# తెలుగు నవలా వికాసం

మొదలి నాగభూషణశర్మ

అన్నమయ్య

ప్రథమ ముద్రణం 1971   1000 ప్రతులు

[illegible]

నాట్యకళా ప్రెస్, హైదరాబాదు-4.

PURCHASED ON
10 SEP 1974

18207
అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం.
అన్నమయ్యవీధి. గుంటూరు-8
894.827

STATE REGIONAL LIBRARY
A.P. GUNTUR

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీల ఆర్థిక సహాయంతో ముద్రింపబడ్డది.

ప్రతులకు : శ్రీమతి పద్మజాభూషణ్, 1-9-638/2, విద్యానగర్, హైదరాబాదు-44.

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, రాష్ట్రపతి రోడ్డు, సికింద్రాబాదు.

TELUGU NAVALA VIKASAM
*by*
MODALI NAGABHUSHANA SARMA

"ఆర్థిక, సాంఘిక, చారిత్రక వ్యత్యాసాల కతీతమై మనిషినీ మనిషినీ స్నేహపాశంలో బంధించివేసే మానవత్వం యొక్క శక్తుల్ని" తరచిచూపే సాహిత్యం సృష్టించిన బుచ్చిబాబుకు

CHECKED 1993

# విషయానుక్రమణిక

ప్రస్తావన

*మొదటి భాగం*

నవల : స్వరూప స్వభావాలు 1
తెలుగునవల : కొన్ని లక్షణాలు 17

*రెండవ భాగం*

తెలుగునవల : యుగవిభజన 21
తొలి తెలుగునవల 32
తెలుగునవల : సంక్షిప్త చరిత్ర 40

*మూడవ భాగం*

తెలుగునవల : సాంఘిక జీవితం—1 125
తెలుగునవల : సాంఘిక జీవితం—2 134
తెలుగు చారిత్రక నవల 146
తెలుగు నవలలలో హాస్యం 161
అనుకరణలు—అనువాదాలు 174
తెలుగునవల : మనోవైజ్ఞానికత 193
తెలుగునవల : జాతీయోద్యమం 205
డిటెక్టివ్ నవలలు 218

నాలుగవ భాగం


తెలుగునవల : కథాకథన శిల్పం 225


ఐదవ భాగం


రాజశేఖర చరిత్ర 247
మాలపల్లి 255
హిమబిందు 270
✓ఏకవీర 283
వేయిపడగలు 294
దైవమిచ్చిన భార్య 304
✓అసమర్థుని జీవయాత్ర 315
✓చివరకు మిగిలేది 323
కీలుబొమ్మలు 334
అల్పజీవి 347
చదువు 353
రుద్రమదేవి 359

పదానుక్రమణిక 367

# ప్రస్తావన

తెలుగులో ఆధునిక సాహిత్య ప్రక్రియలకు సమగ్రమైన చరిత్ర లేదు. నవల, కథానిక, నాటకం, నాటిక, సాహిత్య విమర్శ వంటి ప్రక్రియలలో అశేషమైన రచనలు వెలువడుతున్నప్పటికీ ఇంకా వానిని గురించిన విమర్శనాత్మకమైన అధ్యయనం కన్పించదు. ఆధునిక కవిత్వంమీద కొంత పరిశీలన జరిగినా, అది ఎక్కువగా చారిత్రక దృష్టితో జరిగిన విమర్శకో, లేదా ఒక వ్యక్తిని లేదా ఒక గ్రంథాన్ని గురించిన పరిశీలనకో పరిమితం అవుతున్నది. ఈ విమర్శలలో వస్తునిష్ఠమైన విశ్లేషణ కన్పించదు.

నవల, నాటకం, కథానిక, నాటిక వంటి ఆధునిక సాహిత్య ప్రక్రియలు దాదాపు వందసంవత్సరాలనుంచి మాత్రమే తెలుగునాట ప్రచలితమై ఉన్నాయి. వీని ఉద్భవానికి ఆంగ్లభాషా సంపర్కం కారణం అంటే ఆగ్రహించే వారెవరూ ఉండరనుకుంటాను. మన విమర్శకులెవ్వరూ ఆయా ప్రక్రియల లక్షణాలనుకూడా ఎక్కడా పేర్కొన్నట్లు కన్పించదు.

అంతేకాదు! తెలుగులో పై ప్రక్రియలలో వచ్చిన ఉత్తమమైన రచనలపై కూడా విమర్శ అంతగా రాలేదు. ఈ మూడు పద్ధతు

లను మేళవించి—అంటే, ఒక ప్రక్రియనుతీసుకొని, దాని లక్షణాలను పేర్కొని, సంక్షిప్త చరిత్రనూ విషయానుగతమైన విశ్లేషణనూ జత చేసి, ఆ ప్రక్రియలో వచ్చిన ఉత్తమ రచనలను పరిచయంచేస్తూ — ఒక్కొక్క ప్రక్రియకూ ఒక పరిచయాత్మకమైన గ్రంథాన్ని వ్రాయాలన్న ప్రణాళికలో నవలనుగురించిన ఈ గ్రంథం మొదటిది. ఈ విధంగానే కవిత్వం, నాటకం, కథానిక, నాటిక, సాహిత్య విమర్శలపై ఇదే ప్రణాళికను అనుసరించి పరిశీలక గ్రంథాలను వ్రాయాలని నా ఆశయం.

ఈ ప్రణాళికలో అటు చరిత్రనూ, ఇటు కొన్ని ఉత్తమరచనల పరిచయాలను ఇవ్వడంవల్ల ఇందులో సమగ్రమైన చరిత్రలేదు-అనే విమర్శకు అవకాశం ఉన్నది. అయితే నవలా చరిత్రలో ముఖ్యమైన ప్రవృత్తుల నన్నిటినీ ఇందులో పరిశీలించటం జరిగింది. ఆయా ప్రవృత్తులలో రచనలు సాగించిన ప్రముఖ రచయితలను, వారి రచనలనూకూడా ఉటంకించటం జరిగింది.

తెలుగులో వచ్చిన నవలలు ఇరవై వేలవరకు ఉన్నాయి. ఇన్ని నవలలను పేర్కొనడం సాధ్యమూకాదు; అవసరమూకాదు. అందువలననే ఈ గ్రంథంలో కొన్ని ప్రముఖమైన నవలలనుగురించి మాత్రమే ప్రస్తావించటం జరిగింది. ఇందులో కొందరు నవలాకారులను, చాలా నవలలను పేర్కొనలేదు. అందులో కొందరు నాకు మిత్రులుకూడా. ఆలా పేర్కొనకపోవడం నా అయిష్టానికి సూచకం కాదు. లేదా వారి రచనలలో విలువలేదనీ కాదు. నేను సిద్ధపరచుకొన్న ప్రణాళికలో అవి చేరకపోవటమే అందుకు కారణం.

ఈ గ్రంథంలో—ప్రచురితమైన అన్ని నవలలను పరిశీలించడానికి వీలు లేకపోయిన ఒక భాగం "అనువాదాలు - అనుకరణలూ". ఇతర భాషలనుంచి తెలుగులోకి వచ్చిన అనువాద నవలలు కొన్నివేలు ఉన్నాయి. వాని నన్నింటినీ పేర్కొనడం సాధ్యంకాలేదు. కాని విక్టర్ హ్యూగో నవలలకు పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వెంకటేశ్వర రావుగార్ల అనువాదాలను, జపాన్‌కు చెందిన 'నట్సుమే' వ్రాసిన నవల 'కోకోరో'కు శ్రీ శ్రీనివాస చక్రవర్తిగారి అనువాదాన్ని, "చెమ్మీన్" మొదలయిన అనువాదాలను పేర్కొనవలసి ఉంది.

ఈ గ్రంధరచనకు కావలసిన సామాగ్రిని సేకరించడంలో రాజ మండ్రి, వేటపాలెంలోని గ్రంథాలయాలు, మద్రాసులోని కన్నెమెరా గ్రంథాలయం నాకు ఎక్కువగా ఉపకరించాయి. శ్రీ భీమసేన్ "నిర్మల్" సంపాదకత్వాన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురించిన "పద్మాకర్" రెండవభాగం, విశ్వనాధ సాహిత్యసంచిక, గోపీచంద్ సంస్మరణ సంచికలు ఎంతో తోడ్పడ్డాయి. ఆయా గ్రంథాలయాధికారులకు, సంపాదకులకు నా కృతజ్ఞత. ఇందులో ముద్రితమైన "చివరకు మిగిలేది" ఆకాశవాణి, హైదరాబాదు కేంద్రంనుంచి ప్రసారం చేయబడ్డది. ఆ అధికారులకు కృతజ్ఞత.

ఈ గ్రంథ ముద్రణకు పాక్షిక సహాయంచేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖవారికీ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారికి, ముఖ్యంగా అకాడమీ కార్యదర్శి పూజ్యులు శ్రీ దేవులపల్లి రామానుజరావు గారికి నా కృతజ్ఞతలు.

ఈ గ్రంథ రచనలోనూ, ముద్రణలోనూ తగు సలహాలనిచ్చి నన్ను ప్రోత్సహించిన ఆప్తమిత్రులు డాక్టర్ పి.యస్.ఆర్. అప్పారావుగారికి నా నమస్కారాలు.

గ్రంథముద్రణలో నాతో ఎంతో సహకరించిన మిత్రుడు శ్రీ దేశపతిరావుకీ, ముఖపత్రాన్ని అందంగా తీర్చిదిద్దడానికి తోడ్పడిన మిత్రులు ఎం. బలరామాచార్యకు, శ్రీ వఝ శ్రీనివాసశర్మకు నా కృతజ్ఞతలు.

ఈ గ్రంథ రచనకు శ్రీకారం చుట్టిన నాటినుంచి, ముద్రణ అయ్యేవరకు నాతో సమానంగా శ్రమించి, వ్రాతప్రతిని తయారు చేసిన నా శ్రీమతి — సరస్వతికి ఆశీస్సులు. బాపిరాజుగారి "హిమ బిందు" ను గురించిన వ్యాసంలో ఆమె అభిప్రాయాలను స్వీకరించాను. అందుకోసం కూడా ఆమెకు ఆశీస్సులు.

నా విసుగుదలను కనిపెట్టి ఈ గ్రంథాన్ని తొందరగా ముద్రించిఇచ్చిన నాట్యకళ ప్రెస్‌వారికి నా కృతజ్ఞతలు.

మొదలి నాగభూషణశర్మ

# మొదటి భాగం

నవల : స్వరూపం

1. నవల : స్వరూప స్వభావాలు
2. తెలుగు నవల : కొన్ని లక్షణాలు

# నవల
# స్వరూప స్వభావాలు

"నవల" అన్న పదం ఆంగ్లంలోని "నావెల్" అన్న పదానికి పర్యాయవాచిగా తెలుగులో వాడబడుతున్నది. కాల్పనిక కథా సాహిత్యమంతా (fiction) యీ ప్రక్రియగానే ఎంచబడుతున్నది. గుజరాతీలో "నవల్ కథా" అనీ, మరాఠీ, కన్నడ భాషల్లో "కాదంబరీ" అనీ, బెంగాలీ, హిందీలలో "ఉపన్యాస్" అనీ పిలవబడుతున్న యీ ప్రక్రియ తెలుగులో "నవల" అని పిలవబడడం — అది ఆంగ్ల శబ్దానికి దగ్గరగావున్నదనేకాదు. 'నవల' అన్న పదంలో ఆంగ్లపదం "నావెల్" అన్న పదానికి ఉన్న "కొత్తది", "వినూత్న

మైనది'' అన్న అర్థంకూడా స్ఫురిస్తున్నది. ఈ ప్రక్రియకు మనవారు మొదట ఉంచినపేరు ''వచన ప్రబంధము'' అన్నది. దాదాపు ఇరవై యేళ్ళతరువాత వీరేశలింగం పంతులుగారి రాజశేఖరచరిత్రను విమర్శిస్తూ పీఠికాభాగంలో శ్రీ కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు 'నవల' అన్న యీ పదాన్ని సూచించారు. ఇదే తెలుగులో 'నవల' అన్న పదానికి మొదటి ప్రయోగం. ''నవం లాతీతి నవలా'' అన్నట్లు నూతనమైనదానిని, లాలిత్యాత్మకమైనదానిని 'నవల' అనడమే ఎక్కువ సమంజసం.

నవలను వర్తమానకాలపు మహాకావ్యం అనవచ్చు. ఇంత సంఘర్షణమయమూ, క్లిష్టమూ అయిన యుగంలో కావ్యం అదృశ్యం అయి, దానిస్థానే గద్యం - అందునా గద్యకావ్యం ప్రచురం కావడం సహజమే. నాటకం, కావ్యం మొదలైన అన్ని ప్రక్రియల పద్ధతులు నవలలో మనకు ద్యోతకం అవుతాయి. అందువల్లనే యీనాడు మిగిలిన అన్ని సాహిత్య ప్రక్రియలకన్న ''నవల'' అత్యంత సమాదరణీయమయింది.

నవలకు నిర్వచనం యివ్వడం చాలకష్టమైనపని. దీనినిగురించి పాశ్చాత్యులలోకూడా ఎక్కువ వివేచన కనిపించదు. పైగా యిది యిటీవలి ప్రక్రియ. కవిత్వతత్వాన్ని విచారణచేసినవారు కోకొల్లలు. కాని నవలను సమగ్రమైన సాహిత్యరూపంగా విమర్శకులు, పండితులు ఇప్పుడిప్పుడే ఒప్పుకొంటున్నట్లు కనిపిస్తున్నది.

ఇది నూతన ప్రక్రియకనుక, పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్ల వచ్చినది కనుక, ఆ విమర్శకులు దీనిని ఎలా ఊహించారో ముందుచెప్పడం మంచిదనుకుంటాను.

''యథార్థ జీవనాన్ని యథార్థ దృష్టితో అధ్యయనం చేసి, దానిని గద్యరూపంలో వ్యక్తంచేసేదే నవల'' అన్నాడు రిచర్డ్ క్రాస్, "The Development of English Novel'' లో.

"నవల అన్నది కేవలం గద్యాత్మకమైన కాల్పనిక కథ కాదు. అది మానవుడి జీవితాన్ని గురించి, పరిపూర్ణ మానవ చేష్టలను గురించి గద్యరూపంలో చెప్పబడిన వ్యాఖ్యానం'' అన్నాడు రాల్ఫ్ ఫాక్స్ — తన "Novel and the People'' లో.

"సజీవమైన జగత్తుతో పరిచయంచేసే కళాకృతి నవల. చాలా విధాల యీ జగత్తు మనచుట్టూవున్న ప్రపంచాన్ని పోలివుంటుంది'' అన్నాడు లార్డ్ డేవిడ్ సెసిల్ తన గ్రంథం Hardy, the Novelist లో.

"నవల జీవితానికి ప్రతిబింబం. మిగిలిన అన్ని సాహిత్య ప్రక్రియలకన్న దీని పరిధి విస్తృతమైనది...నవలను మనం చాలా విధాలుగా చూడవచ్చు: కేవలం ఒక కథను చెప్పడం, కొన్ని అచారవ్యవహారాలను విదితం చేయడం, పాత్రల వ్యక్తిత్వాలను చిత్రించడం, జీవితంపై ఒక దృక్పథాన్ని ప్రేరేపించడం—ఇవిఅన్నీ నవల ఒక్కసారిగా గాని, వేరువేరుగాగాని చేస్తుంది'' అన్నాడు జె.బి. ప్రీస్ట్‌లీ The English Novel లో.

ఇక మన పూర్వులు సృజనాత్మక సాహిత్యాన్నంతా దృశ్య కావ్యాలని, శ్రవ్యకావాలని రెండు విధాలుగా విభజించారు. శ్రవ్య కావ్యాల్లో గద్య, పద్య, చంపూకావ్యాలు ముఖ్యమైన విభాగాలు. గద్య కావ్యంలో అఖ్యాయిక, కథ అంటూ తిరిగి రెండు విభాగాలను చేశారు. ఒకటి కల్పితమైనదని, రెండవది ఒక నాయకుని స్వచేష్టి తములను చెప్పేదని వేర్పరచారు. "వృత్త మాఖ్యాయతే తస్యాం నాయకేన స్వచేష్టతం'' అన్నాడు భామహుడు.

ఈ అఖ్యాయిక నవలకు కొంత దగ్గర రూపం అనుకోవచ్చు. ఐతరేయ బ్రాహ్మణంలోని శునశ్శేపుని కథ దగ్గరనుంచి ఎన్నో కాల్పనిక కథలు సంస్కృత, ప్రాకృత భాషల్లోను, దేశి సాహిత్యాల లోను ప్రచురమై ఉన్నాయి. ఇవి అన్నీ కథాత్మకాలు. అంత

మాత్రాన యీనాటి 'నవల' "ఆఖ్యాయిక" నుంచి వచ్చినదేనని, అదేపేరును మార్చి ఈనాడు దానిని 'నవల' అంటున్నారని భావించడం సముచితంకాదు.

'నవల' అన్న ప్రక్రియ పాశ్చాత్య సాహిత్యాన్ని—ముఖ్యంగా ఆంగ్ల సాహిత్యాన్ని—మనం అధ్యయనం చెయ్యడం మొదలుపెట్టిన తరువాతనే భారతీయ భాషల్లో వెలువడడం ఆరంభమైనదన్న సత్యాన్ని మనం విస్మరించకూడదు.

నవలాకారులందరూ యీ ప్రక్రియను జీవితానికి వ్యాఖ్యగా, మనుష్యుల కథగా రూపొందించే ప్రయత్నం చేశారు. అందువల్లనే నవలను "వాస్తవిక జీవితాన్ని గురించిన కాల్పనిక కథ" అనవచ్చు. మనోరంజకతే దీని ముఖ్యమైన ధ్యేయం. అయినా, అంతకుమించి జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలను యిందులో చర్చించి సమాధానం చెప్పడానికి వీలుంటుంది. "జీవిత సత్యం యేమిటి ?" అన్న ఆధ్యాత్మిక వివేచనకూడా నవలలో చేయబడుతున్నది అంటే దాని విస్తృతి మనకు అర్థం అవుతుంది.

నాటకం అత్యంత ప్రచలితమై వున్నప్పుడుకూడా దానికి యింత ప్రచారం లేదు. దీనికి కారణం కొంతవరకు నాటకానికి రంగస్థలం అవసరం అన్న నియతి. అంతేకాదు. నవలలో అన్నిరకాలయిన ప్రవృత్తుల వ్యక్తీకరణకు అవకాశం ఉండడమే ! అందువల్లనే నవలను "పాకెట్ వర్ల్డ్" అంటారు.

నవల స్వరూపస్వభావాలను నిర్ణయించేటప్పుడు యీ క్రింది లక్షణాలు నవలకు ఉంటాయని మనం క్రోడీకరించవచ్చు. అక్కడక్కడా దీనికి వ్యత్యస్తం ఉండడంలో ఆశ్చర్యంలేదు. కాని, ఇవి బహుళమైన నవలలకు వర్తించే లక్షణాలు :

1. నవల గద్యకావ్యం.

2. యుగ చిత్రణే దీనికి ప్రప్రథమ ధ్యేయం. అంటే సమకాలీన సమాజ, మానవజీవితాల చిత్రణే దీని లక్ష్యం.

3. సహజమైన, స్వాభావికమైన శైలి దీనికి ప్రాణం.

4. సర్వజీవిత విధానానికి వ్యాపకమైన, విస్తృతమైన విధానం యిందులో ఉన్నది.

5. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సర్వవిషయాలమీద రచయిత వ్యాఖ్యానానికి యిందులో ఆస్కారం ఉన్నది.

6. కాల్పనిక కథా సాహిత్యానికి సరళమైన స్వాభావికమైన రూపం నవల.

7. వ్యక్తుల కార్యాలు, చరిత్ర యిందులో సంఘటనలకు బలం.

8. నవల ప్రక్రియలో నాటకం, కావ్యం, అధిక్షేపణ కావ్యంవంటి అన్ని ప్రక్రియల విధానాలు ఉపయుక్తం చేయబడవచ్చు.

9. మనోరంజకతతోపాటు విజ్ఞాన సముపార్జనంకూడా యిందులో సాధ్యం.

10. యధార్థజీవితంలోని సత్యంకన్న నవలలోని సత్యం యింకా గాఢతరమైనది. యధార్థజీవితంలోనివన్నీ జరిగిన సత్యాలు. ఇక్కడ సంభవంకాగల సత్యాలకుకూడా స్థానంవున్నది.

11. వేదన, భావుకత — యీ రెండూ నవలకు ప్రేరణ శక్తులు.

12. ఒకవ్యక్తి జీవితాన్ని గురించిగాని, జీవితంలో ఒక ముఖ్య భాగాన్ని గురించిగాని నవల చిత్రించడానికి ప్రయత్నిస్తుంది. ఇటీవల వచ్చిన "చైతన్య స్రవంతి" పద్ధతిలో వ్రాయబడిన నవలల్లో ఒకే ఒక్క ముఖ్య సంఘటన వుంటున్నది. కాని ఆ సంఘటనకు పూర్వాపరాలు చిత్రించడంలో మనిషి

మనస్సులోని అన్ని ఉద్వేగాలను వెలికి తీసుకొనిరావడంవల్ల దానినిసంపూర్ణ జీవిత చిత్రంగానే పరిగణించవచ్చు.

13. వివరణాత్మకము, వ్యాఖ్యానాత్మకము, నాటకీయము అయిన శైలిలో ఏ ఒక్కదానినిగాని, అన్నింటినిగాని నవలలో ప్రయుక్తం చేయవచ్చు.

14. జాగ్రత్, సుషుప్త్యావస్థలలోని సర్వ విషయాలను, ఉద్వేగాలను వెలికితెచ్చి వర్ణించగానికి తగిన సాధనం నవలే !

నవలకు, మిగిలిన సాహిత్య ప్రక్రియలకుగల సంబంధాన్ని గురించి చర్చించడం యిప్పుడు అనావశ్యకమే ! నవలకు కావ్యానికి, నవలకు కథానికకు, నవలకు నాటకానికిగల సంబంధాలను గురించి సుదీర్ఘమైన చర్చలు జరపడం ఈనాడు అప్రస్తుతం. ఆయా ప్రాథమిక విషయాలను గురించి పూర్వమే సవిస్తరమైన వివేచన జరిగింది.

పోతే ఒకే ఒక్కవిషయాన్నిగురించి యిక్కడ ముచ్చటిస్తాను. అది నవలకు నాటకానికి గల అనేకములైన అంతరాలలో ఒకదానిని గురించి. అది కాలానికి సంబంధించినది. ("నాటకం వర్తమానాన్ని తెలియబరుస్తుంది. నవల గతాన్ని వ్యక్తీకరిస్తుంది.") ఇది కొంత క్లిష్టమైన ప్రతిపాదనే ! అయినా ఈ భావాన్ని మరికొంత విశదంచేస్తాను.

నాటక రచనకు ఏ ఇతివృత్తాన్ని స్వీకరించినా — అది పౌరాణికమైనా, చారిత్రకమైనా, సాంఘికమైనా — ఆనాడు ఏ విధంగా జరిగివుంటుందో ఆ విధంగా దానిని తిరిగి సృష్టిస్తాడు నాటకకర్త. అదికాక ఏ కాలంలో జరిగిన కథనైనా ఆ క్షణంలో జరిగినట్లు చూపాలి నాటకరచయిత. అందువల్ల అన్ని సంఘటనలు నాటకరంగంమీద వర్తమానకాలంలో జరుగుతున్నవే అన్న భ్రమను కల్పించగలగాలి.

ఇక నవలలో భూత భవిష్యద్వర్తమానాలలో ఏ కాలానికి చెందిన సంఘటనను స్వీకరించినా, "ఈ సంఘటన యీ విధంగా

జరిగింది ; అతను యిక్కడకువచ్చాడు ; ఆ పనిచేశాడు.'' – ఇలా చెప్పుకు పోతున్నప్పుడు ఈ అన్ని కాలాలకు చెందిన సంఘటనలు జరిగిపోయిన సంఘటనలుగా చిత్రింపబడుతున్నాయి. ఫలానా వ్యక్తి ఫలానా విధంగా "అన్నాడు'' అంటాడు నవలారచయిత. "అంటున్నాడు'' అనడు. అందువల్లనే నవలలో సంఘటనలు, సంభాషణలు అన్నీ భూతకాలానికి చెందినవి, జరిగిపోయినవి ; ఆ జరిగిన సంఘటనలు తిరిగి మనకు యిప్పుడు చెప్పబడుతున్నవి-అన్న అభిప్రాయం కలుగుతుంది. కాలానికి సంబంధించిన ఈ నియతిని తప్పించుకోవడానికే నాటకకర్తలు "అనిబద్ధ రూపకాల ( Absurd dramas ) ను, నవలాకారులు ''చైతన్యస్రవంతి'' నవలల (Stream of Concious-ness Novels) ను వ్రాస్తున్నారు.

నవల సమగ్రమైన సాహిత్య ప్రక్రియగా – అంటే వ్యక్తి యొక్క అన్నివిధాల అభిప్రాయాలను విభిన్న కోణాలనుంచి అభివ్యక్తీకరించగల ఏకైక సాహిత్యరూపంగా క్రమక్రమంగా రూపొందుతున్నది. అతి విస్తృతమైన భావసంచయాన్ని, సంఘటనలను, పాత్రలను వెలువరించడంద్వారా నవలలో ఎంతో వైవిధ్యాన్ని కూడా సాధించవచ్చు.

ఇప్పుడు నవలలో ఉండే ముఖ్యమైన అంశాలను గురించి పరిశీలించవలసివుంది. ఈ అంశాలు ఒక్క నవలకే పరిమితంకాదు ; ప్రతి సాహిత్య ప్రక్రియలోను ఇవి అంతర్భాగాలే. అయినా 'నవల' లో యివి కొంత మార్పునుచెంది ఉపయుక్తం చేయబడుతున్నాయి.

ఏ కథారచనలోనైనా ముఖ్యమైన అంశాలు కొన్ని వుంటాయి. అవి—

1. ఇతివృత్త నిర్మాణము
2. పాత్రచిత్రణ

3. సంభాషణ
4. కాల, స్థల ఐక్యతలు
5. శైలి
6. ఉద్దేశం.

ఇవికాక జీవితచిత్రణ, ప్రతీకయోజన, వర్ణనౌచిత్యం వంటి ఉప భాగాలు ఎన్నో ఇందులో నిబిడీకృతమై ఉన్నాయి.

ఇవి అన్నీ ఏ కథకైనా ముఖ్యమే. మరీ ముఖ్యంగా నవలా రచనలో యివి క్రమమైన పద్ధతిలో ఉండితీరాలి. అయితే అవి యీ పద్ధతిలో, యీ క్రమంలో ఉండాలన్న నియమం మాత్రం లేదు.

నవల దేనినిగురించి వ్రాయాలి? ఎలా వ్రాయాలి? అన్న ప్రశ్నలకు మారుతూవస్తున్న సమాధానాల దృష్ట్యా పై లక్షణాలను మార్పు చేయవలసి వస్తుందని కొందరు విమర్శకులు పేర్కొన్నారు. కాని, అది అవసరంలేదు. ఎందువల్లనంటే పై లక్షణాలు కథారచనకు ముఖ్యలక్షణాలేకాని, ఫలానా కథకు, లేదా ప్రక్రియకు ముఖ్య లక్షణాలు కాదు.

## ఇతివృత్తం

నవల మానవ జీవిత చిత్రణ అనుకొన్నప్పుడు అందులో మానవ జీవితంలోవుండే సంఘటనలు, భావన, ఆదర్శాలు, సమస్యలు‌_ వీని అన్నింటి చిత్రణ ఉండాలి. ఇతివృత్త నిర్మాణానికి ముఖ్యమైన సామాగ్రికూడా యిదే.

కథా కల్పనలో, ఇతివృత్త నిర్మాణంలో, ఉండవలసిన లక్షణాలను ప్రాచ్యపాశ్చాత్య లక్షణకారులు యిదివరకే సిద్ధాంతీకరించి వున్నారు. ప్రారంభము, ప్రయత్నము, ప్రాప్త్యాశ, నియతాప్తి, ఫలాగమమన్న అయిదు అవస్థలు కథా దేహబంధానికి (Structure)

ఆవశ్యకమని భారతీయ కావ్యశాస్త్రకారులు చెప్పారు. అలానే exposition, incident, crisis, denouement, catastrophe అన్న అయిదు భాగాలు ఇతివృత్తంలో వుంటాయని పాశ్చాత్య కావ్యశాస్త్రకారుల అభిప్రాయం. ఇది కథను స్వీకరించి వికసింపచేయడానికి రచయిత అనుసరించవలసిన పద్ధతిగా వారు సిద్ధాంతీకరించారు.)

హేమచంద్రుడు తన "కావ్యానుశాసనం" లో కథను–దాని యితివృత్తాన్ని, విస్తృతిని ఆధారంచేసుకొని – యీ క్రింది భాగాలుగా చేయవచ్చునన్నాడు.

ఉపాఖ్యానము, ఆఖ్యానకము, నిదర్శనము, ప్రహేళిక, మంథాల్లిక, మణికుల్య, పరికథ, ఉపకథ, ఖండకథ, సకలకథ, బృహత్కథ.

వీనిలో ఉండే అంతరాన్నిబట్టి యివి అన్నీ కథలలోని వేరు వేరు రూపాలనవచ్చు. కాని వీనిలో దేనినీ నవలకు పర్యాయవాచిగా ప్రయుక్తం చేయడానికి వీలుకన్పట్టదు. వీని అన్నింటకన్న నవల భిన్నమైనది ; విస్తృతమైనది.

(ఏ కథ అయినా మూడు విభిన్నమైన భాగాల కలయికఅని మనం చెప్పవచ్చు : 1. స్వీకరించబడ్డ విషయం లేదా కార్యం, 2. దాన్ని వ్యక్తీకరించడానికి గ్రహించే సాధనం, 3. వ్యక్తకరించే పద్ధతి. ఈ మూడింటి సంయోజనంవల్ల కథాసాహిత్య సృష్టి జరుగుతున్నది. ఈ సంయోజనాన్ని తిరిగి విశ్లేషిస్తే, కార్యము, కార్యకర్త, భావము లేదా ఉద్దేశ్యము–ఈ మూడు కథను చిత్రించడానికి ముఖ్యమని తేలుతున్నది. ఈ మూడింటిలో ఏ ఒక్కటో ముఖ్యమై మిగిలిన రెండు ఆ లక్షణానికి ఒదిగి ఉంటే ఆ యితివృత్తాన్ని ఆ ముఖ్యమైన లక్షణం పేరు పెట్టి పిలుస్తాం – సంఘటనాత్మకమైన ఇతివృత్తం, ( Action plot ) వ్యక్తిశీలం ప్రధానమైన ఇతివృత్తం ( Character plot ), భావాత్మక ఇతివృత్తం ( Thought plot ).

మొదటిరకం ఇతివృత్తంలో ఎన్నో ముఖ్యమైన సంఘటనల ద్వారా స్థితిగతులను పాత్రలద్వారాను, భావాలద్వారాను వ్యక్తీకరిస్తాడు రచయిత. హిమబిందు, చలం నవలలు, వేయిపడగలు ఇందుకు నిదర్శనలు. రెండవదానిలో పాత్రల వికాసము ముఖ్యము. సంఘటనలు, భావాలు, దీనికి ప్రోద్బలకాలు మాత్రమే! రాజశేఖరచరిత్ర, రామచంద్రవిజయము, చంఘిజ్ ఖాన్, రుద్రమదేవి వంటివి ఇట్టివి. ఇక మూడవ తరహా నవలల్లో భావం ముఖ్యం; (సిద్ధాంతం ముఖ్యం. ప్రధాన పాత్ర భావాలద్వారా అతని స్థితిగతుల్లో మార్పుని సూచిస్తాయి. చివరకుమిగిలేది, అల్పజీవి, అసమర్థుని జీవయాత్ర ఈ ఈ కోవకుచెందిన నవలలు.

అయితే ఈ విధమైన విశ్లేషణ-ఫలానా నవలకు ముఖ్యమైన ప్రవృత్తి ఇదీ అని చెప్పడానికి మాత్రమే పనికి వస్తుంది. తరతమ భేదాలుఉన్నా ఈ మూడింటి సంయోజనము నవల అవుతున్నది.

ఇతివృత్తాన్ని పైన చెప్పిన విధంగానేకాక, ఇంకా ఎన్నో రకాలుగా విభజించవచ్చు. సాధారణంగా విభజించేపద్ధతి : పౌరాణిక నవలలు ; చారిత్రకనవలలు; సాంఘిక నవలలు — అని. ఇలాకాక, కథలలోవుండే నాయకపాత్రను, ఇతరపాత్రలనుబట్టి నార్త్రోప్ ఫ్రై అనే ప్రఖ్యాత విమర్శకుడు ఇతివృత్తాలను నాలుగువిధాలుగా విభజించాడు. దేవుడు నాయకుడు గాగల నవలలు ; ఉన్నత మానవుడు నాయకుడు గాగల నవలలు ; మానవుడు నాయకుడు గాగల నవలలు; మానవప్రకృతికన్న అధమమైన ప్రకృతిగలవారు నాయకులు గాగల నవలలు—అన్నది ఆయన విభజన.

అలానే ఇతివృత్తాలను సుఖాంతాలు, విషాదాంతాలు-అంటూ కూడా విభజించవచ్చు.

నవలకు ముఖ్యలక్షణం అందులో చదివించేగుణం ఉండటం. ఈ చదివించే గుణం-ఉత్సుకత - కథలోని అనేక ముడులను విప్పటం

ద్వారా రచయిత సాధిస్తాడు. పాఠకుడు అనుభవిస్తాడు. ఒక ముడి తర్వాత మరొకముడిని కట్టుకుంటూపోయి పతాకసన్నివేశంనుంచి ఒక్కొక్క ముడిని విప్పుకుంటూ రావడం ఇతివృత్తాలలో మామూలుగా రచయితలు చేసేపని. తరువాత ఏం జరుగుతుందీ, ఈ సమస్యను రచయిత ఎలా సాధిస్తాడు, అన్న ఉత్సుకతే (inferential activity) వల్లనే ఇతివృత్తం మంచి-చెడ్డలు నిర్ణయింపబడతాయి.

## పాత్రచిత్రణ

పాత్రచిత్రణ నవలకు ఆత్మవంటిది. నవలలో విషయం అంతా మానవజీవితాన్ని గురించే అయినప్పుడు ఆ మానవ జీవితమే నవల అవుతున్నది. మన పురాతన కథలన్నింటిలోనూ పాత్రల్ని కొన్ని భావాలకు ప్రతినిధులుగా మాత్రమే స్వీకరించి సృష్టించేవారు— మంచి చెడులను నిర్దేశించడానికి రాముడిని, రావణుణ్ణి చిత్రించినట్లు. చాలాకాలంవరకు నవలల్లోకూడా ఇటువంటి చిత్రణ తప్పలేదు. రానురాను పాత్రల్ని చిత్రించడంలో నవీన శాస్త్ర సిద్ధాంతాల సమన్వయం కన్పిస్తుంది. ఏ పాత్రా - ఏ వ్యక్తికివలెనే - కేవలం మంచో, కేవలం చెడో, మాత్రమే కలిగిఉండదు. ప్రతిమనిషి మంచిచెడ్డల కలయిక. ఈ భావమే ఈనాటి నవలలో మనకు గోచరిస్తుంది.

"అరిస్టాటిల్" పాత్రల్ని ఉదాత్తమైనవిగా, యదార్థ జీవనానికి అనురూపంగా, సంభావ్యత కుంటుపడకుండా చిత్రించాలన్నాడు. ఏకరూపకత (Uniformity) ఉండాలన్నాడు. పాత్రచిత్రణలో సంభావ్యతని దృష్టిలో ఉంచుకోవాలన్నాడు. అయితే ఆధునిక విమర్శకులు పాత్రలను, ఇతివృత్తాన్ని వేరుచేసి చూపడం అంగీకరించరు. "Character, in any sense in which we can get it, is action, and action is plot" అంటాడు ప్రఖ్యాత అమెరికన్ నవలాకారుడు హెన్రీ జేమ్స్.

పాత్రకీ, సంఘటనలకీ ఉన్న సంబంధం నవలా రచనకు అతి ముఖ్యమైనది. రచయితలు సృష్టించే పాత్రలు తమ ప్రత్యేకతలను నిలబెట్టుకోవాలి. ఈ పాత్రల్లోనుంచే వారు చేసే కార్యాలు వెలువడాలి. ఇదంతా అత్యంత స్వాభావికంగా ఉండాలి. పాఠకుడు ఎప్పుడూ "ఫలానా పాత్ర అట్లా ప్రవర్తించి ఉండదు" అనుకో కూడదు. పైగా "నేనయితే అలానే చేసి ఉందును" అనిపించేటట్లు వ్రాయాలి ఈ విధంగా పాత్రచిత్రణని ఆయాపాత్రలు చేసే కార్యాల ద్వారా నిర్ధరించవచ్చు.

పాత్రలచిత్రణకి రెండోపద్ధతి సంభాషణలు. మూడవపద్ధతి రచయిత చేసే వ్యాఖ్యానంద్వారా. మన స్తత్వశాస్త్రం వచ్చాక మరోపద్ధతికూడా పాత్రచిత్రణకు ఉపకరిస్తున్నది. అది "మనోవిశ్లేషణ పద్ధతి".

పాత్రల్ని తమంతతాము నిలబడగల వ్యక్తిత్వం కలవిగాను (individiual), కొన్ని భావాలకు ప్రతీకలు (types)గాను విభజించవచ్చు. ప్రతీకలుగా, ప్రతినిధులుగా చిత్రింపబడేపాత్రలు సామ్యవాద సాహిత్యంలో ఎక్కువగా కనిపిస్తాయి. ఈ రెంటినీ సమన్వయం చెయ్యడంలో రచయిత ప్రత్యేకత ఉంటుందనుకుంటాను. ప్రతివ్యక్తి ఏదో భావానికి ప్రతినిధే! భావాల్లోకాక అతడు చేసే కార్యాల్లో అతని ప్రత్యేక వ్యక్తిత్వం వెల్లడి అవుతుంది.

పాత్రచిత్రణలో స్వాభావికత, సజీవత, మొదలైన గుణాల్ని పాటించాలని చాలమంది విమర్శకులు చెప్పారు. కాని ఇది ఏ నవలా కారుడూ గట్టిగా అనుసరించగల పద్ధతికాదు. తాను చెప్పదల్చుకున్న భావాలకి ఎట్టి పాత్రలు పనికివస్తాయో అట్టి పాత్రల్ని మాత్రమే రచయిత స్వీకరిస్తాడు.

ఈ పాత్రల్ని flat and round పాత్రలు అని Forster రెండు రకాలుగా విభజించాడు. ఒక భావాన్ని, ఒక లక్షణాన్ని

వ్యక్తీకరించే పాత్రలు flat పాత్రలనీ, క్లిష్టమైన అనేక భావాలను, అనేక లక్షణాలను, కలిగిఉన్న పాత్రలు round పాత్రలనీ నిర్వచించాడు. కాని ఈ విధమైన విభజన అతిసూక్ష్మీకరణ (over simplification) గా తోస్తున్నది.

మొత్తంమీద పాత్రచిత్రణ స్వాభావికంగా ఉండాలి. స్వాభావికంగా అంటే ఇక్కడ అర్థం రచయిత సందేశానికి, అతను స్వీకరించిన సంఘటనలకి అనువైనదిగా మాత్రమే ఉండాలని అర్థం. దీని వల్లనే డాన్ క్విజాట్, పసరిక, వంటి పాత్రలుకూడా సంభావ్యాలనీ, రచయితల ఉద్దేశ్యాలని అవి నిజాయితీతో వ్యక్తీకరిస్తున్నవని మనకు ద్యోతకం అవుతుంది.

## ఉ ద్దే శ ం

''రచయిత తన రచనలలో కనిపించకుండా విశ్రాంతితీసుకోక తప్పదా ? అయినా నవలలో రచయిత పాత్రను గురించి మనం మరీ అంత పట్టు పట్టగూడదు'' అన్నాడు ఆల్డస్ హక్స్లీ 1928 లో. ఆ తరువాత నాలుగేళ్ళకు కాబోలు జోసెఫ్‌వారన్‌బీచ్ అనే విమర్శకుడు ఆంగ్ల నవలా చరిత్రను సమీక్షిస్తూ అందులో తనకు కొట్టవచ్చినట్లు కనిపించే ముఖ్యమైన విషయం-రానురాను రచయిత అదృశ్యం కావడం అన్నాడు.

రచయిత తన ఉద్దేశాలను తన పాత్రలద్వారా, వాతావరణంద్వారా, యితర విధాల చిత్రించాలికాని తనంతట తాను రంగస్థలంమీదికివచ్చి సుదీర్ఘమైన వుపన్యాసాలద్వారా వానిని వెలిబుచ్చగూడదని రానురాను రచయితలు గుర్తిస్తున్నారు. అందువల్ల నేననుకుంటాను — విశ్వనాథ నవలలు చదివేటప్పుడు కొంచెం పట్టిస్తాయి. చలం నవలలు సాఫీగా చదవనిస్తాయి. రచయిత తన అభిప్రాయాలను అవి ఎంత మంచివైనా - తన పాత్రలద్వారానే చెప్పించాలి. రచ

యిత పాత్రలను సృష్టించింది అందుకనే కదా ! ఆ పాత్రలు చెప్ప లేనిది ఏదో ఉంటేనే తానుగా చెప్పవలసివస్తున్నది. అంటే అతని పాత్రచిత్రణ సమగ్రంగా లేదనైనా అనుకోవాలి, లేదా ఆ రచయిత తన నవలను ఏదో ప్రచారంకోసం వ్రాస్తున్నాడనైనా అనుకోవలసి వుంటుంది.

మిగిలిన అన్ని కళల కంటె సాహిత్యంలో 'వాక్కు'కు ఎక్కువ అవకాశం. ఒక్క సాహిత్యంలోనే శబ్దజాలం యొక్క గొప్ప తనం విదితం అవుతుంది. కాని సాహిత్యంలో యిది ప్రయోగింప బడ్డపుడు రెండువిధాలుగా యీ ప్రయోగాలు వుంటాయి. ఆత్మాశ్ర యము పరాశ్రయము అని. కవి తన కిష్టులయిన పాత్రల్ని, ఇష్టులు కాని వారిని సృష్టించి వారిద్దరికీ తగిన సంభాషణలు యిస్తాడు. ఈ సంభాషణలు రచయిత భావాన్ని వ్యక్తంచేసేవే ! ఆసంభాషణ ల్లోని మెళకువలతో రచయిత తన అభిప్రాయాన్ని పరోక్షంగా వ్యక్తం చేస్తాడు.

అయితే యీ పరోక్షంగా చేసేపని ప్రత్యక్షంగా చేస్తే యేం అని ప్రశ్నించేవారు కొందరు ఉండవచ్చు. కాని రచయిత తనంత తానుగా రంగంమీదికి ప్రవేశిస్తే తానుకూడా ఒక పాత్ర అయి, అంతవరకు అతడు చిత్రించిన పాత్రలతో సమానుడై తాను సృష్టిం చిన 'భ్రమ' ను తానే చెరిపి వేయడానికి కారకుడౌతున్నాడు.

రచయిత తానుగా ఎక్కడ కనిపించవచ్చు ? - అంటే తన అభిప్రాయాలకు అనుగుణమైన, కథకు ప్రస్తుతమైన భావ చిత్రాలను నిర్మించేటప్పుడు, వర్ణనలు చేసేటప్పుడు - అంటే వాతావరణ చిత్రకారుడుగా - scenic designer గా-మాత్రమే అతడు కన్పించ వచ్చు లేదా వ్యాఖ్యాతగా అప్పుడప్పుడు రంగం మీదికి రావచ్చు. అంతే.

### భావ చిత్రాలు :

ప్రతీకలు, భావచిత్రాలు, వర్ణనలు చిత్రించడంలో రచయిత పరోక్షంగా తననుతాను వ్యక్తీకరించుకోవచ్చునన్నాను. ఈప్రతీకలు రచయిత భావాలకు ప్రతీకలే. ఈభావచిత్రాలే (images) వాని వర్ణనలు. విశ్వనాథ నవలల్లో యిట్టివి మనకు కోకొల్లలుగా కన్పిస్తాయి. 'చివరకు మిగిలేది' లో అక్కడక్కడా ప్రకృతి చిత్రణలు రచయిత చెప్పదలుచుకున్న భావాలను పరోక్షంగా సూచించే పద్ధతి వుంది.

'నేను' అంటూ కథను మొదలుపెట్టినపుడు రచయిత పాత్రల ద్వారా చెప్పించ వలసిన అన్ని విషయాలను "తన" ద్వారానే చెప్పించుకోదలిచాడని స్పష్టం అవుతున్నది. ఇట్టి నవలల్లోనే ఎక్కువ ఆత్మాశ్రయత ద్యోతకం అవుతుంది. ఎంత తక్కువ చెప్పదలుచుకున్నా తనను గురించి చెప్పవలసివచ్చినపుడు యితరుల కన్న ఎక్కువగానే చెప్పడం - మానవుడిలక్షణం.

'నేను' అని చెప్పకుండానే ఒక ముఖ్య పాత్రను చిత్రించి ఆ పాత్ర మనోభావాలు అతనిలో అతడు అనుకుంటున్నట్లు చిత్రించడం కూడా యీమధ్య వస్తున్న కొత్త విధానాలలో ఒకటి.

### కాలం :

కథా చిత్రణలో కాలానికి చాలా ప్రాముఖ్యం వుంది. క్రమానుగతమైన కాలం నవలలోని సంఘటనలలో అంతస్సూత్రంగా నిలిచివుంటుంది. ఈకాలాన్ని ఒకే క్రమంలో చూపవచ్చు. లేదా ఒక చోట మొదలుపెట్టి, వెనుకకు, ముందుకు పోయి భూత భవిష్య ద్వర్తమానాల సంఘటనలను చూపవచ్చు.

కాని నవలలో కాలానికి నిర్వచనం మారుతున్నది. మానవుడు కేవలం వర్తమానంలో మాత్రమే బ్రతకడు. అతడు బ్రతుకుతున్న ప్రతి నిముషంలోను భూత, భవిష్యద్వర్తమానాలు మిశ్రితమై

వుంటాయి. ఈ యీ కాలాల్లో అతడికి వచ్చిన భావాలన్నీ క్రమంగా వుండనవసరంలేదు. అవి అన్నీ పైకి ఏకసూత్రంగా కనిపించక పోవచ్చు. కాని మనిషి అంతరాంతరాలకు, సుప్త చైతన్యానికి అవి అన్నీ సరిగా, ఒక క్రమంలో వున్న సంఘటనలే. అందువల్లనే కాలానికి పూర్వులు యిచ్చిన అర్థంవేరు, ఈనాటి అర్థం వేరు, అంటున్నారు విమర్శకులు.

అలాగే స్థలం కూడా. అయితే స్థలం యింకా స్థూలమైనది కనుక దాని ప్రాముఖ్యం యింకా నిలిచి వున్నది. సక్రమమైన వాతావరణ నిర్మాణానికి స్థల వర్ణన - చాలా ముఖ్యం.

ఇవి కాక యింకా ఎన్నో లక్షణాలు నవల అన్న సాహిత్య ప్రక్రియకు చెప్ప బడ్డాయి. ఇవి అన్నీ ఇంతకు పూర్వం వచ్చిన నవలలను ఆధారంగా చేసుకొని విమర్శకులు చేసే సాధరణీకరణాలే కాని వాని ఆధారంగానే నవలారచయితలు రచనలు చేయాలనికాదు. ఎప్పుడూ లక్ష్యంముందు, లక్షణమే తరువాత.

ఈ లక్షణాలు ప్రపంచంలోని అన్ని భాషలలోని నవలలకు సాధారణమైనవే. కాగా, తెలుగు నవలలలోని ప్రత్యేక లక్షణాలు, అది ప్రారంభింప బడినప్పుడు రచయితల ఉద్దేశం - వంటివి యిపుడు తెలుసు కుందాము.

# తెలుగు నవల లక్షణాలు

1857 తర్వాత భారతదేశం మొత్తంమీద ఒక నూతన చైతన్యం ఆవిర్భవించింది. కలకత్తా, మద్రాసు, బొంబాయి నగరాలలో ప్రారంభం అయిన విశ్వవిద్యాలయాలలో ఆంగ్లభాషద్వారా బోధనం జరగడంవల్ల యువకులు చాలామందికి ఆంగ్లసాహిత్యంతో పరిచయం ఏర్పడ్డది. మహర్షి అరవిందుల మాటల్లో చెప్పాలంటే "ఈ ఆంగ్ల సాహిత్యసంపర్కం మనలోవున్న విమర్శనాత్మకమైన దృష్టిని పెంపొందించింది. నూతన సృజనాత్మకప్రక్రియలవైపుకు మన దృష్టిని మళ్ళించింది. క్రొత్త సంఘర్షణలను ధైర్యంగా ఎదుర్కొని వాటిని జయించి, సిసలయిన జాతీయతను వికసింపచేసింది."

నవల, నాటకం, చిన్నకథ, ఆత్మకథ వంటి ఎన్నో నూతన ప్రక్రియలు ఈ ఆంగ్లభాషా ప్రభావంవల్ల మనకు సంతరించినవే. ఈ విధంగా తెలుగునవల ఆవిర్భావానికి ఆంగ్లభాషా ప్రభావమే కారణమని విజ్ఞులు, విమర్శకులు నిరూపించివున్నా, తొలి తెలుగు నవల అట్టి ఆంగ్ల ప్రభావం కొంచెమూ లేకుండానే ఆవిర్భవించింది. "శ్రీరంగరాజచరిత్ర" మొదలుగా ఈనాటివరకూ వచ్చిన వేలాది తెలుగు నవలలను పరిశీలిస్తే నవలను, దాని లక్షణాలను మనవారు ఎలా వూహించుకున్నారో తెలుస్తుంది.

శ్రీ రంగరాజచరిత్రకర్త శ్రీ గోపాలకృష్ణమ చెట్టిగారు దీనిని "నవీన ప్రబంధము" అన్నారు. ఇది ఆంగ్లములోని "నవల" అన్న పదానికి తెలుగుసేత. చెట్టిగారు "నావెల్" లోని నవ్యతను మాత్రమే దృష్టిలోవుంచుకుని (నావెల్ అన్నపదానికి "క్రొత్తది"

అని అర్థం కనుక) "నవీన ప్రబంధము" అన్న పేరుపెట్టి ఉండాలి. "చింతామణి" పత్రిక 1892-96ల మధ్యకాలంలో నిర్వహించిన నవలల పోటీలకుగాను "వచనప్రబంధము" అన్న ప్రయోగాన్ని ఆమోదించి ప్రయుక్తంచేసింది.

ఇట్టి విస్తృతమైన కథా సాహిత్యానికి "నవల" అన్న పేరును మొదట ప్రయుక్తం చేసినవారు శ్రీ కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి గారు. "రాజశేఖరచరిత్ర"పై విమర్శవ్రాస్తూ ఇట్టి రచనలను "నవల" అనడం బావుంటుందని, శబ్దంలోనేకాక అర్థంలోకూడా ఈ రెంటికీ సామ్యం వున్నదని ఆయన పేర్కొన్నారు.

ఆ పీఠికలో బ్రహ్మయ్యశాస్త్రిగారు ఈ విధంగా వ్రాశారు:

"ఆంగ్లేయ భాషలో నావల్ (Novel) అను నీ పదము 'క్రొత్త' యను నర్థమునగల 'నవ్' అను పదమునుండి పుట్టినది. ఈ 'నవ్' అను దానికిని 'నవ' యను సంస్కృత పదంబునకును గల సంబంధము తేటతెల్లంబెకదా? కావున నవల యనగా నవాన్ విశేషాన్, లాతి గృహ్ణాతీతి నవలా — అనగాఁ గ్రొత్తవిశేషబులు గలదని యర్థము వచ్చుచున్నది. హూణ బాషయందును నీమాటకిదే యర్థమగుటచే నవలను పదమునకు సరియైన వేరొక సంస్కృత పదమునకయి ప్రయత్నము చేయక 'నవల' యని యీ పదమునే నేనిట వాడుచున్నాను."

'నవల' అన్న పదం యిలా ఆవిర్భవించినా, అది ప్రచురము కావడానికి మాత్రం చాల సంవత్సరాలు పట్టింది. మొదటిరోజులలో- దాదాపు 1900 సంవత్సరం వరకు — వచన ప్రబంధము అన్న పదమే ఎక్కువ ప్రచారంలో ఉన్నది. ఆ తరువాతనే 'నవల' అన్నది ప్రాచుర్యం పొందింది. 'నవల' అన్న పదంతోపాటు 'నావెలు' అనీ (Novel అన్న ఆంగ్ల పదాన్ని తెలుగులో వ్రాయడం), 'నోవలు' అనీకూడా ప్రయుక్తం చేయబడ్డాయి.

దీనిని "నవీన ప్రబంధము" లేదా "వచన ప్రబంధము" అని పిలవడంతో తెలుగు నవల రూపాన్ని నవలా సాహిత్యానికి ఆద్యులైన రచయితలు ఎలావూహించారో మనం గ్రహించవచ్చు. ప్రబంధాలలో వుండాలని నిర్ణయించిన కొన్ని లక్షణాలు నవలల్లో కూడా వుండడంవల్ల వారు దీనిని ప్రబంధానికి ప్రతిగా, దానికి వచనరూపంగా భావించారు. "కేవల గద్యాత్మకములయిన తెనుఁగు ప్రబంధములు - విశేషము లేమింజేసి యిది తెనుఁగు విద్యార్థులకు నయిత ముపయోగించునని తలంచెద" అని శ్రీ చెట్టిగారు వ్రాయడంవల్ల పై విషయం రూఢి అవుతున్నది.

వచన ప్రబంధాన్ని వివరిస్తూ "చింతామణి" పత్రిక ఇలా వ్రాసింది:

"ప్రబంధమనగా కల్పితమైన గాధ. ఆ కథను పురాణేతిహాసాదులనుండిగాని, చరిత్రములనుండిగాని గైకొని కథా సారస్యమున కనుకూలముగా నుండులాగున దానికి నూతనాంశములనుచేర్చి పెంచి వ్రాయవచ్చును. లేదా కవి మొదటినుండి కడవరకును స్వబుద్ధిచేతనే నూతన కథను కల్పించియైనను వ్రాయవచ్చును."

"శృంగార మో, వీరమో యేదో యొకరసమును ప్రధానముగా జేసికొని వివిధ రస సంయుతముగ నుండునట్లుగాని, యాయా రసమును పాటించుటకయి, వివిధ కష్ట సుఖములను, కార్యసాఫల్యములను మధ్య మధ్య సందర్భోచితముగ దీసికొనివచ్చుచు కథయంతయు నొక్కని చరిత్రమువలెనుండునట్లు వ్రాయవలెను".

"చింతామణి" లో చెప్పబడిన నవలా లక్షణాలను ఈ క్రింది విధంగా క్రోడీకరించవచ్చు.

1. కల్పితమైనకథ. 2. శృంగార వీరరసముల ఆధిక్యత. 3. మానవుల కార్యవిఘాతములు, కార్యసిద్ధి ప్రాముఖ్యం వహించడం. 4. కథ ఒక్కని చరిత్రగా వుండడం.

ఈ నాలుగులక్షణాలు దాదాపు ఈనాటివరకూ నవలకు ముఖ్యమైన లక్షణాలే!

వీనికితోడు చెట్టిగారు తమ నవలకు ఉపోద్ఘాతము వ్రాస్తూ "తెలుగుదేశమువారి యాచార వ్యవహారంబులు తెలుపునట్టి ప్రబంధంబొకటి రచియించుట తెలుగువారికుపయుక్తంబగునని తలంచి, నా నేర్పుకొలది నీ ప్రబంధంబు చెప్పబూనితిని" అన్నారు. చెట్టిగారి నవలకు ముఖ్యమైనది "జనుల ఆచార వ్యవహారాలను ప్రతిబింబించేటట్లు చేయడం". దీనిని అయిదవ లక్షణంగా చెప్పుకోవచ్చు. ఇతివృత్త నిర్మాణానికి మూలసూత్రం గోపాలకృష్ణమ చెట్టిగారు చెప్పిన ఈ లక్షణమే !

దీనికి కొంత విశేషణం (శ్రీ) కందుకూరివారు చేర్చారు. పంతులుగారు తమ రచన - "మనలోగల మూఢ విశ్వాసములను పోగొట్టవలెనన్న ముఖ్యోద్దేశముతో..." రచింపబడినదన్నారు. ఈ లక్షణం కేవలం కందుకూరివారి రచనలకు, లేదా వారినవలను అనుసరించి వ్రాయబడిన నవలలకు మాత్రమే పరిమితమని చెప్పవచ్చు.

పైన చెప్పిన విషయాలను క్రోడీకరిస్తే "సాంఘిక జీవితానికి ప్రతిబింబంగా, వ్యక్తుల జీవితగమనాన్ని చిత్రిస్తూ, జనుల ఆచార వ్యవహారాలను వ్యక్తీకరించే గద్య ప్రబంధం "నవల" అని నిర్వచించవచ్చు.

వాస్తవికచిత్రణ, సమాజంలోని వ్యక్తుల అనుభవాలను చిత్రించడం, తెలుగునవల ముఖ్యలక్షణం. సాంఘికవ్యవస్థ మారినకొద్దీ ఇలా కేవలం సాంఘికమైన వ్యవహారాలను ప్రతిబింబింపచేయడంతో ఆగక నవల మానవుని ఆంతరంగిక భావాలకు, సంచలనాలకు అక్షరరూపాన్ని ఇవ్వ సాగింది. "జీవితాన్ని వాస్తవంగా చిత్రించడం రచయిత సృజనశక్తి హద్దుల్ని నిర్మిస్తూ వున్నది" అన్న గోపీచంద్ మాటలను గమనిస్తే ఈ హద్దుల్ని అధిగమించి నవలను కేవలం సమాజ ప్రతిబింబ రూపంగా మాత్రమేకాక సర్వమానవుల సమస్తమైన వ్యక్తీకరణకు నవలను తెలుగు నవలాకారులు నేడు ప్రయుక్తం చేస్తున్నారని చెప్పవచ్చు.

# రెండవ భాగం

తెలుగు నవల : చరిత్ర

1. తెలుగు నవల : యుగవిభజన
2. తొలి తెలుగు నవల
3. తెలుగు నవల : సంక్షిప్తచరిత్ర

# తెలుగు నవల యుగవిభజన

**తెలుగు** నవల పుట్టి వంద సంవత్సరాలే అయినా అంత సమృద్ధిగా పంటను పండించిన సాహిత్యఖండం మరొకటిలేదు. ఈ వంద సంవత్సరాల తెలుగు నవలా సాహిత్యాన్ని పరిశీలిస్తే నవలాకారులు స్వీకరించిన ఇతివృత్తాలలో ఒక క్రమం, ఒక వైశిష్ట్యం కనిపిస్తాయి. నవలా రచయిత తాను చూస్తున్న జీవితాన్నే తన నవలల్లో ప్రతిబింబింప చేస్తాడు. దాన్ని ఇతివృత్తంగా స్వీకరిస్తాడు. ఈ వంద సంవత్సరాల చరిత్రను ఇతివృత్తంలో వచ్చిన మార్పుల దృష్ట్యా పరిశీలించి తదనుగుణంగా యుగవిభజన చేయడం ఈ వ్యాసంయొక్క ధ్యేయం.

ఇతివృత్త నిర్మాణం దృష్ట్యా ఈ వంద సంవత్సరాల చరిత్రను నాలుగుయుగాలుగా విభజించవచ్చు. ఇవి :

1. మొదటిదశ ... 1872–1900
2. రెండవదశ ... 1900–1920
3. మూడవదశ ... 1920–1942
4. నాలుగవదశ ... 1943– ఈనాటివరకు.

ఈ నాలుగు దశలలోను, ఇతివృత్త నిర్మాణంలో రచయితలు సాగించిన పద్ధతులను స్థూలంగా విశ్లేషించి చూద్దాం.

## నవల : కొన్ని ప్రాథమికలక్షణాలు

తెలుగు నవల ఆవిర్భావానికి ఆంగ్లభాషా ప్రభావమే కారణమని విజ్ఞులు, విమర్శకులు నిరూపించివున్నారు. కొందరు మాత్రం సంస్కృతంనుంచి అనువదింపబడిన "మహాశ్వేత" ను మొదటి నవలగా స్వీకరించాలని అభిప్రాయపడుతున్నారు.

కాని ఈ రెండు అభిప్రాయాలు సరికావు. సంస్కృత ఆంగ్ల సాహిత్య ప్రభావాలు తెలుగు సాహిత్యంమీద ఎంతవున్నా మొదటి తెలుగు నవల ఈ రెంటి ప్రత్యక్ష ప్రభావం లేకుండానే అవతరించింది. అది నరహరి గోపాలకృష్ణమ చెట్టిగారి "శ్రీరంగరాజు చరిత్ర" (1872). ఇది లార్డు మేయో ప్రేరణముతో వ్రాయబడిన మౌలికమైన తెలుగు నవల ; అనుకరణమూకాదు ; అనువాదమూకాదు.

తెలుగు నవలా లక్షణాలను క్రోడీకరిస్తూ మొదటి నవలాకారులైన గోపాల కృష్ణమచెట్టిగారు, కందుకూరి వీరేశలింగంగారు తమ నవలలపై వ్రాసిన అభిప్రాయాలు, చింతామణి పత్రిక నవలల పోటీలను ప్రారంభిస్తూ పేర్కొన్న నవలా లక్షణాలను ఇంతకు పూర్వమే సంక్షిప్తీకరించడం జరిగింది.

నవల అన్నది సాంఘిక జీవితానికి ప్రతిబింబంగా, సంఘంలో వున్న మూఢ విశ్వాసాలను రూపుమాపే సాధనంగా ప్రారంభం అయింది. వ్యక్తి జీవిత చరిత్రలో చెడును పోగొట్టి మంచిని పంచి ఇచ్చే సాధనంగా దానిని వారు వూహించారు. ఇలా ప్రారంభం అయిన నవల, దాని ఇతివృత్తం ఈ నాలుగుదశలలోనూ ఎటువంటి మార్పులను పొందిందో ఇప్పుడు పరిశీలిద్దాం.

### మొదటిదశ : 1872–1900

ఈ మొదటిదశలోని రచయితలు నవలను వచన ప్రబంధంగా భావించారు. ఈ రచనలకు సాంఘికమైన మూఢాచారాలను సమసింపచేయాలనే ఆదర్శం బలమైనది. దీనికిగాను వీరు ఒక వ్యక్తి సంపూర్ణ జీవితాన్ని తమ కథావస్తువుగా చేసుకొన్నారు. ఈ రచయితలందరిలోనూ ప్రబంధ లక్షణాలయిన క్లిష్ట సమాసరచన, వర్ణనలు కల్పితమైనగాధను స్వీకరించడం-ఇవి సామాన్య లక్షణాలుగా కనిపిస్తాయి. ఈ మొదటిదశను నవలా సాహిత్యంలో "ప్రబంధయుగం" అనవచ్చు.

ఈ నవలలన్నింటిలో మరో ముఖ్యలక్షణం - ఒకవ్యక్తి జీవితాన్ని తీసుకుని దానిని ఆద్యంతమూ వర్ణించడం. అతని జీవితంలో వచ్చిన ఒడుదుడుకులను పేర్కొని, వానిని అతడెలా దాటగలిగాడో చూపడం. అందుకే ఈ నవలలలో పెక్కింటికి ''చరిత్ర'' అన్నది పేరులో ఒకభాగంగా వున్నది. వానిని వ్యక్తుల జీవితచరిత్రలుగా రచయితలు వూహించడమే ఇందుకు కారణం.

మొదటి నవలాకారులైన గోపాలకృష్ణమ చెట్టి, కందుకూరి, ఖండవల్లి రామచంద్రుడు మొదలయినవారి నవలలు ఈ కోవకు చెందినవి. వచన ప్రబంధ లక్షణాలను వివరిస్తూ ''చింతామణి'' పత్రిక వ్రాసిన మాటలు ఇక్కడ పేర్కొదగినవి.

> ''శృంగారమో, వీరమో, ఏదోయొకరసమును ప్రధానముగా జేసికొని వివిధ రస సంయుతముగా నుండునట్లుగానీ, యాయారసమును పాటించుటకయి వివిధ కష్టసుఖములను ప్రయత్నములను, కార్యసాఫల్యములను మధ్యమధ్య సందర్భోచితముగా దీసికొనివచ్చుచూ కథయంతయూ నొక్కని చరిత్రమువలెనుండునట్లు వ్రాయవలెను.''

ఈ మాటలవల్ల నవల ఒక్కని చరిత్రముగా వుండటం, మానవుల కార్యవిఘాతములను కార్యసిద్ధిని చూపడం ఈ కాలంలో నవలల ముఖ్యలక్షణం. ఒకవ్యక్తి చరిత్రగతిని ప్రబంధశైలిలో వ్రాయడం ఈ నవలల లక్షణంగా మనం చెప్పుకోవచ్చు.

## రెండవదశ : 1900–1920

రానురాను నవల మధ్యతరగతి జీవితానికి ప్రతిబింబంగా మారింది. మధ్యతరగతి ప్రజల జీవితంలో ఒక ప్రత్యేకతవుంది. వారు ''నీతి'' (Morality) కి ఇచ్చినంతవిలువను పైతరగతివారుకానీ, కిందితరగతివారుకానీ ఇవ్వరు. నీతినియమాలకు (ముఖ్యంగా బాహ్యామైనవానికి) వారు ఇచ్చే ఆధిక్యతను, సంప్రదాయబద్ధమైన ఆచారాల ఆచరణలో వారుచూపే పట్టుదలను రెండో దశలోని రచనలు వ్యక్తం చేస్తాయి.

చిలకమర్తి వారి రచనలు అన్నీ ఈ కోవకుచెందినవి. కేతవరపు వేంకటశాస్త్రి, వేంకట పార్వతీశకవుల రచనల్లో, మనకు కనిపించే ఇతివృత్తాలన్నీ నాయకుని స్థితిగతులు, వంశము, సంఘంలో అతని గౌరవం వానికి అతనివున్నతకీగల సంబంధం—వీనికి సంబంధించినవి.

ఈ కాలం రచనల్లో మరొక విశిష్ట లక్షణం సంఘాన్ని అధికారికమైన వ్యవస్థ (ultimate authourity)గా రచయితలు, వారు సృష్టించిన పాత్రలు స్వీకరించడం. సంఘం సర్వాధికారాలుకలది.

దాని అధికారానికి సంఘజీవి అయిన ప్రతివాడూ తలవంచవలసిందే. మనుష్యుల అంతస్తులూ, అధికారమూ, పలుకుబడీ, ఇవన్నీ వారికి సంఘంలోవున్న స్థానాన్నిబట్టి నిశ్చయింపబడతాయి.

ఈ కాలంలోని రచయితలందరూ, పరంపరానుగతంగా వస్తున్న విలువలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆ విలువలుకూడా వ్యక్తిగతమైనవి కావు. సాంఘికమైనవి. కేతవరపు వెంకటశాస్త్రిగారు "లక్ష్మీప్రసాదము" అనే తమ నవలలో మనిషి హాయిగా బ్రతకడానికి ఇంగ్లీషు భాషే చదవనక్కరలేదని రెండుకుంట్ల భూమిని దున్నుకునికూడా హాయిగా కాలం వెళ్ళబుచ్చవచ్చునని నాయకునిద్వారా చెప్పిస్తారు. నాయకుడుపడిన పాట్లు, అతనికి ఎదురైన ఇబ్బందులు, చివరకు అతడే విజయం సాధించడంతో కథ సమాప్తమవుతుంది. అంటే ఆనాడు సంఘంలోవున్న క్రమక్రమానుగతంగా వస్తున్న సాంఘికమైన విలువలకే రచయిత తన నాయకునిద్వారా ప్రాముఖ్యం ఇచ్చాడన్న మాట. చిలకమర్తి వారి "రామచంద్రవిజయము" లో సాంఘికమైన సంబంధాలకు ఇవ్వబడిన విలువలను గురించి ఇక్కడ ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఈ రెండవదశలో వచ్చిన నవలలు చాలాభాగం ఇట్టివే.

ఈ నవలల సామాన్యలక్షణాలను ఈ క్రిందివిధంగా క్రోడీకరించవచ్చు :

> "నాయకులు సాంఘికంగా వున్నతమైన స్థితిలోవుండి తమ స్వకార్యములవలననో, దైవప్రేరితముననో కిందకు జారిపోవడం, తరువాత ఆ పరిస్థితులు చక్కబడి వెనుకటి వున్నతిని సాధించడం."

ఈ నవలల్లో "విధి" నిర్వహించిన పాత్ర అతిముఖ్యమైనది.

ఈ కాలంలో సాంఘికమైన వున్నతినే రచయితలు, పాఠకులు కూడా ఆదర్శంగా భావించారు. అట్టి వున్నతికి మనిషిలోని మంచి

తనం (భగవంతుడు ఇచ్చినది) అని వారు నమ్మారు. అయితే మానవుని లోని ఆంతరంగిక, బాహ్యప్రవర్తనలోనూ, స్థితిగతులలోనూ వచ్చే మార్పులకు పరిస్థితులు ఎలా కారణమో ఈ నవలా రచయితలు అంతగా పట్టించుకోలేదు.

### మూడవదశ : 1920–1942

ఈ మూడవదశలో వచ్చిన నవలలలో-సాంఘికమైన ఉన్నతికి, మానవుని వైయక్తికమైన ఉన్నతికిగల అంతరం సూచింపబడ్డది. సాంఘికంగా అధికారం, ఉన్నతి, ధనం, గౌరవంపున్న మనిషి నైతి కంగా వ్యక్తిగతంగా పతనం చెందడానికి అవకాశం ఉన్నదని ఈ రచనలు సూచించాయి. అంటే సాంఘికమైన జీవితానికి, సాంఘిక ఔన్నత్యానికి-వైయక్తిక ఔన్నత్యానికి వున్న అంతరాన్ని నవలా రచయితలు గుర్తించి దానికి తమ రచనలలో ప్రాముఖ్యం ఇచ్చారన్న మాట.

రెండవ దశలోని రచయితలు కేవలం దూరంనుంచి మాత్రమే ఆయా పాత్రల జీవితాలలోని సంఘటనలను వీక్షించి వారి బాహ్య ప్రవృత్తులను మాత్రమే వ్యక్తంచేశారు. కాగా ఈ మూడవదశలోని నవలాకారులు తమ పాత్రల ఆంతరంగిక మానసిక ప్రవృత్తులను గురించి విమర్శలు, వ్యాఖ్యానాలు చేశారు. ఈ విమర్శలు నిశిత మైనవీ, ఆత్మాశ్రయపరమైనవి. అంటే పాత్రపోషణలోనూ, తద్వారా ఇతివృత్తాలను మలచడంలోనూ ఈ నవలాకారులు చాలా వరకు పాక్షికమైన ప్రవృత్తిని అనుసరించారన్నమాట. తమ అభి ప్రాయాలకు అనుగుణంగా చిత్రింపబడిన పాత్రలను మంచిగానూ, వ్యతిరేకభావాలకు ప్రతీకలైనవారిని దుష్టంగానూ వీరు వ్యాఖ్యా నించారు.

ఈ కాలం నవల లక్షణాలను ఈ క్రిందివిధంగా సంక్షిప్తీకరించవచ్చు :

1. ఈ తరం నవలాకారులు సృష్టించిన పాత్రలు ఆ రచయితల భావాలకు ప్రతీకలు.

2. నవలలు ముఖ్యంగా కథాశ్రయాలే అయినా ఇతివృత్తం నడిచేతీరూ పాత్రల పోషణా గమనిస్తే, వానిని ఆత్మాశ్రయాలు అనవచ్చు.

3. ఈ నవలలు ఇంతకుపూర్వం వచ్చిన పూర్తి సాంఘికేతివృత్తం గల నవలలకూ తరువాతితరంలో వచ్చే మానసిక శాస్త్రగతమైన నవలలకూ మధ్యవున్న వంతెన వంటివి.

4. ఈ తరం నవలలు ఆయా రచయితలు వుద్దేశించే సాంఘిక విప్లవానికి మూల భూతాలుగా వుద్దేశింపబడ్డాయి.

ఈ సాంఘిక విప్లవాన్ని ఉద్దేశించి వ్రాయబడిన నవలలు రెండు మార్గాలను అనుసరించాయి. ఒకమార్గానికి వైతాళికుడు చలం ; రెండవతరగతికి నాయకుడు విశ్వనాథ సత్యనారాయణ.

(తన సమకాలికమైన సమాజం మాలిన్యమైనదని అందులోని వ్యక్తులకు (ముఖ్యంగాస్త్రీలకు) స్వేచ్ఛలేదని ఇంతకన్నా స్వేచ్ఛాపూరితమైన వాతావరణమే సంఘానికి విముక్తి నివ్వగలదని చలం వాదించాడు. ఇరుకు సందులలోని సాంఘికజీవనానికి రాజవీధులలో నిర్భయంగా తిరిగే స్వేచ్ఛా వాతావరణం కల్పించడం చలం సాహిత్య సృష్టికి మూలభూతమైన ఆదర్శం.

విశ్వనాథ రచనలలో ఇందుకు విరుద్ధమైన సాంఘిక విప్లవం దృగ్గోచరం అవుతుంది. పాశ్చాత్య నాగరికతా ప్రభావం తెలుగు సాహిత్యానికి ఒక రూపాన్ని ఎలా ఇచ్చిందో అదే నాగరికత విశ్వనాథ

STATE REGIONAL
57768

వారి రచనల్లో అంతటి విమర్శకు గురి అయింది. పాశ్చాత్య నాగరికతా వ్యామోహంలో పడ్డవారు నైతికంగా ఎంతటి అల్పులు కాగలరో ఈ రచనలు చూపించడానికి ప్రయత్నించాయి.

(ఇలా-నిజమైన ఉన్నతిఏది? నిజమైన సంస్కారం ఏది? అన్న ప్రశ్నలకు రెండు విభిన్నమైన దృక్పథాలు గలవారు ఇచ్చే సమాధానాలు ఈ రెండు రకాల రచనలలోనూ మనకు గోచరిస్తాయి. ఇంతేకాదు. వైయక్తికమైన ఉన్నతిని సాధించినవారే సాంఘికమైన ఉన్నతికికూడా అర్హులని ఈ రెండురకాల రచయితలూ వాదించారు.) అయితే వైయక్తికమైన లేదా నైతికమైన ఉన్నతికి వారు వేర్వేరు నిర్వచనాలు ఇచ్చారన్న సంగతి మనం మరువకూడదు.

వెనుకటి తరం నవలాకారులకు ఈ తరం నవలాకారులకు కల ముఖ్యమైనభేదం ఇది : (రెండవదశలోని రచయితల దృష్టిలో వ్యక్తిగతమైన ఉన్నతితో సంబంధంలేని సామాజిక ఔన్నత్యం ధ్యేయంగా కన్పించింది. కాని ఈ మూడవదశలోని రచయితలను సాంఘిక చైతన్యం మార్చివేసింది. పాఠకులుకూడా ఒకవంక కలకాలంగా వస్తున్న సాంఘికమైన విలువలకు, పాశ్చాత్య ప్రభావంవల్ల తారుమారై కొత్తగా ఉద్భవం కావలసివున్న కొత్త విలువలకు, మధ్యలో - "సంధి యుగం" దశలో-వున్నారు. అందువల్ల రచయితలు తమ భావాలను ఇంకా ఇంకా సునిశితంగా సూటిగా తమ పాఠకులముందు వుంచవలసిన అవసరం కన్పించింది. అందువల్లనే వీరిభావాలు ఎంత తీవ్రమైనవో, వారి భాషకూడా అంత సునిశితమైనది. అది "అమీనా" కావచ్చు. "మైదానం" కావచ్చు. అది "చెలియకట్ట" కావచ్చు. "వేయిపడగలు" కావచ్చు. అన్నింటిలోనూ అంతపటిష్ఠమూ, నిశితమూ, అయిన భావనాబలమూ, శక్తిమంతమైన శైలి మనకు కన్పిస్తాయి.)

ఈ రెండువర్గాల రచయితలూ, స్త్రీ పురుషుల సంబంధాలలో రావలసిన మార్పును తమ నవలలకు ముఖ్యమైన ఇతివృత్తంగా స్వీకరించారని చెప్పవచ్చు. విశ్వనాథ పరంపరానుగతమైన, సంప్రదాయ సిద్ధమైన స్త్రీపురుష సంబంధాలకు వివాహాలకు ప్రాముఖ్యం ఇవ్వగా, విప్లవాత్మకమైన వివాహాలు, స్త్రీ పురుష సంబంధాలు మాత్రమే ఆమోదింపబడాలని చలం వాదించాడు.

ఈ రెండు రకాల వాదాలూ పరస్పర విరుద్ధమైనవి. రెండూ తీవ్రమైనవి. రెండూ సాంఘికంగా అనుసరణీయములు కానివే.

## నాల్గవదశ : 1943-1970

ఎప్పుడైతే ఇంత నిశితంగా నిరంకుశంగా రచయితలు ప్రతిపాదించిన సాంఘికమైన విలువలకు అర్థం లేకుండాపోయిందో, అప్పుడు ఆధునిక నవలారచయిత ఉద్భవించాడన్నమాట.

ఇంతవరకూ వచ్చిన నవలలు అన్నీ ఏదోవిధంగా వ్యక్తికి సమాజంలో గల స్థానాన్ని గురించి మాత్రమే చర్చించినవి. ఈ తరం రచనలు వ్యక్తిలోని అంతర బాహ్య సంబంధాల సంఘర్షణను ముఖ్యమైన ఇతివృత్తంగా స్వీకరించాయి. ఈ మార్పుకు ఆర్థికమైన, సాంఘికమైన చైతన్యం, మార్పు ముఖ్యమైన కారణం. కొంతవరకు ఆంగ్ల సాహిత్యప్రభావమూ, తద్వారా వచ్చిన మానసిక శాస్త్ర సిద్ధాంతాలుకూడా ఈ తరం రచయితలను ప్రభావితం చేశాయి.

రానురాను ఈ యాంత్రికయుగంలో మానవుడు ఏకాకి అయిపోతున్నాడు. ("ఏకాంతం" అన్నది "చివరకు మిగిలేది" కి బుచ్చిబాబు వుంచిన మొదటి పేరు!). ఈ ఏకాంతం మనిషి బాహ్య సామాజిక స్థితుల ప్రభావానికి లోనై అతని అంతర్గతమైన భావ సంచయాలను మధించడానికి వుపయోగపడ్డది. ఈ బాహ్య

అంతర సంఘర్షణే బుచ్చిబాబు ''చివరకు మిగిలేది'', జి.వి. కృష్ణారావు "కీలుబొమ్మలు", గోపీచంద్ ''అసమర్థుని జీవయాత్ర'', రాచకొండ విశ్వనాథశాస్త్రి "అల్పజీవి'' వంటి నవలల్లో మనకు కనిపిస్తుంది.

దీనితోపాటు మానసిక శాస్త్రం (బెర్గ్‌సన్) కాలానికి ఇచ్చిన క్రొత్త నిర్వచనం వీరి రచనా క్రమానికి కొంత దోహదం ఇచ్చింది. భాస్కరభట్ల కృష్ణారావు వ్రాసిన ''వెల్లువలో పూచికపుల్లలు'' అన్న నవలకు ముందుమాట వ్రాస్తూ గోపీచంద్ చెప్పిన భావాలు ఇక్కడ వుల్లేఖించదగ్గవి. ''జీవితాన్ని వాస్తవంగా చిత్రించడం రచయిత సృజనశక్తి హద్దుల్ని నిర్మిస్తూ వున్నది....ముగింపుకూ ప్రయోజనానికి అనుకూలంగా ఇతివృత్తాన్ని మనం మలుచుకుంటున్నాం.'' దీన్ని అధిగమించడానికి ఈ కాలం రచయితలు ప్రశంసనీయమైన కృషి చేశారు.

ఈ కాలం నవలల్లోని మరొక ముఖ్యమైన లక్షణం బుచ్చిబాబు మాటల్లో చెప్పాలంటే – ''ఆర్థిక, సాంఘిక, వ్యత్యాసాలకతీతమై మనిషినీ మనిషినీ స్నేహపాశంలో బంధించివేసే మానవత్వంయొక్క శక్తుల్ని తరిచిచూడడమే.''

మానవత్వం ఇతివృత్తంగా స్వీకరించినప్పుడు ఆధునిక రచయిత రెండు భావాలను వ్యక్తం చేస్తున్నాడు. ఒకటి వ్యక్తికీ సంఘానికీవున్న సంఘర్షణ ; రెండవది మనిషిలోనే బాహ్య ఆంతరముల సంఘర్షణ.

ఈ నాలుగు దశలలోని ఇతివృత్తాలను సమీక్షించాలంటే – మొదటి తరంలో వ్యక్తి జీవితం ఆలంబనంగా చూపిన సంఘజీవితం, రెండవతరంలో సంఘజీవితం ఆలంబనంగా చూపిన వ్యక్తి జీవితం, మూడవతరంలో సంఘజీవితానికి వ్యక్తి జీవితానికి మధ్యవున్న

అంతరం, నాల్గవతరంలో సంఘజీవితానికి అతీతమైన మనిషి వైయక్తిక జీవితం చూపబడ్డాయని చెప్పవచ్చు.

ఈ విధంగా ఈ నాలుగు దశలలోని నవలాకారులుకూడా తమతమ సమకాలీన సమాజాలను, అందులో వ్యక్తి స్థానాన్నీ, వ్యక్తికీ సమాజానికీవున్న సంబంధాన్ని వ్యక్తీకరించడానికి ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో వారు వేర్వేరు ఇతివృత్తాలను ఎలా స్వీకరించారో అలాగే తమ రచనలకూ, తమ కాలానికి అనుగుణమైన శైలినిగూడా స్వీకరించారు.)

# తొలి తెలుగునవల

'తెలుగులో మొదటి నవల ఏది?' అన్నవిషయం మీద చాలా తర్జన భర్జనలు జరిగాయి. ధారావాహికంగా నడిచిపోయే ఒక వాహినికి పుట్టుక ఎక్కడ అన్నది అనవసరమైన ప్రశ్నే అయినా ఇందులో కొంత చారిత్రకమైన జిజ్ఞాస ఇమిడివున్నది. మొదటి తెలుగునవలను గురించి వున్న వాదోపవాదాలన్నింటిలోను నాలుగు ముఖ్యమైనవి వున్నాయి.

1. కళాపూర్ణోదయమువంటి పద్యాత్మకమైన కథా కావ్యాలు.
2. కొక్కొండ వెంకటరత్నం పంతులుగారి ''మహాశ్వేత''.
3. నరహరి గోపాలకృష్ణమచెట్టిగారి ''శ్రీరంగరాజు చరిత్ర''.
4. కందుకూరి వారి ''రాజశేఖరచరిత్ర''.

(కథ చెప్పాలన్న ఆకాంక్ష మానవుడికి ఆదికాలంనుంచి క్రమానుగతంగా వస్తున్నదే. అయితే నవల అన్న సాహిత్యప్రక్రియ యొక్క రూపం యేమిటి అని ప్రశ్నించుకున్నప్పుడు ఇంతకు పూర్వమే చెప్పబడ్డ ఈ క్రింది లక్షణాలను పేర్కొనవచ్చు:

1. కల్పితమైన కథ. ఈ కథ పురాణేతిహాసాదులనుంచి గ్రహించినది గాని, లేదా వినూత్నమైనదిగాని కావచ్చు.
2. శృంగార వీర రసాలు ప్రధానాలు.
3. మానవుని కార్య విఘాతములు, కార్యసిద్ధి చూపే ప్రధాన ఘట్టాలు వుండాలి.
4. కథ ఒక్కని చరిత్రగా వుండడం.
5. జనుల ఆచార వ్యవహారాలను ప్రతిబింబించడం.

ఈ లక్షణాలు అన్ని నవలలో వుండే కథకు సంబంధించినవి. కథా కథనానికి సంబంధించిన ఏ లక్షణాలను మనవారు ఆలోచించినట్లు లేదు. అయితే గోపాలకృష్ణమచెట్టిగారు మాత్రం తెలుగులో గద్య ప్రబంధాలు లేకపోవడంవల్ల విద్యార్థులకు అందుబాటుతో వుండే విధంగా తాము దీనిని వ్రాస్తున్నామన్నారు. ''కేవలం గద్యాత్మకములైన తెనుఁగు ప్రబంధములు విశేషములేమింజేసి ఇది తెనుఁగు విద్యార్థులకు సైతముపయోగించునని తలంచెద'' అన్నారాయన.

ఈ లక్షణాలను సమన్వయం చేసుకొని దీనికి మరి ఒక్క లక్షణం కలిపితే తెలుగు నవల ఏ విధంగా ప్రారంభం అయిందో మనకు ద్యోతకం అవుతుంది. వీరేశలింగం పంతులుగారు రాజశేఖర చరిత్ర పీఠికలో ''ఈ వఱకు మన యాంధ్రభాషలో జనుల యాచార వ్యవహారములను దెలుపుచూ నీతిబోధకములుగా నుండు వచన ప్రబంధము లేవియు లేకపోవుట ఎల్లవారికిని విశదమయియే యున్నదిగదా ?'' అన్నారు. అందువల్ల అంతకుపూర్వం తెలుగులో ఇట్టి నవలారచన ప్రారంభంకాలేదని, తమ నవలే తెలుగులో మొట్టమొదటి నవల అని అభిప్రాయపడ్డట్లు స్పష్టమవుతున్నది. అందువల్ల నవల అన్న పదం, ఆ ప్రక్రియ, మనకు ఆంగ్ల సంపర్కంవలన వచ్చినదనికూడా పై మాటలవల్ల విశదమవుతున్నది.

పైన పేర్కొన్న నవలా లక్షణాలనుబట్టి చూస్తే కళాపూర్ణోదయమువంటి రచనలు కథాకావ్యాలుగా మాత్రమే వుండిపోతాయి గాని—వానిని "పద్యాత్మకమైన నవల" అనడానికి వీలుకాదు. అయితే "ఈనాడు నవలకు ఏ లక్షణాలు మనం చెప్పుకుంటున్నామో అవి అన్ని కళాపూర్ణోదయంలో వున్నాయి–ఒక్క వచనంలో లేకపోవడం మినహాయించి. కథాకథనం పద్యంలో సాగిందా గద్యంలో సాగిందా అన్నప్రశ్న అంత ముఖ్యమైనదికాద"ని కొందరి వాదం. అయితే తెలుగులోని కథాకావ్యాలు అన్నింటిని మనం నవలలుగా స్వీకరిం

చాలి. మరి "శివాజీ భారతము", "రాణాప్రతాప్" వంటి పద్య కావ్యాలను, "పెన్నేటిపాట" వంటి ఆధునిక కథా కావ్యాలను నవలలుగా స్వీకరించవచ్చా ? దానికి వీరి సమాధానం, నవలలు లేని రోజుల్లో వ్రాయబడ్డ కళాపూర్ణోదయము వంటివానిని నవలలుగా స్వీకరించవచ్చు. చాలా ముందురోజుల నుంచే మనవాళ్ళు ఈ నవలా ప్రక్రియను వూహించి గ్రంథస్థం చేశారు ఈనాడు వచనంలో నవలలు వ్రాయబడుతున్నంత మాత్రాన ఆనాడు పద్యాలలో వ్రాయబడ్డవి నవలలు కాకుండా పోవు — అని.

ఈ వాదం కొంతవరకు సమంజసమైనదే. ఆ ప్రక్రియలేనప్పుడు దానికి అనుగుణమైన రచనలు రావడం హాస్యాస్పదం. కాని కళాపూర్ణోదయం కథా కావ్యంగా మాత్రమే స్వీకరించడంలో కొంత సులువు వుంది. అది "మీడియం" కు సంబంధించినది. ఒకసారి నవల వచన వాఙ్మయానికిచెందిన ప్రక్రియగా గ్రహించిన తరువాత ఈనాడు పద్యంలో ఎవరైనా నవల వ్రాసినా దానిని నవలగా స్వీకరించం. దానిని కథా కావ్యము అనే అంటాము. అయితే నవలకు పూర్వరూపంగా మనం వీనిని స్వీకరించవచ్చు.

ఇక రెండవది "మహాశ్వేత". దీనివిషయం వెలికి తీసుకువచ్చి దీనికి మొదటి నవలగా పట్టం కట్టినవారు శ్రీ నిడదవోలు వేంకటరావుగారు. "మహాశ్వేత తెలుగులో మొదటి నవల" అనటానికి ఆయనచూపిన కారణాలు ఇవి.

> "పైవాని యన్నింటికన్న ముఖ్యమైనది మహాశ్వేత నవలా రచన. పంతులుగారు క్రీ.శ. 1867 వ సంవత్సరమున రచించిరి. తెనుగు నవలారచనకు పంతులుగారు ప్రథములు. ఈ నవలలో కొంతభాగము 1895వ సంవత్సరమున 'వైజయంతి' పత్రికయందు ప్రకటితమైనది. ఇది వీరేశలింగం పంతులుగారి "రాజశేఖర చరిత్రము" కన్న ఇరువదిరెండేండ్లు ముందుగ వెలసినది".

ఈ మాటలకు ఆధారం శ్రీ శివశంకర పాండ్య వెంకట రత్నం పంతులుగారి జీవితచరిత్రలో వ్రాసిన ఈమాటలు:

"In 1867 he composed the first TELUGU novel by name MAHASWETA founded on the pleasant story of Kadambari, the masterpiece of Banabha-tta in Sanskrit."

ఇందులో రెండు విషయాలు మనం గమనించాలి. ఒకటి "మహాశ్వేత" 1867 లో రచింపబడినదనడానికి శివశంకర పాండ్యాగారి మాటలు ఒక్కటే మనకు ఆధారం. మరో నిదర్శనం లేదు. వ్రాసిన 28 సంవత్సరాలకు ఇది వైజయంతిలో ప్రకటించబడ్డది. అదికూడా కొంతభాగం మాత్రమే. మొత్తం గ్రంథం మనకిప్పుడు లభ్యం కావడంలేదు. గ్రంథరూపంలో రాకపోవడంవల్ల కథావస్తువు కల్పితమైనది కాకపోవడంవల్ల ఆనాటివారెవ్వరూ దీనిని వచన ప్రబంధంగా గుర్తించలేదు. మనకు చాలా కథాకావ్యాలు సంస్కృతంనుంచి వచ్చినవే. అవి అన్నీ కావ్యాలుగా వ్రాయబడివున్నాయి. ఇది వచనంలో వ్రాయబడివున్నది. వారిదృష్టిలో ఈ రెంటికీ అంత పెద్ద భేదం వున్నట్టు లేదు.

ఏవిధంగా చూసినా మహాశ్వేతను తొలి తెలుగు నవల అనడానికి వీలులేదు. కల్పితమైన కథలేదు. దొరుకుతున్న భాగం అసంపూర్ణం. అదికూడా 1867 లో వ్రాయబడినదనడానికి తగిన ఆధారాలు లేవు. అయితే "ఆంగ్లభాష వాసన ఇందులో ద్యోతకం కావడంలేదు. అందువల్ల కూడా దీనిని మొదటి తెలుగునవల అనడానికి వీలులేద" ని డాక్టరు రమాపతిరావుగారు అన్నారు. అయితే ఆంగ్లభాషా సంపర్కం తెలుగుదేశంలో నవల వ్రాయడానికి ప్రోద్బలకం అయిందేకాని

ఆ ప్రభావంవుంచేనేకాని అది నవల కాదు అనడం అసమంజసం. దీనికి ఉదాహరణగా తెలుగు నాటక చరిత్రను పేర్కొనవచ్చు. ఇంగ్లీషు వాసన అంటూలేని ''మంజరీ మధుకరీయా'' న్ని మనం మొదటి నాటకంగా స్వీకరిస్తున్నాం.

ఇక మిగిలిన రెండు నవలలను కలిపి ఇక్కడ చర్చించాలి. "శ్రీ రంగరాజు చరిత్ర" 1872 జూన్ 14 వ తేదీన ప్రకటింపబడ్డది. "రాజశేఖరచరిత్ర" 1888 లో వ్రాయబడ్డది. ఈ రెండుకూడా ఫోర్ట్ సెంట్ జార్జి గెజిట్ లో ప్రకటింపబడ్డ విషయాలే.

డాక్టరు కొత్తపల్లి వీరభద్రరావుగారు ఈ రెంటిలోను కొన్ని తాదాత్మ్యమైన సంఘటనలు చూపి వీరేశలింగం పంతులుగారు "శ్రీ రంగరాజు చరిత్ర"ను చూచేవుంటారు, అంతేకాదు, దానినిచాలా చోట్ల అనుసరించారు అనడానికి ప్రబల నిదర్శనలు చూపారు. కాని పంతులుగారు తమ స్వీయచరిత్రలో ''నేను ఆరంభించిన కాలమందు తెలుగులోనిప్పటివలె వివిధములైన పుస్తకములు లేవు... తెలుగులో మొదటి వచన ప్రబంధమును నేనే చేసితిని, మొదటి నాటకమును నేనే తెనిగించితిని...'' అని చెప్పుకున్నారు. బహుశా పంతులుగారు ఈ గ్రంథమును చూసివున్నా ఆరేడుసంవత్సరాలపాటు దానివంటి రచనలు మరేమీ రాకపోవడంవల్ల తమదే ప్రధానమైన మొదటి నవల అని వూహించివుండవచ్చు.

ఈ విధంగా ఒక కొత్త ప్రక్రియ వెలువడినప్పుడు కొన్ని సంవత్సరాలవరకు సమకాలీన రచయితలు దానిని గుర్తించక పోవడం అనే విషయం మనకు ఆధునిక తెలుగు సాహిత్యాన్ని చూస్తే విదితం అవుతుంది. అంతేకాదు. ఈనాడు మొదటి తెలుగు నవలగా చెలా

మణి అవుతున్న ''రాజశేఖరచరిత్ర'' కూడా వ్రాయబడిన మొదటి రోజుల్లో — అంటే రెండవ ముద్రణకు రానంతకాలం — అలానే విస్మరింపబడినదని చెప్పడానికి ఈ క్రింది కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి గారి వాక్యాలే నిదర్శనం :

''ఈ రాజశేఖర చరిత్రమను నవలను వెనుక నేను జదివి నప్పుడు నాకది కొంత విమర్శనీయముగా దోచినను గాలాతిక్రమణ మగుటచేతను నీ గ్రంథము విద్యావంతులయందంతగా వ్యాపకము గాకపోవుటచేతను నేనప్పుడాపనికి బూనుకొననైతిని.''

చింతామణి పత్రిక ప్రకటించిన నవలల పోటీకి ''రాజశేఖర చరిత్ర''ను ప్రమాణంగా స్వీకరించారు కనుకనే దానికి ఇంత ప్రచారం వచ్చిందని, అట్టిది ''శ్రీ రంగరాజ చరిత్ర'' కు రాలేదని, అందువల్ల అది త్వరగా విస్మరింపబడినదని మనం చెప్పుకోవచ్చు. అంతేకాదు. గోపాలకృష్ణను చెట్టిగారు ఆనాటి సాహిత్య ప్రపంచంలో అంత ప్రఖ్యాతుడుకాదు. వీరేశలింగంగారు నవ్యసాహిత్య వైతాళికుడు. చెట్టిగారు ఎక్కడో ప్రభుత్వోద్యోగం చేసుకుంటూ రాయలసీమ ప్రాంతాలలో ఎక్కువగావుంటూ వుండేవారు. వీరేశలింగంగారు ఆనాడు సాహిత్య, సాంఘిక చైతన్యాలకు ఆటపట్టయిన మదరాసు, రాజమండ్రిలలో వుండేవారు. ఈ కారణాలన్నీ తోడై ''శ్రీ రంగ రాజ చరిత్ర'' అంతగా ప్రఖ్యాతికి రాలేదు.

శ్రీ రంగరాజ చరిత్ర మొదటి నవల అనడానికి మరోకారణం అప్పటి గెజెట్‌లో దానినిగురించి వ్రాస్తూ SUBJECT అన్న చోట " A NOVEL " అని వ్రాయడంతోపాటు కింద "REMARKS" అన్నచోట ''This is apparently the first

attempt ever made in this part of India at Novel writing in Telugu prose'' అని వున్నది.

రాజశేఖర చరిత్రను గురించికూడా హిందూపత్రిక ''It is the first Telugu novel that has yet appeared'' అని వ్రాసింది. దీనివలన ఇంగ్లీషులో నావెల్ ఎట్టిదో తెలుగులో అట్టి రచనే చేయబడ్డదని విదితం అవుతున్నది.

నవల ఆంగ్లభాషా ప్రభావంకలదిగా గుర్తించినంతమాత్రాన-కల్పితము, మౌలికము అయి, ''రాజశేఖర చరిత్ర'' కన్నముందు వ్రాయబడ్డ''శ్రీ రంగరాజు చరిత్ర''ను మొదటి తెలుగు నవలకాదనడం సాహసమే. డాక్టరు రమాపతిరావు ''నేడు నవలగా ఎట్టి ప్రక్రియను మనం అనుకుంటున్నామో ఆ లక్షణాలు మహాశ్వేతయందుగాని, శ్రీ రంగరాజు చరిత్రమునంగుకాని,విశేషించి కనుపించవు. రాజశేఖర చరిత్రమునందు తులనాత్మకంగా ఆ లక్షణాలు ఎక్కువగా వున్నవి. అదీగాక ''ఆలివర్ గోల్డు స్మిత్'' అను కవీశ్వరుని ''ది వికార్ ఆఫ్ వేక్ ఫీల్డు'' అన్న గ్రంథానికి ఇది అనుసరణముగా రచింపబడినది. ఆంగ్ల సాహిత్య ప్రభావం వుండడం, అనుసరణ గ్రంథం కావడం, స్వకపోల కల్పితములైన అంశములనేకములుండటము'' అన్న లక్షణాలను పురస్కరించుకుని ''సర్వలక్షణ సమగ్రమైన తొట్టతొలుతటి తెలుగు నవల రాజశేఖర చరిత్రమేనని విదితం కాగలదు'' అన్నారు. ఈ ''సర్వలక్షణ సమగ్రత'' అంటే ఏమిటో అర్థం కావడంలేదు. కల్పిత కథ, జనుల ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే రచన, మూఢవిశ్వాసాల విమర్శ-ఇవి తొలి తెలుగు నవలలకు ప్రత్యేకమైన లక్షణాలు అనుకుంటే ''శ్రీ రంగరాజు చరిత్ర'' తెలుగులో మొట్ట మొదటి నవల అని చెప్పకతప్పదు. అది రాజశేఖర చరిత్రకన్న ఆరు సంవత్సరాలు ముందు వ్రాయబడ్డది - అనడం అంతకన్న ముఖ్యమైన కారణం. మిగిలిన నవలలపై ఈ నవలయొక్క ప్రభావం ఎంతో

వున్నది అన్న అంశంమీద దాని ప్రథమత్వం ఆధారపడివుండదు. పైగా గోపాల కృష్ణమచెట్టిగారి నవల ఆంగ్ల నవలా ప్రభావ జనితం కాదని డాక్టరు రావుగారు అన్నమాటలు యదార్థం కావు. లార్డు మేయోకి అంకితం చేయబడ్డ ఈ నవల కర్నూలులో డిప్యూటీ కలెక్టరుగాఉన్న చెట్టిగారు ''నవీన ప్రబంధము'' గా వ్రాశారు. దీనివలన ఇంగ్లీషులోని నవలను దృష్టిలోవుంచుకునే ఈ నవలను వ్రాశారని అర్థం అవుతున్నది. ఇతివృత్త నిర్మాణం, కథాకథనాలలో కూడా చెట్టిగారు ఆంగ్లంలోని నవలలను అనుసరించారని చదివినవారికి తేలికగా వ్యక్తం అవుతుంది. అందువలన నరహరి గోపాలకృష్ణమ చెట్టి గారి "శ్రీరంగరాజ చరిత్ర"ను తొలి తెలుగు నవల అనక తప్పదు.

# తెలుగు నవల సంక్షిప్త చరిత్ర

1857 లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య సమరం తరువాత దేశంలో బ్రిటిష్‌వారి రాజ్యం సుస్థిరం అయింది. కేవలం రాజకీయమైన పరిపాలనేకాక, సాంఘిక, విద్యాది రంగాల్లో కూడా ఆంగ్లేయుల ప్రభావం స్పష్టంగా మన జీవిత విధానం మీద పడ్డది. సాంఘికమైన దురాచారాలను ఒకపక్క నిశితంగా విమర్శిస్తూ, వానిని రూపుమాపడానికి సంఘసంస్కర్తలు ప్రయత్నం చేస్తూవుండగా, వేరొకవంక ఆంగ్ల సాహిత్య ప్రభావం ద్వారా ఉత్తేజితులైన భారతీయ రచయితలు ఆయా సిద్ధాంతాలను, భావాలను, ఆంగ్ల సాహిత్యం నుంచి స్వీకరించిన నూతన ప్రక్రియల ద్వారా తమ జాతీయ సాహిత్యంలో కూడా ప్రతిబింబింప జేయాలని దీక్షబూనారు. దానికి ప్రతిఫలమే నూతన సృజనాత్మక రూపాలయిన నాటకం, నవల, కథ మొదలైనవి.

ఈ రూపాలు ఏదోవిధంగా మనకు పూర్వ సాహిత్యంలోలేవని కాదు. యక్షగానాలు, కథాకావ్యాలు, పద్యగాథలు మనకు కోకొల్లలు. అయినా, నూతన దృక్పథంతో, వినూత్న ప్రభావాలతో ప్రారంభింపబడ్డ యీ ప్రక్రియల నన్నిటినీ ఆంగ్లవిద్యా సంపర్క ప్రభావములని ఒప్పుకోవడంలో మనం కించపడవలసిందేమీ లేదు.

ఈ 'నవల' అన్న ప్రక్రియ - మిగిలిన అన్ని దేశాలలోను, అన్ని ప్రక్రియలకు వలెనే — ముందు అనుకరణలు, అనువాదాలుగా ప్రారంభమయినా, రానురాను తన స్వయం ప్రతిభను నిర్ధరించుకొని ఎన్నో కొత్త పోకడలుపోయింది. మధ్య మధ్య విదేశీయ ప్రభావం ఉన్నా దానిని స్వంతం చేసుకొని భారతీయత, ఆంధ్రత్వం అలంబ

నంగా జీవితానికి, సంఘానికి కొత్త అర్థాల్ని స్ఫురింపచేసి, కొత్త విలువలను చూపింది. దాదాపు వందయేళ్ళుగా సాగిన యీ చరిత్రలో వందలాది రచయితలు తమ నవలల ద్వారా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. ఆ నవలలన్నింటిని గురించీ ఇక్కడ చర్చించడం అసంభవం. అయినా యీ వందయేళ్ళలో తెలుగు నవలా సాహిత్య వికాసంలో వచ్చిన మలుపుల్ని, ముఖ్యమైన ప్రభావాల్ని, స్వరూప స్వభావాల్ని చర్చించి వానికి ఒక రూపం యివ్వడం యీ వ్యాసం యొక్క ఉద్దేశం.

ముఖ్యమైన రచయితలు, వారి వారి ముఖ్యమైన రచనలు, ప్రవృత్తులే యీ సంక్షిప్త చరిత్రలో పేర్కొనడం జరుగుతుంది. అంత మాత్రాన మిగిలిన వారి నవలలు ముఖ్యమైనవి కావని కాదు. ఇది వారి నవలలను గురించి చేసిన వ్యాఖ్యానంగా ఎంచకూడదని మనవి.

ఈ నవలా సాహిత్యాన్ని ఆయాకాలాలలోవున్న ముఖ్యమైన ప్రవృత్తులనుబట్టి యీక్రింది భాగాలుగా విభజించడం జరిగింది:

1. ప్రారంభయుగం: 1872—1900
2. అనువాదయుగం: 1900—1920
3. వికాసయుగం: 1920—1942
4. మనోవైజ్ఞానిక యుగం: 1943—1960
5. సమకాలీన యుగం: 1960—

ఈ యుగవిభజన అనేక విధాలుగా చేయవచ్చు. చారిత్రక నవలల్ని గురించి ఆలోచించిచేటప్పుడు వానికి తగిన విభజన ఆవశ్యకం. అలాగే సాంఘికేతివృత్తాలను తెలుగు నవలాకారులు ఎలా చిత్రించారో చూపించడం ''తెలుగునవల: యుగవిభజన'' అన్న అధ్యాయం నిరూపిస్తుంది. అందువల్ల పై విభజన కూడా స్థూలమైనదిగానే మనం

చెప్పుకోవాలి. ఇట్టి విభజనలో తప్పకుండా కొంత అభిప్రాయ భేదానికి తావు వుండవచ్చు. ఆయాకాలాలలోని ముఖ్యమైన ప్రవృత్తుల్ని గ్రహించి, దీనికి అనుగుణమైన పేరువుంచడం యిక్కడ చేసిన పని. నిజానికి 'అనువాదయుగం' లో కేవలం అనువాదాలే వచ్చాయని కాని, 'మనోవైజ్ఞానిక యుగం'లో కేవలం మనస్తత్వ శాస్త్రసంబంధమైన నవలలే వచ్చాయని కాని అర్థంకాదు.

మనోవైజ్ఞానికయుగం 1960 తో అంతరించిందని చెప్పవచ్చు. అంటే మనో విశ్లేషణే ధ్యేయంగా, ఒక కొత్త పద్ధతి ద్వారా, ప్రయోగాత్మకంగా వ్రాసిన నవలలు 1960 తరువాత అంతగా కనిపించవు. (ఇటీవల వచ్చిన అంపశయ్య, అనురసంధ్యవంటి ఏకొద్ది నవలలో తప్ప) ఈ నాడు వస్తున్న నవలలో బహుళమైనవి కుటుంబ జీవితాన్ని గురించినవి. అందువల్ల ఈ భాగం మొదటి అధ్యాయంలో సూచించినట్లు 1943 నుంచి యీనాటి వరకు ఒక యుగంగా చెప్పడం కన్న, 1960 నుంచి ఈనాటివరకు గల కాలాన్ని మరొక దశగా చూపడం అవసరమనుకుంటాను.

ముందు యుగ లక్షణాలుచెప్పి, ఆ సంబంధమైన నవలలను పేర్కొని ఆ తరువాత తదితరములైన నవలలను పేర్కొంటాను.

## ప్రారంభయుగం

ఈ ప్రారంభయుగాన్ని వీరేశలింగం యుగమని కూడా అనవచ్చు. తెలుగు సాహిత్యంలో ఒక వినూత్నమైన పునరుజ్జీవనాన్ని కలిగించిన వాడు శ్రీ కందుకూరి. నాటక రచనలో కందుకూరికన్న ముందు కొందరు వైతాళికులున్నట్లే నవలా రచనలో కూడా అట్టి ప్రయత్నం చేసినవారు లేకపోలేదు. అంత మాత్రాన ఆయన గౌరవం కాని, ఆయన వ్రాసిన నవలకు గల గౌరవం కాని తగ్గవు.

ఈ ప్రారంభంలోని నవలలన్నీ ఆంగ్ల సాహిత్య ప్రభావంవల్ల వ్రాయబడినవే! కొన్నింటికి - రాజశేఖర చరిత్ర వంటివానికి-ప్రత్యక్షమైన మూలాలు వున్నాయి. మరికొన్నింటికిలేవు. అంతేతేడా. ఈ ప్రభావం కథ చెప్పడంలో కన్న ఇతివృత్తంలోను, సంఘటనలలోను చాలవరకు కన్పిస్తుంది. నరహరి గోపాలకృష్ణమ చెట్టిగారు బంగాలీల ఆచార వ్యవహారాలను ప్రతిబింబింపచేసే నవలకు బహుమతి నిస్తామని లార్డుమేమో గెజెట్‌లో చేసిన ప్రకటనను చూచి తానుకూడా ఉత్సాహితుడై తన నవలను వ్రాశాడు. ఆయన డిప్యూటీ కలెక్టరు. ఆంగ్ల భాషాకోవిదుడు. తన గ్రంథాన్ని తెలుగు వారి ఆచార వ్యవహారాలను జోడిస్తూ వ్రాసినా కథాకల్పనలో ఆంగ్ల వాసనను వీడలేకపోయాడు.

ఈకాలంలో వచ్చిన కొద్దినవలలోను మరో ముఖ్యలక్షణం అవి ఒకే వ్యక్తి జీవితాన్ని స్వీకరించి అందులో అతడు ఎదుర్కొన్న కష్టాలను అధిగమించి స్వాస్థుడు కావడం. అందువల్లనే ఈ నవలలలో చాల వానికి ''చరిత్ర'' అనీ, ''విజయము'' అనీ నామకరణంచేశారు నవలాకారులు. శ్రీరంగరాజు చరిత్ర, రాజశేఖర చరిత్ర, సంజీవరాయ చరిత్ర, రామచంద్ర విజయమువంటి నవలలు యిందుకు నిదర్శనలు.

(వ్యక్తుల జీవిత చరిత్రలను వర్ణించడం అటుంచి యివిఅన్నీ నీతిదాయకాలు కూడా. సాంఘికమైన దురాచారాలను ఖండించడం కోసమే వీరేశలింగంగారు తమ నవల వ్రాశారు. నీతిబోధే వీరి ధ్యేయమా అన్నంత ఎక్కువగా వీనిలో నీతిదాయకమైన సూక్తులను, సంఘటనలను చేర్చారు. ఈ నవలన్నిటికీ ప్రధానమైన నామకరణంతో పాటు మరొక పేరు కూడా పెట్టడం యీ నవలా కారులందరికీ అలవాటు. ''సోనాబాయి పరిణయము'' అని ''శ్రీరంగ రాజు

చరిత్ర'' కూ, ''వివేకచంద్రిక'' అని ''రాజశేఖర చరిత్ర'' కూ మారుపేర్లు ఉన్నాయన్న సంగతి అందరికీ తెలిసినదే !

సాంఘికమైన దురాచారాలను ఖండించడంతో పాటు రాను రాను సాంఘిక మర్యాదలను, ఆనాటి సాంఘిక జీవనాన్ని నవలల్లో ప్రతిబింబించడం ప్రారంభించారు రచయితలు. మొదటి యిద్దరు నవలా కారులు ఆనాటి జాతిజీవనాన్ని అంతగా తమ నవలల్లో ప్రతిబింబింప చేయడానికి ప్రయత్నించలేదు. ఆనాటి దురాచారాలైన వర్ణాశ్రమ ధర్మం, స్త్రీలకు సంఘంలో గల స్థానం—వీని పైననే వారి విమర్శ కేంద్రీకరించ బడ్డది. కాని ఖండవిల్లి రామచంద్రుడు, ఆ తరువాత చిలకమర్తి లక్ష్మీనరసింహంగార్ల నవలల్లో ఆనాడు గోదావరి మండ లంలో, కోనసీమల్లో ఉండే బ్రాహ్మణ కుటుంబాల్లోని ఆచార వ్యవ హారాలు యదార్థరూపంలో చిత్రించబడ్డాయి.

ఈ కాలంలోనే 1894 లో 'చింతామణి' పత్రిక నవలా రచనల్లో పోటీలు పెట్టి ప్రథమ, ద్వితీయ బహుమానా లివ్వడం ద్వారా, ఆ రచనలను తమ పత్రికలో ప్రకటించడం ద్వారా, రచయితలకు ఎంతో ప్రోత్సాహం యిచ్చింది. వారు నవలా రచనా విధానానికి చేసిన సూచనలు, పెట్టిన షరతులు కూడా కొంతవరకు నవల రచనా విధా నాన్ని నియమబద్ధం చేయడానికి తోడ్పడినదని చెప్పవచ్చు. ఈ విషయం చారిత్రక నవలల విషయంలో మరీ నిజం.

''శ్రీరంగరాజు చరిత్ర'' కు అనేక కారణాలవల్ల అంతప్రచారం రాలేదు. కాగా, కందుకూరి వారి ప్రతిభవల్ల, ఆనాటికే ఆయన సాహిత్య ప్రపంచంలో సుస్థిరుడై వుండడంవల్ల, ఆయన నవలకు సాహిత్య గౌరవం, ప్రచారం లభించాయి. దాని ఒరవడిలోనే చిలకమర్తి వంటివారు నవలా రచన చేశారు. ఆ నవలలోని లక్షణా లనే చింతామణి పత్రిక స్వీకరించి, పోటీదారులు ఆ లక్షణాలనే అనుస

రించాలని నిర్ణయించింది. అంతేకాదు. పోటీలలో పాల్గొనే వారు "రాజశేఖర చరిత్ర" ను అనుసరించడం మంచిదని సలహా చెప్పింది.

పురాణేతిహాసాదుల నుంచిగాని, చరిత్రనుంచిగాని కథను స్వీకరించవచ్చునని, లేదా కవి స్వకపోల కల్పితమైన గాథను స్వీకరించవచ్చునని 'చింతామణి' పత్రిక వ్రాసింది. శృంగార, వీర రసాలు అంగి రసాలుగా, మిగిలిన అన్ని రసాలు అంగరసాలుగా వుండాలని నిర్ణయించింది. ఒక్కని చరిత్రమునే వ్రాయాలన్నది. ఇవి అన్నీ రాజశేఖర చరిత్రలోని లక్షణాలేనని వేరుగా చెప్పనక్కరలేదు.

ఈ లక్షణాలను స్వీకరించి వ్రాయబడ్డ యీ ప్రక్రియను చాల రోజులుగా 'వచన ప్రబంధము' అన్నారనీ, గోపాల కృష్ణమ చెట్టి గారు దీనిని "నవీన ప్రబంధము" అన్నారనీ వెనుకనే చెప్పాను. నవీన అంటే 'Modern' అని కాక 'Novel' (వినూత్నమైనది) అన్న పదానికి తెలుగు రూపంగా గ్రహిస్తే 'నవీన ప్రబంధ' మన్న పేరే ఉచితమనిపిస్తుంది. లేదా దీనిని 'నవీన వచన ప్రబంధము' అనడం సమంజసం.

ఈ మొదటి యుగంలోని రచయితలకు తాము అనుకరించడానికి వీలుగా అంతకుముందు యిట్టి ప్రక్రియ లేకపోవడంతో, అట్టి దానికి వారే ఆద్యులు కావడంతో శైలిని ఏర్పరచుకోవడం, కథా కథన పద్ధతిని నిర్ణయించుకోవడం, ఇతివృత్త స్వీకరణకు కొన్ని లక్షణాలను చెప్పుకోవడం వారికివారే ఏర్పాటు చేసుకోవలసి వచ్చింది. ఈ నిర్ధరించే పని "చింతామణి" పత్రికే చేసిందని చెప్పవచ్చు.

ఈ తరం నవలాకారుల నవలలన్నీ ప్రబంధ ధోరణిలోనే సాగినాయని చెప్పవచ్చు. ప్రబంధోచితమైన భాష ముఖ్యంగా యీ మొదటి నవలల్లో చూడవచ్చు. నరహరి గోపాల కృష్ణమ చెట్టిగారి నవల జటిలమైన, సమాస భూయిష్టమైన శైలిలో వ్రాయబడ్డది. అది

మొదటి ప్రయత్నం కనుక అది తరువాతి నవలలలోని భాషతో ఏమాత్రం పోలికలేని ప్రబంధాల భాషనే ప్రయుక్తం చేసింది.

ఎప్పుడైతే వీరేశలింగం పంతులుగారు నవలను కూడా తన సంఘసంస్కారానికి ఒక ఆయుధంగా ఉపయోగించ దలుచుకున్నాడో అప్పుడే ఆయన తన నవల శైలి అంత జటిలంగా ఉండగూడదన్న నిర్ధారణకు వచ్చినట్లే!

గోపాలకృష్ణమ చెట్టిగారి నవలకన్న కందుకూరి వారి నవల, అంతకన్నా చిలకమర్తి వారి నవలలు సరళములై ప్రజలు తేలికగా చదువు కోవడానికి అనువుగా వ్రాయబడ్డాయి.

ఈ లక్షణాలేమీ పట్టని రచన కొక్కొండవారి ''మహాశ్వేత''. ఇది బాణభట్టుని ''కాదంబరి'' లోని కొన్ని ఘట్టాలకు యథాతథమైన అనువాదం. భాష సంస్కృత శబ్ద భూయిష్టం. ఇందులో కథాకల్పన కాని, రచయిత ప్రత్యేకతకాని ఏమీలేవు. ఇది పూర్తిగా ముద్రితం కాలేదు. అయినంత కూడా (వైజయంతిలో, 1895 లో) ప్రబంధము వలె జటిలమైన శైలిలో వ్రాయబడ్డది.

ఇక తొలి తెలుగు నవల "శ్రీరంగరాజు" చరిత్ర (1872) లో కూడా భాష అలానే వున్నా, కొంత వైచిత్రి, కథాకల్పనవుండి, నవల అన్న పదానికి అనువైన రచనగా సాగింది. అయిదు ఉల్లాసాలుగా విభజింపబడ్డ యీ కథలో కల్పన, బిగి తక్కువ. ఈ నవలకు ఉపనామం ''సోనాబాయి పరిణయము''. ఈ నవలలో నాయకుడు శ్రీరంగరాజు. రంగనాయిక నాయిక. ప్రధాన పాత్రలకు ఆ పేర్లను ఎన్నుకోవడం ధ్వన్యాత్మకంగా వుంది. రంగనాయిక కొంతకాలం 'సోనాబాయి' గా వ్యవహరింప బడుతుంది. శ్రీరంగరాజు ఒక రాజ కుమారుడు. తండ్రి తన్నూ, అయనకు ఒక వేశ్యయందు కలిగిన కుమారుణ్ణి ఒకే విధంగా చూడడం నచ్చక ఒక స్నేహితునితో కలిసి

యిల్లు వదిలి పారిపోతాడు రాజు. చంద్రగుప్తి అన్న వూళ్లో సోనా బాయి అనే లంబాడీ కన్యను ప్రేమిస్తాడు. కాని ఆమెను భీమా నాయకుడనే లంబాడీ దొర ప్రేమించి, ఆమెకు ఆమె తల్లికి అది యిష్టంలేకపోవడంవల్ల వారిని అపహరించి కొండవీటి రాజుకు అప్ప గిస్తాడు. ఆమెను కాపాడడానికి కొండవీడు చేరుకుంటాడు శ్రీరంగ రాజు. తుదకు సోనాబాయి తనకు మేనమామ కూతురని, ఆమె రాజకన్య అని తెలుసుకొని ఆమెను వివాహ మాడతాడు.

ఇదీ కథ. కథలో కల్పన నామ మాత్రం. వర్ణనాత్మకమైన శైలి. జటిలమైన భాష. ''హిందువుల యాచారము తెలుపునట్టి నవీన ప్రబంధము'' అన్న చెట్టిగారు ఆనాటి ఆచారవ్యవహారములను యిందులో చూపి విమర్శించడానికి యత్నించి కృతకృత్యులైనారు. వర్ణవ్యత్యాసాలను గురించి యిందులో నిశితమైన విమర్శవుంది. గెజెట్‌లో దీనిని సమీక్షించిన వారు మాత్రం దీనిలోని ఒక్క సంఘ టనను ఆమోదించలేకపోయినట్లు యీ క్రింది వాక్యాలవల్ల తెలు స్తున్నది :

> "The diction and manner of telling the story are favourably spoken of excepting perhaps the incident of the capture of the heroine by force by a party of Lambadies, which is not considered to be a good feature of a healthy specimen of novels for native females "
>
> (Fort St. George Gazette, Supplement for July, August, Sept, 1872.)

1872 లో వచ్చిన శ్రీరంగరాజు చరిత్రకు 1880 లో వచ్చిన రాజశేఖర చరిత్రకూ మధ్య నవలలు ఏమీ వ్రాయ బడ్డట్లులేదు. దానికి కారణం - ఉన్న కొద్దిమంది రచయితలు కావ్యాలు వ్రాయడం,

లేదా కొత్త ప్రక్రియ అయిన నాటకాలు వ్రాయడంలో నిమగ్నులై వుండడం. నవల మరీ కొత్త ప్రక్రియ. నాటకం - అలాకాక - ఇదివరకు ఉన్నది; పైగా నాటకాలు వ్రాయడానికి వీలుగా ఎన్నో ఆంగ్ల, సంస్కృత నాటకాలు ఉన్నాయి. ఈమధ్య కాలంలో కొన్ని కథలు మాత్రం వెలువడ్డాయి. అవి అన్నీ నీతిదాయకాలైనవి. హంస వింశతి, శుకసప్తతి కథలకు గద్యరూపాలు కొన్ని, రాజపుత్రుల సాహస గాథలు మరికొన్ని.

1878 లో ''వివేకచంద్రిక'' లో వరుసగా ప్రకటింపబడి 1880 లో పుస్తక రూపంలో వచ్చింది శ్రీ కందుకూరి వీరేశలింగం గారి "రాజశేఖరచరిత్రము''. శ్రీసమర్థి రంగయ్యసెట్టిగారు "Can you not undertake the writing of an original novel in Telugu?" అని ఒక లేఖ ద్వారా ప్రశ్నించగా (ఫిబ్రవరి 8, 1875) ముందు "ఒక చిన్న యింగ్లీషు ప్రబంధమును దేనినైనను తెలిగించి శైలి కుదురు పఱుచుకొని, తరువాత స్వకపోల కల్పితమైన వచన ప్రబంధమును వ్రాయబూనుకోవలెనని'' తలచి అందుకుగాను గోల్డ్‌స్మిత్ వ్రాసిన ''వికార్ ఆఫ్ వేక్ ఫీల్డు''ను ఎన్నుకున్నారు. కొంత అనువదించిన తరువాత ''విదేశకథ భాషాంతరమున మనవారికింపుగానుండదని తోచి......దానిని మానివేసి రాజశేఖరచరిత్రమును వ్రాయనారంభించితిని'' అని పంతులుగారు తమ స్వీయచరిత్రలో చెప్పుకొన్నారు.

ఈ నవలను గురించి, దానిపై ఆంగ్లగ్రంథం ప్రభావం ఎంతవరకన్న విషయాన్ని గురించి వేరొక అధ్యాయంలో విపులంగా చర్చింపబడుతున్నది.

డాక్టర్ కొత్తపల్లివీరభద్రరావుగారు యీనవలలోను గోపాలకృష్ణమచెట్టిగారు వ్రాసిన ''శ్రీరంగరాజుచరిత్ర'' లోను ఒకేవిధమైన

సంఘటనలు ఉన్నాయని సోదాహరణంగా చూపించి పంతులుగారు యీనవలను తప్పక చూచివుండాలన్నారు. అంతేకాదు. గోపాల కృష్ణమచెట్టిగారు ఉన్నత పదవిలో ఉన్నవాడు. అసలే గ్రంథములు వ్రాయబడని రోజులలో ఏఒక్క గ్రంథము వచ్చినా అది సాహిత్యకుల దృష్టిలో పడకుండా ఉండడం అసంభవంకాదా!

''కథను గల్పించుటలో గోల్డుస్మిత్తను నింగ్లీషు కవీశ్వరుని గ్రంథసాహాయ్యమును గొంత'' పొందినట్లు 'రాజశేఖరచరిత్ర' పీఠికలో కందుకూరివారు వ్రాసుకొన్నారు. కాని ఆ నవలలోని చాల సంఘటనలను పాత్రలను పంతులుగారు గ్రహించారు. ఎక్కడ తెలుగు దేశంలోని ఆచారవ్యవహారాలకు విరుద్ధంగా ఆంగ్ల గ్రంథం లోని కథవుందో అక్కడ మాత్రం తప్పనిసరి మార్పులను చేశారు రచయిత.

1891 లో పంతులుగారు ''సత్యరాజాపూర్వదేశయాత్రలు'' అన్న రెండు కథల సంపుటాని ప్రకటించారు. ఇవి నవలికలు. ఇంగ్లీషులోని ''గల్లివర్సు ట్రావెల్సు'' కు అనువాదం ఒకటి; ఆపద్ధతిని అనుసరించి తెలుగు వారి ఆచారవ్యవహారాలను విమర్శించడానికి వ్రాసింది వేరొకటి. ''వ్యాజరీతిని'' వ్రాసినట్లు పంతులుగారే చెప్పుకొన్నారు. ''వ్యాజరూపమున'' (Ironical) మనలోని దురాచారములను మూఢవిశ్వాసములను పరోక్షముగా ప్రదర్శించునట్టి పుస్తకమును నాలుగుభాగములుగాఁ జేయవలెనని బుద్ధిపుట్టి మొదట నీభాగమును జేసితిని.'' అని చెప్పుకొన్నారు పంతులుగారు.

పంతులుగారప్పటికే తమ ప్రహసనాలలో సంఘంలోని మూఢా చారాలను విమర్శించడం మొదలుపెట్టారు. ఇందులో కూడా మొదటి కథలో స్త్రీలకు సంఘంలో వున్న దుస్థితిని గురించి వ్యంగ్య రూపంలో చిత్రించారు. అందులో సత్యరాజును ఆడుమళయాళము

ఉన్నచోటునకు తీసుకుపోయారు. అక్కడ స్త్రీలకు సమస్త హక్కులు ఉండి, పురుషులు వారికి బానిసలుగా వుండడం ఎంతో నిశితమైన వ్యంగ్యంతో చూపించారు. ఈ నైశిత్యం స్విఫ్ట్‌లోని నైశిత్యానికి ఏమాత్రము తీసిపోదు. ఇది చాలా ప్రతిభావంతమైన రచన.

ఇందులోని రెండవ కథ స్విఫ్ట్ వ్రాసిన 'గల్లివర్స్ ట్రావెల్స్' లోని ''బ్రాబ్డింగ్ నాగ్'' కథకు అనుకరణ రూపం. కాని స్విఫ్ట్ చూపిన వ్యంగ్యం, హాస్యం మాత్రం ఇందులో కనిపించవు.

నాటకాలవలె, ప్రహసనాలవలె యింకా ఎన్నో నవలలను పంతులుగారు వ్రాయక పోవడం తెలుగువారి దురదృష్టమునే చెప్పుకోవాలి. దీనికి ఒక కారణం ఆనాటికి యింకా పాఠకుల సంఖ్య పెరగక పోవడం. రెండవ కారణం నాటకాలమీద ఉన్న మోజు. పంతులుగారు మాత్రం దీనికి కారణం చెప్పుకుంటూ స్వీయచరిత్రలో యిలా వ్రాసుకున్నారు : ''రాజశేఖర చరిత్రము పత్రికాధిపతులచేతను తదితరుల చేతను బహువిధముల పొగడబడెను గాని సామాన్య జనులు దానిని గ్రహింప లేక పోయినందున దానివలన వట్టి పొగడ్తలే గాని లక్ష్మియేమియు నాకు గలుగలేదు. వేయి ప్రతులుగల మొదటి కూర్పమ్ముడు పోవుటకే బహు సంవత్సరములు పట్టినది. అందుచేత నిప్పుడు నవలలనబడు వచన ప్రబంధములను వ్రాయుప్రయత్నములను మానివేసితిని.''

కాని పంతులుగారు నవల వ్రాయకూడదనుకొన్నంతమాత్రాన వారికి నవలమీద అసంతృప్తి కలిగిందని చెప్పడానికి వీలులేదు. ఒక ప్రక్రియగా దీనిని సుస్థాపితం చేయడానికి సమకట్టింది పంతులుగారే ! 1892-99 మధ్యకాలంలో తమ సహకారంతో నడిచిన చింతామణి పత్రిక ద్వారా నవలల పోటీలను ఏర్పాటు చేసి రచయితలను ప్రోత్స

హించి నవలలు వ్రాయడానికి ఒక ఒరవడిని పెట్టింది పంతులు గారే ననడానికి ఎట్టి సందేహములేదు. వారి నవల తరువాత నవలా రచయితలకు ఎట్లా మూలగ్రంథం అయిందో, అలానే వ్రాయడానికి ఉత్సాహాన్నిచ్చింది చింతామణి పత్రిక. రెండూ పంతులుగారు మన జాతికి పెట్టిన భిక్షే!

పనప్పాకము అనంతాచార్యులుగారు వ్రాసిన "మంజువాణీ విజయము" (1892) ఒక వణిజ పుత్రిక అయిన మంజువాణి ఒక రాజ కుమారుణ్ణి ప్రేమించి, చాలా కష్టాల తరువాత అతన్ని వివాహం ఆడడం చిత్రించిన నవల. శైలి రాజశేఖర చరిత్ర కన్న జటిలమైనది.

శ్రీ ఖండవిల్లి రామచంద్రుడు 1893, 1895 లలో 'చింతామణి' బహుమతి గ్రహీత. "ధర్మవతీవిలాసము" ఆయన మొదటి నవల. కథను కల్పించడంలో, చారిత్రక కాలాన్ని స్వీకరించడంలో యీయన "శ్రీరంగరాజుచరిత్ర" ను అనుసరించినట్లు తోస్తుంది. ఈ కథ గజపతుల కాలంనాటిదిగా ఊహింప బడ్డది. కాని చాలావరకు స్త్రీల బుద్ధిబలము, ధీశక్తి నిరూపించడానికి వ్రాసిన నవలగా పేర్కొన వచ్చు. ఇందులో యువతి స్వయంవరంలో భర్తను పరీక్షించి వివాహం చేసుకోవడం, అతనికి కష్టాలు వచ్చినపుడు తాను స్వయంగా రాజు గారి న్యాయస్థానానికి వెళ్ళి ప్రత్యర్థులతో వాదించి గెలవడం - యివి అన్నీ షేక్స్పియర్ వ్రాసిన "మర్చంట్ ఆఫ్ వెనిస్" అన్న నాటకం ఆధారంగా వ్రాసినట్లు తోస్తుంది. వీరి రెండవ నవల "మాలతీరాఘవీయము" కూడా ప్రేమికుల గాథే! ఈ నవలతో యువతీ యువకుల పేర్లు కలిసి వచ్చేటట్లు నవలకు నామకరణం చేయడం దీనితోనే ప్రారంభమైనదని చెప్పవచ్చు.

ఈయనదే మరొక నవల "లక్ష్మీసుందరవిజయము" (1896) ఇది కూడా చింతామణి పోటీలలో బహుమతి పొందినదే! ఇది టిప్పు

సుల్తాన్ కాలంనాడు జరిగినట్లు ఊహించ బడ్డది. అక్కడక్కడ చారిత్రక విషయాలను, వర్ణనలను తప్పిస్తే యిందులో చారిత్రకం అనడానికి వీలుగా కథాకల్పనలో గాని, పాత్ర చిత్రణలో కాని ఏమీ కన్పించదు. ఇది ఒక నటుని గాథ.

తల్లాప్రగడ సూర్యనారాయణగారి ''సంజీవరాయచరిత్రము'' (1893) యీకాలం నవలలలో ఒక విశిష్టమైన స్థానం ఆక్రమించుకున్నది. కందుకూరి వారికి, వారి సంస్కరణాభిలాషకు అతి సన్నిహితులు శ్రీతల్లాప్రగడవారు. రాజశేఖర చరిత్రకు 'నకలు' అనదగిన ''సంజీవరాయ చరిత్రము'' (1893) ఆయన మొదటి నవల. ఇది కందుకూరి వారి నవల లానే సంఘసంస్కరణే ముఖ్యమైన ధ్యేయంగా వ్రాయ బడ్డది. ఒక పురోహితుల పిల్లవాడు ధైర్యంగా నలుగురికి ఎదురు నిలచి భార్యను చదివించడం, మరొకప్రక్క అతని చెల్లెల్ని ఒక చరిత్ర హీనుడికి యిచ్చి పెళ్ళి చేయడంతో అట్టిపెళ్ళిళ్ళతో స్త్రీలు ఎట్టి హీనమైన జీవితం గడపవలసివస్తుందో యిందులో చిత్రించబడ్డది. చిట్టచివరకు మూర్ఖంగా ప్రవర్తించిన తండ్రి-కొడుకు, కోడళ్ళను దగ్గరకు తీయడం ద్వారా పశ్చాత్తప్తుడౌతాడు.

ఈకాలంలో వచ్చిన నవలల్లో ప్రత్యేకంగా పేర్కొనదగిన నవల నంబూరుతిరునారాయణస్వామి రచించిన ''సుబ్బారావు'' లేక ''ప్రణయమహిమము'' అన్నది (1894). ఇది తెలుగువారి గృహస్థ జీవితాన్ని గురించి వ్రాయబడిన మొదటి నవల. అంతకు పూర్వం కూడా ''రాజశేఖరచరిత్ర'', ''సంజీవరాయచరిత్రము'' వంటి నవలల్లో తెలుగు సాంఘిక జీవితం లేదా ఒక వర్గం వారి చరిత్ర చిత్రించ బడ్డాయి. కాని కుటుంబ జీవితాన్నే ప్రధానంగా తీసుకొని వారెవరు తమ నవలలను వ్రాయలేదు. ఈ నవలలో అత్తా కోడళ్ళ కయ్యాలు, స్త్రీల స్వార్థపరత్వము, వివాహాలలో విపరీతమైన ఖర్చులు, నాయకుని వేశ్యాలోలుపత్వము మొదలైన ఆ కాలంలోని అనేక

విషయాలను గురించి చర్చింపబడ్డది. సమకాలీన సంఘంలోని అవినీతి, వేశ్యల చతురత వంటివి, విధవ ఆడబడుచుల దుశ్చర్యలు యిందు కళ్ళకు కట్టినట్లు వర్ణింప బడ్డాయి.

1894 లో 'రామచంద్రవిజయము' చింతామణి పత్రిక బహుమతి పొందడంతో చిలకమర్తివారు నవలారంగంలో ప్రవేశించారు. అప్పటి నుంచి దాదాపు ఒక పాతిక సంవత్సరాల పాటు ఆయన తెలుగు నవలా సాహిత్యాన్ని వివిధములైన తమ నవలలతో ఎంతో సుసంపన్నం చేశారు.

చింతామణి పత్రిక బహుమతులను నాలుగుసార్లు స్వీకరించారు చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు. 1893 లో ఖండవిల్లివారి ''ధర్మవతీ విలాసము'' తల్లాప్రగడవారి ''సంజీవరాయచరిత్రము'' ప్రథమ, ద్వితీయ బహుమానములను స్వీకరించిన నవలలు. 1894 లో చిలకమర్తివారి ''రామచంద్రవిజయము'', గోటేటి కనకరాజుగారి ''వివేక విజయము'' బహుమతులు పొందాయి. 1895 లో వేకుమళ్ళరాజ గోపాలరావుగారి ''త్రివిక్రమ విలాసము'' ఖండవిల్లి రామచంద్రుడు గారి ''మాలతీరాఘవము''నకు ప్రథమ, ద్వితీయ బహుమానములు యివ్వబడ్డాయి. 1896 లో, 97 లో, 98 లో చిలకమర్తి వారికే ప్రథమ బహుమానాలు యివ్వబడ్డాయి - వారి హేమలత, అహల్యాబాయి, కర్పూరమంజరి బహుమతి పొందిన నవలలు.

ఇవి కాక యీకాలంలో వచ్చిన నవలలలో పేర్కొనదగ్గవి : రెంటాల వెంకటసుబ్బారావుగారి 'కేసరీవిలాసము' (1895), బులుసు పాపయ్యశాస్త్రిగారి 'భాస్కరవిలాసము' (1895), రాజా మంత్రి ప్రగడ భుజంగరావుగారి 'మనోరమ'(1899). కూనపులిలక్ష్మీనరసయ్య గారి ''బక్షీ'' (1899) 'చింతామణి' ద్వితీయ బహుమానముపొందిన నవల.

ఈకాలంలోనే వచ్చిన మరొక ముఖ్యమైన నవల ''కపాల కుండల''. అంతవరకు కథాబీజాన్ని మాత్రమే ఏదో ఒక మూలంనుంచి గ్రహించి అనుసరణలుగా సాగిన నవలా సాహిత్యం ఈ నవలతో అను వాదాల దిశకు సాగింది. ఓ. వై. దొరస్వామయ్య అనువదించిన ఈ నవలకు మూలం బెంగాలీలో బంకించంద్రచటర్జీ వ్రాసిన ''కపాల కుండల". దీనితో తెలుగు నవలా సాహిత్యం కొత్త పుంతలు తొక్కిం దని చెప్పవచ్చు.

"చింతామణి" పత్రిక తెలుగునవల ప్రారంభమైన తొలి రోజుల్లో నవలారచనలో ఒక పద్ధతిని, క్రమాన్ని కలిగించింది. తెలుగులోని నవలలు చాలా భాగం ఆ యా కాలాలలోని పత్రికల పోటీలు నియమించిన నిబంధనలకు అనుగుణంగా వ్రాయ బడుతున్నవే. అట్టి రచనలకు నాంది పలికినది '' చింతామణి '' పత్రిక. నవల అంటే ఏవిధంగా ఉండాలో, నవలారచయితలు ఏయే నిబంధనలను అనుసరించాలో మొట్టమొదటిసారి పేర్కొన్నది యీపత్రికే! ఈ నిబంధనలను అనుసరించే చిలకమర్తి మొదలైన వారు తమ నవలలను వ్రాశారు. ఈ పత్రికకు సంపాదకులు శ్రీన్యాపతి సుబ్బారావుపంతులుగారు. కందుకూరి వీరేశలింగంపంతులుగారి ఆధ్వర్యంలో నడిచింది యీ పత్రిక. ఆనాడు వ్రాయబడిన నవలల లక్షణాలను యీ పత్రిక ఏవిధంగా నిబంధించిందో చూపడానికిగాను 1892 వ సంవత్సరంలో తొమ్మిదవ సంపుటంలో నవలల పోటీలను ప్రారంభిస్తూ ''చింతామణి'' పత్రిక చేసిన ప్రకటన భాగాన్ని యిక్కడ పొందుపరుస్తున్నాను.

"ప్రబంధ మనగా కల్పితమయిన కథ. ఆ కథను పురాణేతి హాసాదులనుండిగాని, చరిత్రలనుండి గాని గైకొని కథాసారస్యమున కనుకూలముగ నుండులాగున దానికి నూతనాంశములను చేర్చి పెంచి వ్రాయవచ్చును; లేదా కవి మొదటినుండి కడవరకును స్వబుద్ధి

చేతనే నూతన కథను కల్పించియైనను వ్రాయవచ్చును. కథాంశము వ్రాయువారి బుద్ధివిశేషము ననుసరించి యుండునుగాన దానిని గురించి విధులు చెప్పుట యనావశ్యకమేయైనను, కథ పూర్ణముగా కల్పితమైనను కొంతవరకితర గ్రంథముల నుండి గ్రహింప బడినదైనను చమత్కారముగనుండి చదువు వారికి హృద్యముగా నుండవలెనని చెప్పుట యనావశ్యకము కాదు. శృంగారమో, వీరమో, యేదో యొక రసమును ప్రధానముగా జేసి కాని వివిధ రస సంయుతముగ నుండునట్లుగాని యాయారసమును పోషించుటకయి వివిధ కష్ట సుఖములను ప్రయత్నములను కార్యవిఘాతములను కార్యసాఫల్యములను మధ్య మధ్య సందర్భోచితముగా తీసికొనివచ్చుచు కథ యంతయు నొక్కని చరిత్రమువలె నుండునట్లు వ్రాయవలెను. కథ యందు వచ్చు పాత్రములలో నొక పురుషుని సన్మార్గునిగా జెప్పెడు పక్షమున వాని వర్తనమును తదనుగుణముగానే యంతకంతకు వికసింప జేసి ధర్మ మార్గానుసరణము నిమిత్తమయి కష్టములకోర్చుట ధర్మమార్గము తొలగవలసి వచ్చునని పరితాప పడుట మొదలయిన సంగతులను బలపరచి వ్రాయవలెను. కథలోని ఇంకొక పాత్రమును దుష్టునిగా చెప్పెడు పక్షమున వాని దుష్ప్రవర్తనమును సహితము క్రమ క్రమముగా విస్తరింప జేసి మొట్టమొదట మనస్సులో దుశ్చింత పుట్టినపుడు పాపమునకు భయపడి వెనుదీసి రాగద్వేషాదుల ప్రేరణము చేత కార్యమునకు లోబడుట, తరువాత గొంత పశ్చాత్తాప పడినను దినదిన క్రమమున కఠినుడయి యకార్యకరణమునకు సందేహింపకుండుట మోసము మొదలయిన దుష్కార్యముల వలన మొదట కొంత కాలము కార్యసిద్ధి యగునట్లు కనబడినను కడపట కృషి యంతయు నిష్ఫలమయి ధర్మమునకే విజయము కలుగుట మొదలయిన సంగతులను బలపరచి వ్రాయవలెను. ఈ ప్రకారముగనే యొకపాత్రమును శూరునిగానో భీరునిగానో కామునిగానో విరాగినిగానో

యెట్లుచెప్పినను తత్తద్రసోచితముగ వాని గుణముల నంతకంతకు విస్తరింప చేసి స్వభావము ననుసరించి వర్ణించవలెను. మధ్య మధ్య నెన్ని పాత్రములు వచ్చుచున్నను కథకంతకును ముఖ్య నాయకు డొకడుండ వలెను. నాయకుని తోడిపాటుగా కథానాయికయు ఉండవచ్చును."

"ఈ వచన ప్రబంధముల యందు కథ కేవల కల్పితమైనను స్వభావ విరుద్ధముగా నుండక నిజముగా జరుగుచున్న చరిత్రము వలె నుండి చదువువారికి హృదయాహ్లాదకరముగా నుండవలెను. కథలో సందర్భోచితముగా జనుల యాచార వ్యవహారములను కార్యములు జరిగిన స్థలములు మొదలయిన వానిని వర్ణింప వలసి వచ్చినప్పుడా వర్ణనలను అసంభావ్యములుగా నుండునట్లు చేయక నైసర్గికముగాను వినోదకరముగాను జేయవలెను. కథయందు రసోచితముగా శృంగార వర్ణనము చేయవలసివచ్చినను మన కావ్యములయందున్న రీతిగా కుచ కచ సంభోగాది వర్ణనలు చేయకూడదు. మొత్తముమీద కథయొక్క ఫలితార్థమంతయు నేదోయొక నీతిని బోధించునదిగా యుండవలెను. కవి హాస్య వచనములు మొదలయిన వానిచేత వాక్చనుత్కృతిని జూప వలసినను స్త్రీలు చదువకూడదని మృదుత్వము తప్పిన మోటుమాటలు గాని యంశములుగాని ఉపయోగింపకూడదు. కథ నంతను ప్రథమ పురుషమునందే వ్రాయక నాటకములయందు పాత్రము లొండొరులతో మాటాడుకొనునట్లు నడుమ నడుమ సంభాషణములను బెట్టుచు వచ్చిన బాగుగనుండును. సంభాషణములనుచేయువారి యొక్క కులాదులనుబట్టి జాతీయముగా వారి సంభాషణములను గ్రామ్య పదములలో నుంచవచ్చును."

"సంభాషణములుగాక మిగిలిన కథాంశమునందు సహితము సాధ్యమయినంతవరకు కేవల గ్రాంధిక పదములను దీర్ఘ సమాస

ములను విడిచి మృదుమధుర పదములతో సులభ శైలినే ఉపయోగించ వలెను. చదువువారికి హృదయరంజకముగానుండుటకయి తగిన స్థలములయందర్థాలంకారములను శబ్దాలంకారములనుగూర్చుట యావశ్యకమే అయినను, అలంకారముల నిమిత్తమయి రసమునకుగాని పద లాలిత్యమునకుగాని భావగౌరవమునకుగాని యెంతమాత్రమును భంగము కలుగనీయకూడదు."

"ఇటువంటి వచనప్రబంధములను పశ్చిమ ఖండవాసులు విశేషముగా వృద్ధిచేసిరేకాని మనవారీ విషయమున నంతగా కృషిచేయలేదు. ఆదేశమునందు సహితము మొట్టమొదట నీపుస్తకములు కథల మూలముననే యారంభమయి యంతకంతకు స్వాభావికమయిన యిప్పటి ప్రబంధరూపమున వృద్ధిపొందినవి. మనదేశము నందలి పంచతంత్రము, హితోపదేశము, హంసవింశతి, శుకసప్తతి మొదలయిన కథలాదేశము నందు మొట్టమొదట పుట్టిన కథలవంటివే. కొంతకాలమయిన తరువాత మనదేశము నందాకథలు సంస్కృతమున దశకుమార చరిత్రము మొదలైనవిగాను తెనుగున షోడశకుమార చరిత్రము మొదలయినవిగాను గొంతవరకు వృద్ధినొందెను గాని యావృద్ధి క్రమక్రమముగా రాక యంతటితో నిలిచిపోయినది. ఇంగ్లీషువారు వ్రాసిన గ్రంథములను చూచి యిప్పటి మనవారు వచన ప్రబంధములను వ్రాయ నారంభించినారు గాని యింకను మనభాషలోనుండ వలసినన్ని పుస్తకములు పుట్టలేదు. రాజశేఖర చరిత్రము, సత్యరాజాపూర్వ దేశ యాత్రలు, సత్యవతీ చరిత్రము, సత్యసంజీవిని మొదలయిన పుస్తకములీతరగతిలో చేరినవి. ఇంగ్లీషు భాషాపరిశ్రమము లేక యిటువంటి వచన ప్రబంధములను రచింప దలచుకొన్నవారు కొంతవరకు పై పుస్తకములను తమకు మార్గ దర్శకములనుగా జేసికొనవచ్చును."

ఈ ప్రకటన వలన ఆనాటి నవలలు ఈ పత్రిక నిర్దేశించిన నిబంధనలను ఎంత జాగ్రత్తగా అనుసరించాయో తెలుస్తున్నది.

1894 లో నవలారచన ప్రారంభించిన శ్రీ చిలకమర్తి 1921 వరకు ఆ నవలారచనను కొనసాగిస్తూనే వచ్చారు. 1894 - 1900 మధ్యకాలంలో చిలకమర్తి వ్రాసిన నవలలు యివి: రామచంద్ర విజయము, హేమలత, అహల్యాబాయి, కర్పూరమంజరి. కర్పూర మంజరి 1898లో చింతామణి బహుమతి పొందినా, పుస్తకరూపంలో 1907 లో కాని రాలేదు. ఈ నవలల్లో రామచంద్రవిజయం ఒక్కటే సాంఘికం. మిగిలినవి చారిత్రకాలని చెప్పదగ్గవి.

"రామచంద్ర విజయం'' కథా నిర్మాణంలోను, కథనంలోను, సంఘటనలను నిర్మించుకోవడంలోను రాజశేఖరచరిత్రను ఒద్దికగా పెట్టుకొని వ్రాయబడ్డది. కాని ఆ నవలలోకన్న యదార్థంగా గోదావరిసీమ వర్ణన, అంతకన్న యథార్థమైన మనుష్యులు మనకు యిందులో గోచరిస్తారు. ఒక నీతిని చెప్పడానికి, ఒక మూఢవిశ్వాసం విమర్శించడానికి యింతవరకు వచ్చిన రచయితలు ఒకపాత్రనో, సంఘటననో చిత్రించి దానిని కథలో ఒకభాగంగా చేసేవారు. కాని చిలకమర్తితో ఆ విధానం మారి కథకు, యితివృత్తానికి ప్రాముఖ్యం వచ్చాయి. కథలో, సంఘటనలలో ఒదిగిపోయే సంఘవిమర్శ వస్తే చేయడం, అంతేకాని సంఘ విమర్శకోసమే సంఘటనలను చిత్రించడం ఆయన చేయలేదు. అందువల్లనే కథా నిర్మాణం దృష్ట్యా చిలకమర్తి నవలలు అంతకుపూర్వం వచ్చిన నవలలకన్న పటిష్ఠమైనవి. అంతేకాదు. వానికన్న శైలిలోను, భాషలోను సుగమమైనవికూడా.

"రామచంద్రవిజయము" రామచంద్రుడు అన్న అనాథుని కథ. విద్యాసముపార్జనకోసం, భృతికోసం అతను పడినపాట్లు, పొందిన అవమానాలు హృదయాన్ని కలచివేసే విధంగా వర్ణింపబడ్డాయి. తుదకు అతని మంచితనం వీనన్నింటిని జయించి అతనికి విజయాన్ని సాధించి పెడుతుంది. ఈ నవలలో కోనసీమ ప్రాంత వర్ణన, అమలాపురం మొదలైన పట్టణాలు, అక్కడి మనుష్యుల

వర్ణన, శరభరాజువంటి ధనికుల, ఉదారుల వర్ణన దీనిని మొట్టమొదటి యదార్థాత్మకమైన నవలనుగా చేశాయి.

ఈ కాలంలోవచ్చిన నవలలన్నింటిలో కులమత వర్గాలమీద విమర్శ, సంఘంలో పాతుకుపోయిన దురాచారాలను గురించిన తీవ్ర విమర్శలు కనిపిస్తాయి. ఆర్థిక, సాంఘిక రంగాల్లో వస్తున్న మార్పులను, భేదాన్ని యీ కాలంలో, మొదటి, చివరి నవలలు అత్యుత్తముగా చిత్రించాయి. కేవలం ధనికవర్గానికి చెందిన నాయకుడు బీదవాడు కావడం, తద్వారా అతడు పడిన కష్టాలు కందుకూరి వారు చిత్రించగా, బీదవాడు అడుగడుగునా సంఘంలో పడవలసిన కష్టాలను వర్ణించి తుదకు ఉదారులైన ధనవంతుని సహాయంవల్ల జీవితాన్ని ఆనందమార్గాన పయనింపచేయడానికి యియ్యకొన్న అనాధ బాలునికథ చిలకమర్తివారు వర్ణించారు.

ఈ భేదం రానురాను మరింత స్పష్టమై మధ్యతరగతి జీవితాల చరిత్రను, ఆయా కుటుంబాల బాధలను వర్ణించడం సాంఘికనవలలకు ధ్యేయం అయింది.

ఈ కాలంలో వచ్చిన చారిత్రక నవలలకు కూడా ఒక విధంగా "చింతామణి" పత్రికే ఒరవడిపెట్టిందని చెప్పవచ్చు. 1893, 94, 95 సంవత్సరాలలో సాంఘిక నవలలకు బహుమానాలనిచ్చిన యీ పత్రిక 1896 లో చారిత్రక నవలలకు బహుమానాలను యివ్వడానికి నిశ్చయించింది. 1896 లో బహుమాన ప్రకటనచేస్తూ యీ పత్రిక యీ విధంగా వ్రాసింది.

"పయి సంవత్సరము వచన ప్రబంధములను వ్రాయదలంపుగొన్నవారు భూగోళ, హిందూ చరిత్రాంశములతోడగూడి యుండునట్లుగా కథను హృద్యముగా కల్పనచేసి వ్రాయవలెను. ఈ యంశములులేని గ్రంథములకు బహుమానములీయబడవు."

ఈ సందర్భంలోనే చరిత్రాంశాలు ఎలా వుండాలోకూడా పత్రికాధిపతులే నిర్ణయించారు.

"కేవల చరిత్రము వ్రాయగూడదు. చరిత్రాంశములును, కాలములును, సరియైనవిగా నుండవలెను. చరిత్రలో వచ్చువారుకాక కల్పిత పురుషులును, స్త్రీలును ఉండవచ్చును. చరిత్రాంశములీయైదు కాలములలోను నొకదానితో సంబంధించినవిగా నుండవలెను: 1. కృష్ణదేవరాయల కాలము, 2. అక్బరు లోనుగాగల చక్రవర్తులలో నొకనికాలము, 3. శివాజీ మొదలగు మహారాష్ట్రప్రభువులలో నొకని కాలము, 4. ప్రతాపసింగు మొదలగు రాజపుత్ర సంస్థానప్రభువులలో నొకని కాలము, 5. హైదరాలీ టిప్పుసుల్తానుల కాలము."

ఈ ప్రకటనకు చివర "గ్రంథములను వ్రాయ బ్రయత్నించు వారు ముందుగా నింగ్లీషు భాషలోనున్న తార, సీత, అక్బర్, చాంద్‌బీబీ. టిప్పుసుల్తాన్ మొదలయిన హిందూదేశముతో సంబంధించిన ప్రబంధములను, స్కాట్, జూల్స్‌వరన్స్ మొదలయినవారు రచించిన ప్రబంధములను కొన్నిటిని జదువుట మంచిదని తలంచుచున్నాము."

ఈ వివరణనుబట్టి పరిశీలిస్తే చిలకమర్తి "హేమలత, అహల్యాబాయి" వంటి నవలలు, ఖండవిల్లి వారి "లక్ష్మీసుందరవిజయము" వంటి నవలలు ఎంతదగ్గరగా యీ సూచనలను అనుసరించినవో స్పష్టమవుతుంది.

వీరి చారిత్రక రచనల ఇతివృత్త నిర్మాణంలో చరిత్రకన్న కల్పనకు అధిక ప్రాధాన్యతఉంది. ముఖ్యమైన పాత్రలను ఒకదానినో రెంటినో చరిత్రనుంచి గ్రహించి, మిగిలినవానిని కల్పించడం; కథనంతనూ కల్పించి వ్రాయడం యీ నవలల ప్రత్యేకత.

ఈ పద్ధతికి చెందిన చారిత్రక నవలలకు భిన్నంగా వేంకట పార్వతీశ కవులు అటు వంగదేశంనుంచి చేసిన అనువాదాలు, ఆ వంగదేశ నవలల పద్ధతిలో వ్రాసిన చారిత్రక - కాల్పనిక నవలలు మరొక కోవకు చెందినవి.

## అనువాదయుగం : 1900–1920

ఈ రెండవ యుగాన్ని అనువాదయుగం అనికానీ, చారిత్రక నవలాయుగం అనికాని అనవచ్చు. కాని చారిత్రకాలలో కూడా చాలా భాగం అనువాదాలు కనుక దీనిని అనువాదయుగం అంటున్నాను.

ఇరవయ్యో శతాబ్ద ప్రారంభంలో భారతదేశంలో జాతీయోద్యమం ప్రారంభమైంది. ఒకవంక కాంగ్రెసు మెల్లగా దేశరాజకీయాలకు కేంద్రమై స్వాతంత్ర్య సముపార్జనకు సమరం ప్రారంభించింది. వేరొకవంక ఆంగ్ల విద్యాపారంగతులైనవారు ఆర్థిక, సాంఘిక రంగాల్లో మనం సాధించవలసిన పురోభివృద్ధిని గుర్తించి దానికోసం ప్రయత్నం చేయసాగారు. ఒకవంక బ్రిటిష్ వారు మనదేశం నుంచి పోవాలన్న ఆందోళన; వేరొకవంక వారిద్వారా నేర్చుకొన్న విజ్ఞానము, క్రొత్త విలువలు నిలచిపోయి సాంఘిక దురాచారాలు పోవాలన్న ఆందోళన. ఈ విధంగా ఆంగ్లదేశ సంపర్కం-వారే నేర్పిన విద్య ద్వారా-పరస్పర విరుద్ధములైన భావాలను ప్రజలలో ప్రజ్వలింపచేసి, అన్ని రంగాలలోను స్వాతంత్ర్యం, న్యాయం సాధించాలనే ఉద్యమాలు బయలుదేరడానికి కారణం అయింది.

1905 లో బెంగాల్ విభజనతో రాజకీయాలన్నీ ఉద్రిక్త పూరిత వాతావరణంలోకి దిగాయి. ఒకపక్క జాతీయ భావాలను వెలువరించే పాటలు, పద్యాలు వ్రాయబడ్డాయి. వేరొకవంక జాతీయాత్మకమైన నాటకాలు ప్రజలను ప్రభావితం చేయ సాగాయి.

ఈకాలం తెలుగు నాటక సాహిత్యాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే జాతీయ భావాలను నాటక కర్తలు తమ రచనల్లో ఎలా పొందుపరిచిందీ తెలుస్తుంది. ముందు పరోక్షంగా యీ భావాన్ని చూపడం, పౌరాణిక గాథల్ని స్వీకరించి; అందులో జాతీయ భావాలను, మాతృదాస్యవిమోచన భావాలను ప్రస్ఫుటంగా చెప్పడం మొదటిమెట్టు. రాజకీయ సాంఘిక ఆందోళనలను ప్రతిబింబింపచేస్తూ ప్రజలను ఉత్తేజపూరితులను చేయడానికి వ్రాయబడ్డ చారిత్రక నాటకాలు రెండవ మెట్టు. తరువాత ప్రత్యక్షంగా గాంధీ, తిలక్ మొదలైన వారిని గురించిన నాటకాలు.

నవలల్లో మాత్రం యీ జాతీయ భావాల వ్యక్తీకరణ ఎక్కువగా చారిత్రక నవలల ద్వారానే జరిగింది. "లక్షణములను బరీక్షింపనాఖ్యాయిక ప్రబంధ, నాటకములకంటె విజ్ఞాన వర్ధనముగ దోచుచున్నది. శక్తి యున్నచో గ్రంథకర్త కిందు ప్రబంధ నాటక లక్షణములను రెండింటిని గూడ నిర్వహించుట కవకాశమున్నది. మసిపాత గట్టిన మణులవలె నణగియున్న మన తొల్లింటి వారి పావన చరిత్రములను, వారి బుద్ధి బాహుబలములను బ్రకాశనముగావించి జాతీయ గౌరవమును దెలిపి తన్మూలమున నాధునికులకాత్మ గౌరవమును గలిగించుట కాఖ్యాయిక మిగుల సహకారిగ గాన్పించుచున్నది." అని శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు తమ "మిథునానురాగము" అన్న నవలకు వ్రాసిన పీఠికలో పేర్కొన్న మాటలు ఎంతైనా సమంజసాలు.

ఈ యుగంలో తెలుగు నవల మీద కేవలం జాతీయోద్యమ ప్రభావమేకాక అనాటి సాంఘిక, ఆర్థిక స్థితిగతుల ప్రభావం కూడా పడ్డదని చెప్పాను. ఈ జాతీయోద్యమం బెంగాలులో తీవ్రతరం దాల్చింది. పాల్ బిపిన్ చంద్రపాల్ వంటి మహోదయులు రాజకీయ రంగంలో ఎంతటి నూత్న చైతన్యాన్ని కలిగించారో, సాహిత్య

రంగంలో బంకించంద్ర వంటి మహనీయులు అంతటి చైతన్యాన్ని కలిగించారు. ఒకవంక బంకింబాబు తన చారిత్రక నవలలతో ప్రజలను దేశభక్తి వైపుకు ఉద్బోధిస్తూ వుండగా, వేరొకవంక రవీంద్రనాథ్ ఠాకూర్ సాంఘిక దురాచారాలమీద కత్తిగట్టాడు. వర్ణ వ్యవస్థమీద ఆయన వ్రాసిన నవల లన్నింటిలోనూ ఆయన తీవ్రమైన విమర్శలు చేశాడు.

తెలుగు రచయితల్లో చాలమందిపై యీ జాతీయోద్యమ ప్రభావం ఎక్కువగా పడ్డది. దానికి తోడుగా బెంగాల్ సాహిత్యం - ఆంగ్ల సాహిత్యం తరువాత - అంతటి ప్రగతిని సాధించిందని గ్రహించిన విద్యావేత్తలు ఆ దేశంలోని ప్రజలను కదిలించిన నవలలను తెలుగు వారికి అనువాద రూపంలోను, అనుకరణల రూపంలోను అందించారు. 1900 ముందుగానే ఇట్టివి కొన్ని వ్రాయబడినా యీ 20 ఏళ్ళలోను అట్టి నవలలు అసంఖ్యాలుగా వెలువడ్డాయి.

వంగదేశం నుంచే గైకొనబడ్డ మరో రకం నవల అపరాధపరిశోధక నవల. ఈ కాలంలో వచ్చినన్ని అపరాధ పరిశోధక నవలలు 1960 ప్రాంతాల్లోకూడా రాలేదంటే అతిశయోక్తికాదు. దీనికి కారణం వుంది. నవల సర్వపాఠకులకు తేలికగాచదివే ప్రక్రియ అని గమనించిన తరువాత దానికి పాఠకులు విపరీతంగా బయలుదేరారు. అంతమంది పాఠకులకు అందించడానికి వీలైనన్ని నవలలు మౌలికంగా వెలువడలేదు. ఆ లోపాన్ని పూరించడానికి ఒకటే మార్గం కనిపించింది. అది అపరాధ పరిశోధక నవలల అనువాదం.

దానికితోడు చౌకధరలో పుస్తకాలు అచ్చువేసి పాఠకులలో పఠనాసక్తిని పెంపొందించే ధ్యేయంతో ఎన్నో పుస్తక సంస్థలు వెలిశాయి. ఇందులో ప్రథమంగా చెప్పుకోతగ్గది విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి. తరువాత ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల. ఆ తరువాత

వచ్చినది వేగుచుక్క గ్రంథమాల. ఇందులో మొదటి గ్రంథమండలి ఆదర్శవంతంగావుండి చదువరులకు నీతిదాయకమైన, దేశభక్తి ప్రపూరితములైన గ్రంథాలను అందించడానికి నిర్ణయించుకొన్నది. ఇక రెండవది కొన్ని ఉత్తమ ఆదర్శాలుగల గ్రంథాలను, పాఠకుల ఆసక్తిని పెంచే అపరాధక నవలలను మరికొన్నింటిని ప్రచురించింది. ఇక మూడవ గ్రంథమాల కేవలం పాఠకుల ఆసక్తిని ఆలంబనంగా గ్రహించి అపరాధ పరిశోధకాలనే ఎక్కువ భాగం ప్రచురించింది.

ఈ అపరాధ పరిశోధకాలలో ముప్పాతిక నవలలు వంగ భాష నుంచి అనువదింప బడ్డవి. మిగిలినవి మౌలిక రచనలు. కాని యివి కూడా అనుకరణలకువలెనే ఏ మారుమూల ప్రాంతాన్నో, దేశాన్నో కథాస్థానంగా చేసుకొని వ్రాయబడ్డవే.

ఇక చారిత్రకాలలో వంగానువాదాలను గురించి పేర్కొన్నాను. మరికొన్ని మౌలికాలు. అనువాదాలలో చాలభాగం భారత దేశ చరిత్ర నుండి గైకొనబడిన కథలు గలవి. మౌలికాలలో చాలా భాగం ఆంధ్రదేశ చరిత్రకు సంబంధించినవి.

ఆంగ్లం నుంచి మరికొన్ని అనుకరణలు, అనువాదాలు వెలువడినవి. అవి చాలా తక్కువ సంఖ్యలో వచ్చినవే!

ఇక మౌలికమైన సాంఘిక రచనల్లో ఎక్కువ భాగం వ్యక్తికీ సంఘానికీగల పరస్పర సంబంధాన్ని, వ్యక్తి ఎలా సంఘ విధేయుడై వుండాలో, అందువల్ల వచ్చే లాభాలేమిటో - యీ విషయాలను గురించిన ప్రసక్తి వుంది.

మొత్తంమీద యీ కాలంలోనే నవలలకు చదువరులు పెరిగి, రానురాను నవలా రచయితలే ఎక్కువ మంది అయి, నాటక, కావ్య రచయితలు తగ్గిపోతూ వచ్చారు. ఈ నవలల్లో చాలాభాగం అనువాదాలే అయినా, మౌలికాలు కూడా కొన్ని లేకపోలేదు. ఈ అను

వాదాలు పాఠకుల అభిరుచినిబట్టి వచ్చినవే! ప్రజలేవిధమైన కథలను కోరారో, అట్టి వాటినే రచయితలు యిచ్చారని చెప్పుకోవాలి. పాఠకులకు ఎట్టి రచనలు అవసరమని నవలాకారులనుకొన్నారో అట్టి రచనలను తరువాతి తరం నవలా రచయితలు వ్రాశారు.

ఈ యుగంలో వచ్చిన నవలలలో ముఖ్యమైనవి చారిత్రకాలు అనీ, అందునా భారతదేశీయమైన చారిత్రకాలనీ, అందులో చాలా భాగం వంగభాషనుంచి అనువదింపబడ్డవనీ, మరికొన్ని ఆంగ్ల రచయితలైన మెడోస్ టేలర్, వంగరచయితలై ఆంగ్లంలోకూడా వ్రాసిన రమేశ చంద్రదత్ వంటివారి నవలలకు అనువాదాలనీ ముందే చెప్పబడ్డది.

బంకించంద్ర నవలలను తెలుగులోనికి తెచ్చిన ప్రథముడు శ్రీ ఒ. వై. దొరస్వామయ్య. ఈయన "కపాలకుండల" 1899 లోనే అనువదింపబడి ప్రకటింపబడ్డది. ఈయనే 1907 లో ప్రఖ్యాత బంకిం రచన 'ఆనందమఠం' తెలుగులోనికి మొదటిసారి తర్జుమా చేశారు. పాఠకుల మనస్సులను యీ నవల ఎంతగా ఆకట్టుకొన్నదంటే 1920 లోగా ముగ్గురు యీ నవలను అనువదించారు. ఈ మూడూ కలిపి యీ యిరవై యేళ్ళలోను ఎనిమిది ముద్రణలను పొందాయి.

దొరస్వామయ్యగారి 'కమలాకోమల' (1908) కనకవల్లి భాస్కరరావు వ్రాసిన "ప్రఫుల్లముఖి" (1909) చిల్లరిగె శ్రీనివాస రావుగారి "కృష్ణకాంతుని మరణశాసనం" (1910), ఇదే నవలకు వేంకట పార్వతీశ కవుల అనువాదం (1914), తల్లాప్రగడ సూర్య నారాయణగారి "శైవాలినీ చంద్రశేఖరము" (1910), చాగంటి శేషయ్యగారి "రాధారాణి" (1910), దుర్గేశనందిని (1911), నవాబునందిని (1915), వేంకట పార్వతీశ కవుల "రాజసింహం" (1912) వంటి బంకిం నవలలు అనువాదం చేయబడి పాఠకుల ఆదరాభి

మానాలలో తిరిగి తిరిగి ముద్రణలు పొందాయి. దుర్గేశనందినికి యీ కాలంలో మూడు నాలుగు అనువాదాలు వచ్చాయి. అందులో వంగూరి సుబ్బారావు, ఉల్లిగుండము రంగారావుగార్ల అనువాదాలు పేర్కొనదగినవి.

రమేశ చంద్రదత్తు ఆంగ్లంలో వ్రాసిన "ది స్లేవ్ గర్ల్ ఆఫ్ అగ్రా" అన్న నవలకు తల్లాప్రగడ సూర్యనారాయణగారి 'మాధవీ కంకణము' (1910), రమేశ్ చంద్రదత్తు వ్రాసిన "లేక్ ఆఫ్ పామ్స్" అన్న నవలకు చిలకమర్తివారి సుధాశరశ్చంద్రము (1915) అనువాదాలు. మొదటి నవలకు చిలకమర్తి అనువాదం "దాసీకన్య" అన్న పేరుతో (1915) వెలువడింది.

ఇతర అనువాదాలలో ఆంగ్లంనుంచి వచ్చిన అనువాదాలు కూడా ముఖ్యమైనవే! కొండిపర్తి వీరభద్రాచార్యులు "జయసేన విజయము" (1910) అన్న నవల "ఒథెల్లో"కు అనుకరణ. 'కమల' అన్న ఆంగ్ల నవలకు కృపాబాయి సత్యనాథమ్మ 'కమలాంబ' అన్న పేరున తెలుగు చేశారు (1919). ఇది క్రైస్తవ మతప్రచారానికి ఉద్దేశింపబడ్డది.

సర్ వాల్టర్ స్కాట్ వ్రాసిన 'ఐవాన్‌హో'కు కేతవరపు వేంకట శాస్త్రిగారి అనువాదం (1910) యీ కాలంలో వచ్చిన అనువాద నవలలలో ముఖ్యమైనది. మెడోస్ టేలర్ రచన ఆధారంగా అక్కిరాజు ఉమాకాన్తంగారి "టిప్పుసుల్తాన్" పేర్కొనదగిన నవల.

ఇవికాక మలయాళంనుంచి చందమీనన్ వ్రాసిన 'కళావతి'కి దొడ్ల వెంకటరామరెడ్డి అనువాదం (1909) ఒక ప్రత్యేకమైన రచన. అప్పటినుంచి యిప్పటిదాకా మలయాళంనుంచి వచ్చిన అనువాదాలు చాలా తక్కువ.

ఈ కాలంలోనే చిలకమర్తివారు కల్నల్ టాడ్ కు అనువాదంగా ''రాజస్థాన్ కథావళి''ని ప్రచురించడంతో దాని ప్రభావం కూడా రచయితలపై పడ్డది. అవి ఆధారంగా కొన్ని నవలలుకూడా వెలువడ్డాయి. అట్టివానిలో అట్లూరి వేంకట సీతమ్మ వ్రాసిన "రూపవతి" (1918) రాజస్థాన కథావళిలోని 'మోకలరాణి' అన్న కథ ఆధారంగా వెలువడ్డ నవల.

ఈ అనువాదాలు అలా వుండగా యీ కాలంలోనే యిదే ఒరవడిలో స్వతంత్రమైన నవలలుకూడా కోకొల్లలుగా వెలువడ్డాయి. స్వతంత్రమైన చారిత్రక నవలలు వ్రాసినవారిలో చిలకమర్తి, వేంకట పార్వతీశ కవులు, కేతవరపు వేంకట శాస్త్రిగార్లు ముఖ్యులు. వీరందరిదీ ఒకటేపద్ధతి. కథకు భూమికగా (back ground) చారిత్రకకాలాన్ని స్వీకరించి ఒకటిరెండు చారిత్రక పాత్రలను సృష్టించి, వానిపై కథను అల్లుకొనిపోవడం. అంటే ఎక్కువభాగం కాల్పనికమన్నమాట. చిలకమర్తి వ్రాసిన 'హేమలత', 'అహల్యాబాయి' లను గురించి పూర్వమే చెప్పబడ్డది. ఇట్టి నవలలలో పేర్కొనదగినవి : శివాజీ కథ ఆధారంగా ధరణిప్రగడ వెంకట శివరావు వ్రాసిన ''కాంచనమాల'', భోగరాజువారి ''విమలాదేవి'' (ఔరంగజేబు కాలానికిచెందిన రాజపుత్రులగాథ.), మౌర్య చంద్రగుప్తుల కాలానికి చెందిన వేంకట పార్వతీశ కవుల "వసుమతీ వసంతము", రాజపుత్రులకథ ఆధారంగా రత్నాకరము వేంకటప్పయ్య,తుమ్మగుండి కేశవరావులు కలిసి వ్రాసిన "సత్యాబాయి", వేంకట పార్వతీశ కవుల "ప్రమదావనము" ముఖ్యమైనవి. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి "ఆంగ్ల రాజ్యస్థాపన" (1917) కూడా యీనవలలలో ఎన్నదగినదే!

ఈ తరం రచయితలు తాము ఎక్కడో గ్రహించిన కథను ఏ విధంగా తమ స్వంతం చేసుకున్నారో, దానిని ఎలా మార్చి ఆంధ్రదేశ స్థితిగతులకు అనువైనదిగా చేసుకున్నారో చూపడానికి

వేంకట పార్వతీశ కవులు వ్రాసిన "శ్యామల" అన్న నవలను చూప వచ్చు. వారు యీ నవలకు ''విజ్ఞప్తి'' వ్రాస్తూ "సర్వమయియగు శ్యామల పౌరాణిక కళలను, నైతిహాసిక సాంప్రదాయములను, జారిత్రక స్వభావములను గలిగియుండుననుటలో వింతలేదు...అంధ్రారణ్యంబులంబుట్టి పెరిగి యాంధ్రదేశ మధ్యమున బ్రదర్శింపబడిన యీ శ్యామల గుణగౌరవములను బరిశీలించు బాధ్యత ... ఆంధ్రసోదరులకే చెందియున్నది."

నిజానికి యీ నవల చాలవరకు షేక్స్పియర్ వ్రాసిన ''మేక్ బెత్'' కు అనుసరణ. వేంకట పార్వతీశ కవులు తెలుగు వాతావరణాన్ని కల్పించి, పాత్రలను తెలుగువారిని చేశారు. విజయరాయడన్న ఒక సేనాని ఒక సన్యాసి చెప్పిన జోస్యాన్ని నమ్మి తనరాజును సంహరిస్తాడు. ఆ రాజు నిడుబ్రోలు సింహాసనాధిపతి. ఈ హత్యలో 'మురళ' అన్న అతనిభార్య ప్రోద్బలంకూడా వున్నది. రాజుగారి కుమారుడు దేశంనుంచి పారిపోతాడు. ఒక వనరాజు సహాయంతో విజయరాయుణ్ణి సంహరించడానికి ప్రయత్నిస్తాడు. యుద్ధంలో మహారాజు పుత్రుడు రామరాయడు చనిపోగా అతని పుత్రుడైన 'ఆనంద రాయడు' రాజ్యాభిషిక్తుడౌతాడు.

ఇది అంతా మేక్ బెత్ కు అనుసరణ. అయినా ఎక్కడా ఆ అనుసరణ ఛాయలే కనుపించవు. ఈ కాలంలో వచ్చిన చాలా నవలలు ఇటువంటి ఛాయానువాదాలే!

భారతీయ చరిత్రను గురించి వ్రాయబడిన చాలా నవలలు రాజపుత్రులను గురించి వ్రాయబడ్డవే! ఆ తరువాత వంగదేశీయుల చరిత్రను గురించి వచ్చినవి.

ఈ కాలంలోనే 1910 ప్రాంతాల ఆంధ్ర మహాసభ ప్రారంభమై ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంకోసం కూడా నాయకులు పాటుపడడంతో

భారతీయ చరిత్రను గై కొన్న రచయితలుకూడా ఆంధ్రదేశ చరిత్ర వైపుకు మొగ్గు చూపారు.

"నవ్యులకు జారిత్రక విజ్ఞానమును, సున్నతాశయములను గలిగించి యాంధ్ర జాతీయ ఘనతను లోకమున బ్రకాశము సేయనెంచు నాంధ్ర గ్రంథకర్తల కాఖ్యాయికా రచనా మవశ్య కర్తవ్యము... ఆంధ్రమున నింతవరకు ననేకాఖ్యాయికలు వెలసినవిగాని యిందొక్కటియు నాంధ్రుల వైభవమును బ్రకటించునది లేదు. ఇది యెంతయు విచారకరము" అని శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు 1914 లో వెలిబుచ్చిన అభిప్రాయం ఎంతో కాలానుగుణ్యమైన హెచ్చరిక. ఈ అభిప్రాయమే కలిగిన అనేక రచయితలు ఆంధ్రుల కథలను స్వీకరించి నవలలు వ్రాయడం ప్రారంభించారు. అటు విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి, యిటు ఆంధ్రప్రచారిణీ గ్రంథమాల యీ నవలను స్వీకరించి ప్రకటించడానికి పూనుకొన్నాయి. మొదట భారతదేశ చరిత్రకు సంబంధించిన ఏ కథనైనా స్వీకరించగలమని ప్రకటించిన కొమఱ్ఱాజు లక్ష్మణరావు పంతులుగారి వంటి చారిత్రక పరిశోధకులు ముఖ్యంగా ఆంధ్రదేశానికి సంబంధించిన కథలను కూడా తమ విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి ద్వారా ప్రకటించారు.

చిలకమర్తి వారి 'శాపము' అన్న చిన్న నవల ఆంధ్రదేశాన్ని గురించిన కథే! అది రాజాకళింగగంగు కవి సత్తముడైన వేములవాడ భీమకవిని అవమాన పరచడం ద్వారా శాపాన్ని పొందడం కథగా కలది. ఇదే తెలుగు దేశానికి సంబంధించిన మొదటి తెలుగు నవలగా చెప్పుకోవచ్చు.

ఈరకం రచనల్లో ప్రముఖమైనవి శ్రీ కేతవరపు వేంకటశాస్త్రి, భోగరాజు నారాయణమూర్తిగారి నవలలు. కేతవరపువారి "రాయచూరు యుద్ధము" సరస్వతీ గ్రంథమండలి ప్రచురణ (1913). ఇది

తరువాతి తెలుగు నవలకు మార్గదర్శక మని చెప్పవచ్చు. భోగరాజు వారి "ఆంధ్ర రాష్ట్రము (1915), విమలాదేవి (1910), అస్త మయము (1916), ధరణికోట (1917)" వంటి నవలలు ఆంధ్ర దేశానికి సంబంధించిన వివిధ కాలాలలోని చరిత్రను స్వీకరించి, ఎక్కువ కల్పన లను జోడించి ఈ రచనలు చేశారు. ఇవి కాక, శ్రీ దుగ్గిరాల రాఘవ చంద్రయ్య సచ్ఛాస్త్రిగారు వ్రాసిన "విజయనగర సామ్రాజ్యము" (1913), చిలుకూరి వీరభద్రరావుగారి "కర్ణసామ్రాజ్యము (1916)" కూడ ముఖ్యమైన నవలలే! శ్రీ చిలుకూరివారి నవల రెండవ శతా బ్దంలోని ఆంధ్ర చరిత్రకు చెందిన కథ. ధాన్యకటక నగరంలో జరిగి నట్లు వ్రాయబడ్డది.

ఈ కాలంలో వచ్చిన అనువాదాల్లో అపరాధ పరిశోధక నవ లలు కూడా ముఖ్యంగా పేర్కొన దగినవే! పాఠకులలో ఉత్సుక తను పెంచి ఆసాంతమూ చదివించే గుణం వీటికి ఉంది. సంభ్రమా శ్చర్యాలతో ముంచే కథా కల్పనలు వీటికి ప్రాణం. పాఠకులు పెరగ డంతో వారికి కావలసిన నవలలు కూడా గ్రంథప్రచురణ కర్తలు అందిం చవలసి వచ్చింది. ఈ కాలంలో యిట్టి నవలలు కోకొల్లలు.

దీనికి ప్రోత్సాహం యిచ్చింది వేగుచుక్క గ్రంథమాల. బరం పురం దీని కార్యస్థానం. తాపీ ధర్మారావుగారు దీని సంపాదకులు. ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల, సరస్వతీ గ్రంథమాలలు 1935, 40 వరకు కూడా యిట్టి నవలలను ప్రచురిస్తూనే వచ్చాయి.

ఈ నవలల్లో వంగభాష నుంచి అనువాదాలు ఎక్కువ. వీరికి మూల రచయిత పాంచకడీదేవ్. ఆయన బెంగాలీలో దాదాపు 106 గ్రంథాలు ప్రచురించాడు. అవి అన్నీ కాకపోయినా, చాలా భాగం తెలుగులోకి వచ్చాయి. కొన్ని వానికి నకళ్లుగా కూడా బయలు దేరాయి.

ఈ అనువాద కర్తల్లో ముఖ్యులు వేంకట పార్వతీశ కవులు; దేవరాజు వేంకట కృష్ణారావు ప్రభృతులు. దేవరాజువారి వాడే వీడు, నేనే, కాలూరాయి వంటి నవలలు ఎన్నో ముద్రణలు పొందాయి.

వేగుచుక్క గ్రంథమాలలోని ఈ గ్రంథాలు ప్రచారం పొందడంతో ఆంధ్రదేశం నలుమూలలా యిట్టి గ్రంథమాలలు స్థాపింపబడడం, ఇట్టి అపరాధ పరిశోధక నవలలు ప్రకటించబడడం జరిగింది.

ఈ కాలంలో వచ్చిన మౌలిక రచనల్ని గురించి యిక్కడ ముచ్చటించాలి. దీనిని అనువాద యుగం అన్నంత మాత్రాన అసలు మౌలికమైన రచనలు లేవని కాదు. ఈ కాలంలో మౌలికములైన చారిత్రక నవలలను గురించి ఇంతకు పూర్వమే పేర్కొనడం జరిగింది.

మౌలికములైన సాంఘిక నవలల్లో పేర్కొనదగినవి చిలకమర్తి వారి రాజారత్నము (1919), గణపతి (1920), వేంకట పార్వతీశ కవుల "మాతృమందిరము" (1919), శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి "శ్మశాన వాటిక" లేదా "విషభుజంగము" (1917).

"రాజారత్నము" తెలుగు వారి వైవాహిక జీవితమును గురించిన మొట్టమొదటి నవల అనవచ్చు. ఇదివరకు తల్లాప్రగడ వారిది ఒకటి వచ్చినా అది గృహస్థ జీవితానికి, అత్తాకోడళ్ళ పోట్లాటలకు సంబంధించినది. కాని ఈ నవలలో కట్నాలవల్ల బాధలు, చేసుకొన్న భార్యను కాపురమునకు తీసుకొని రాక మారుమనువులు చేయడానికి తండ్రుల ప్రయత్నం, వంటివి యదార్థంగా చిత్రించబడ్డవి.

తల్లాప్రగడ వారి హేలావతి (1913), వేంకట పార్వతీశ కవుల "మాతృమందిరము"(1919) సాంఘిక వ్యవస్థ, వర్ణ వ్యవస్థలను

గురించి నిశిత విమర్శలు చేసిన నవలలు. ఈ రెంటిలోను హరిజనుల సమస్య, హరిజనోద్ధరణకు చేయవలసిన కార్యక్రమాలు ఎంతో వివరంగా పేర్కొనబడ్డాయి. గాంధీజీ ఇంకా హరిజనోద్ధరణకు పిలుపు నివ్వకముందే వీరు ఈ సమస్యలను స్వీకరించి, ఈ సంఘ దురన్యాయములను పోగొట్టుటకు మార్గములను అన్వేషిస్తూ నవలలు వ్రాయడం ఎంతైనా ప్రశంసనీయం.

చిలకమర్తి వ్రాసిన నవలలు దాదాపు 14. ఇందులో నాలుగు సాంఘికాలు, ఐదు చారిత్రకాలు, రెండు కాల్పనికాలు, రెండు అనువాదాలు. వీనిలో ''దుందుభి'' అని మరో చిన్న నవల ఉంది. దుందుభి ఆడరూపంలోవున్న గణపతి. ''రాజారత్నము'' ఒక అమాయకురాలి కథ. ఆమెను ఆధారంగా చేసుకొని వియ్యంకుల మధ్య కలిగిన కయ్యం ఈ నవలకు ఆధారం.

ఈ కాలానికి చెందినదే ''గణపతి''. తెలుగు హాస్యనవలలలో దీనికి గొప్ప పేరున్నది. ఇందులో గణపతి పాత్ర చిత్రణం కొంత మోతాదుకు మించి చేయబడ్డట్లు తోస్తుంది. ఆ కాలంలో దీనికి ఉన్న ప్రచారాన్నిబట్టి పాఠకులు దీనిలోని హాస్యాన్ని గ్రహించి ఆనందించినట్లు తేటతెల్లమవుతున్నది. కాని ఈనాటి వారికి _ ఆనాటి ఆచార వ్యవహారాలతో సంబంధం లేకపోవడంవల్ల కాబోలు - అది హాస్యాన్ని యివ్వదు సరికదా ఒక్కొక్క చోట చాలా విచారాన్ని కలగ చేస్తుంది.

మనస్తత్వ పరిశీలన, మనుష్యుల్ని అర్థం చేసుకొనే శక్తి ఎక్కువ అయిన ఈనాడు పొట్ట కూటికోసం శవాలుమోసి, మంచి నీళ్ళ కావిళ్లుమోసి, అడ్డమయిన పనులు చేసిన గణపతి హాస్యపాత్ర కాడు. మన దీనమైన చరిత్రకు అతడు ప్రతినిధి అనే అనిపిస్తాడు.

వేషాన్ని చూచి వెక్కిరించడం, భుక్తికోసం ఒకరు చేసే పనిని అవహేళన చేయడం ఈనాడు మనకు నాగరికతా చిహ్నాలు కావు. ఏదిఏమైనా అక్కడక్కడి సంఘటనలు, గణపతి వెర్రిచేష్టలు, తిండి మీద అతనికున్న ఆసక్తి కొందరికి ఈనాటికి కూడా నవ్వు తెప్పిస్తూనే వున్నది.

ఈ యుగంలో ముఖ్యమైన రచయితలు చిలకమర్తి, వేంకట పార్వతీశ కవులు, కేతవరపు వేంకటశాస్త్రి; భోగరాజు నారాయణ మూర్తి, చాగంటి శేషయ్య, తల్లాప్రగడ సూర్యనారాయణగార్లు. వీరిలో చిలకమర్తి, వేంకట పార్వతీశ కవులు అనువాదాలు చేశారు. చారిత్రక సాంఘిక నవలలను వ్రాశారు. కవులుగా ప్రసిద్ధికెెంచారు. వేంకట పార్వతీశ కవులు తమ నవలా సాహిత్య సృష్టితో తెలుగు భాషను సుసంపన్నం చేశారు. వారు చక్కని పండితులు; చిక్కని భాష వారి సొమ్ము. కమ్మని వర్ణనలు చేయగలరు. వారి చేతిలో భాష, కథ రెండూ కూడా నవనవోన్మేషంగాసాగి ఇరవై యేళ్ళ పాటు తెలుగు పాఠక లోకాన్ని ఉర్రూతలూగించిందంటే అతిశ యోక్తికాదు.

అలాగే కేతవరపు వారుకూడా. అటు స్కాట్‌ను అనువ దించడంనుంచి, యిటు మదాలసవంటి పౌరాణికనవల వ్రాయడం, లక్ష్మీప్రసాదమువంటి సాంఘిక నవల వ్రాయడందాకా అన్ని రకాల నవలలను వ్రాసి నవలా సాహిత్యానికి సేవచేశారు.

భోగరాజు నారాయణమూర్తిగారికి ఆంధ్రదేశమన్నా, ఆంధ్రుల చరిత్ర అన్నా ఎంతో ఆదరం. వారి తెలుగు చరిత్రమీది నవలలు చిరకాలం మనగలుగుతాయి.

## వికాసయుగం : 1920–1942

తెలుగు నవలా సాహిత్య పరిణామంలో యీ వికాస యుగానికి ఉన్నంత విశిష్టత మరోయుగానికి లేదనవచ్చు. ఒకవంక రాజకీయాలలో అంతకంతకు జాతీయోద్యమం తీవ్రతరం తాల్చడం, మరొకవంక జాతిజీవన విధానంలో విప్లవాత్మకమైనమార్పులు రావాలనడం, సంఘంలో యింతవరకు పీడితులైన దరిద్రులు, స్త్రీలు — పునరుద్ధరించ బడాలనడం — యీ కాలంలో తీవ్రరూపం దాల్చిన భావాలు.

తెలుగు నాటక సాహిత్యంలోవలెనే నవలా సాహిత్యంలోనూ ఎన్నో రాజకీయాలను ప్రత్యక్షంగా వర్ణించే నవలలు వచ్చివుండవలసింది. రాజకీయాలను స్థాలీ పులాకంగా నవలాకారులు చర్చించారే గాని, పూర్తిగా రాజకీయ నవలలు మనకు బహుకొద్ది. ఆనాటి సాంఘిక జీవనాన్ని వర్ణించేటప్పుడు రాజకీయ చైతన్యాన్ని, జీవితాన్ని పేర్కొనకుండా వుండడం అసంభవం కనుక అట్టివానిని యీ యుగం రచయితలు చిత్రించారు.

ఈ యుగంలోని నవలారచయితలు స్వీకరించిన ఇతివృత్తాలను మూడు భాగాలుగా విశ్లేషించవచ్చు. జాతీయోద్యమ ప్రభావాన్ని సూచించే నవలలు మొదటి తరగతికి చెందినవి. గాంధీజీ పూరించిన శంఖారావం దేశం నలుమూలలా మారుమ్రోగింది. ఉత్సాహవంతులైన రచయితలు "మాకొద్దీ తెల్లదొరతనము" అంటూ పాటలు పాడారు. నాటకకర్తలు ''గాంధీవిజయము'' వంటి నాటకాలు వ్రాశారు. తెలుగు నవలలలో గాంధీజీ చేసిన కార్యక్రమాలకు ఎక్కువ విలువనిచ్చి వానినే — అందునా ముఖ్యంగా హరిజనోద్ధరణను—యితివృత్తంగా తీసుకొని వ్రాసిన మహత్తరమైన నవల ''మాలపల్లి''.

ఒకపక్క రాజకీయ, ఆర్థిక, సాంఘిక విషయాలను గురించి రచయితలు యథార్థ దృష్టితో నవలలువ్రాస్తూ వుండగా, వేరొక

పక్క తెలుగు చరిత్రను నూతన దృక్పథాలనుంచి చూచి, విజయ నగర, కాకతీయ, కొండవీడు, మధురనాయకుల రాజ్యములలోని స్థితిగతులను, వారివారి మహత్తర కార్యదీక్షను వెలువరిస్తూ ప్రశంస నీయమైన నవలలు ఈ కాలంలో వెలువడ్డాయి. ఇవి రెండవ తరగతికి చెందిన నవలలు.

అటు సాంఘికములు, యిటు చారిత్రకములు అన్నీకూడా ఎక్కువభాగం మౌలిక రచనలుకావడం యీ యుగంలోని నవలల ప్రత్యేకత. క్రిందటి యుగంవారు అనువాదాలమీద మోజు చూపడం వల్ల దానికి ప్రతీకారంలా భావించినట్లు తోస్తుంది యీ కాలంలోని నవలా రచయితల మౌలికత. ఈ నవలలకుకూడా ఎక్కడో మాతృక లున్నాయని విమర్శకులు చెప్పినా, అవి ఆ మాతృకలను మించిన మౌలికతతో తెలుగువారి స్వంతజీవిత కథలయ్యాయి.

ఈ మౌలిక రచనల్లో చారిత్రకాలు, సాంఘికాలు కూడా ఉన్నాయి. చారిత్రకాల్లో చాలాభాగం ఆంధ్రదేశ చరిత్రకు సంబంధిం చినవే! ఇక మూడవ తరగతికిచెందిన సాంఘికేతి వృత్తాలుగల నవల లను మూడు విధాలుగా వేర్పాటు చేసుకోవచ్చు. కుటుంబ జీవిత గాథలు, సంఘసంస్కరణాత్మకాలు; సంస్కృతీ భావ స్ఫోరకాలు - అని.

ఈ యుగం తెలుగు సాహిత్య చరిత్రలో-ముఖ్యంగా తెలుగు కవిత్వ చరిత్రలో - కాల్పనిక యుగం అనీ, భావ కవిత్వ యుగమనీ పేరుకాంచింది. కాల్పనిక యుగానికి ముఖ్య లక్షణాలు : భావనా శబలత ; కొత్తకొత్త మార్గాల అన్వేషణ (ఈ అన్వేషణ యిటు కథ ల్లోను అటు శైలి, కథనంలోనుకూడా) ; మానవతావాదం — ఈ లక్షణాలన్నీ యీ యుగంలోని నవలా సాహిత్యానికికూడా ఉన్నా యని చెప్పక తప్పదు.

ఈ కాల్పనికోద్యమానికి నవలా సాహిత్యంలో ప్రతినిధులు: విశ్వనాథ, చలం, అడివి బాపిరాజు. వీరినిగురించి వేరుగా చర్చిద్దాం. ప్రస్తుతం యీ యుగంయొక్క ప్రత్యేక లక్షణాలను చెప్పుకో దలచినప్పుడు రచయితల వైయక్తికత (individualism) కూడా ముఖ్యలక్షణంగా చెప్పుకోవలసివుంటుంది.

ఈ కాలంలో ప్రారంభమైనదే 'సాహితీ సమితి'. దీనికి సభాపతి స్వామి శివశంకరులు. ఆయన బహుప్రజ్ఞాశాలి. అనేక భాషలు వచ్చినవాడు. విశాలహృదయం వున్నవాడు. ఆయన సభాపతిత్వాన తెలుగు కవిత్వం, గేయకవిత్వం కొత్తపుంతలు తొక్కింది. కాల్పనికోద్యమ కాలం నిజంగా గేయ కవితా కాలమని చెప్పవచ్చు. కాని ఈ కాలంలో నవల, నాటకంకూడా ఉదాత్తమైన పద్ధతిలో వ్రాయబడ్డాయి. ఈ కాలంలో వారికి శిల్పమూ, తమకు నచ్చిన అభిప్రాయాలు చెప్పాలన్న దృఢమైన ఆకాంక్ష హెచ్చు. ఈ విషయంలో యీ కాలంలో రచయితలందరూ సాక్షాత్తు కాల్పనికోద్యమ రచయితలే అయినారు. వీరిలోని భావ గరిమ, భావనాతీవ్రత అత్యధికమైనవి. అందువల్లనే యీ రచయితలు ఆత్మాశ్రయ రచయితలైనారు.

ఒకవంక జాతీయోద్యమ ప్రభావం, వేరొకవంక పాశ్చాత్య నాగరికతా ప్రభావం ఈ రచయితల మనస్సులను ఆకట్టుకొన్నాయి. వీరందరూ తీవ్రవాదులన్నాను. ఈ తీవ్రతలో వారివారికినచ్చిన భావాలను, మతాలను స్వీకరించి దానికి అనుగుణంగా ఆ భావాల ప్రచారంకోసం రచన చేశారా అన్నంత ఆత్మపరంగా, ఎంతో అభినివేశంతో వీరు రచన సాగించారు.

చలం, విశ్వనాథ, అడివి బాపిరాజు కాల్పనికోద్యమం తొలి రోజులలో కలం పట్టినవారు. ఈ కాల్పనికోద్యమంలో రచయితలు

ఒక్కొక్కరు ఒక్కొక్క తీవ్రమైన సిద్ధాంతాన్ని ధ్యేయంగా ఉంచుకొని రచన చేశారు. ఏర్పడిపోయిన రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా ఒకరు, ఆంధ్ర పౌరుషాన్ని, ఆంధ్రవీరుల గొప్పతనాన్ని ఎలుగెత్తి చాటుతూ మరివొకరు — ఇలాంటి లక్ష్యాలతో నవలా రచన సాగించారు రచయితలు.

ఈ కాలం రచయితలందరిలోనూ వెనుకటి తరంమీద దాడి; దానికి భిన్నంగా నిజమైన ఒక ఉద్యమాన్ని, ఒక భావ విప్లవాన్ని తీసుకొని రావాలన్న ఆశ ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఆయా రచయితలు అంత ఉద్వేగంతో తమభావాలను పాఠకులను ఆకట్టుకొనేలా చెప్పాలనే ఆకాంక్షకు కారణం పై అభిప్రాయాలే.

చలం పాశ్చాత్య నాగరికతమీద వ్యామోహం ఉన్నవాడు కాడు. కాని వారివల్ల స్త్రీ పురుషుల సంబంధాల విషయంలో భారతీయ పాశ్చాత్య దృక్పథాలలో వున్న తేడా తెలుసుకొన్నవాడు. తన స్వానుభవాల దృష్టినుంచి వానిలోని మంచి చెడ్డలను బేరీజు వేసుకొన్నవాడు. ఆయనకు తనచుట్టూ నీతిపేరిట జరుగుతున్న మురికి సంఘటనలు ఏవగింపు కలిగించాయి. అందువలన స్త్రీలకు స్వేచ్ఛ, స్వేచ్ఛాప్రణయం — యివితప్ప దేశానికి, మనిషికి మరో మేలు లేదన్నాడు.

చలం ఆద్యంతమూ రొమాంటిసిస్ట్. ఈ దృష్టితోచూస్తే చలం ఒక్క చలమేకాదు. ఈ కాలం రచయితలందరూ — మనకు అర్థం అవుతారు. స్వేచ్ఛాగానం యీ కాలంవారి గళాలనుంచి వెలువడిన ఒకే ఒక నాదం.

ఈ తీవ్రత విశ్వనాథ చలంలలో వేరువేరు పద్ధతుల్లో నడిచింది. ఇద్దరూ సమకాలీన సమాజంలో ఉన్న స్థితిగతుల్ని ఆమోదించలేదు. ఇద్దరూ సమకాలీన వ్యక్తుల స్వేచ్ఛను, కట్టుబాట్లకు లొంగని వ్యక్తి

స్వాతంత్ర్యాన్ని కోరారు. విశ్వనాథ సంఘం నియమించే కట్టుబాట్లు యింకా గట్టిగా నిలబెట్టాలని ఆశించాడు. పాశ్చాత్య నాగరికతా వ్యామోహంలో పతితమైపోతున్న వ్యవస్థను మన పూర్వుల నైతిక జీవనంవైపుకు నడపాలనికోరాడు.

ఒకవిధంగా వీరిద్దరూ కూడా తీవ్ర అన్వేషులు. ఒకరు స్వేచ్ఛాన్వేషి. మరొకరు నైతిక జీవనాన్వేషి. అయితే ఒక సంగమంలోనుంచి బయలుదేరిన రెండు మహా ప్రవాహాలు వారు. వారు నమ్మిన అభిప్రాయాలయెడ వారికున్న అభినివేశంలోను, భాషమీద వారికున్న అధికారంలోను వారికి వారేసాటి.

వీరిలో మూడవవాడు బాపిరాజు. ఇతడు వైవిధ్య కళామూర్తి. కవి, కథకుడు, గేయకారుడు, శిల్పి, అతిసుకుమారుడు, సుకుమారమైన భావన చేయగలవాడు. ఈయన తెలుగు చరిత్ర అన్నా, ఆ చరిత్రలోని మహామహులన్నా ప్రాణం యిస్తాడు. అందువల్లనే తెలుగు జీవితంలోని ఆనందదాయకమైన ప్రతి భావనకు కార్యరూపం యిచ్చాడు. ఈయనవ్రాసిన కథలకు, నవలలకు తెలుగు దేశమే కథాస్థానము.

చరిత్రను పునర్నిర్మించడంలో బాపిరాజుది అందెవేసిన చేయి. విశ్వనాథ, బాపిరాజు, నోరి — ముగ్గురు గొప్ప నవలాకారులు తెలుగు చరిత్ర ఆధారంగా రచనలు చేశారు. అందులో విశ్వనాథ చరిత్రను కేవలం భూమికామాత్రంగానే స్వీకరించాడు. ఆయనకు కథ ముఖ్యం. ఇతివృత్తాన్ని యిష్టంవచ్చినన్ని మలుపులు మళ్ళిస్తూకూడా వస్త్వైక్యం చెడకుండా నిలబెట్టి తన రచనను సుసంఘటితమైన శిల్పమూర్తిగా వెలవరించే నేర్పుగలవాడు. చరిత్రాత్మక నవలలో చరిత్ర ప్రధాన స్థానం వహిస్తుంది. గంభీరమైన పాత్రలు, ఉదాత్తమైన కథా కథనం, రచయిత తాను స్వీకరించిన కాలానికి అనుగుణంగా చిత్రించే

వాతావరణ కల్పన — ఇవి చారిత్రక నవలలకు ముఖ్యలక్షణాలు. అంతవరకు యీ ముగ్గురి రచనలు ఒకే పద్ధతిని అనుసరించాయి. కాని విశ్వనాథలో చరిత్రకన్న కథ ముఖ్యం. నోరిలో చరిత్ర పునర్నించడానికి గట్టి పట్టుదల ఉన్నా, సంఘటనలలో, పాత్రచిత్రణలో కొంత ఆధునికత, కొంత సమకాలీన జీవనాన్ని ప్రతిబింబింప జేయాలని ఆకాంక్ష కనిపిస్తుంది. ఇక బాపిరాజు తన నవలలలో చారిత్రకభావాన్ని సృష్టించడంలో కృతకృత్యుడైనాడు. దానికి బహుశః ఆయన చేసిన వర్ణనలు ఒక ముఖ్యమైన కారణం కావచ్చు.

తిరిగి యీ వర్ణనల్లోకూడా యీ ముగ్గురిలో వైవిధ్యంఉంది. విశ్వనాథ వర్ణనలు ప్రతీకాత్మకాలు. అవి పాత్రల మనోచిత్రణకు ఎంతో ఉపకరిస్తాయి. నోరివారిలో వర్ణనలు తక్కువ. ఉన్న వర్ణనలు కూడా పాత్ర నిష్ఠమైనవి. ఇక బాపిరాజుగారి వర్ణనలు - తాను ఏ కాలాన్ని చిత్రిస్తున్నాడో ఆ కాలంలోని అన్ని విషయాలను-ఉదాహరణకు భవనాలను, రాజమార్గాలను, సైన్యాన్ని, వేషభాషల్ని, ప్రతి చిన్న విషయాన్నికూడా వర్ణిస్తాయి. ఈ వర్ణించడంలో చిత్రలేఖనంలో చూపించే నేర్పంతా చూపించాడు బాపిరాజు.

ఇక యీ కాలంలోవచ్చిన నవలలను పరిశీలిద్దాం. ఈ కాలంలో వెనుకటియుగంలో వ్రాసిన కొందరు రచయితలు తమ రచనలను కొనసాగించారు. వారిలో చిలకమర్తి, కేతవరపు వేంకటశాస్త్రిముఖ్యులు. చిలకమర్తి వ్రాసిన "కృష్ణవేణి"లో 1675 ప్రాంతాల గోల్కొండ నేలిన అబుల్ హసన్ తానీషా కాలంలోని సైనికోద్యోగిఅయిన రామరాజు కథ వర్ణింపబడ్డది. ఈయన "సువర్ణగుప్తుడు" కూడా చారిత్రక కథే !

కేతవరపు వేంకటశాస్త్రిగారు వెనుకటితరంలోని ముఖ్య రచయితలవలె అన్నిరకాలైన నవలలను వ్రాసినవారే! అందులో చారిత్రకాలు, అపరాధపరిశోధకాలు, సాంఘికాలు-అన్నీ వున్నాయి.

'మదాలస' అన్న పౌరాణిక నవల, 'తారాబాయి' అన్న భారతచరిత్రకు సంబంధించిన నవల, ఆనందాబాయి, ఇచ్ఛినీకుమారి, రాజసుందరివంటి ఆంధ్రదేశం ప్రధానస్థానంగాగల నవలలు, అగ్రహారము, లక్ష్మీప్రసాదమువంటి సాంఘిక నవలలు, రహస్యభేదనము వంటి డిటెక్టివ్ నవలలు వ్రాసి తెలుగు నవలా సాహిత్యానికి ఎంతో సేవచేశారు.

వీరి సాంఘిక నవలలలో ఆనాటి సాంఘిక దురాచారాలను గురించి, ఆనాటి మధ్యతరగతి జనుల జీవన వ్యవహారాలనుగురించి చక్కని వివరణలు ఉన్నాయి.

ఆ తరువాత చెప్పుకోదగ్గ రచయిత ఉన్నవ లక్ష్మీనారాయణ గారు. ఆయన వ్రాసిన ఒకే ఒక అజరామరమైన నవల మాలపల్లి అనే సంగవిజయం. ఆనాటి సాంఘిక రాజకీయ జీవితంలో ఉన్నవ వారికి విశిష్టమైన స్థానం ఉన్నది. ఆయన కాకలుతీరిన రాజకీయ నాయకుడు. అందరిచేతా ఔననిపించుకొన్న సంఘసంస్కర్త. ఆయనకు నచ్చిన యీ రెండు విషయాలనూ జోడించి, పచ్చివ్యవహారిక భాషలో మాలపల్లి వ్రాశారు. ఆనాడు అలా వ్రాయగలగడానికి ఎన్నిగుండెలు కావాలి? 'కన్యాశుల్కం' వ్రాయబడ్డ ఎన్నోరోజులకు గాని తెలుగునాటకాలు వ్యావహారిక భాషను స్వీకరించలేక పోయాయి. అలానే మాలపల్లి వ్రాయబడ్డ చాలరోజులకుగాని తెలుగునవల వ్యావహారిక భాషలో వ్రాయబడలేదు. ఈ యిద్దరు రెండు రంగాలలో ఆధునిక తెలుగు సాహిత్యవైతాళికులని చెప్ప వచ్చు.

రాజకీయాలు, హరిజనసమస్య, ''మాలపల్లి'' కి ముఖ్యమైన విషయాలు. గ్రామీణ జీవితం యథాతథంగా చిత్రింపబడ్డ యీ నవల లోని పాత్రలు కూడా సజీవమైన మూర్తులే. ఒక రామరాజ్యానికి

నాందిగా ఉన్న తాదర్శాలుగాగల మూర్తుల కలయికే మాలపల్లి రామదాసు, సంగదాసు, రామానాయడు, జ్యోతి, పాల్-అందరూ యీ మంగళాపురం అనే రామరాజ్యంలో ప్రముఖ పౌరులు.

తెలుగు జాతీయ జీవితాన్ని కన్నులకు కట్టినట్లు చిత్రించిన యీ నవల తెలుగు నవలా సాహిత్యంలో ఒక మైలురాయి.

(విశ్వనాథ, చలం, బాపిరాజులలో మొదట నవలా రచనకు పూనుకొన్నవాడు విశ్వనాథ. ఈయన 1918 నాటికే తన మొదటి నవల వ్రాశాడు.

భావనా ప్రపంచంలో చలానికి ప్రత్యర్థిగా నిలచిన వాడు విశ్వనాథ. చలం ఎంతగా పాశ్చాత్య వ్యామోహితుడై నాడో విశ్వనాథ అంత పురాతన భారతీయ సంస్కృతీ వ్యామోహితుడు. చలం వివాహ వ్యవస్థకు ఎంత వ్యతిరేకో, విశ్వనాథ ఆవ్యవస్థ అంటే అంత ప్రాణం యిచ్చినవాడు. కాని యిద్దరికీ కొన్ని సమమైన లక్షణాలు కూడా వున్నాయి. ఇద్దరూ నిశితమైన భావన, అతినిశితమైన భాష, శైలి వున్నవారు. ఇద్దరూ కళను తమ తమ భావాలను ప్రచారం చేయడానికి ఉపయుక్తం చేసినవారే! ఇద్దరూ సమకాలీన సమాజం మీద ధ్వజం ఎత్తినవారే!

విశ్వనాథ ఆధునికాంధ్ర సాహిత్యవ సామ్రాజ్యానికి సమ్రాట్టు. తన మేధను, స్వతంత్ర భావనా బలాన్ని తన అశేషమైన రచనల ద్వారా తెలుగువారికి అందించిన వాడు. అర్ధ శతాబ్దినుంచి అవిరళమైన సాహిత్యసేవ చేస్తూ తాను నమ్మిన దానిని జంకుగొంకులు లేక బయటపెట్టే నిర్మొహమాటి. కళాప్రపూర్ణ బిరుదాంకితుడు.

ఈయన కూడా కాల్పనికోద్యమ ప్రభావంతో మొదటి రచనలు చేసినవాడే! అయితే ఆంధ్రులయెడ, ఆంధ్రభాష యెడ, ఆంధ్ర

ఔన్నత్యము యెడ ఎంతో అభినివేశం వున్నవాడు. పలుకు ఎంత వాడి అయినదో రచన కూడా అంతవాడి అయినదే!

విశ్వనాథ మొదటి నవల "అంతరాత్మ" (1918). వారి రెండవ నవల ఏకవీర (1925) నాటి నుంచి యీనాటి వరకు అవిచ్ఛిన్నంగా నవలా రచన సాగిస్తూనే వున్నారు. వేయిపడగలు (1934), మాబాబు (1935), చెలియలికట్ట (1935), బద్దన్న సేనాని (1938), ధర్మ చక్రము (1942), స్వర్గానికి నిచ్చెనలు (1950), పురాణ వైరగ్రంథ మాల కోసం వ్రాసిన పన్నెండు నవలలు (1958_61). విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు (1964), వల్లభమంత్రి (1965), బాణావతి (1965) మిహిరకులుడు (1965), ఇటీవలి నేపాల దేశచరిత్రకు సంబంధించిన నవలలు (1967- ) ఈ ఈనవలల్లో ఏ ఒకటి మరో దానివలె ఉండదు. ఏ నవలలోని పాత్ర మరొక దానిని పోలివుండదు. ఇంతటి వైవిధ్యం విశ్వనాథకే చేతనౌతుందంటే అతిశయోక్తికాదు. వీనిలో పౌరాణి కాలు వున్నాయి. చారిత్రకాలు వున్నాయి, సాంఘికాలు వున్నాయి. వ్యంగ్య రచనలు వున్నాయి.

ఈయన నవలలోని చారిత్రకాలలో ముఖ్యమైనవి ఏకవీర, ధర్మ చక్రము, కడిమిచెట్టు. ఏకవీరలో ప్రేమకు, దానికి ప్రతిగా ధర్మబద్ధ మైన వివాహానికి సంఘర్షణ ఏర్పడితే మానవుడు దేనిని స్వీకరించాలో చూపబడ్డది. ఈ నవలలో పాటించిన 'ఎకానమి' విశ్వనాథ యితర నవలల్లో కనిపించదు. అందువల్లనే తెలుగు దేశంలోని అత్యుత్తమ నవలల్లో ఏకవీర ప్రథమ శ్రేణికి చెందుతుందని చెప్పవచ్చు.

ధర్మచక్రము కూడా తెలుగు చరిత్ర నుంచి స్వీకరించినదే! అందులో బౌద్ధమత ప్రభావము, దానిలోని లోపాలను పూరించే వైదికమతప్రశస్తి రెండు వర్గాల పాత్రలద్వారా చూపబడ్డది. 'బద్దన్న సేనాని' లో బద్దన్న, బాధన్నల ధర్మబద్ధము కాని ప్రేమ చూపబడ్డది.

అయినా వారి ప్రేమలోని మాధుర్య భావాన్ని అతిసుందరంగా నిరూపించారు విశ్వనాథ.

'కడిమిచెట్టు' చిన్న నవల. చాళుక్యుల కాలంనాటిది. నవల అతి త్వరితగతిని నడుస్తుంది. తనకు జరిగిన అన్యాయాన్ని, తన కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని జ్ఞప్తిలో వుంచుకొని, దానికి తగిన ప్రతీకారాన్ని తీర్చుకోవడం యిందులో కథ. కథ అత్యంత రమణీయంగా నిర్వహింపబడ్డది. మయూరిని పాత్ర విశ్వనాథ సృష్టిలో మరెక్కడా కనిపించదు.

విశ్వనాథ చారిత్రక నవలలలో ఒకవిశేషం వున్నది. చారిత్రక భ్రాంతి కల్పించడానికి ఆయన ఎక్కువగా పాటు పడడు. ఆ కథలో వుండే సంఘర్షణే పాఠకులను ఆకట్టుకుంటుంది. కథాభాగం, పాత్రల లోని వైచిత్రి, సంఘటనలలోని బలం ముఖ్యం. కాని చరిత్రను అంతగా ఆదరించడు. ఒక్క ఏకవీరలో మాత్రం యిందుకు భిన్నంగా కొన్ని చారిత్రక సంఘటనలను కూడా-కథకు అనువైన వానిని-చేర్చి చరిత్రను నవలలో ముఖ్యభాగంగా నిర్మించారు.

విశ్వనాథ మహోత్కృష్టమైన రచన 'వేయిపడగలు'. ఆ నవల. తెలుగు వారి జీవన విధానాన్ని అన్ని కోణాలనుంచి చూపినట్టిది- యింతవరకు మరొకటి రాలేదు. సర్వతోముఖమైన ఆయన ప్రతిభకు యిదితార్కాణ.

'మాబాబు' ను మించిన కరుణ రసాత్మకమైన నవల ఆయన రచనల్లో మరొకటి లేదు. ఈ నవలలోని కథనం అంతా ఉత్తమ పురుషలో సాగింది. మనసుల లోతుల్ని తరిచి, అత్యంతమైన విషాద సంఘటనలను ఎంతో సంయమనంతో వ్యక్తీకరించారు విశ్వనాథ. అనాథుడైన ఒక వ్యక్తి జీవితంలో వచ్చిన అనేకములైన మార్పులు,

అతని త్యాగం, మానవతా సంబంధమైన మమతలు - యివి ఇందులో ఉత్తమంగా చిత్రించ బడ్డాయి.

'చెలియలికట్ట' విశ్వనాథ భావాలకు చక్కని, సూటి అయిన వ్యక్తీకరణ. పాశ్చాత్య వ్యామోహంలో చిక్కుకొన్న ఈనాటి వారి కుతార్కిక సిద్ధాంతాలను ఇందులో ఖండించడానికి ప్రయత్నం చేశాడు విశ్వనాథ. విశ్వనాథ భావాలు మనకు రుచించక పోయినా అయన ఇందులో చూపిన శిల్ప ప్రతిభ మనకు అచ్చెరువు కలిగిస్తుంది. చెలియలి కట్టను మనుష్యుల ఉద్వేగాలకు ఒక అంచుగా ఊహించుకొని, సంస్కృతీ సమాజాలు ఆ ఎల్లను నిర్దేశించాయని, వానిని దాటి రాకూడదని, అవి దాటడానికి ప్రయత్నించడం ఆత్మహత్య సదృశమని రత్నావళి కథతో నిరూపించారు విశ్వనాథ. తాత్కాలికమైన లైంగిక వాంఛలకూ, సుస్థిరమైన వివాహవ్యవస్థకు మధ్యగల అంతరాన్ని నిరూపించే ప్రయత్నం చేశారు విశ్వనాథ.

మిగిలిన నవలలలో ముఖ్యమైనది 'తెఅచిరాజు' ఒక మహా నటుని కథ. అతనిని అతిలోకమైన పాత్రగా ఊహించి అతడు సంఘం నిర్మించిన విలువలకు అతీతుడని, అతడు చేసిన పనులన్నీ అట్టివేనని చిత్రించడానికి ప్రయత్నం చేశారు విశ్వనాథ. ''స్వర్గానికి నిచ్చెనలు'' ఆస్తిక, నాస్తిక వాదాల మధ్య ఈ శతాబ్దంలో నడుస్తున్న సంఘర్షణను వసుంధర కథగా స్వీకరించి, నాస్తికతపై ఆస్తికత విజయాన్ని, ఆధిక్యాన్ని నిరూపించింది.

ఇక వ్యంగ్యాత్మకమైన రచనల్లో "విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు" ఇంగ్లీషు చదువుకొని గొప్పలకు పోయేవారిపై విశ్వనాథకున్న కోపానికి చక్కని చిత్రణ. విశ్వనాథవలె గాఢమైన ఆంగ్లభాషా పరిచయం వున్న వ్యక్తి ఇది వ్రాయడం ఆశ్చర్యమే! కాని ఆ ఇంగ్లీషు తప్ప అన్ని భాషలు భాషలు కాదనే మిథ్యావాదులపై యిది విమర్శ.

"హాహా హూహూ" ఒక గంధర్వుడు ఈ ప్రపంచంలోకి దిగి వస్తే అతని భావాలు ఎలావుంటాయో వ్యంగ్యాత్మంగా చిత్రించే రచన.

ఇటీవల వారు వ్రాస్తున్న పురాణవైర గ్రంథమాలలోని నవలలను వారు భారతీయ చరిత్రగా ఊహించి వ్రాస్తున్నారు. దానిని చరిత్ర అనడం, దీనిని గట్టిగా నమ్మడం, దీనికి కొంత కల్పనలు చేర్చి నవలలుగా వ్రాయడం ఆయన ఆత్మ ప్రత్యయానికి నిదర్శన.

గతపదేళ్లుగా విశ్వనాథ వ్రాసిన నవలలు అసంఖ్యాకం. నేపాల దేశచరిత్ర, భారత చరిత్రలను ఆయన పునర్నిర్మిస్తునట్లు కన్పిస్తుంది. పురాణ వైరగ్రంథమాలలోని నవలలన్నీ పురాతన భారతీయ చరిత్రను ప్రతిబింబిస్తున్నాయని, ఆ చరిత్ర ఆధారంగానే అవి వ్రాయబడ్డాయని ఆయన నమ్మకం. అది ఆయన ఆత్మ ప్రత్యయానికి, విశ్వాసానికి ప్రబల నిదర్శనం.

ఈ నవలలుకూడా విశ్వనాథ చాలా నవలలమాదిరిగా సంవాదాత్మకాలే! విశ్వనాథ నవలా రచనలో "వేయిపడగలు" వరకు ఒక దశ, ఆ తరువాత మరొకదశ ఉన్నట్లు తోస్తుంది. మొదటి దశకు చెందిన నవలలు కథాత్మకాలు, రెండవ దశలోని నవలలు సంవాదాత్మకాలు, లేదా ఉపన్యాసాత్మకాలు.

ఈ నవలలలోకూడా శిల్పగరిమ తక్కువకాదు. "ఆఱు నదులు" వంటి నవలలో ఆయన చూపిన ప్రతీక భావన అత్యుత్తమం. ఈ నవలలన్నింటినీ కాల్పనిక నవలలుగా మనం భావించవచ్చు.

కాల్పనికోద్యమంలోని ప్రతి లలిత భావానికి అక్షరరూపం యిచ్చినవాడు అడివి బాపిరాజు. అంత వైవిధ్యమైన కళామూర్తి మనకు మరొకరు లేరు. అందువల్లనే ఆయన రచనలనిండా శిల్పము, చిత్రలేఖనము మొదలైన కళలనుగురించిన చర్చలే.

విశ్వనాథవలెనే బాపిరాజుకుకూడా తెలుగు చరిత్ర అన్నా, తెలుగువారి జీవితమన్నా ఎంతో అభిమానం. అందువల్లనే ఆయన వ్రాసిన నవలలకు, కథలకు కార్యస్థానం తెలుగు దేశమే! ఆయన వ్రాసిన నవలలన్నీ తెలుగువీరులను గురించే!

బాపిరాజుగారి నవలలలో నాలుగు ప్రధానమైనవి. హిమబిందు, గోన గన్నారెడ్డి, నారాయణరావు, కోనంగి. ఇవినాలుగూ తెలుగుదేశం, తెలుగువీరుల కథలే! వీని అన్నింటిలోను మనకు కన్పించే సాధారణ లక్షణాలు బాపిరాజుగారి వైవిధ్యమైన వ్యక్తిత్వము, ఆంధ్రాభిమానము, లలితకళలంటే ఆయనకున్న ఆసక్తి.

'హిమబిందు' ఈయన రచనలలో ముఖ్యమైనదిగా చెప్పవచ్చు. ఇది ఆంధ్ర శాతవాహనుల కథ. బౌద్ధశకము 453లో ధాన్యకటకము రాజధానిగా ఆంధ్ర సామ్రాజ్యాన్ని ఏలిన శ్రీముఖ సాతవాహన చక్రవర్తి పాటలీపుత్రాన్ని జయించడం, జంబూద్వీపాన్ని వశపరుచుకోవడం యిందులోని ముఖ్యమైన కథ. ఆనాటి మత, రాజకీయపరిస్థితులకు, బౌద్ధ వైదిక ధర్మాలకు ఆనాడువున్న స్పర్థలను అతి సహజంగా చిత్రించారు బాపిరాజు. బౌద్ధ, వైదికమతాలకు ప్రతీకలుగా తండ్రి కొడుకులను ఉంచడం, వారు దగ్గరికి రాగానే ఆ రెండు మతాలు తిరిగి దగ్గరకావడం యిందులో ఎంతో ప్రతిభావంతంగా చిత్రించడడ్డది.

రెండవ చారిత్రక నవల గోన గన్నారెడ్డి. శ్రీశ్రీ రుద్రదేవి ఆంధ్ర సామ్రాజ్ఞిగా వుండగా ఆమెకు దక్షిణ హస్తంగావుండి వర్ధమానపురం రాజధానిగా పశ్చిమాంధ్ర భూమిని ఏలుతూ వుండిన మహా మాండలిక ప్రభువు గోన గన్నారెడ్డిని గూర్చిన కథ యిది.

'నారాయణరావు' ఆంధ్ర విశ్వవిద్యాలయంవారిచే 'వేయి పడగలు' లో పాటు బహుమతినందుకొన్న రచన. తెలుగు జమీందా

రుల ఇండ్లలోని కథ. ఇందులో నారాయణరావు శారదల వివాహం, మనస్పర్ధలు ఆర్థిక వ్యత్యాసం కారణంగా కలతలు అన్నీ స్పష్టంగా చిత్రించబడ్డాయి. జమీందారుల యిళ్ళలోని ఆచార వ్యవహారాలు, మనస్తత్వాలు, సంఘర్షణలు యిందులో వివరంగా వర్ణించబడ్డాయి. ఇది పాఠకులకు అత్యంతమూ ప్రియమైన నవల.

"కోనంగి" జాతీయోద్యమ ప్రభావంలో వ్రాయబడ్డది. ఆనాటి వీరులు, వారి త్యాగాలు చక్కగా వర్ణించబడ్డాయి. వీనితో పాటు చిత్రకళను గురించి, పత్రిక నడపడం గురించికూడా దీర్ఘమైన ఉపన్యాసాలు ఉన్నాయి.

ఇవికాక బాపిరాజు వ్రాసిన నవలికలలో తుఫాను, రాగమాలిక, జాజిమల్లి, నరుడు మొదలైనవి ముఖ్యమైనవి. ఇవి అన్నీ అతిసుకుమారమైన భావనా పటిమను చాటి చెప్పుతాయి.

బాపిరాజు చారిత్రక నవలలలో ఆనాటి చారిత్రక జీవిత చిత్రణం చెయ్యడానికి, పునర్నిర్మించడానికి ప్రయత్నం కనిపిస్తుంది. అది భాషలో, సంభాషణల్లో, పాత్రచిత్రణంలో అన్నిటికన్న ముఖ్యంగా వర్ణనల్లో యీయన సాధించాడు.

ఏ చరిత్రను నిర్మించడానికయినా ఆనాటి రాజకీయ, మత సంబంధమైన సంఘటనలను పేర్కొనక తప్పదు. బాపిరాజు చారిత్రక నవలల్లో యిది అతి ముఖ్యము.

బాపిరాజు పాత్రలమీద దేశంలో ఒక అపప్రథవున్నది. ఆయన చిత్రించిన పాత్రలన్నీ ఎంతో ఆదర్శమూర్తులు. అందరూ మంచివారు; అన్నీ ఉదాత్తంగా వర్ణితాలు. ఇందులో వైవిధ్యంలేదు. కాని ఒకరకంగా చూస్తే యీ వాదన నిజమేననిపిస్తుంది. అయితే అది బాపిరాజు వ్యక్తిత్వంలోని మంచికి ప్రతిబింబమేనని చెప్పుకోవచ్చు.

ఈ తరం రచయితలలో అతిత్వరగా పేరుప్రఖ్యాతులు పొందిన వాడు చలం. సంప్రదాయ వాదులు ఆయన రచనలలోని భావాలను విమర్శించినా, ఆయన శైలిని, పటిష్టమైన భావనాబలాన్ని కాదన లేకపోయారు. యువతరంవారికి చలం గ్రంథాలు వేదాలే అయి నాయి. చలం 1926 నాటికే 'శశిరేఖను వ్రాశాడు. ఆ తరువాత దైవమిచ్చిన భార్య, మైదానంవంటి నవలలువచ్చాయి. ఈ నవల లన్నింటిలోను చలం చెప్పదలుచుకొన్న కథ ఒక్కటే ! స్వేచ్ఛా ప్రణయం ఆయన చాటిచెప్పిన సిద్ధాంతం. వివాహ వ్యవస్థలోని కామ గతమైన సంబంధాన్ని, ప్రేమరహితమైన జీవితాన్ని విమర్శించి, కాదని త్రోసిపుచ్చి. స్వేచ్ఛతో స్త్రీ పురుషులు పరస్పరాకర్షణలతో, శృంగార భావనతో, అర్థంచేసుకున్న మనస్సులతో వెన్నెలవంటి జీవితాలను గడపాలని ఆకాంక్షించాడు చలం. ఆ భావాన్నే మళ్ళీ మళ్ళీ తన నవలల్లో వెలువరించాడు.

చలం సృష్టించిన స్త్రీలందరూ సంఘంచేత వంచింపబడినవారు. వీరందరూ ఆయన భాషలో పీడితులు. వారికి స్వేచ్ఛ కలిగించడానికే ఆయన కలం పట్టాడు. దైవమిచ్చిన భార్య, శశిరేఖ, మైదానం, జీవితాదర్శం, బ్రాహ్మణీకం, హంపీ కన్యలు మొదలైన ఎన్నో నవలలు వ్రాశాడు.

ఇవి అన్నీ వివాహం అన్న అసంబద్ధమైన బంధంలో చిక్కు కొన్న స్త్రీలను గురించే. అయితే యిన్ని నవలల్లోను ఆయన స్త్రీలకు బోధించిన నీతి అంతా స్వేచ్ఛా విహారం. ఆకర్షణ, స్వేచ్ఛ — యీ రెండూ స్త్రీ పురుషులను కలిపివుంచాలి. ఆ తరువాత ఏమవుతుందన్న బాధలేదు. ఆలోచనలేదు. తరువాత పిల్లలుపుట్టే ప్రసక్తిలేదు. వెనుకముందులు ఆలోచించని శారీరక

వాంఛ, స్త్రీ పురుషుల కామసంబంధం — యివే చలం రచనల్లో కొట్టవచ్చినట్లు కనిపించే భావాలు.

కాని చలంలోని ఈ భావప్రకర్షను కొన్ని అంచెలుగా చూపవచ్చుననుకుంటాను. చలం రొమాంటిక్. సౌందర్యాన్వేషణ ఆయన ప్రప్రథమ ధ్యేయం. ఈ సౌందర్యాన్వేషణ ఎన్ని తరగతులుగా, ఎట్టి పరిణామాలతో చలంలో క్రొత్త మలుపులు తిరిగిందో మనం గమనించవచ్చు.

ఈ సౌందర్యాన్వేషణ ప్రతి వ్యక్తికివలెనే చలంలో కూడా శరీరాకర్షణతో ప్రారంభం అయింది. ఆయన మొట్టమొదటి కథలు, నవలలు - అన్నీ కేవలం శరీరాకర్షణతో సౌష్టవంతో నిండివున్న యువతుల చరిత్రలే! మైదానంలో నాయిక, అరుణలో అరుణ వీరందరూ ఒకే మూసలో పోసిన స్త్రీలు. వీరి కలయికకు వివాహ వ్యవస్థ ఆటంకం. అందువల్ల ఎక్కడికో పారిపోవడం. ఎప్పుడూ ఎక్కడా ఎవరికీ సంజాయిషీ చెప్పనక్కర లేకుండా, బాధ్యతలు లేకుండా జీవించే జీవితాలు వారివి.

ఇక రెండవ దశలో ఈ నిరంతర సౌందర్యాన్వేషణ శరీరపుటంచుల్ని దాటి హృదయం వైపుకు, మానవత వైపుకు సాగింది. ఆదర్శప్రాయమైన వివాహమంటే రెండు హృదయాల కలయిక. అట్టిదే వివాహం అంటాడు చలం. అందుకే 'దైవమిచ్చిన భార్య' లోని పద్మావతి కాపురం చేస్తూ కూడా చిన్ననాటి స్నేహితుణ్ణి మన్నిస్తూనే వుంటుంది!

ఇక మూడవ మెట్టు మానసికమైన సౌందర్యానుభూతి. నిశ్శబ్దమైన నిశీధిలో శరీరాకర్షణలతో సంబంధంలేని యిద్దరు ఆధ్యాత్మిక వాదుల ఆదర్శ ప్రణయం. ఇది నవలలలో కన్న ''పురూరవ''

వంటి నాటకాలలోను, ''ఓ పువ్వుపూసింది'' వంటి కథలలోను ప్రతీకాత్మకంగా చూపబడ్డది.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే - సమకాలీన జీవితంలో ఎన్నో విప్లవాలు, తీవ్రమైన సంఘటనలు జరుగుతూవుండగా అవి ఏవీ ఆయనను కదిలించలేదు. ఎప్పుడూ ఏవో ఊహాలోకాలలో విహరించిన వాడే! విమర్శలను ధైర్యంగా ఎదుర్కొన్నాడు నిజమే. అంతేకాదు. ఏర్పడిపోయిన వ్యవస్థలోని కుళ్లును నలుగురిముందు వుంచాడు. దానిని నాశనంచేయడానికి విప్లవం లేవదీశాడు. కాని దానిని పునర్నిర్మించడానికి మాత్రం ఎట్టి మార్గము చూపలేదు.

ఇంత సంకుచితమైన భావాలను వెలువరించి కూడా యింతటి కీర్తిని సంపాదిండానికి కారణం ఏమిటి? దీనికి కారణాలు రెండు: ఒకటి చలం వ్రాసిన విషయం యువతీ యువకులకు నచ్చేవిషయం. ప్రతి యువతీ, ప్రతి యువకుడూ ఆదర్శాల కలలు కంటాడు. చక్కని తీయని కలలు. ఆ కలలనే చలం కాగితం మీద పెట్టాడు. అందుకనే చలం రచనలన్నీ యువతీ యువకులకు అతిసన్నిహితాలు.

ఇక రెండవ కారణం ఆయన భాష, శైలి. వీనిలోని పటిష్ఠత. చలం అంత పటిష్ఠమైన భాషను వ్రాసిన తెలుగు రచయిత మరొక్కడే వున్నాడు. ఆయన విశ్వనాథ.

ఇవికాక చలం భావ చిత్రాలలో వున్న వైవిధ్యం, నూతనత్వం కూడా పాఠకులను రంజింపచేస్తూనే వుంటుంది. వెన్నెలను గురించి, స్త్రీని గురించి, ప్రకృతిని గురించి ఆయనచేసిన వర్ణనలు అతి వినూత్నమైన పథంలో సాగిపోతాయి.

తెలుగు భాషలో అతడు తెచ్చిన తియ్యదనం, భావాలలో ఉద్రేకం - యివి చలాన్ని కలకాలం నిలిచేటట్లు చేస్తాయి.

ఈ యుగంలో ప్రఖ్యాతులైన రచయితలు మరో ముగ్గురు ఉన్నారు. వారు మొక్కపాటి నరసింహశాస్త్రి, మునిమాణిక్యం నరసింహారావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగార్లు. వీరందరూ తెలుగు సాహిత్యానికి చిరస్మరణీయమైన సేవచేసిన వారే!

మొక్కపాటి వారి "బారిష్టరు పార్వతీశం" 1925 లోనే ప్రచురింపబడ్డది. చక్కని హాస్యనవలలు లేవన్న అపఖ్యాతిని తొలిగించింది "బారిష్టరు పార్వతీశం". ఇందులో మొక్కపాటి వారు చేష్టాగతమూ, పాత్రగతమూ అయిన హాస్యాన్ని చక్కగా పోషించారు. పార్వతీశం అనే యువకుని సీమ ప్రయాణం ఇందులో హాస్యభరితంగా వర్ణించబడ్డది. ఇది కొంతలో కొంత ఆత్మకథ అని ఈ రచయితే చెప్పుకొన్నారు.

ఛాందసుడూ, ఏనాడూ యిల్లు కదలనివాడూ అయిన పార్వతీశం సీమ ప్రయాణానికి నాందిగా మద్రాసు పోవడం - త్రోవలో అతని విచిత్రమైన అనుభవాలు ఇందులో వర్ణితాలు. సీమ ప్రయాణానికి అతడు తయారుకావడం, దానికోసం కచ్చిక, తాటాకులతో సహాబయలుదేరడం - వంటి సంఘటనలతో గ్రామీణ జీవితంలోని అమాయకుల ప్రవర్తనకీ అప్పుడే ఏర్పడుతున్న పట్టణ నాగరికతకూ మధ్యగల అంతరాన్ని, సంఘర్షణనూ ఈ నవల సూచిస్తున్నది. ఈ మార్పు సంఘంలోని మార్పుగా చూపించకుండానే చూపించారు మొక్కపాటి వారు. ఈ పరాశ్రయతే యీ నవలకు ఇంత ప్రఖ్యాతి తెచ్చిపెట్టడానికి కారణం అయింది.

మొక్కపాటి వారు ఇటీవల వెలువరిస్తున్న "బారిష్టరు పార్వతీశం'' రెండో భాగం మొదటిదాని అంత హాస్యాత్మకం కాదు. నండూరి వారి 'ఎంకి' రాను రాను 'వెంకి' గా మారినట్లు పార్వతీశం బారిష్టరై, ఎదిగి తెలివి తేటలు అలవరుచుకొని సంఘంలో తిరుగుతూ

వుంటాడు. అందువల్లనే కాబోలు ఈ రెండో భాగంలో వెనుకటి భాగంలో ఉన్నంత హాస్యం కానరాదు.

వీరి మరొక నవల 'ఏకోదరులు' (1931) మతాంతర వివాహాల లోని బాధల్ని, మానసికమైన సాంఘికమైన సంఘర్షణల్ని అతి ప్రతిభావంతంగా చిత్రించిన కరుణామయ గాథ.

మొక్కపాటి నరసింహశాస్త్రి గారితో సరిసమానంగా చెప్పుకో దగిన మరో హాస్యరచయిత మునిమాణిక్యం. 'కాంతం' అన్న కాంతని సృష్టించి, గృహస్థ జీవితంలోని ఎన్నో వెలుగునీడల్ని అత్యంత మధు రంగా చిత్రించారు మునిమాణిక్యం వారు. కుటుంబ జీవితంలో, గార్హస్థ్య జీవితంలోవుండే అతి సున్నితమైన హాస్యం, వంగ్య సంభా షణలు వీరి రచనలకు ప్రాణం.

విస్తృతికల రచనలు వ్రాయలేదు కాని వానిలో కాంతంతో వున్న అన్ని దీర్ఘమైన కథలూ అతిమధురమైనవే! ఆమె భర్తను చేసే మృదువైన హాస్యం తెలుగు వారి యిళ్ళలోని మధురమైన హాస్యానికి ప్రతి రూపమే!

విచిత్రమైన విషయం ఏమంటే - యీ యిద్దరు హాస్యరచయి తలూ వ్రాసిన విషాద రచనలు మనలో చెరగని ముద్ర వేస్తాయి. మునిమాణిక్యం వ్రాసిన 'దీక్షితులు' అన్న నవల ఎంతో కరుణాత్మక మైనది. ప్రతి వారి కష్టమూ తన కష్టంగా భావించుకొని జీవించి చివరకు తనకే కష్టాలురాగా యోగిగా మారిపోయిన ఒక అమృత మూర్తి కథ యిది. చూడగా, వీరిద్దరూ విషాద సంఘటనాత్మకాలైన నవలలు వ్రాసివుంటే యింకా ఎంతగానో రాణించేవారనిపిస్తుంది.

కాంతం కథలు కాక మునిమాణిక్యం మూడు చక్కని నవ లలు వ్రాశారు - రుక్కుతల్లి, దీక్షితులు, తిరుమాళిగ. ఈ మూడూ

ఆయన అతి సున్నితమైన భావనకూ, ఆయనలో విషాద సంఘటనలు చిత్రించే నేర్పుకూ తార్కాణ.

శ్రీపాదవారికి తెలుగుతనంమీద అభినివేశం చెప్పనలవికానిది. ఆ అభినివేశాలే ఆయన్ని ప్రబుద్ధాంధ్ర పత్రిక నడిపించేటట్లు చేసింది. తెలుగు వారి చరిత్రనుంచి కథలను స్వీకరించి నవలలను వ్రాయాలని ఆయన కలలు కన్నారు.

వారి నవలల్లో శ్మశాన వాటిక, మిథునానురాగము మొదటి రచనలు. మిథునానురాగము (1914) కొమర్రాజు లక్ష్మణరావుగారు వ్రాసిన ఒక కథ - ''పుల్ జానీబేగం'' అన్న కథ ఆధారంగా వ్రాయబడినది. ఇవి రెండు గ్రాంథిక భాషలో వ్రాయబడ్డ నవలలు.

ఆ తరువాత శ్రీపాద వారు 'ఆత్మబలి' 'రక్షాబంధము' అన్న నవలలు వ్రాశారు. ఇవికాక అనేకమైన నవలికలు వ్రాశారు. వానిలో 'వడ్లగింజలు', ఇల్లుపట్టిన వెధవాడ బడుచు' వంటి ప్రఖ్యాతములైనవి వున్నాయి.

వీరి నవలలన్నీ గోదావరీ మండలంలోని బ్రాహ్మణుల ఇళ్ళలో జరిగే కథలు ఆధారంగా వ్రాయబడ్డాయి. ఇందులో ఆయన సజీవమైన పాత్ర చిత్రణ, సున్నితమైన హాస్యంతో పాటు చక్కని ఆంధ్ర దేశ ఆచారవ్యవహారవర్ణన కూడా చేశారు.

ఈ కాలంలో వెలువడిన యితర రచనల్లో వేలూరి శివరామ శాస్త్రిగారి 'అహోబలీయం' (1920) జాతీయోద్యమాన్ని గురించిన మొదటినవల. శేషాద్రి రమణకవుల "కొండపల్లి ముట్టడి", పిలకా గణపతి శాస్త్రిగారి "మీనాంబిక" ఎన్నదగిన చారిత్రక నవలలు.

అనువాదాలుకూడా చాలా వచ్చాయి యీ కాలంలో. వీనిలో ధీరేంద్రనాథ్ పాల్ వ్రాసిన ప్రఖ్యాత రచన 'మొగలాయీ

దర్బార్' (1925) కు మొసలికంటి సంజీవరావుగారి అనువాదం ముఖ్యమైనది. వెదురుమూడి శేషగిరిరావు గారు గెథేకవి వ్రాసిన ఫాస్టుకు చేసిన అనువాదంకూడా ఎన్నదగినదే!

ఈ కాలంలోనే వేలూరివారిచే శరత్ అనువాదాలు ప్రారంభం అయ్యాయి. అవి దేశాన్ని చాలా ప్రభావితం చేశాయి. ఇవికాక పాంచకడీదేవ్ అనువాదాలు యీ యుగంలోకూడా వస్తూనే వున్నాయి.

ఈ యుగం చివరిలో మద్రాసులో చక్రపాణి, నాగిరెడ్డిగారల ఆధ్వర్యంలో "యువ ప్రచురణలు" ప్రారంభమై చలం నవలలను, నాటకాలను, పెక్కు అనువాదాలను ప్రచురించి పాఠకులకు ఆదర పాత్రమైంది. ఇందులో కొన్ని వంగ అనువాదాలు, ఆంగ్ల అనువాదాలు (ఈస్ట్‌లిన్) కూడా ముఖ్యమైనవే!

## 4 మనోవైజ్ఞానిక యుగం : 1940-60

పందొమ్మిదోశతాబ్దం చివరిభాగంలో మనస్తత్వశాస్త్రం కొత్త మలుపులు తిరిగింది. అంతవరకు తాత్త్వికశాస్త్రంలో ఒకభాగంగా వున్న యీ శాస్త్రం కొత్త సిద్ధాంతాలతో, కొత్త ప్రేరణలతో ఒక సమగ్రమైన శాస్త్రంగా రూపొందించబడ్డది. దానికి తోడ్పడ్డవారు ముగ్గురు: స్కాపెనోర్, నిష్జ, బెర్గ్‌సన్. వీరితరువాత దానికొక రూపాన్ని యిచ్చి సమగ్రమైన సిద్ధాంతాలను రూపొందించినవాడు ఫ్రాయిడ్. ఫ్రాయిడ్ తరువాత అంత ప్రభావమూగల మరొక మనస్తత్వశాస్త్రవేత్త యుంగ్ (Jung): వీరుకాక ఫ్రేజర్, ఆడ్లర్ మొదలైన ఎందరో నూత్న సిద్ధాంతాలను ప్రపంచించడంద్వారా మనస్తత్వశాస్త్రాన్ని, తద్వారా సాహిత్యాన్ని ప్రభావితంచేశారు.

ఫ్రాయిడ్ సిద్ధాంతంతో అటు కథాచిత్రణలోను, సన్నివేశ కల్పనలోను, కథాకథనంలోనుకూడా ఎన్నో మార్పులు జరిగాయి. ఫ్రాయిడ్ సిద్ధాంతాలు ఆధారంగా పాత్రచిత్రణలో వచ్చిన మార్పు చెప్పుకోదగ్గది. (తొలిరోజుల్లో ఎక్కువగా వ్రాయబడిన సంఘటనా త్మకములైన నవలలకు బదులు రానురాను పాత్రగతములైన నవలలే వ్రాయబడడానికి కారణం మనస్తత్వ శాస్త్రమేనని చెప్పవచ్చు.

మనస్తత్వశాస్త్ర సిద్ధాంతాలు ఆధారంగాకాని, లేదా మనో విశ్లేషణ పద్ధతిద్వారాకాని పాత్రచిత్రణ జరగడం యీనాటి నవల లన్నింటా సామాన్యంగా జరుగుతున్నది. ఈ రచయితలు అటు పాశ్చాత్య దేశాల్లోను, యిటు భారతదేశంలోను, ఆంధ్రదేశంలోను కూడా అనుసరించిన కొన్ని మనస్తత్వ పద్ధతులను యిక్కడ పేర్కొ నడం అసంగతం కాదనుకొంటాను. వీనిలో ముఖ్యమైనవి యివి :

1. అంతర్ ప్రేరణయొక్క చిత్రణ motivation.
2. అంతర్ద్వంద్వం లేదా అంతరసంఘర్షణ Internal Confilict.
3. ఆంతర సంభాషణ Interior monologue.
4. మానసిక విశ్లేషణ Psycho-analysis.
5. స్వప్నవిశ్లేషణ dream analysis.
6. జ్ఞాపక విశ్లేషణ Analysis of recollection.
7. పూర్వవృత్తాంత నిర్మాణ పద్ధతి Case History method. మొదలైనవి.

ఇవి అన్నీ కూడా పాత్రల మనోగత భావాలను చిత్రించడానికి ఉపయోగపడే వివిధ విధానాలు. ఇవిగాక జాగ్రత్, చేతన, అర్ధచేత నావస్థలను గురించిన సిద్ధాంతాలు, ఈడిపస్ కాంప్లెక్సును గురించిన సిద్ధాంతాలు కూడా ఇందుకు దోహదకారులైనాయి.

పైన చెప్పిన విధానాలలో అంతర్ ద్వంద్వం, మనోవిశ్లేషణ వంటివి సర్వసామాన్య ప్రతి రచయితా పాత్ర చిత్రణకు ఉపయోగించే ముఖ్యమైన సాధనాలైనాయి. పోతే ఆంతర సంభాషణాది ముఖ్యమైన మనస్తత్వ శాస్త్ర పద్ధతులు వాడిన వారిలో బుచ్చిబాబు, గోపీచంద్, జి. వి. కృష్ణారావు, రాచకొండ విశ్వనాథశాస్త్రి అతి ముఖ్యులు. సమకాలిక రచయితలలో యివి ప్రయుక్తం చేయని రచయితలు లేరనే చెప్పవచ్చు. పైన పేర్కొన్నవారు వీరిలో ప్రముఖులు.

వీరందరికన్న ముందుగా మనం పేర్కొనవలసిన రచయిత కొడవటిగంటి కుటుంబరావు. అశేషమైన కథలూ, నవలలూ వ్రాసినవాడు; ఇంకా వ్రాస్తున్నవాడు. వ్రాసిన ప్రతి విషయమూ ఏదో ఒక సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని వ్రాసినవాడు.

(కుటుంబరావులో ఉన్నంత 'సిన్సియారిటీ' మరి ఏ తెలుగు రచయితలోను కనిపించదు. తనకు తెలిసిన, తన అనుభవంలోకి వచ్చిన, లేదా సంభవాలైన సంఘటనలను గురించే వ్రాస్తాడు. తనకు తెలిసిన మనుష్యులను గురించే వ్రాస్తాడు. వారందరూ నిత్యమూ మనకు కనిపించేవారే. మనమే ఆ పాత్రలం. కాని ఒక్క విశేషం వుంది. పాత్ర అంతరాంతరాల్లో ఎటువంటి ఆలోచనలు జరుగుతున్నాయో, ఎందుకు జరుగుతున్నాయో కుటుంబరావు వివరించినట్లు మరియే యితర తెలుగు రచయితా వివరించలేదు. కుటుంబరావు సిద్ధాంతాలు చెప్పడు. మనస్తత్వం పేరు ఎత్తడు. వానిని గురించి వ్యాఖ్యానించడు. దీర్ఘంగా చర్చించడు. కాని ఒక్కమలుపు, ఒక్క వ్యంగ్యాత్మకమైన వ్యాఖ్య. ఇలా పాత్ర మనోగత విశ్లేషణను క్లుప్తమైన పరిధిలో చేయడానికి ఎంతో ప్రతిభ కావాలి. అది ఉన్నవాడు ఈనాటి రచయితలలో కొడవటిగంటి ఒక్కడు.

ఈయనలోను, పైన పేర్కొన్న నలుగురు రచయితలోను సామాన్యమైన మరొక లక్షణం వున్నది. అది మానవత.

మానవతావాదం సామ్యవాదమూ, డెమోక్రసీ కలిసి సృష్టించిన అధునాతన సిద్ధాంతం అని కొందరు భావించవచ్చు. (కాని లోక కల్యాణాన్నే సాహిత్య ధ్యేయంగా భావించిన మనవారందరికీ ఈ మానవతావాదంకొంతో గొప్పో ఉన్నట్లే. అయితే సామాన్య జనులకు అందుబాటులోవుండే విధంగా వెనుకటివారు మంచి, చెడుల సంఘర్షణ, అందులో మంచి గెలవడం తమరచనల్లో చూపారు. కాని ఈనాటి మానవతావాదం వ్యక్తులకూ వ్యక్తులకు మధ్యవుండే అన్ని అడ్డుగోడలనూ పడగొట్టి తరతమ భేదాలనూ, బీద, గొప్పల తారతమ్యాన్ని ఛేదించి మనుష్యులుగా ఒకరినొకరి ప్రేమించుకోవాలని నేర్పుతున్నది. ఆభావం ఈ రచయితల్లో స్పష్టంగా గోచరిస్తుంది.)

ఈ రచయితల్లో మొదటివాడు కుటుంబరావు. ఆయన వ్రాసినన్ని నవలలు మరియే యితర తెలుగు రచయితా వ్రాసివుండడు. ఈనాటి మధ్య తరగతి కుటుంబాల సమస్యలు ఈయన నవలలు చాలా వాటికి ఇతివృత్తాలు. పెళ్ళిళ్ళ సమస్య, స్త్రీ పురుష సంబంధాలు; కొత్త చదువులతో వచ్చిన కొత్త ఇబ్బందులు; కొత్తకోడళ్లు, కొత్త అల్లుళ్లు ఇవిఅన్నీ ఆయన ఎన్నోసార్లు వివిధ కోణాలనుంచి చూసి, ఎంతో లోతుగా ఆ సమస్యలను పరిశీలించి మనముందు ఉంచుతాడు.

(ఈయన ఎంత వున్నతమైన మానవతావాదో 'ప్రేమించిన మనిషి' చదివితే తెలుస్తుంది. అందులో పనిమనిషి 'మంగి' మానవతలోని అతి తక్కువ స్థాయిలో నిలబడివుంది. ఆమెను ప్రేమించిన నాయకుడు, ఆమెను ప్రేమించలేని పక్కింటి అరవవాళ్ళ అమ్మాయిని మనస్ఫూర్తిగా ద్వేషించి, ఆ మంగిని తనవలెనే ప్రేమించగల పద్మను మనస్ఫూర్తిగా ప్రేమించగలడు. మంగిని ప్రేమించలేక

పోవడం తోటి మనిషిని అందుకు అబల, అనాథ అయిన వ్యక్తిని ప్రేమించ లేకపోవడం అంటాడు. అలానే ఆయన చాలా వ్యక్తిగత సమస్యలను గురించి వ్రాశాడు. 'కురూపి', 'లేచిపోయిన మనిషి' వంటివి ఇట్టినవలలు.

ఈయన నవలల్లో జాతీయోద్యమ ప్రభావం ఒక కుటుంబం మీద ఎలా పడిందో, దాని ఫలితాలేమిటో వివరంగా చిత్రింపబడ్డ "చదువు" చక్కని నవల. జాతీయోద్యమాన్ని అటు మెచ్చుకొనే వారి దృష్టినుంచీ, ఇటు అసహ్యించుకొనే వారి దృష్టినుంచీ కూడా ఆ సమస్యను చూచి వారి అభిప్రాయాలను యిందులో వ్యక్తీకరించాడు.

పాత్రచిత్రణలో కుటుంబరావు ఎన్నో పోకడలు పోయాడు. సాధారణంగా ఒక సంఘటనను, ఒక సమస్యను చిత్రించవలసి వచ్చినప్పుడు ఆయన అవలంబించే పద్ధతి యిది: ప్రతి సమస్యకు ముఖ్యంగా రెండు దృక్పథాలు ఉంటాయి. ఆ రెండు దృక్పథాలకు ప్రతినిధులుగా ఇద్దరు పాత్రలను సృష్టించు కొంటారు. వారి వారి సంభాషణల్లోను, నవల చివర ఆ సమస్యను పరిష్కరించినప్పుడు రచయిత ఎటు మొగ్గు చూపుతారో తెలిసినప్పుడు ఆ సమస్యకు రచయిత ఎలాటి పరిష్కారాన్ని ఆశిస్తున్నారో మనకు తెలుస్తుంది.

ఏదో ఒక శైలిలో వ్రాయాలని కుటుంబరావు ఎన్నడూ ప్రయత్నించడు. పెద్ద పదాలను వాడాలని, వర్ణనలూ అవీ ఉండాలనీ ఎన్నడూ ఆలోచించడు. శిల్పాన్ని గురించి చెబుతూ, ఏమీ శిల్పం లేకపోవడమే గొప్ప శిల్పం అన్న సూక్తి జ్ఞాపకం వస్తుంది కుటుంబరావు నవలలు చదువుతూవుంటే. మనం మన చుట్టూవున్న ప్రపంచాన్ని గురించి మనలో మనమే అనుకొనే భావాలకు రూప చిత్రణ చేస్తాడు కుటుంబరావు. అంతే!

అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం
అన్నమయ్యవీధి. గుంటూరు-



కుటుంబరావులో వున్నంత వ్యంగ్యం చాల కొద్దిమంది రచయితల్లో మనకు గోచరిస్తుంది. ఇంత సునిశితమైన వ్యంగ్యం విశ్వనాథ, చలంలలో మనకు కనిపిస్తుంది. కానీ అవి ఎవరిని ఉద్దేశించి వ్రాశారో వారు ఆ వర్గంవారు చదివితే వారికి కోపం రావడమో, మొహాలు నెల వెలాపోవడమో జరుగక తప్పదు. కాని కుటుంబరావులో వ్యంగ్యం అతిసున్నితమైనది. ఎవరిని ఉద్దేశించి వ్రాయబడ్డదో వారు ఈ మాటలు వింటే సంతోషంతో తల ఊపేటంత చక్కగా వుంటాయి

"కనకం బస్సుకోసం ముళ్ళమీద నించున్నాడు. పట్నంలో బస్సులకోసం ఇంకో విధంగా నుంచోవటం సాధ్యంకాదు. తమిళ సోదర సోదరీమణులు తపశ్శక్తి సంపన్నులు కావటం చేత కాబోలు ముళ్ళమీద నుంచున్నా బాధపడరు. తెలుగువాడి కాశక్తిలేదు."

తమిళులను గురించి ఒక్క ముక్కలో ఎంత విమర్శ!

మనిషికీ, మనిషికీ మధ్యవుండే అతిసాధారణమైన సంబంధాలను వ్యక్తీకరిస్తాడు కుటుంబరావు. బస్సులో ఒకమ్మాయి తన్ని చూచి గుర్తుపట్టి నవ్వితే, తాను గుర్తుపట్టక మొహం చిట్లించాడు. మళ్ళీ అమ్మాయివంక చూస్తే ఆమె అతనికేసి చూడదు. కోపం వచ్చినట్టుంది అనుకున్నాడు అతను.

"మనుషులకు మాట్లాడే శక్తి లేకపోయినప్పటికీ ఒకరి నొకరు మానసికంగా హింసించుకోగలరన్న మాట. ఈ పని పశువులు చేయలేవు. దేర్‌ఫోర్, ఒకరి నొకరు మానసికంగా హింసించుకునే శక్తి కూడా పరిణామం ద్వారానే మనుష్యులకు సంక్రమించింది.!"

ఇలాంటివి యీయన రచనల్లో కోకొల్లలు. కుండ బద్దలు కొట్టినట్టు మాట్లాడే మనుష్యులు, వెకిలి వెకిలి మనుష్యులు-అందరూ కనిపిస్తారు. వీరందరికీ వెనక సూత్రం పట్టుకొని ఆడించే సూత్రధారుడి

లాగ కుటుంబరావు మాత్రం ఎక్కడా కనిపించడు. అప్పుడప్పుడూ చేసే ఈ వ్యంగ్య, హాస్య వ్యాఖ్యల ద్వారా మాత్రం తప్ప!

ఈయన హాస్యమూ, వ్యంగ్యమూ కూడా నిష్కల్మషంగా వుండి హాయిగా ఎక్కడో మనస్సులో ఆయన వ్యంగ్యంగా విమర్శించిన విషయం మీద తిరస్కృతితో సహా నవ్వుకోవడానికి, పనికి వస్తుంది. సంఘ సంస్కరణ ఉద్యోగాన్ని ఎక్కడా స్వీకరించడు కుటుంబరావు.)

(బుచ్చిబాబు వ్రాసింది ఒకే ఒక్క నవల "చివరకు మిగిలేది" అదికాక పెద్ద కథలు - లేదా నవలికలు అనదగ్గవి దాదాపు ఇరవై వరకు వ్రాశాడు. "చివరకు మిగిలేది" ప్రతి యువకుడూ ఈనాడు సాగించే తాత్త్వీక ఆలోచనల పర్యవసానం. మానసిక శాస్త్రం వెలువరించిన అన్ని సిద్ధాంతాలు, అన్ని పద్ధతులూ ఇందులో ఇమిడ్చాడు బుచ్చిబాబు. వాటిని గురించి ఆలోచించి, వానిని తనకు కావలసిన విధంగా మలుచుకున్నాడు ఆయన.

'చివరకు మిగిలేది' లోని ప్రధాన వస్తువు 'ఈడిపస్ కాంప్లెక్స' అన్న సమస్య. దానిని ఆధారంగా చేసుకొని ఒక యువకుడి జీవితంలోని వివిధ సమస్యలను చర్చించి, జీవితానికి అర్థం ఏమిటి అన్న ప్రశ్నకు సమాధానం కోసం నిరంతరం ఆలోచించి జీవితం అంటే అనుభవాల జ్ఞాపకాలన్న సమాధానం చూపుతాడు.

ఇందులో ప్రధాన వస్తువుగా ఫ్రాయిడ్ చాలచోట్ల చిత్రించిన ఈడిపస్, కాంప్లెక్సును ఎలాస్వీకరించాడో, అలానే కథాకథనంలో కూడా ఫ్రాయిడ్ ద్వారా సాహిత్య రంగంలో చిరస్థాయిగా నాటుకొని పోయిన మనోవిశ్లేషణ, అంతర్ద్వంద్వమూ, అంతర్ ప్రేరణ వంటి అన్ని సాధనాలనూ తన నవలలో వాడుకొన్నాడు.

దీనికి తోడుగా ఆయన భారతీయ అధ్యాత్మికతను కూడా జోడించి, ప్రాక్ పశ్చిమ సిద్ధాంతాలను సమన్వయం చేయడానికి సంకల్పించాడు.

బుచ్చిబాబు తన నవలలో ప్రయుక్తం చేసిన అంతర్ ప్రేరణ, న్యూరోసిస్ వంటి సిద్ధాంతాలు ఈనాడు సిద్ధాంతాలుగా ఇతర రచయితలు స్వీకరించ నప్పటికీ వానిని తమ నవలల్లో ప్రయుక్తం చేస్తూనేవున్నారు.

బుచ్చిబాబు అన్ని రచనలను, ముఖ్యంగా 'చివరకు మిగిలేది' లోను ఆయన ప్రయుక్తం చేసిన భాష విషయంలో చాల మంది అపోహలు వ్యక్తం చేశారు. కొందరు ఈ నవలలోని భాష అంతా ముందు ఇంగ్లీషులో భావించి తరువాత దానిని తెలుగులోకి తర్జుమా చేసినట్లు ఉంటుందన్నారు. ఇంగ్లీషు భాషలోని వాక్యనిర్మాణం విధానం బుచ్చిబాబు మీద చూపిన ప్రభావాన్ని ఎవ్వరూ కాదనలేరు.

కొడవటిగంటివలె, గోపీచంద్ వలె, బుచ్చిబాబు కూడా మానవతా వాది. మానవుడికీ మానవుడికీ మధ్యవచ్చే సంఘర్షణలను తగ్గిస్తే మనుష్యులింకా ఎక్కువ హాయిగా జీవించగలరన్న ఆశఉన్నవాడు. అందువల్లనే వ్యక్తులు ప్రేమించ లేకపోవడానికి కారణం ఏమిటో ఈ నవల అంతటా అన్వేషించాడు. సమాజానికి సమాజానికిగల వ్యత్యాసమూ, ఈర్ష్య, మానవులమధ్య ఈర్ష్యకు, అసహనానికిగల కారణంగా పేర్కొన్నాడు బుచ్చిబాబు. అందువల్లనే ఈ సమస్యని తరిచి, రాయలసీమ వారికీ, సర్కారు జిల్లావారికి గల మనస్పర్థలని మానసిక శాస్త్రం దృష్ట్యా, మానవతావాదం దృష్ట్యా పరిశీలించి తన రచనను చేశాడు. అందుకే తన నవలకు వ్రాసిన సమర్పణలో -

"ఆర్థిక, సాంఘిక, చారిత్రక వ్యత్యాసాల కతీతమై మనిషినీ మనిషినీ స్నేహపాశంలో బంధించివేసే మానవత్వం యొక్క శక్తుల్ని

తరచి చూచినప్పుడు ఆ దృశ్యాన్ని తన్మయతతో అనుభవించగలం. కాని ఆ అనుభవాన్ని మాటల్లో చెప్పలేం. ఈ జీవిత రహస్యం, దాన్ని తెలుసుకోవడానికి మానవుడు చేసే యత్నం ఏ గొప్ప గ్రంథానికైనా ఇవి పునాది. ఈ నవలకీ అదే పునాది'' అంటాడు. అందుకే 'చివరకు మిగిలేది' గొప్ప నవల.

''జీవించినన్నాళ్లు నిశితజిజ్ఞాసతో, సత్యాన్ని వెతుకుతూనే వున్నాడు. ఊపిరున్నంతవరకు తాను నమ్మిన సత్యాన్ని వెన్నెల జల్లుగా వెదజల్లుతూనే ఉన్నాడు'' అన్నారు గోపీచంద్‌ను గురించి శ్రీ ఆవుల సాంబశివరావుగారు. ఈ మాటలు అక్షరాలా నిజం. ''ఎందుకు ?'' అన్న జిజ్ఞాసతో జీవితాన్ని ప్రారంభించి ''ఇందుకే !'' అన్న సమాధానంతో జీవితాంతాన్ని శాంతంగా వెదుకుకున్న కళా జీవి ఆయన.

ఈ జిజ్ఞాసా మార్గాన పయనించిన గోపిచంద్ ముందు హేతు వాదం, తరువాత మానవతావాదం, తరువాత ఆధ్యాత్మిక వాదం అన్న మజిలీలు చేరుకొన్నారు. సాహిత్య జీవితంలో, తాత్త్విక దృక్పథాన్ని సమన్వయం చేసిన మేధావి ఆయన. ప్రతికొత్త ప్రక్రియనీ ఒకసారి ప్రయత్నించి చూడడం నైజంగా పెట్టుకొన్న గోపీచంద్ ఫ్రాయిడ్‌ను అనుసరించి కూడా కొన్ని కథలు వ్రాశారు. రాజకీయాలను గురించి వ్రాశారు. తత్త్వశాస్త్ర విషయాలను వ్రాశారు. వానిని అన్నింటినీ కలిపి నవలలుగా వ్రాశారు.

ఈయన మొట్టమొదట కథలు వ్రాయడానికే ఎక్కువ మొగ్గు చూపారు. అసంఖ్యాకమైన కథల మధ్య రెండే రెండు నవలలు వ్రాశారు మొదటిదశలో: పరివర్తన. అసమర్థుని జీవయాత్ర. తరువాత అరవిందుల దర్శనంతో ఆయన జీవితం కొత్త మలుపులు తిరిగింది. ఆ తరువాత తన భావాలను చిన్న విస్తృతికల కథానికకు పరిమితం

చేసుకోలేక ఎన్నో నవలలను వ్రాశారు. ఒక నవల వ్రాస్తూ పూర్తి చేయకుండానే మరణించారు.

ఈ కాలంలో వారు వ్రాసిన నవలలు: మెరుపుల మరకలు, పిల్ల తెమ్మెర, గడియపడిన తలుపులు, పండిత పరమేశ్వరశాస్త్రి వీలు నామా, ప్రేమోపహతులు, శిథిలాలయం, చీకటి గదులు, యమ పాశం.

వీటి అన్నిటిలోను నార్ల వెంకటేశ్వరరావుగారు అన్నట్లు "మూలతత్వ విచారణకై ప్రయత్నం కనబడుతుంది... జీవితమే ఆయనకు సాహిత్యం. సాహిత్యమే జీవితం.

గోపీచంద్ మొదటి నవల 'పరివర్తన'. ఇందులో రాజారావు భార్య చనిపోయినతర్వాత ఆ వియోగంలో హృదయ దౌర్బల్యంతో బాధపడుతూ వుంటాడు. అతనికి ఆ వేదనలోనే సుఖం ఉందా అని పిస్తుంది. భావకవులు నేర్పిన 'విరహానందం' అతనికి నచ్చింది. ఆ స్థితి తప్పించుకొనితిరగడమేకాని, పలాయనవాదమేకాని,దీనివలన సంఘం లోని సమస్యలు కాని, వ్యక్తి సమస్యలు కాని పరిష్కారంకావు. అందుకే అతడు తిరిగి కుటుంబ జీవితం వైపుకు దృష్టినిలిపి పెళ్ళి చేసుకుని సుఖిస్తాడు. ఈ పరివర్తన ఈ కథకు మూలం.

ఇందులోనూ, తరువాతి నవలఅయిన "అసమర్థునిజీవయాత్ర" లోనూ కూడా శుష్క సిద్ధాంతాలవల్ల, ఆలోచనలవల్ల ఏవిధమైన ప్రయోజనమూ లేదన్నది గోపీచంద్ చెప్పదలుచుకొన్నారు. రాజా రావు పరివర్తనపొంది సుఖిస్తాడు. ఆ పరివర్తన యేమిటో తెలుసుకో లేని సీతారామారావు మరణిస్తాడు.

"మెరుపుల మరకలు" గోపీచంద్ ఆధ్యాత్మిక దృష్టిని అలవరచు కొన్న తరువాత వ్రాసిన మొదటి నవల. ఇందులో 'ఉషారాణి'

పాత్ర ముఖ్యమైంది. ఆమె అతిలోక సౌందర్యవతి. జీవితాన్ని శారీరికానందాన్వేషణగానే సాగించింది. కాని అంత కంతకు ఆమెకు అతృప్తి. శ్రీకాంతవంటి యువకుల దగ్గరనుంచి చంద్రవదనుల వారి వరకు సమ్మోహితులైన తన అందం, శారీరకవాంఛ ఆమెకు గమ్యాలుగా కనిపించలేదు. ప్రకృతి, కళ, శిల్పం ఇవి ఆమె మనసుకు కొంత తృప్తిని యిచ్చినవి. ఆనాటి ఉద్వేగాల వెల్లువలనుంచి ఈనాటి స్వచ్ఛంద శాంతి మయ జీవితానికి ఆమె పరివర్తనే ఆమెకు జీవితంలోని కొత్త మలుపులకు కారణమైంది.

''పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా'' కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి నందుకొన్నది. ''పోస్టుచెయ్యని ఉత్తరాలు''లో గోపీచంద్ ఏ తాత్త్విక దృక్పథాలను వెలువరించారో వానికి నవలారూపం ''పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా''. ఆధ్యాత్మిక, భౌతిక వాదాల సమన్వయం యిందులో మనకు ద్యోతకం అవుతుంది. ఈ సమన్వయం కేశవమూర్తి పాత్ర ద్వారా చూపారు గోపీచంద్. కేశవమూర్తి రచయిత, రాజకీయవాది, మానవత్వం మీద నమ్మకం ఉన్నవాడు; ఆధ్యాత్మికత యెడ అభినివేశం వున్నవాడు. తాను నిరంతరం జీవించే రాజకీయాలను మార్పుచేయడానికి పూని అది వృథాశ్రమ కావడంవల్ల ఆధ్యాత్మికతలోని లోతులు తరచి చూచినవాడు. ''మతిమంతులు (వలయాల్లో తిరిగుతూ వున్నవారు) తమ తమ వలయాలను అధిగమించి అన్ని వలయాలను, అన్ని పరిస్థితులను సమన్వయ పరచుకొని, పురోగమనానికి దోహదం చెయ్యగలిగిన శక్తిని పెంపొందించుకోవాలి. ఈ శక్తి మనస్సుకులేదు. ఇందుకు మానవుడు మనస్సుపైన వున్న అంతస్థులను చేరుకోవాలి'' అంటారు.

'గడియపడని తలుపులు'లోని కోటేశ్వరమ్మ, 'మెరుపుల మరకలు' లోని ఉషారాణి చాలా దగ్గరివారు.

ఇలా గోపీచంద్ తన నవలలన్నింటిలో తాత్త్వికంగా ఆలోచించి, తద్వారా భౌతిక వాదానికి, ఆధ్యాత్మిక వాదానికి సమన్వయం స్థాపించడానికి వీలైన నూత్న దృక్పథాన్ని తెలుగు పాఠకులకు అందించారు. ఆదర్శాలు ఆచరణలోకివస్తే కాని వానికి శాశ్వతత్వం ఏర్పడదని గోపీచంద్ నిర్ధారణ.

జి. వి. కృష్ణారావుగారి ''కీలుబొమ్మలు'' కూడా ఈకాలంలో వచ్చిన ఉత్తమమైన నవలలలో ఒకటి. స్వాతంత్ర్యానంతరం వచ్చిన నవలల్లో ముఖ్యమైనది. ఈ నవలలో కూడా మనస్తత్వ పరిశీలన ఉత్తమంగా సాగింది. పుల్లయ్య అన్న ఊరి పెద్ద జీవితం యిది. భోజర్ అన్న రచయిత వ్రాసిన ''The Power of a Lie'' అన్న గ్రంథం ఈ నవలకు కావలసిన అభిప్రాయాన్ని ఇచ్చింది. ఈ నవలలో కూడా ''అబద్ధం యొక్క శక్తి'' ఎంతో క్రమబద్ధంగా నిరూపింపబడ్డది. పుల్లయ్య తాను జీవితంలో పరధ్యానంగా ఉండగా ఆడిన ఒక అబద్ధాన్ని నిలబెట్టుకోవడం యీ నవలలో ప్రధానమైన కథావస్తువు.

ఇది నిరూపించడానికి అడుగడుగునా పుల్లయ్య మనస్తత్వం నిరూపించక తప్పదు. అందువల్లనే మనోవిశ్లేషణ, Motivation యీ రెండూ యీ నవలలో అద్యంతమూ ఎంతో ప్రతిభావంతంగా ప్రయుక్తం చేయబడ్డాయి.

ఈ నవల స్వాతంత్ర్యానంతరం వున్న తెలుగు గ్రామీణ జీవితాన్ని యథాతథంగా చిత్రిస్తుంది. రాజకీయాలు, ఎత్తుగడలు, ఒకళ్ళనొకళ్లు హింసించుకోవడం ఇవన్నీ కూడా దీనిలో ముఖ్యమే! రామారావు వంటి సత్యవాది తన తండ్రి చేసిన అన్యాయాన్ని కోర్టులో చెప్పడానికి సిద్ధపడతాడు కాని అతని తండ్రి అతన్ని

మరొక నేరానికి పోలీసులకు వప్పచెబుతాడు. ఇవిఅన్నీ ఈనాడు పల్లెటూళ్ళలో నిత్యమూ జరిగే సంఘర్షణలు.

ఈ నవలలో విశేషం రచయిత తానుగా ఎక్కడా కనిపించక పోవడం. ఇంత పెద్ద నవలలో ఎక్కడో ఒక చోట రచయిత తానుగా పాత్రలను విమర్శించడమో, కథను నడిపించడమో చేస్తాడు. వ్యాఖ్యానిస్తాడు. కాని రచయిత దూరంగావుండి తన పాత్రల చేతనే కథనంతా నడిపిస్తాడు. పాత్రల మీదవ్యాఖ్యానాలు పాత్రలేచేస్తాయి. తనకేమీ సంబంధం లేనట్లు వారినందరినీ రంగం మీద నిలిపి మీమీ పనులు మీరు నిర్వర్తించడని రచయిత చెబుతున్నట్లుంటుంది, ఈ నవలలో.

మనిషి తన మనసులోని ఆలోచనలకు ఎంతలొంగిపోతాడంటే తాను ఆడిన అబద్ధం అబద్ధంకాదని, తాను ఆ మాటె అనలేదని ఇందులోని ప్రధాన పాత్ర తన్నుతాను నమ్మించుకొనేవరకు. ఆత్మవంచనకు పరాకాష్ట ఇదే!

ఈ నవలను వ్యాఖ్యానాత్మకమైన నవల అనవచ్చు. సమకాలీన సమాజం మీద వ్యాఖ్యగా వెలువడిన నవలలలో ఇంత శక్తిమంతమైనది లేదు.

ఈ కోవకు చెందిన రచనలలోచివరిది రాచకొండ విశ్వనాథ శాస్త్రి వ్రాసిన ''అల్పజీవి''. ఇది కూడా మనోవైజ్ఞానికతను సాహిత్యంలో ప్రయుక్తం చేసిన నవలే! ఇందులోని ముఖ్యపాత్ర యొక్క ప్రవృత్తి ఆడ్లర్ అన్న మనోవైజ్ఞానికవేత్త ప్రతిపాదించిన ''Inferiority complex'' కు సంబంధించినది. సుబ్బయ్య ఈ ప్రవృత్తితో బాధ పడతాడు. దానిని కారణం అతనిగతం. గతం వర్తమానంమీద అధికారం చెలాయించడం ఇందులో అడుగడుగునా కనిపిస్తుంది. సుబ్బయ్యపై అందరూ అధికారం చెలా

యిస్తారు. బావమరిది, భార్య, గవరయ్య అందరూ ఈ అధికారానికి ప్రతినిధులు. ఒక్క మనోరమ అతన్ని ఓదార్చి జీవితం మీద ఆశను నిలబెడుతుంది.

ఇందులోని కథా కథనం కూడా మనసత్వాత్మకమైనది. దీనిని అంతర సంభాషణ (Interior monologue) అంటారు. పాత్ర తనలో తానే వితర్కించుకొని, తనకుతానే ప్రశ్న వేసుకొని సమాధానాలు చెప్పుకోవడం, తద్వారా పాత్ర చిత్తవృత్తిని తెలియచేస్తూ, కథను నడపడం ఇందులో ముఖ్యమైన శిల్పం. దానిని అత్యుత్తమంగా నిర్వహించారు శ్రీశాస్త్రి.

మనస్తత్వ శాస్త్రంలో ఏదో ఒక సిద్ధాంతాన్నో, పద్ధతినో తమ రచనల్లో ప్రయుక్తం చేసిన మరికొందరు రచయితలను యిక్కడ పేర్కొనడం అప్రస్తుతం కాదు.

బలివాడ కాంతారావు "గోడమీది బొమ్మ", "బూచీ" "సుగుణ" వంటి నవలల్లో మానవత్వంలోని ఆర్ద్రతతోపాటు తోటి వారు కొందరు వ్యక్తుల్ని కించపరుస్తున్నట్లుగా చూడడం ఎంతో కదిలించేటట్లు వ్రాశారు. ఈయన నవలలన్నింటిలో ధనవంతుడైన మంచివారిలో, లేనివారిలోవుండే అణకువ, మర్యాద; ధనవంతులు, అందమైన వారు అయిన స్త్రీలలోవుండే గర్వం చక్కగా వ్యక్తం అవుతాయి.

భాస్కరభట్ల కృష్ణారావు 'నవీనత' ను నిత్యమూ కోరినవాడు. ఆయన వ్రాసిన "యుగసంధి" లో రాజకీయాల ప్రసక్తివుంది. కాని "విచిత్ర ప్రణయం" లో స్త్రీ పురుషుల సంబంధాన్ని, "వెల్లువలో పూచిక పుల్లలు" లో బెర్గ్‌సన్ కాలానికి ఇచ్చిన నిర్వచనాన్ని కథా రూపంలో చూపడానికి ప్రయత్నించాడు. అంతేకాదు. ఇందులో Existentialism ను దాని ప్రాధాన్యతను చూపాలని ప్రయత్నం

చేశాడు కృష్ణారావు. కాని ఇతర దేశాలలోని సాహిత్యంలో ప్రయుక్తం అయిన Existentialism ఆదర్శవాదానికి యదార్థ వాదానికి చేసిన సమన్వయం యిందులో కనిపించదు.

ఆర్. యస్. సుదర్శనం తన "మళ్ళీవసంతం" అన్న నవలలో ఫ్రాయిడ్ ప్రతిపాదించిన స్వప్న సిద్ధాంతాలను కథాశిల్పానికి వీలుగా చక్కగా మలుచుకొన్నాడు. ఊర్మిళ అన్న డాక్టరు జీవితంలో తటస్థ పడ్డ ముగ్గురు వ్యక్తులు-భూషణం, మాధవ్, శేఖర్ వారి వారి జ్ఞాపకాలు, ఆమెకు వచ్చిన ఊహలకూ స్వప్నానికీ వున్న సంబంధం, ఇవి అన్నీ ఫ్రాయిడ్ నిర్దేశించిన సుప్త చైతన్యం ద్వారా వెలికి తీసుకొనివచ్చే ప్రయత్నంచేసి, కృతకృత్యులైనారని చెప్పవచ్చు.

ఈ తరువాతి కాలంలో వచ్చిన నవలలో చైతన్య స్రవంతి-ఒక భావం తరువాత, ఆలోచన తరువాత దానికి సంబంధించిన అనేకమైన ఆలోచనలు ఒక దాని తరువాతఒక టివచ్చి మనస్సును ఆకట్టుకోవడం-సాధారణమైన శిల్పవిశేషంగా ఏర్పడిపోయింది. అలానే పాత్ర చిత్రణలో మనోవిశ్లేషణ కూడా సామాన్యమైపోయి, పాదులు తొక్కుకున్నది.

ఇవి రెండూ మనస్తత్వ శాస్త్రం ఆధునిక నవలా సాహిత్యానికి ఇచ్చిన వరాలు. అదివరకు యీ మానసిక విశ్లేషణ లేదా అనవచ్చు. కాని ఈనాడు వున్నంత Consciuos గా ఏనాడూ మనస్సులో నిత్యమూ జరుగుతున్న సంఘర్షణకు అక్షరరూపం ఇవ్వలేదు రచయితలు.

ఈ యుగాన్ని మనోవిశ్లేషణ యుగం అన్నాం. ఇది 1956 తో అంత మవుతుంది అన్నాం. కాని ఆ రెండూ చాలా స్థూలమైన విభజన మాత్రమే ! ఎందువల్లనంటే మనోవిశ్లేషణాత్మకమైన రచనలే కాక ఈ కాలంలో అనేకములైన యితర విధాలైన నవలలు కూడా

వచ్చాయి. నిజానికి ఇతర నవలలే అధిక సంఖ్యలో వున్నాయి. కాని ఆ యుగంలోని ప్రత్యేకత అది కనుక దానికాపేరు పెట్టడం సమంజసంగా వున్నదనుకుంటాను.

కాగా, ఈ యుగం 1960 తోనే అంతం కావాలన్న నియమం లేదు. కనుక మిగిలిన రచనలను గురించి వివేచనచేసే సమయంలో ఈ రెండు యుగాలను కలిపే మనం వివేచన చేయవలసి వుంటుంది. కాని ఈ తరువాతి యుగానికి పోకముందు, ఈ యుగంలో నవలా రచన ప్రారంభించిన వారిని గురించి మనం తెలుసుకోవడం అవసరం.

వారిలో చారిత్రక నవలా రచయిత లున్నారు; సాంఘిక నవలా రచయిత లున్నారు. ముందు ఈ కాలంలోని చారిత్రక రచయితల్లో అగ్రగణ్యుడైన శ్రీ నోరి నరసింహశాస్త్రిగారిని గురించి చెప్పుకోవాలి.

శ్రీ నోరి నరసింహశాస్త్రి భావకవిత్వం రోజుల్లో కలంపట్టినవాడు. సాహితీ సమితిలో ఉత్సాహంగా పనిచేశాడు. కాని ప్రస్తుతః సంప్రదాయబద్ధమైన సాహిత్యం అంటే గౌరవం వున్నవాడు (Classicist). ఈయనకు భారత దేశం అన్నా, తెలుగుకవిత్వ మన్నా అత్యంతమైన ఆసక్తి. ఈ రెంటినీ జోడించి తెలుగు మహాభారత రచయితలైన నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రగడలను గురించి, వారి కాలాలను గురించి, ఆ కాలంలోని ఆచారవ్యవహారాలను గురించి పరిశోధనలు చేశాడు. ఆ పరిశోధనల ఆధారంగా నవలలు వ్రాశాడు.

ఈయన ఐతిహాసిక నవలలను వ్రాయడం స్వాతంత్ర్యానంతరమే మొదలు పెట్టారు. దీనికి కారణంగా "నిత్యనూతనమై యచంచలమగు భారత ధర్మము మన దేశమును ఇప్పుడు మరల నావేశించినది." అన్నారు నోరి. "భారత ధర్మము ఏయే కాలముల నెట్లు విజృంభించినదో వర్ణించుటచే ఈ నవలలు వ్రాయుట కుద్య

మించుటకు ప్రధాన కారణము" అని వారు చెప్పుకోవడం చూస్తే భారత ధర్మాన్ని, తెలుగు చరిత్రను జోడించి రచనలు చేశారని తెలుస్తున్నది. అంటే తెలుగు చరిత్రలో భారత ధర్మాన్ని నిలబెట్టడానికి ఏయే సంఘటనలు జరిగాయో వానిని నవలలుగా వ్రాయడం వారి ధ్యేయం అని వ్యక్తం అవుతున్నది.

కవిత్రయంవారి కాలాలను చిత్రిస్తూ వారు ''నారాయణ భట్టు'', ''రుద్రమదేవి'', ''మల్లారెడ్డి'' అన్న నవలలను వ్రాశారు. ''నారాయణభట్టు'' 11 వ శతాబ్దంలో నన్నయ మహాభారతం వ్రాయడం, ఆయనకు నారాయణభట్టు సహాయంచేయడం, రాజరాజు కవితా ప్రేమ వెల్లడి చేస్తుంది.

తరువాతి నవల రుద్రమదేవి కాకతీయ సామ్రాజ్ఞి అయిన రుద్రమ కథ. 13 వ శతాబ్దానికి చెందినది. ఇందులో ఇంతవరకు చరిత్రకెక్కని విషయాలు ఎన్నో వున్నాయి. రుద్రమ భర్త వీరభద్రేశ్వరుడే ఆమెకు వ్యతిరేకంగా పన్నుగడలు పన్నడం ఈ నవలకు కొంత ఆధునికత్వాన్ని ఆపాదిస్తున్నది. ఈనాటి రాజకీయాలకు, ఇందులో వర్ణించిన పన్నుగడలకు దగ్గరితనం గోచరిస్తున్నది.

14 వ శతాబ్దానికి చెందిన నవల 'మల్లారెడ్డి'. రెడ్డి ప్రభువుల ధర్మదీక్షను ఇందులో ఎంతో ఆత్మీయంగా వర్ణించాడు రచయిత.

నోరి వారు వ్రాసిన తరువాతి నవల ''కవిసార్వభౌముడు'' విద్యానగరానికి శ్రీనాథుడు బయలుదేరి డిండిమభట్టు కంచు ఢక్కను పగులగొట్టించిన గాథను వర్ణించినది.

ఇటీవలి రచన ''కవిద్వయము'' శ్రీనాథ, పోతనల కథను, వారి బాంధవ్యాన్ని, వారి కవిత్వంలోని అంతరాన్ని సూచించే నవల.

నోరి వారు తమ నవలా రచనలలో ప్రత్యేకమైన పరిశోధనను చేశారన్నది ఈ నవలలు చదివితే మనకు అర్థం అవుతుంది. మహాభారతాన్ని, ఈ కవులు వ్రాసిన అన్ని రచనల్నీ సమగ్రంగా చదివి, ప్రతి పాదమూ ఎంతో జాగ్రత్తగా పరిశీలించి ఈ గ్రంథాలు వ్రాసినట్లు తోస్తుంది.

ఆయన ఏ ధ్యేయంతో ఈ ఐతిహాసిక నవలా రచనకు ఉపక్రమించారో అట్టి ఆనాటి భారత ధర్మాన్ని పునర్నిర్మించడంలో కృతకృత్యులైనారనే చెప్పాలి.

ఈ కాలంలో వచ్చిన చారిత్రక నవలలో తెన్నేటి సూరి వ్రాసిన ''చంఘిజ్ ఖాన్'' కూడా ఎన్నదగినది. మంగోలు జాతి జీవితమూ, చంఘిజ్ ఖాన్ సాహసకృత్యాలు కన్నులకు కట్టినట్లు చిత్రించాడు ఇందులో. గోబీ ఎడారి వాతావరణమూ, మంగోల్ జాతీయుల జీవితవిధానమూ ప్రస్ఫుటంగా చిత్రించబడిన యీ నవలకు తెలుగు చారిత్రక నవలా సాహిత్యంలో అగ్రస్థానం వున్నది.

ఇదే కాలంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం చారిత్రక నవలా రచనకు ఎంతో తోడ్పడింది. ఇంటర్మీడియేట్ విద్యార్థులకోసం తెలుగు చరిత్రమీద వ్రాసిన ఉత్తమ గ్రంథానికి 2000 రూ॥ల బహుమానం ఆ విశ్వవిద్యాలయం ప్రకటించింది.

ఈ పోటీలలో విజేతలయిన నవలలో కుమారి మల్లాది వసుంధర వ్రాసిన "తంజావూరి పతనము" ''సప్తపర్ణి''; పాటిబండ మాధవశర్మ వ్రాసిన ''రాజశిల్పి''; ధూళిపాళ శ్రీరామమూర్తి వ్రాసిన ''భువనవిజయము" ముఖ్యమైనవి.

ఈ నవలలలో భాష అతి క్లిష్టమైనది. చరిత్రకన్న కల్పన అధికమై చారిత్రక నవలలగాకన్న కల్పనాత్మక నవలలుగా ప్రఖ్యాతి వహిస్తున్నాయి.

ఈ చారిత్రక నవలల తరువాత పేర్కొనదగిన నవలలు సాంఘి కాలు. ఈ సాంఘిక నవలల్లోకూడా సంఘాన్ని అనేక దృక్పథాల నుంచి పరిశీలించి వ్రాయబడిన నవలలు యీ కాలంలో ఎక్కువగా వచ్చాయి. ఈ దృక్పథాలు, వీరు నిర్మించిన యితివృత్తాలు పరిశీలిస్తే రచయితలలో సంఘాన్ని గురించి చేసే ఆలోచనలలోని మార్పు గోచరిస్తుంది.

సాంఘికమైన సమస్యలను చిత్రించిన నవలలు యీ కాలంలో పుంఖానుపుంఖంగా వెలువడ్డాయి. వాని అన్నింటిలో రావూరి సత్యనారాయణరావు వ్రాసిన ''నెలవంక'' ఒక చక్కని నవల. మతాంతర వివాహాలను గురించి, దాని లోటుపాట్లనుగురించి వ్రాయ బడ్డ యీ నవలలో ప్రధాన పాత్ర అయిన ఒక మహానటుడిపాత్ర అత్యంత రమణీయంగా చిత్రించబడ్డది.

ఈ కాలంలోని రాజకీయ నవలల్లో చెప్పుకోదగ్గది బొల్లి ముంత శివరామకృష్ణ వ్రాసిన ''మృత్యుంజయులు''. ఇది నైజాం దేశంలో ఆ నవాబు పాలనలో ప్రజలు పడిన పాట్లను, రజాకార్ చర్యలను వివరంగా వర్ణించిన నవల. ఇదే కాలంలో కీర్తిశేషులు వట్టికోట ఆళ్వారుస్వామి ''ప్రజలమనిషి'' అన్న నవలలో తెలంగాణా విమోచనోద్యమంలోని ఒక నాయకుణ్ణి గురించి వ్రాస్తూ ఆనాటి స్థితిగతులనూ, రాజకీయాలను కన్నులకు కట్టినట్లు చిత్రించారు. ఆయనే తరువాత వ్రాసిన ''గంగు'' కూడా తెలంగాణా ప్రజా జీవితాన్ని చిత్రించే మనోహరమైన నవల.

పోతుకూచి సాంబశివరావు వ్రాసిన ''ఉదయ కిరణాలు'' ఆంధ్ర పత్రిక పోటీలలో ప్రథమ బహుమతినందినది. సమకాలీన జీవిత చిత్రణ యిందులో ధ్యేయమని రచయిత వ్రాశారు. నిజానికి 1956 నుంచి వచ్చిన నవలలలో తమచుట్టూవున్న జీవితాన్ని, అందులోని శక్తుల్ని చిత్రించడమే ప్రధానమైనదని చెప్పుకోవాలి.

సమకాలీన నవలలు :

గత పది పదిహేను ఏళ్లుగా తెలుగు నవలలో ఒక కొత్త మలుపు వచ్చిందని చెప్పవచ్చు. ఈ మార్పు అటు గుణంలోను ఇటు సంఖ్యలోనుకూడా కన్పిస్తున్నది. దీనికి కారణం వారపత్రికలు, మాసపత్రికలు, నవలల పోటీలను ఏర్పాటు చేయడం; చదువుకున్న పాఠకుల సంఖ్య ఎక్కువ కావడంతో వారికి విశ్రాంతి సమయంలో చదువుకోవడానికి కొంత సామాగ్రిని అందివ్వడం. ఈ చదువుకొన్న వారిలో ఎక్కువమంది మధ్యతరగతికి చెందినవారు. ఇందులో ఇంటి దగ్గర తీరికగా ఉండే మధ్యతరగతి స్త్రీలు ఎక్కువ. అందువల్ల ఈ కాలంలో వ్రాయబడుతున్న నవలలలో ఎక్కువ భాగం ఈ పాఠకుల కోసమే ఉద్దేశింపబడుతున్నాయి. 1955 ప్రాంతాల ఆంధ్రపత్రిక పోటీలు ప్రారంభించిన నాటినుంచీ దాదాపు ప్రతి వారపత్రికా, ప్రతి మాసపత్రికా ఈ పోటీలను ప్రారంభించి అందులో ఎన్నుకోబడ్డ నవలలను ప్రచురించడం జరుగుతున్నది. ఈ పోటీలవల్ల ఎందరో కొత్తరచయితలు ముందుకు వచ్చారు.

ఈ నవలలను పరిశీలిస్తే రెండు ముఖ్యమైన లక్షణాలు కన్పిస్తున్నాయి. మొదటి లక్షణం: నవలారచయితలు ఎక్కువగా కుటుంబగాధలు తమ ఇతివృత్తాలుగా స్వీకరిస్తున్నారు. మధ్యతరగతి చదువరుల అనుభవాలకు దగ్గరగా ఉండడంవల్లనే ఇటువంటి రచనలు అధికంగా ఆదరింపబడుతున్నాయి. ముఖ్యంగా తండ్రి కుమారుల మధ్య సంఘర్షణ, ఒక తరానికి చెందిన తల్లిదండ్రులకూ, తరువాతి తరానికి చెందిన పిల్లలకూ మధ్య జరిగే భావ సంఘర్షణ; ప్రేమ, వివాహం - ఈ ఇతివృత్తాలుకల నవలలు అధికంగా వస్తున్నాయి.

ఈ కాలంలో కన్పించే మరో లక్షణం చదువుకున్న, భావనాశక్తి వున్న స్త్రీలు నవలారచనను చేపట్టడం. నేడు మగ రచయితల

కంటె నవలామణులే కొత్త కొత్త రుచుల నవలల్ని వండేస్తున్నారని కొందరు విమర్శకులకు అసూయగాకూడా ఉన్నట్లు తోస్తున్నది.

ఈ సమకాలీన రచనల్లో రాజకీయాలకు కూడా ప్రముఖమైన స్థానం ఉంది. రాజకీయ నవలలు కొన్ని ఇదివరకు వచ్చినా ఈ కాలంలో వాటి సంఖ్య అధికం. అంతేకాదు. రాజకీయాలను వర్ణించేటప్పుడు ప్రభుత్వంపైన వ్యంగ్యాత్మకమైన విమర్శ తప్పనిసరిగా కన్పిస్తుంది. సాంఘిక సమస్యల్లో ఈ తరం రచయితలు చిత్రించిన అతిముఖ్యమైన విషయాలు స్త్రీ పురుషులమధ్య సంబంధాలు, ఆర్థిక సమస్యలు.

ఈ కాలానికి ఎంతో ముందుగానే నవలారచనను ప్రారంభించి ఈ కాలంలోకూడా ఆ వ్యాసంగాన్ని కొనసాగించినవారిలో కొడవటిగంటి కుటుంబరావు ముఖ్యుడు. ఈయన వ్రాసిన ''ప్రేమించిన మనిషి'' ఆధునిక తెలుగు నవలల్లో చెప్పుకోతగ్గది. మార్క్సిస్టు దృక్పథానికి, మానవతకూ కొంత సామ్యాన్ని ఈ నవలలో కొడవటిగంటి చూపించాడని తోస్తుంది. ఇవిగాక ఆయన ఈ పదేళ్ళుగా చాలా నవలలు వ్రాసాడు. ''కొత్తఅల్లుడు'', ''కొత్తకోడలు'', ''అనుభవం'', ''తిమింగలంవేట'' వంటి నవలల్లో చెప్పినవిషయాన్నే మళ్ళీ మళ్ళీ చెపుతున్నాడా అనిపిస్తుంది. ఆయన ఇప్పుడు సృష్టించే పాత్రలన్నీ ఆయన వెనుకటి రచనల్లో కన్పిస్తూనే ఉంటాయి.

బలివాడ కాంతారావు నవలా రచనలో ఎంతో ప్రతిభ, వైవిధ్యం కనపరచినవాడు. ఆయన నవలల్లో ''గోడమీదిబొమ్మ'' ప్రత్యేకంగా పేర్కొనదగ్గది. ''సుగుణ'', ''దగాపడిన తమ్ముడు'' మొదలైన అన్ని నవలల్లోనూ ఆయన కనపరిచే ఆర్ద్రత, మానవతలను గురించి వెనుకనే చెప్పి ఉన్నాను.

ఇచ్ఛాపురపు జగన్నాథరావు వ్రాసిన "సుఖమూ-సుందరీ" భాగ్యవంతురాలై, స్వార్థపరురాలైన అమ్మాయినిగురించినకథ. పురాణం సుబ్రహ్మణ్య శర్మ వ్రాసిన "చంద్రునికో నూలుపోగు" కళాకారుల జీవితాలను గురించిన చక్కని కథ. పిలకా గణపతి శాస్త్రి నవలలు వ్రాయడం ఈ మధ్యనే ప్రారంభించినా, ఆయన "విశాలనేత్రాలు" పలువురిని ఆకర్షించింది. ఇది దాదాపు జానపద గాథలకు దగ్గరలో ఉండే కథ. వీర శృంగార రసాలు ఆలంబనంగా ఈ కథ చిత్రీకరించబడటంవల్ల పాఠకుల ఆసక్తిని ఎంతగానో రేకెత్తించగలిగింది. ఆయన ఇటీవల వ్రాసిన "కాశ్మీర పట్టమహిషి" వంటి నవలలు కొంత చరిత్రని ఎక్కువ భాగం కల్పనను మేళవించి వ్రాయబడ్డాయి.

మహీధర రామమోహనరావు తెలుగులో రాజకీయ నవలలు వ్రాసిన బహు కొద్దిమందిలో ఒకడు. ఈయన "కత్తులవంతెన", "ఓనమాలు" వంటివి తెలుగు దేశపు రాజకీయ జీవితాన్ని చిత్రిస్తూనే మంచి ఇతివృత్తం, వ్యంగాత్మకమైన కథాకథనం కలవి. ఈయన వ్రాసిన "కొల్లాయి గట్టితేనేమి"? ప్రత్యేకంగా పేర్కొనదగ్గ నవల. ఇది గాంధీగారు 1921 లో చేసిన ఆంధ్రదేశ పర్యటనను చిత్రించేనవల. ఇటీవల వచ్చిన "స్వయంవరణం" ఆధునిక సమాజంలో యువతీ యువకుల వివాహ సమస్యను విపులంగా చిత్రించింది.

1950 ప్రాంతాలలోనే తమ నవలా రచనను ప్రారంభించి యీనాటివరకు అవిచ్ఛిన్నంగా వ్రాస్తూనేవున్న రచయిత్రి శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి. మధ్యతరగతి జీవితాలలో స్త్రీల సమస్యలు యీమె నవలలకు కథావస్తువులు.

1955-56 లలో ఆంధ్రపత్రిక నవలల పోటీలు ప్రారంభించింది. ఈ విధంగా వారపత్రికలు పోటీలు ప్రారంభించి తద్వారా రచయిత

లను ప్రోత్సహించడం కొత్తకాదు. 'చింతామణి' పత్రిక ప్రారంభించిన యీ పోటీలను గురించి వెనుకనే వివరించడం జరిగింది. అయితే ఈ కొత్తగా ప్రారంభమైన పోటీలు రెండు విధాలుగా యీనాటి నవలా సాహిత్యాన్ని ప్రభావితం చేశాయని చెప్పవచ్చు. ఒకటి: రచయితలపై యీ పోటీ నిబంధనలు తెచ్చిన నియమాలద్వారా నవలల రచనా విధానంలో మార్పు తీసుకురావడం; రెండు: పాఠకుల ఆసక్తిని పెంచడానికి, తద్వారా నవలను అతి ప్రాముఖ్యమైన, అతి ప్రాచుర్యంకల సాహిత్య ప్రక్రియగా రూపొందేటట్లు చేయడం.

తొలిరోజుల పోటీలలో పేర్కొనదగినది పోతుకూచి సాంబశివరావు వ్రాసిన ''ఉదయకిరణాలు''. మధ్యతరగతి జీవితం క్రమేపీ రచయితలకు ఎలా కథాస్థానం అయిందీ చూపడానికి యీయన నవలలు పనికివస్తాయి. ఈయన వ్రాసిన యితర నవలలలో ''అన్వేషణ'' ''ఏడురోజుల మజిలీ" వంటివి కొంత ప్రయోగాత్మకాలు. ఇవి అన్నీ మధ్యతరగతిలో చదువుకున్నవారి జీవితాలలో కలిగే సంఘర్షణలను చిత్రించేవే.

ఈ పోటీ నవలలను జాగ్రత్తగా పరిశీలిస్తే, నవల - సమకాలీన జీవితాన్ని చిత్రించడానికి ఎంత చక్కని ప్రక్రియగా రూపొందిందో తెలుస్తుంది. యదార్థవాదం యీ నవలల కన్నింటికీ వెన్నెముక. ఈ రచయితలు చాలమంది మధ్యతరగతి జీవితాలనుంచి వచ్చినవారు కనుక ఆ జీవిత చిత్రణే ఇందులో ఎక్కువగా కన్పిస్తుంది. రాను రాను మధ్యతరగతి రచయితలు ఎక్కువ కావడంతోను, ఒకే సమస్యను వారు వేరువేరు కోణాలనుంచి ప్రదర్శించడంతోను, ఈనాటి నవలలలో చర్విత చరణం ఎక్కువగా కానవస్తున్నది.

ఈ రచయితలలో చేర్చవలసినవాడే ''శారద''. తెలుగు నవలా రచయితలలో ''శారద''కు ఒక ప్రత్యేకస్థానం వుంది. ఈయన వ్రాసిన

''మంచీ-చెడూ'', ''అపస్వరాలు'' పాఠకులను ఎంతగానో కదిలించి వేసిన వాస్తవిక నవలలు. అతిహీనమైన పరిస్థితుల్లో జీవించేవ్యక్తులూ, పరిస్థితులు వారిపై చూపే ప్రభావం యీ నవలలలో అతి విస్పష్టంగా చిత్రించబడ్డాయి.

ఇక అత్యాధునికులను గురించి వ్రాయవలసి వచ్చినప్పుడు విమర్శకుడిని రెండు యిబ్బందులు ఎదుర్కొంటాయి. తనతోటివారు కావడంవల్ల అందరినీ పేర్కొనాలనే ఆకాంక్ష, ఇందులో ఎందరు నిలుస్తారోనన్న భయం. ఇది కేవలం సంక్షిప్తమైన చరిత్రే కనుక ఇందులో కొందరు ముఖ్యులను మాత్రం పేర్కొంటాను. వీరు ముఖ్యు లన్నంత మాత్రాన మిగిలినవారు కారని నా భావం కాదు. ఇది కేవలం ఆత్మాశ్రయమైన భావం మాత్రమే.

కొమ్మూరి వేణుగోపాలరావు మధ్యతరగతి జీవితాన్ని తన తొలి నవలల్లో ప్రతిభావంతంగా చిత్రించాడు. ''పెంకుటిల్లు'' వంటి నవలలు ఇందుకు ఉదాహరణ. ఇటీవల వచ్చిన ''హౌస్ సర్జన్'' వంటి నవలల్లో ఆయన తన వృత్తిలో వచ్చిన సాధక బాధకాలను సాహిత్యం ద్వారా చిత్రిస్తున్నట్లు కనిపిస్తుంది.

పురాణం సూర్యప్రకాశరావు 'జీవన గంగ', 'మారే మనుషులు' అన్న నవలల్లో కుటుంబ జీవితాన్ని గురించి, అందులోని ఎగుడు దిగుడులను గురించి వర్ణించాడు.

కందుకూరి లింగరాజు వ్రాసిన 'మనం మిగిలేం' తాత్త్విక విచారమూ, మానవత్వం లోతులను తరిచి చూడాలన్న ఆసక్తి కల నవల.

సింగరాజు లింగమూర్తి నవలల్లో ''ఆదర్శాలు-అంతర్యాలు'' పేర్కొనదగినది. పల్లెటూరి వాతావరణాన్ని సహజంగా చిత్రించ డానికి ఇందులో ప్రయత్నించాడు రచయిత.

('మంజుశ్రీ' లలితమైనభావన చేయగలవాడు. ఈయన వ్రాసిన "జారుడుమెట్లు", స్వర్గారోహణ" వంటి నవలలు జీవితంలోని ఆర్థిక విషయాలను తరచిచూస్తూనే, మానవత్వపు అంచులను స్పృశించాయి. మానవుల మధ్య ఉండే ఆర్ద్రత, మమత యీయన నవలల్లో ఆసాంతమూ ద్యోతకం అవుతాయి. ఇటీవల యీయన వ్రాసిన "నూరు శరత్తులు" పల్లెటూరి జీవితాన్ని గురించిన యథార్థ చిత్రణ.

ముళ్ళపూడి వెంకటరమణ "ఇద్దరమ్మాయిలూ - ముగ్గురబ్బాయిలూ" నవలద్వారా ప్రసిద్ధుడు. "వెంకటరమణ మార్కు" సంభాషణలు ఆంధ్రదేశంలో ప్రసిద్ధాలే! కథావస్తువులో బలం లేకపోయినా, కథా కథనంలో నేర్పువల్ల, సంభాషణా చాతుర్యంవల్ల చక్కని నవలలు వ్రాయగల సమర్థుడు యీయన.

అవసరాల రామకృష్ణారావు కథానికా రచయితగా ప్రసిద్ధుడు. ఈయన నవలారచన యీమధ్యనే ప్రారంభించాడు. ఈయన వ్రాసిన "అది ప్రశ్న - ఇది జవాబు" ఇటీవల వచ్చిన తెలుగు నవలల్లో పేర్కొనదగ్గ రచన. అంతరాంతరాల్లో ఏర్పడే మమతలే మనుషుల్ని ఎలా విడదీయగలవో చక్కగా వర్ణించబడ్డది యీ నవలలో.

వీరాజీ "తొలిమజిలీ"తో నవలారచన ప్రారంభించాడు. జీవితం తొలిమలుపులో ఉన్న యువతీ యువకులలోని ఆవేశాలను, ఆదర్శాలను అతిసహజంగా చిత్రించిన రచయిత వీరాజీ. ఈయన ఇటీవలి రచన "ఇద్దరం ఒక్కటే" చక్కని హాస్యసంభాషణలు ఉన్న నవల.

ఆదివిష్ణు వ్రాసిన "సగటు మనిషి", "మనిషీ-మిథ్యా" జీవితంలోని మామూలు మనుషుల యదార్థచిత్రణ.

గొల్లపూడి మారుతీరావు మనస్తత్వశాస్త్ర సిద్ధాంతాలను అనుసరించి మనుష్యుల అంతరాంతరాలలోని గాథలను వ్యక్తీకరించిన

వాడు. ''చీకటిలో చీలికలు'' కొంతవరకు ''చివరకు మిగిలేది'' ని అనుసరించినట్లు కన్పించినా, కథావిధానంలోను, పాత్రచిత్రణలోను ఎంతో ప్రయోగవైవిధ్యం కన్పరచిన నవల.

ఈ తరం నవలలలో వచ్చిన కొన్ని ప్రయోగాలను యిక్కడ పేర్కొనడం అవసరం. మనస్తత్వ శాస్త్రంవల్ల ప్రభావితులై నూతన ప్రయోగాలను చేసిన భాస్కరభట్ల కృష్ణారావు, ఆర్. యస్. సుదర్శనంగార్ల నవలలను ఇదివరకే పేర్కొనడంజరిగింది. ఇవికాక దాశరథి రంగాచార్య, పోరంకి దక్షిణామూర్తి, మాండలిక భాషలో చేసిన ప్రయోగాలు కూడా పేర్కొనదగ్గవి.

దాశరథి రంగాచార్య "చిల్లరదేవుళ్లు" అన్న నవలలో తెలంగాణా మాండలికాన్ని, పోరంకి ''వెలుగు-వెన్నెల-గోదావరి'' లో తూర్పు ప్రాంతం యాసను చక్కగా వినియోగించుకొన్నారు. పోరంకి ''ముత్యాలపందిరి"లో తెలంగాణాలోని పద్మసాలీల కుటుంబాలకు సంబంధించిన భాషను ప్రయుక్తం చేశాడు. ఇది అక్కినేని నాగేశ్వరరావు సాహిత్య బహుమానాన్ని పొందిన నవల.

ఇటీవలనే నవలా రచనకు పూనుకొన్న పాలగుమ్మి పద్మరాజు రెండు చక్కని నవలలు వ్రాశాడు. ''బతికినకాలేజీ'', ''నల్ల రేగడి''. మొదటిది హాస్యరసప్రధానమైన నవల. రెండవది పల్లెటూరిజీవితాన్ని, అక్కడి సంఘర్షణలను ఎంతో విస్పష్టంగా చిత్రించిన నవల. ఇటీవల వచ్చిన మంచి తెలుగు నవలల్లో ''నల్ల రేగడి'' ఒకటి. ఇందులో చూపిన ప్రతీక యోజన ఎంతో మెచ్చుకోదగ్గది. నవల చివర కొంత ''సినిమా పద్ధతి''ని అవలంబించినా, బిగువైన కథ, సహజమైన పాత్ర చిత్రణ, ఉదాత్తమైన ప్రతీకలు యీ నవలను నాలుగు కాలాలపాటు మనగల నవలగా రూపొందించాయి.

కొండముది శ్రీరామచంద్రమూర్తి వ్రాసిన "కరుణ" కరుణ రసాత్మకమైనది. మధ్యతరగతి జీవితాలను నిశితంగా పరిశీలించి వ్రాసిన వాడు కొండముది.

పోలాప్రగడ కూడా మధ్యతరగతి జీవితాలను ఆకళింపు చేసుకొన్నవాడే. "సంఘం చేసినమనిషి", "కౌసల్య" వంటి నవలల్లో యదార్థ జీవితచిత్రణ గోచరమౌతుంది.

తాళ్లూరి నాగేశ్వరరావు చాలా నవలలు వ్రాశాడు. తనకు తెలిసిన జీవితాలను, వాతావరణాన్ని మాత్రమే చిత్రించే "సిన్సియారిటీ" ఉన్న రచయిత తాళ్ళూరి. "కొత్తయిల్లు" పాతకొత్త తరాల మధ్య సంఘర్షణను యదార్థంగా చిత్రించిన నవల. ఈయన ఇటీవలి రచనలు "ఎదిగీ ఎదగని పువ్వు", "జీవనజ్యోతి" కూడా మధ్యతరగతి జీవిత చిత్రణలే!

మురయా, ఉషశ్రీలు సాహిత్య ప్రతిభవున్న నవలాకారులు. వీరి నవలలు ఎంతో జాగ్రత్తగా మలిచిన శిల్పాలవలె వుంటాయి. మురయా వ్రాసిన "చిత్రకారునిభార్య", ఉషశ్రీ వ్రాసిన "ప్రేయసి-ప్రియంవద" లలో కథాసంవిధానంలో కన్న మాటల పొందికలో, భాషలో ఎక్కువ నేర్పరితనం కనిపిస్తుంది.

పెద్దిభొట్ల సుబ్బరామయ్య "ధృవతార", వాసమూర్తి "కోనేరు-సెలయేరు", రంగధామ్ "శ్రీదేవి" మధ్యతరగతిని వివిధ కోణాలనుంచి చూచి వ్రాసిన నవలలు.

హరికిషన్ పత్రికల పోటీలలో బహుమతులు పొందినవాడు. ఆయననవలలు "లోకంపోకడ", "హృదయ కుసుమాలు", "అదృష్టచక్రం"; ధనిష్ఠ "కెరటాలు", వాచస్పతి "అంతస్థులు- అంతఃకరణలు" వంటివి పాఠకుల అభిమానం పొందిన నవలలు.

ఇవి కాక ముద్దంశెట్టి హనుమంతరావు "అహం-అనర్థం", పన్యాల రంగనాధరావు "గద్వాల చీర", అంగర వెంకటసత్యనారాయణరావు "స్నేహబంధం", పణతుల రామచంద్రయ్య "మల్లిక", వి. యస్. రంగస్వామి "రాజరికాలు - పేదరికాలు", నండూరి పార్థసారధి "శిఖరాలు - సరిహద్దులు" పేర్కొనదగిన నవలలు.

ఈ తరంలో వచ్చిన పెద్ద మార్పు ఎక్కువ మంది నవలా రచయిత్రులు రంగం మీదికి రావడం. ఇల్లిందల సరస్వతీదేవివంటి వారు ఎంతో కాలంనుంచీ నవలారచన చేస్తూనేవున్నారు. తరువాత వచ్చిన వారిలో పేర్కొన దగిన రచయిత్రులు శ్రీమతి మాలతీ చందూర్, లతలు.

(మాలతీచందూర్ "చంపకం - చెదపురుగులూ" ఉద్యోగవతి అయిన స్త్రీ పడే యిక్కట్లను వర్ణించిన నవల.

రచయిత్రులలో ఎక్కువ మంది పాఠకులున్న రచయిత్రి లత. ఈమె సుమారు ఇరవై నవలలు వ్రాసింది. ఈమెకు చలం సాహిత్య గురువు. ఆయనకు వలెనే చాలచోట్ల స్వేచ్ఛా ప్రణయాన్ని గురించి గానం చేసింది. కాని ఇటీవలి కొన్ని నవలల్లో ఆధ్యాత్మిక అన్వేషణ కూడా గోచరిస్తున్నది. అతిసునిశితమైన భాష యీమె ఆయుధం. "పథవిహీన" వంటి నవలలు యిందుకు నిదర్శనం. ఈమె నవలల్లో "మోహనవంశి" పేర్కొనదగినది. "మహానగరంలో స్త్రీ" వంటి నవలలు అధివాస్తవిక చిత్రణలు.

ఆ తర్వాత పేర్కొన దగిన రచయిత్రి ముప్పాళ రంగనాయకమ్మ. మానవనైజాన్ని - ముఖ్యంగా తాను చెప్పదలుచుకున్న కోణాన్ని - జాగ్రత్తగా పరిశీలించి, పాఠకులకు నచ్చేవిధంగా చెప్ప గలదు ఈమె. మతాంతర వివాహాలలోని మంచిచెడ్డలను ఎత్తిచూపిన "బలిపీఠం" శక్తిమంతమైన నవల. "పేకమేడలు" స్త్రీ పురుషుల మధ్య ఉండే వైవిధ్యాన్నివర్ణించిన నవల. "కృష్ణవేణి" లో కథ అంతా ఉత్తరాల ద్వారాచెప్పించడం కొంత ప్రత్యేకత. ఇటీవల ఈవిడ వ్రాసిన "స్వీట్ హోం" లో కొంత ధాంభికత్వం కన్పిస్తున్నా, ఆధునాతన గృహస్థ జీవితాలలోని హాస్యమయ భావాలను వర్ణించింది.

కోడూరి కౌసల్యాదేవి వ్రాసిన "చక్రభ్రమణం" చాలమంది పాఠకులకు నచ్చిన రచన. "చక్రనేమి", "చక్రవాకం", "ధర్మచక్రం", శాంతినికేతన్ వంటి నవలల్లో సహజత్వం లోపించింది, కథానిర్మాణంలో జానపద పద్ధతుల్ని అనుసరించిన నవలలు.

యద్దనపూడి సులోచనారాణి యిటీవల ప్రఖ్యాతికి వచ్చిన రచయిత్రి. ఈమె "సెక్రటరీ", "విజేత" వంటి నవలలు అడివి బాపిరాజుగారి సాంఘిక నవలలను గుర్తుకు తెస్తాయి. ఈమె రచనల్లోని పాత్రలు ఆదర్శ మూర్తులు. ఆశావాదులై, గొప్ప జీవితాలనుసరించి కలలుకనే అధిక సంఖ్యాకులైన పాఠకులకు ఈమె నవలలు నచ్చడంలో ఆశ్చర్యం లేదు.

ద్వివేదుల విశాలాక్షి రచనల్లో ఈనాటి కుటుంబ జీవితం అన్ని కోణాల నుంచీ నిశితంగా పరిశీలించి, ప్రకటించాలనే ఆకాంక్ష కనిపిస్తుంది. "వైకుంఠపాళి" లో ఒక కుటుంబ జీవితంలోని ఎగుడుదిగుడులను నిశితంగా చిత్రించిన నవల. "వారధి", "మారిన విలువలు", "గ్రహణం విడిచింది" వంటి నవలలలో కథాచిత్రణ, పాత్రపోషణ రెండూ సమంగా నిర్వహింపబడ్డాయి.

ఆనందారామం 'సంపెంగ పొదలు', "చీకటి కడుపునకాంతి", "ఆత్మబలి" వంటి రచనలు మానవత్వాన్ని ఆలంబనంగా స్వీకరించిన నవలలు. ఈమె నవలల్లో భావనాతీవ్రత, కథనంలో గాంభీర్యం కనిపిస్తాయి.

వీరుకాక ఇప్పుడిప్పుడే నవలలు వ్రాస్తున్న వారిలో ఉన్నవ విజయలక్ష్మి, పవని నిర్మల ప్రభావతి, ఎ. శ్యామలారాణి, కొలిపాక రమామణి, కోమలాదేవి, యలమంచిలి ఝాన్సీలక్ష్మి, డి. కామేశ్వరి, గంటి వెంకటరమణ, అద్దేపల్లి వివేకానందాదేవి, పరిమళా సోమేశ్వర్ వంటి వారెందరో ఉన్నారు.

# మూడవ భాగం

## తెలుగునవల - విశ్లేషణ

1. తెలుగు నవల - సాంఘిక జీవితం-1
2. తెలుగు నవల - సాంఘిక జీవితం-2
3. తెలుగు చారిత్రక నవల
4. తెలుగు నవలల్లో హాస్యం
5. అనుకరణలు, అనువాదాలు
6. మనస్తత్వ నిరూపక నవలలు
7. తెలుగు నవల : జాతీయోద్యమం
8. డిటెక్టివ్ నవలలు

## తెలుగు నవల
## సాంఘిక జీవితం

# 1

నవల వ్యక్తుల సాంఘిక జీవనానికి ప్రతిబింబమైన సాహిత్య రూపం. కవిత్వం రచయిత భావనా బలానికి వ్యక్తీకరణకాగా, నాటకం మానవుల అంతర్బాహ్య సంఘర్షణలకు ప్రతీకగా చెప్పుకోవచ్చు. ఒక్క నవల మాత్రమే సమగ్రంగా సమకాలిక జీవితానికి దర్పణంగా వుండగలదు. అది ఎట్టి ఇతివృత్తాన్ని స్వీకరించినా అందులో సమకాలిక సంఘటనల ప్రభావం ఉండక తప్పదు – అన్నది అందరికీ తెలిసిన విషయమే. కేవలం సాంఘికమైన నవలలు ప్రత్య

క్షంగా సంఘ సమస్యలను ఇతివృత్తాలుగా స్వీకరించగా, చారిత్రక నవలలు కూడా సంఘవిప్లవానికి సూచనలని, ఒకనాటి సాంఘిక జీవనాన్ని చిత్రించినవని చెప్పవచ్చు. దీనికి నిదర్శనంగా జాతీయ జీవనాన్ని ప్రతిబింబిస్తూ తెలుగులో వచ్చిన అసంఖ్యాకమైన నవలల్ని పేర్కొనవచ్చు. ఆ రోజుల్లో (స్వాతంత్ర్య సమరం సాగే రోజుల్లో) వచ్చిన చారిత్రక నవలలు ఆనాటి జాతీయ విప్లవోద్దేశానికి పరోక్షంగా ప్రతీకలే.

మానసిక శాస్త్రాత్మకాలయిన నవలలు వ్యక్తి ఆంతర, బాహ్య ప్రవృత్తుల మధ్య జరుగుతున్న సంఘర్షణను వ్యక్తీకరించి నప్పుడు కూడా ఆ నవలలు ఒక విధంగా సాంఘిక జీవితాన్ని గైకొనక తప్పదు. మానసిక ప్రవృత్తులన్న ఒక నియమితమైన పృష్ఠభూమి (Back ground) మీద ఆధారపడే రచయిత చిత్రింపవలసివుంటుంది. ఈ పృష్ఠభూమి ఎప్పుడూ సమాజమే. ఇలా నవలా రచయిత తాను ఏ ఇతివృత్తం స్వీకరించినా సంఘ జీవితాన్ని ప్రతిబింబించక తప్పడం లేదు.

తెలుగు నవల విషయంలో కూడా ఇది సత్యం. అనువాద నవలలనుమినహాయించి మిగిలిన అన్నిరకాల నవలలకు, ఆయాకాలంలో తెలుగు నాట వున్న సాంఘిక సమస్యలకు అవినాభావ సంబంధం వున్నది. తెలుగు నవలకు ఆద్యులయిన గోపాల కృష్ణమచెట్టి, కందుకూరి వీరేశలింగంగార్ల అభిప్రాయాలు ఈ విషయాన్ని వ్యక్తీకరిస్తాయి. శ్రీ గోపాల కృష్ణమచెట్టిగారు తమ నవల హిందువుల యాచారము తెలుపునట్టి ''నవీన ప్రబంధము'' అని పేర్కొన్నారు. ఆనాడు తెలుగు దేశంలోవున్న ఆచార వ్యవహారాలను విమర్శనాత్మకంగా చూపడమే ఈ రచయిత వుద్దేశం. ఇలానే కందుకూరి వారు కూడా ''మన యాంధ్రభాషలో జనుల యాచార వ్యవహారములను

తెలుపుచు నీతి బోధకములుగానుండు వచన ప్రబంధము లేవియు లేకపోవుట'' వలన తాము ''రాజశేఖర చరిత్ర'' ను వ్రాస్తున్నామని చెప్పారు.

తొలిరోజుల్లో తెలుగు నవల సమకాలిక సాంఘిక జీవితంలోని చెడును విమర్శించడానికే వుద్దేశింపబడ్డదని తెలుస్తున్నది. అయితే మూఢవిశ్వాసాలను విమర్శించి ప్రజలకు నీతి గరపడమే మొట్టమొదట వీరి వుద్దేశం అయినా రానురాను నీతి బోధన పాలు తగ్గి జీవితవర్ణన ఎక్కువయింది. ఈ మార్పు క్రమంగా జరుగుతూవచ్చి చిట్టచివరకు ''నీతి'', ''మంచి తనం'' అన్న పదాల అర్థాలు విస్తృతం అయి నేటి నవలా కారులు తమ నవలలలో మంచి మీద చెడు సాధించేవిజయం - అనే నినాదాన్ని వదిలిపెట్టి యథాతథమైన జీవిత చిత్రణకు ప్రాముఖ్యం ఇచ్చారు.

సాంఘిక జీవితాన్ని సంపూర్ణంగా చిత్రించక పోయినా వ్యక్తుల జీవిత చరిత్రలను చిత్రిస్తూ సంఘాన్ని ఆ జీవితాలకు ''బాక్ గ్రౌండు'' గా చిత్రించారు మొదటితరం నవలాకారులు. వ్యక్తుల జీవితాల్లో జరిగే కార్య విఘాతాలు, కార్య సాఫల్యాలు, వాటికి సమకాలీన జీవితానికివున్న సంబంధం చిత్రింపబడ్డది కందుకూరి, చిలకమర్తి, భోగరాజు నారాయణమూర్తిగార్ల రచనల్లో.

ఇక్కడ కందుకూరి, చిలకమర్తిలలోవున్న సామ్యాన్ని విభిన్నతని చూపవలసిన అవుసరం ఉన్నది. చిలకమర్తి కందుకూరి. వారికి సమకాలికుడు, శిష్యప్రాయుడు. ఆయన మార్గాన్ని అనుసరించి తన మొదటి నవల ''రామచంద్ర విజయము'' ను వ్రాశాడు. అయితే కందుకూరి తన దృక్పథాన్ని ప్రజలకు తెలియజేయడానికిగాను తన సాహిత్య ప్రక్రియలను వుపయోగించు కున్నాడు. ఆయన ముందు సంఘసంస్కర్త. ఆ తరువాతనే రచయిత. కాగా చిలకమర్తిముందు రచయిత తరువాత నైతిక వాది. దీనివలన వారి కథానిర్వహణలో

ఎంతైనా భేదం కనిపిస్తుంది. కందుకూరి అదను దొరికి నప్పుడల్లా మూఢవిశ్వాసాలను సాంఘిక దురాచారాలను వ్యతిరేకిస్తూ తాను స్వయంగానూ తన పాత్రలచేతనూ వుపన్యాసాలు ఇచ్చాడు, ఇప్పించాడు. చిలకమర్తి ఇట్టి సంభాషణలను తన నవలల్లో కూర్చినా అవి ఆయా పాత్రలకు ఆయా సన్నివేశాలకు అనువుగా మాత్రమే చిత్రించాడు.

అందువలన కందుకూరి నవలల్లోకంటె చిలకమర్తి నవలల్లో సంఘ జీవన వర్ణన ఇంకా ఎక్కువ నిష్పక్షపాతంగా వాస్తవానికి దగ్గరగా జరిగిందని చెప్పవచ్చు. అయితే ఈ ఇద్దరి నవలలూ ఆనాడు సర్కారు జిల్లాలలో - ముఖ్యంగా గోదావరీ తీరాన నివసించే పైమధ్య తరగతి (Upper Middle Class) బ్రాహ్మణ క్షత్రియ వర్గాల జీవితాలను వర్ణించాయి.

ఈ సమయంలో పేర్కొనదగ్గవే భోగరాజు నారాయణ మూర్తి, కేతవరపు వేంకటశాస్త్రిగార్ల నవలలు.

ఇంతలో జాతీయ సమరం దేశంలోని మిగిలిన ప్రాంతాలవారిని వలె తెలుగు వారిని కూడా సమరోత్సాహితులను చేసింది. చాలా మంది తమ వుద్యోగాలను చదువులను వదిలి పోరాటంలో పాల్గొన్నారు. కవులు జాతీయ గీతాల్ని ఆలపించారు - "మాకొద్దీ తెల్లదొరతనము" వంటి పాటలతో. నాటక కర్తలు "గాంధీ విజయము" వంటి నాటకాలు వ్రాశారు. అట్టి కథావస్తువును స్వీకరించి ఉత్తమమైన నవల వ్రాసిన వాడు శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారు. ఈయన "మాలపల్లి" తెలుగు నవలా సాహిత్యంలో ఒక మణిపూస.

"మాలపల్లి" లో ప్రస్ఫుటం చేయబడినంత స్పష్టంగా, యథార్థంగా తెలుగువారి సాంఘిక జీవితం మరి ఏ ఇతర నవలలోనూ ప్రదర్శింపబడలేదు. అంటె అతిశయోక్తి కాదు. తెలుగు గ్రామీణ

జీవితం యధాతధంగా మనకన్నులకు కట్టినట్లు చిత్రించారు శ్రీ వున్నవ వారు. రామదాసు, మహాలక్ష్మమ్మ, సంగదాసు, రామానాయుడు, జ్యోతివంటి పాత్రలు ఆనాటి పల్లెజీవితంలో ప్రతినిత్యమూ కనిపించే వ్యక్తులకు ప్రతిబింబాలు. కష్టలతో దురాగతాలతో మోయరాని బరువును మోస్తున్న హరిజనుల జీవితంలో జాతీయోద్యమం తెచ్చిన నూతన చైతన్యాన్ని ఆ చైతన్యంవల్ల కలిగిన ఫలితాల్ని వుత్తమంగా చిత్రించారు రచయిత. ఇందులోనే పరస్పర విరుద్ధమైన ప్రవృత్తులు గల వ్యక్తులు, వారి సాన్నిహిత్యం, అయినా వారి ఆదర్శాల్లోవున్న వైవిధ్యం — ఇవన్నీ మానవ మనస్తత్వాల్ని "సాంఘిక సాముహిక'' జీవితం అన్న దర్పణంలోంచి చూసి వారిని కేవలం వ్యక్తులుగానేకాక ఒక సమాజ జీవితంలో మెలిగే వ్యక్తులుగా చిత్రించారు ఈ నవలలో. ఈ ''మాలపల్లి'' నే చివరకు "మునిపల్లె'' గా చేసిన ప్రతిభ గాంధీ భావాలకు ప్రతీకగా నిలిచిన రామదాసుకే దక్కుతుంది. నిత్యజీవితంలో మనుష్యులు ఎదుర్కొనే కష్టాలు, అనుభవించే బాధలు, నిజాయితీకి అడుగడుగునా సంభవించే అవమానాలు, కష్టాలు ఇవన్నీ ఇందులో వున్నాయి. అంతేగాదు. ఇంత నికృష్ట జీవితంలోను ఒక ఆశాజ్యోతి, ఒక వెలుగురేఖ కన్పింపచేయడం కూడా నిత్యజీవితానికి దగ్గర అనుభవమే.

ఇంగ్లీషు చదువు దేశంలో నిలదొక్కుకుపోయి కొన్ని క్రొత్త సాంఘిక సమస్యల్ని లేవనెత్తింది. ఈ ఇంగ్లీషు చదువుల ప్రభావంవల్ల వుత్తేజితులై పాశ్చాత్య సమాజం దాని పద్ధతులు, దాని ఆచార వ్యవహారాలు కేవలం బాహ్యరూపంలో మాత్రమే చూచిన కొందరు రచయితలు ఆ సమాజం విలువలను, అట్టి జీవితాన్ని తెలుగునాట సుస్థాపితం చేయాలని వుద్దేశించారు. అట్టివారిలో అగ్రగణ్యుడు "చలం". పాశ్చాత్య సాహిత్యంనుంచి నేర్చుకొన్న స్వేచ్ఛాభావాలకు తోడుగా తన చుట్టూ చూస్తున్న స్త్రీల దుర్గతికి వగచి చలం ఒక క్రొత్త

సాంఘిక విప్లవాన్ని తన రచనలద్వారా ఆదేశించారు. అయితే వీటిని ఏరకంగానూ సాంఘిక నవలలు అనడానికి వీలులేదు. ఈయన వ్రాసిన వన్నీ వ్యక్తుల చరిత్రలు. ఈ వ్యక్తుల్ని వారి జీవితాల్ని సార్వజనీనం, సార్వకాలికం చేయడానికి వీలులేదు. ఈయన చిత్రించిన సమాజం అతి సంకుచితమైనది. అది స్త్రీ పురుషుల శారీరక సంబంధాన్ని దాటి పోలేదు. అయితే ఒక తరంలో యువతి తన సమకాలిక సమాజంలో జరుగుతున్న ఒకానొక అన్యాయానికి ఏవిధంగా "రియాక్ట్" అయినదీ ఈ నవలలు తెలుపుతాయి.

ఇదే కాలంలో మరికొంత విస్తృతమైన సంఘ జీవనాన్ని ఇదే విధంగా చూపినవాడు విశ్వనాథ సత్యనారాయణ. ఈయనమీద జాతీయోద్యమ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. అయితే అందుకు తోడుగా పురాతన ఆచారాలు సంస్కృతీ సభ్యతలు ఆయనలో జీర్ణించుకొనిపోయి తత్ఫలితంగా వర్ణాశ్రమ ధర్మాలయెడ గొప్ప గౌరవం కలిగి ఆయన నవలల్ని కొంత సాంఘికము, కొంత చారిత్రకము చేశాయి. "వేయిపడగలు" ఇట్టి నవల. ఇది పాత విలువలకు, క్రొత్త విలువలకు మధ్య జరిగే సంఘర్షణకు చక్కని వ్యక్తీకరణ. ఇందులో రచయిత తనకు నచ్చిన ఒక ఉద్దేశంఎడ ఎక్కువ అభినివేశం చూపాడు. ఇందులో 1920-40ల మధ్య కాలంలో తెలుగుదేశంలో జరిగిన సాంఘిక పరివర్తనం అంతా మనకు ద్యోతకం అవుతుంది. అయితే యీ పరివర్తనం రచయిత అభిప్రాయాలను సూచిస్తూ పాఠికంగా కానవస్తుంది.

చలం మాదిరిగానే విశ్వనాథకూడా ఒక నియమితమైన పరిధిలో రచనలు చేసినవాడు. "చెలియలికట్ట", "తెరచిరాజు" వంటి మొదటి నవలలు "విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు"వంటి తరువాత నవలలు ఇందుకు నిదర్శనం.

అడవి బాపిరాజులో సాంఘిక జీవితంయొక్క "ఆదర్శరూపం" ద్యోతకం అవుతుంది. నారాయణరావు, తుఫాను, కోనంగి అన్న నవలల్లో ఆయన తెలుగు గ్రామీణ, పట్టణ జీవితాలను, జాతీయోద్యమ సంచలనాన్ని సంపూర్ణంగా చిత్రించారు. వెనుకటి ఇద్దరిలో వలె ఈయనలో స్వతంత్రమైన ఆలోచన, పటిష్టమైన భావనాబలము, నిశితమైన భాష లేవుకాని ఇంత వైవిధ్యమైన ఆనాటి సాంఘిక జీవితాన్ని చిత్రించిన రచయితలు అరుదు.

వీరికి సమకాలిక రచయిత శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి. ఈయన వ్రాసినంత చక్కని తేట తెలుగును మరి ఏ రచయిత వ్రాయ లేదు. ఈయన నవలల్లో కోనసీమ గ్రామీణుల ఆచార వ్యవహారాలు వారి జీవితాల్లో వుండే సున్నితమైన హాస్యప్రవృత్తి ద్యోతకం అవుతాయి.

రెండవ ప్రపంచ సంగ్రామం తరువాత ఎన్నో విప్లవాత్మకమైన సాంఘిక తత్వాలు తెలుగు రచయితలకు దగ్గరగా వచ్చాయి. అందులో హేతువాదం, మానవతావాదం, మనస్తత్వ నిరూపక వాదం ముఖ్యమైనవి. ఈ తత్వాలన్నింటినీ తన నిశితమైన భావనా బలంతో జోడించి సాంఘిక ప్రయోజనాన్ని వుద్దేశించి రచనలు చేసిన ప్రముఖుడు కొడవటిగంటి కుటుంబరావు. ఈయన వ్రాసిన నవలలు, నవలికలు అసంఖ్యాకాలు. వీని అన్నింటిలో తాను నివసిస్తున్న వాతావరణం, అందులోని యదార్థవ్యక్తులు చిత్రింపబడ్డారు. ఈయన నవలల్లో "చదువు", "ప్రేమించిన మనిషి" చక్కని నవలలు. జాతీయోద్యమంవల్ల ప్రభావితుడై చదువులకు స్వస్తిచెప్పిన సుందరం అన్న యువకుని కథ "చదువు". 1920 ప్రాంతాల గాంధీగారి వుద్యమ ప్రభావం తెలుగుదేశంలో ఏవిధంగా సంచలనం కలగజేసింది, అది ఒక వ్యక్తి జీవితాన్ని ఏవిధంగా మార్చింది ఇందులో సమగ్రంగా చిత్రించబడ్డది.

గోపీచంద్ ''అసమర్ధుని జీవయాత్ర''తో ఒక కొత్తపాత్రను సృష్టించాడు. ఈ కొత్తపాత్ర ''అసమర్ధుడు''. ఈ అసమర్ధత సంఘం లోనూ గృహజీవితంలోనూ కూడా. మారుతున్న సంఘ జీవితంతో పాటు తానుకూడా మారలేకపోవడం మధ్యతరగతికి చెందిన అసమర్ధుడు ఆర్థికంగా పడే ఇబ్బందులూ ఇందులో మనకు కళ్ళకు కట్టినట్టు కనిపి స్తాయి. ఈయన మిగిలిన నవలల్లో మారుతున్న వ్యవస్థలో స్త్రీ పురు షుల సంబంధం వ్యక్తం చేయబడ్డది.

జి. వి. కృష్ణారావు ''కీలుబొమ్మలు'' కొంత సాంఘికమూ, కొంత మనస్తత్వ చిత్రీకరణము. పల్లెటూరి వాతావరణం, విద్వే షాలు, భూస్వాములు, పార్టీలు — వాటివల్ల సామాన్యప్రజల జీవి తాల్లో వచ్చే ఒడిదుడుకులు ఇందులో సమగ్రంగా చిత్రించబడ్డాయి. ఒక రకంగా ఇది మాలపల్లికి తరువాతి ఘట్టం. స్వాతంత్ర్యానంతరం తెలుగుదేశంలోని గ్రామాల్లో పెచ్చుపెరిగిన విద్వేషాలు కార్పణ్యాలు ఇందులో యథాతథంగా చిత్రించబడ్డాయి.

గత 10, 15 సంవత్సరాలుగా వెలువడుతున్న తెలుగు నవ లల్లో సమకాలీన సమాజంలోని వైవిధ్యాన్ని వేర్వేరు కోణాల్లోంచి ప్రదర్శించారు రచయితలు, రచయిత్రులు. మరీ ఇటీవల వస్తున్న రచయిత్రుల రచనల్లో మనకు కుటుంబ జీవితాన్నిగురించి అందులోని విభిన్నమైన ప్రవృత్తులుగల వ్యక్తులను గురించి, కొంతలో కొంత స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలను గురించి వ్రాయబడు తున్నాయి.

ఇంతవరకు ఏ కాలంలోను కనిపించనంత సాంఘిక చైతన్యం ఈనాడు వస్తున్న నవలల్లో కన్పిస్తున్నది. ఈనాటి రచయిత కందు కూరి మాదిరిగా సంఘంలోవున్న మూఢాచారాలను విమర్శించడమే ముఖ్యోద్దేశంగా పెట్టుకోలేదు. చలంలా కేవలం స్త్రీ పురుష

సంబంధాలకే తన రచనలను పరిమితం చేయలేదు. విశ్వనాథవలె పూర్తిగా సనాతన ఆచార వ్యవహారాలపై మక్కువ చూపలేదు. గోపీచంద్, కృష్ణారావు, బుచ్చిబాబు, రాచకొండలవలె కేవలం ఒక వ్యక్తి మనోగతభావాల క్రమవికాసానికి ఆధిక్యత నివ్వలేదు. ఈనాటి రచయిత వీని నన్నింటనీ సమపాళాల్లో సమన్వయంచేసి, క్రొత్తదీ సమగ్రమైనదీ అయిన సాంఘిక జీవితానికి ముమ్మూర్తులా ప్రతిబింబాత్మకమైన నవలలను సృష్టిస్తున్నాడు.

ఈ భావాల సమ్మేళనంతో, జరుగుతున్న చరిత్రను ఇంకా దీర్ఘమైన "కాన్వాస్" మీద చిత్రించడం జరగాలి. అందులో నేటి సాంఘిక చైతన్యం అణువణువునా ప్రతిబింబించాలి. అప్పుడే నిజమైన సాంఘికనవల ఉద్భవించినట్లు.

# తెలుగు నవల సాంఘిక జీవితం

# 2

తెలుగుదేశంలో క్రమానుగతమైన సంఘ చైతన్యం ఏ ఏ యుగాల్లో ఏ ఏ విధంగా, తెలుగు నవలను ప్రభావితం చేసిందో క్రిందటి వ్యాసంలో పరిశీలించాం. కందుకూరి మొదలు నేటి అత్యాధునిక నవలా రచయిత వరకు వస్తున్న వంద సంవత్సరాల తెలుగు సాంఘిక నవలా సాహిత్య పరిణామం క్రమానుగతంగా ఆ వ్యాసంలో చూపబడ్డది. ఈ వ్యాసంలో సాంఘిక జీవితంలోని ముఖ్యాంగాలైన కొన్ని విషయాలు వేర్వేరుగా పరిశీలింపబడతాయి.

సాంఘిక జీవితం ఒక "ప్రిజం" లాంటిది. వేర్వేరు కోణాల నుంచి వేర్వేరు రంగులలో అది మనకు దర్శనం ఇస్తుంది. మానవుడి వ్యక్తిగత జీవితం కొన్ని ప్రధాన బిందువులచుట్టూ పరిభ్రమిస్తూనే వుంటుంది. అందులో ముఖ్యమైన స్త్రీ పురుషుల సంబంధం, ప్రేమ-పెళ్ళి, గార్హస్థ్య జీవితం, ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలు, సంఘసంస్కరణ, పట్టణ పల్లెవాసాల జీవితం వంటివి. ఇవి అన్నీ ఏదో ఒక రకంగా సాంఘిక సమస్యలై ఆ సమస్యలు నవలలకు ఇతివృత్తాలు అయి రచయితలనుంచి ఏదో ఒక రకమైన పరిష్కారాన్ని కోరుతూనే ఉన్నాయి. రచయిత వ్యక్తిగతంగానూ, సమాజంలో బాధ్యతాయుతమైన దార్శనికుడుగాను ఒక వున్నతమైన దృష్టితో ఈ సమస్యలను పరిశీలించి వాటికి సమాధానాలను పాఠకులముందు ఉంచుతాడు. పైన చెప్పిన సమస్యలన్నీ ప్రతి సంఘాన్ని ప్రతి తరంలోనూ ఎదుర్కొనేవే. అయితే ఒక్కొక్క తరం ఈ సమస్యలను ఒక్కొక్క తరహాగా పరిశీలిస్తుంది. ఆ తరానికి అనువైన విధంగా రచయితలు దానికి

పరిష్కార మార్గాలు సూచిస్తారు. అవి సార్వజనీనకాలు, సార్వ కాలీకాలు అవుతాయా లేదా అన్నది విచారణీయం.

ఏ సంఘ జీవితానికైనా అతిముఖ్యమైన బంధం ఆ సమాజం లోని స్త్రీ పురుషుల మధ్యవుండే సంబంధం. స్త్రీ పురుషుల సంబంధం అనగానే పెళ్ళి, పెళ్ళి అనగానే ప్రేమ ఒక దానివెంట ఒకటి తరు ముకువచ్చే విషయాలు. ఈ స్త్రీ పురుషుల సంబంధంలో గార్హస్థ్య జీవితం ఒక భాగం.

1920 ప్రాంతాలవరకు అన్ని సాంఘిక విషయాలలోనూ కనిపించే సనాతనమైన, సాంప్రదాయికమైన జీవన విధానమే నవలల్లో కూడా వర్ణించబడ్డది. సంఘసంస్కరణకోసం, మూఢ విశ్వాసాలను రూపుమాపడం కోసం, ప్రబలంగావున్న కొన్ని దురాచారాలను ఏరి వాటిని ఖండిస్తూ నవలలు వ్రాయడమే మొదటి తరాల నవలాకారులు చేసిన పని. ఈ సందర్భంలో మొట్ట మొదట చెప్పుకోవలసిన వాడు కందుకూరి. ఆయన నవల విధవా వివాహాలకు ప్రోత్సాహమిచ్చిన మొట్టమొదటి సాహిత్య రూపం. 1893లో శ్రీ తల్లాప్రగడ సూర్యనా రాయణ వ్రాసిన "సంజీవరాయ చరిత్రము" అన్న నవలలో ఒక పురోహితుల పిల్లవాడు భార్యను చదివించడం, స్త్రీ పురుషు లిద్దరూ చదుకోవడంవల్ల వారు సామరస్యమైన గారవాస్థ్య జీవితం గడపడం చూపబడ్డది.

"గుణవతీ పరిణయం" (1908) అన్న నవలలో హిందువుల వివాహధర్మం ఆరోజుల్లో ఎలావున్నదీ చిత్రింపబడ్డది. వితంతూ ద్వాహమే ఇతివృత్తంగా వచ్చిన మొదటి నవల హద్దలూరు గోపాల రావుగారి "సుందరి" (1912) అని చెప్పవచ్చు.

అయితే ఇవి ఏవీ స్త్రీ పురుష సంబంధాలను గురించి తాత్త్వికక విచారణ చేయలేదు. అట్టి విచారణ 1920 తరుభాత నవలల్లో ఎక్కు

వగా కన్పట్టుతుంది. ఈ విషయాన్ని విస్తృతంగా స్వీకరించిన వారు చలం, విశ్వనాథ, బుచ్చిబాబు, లత, గోపీచంద్ మొదలయిన వారు.

చలం రచనల్లో స్త్రీ పురుషుల సంబంధానికి వున్నంత ప్రాముఖ్యత మరి ఏ సమస్యకూ లేదు. ఎమలీ జోలా, బాల్ జాక్ ల పద్ధతిలో ఆయన సెక్సుకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చాడు. స్త్రీ పురుషుల జీవితాల్లో - ఆయన దృష్ట్యా - అతిముఖ్యమైన విషయం శారీరక సంయోగం. ముసలి వాళ్లు, పొడుంపీల్చే వాళ్ళు, చుట్టలు తాగే వాళ్ళు మొగవాళ్ళుగా వర్జితులు ఆయన దృష్టిలో. ఆడవాళ్ళు ఇష్టం లేని మొగుళ్ళను వదిలి పెడతారు. ఇష్టం వున్న వాడితో ఇష్టంవున్నంతకాలం "ప్రేమ" గా బతుకుతారు. దీనికే పెద్ద పెద్ద పేర్లు పెట్టి అందమైన భాషలో దాన్ని చెక్కి "ఇదే ప్రేమ" అనమంటాడు చలం. ఎక్కడో ఎప్పుడో మిణుక్కుమనే ఆధ్యాత్మికత ఆయన నవలల్లో ఇంకా బృహద్వ్యాప్తంగా వుండివుంటే ఈ నవలలకు మరికొంత "బలం" వచ్చి వుండేది. ఇంతమంది ఆడవాళ్లు ఇంతమంది మగవాళ్ళతో ప్రేమ జీవితం గడిపినా - ఆశ్చర్యం! ఆ అడవాళ్ళకెవ్వరికీ పిల్లలు పుట్టరు! ఎక్కడో ఒకటి రెండు చోట్ల తప్ప. దీని వల్ల చలం సాంఘికంగా తన బాధ్యతనుండి తప్పించుకుంటున్నాడన్న మాట. ఒక సమస్య వున్నది. అ సమస్య మనదే అయినప్పుడు అది మనకు మిగిలిన వారికంటె ఎంతో పెద్దదిగా ప్రమాదకరమైందిగా కనిపిస్తుంది. నిజం. ఇష్టంలేని మొగుళ్ళతో ఆడవాళ్ళు కాపురం చేయడం ఇటువంటిదిగా చలాని కనిపించడం అతనిలోవున్న సున్నితమైన భావాలకు నిదర్శనం. ఈ సమస్య ఇంత ప్రమాదకరమైనది అని పాఠకులముందు వుంచినప్పుడు ఏ ఒక్కసారి అయినా దానికి తన పరిష్కారమేమిటో వివరించి వుండవలసింది చలం.

దాదాపు స్త్రీ పురుష సంబంధాల విషయాలలో చలాన్ని కూడా అధిగమించిన రచయిత్రి లత. వివాహ వ్యవస్థమీద చలంగారికి

మాదిరిగానే ఈవిడకు అనుమానం, అసహనం, అపనమ్మకం. ''నన్ను ఇష్టం వచ్చిన తీరులో ఎందుకు బ్రతకనియ్యరు ? ప్రతివాడు తన విషయంలో అక్కరలేని నీతిని ఎదుటి వాళ్ళ విషయంలో ఎందుకు ప్రయోగిస్తాడు ?'' అన్న ప్రశ్నలు, వాటికి జవాబుగా స్వేఛ్ఛాయుత మైన జీవితం – ఇవి లత ఆదేశించే విషయాలు.

ఇలా వ్రాసే రచయితలు తెలుగు దేశంలో తక్కువ ఏమీలేరు. ఇటువంటి రచనలు యౌవనం పొంగులాంటివి. అవి లేకుండా మనిషి జీవించలేడు. కాని ఎప్పుడో ఒకప్పుడు ఇంతకుమించిన విలువలు జీవితంలో వున్నాయి అనే భావం రచయితలకు పాఠకులకు కూడా రాక తప్పదు. అందువల్లనే చలం, లతవంటి రచయితలు జీవితాన్ని సమగ్రంగా చిత్రించక ఒక నియమితమైన పరిధిలో మాత్రమే జీవితాన్ని చూసి చిత్రించారని చెప్పవలసి ఉంటుంది. అయితే ఈ రచయితలకు ఎందరో అభిమాన పాఠకులు వుండటం గమనించదగ్గ విషయం. దానికి కారణాలు రెండు. ఒకటి యువతీయువకుల్ని సెక్సుకదిలించినంత తొందరగా మరి ఏ వుద్వేగము కదిలించలేదు. దీనికి రెండో కారణం వీరి భాషలో, శైలిలోవున్న నైశిత్యం, పటుత్వం. తెలుగు భాష ఎంత సూటిగా ఎంతబలంగా, ఎంతపదునుగా ప్రయోగించడానికి వీలుందో తెలుగు దేశానికి చూపిన వాళ్లు తిక్కన, చలం ఇద్దరే.

స్త్రీ పురుషుల సంబంధాన్ని మరికొంత లోతుగా దార్శనికంగా చూచినవాడు బుచ్చిబాబు. ఈయన కథల్లో, ''చివరకు మిగిలేది''లో సెక్సు ముఖ్యమైనదే కాని అంతకన్నా ముఖ్యం స్త్రీ పురుషుల మానసిక జీవితాలకు వున్న సంబంధం. కోమలికి దయానిధికివున్న సంబంధాన్నే నవల మొదటి నుంచీ చివరివరకూ పరిశీలిస్తే – అందులో ఒక క్రమపరిణతి మనకు కన్పిస్తుంది. దయానిధి మొదట కేవలం కోమలి శారీరక సౌందర్యానికి మాత్రమే ముగ్ధుడైనాడు. ఆమెతో పొందును మాత్రమే కోరాడు. కాని మానసికంగా ఆమెకు దగ్గర వాడుకాడు.

ఆమె సౌందర్యాన్ని పొందలేక పోయిన దయానిధి ఎన్నో అనుభవాల అనంతరం మళ్ళీ ఆమెను కలుస్తాడు. అప్పటి వారి అనుబంధం శారీరకమైందికాదు. కోమలి అతన్ని రెచ్చగొడుతుంది. అయినా దయానిధి "ఇంకా ఆ బ్రతుకు కోరుకుంటావేం ? అది లేకుండా బ్రతకలేమా ?" అని అడుగుతాడు. "కోమలితో ఎక్కడో నూరో కొత్త జీవితం ప్రారంభించాలి" అని అనుకుంటాడు దయానిధి. రచయిత అంటాడు: "శరీరం అనుభవంతో ఆత్మైపోయింది" అని. ఈ ఒక్క వాక్యంతో దయానిధిలోని మార్పును, పరిణితిని సూచిస్తాడు రచయిత. ఈ మానసికమైన అనుబంధం స్త్రీ పురుషులమధ్య తప్పదు అన్న విషయాన్ని బుచ్చిబాబు నవలలోనూ, ప్రతి కథలోనూ మనం చూడవచ్చు.

గోపీచంద్ దార్శనికుడు కావడంవల్ల స్త్రీ పురుషుల సంబంధంలోని అన్ని అంశాలను తాత్వికంగా ఆలోచించాడు. తన భావాలకు తన నవలల్లో ఒక ఆకృతి నిచ్చాడు. స్త్రీని అర్థం చేసుకోవడానికి అనేక కోణాలనుంచి ఆమెను, ఆమె జీవితాన్ని పరిశీలించాడు. "ఎంత మనోహరమైనది ఈ సృష్టి ! స్త్రీలో తరచినకొద్దీ లోతులు కనిపిస్తూనే వుంటాయి" అన్నాడు గోపీచందు. చలం సృష్టించిన స్త్రీ పురుష సంబంధాన్ని, అతడు విచ్ఛిన్నంచేసిన కుటుంబ జీవితాన్ని అవహేళన చేశాడు గోపీచందు. ఒక కథలో "వెంకటచలం" అన్న పాత్రను సృష్టించి—

> "అతని అన్నిపాత్రలు ఒకే రకంగా వున్నాయి. అదే నునుపు. అదే వంపు... ఎప్పుడూ డబ్బు సంగతి ఆలోచించలేదు. అసలు ఆ ఆలోచనలకు తీరిక వుందా? ఆ వెన్నెల్లో, ఆమైదానంలో, ఆ గులాబీ తోటల్లో... ..." అని వర్ణిస్తూ పాపం ఆ రచయిత పాత్రలకు ఆకలే వెయ్యనేదేమో అంటాడు.

గోపీచంద్ వివాహవ్యవస్థనుకూడా నిశితంగా పరిశీలించాడు. వివాహాలు, కుటుంబజీవితం ఎంతో అవశ్యకమైనవని ఆయన భావించాడు. వివాహాలు భగ్నం కావడానికి కేవలం దైహికమైన కారణాలే కాక మానసిక కారణాలుకూడా వుంటాయని స్త్రీ, పురుషుల మధ్య మానసికమైన పొందిక (Adjustment) లేకపోవడమే వీటికి కారణమని అంటాడు గోపీచంద్ "శిథిలాలయం"లో.

ఆధునిక రచయితల్లో చాలామంది స్త్రీ, పురుష సంబంధాన్ని తమ నవలల్లో ప్రస్తావించినవారే. అయితే కేవలం ఈ సంబంధాన్ని విడిగా చూడక దానికి అత్యంత సన్నిహితమైన ప్రేమ పెళ్ళి, కుటుంబ జీవితం అన్ని విషయాలతో స్త్రీ, పురుష సంబంధాన్ని ముడిపెట్టారు. అందుకే 1960 తరువాత వచ్చిన నవలలన్నీ ప్రేమ-పెళ్ళి కథలే.

## ప్రేమ - వివాహం

ఇంగ్లీషు చదువులతోను, స్త్రీ పురుషు లిద్దరూ పెద్దచదువులు చదవడంతోను, సాంఘికవ్యవస్థలో కొన్ని కొత్తమార్పులువచ్చాయి. పూర్వం పల్లెటూళ్ళకే పరిమితం అయిన చాలా కుటుంబాలు చదువులకోసం, వుద్యోగాలకోసం పట్టణాలు చేరుకుంటున్నారు. పట్టణ వాతావరణం అనగానే కొంత స్వేచ్ఛ, కొత్తలో అశాసంగా కనిపించే కొత్త నాగరికత (Pseudo-civilization) అలవర్చుకోక తప్పదు. నిత్య జీవిత విషయాలలో ఈ పట్టణజీవితం తెచ్చిన మార్పులు రెండు రకాలు. ఒకటి ఆర్థికమైనది. రెండవది సంఘంలో యువతీ యువకుల మధ్య పెరుగుతూ వస్తున్న పరస్పర ఆకర్షణకు సంబంధించినది. దీనినే "ప్రేమ" అందాం.

ప్రేమను దానికి పర్యవసానమైన వివాహాన్ని నవలా రచయితలు వర్ణించిన పద్ధతిని చూస్తే అది సినిమాల్లో కనిపించే ప్రేమ

అంత విస్తృతం కాకపోయినా రచయితలు దానికి ఎక్కువ ప్రాముఖ్యాన్ని ఇచ్చారనే చెప్పుకోవచ్చు. ప్రేమను గురించి వివాహాన్ని గురించి వ్రాసిన నవలాకారుల్ని రెండు రకాలుగా విభజించవచ్చు. ఇందులో మొదటిరకం రచయితలు అప్పుడే కలం పట్టినవాళ్లు. జీవితానుభవం లేనివాళ్లు. యౌవ్వనోద్రేకం సృజనాత్మక శక్తికన్నా కొంచెం ఎక్కువ వున్నవాళ్లు. వీరి రచనల్లో యౌవనోద్రేకమే ప్రేమ. ''లవ్ ఎట్ ఫస్ట్ సైట్'' వీళ్ళ సూత్రం. నూత్నయౌవనంలో ఎన్ని శారీరకమైన వికృతులు రావడానికి అవకాశం వున్నదో వాటిలో చాలావాటికిఅక్షరరూపం ఇచ్చారు ఈ రచయితలు.

ఇందులో రెండోతరహా వాళ్ళున్నారు — వాళ్ళు చాలా కొద్దిమంది — ప్రేమను, వివాహాన్ని ఒక సామాజికమైన సమస్యగా స్వీకరించి దాని లోతుపాతుల్ని క్రాంతికారుల దృష్టితో చూసినవాళ్లు. ఇది సామాజిక సమస్యగాకాక కేవలం కుటుంబ సమస్యగా నిర్ణయించి దానికీ మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక వ్యవస్థకూ గల సంబంధాన్ని సూచించిన నవలలు యిటీవల వేలాదిగా వస్తున్నాయి. నిజానికి ఇదీ నిజమైన సమస్య. అయితే ఈ సమస్యకు స్త్రీ రచయితలు ప్రాణం పోసినంతగా పురుషులు చేయలేకపోయినారన్న విషయం గమనించతగ్గది. బహుశః దీనికి కారణం ఈ సమస్య పురుషులకన్నా స్త్రీలనే ఎక్కువ బాధించి ఉండడం కావచ్చు.

ప్రేమ పెళ్ళిళ్ళలో ముఖ్యంగా విమర్శింపబడిన విషయాలు రెండు. ఒకటి ఆ ప్రేయసీ ప్రియుల ఆర్థికమైన తేడా. రెండవది కులం. 1925—45ల మధ్య ఇటువంటి నవలలు చాలా వచ్చాయి. కాని ఆర్థికమైన అంతరం ప్రేమ వివాహాలకు ఆటంకమన్న విషయం సినిమాలలో మాత్రమే మిగిలి నవలల్లో అంతరించి పోయింది. 1955 తరువాత వచ్చిన నవలల్లో ప్రేయసీ ప్రియుల కులాలు ఒకటి కాకపోవడం, తద్వారా జరిగే సంఘర్షణ చూపబడ్డాయి. అయితే ఈ

సమస్యను చిత్రించిన చాలామంది రచయితలు దీనిలో ఇమిడివున్న వ్యక్తుల మానసిక సంఘర్షణలకంటె బాహ్యమైన సంఘర్షణలకే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు. ''బలిపీఠం'' వంటి నవలలోకూడా సాంఘికంగా విభిన్నమైన అలవాట్లున్న ఇద్దరు వ్యక్తుల సాంసారిక జీవితం ఎంత కష్టమయం కాగలదో వివరించబడ్డది.

ఈ సమస్యతోపాటు అతి సున్నితమైన మానవ ప్రవృత్తిని చిత్రించిన నవలలు లేకపోలేదు. ఇటీవల వచ్చిన నవలల్లో శ్రీమతి ద్వివేదుల విశాలాక్షి రచించిన ''వైకుంఠపాళి'' అటువంటిది. రెండు తరాల మనుష్యులు, వాళ్ళ ఆలోచనలు, వారిచుట్టూ తిరిగే పర్విడిపోయిన సాంఘిక సమస్యలు అతి సున్నితంగా, అయినా అతి నిశితంగా వర్ణించబడ్డాయి యిందులో.

స్త్రీ పురుషుల సంబంధం — వివాహ వ్యవస్థ — వీటిని గురించి చర్చించేటప్పుడు విశ్వనాథను మరచిపోలేము. ఈయన నవలల్లో ఈ సంబంధం జన్మజన్మల పురాకృత రూపం. తాను గొప్పదిగా వూహించిన ఒక సాంఘిక వ్యవస్థను ఆదర్శంగా గ్రహించి, కొలతబద్దను చేసుకొని, నేటి సమాజం అట్టి వ్యవస్థను అనుసరిస్తేనే దానికి ముక్తి అన్న అభిప్రాయాన్ని ఆయన తన నవలలలో వెలువరించాడు. ఈ అభిప్రాయాలతో మనకు అభ్యంతరం లేదు. కాని ఈయన చూపిన స్త్రీ పురుషుల లేదా భార్యాభర్తల మధ్యవున్న వయోభేదం అటు విమర్శలకూ ఇటు పొగడ్తలకుకూడా అవకాశం ఇచ్చింది. వెనుక ఈ విషయంలో నేను చేసిన విమర్శకు, ఒక థీసిస్ కారుడు జవాబుచెప్పడానికి ప్రయత్నించాడు. ఆయన ప్రతివిమర్శలోని సారాంశం ఇది. విశ్వనాథ వూహించిన సమాజంలో ఆ అంతరం లెక్కలోనిది కాదు. పూర్వపు సమాజంలో అది చాలా సాధారణమైన విషయం. విశ్వనాథకు ధ్యేయమైన ఆనాటి సమాజంలోని అలవాట్లను ఆయన

చిత్రించడంలో ఆశ్చర్యం లేదు. ఒక రచయితను విమర్శించేటప్పుడు ఆయన్ని సానుభూతితో అర్థం చేసుకోవాలి. అంతేకాదు. ఈనాటి కొలత బద్దలతో ఆనాటి విషయాలను విమర్శించడం కూడదు. ఇది ఆయన విమర్శన సారాంశం.

దీనిని గురించి రెండు మాటలు చెబుతాను. ఒకటి, ఏనాటి కొలతబద్దలతో ఆనాటి రచనల్ని కొలవాలి అనడం సత్యమే. కాని పురాతన కాలంనాటి సమాజ వ్యవస్థకు వుపయోగించబడ్డ కొలతబద్ద లను నేటి సమాజంమీద రుద్ది అదే నిజమైన ప్రమాణం అనడం సాహసంతో కూడిన పని. సమాజవ్యవస్థ మారుతున్నకొద్దీ సాంఘికమైన విలువలుకూడా మారుతుంటాయి. మారుతున్న సాంఘిక విలువల్ని గుర్తించక వెనుకటి విలువలే వుత్తమమైనవి. సమాజం మారకూడదు. అలానే నిలవ నీరులా నిలిచిపోవాలి అనడం అజ్ఞానం, మూర్ఖం.

ప్రేమజీవితంనుంచి గార్హస్థ్య జీవితానికి ఒక్కటే మెట్టు. ఇది కుటుంబ జీవితానికి దగ్గరిది. కుటుంబ జీవితాన్ని గురించి చిత్రించిన నవలల్ని గురించి చెప్పుకోవాలి అంటే సూటికి 90 పాళ్లు నవలల్ని చర్చించడం అన్నమాట. ఈ కుటుంబ జీవితాన్ని ఏప తరం వారు ఎలా పరిశీలించి వర్ణించారో ఇక్కడ చెప్పడం కష్టం. అయినా ఈ కుటుంబ జీవితాన్ని గురించిన రెండుమూడు విషయాలను ఇక్కడ పేర్కొనడం అవసరం. ఈనాడు వస్తున్న ఎక్కువ నవలలు కుటుంబ జీవితాన్ని మూలబిందువుగా చేసుకొన్నవే. కుటుంబ జీవితంలో సమస్యలైన ఆడపిల్లల వివాహాలు, మగపిల్లల ఆడపిల్లల చదువులు, తలిదండ్రులకు పిల్లలకు ఈ విషయంలో వచ్చే సంఘర్షణ ముఖ్యమైనవి.

ఇవికాక కుటుంబ జీవితంలోని మధురిమను వెలువరించే రచనలు చేసిన వ్యక్తి శ్రీ మునిమాణిక్యం నరసింహారావు. మామూలు జీవితాల్లో ఎదురయ్యే అతి స్నిగ్ధమైన విషయాలను ఈయన చూపినంత

స్పష్టంగా సున్నితంగా మరే రచయిత చూపలేదు. భార్యాభర్తల మధ్యవుండే సున్నితమైన స్పందనం, కోపతాపాలు, విరహ సంయోగాలలోవుండే ఆనందం ఇవన్నీ ఈయన కాంతం కథల్లో రూపు కట్టాయి. ఇక్కడే పేర్కొనవలసిన మరో రచయిత శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి. ఆయన "చిన్న కథలు" అని చెప్పిన నవలికల్లో 20వ శతాబ్దం మొదటి రెండుమూడు దశాబ్దాలలోనూ కోనసీమలో వైదిక బ్రాహ్మణుల యింటవుండే ఆచార వ్యవహారాలు ఎంతో చక్కగా మన కళ్ళముందు వుంచారు.

స్త్రీ-పురుష సంబంధాలను గురించి, యౌవనోద్రేకాలను గురించి నవలలు వ్రాసిన వారిలో జంపన చంద్రశేఖరరావు, కొవ్వలి లక్ష్మీనరసింహారావులను పేర్కొనాలి. ఒక దశాబ్దంపాటు వీరి నవలలు యువలోకానికి చాలా దగ్గరగా వచ్చాయి.

ఈనాడు సంఘ వ్యవస్థను కలచివేస్తున్న ముఖ్యమైన సమస్య ఆర్థిక సమస్య. ఇది ప్రత్యక్షంగానో పరోక్షంగానో చూపించబడని నవల అంటూ లేదని చెప్పడం అతిశయోక్తి కాదు. అయితే చాలా మంది దీని బాహ్యరూపాన్ని మాత్రమే విమర్శించి వర్ణించినవారు. కొద్దిమంది రచయితలు దీని లోలోతుల్ని పరిశీలించి దీన్ని తాత్విక దృష్టితో చింతన చేసినవారు. కుటుంబ జీవితానికి, ఆర్థిక సమస్యకు వున్న అవినాభావ సంబంధం గోపీచంద్ "అసమర్థుని జీవయాత్ర" లోనూ, రాచకొండ "అల్పజీవి"లోనూ మనకు ద్యోతకం అవుతుంది. బలివాడ కాంతారావు ఇదే సమస్యను వైయక్తిక అంతరంగా చక్కగా నిరూపించాడు.

కాని, నడుస్తున్న చరిత్రకీ నేటి ఆర్థిక వ్యవస్థకీ వున్న సంబంధాన్ని, అత్యుత్తమంగా చిత్రించినవాడు కొడవగంటి కుటుంబరావు. ఈయన నవలల్లో ఆర్థికసమస్య తాలూకు అన్ని కోణాలు చిత్రించబడ్డాయి. "చదువు"లో జాతీయోద్యమంలో పాల్గొన్నవారి ఆర్థిక

జీవితం చిత్రించబడ్డది. కాని ఆయన ''ప్రేమించిన మనిషి'' అన్న నవలలో చూపించిన ఆర్థికసమస్య, దాన్ని అనువర్తింపచేసిన మానవతా సమస్య ఈనాటి సమాజంలోని మూలసమస్యలను స్పృశించాయి.

సాంఘిక జీవితానికి సంబంధించిన మరో రెండు సమస్యల్ని ఇక్కడ పేర్కొనాలి. అవి రాజకీయాలు, పట్టణ పల్లెవాసాల జీవితం. మనకున్న రాజకీయ నవలలు బహు కొద్ది. జాతీయోద్యమకాలంలో వచ్చిన చాలా నవలల్లో రాజకీయాలు ఎక్కడో ఒకచోట స్పృశించబడ్డ విషయం ఇక్కడ చెప్పుకోవాలి. అందులో ముఖ్యమైనవి వేయి పడగలు, కోనంగి. ఈ రెంటిలోనూ జాతీయోద్యమంలో పాల్గొన్న వ్యక్తుల జీవితాలు, వారి ఆశలు, ఆదర్శాలు, త్యాగాలు చూపబడ్డాయి. అలాగే ''మాలపల్లి''లో కూడా. స్వాతంత్ర్యానంతరం వచ్చిన నవలల్లో రాజకీయాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో చిత్రించబడుతూనే వస్తున్నాయి. ఇట్టి నవలల్లో 'కీలుబొమ్మలు'' రాజకీయాలను పరోక్షంగా చిత్రించిన నవల. కాని రాజకీయ నవలల్ని పేర్కొన్నప్పుడు మహీధర రామమోహనరావును పేర్కొనకతప్పదు. ఆయన నవలల్లో చాలాభాగం రాజకీయాలను యథాతథంగా చిత్రించిన నవలలే. రథచక్రాలు, కత్తుల వంతెన, కొల్లాయి కట్టితేనేమి అన్న నవలలు జరుగుతున్న రాజకీయ సమస్యల్ని చిత్రించినవి.

పట్టణ పల్లెవాసాల మధ్యవున్న జీవితాంతరాల్ని వర్ణించిన నవలలు మనకు అంతగా లేవు. కేవలం పల్లెటూరి జీవితాన్ని గురించి అక్కడి సమస్యల్ని గురించి వర్ణించిన వానిలో మాలపల్లి, కీలుబొమ్మలు ముఖ్యమైనవి, పద్మరాజు ''నల్లరేగడి'', మంజుశ్రీ ''నూరు శరత్తులు'' వంటి నవలల్లో నేటి పల్లెజీవితం అందులోని కార్పణ్యాలు వెల్లడి చేయబడ్డాయి.

స్వాతంత్ర్యానంతరం వచ్చిన నవలల్లో ఎక్కువ భాగం తత్ఫలితంగా ఏర్పడుతున్న సాంఘిక వ్యవస్థను అందులోని మంచిచెడ్డల్ని

విమర్శించడంపోయి భూస్వాముల్ని, భాగ్యవంతుల్ని విమర్శించడం ప్రారంభించాయి. వెనుక బ్రిటిష్‌వారిని, వారి విధానాలను విమర్శించారు రచయితలు. నేడు పదవుల్లోవున్న కాంగ్రెసువారిని (పేరు పెట్టకపోయినా) మంత్రుల్నీ, పదవుల్లోవున్న తదితరుల్ని విమర్శిస్తున్నారు రచయితలు. ఇది సహజం. రాజకీయంగా వచ్చిన పలుకుబడి తమ ఆర్థికమైన వున్నతికోసం వినియోగించుకొనే స్వార్థపరులున్నంతకాలం ఇట్టి విమర్శలు తప్పవు. ఈ అధికారుల నిరంకుశ చర్యలు, భూస్వాముల కుచ్చితాలు, పల్లెల్లో బయటపడ్డంత దారుణంగా పట్టణాల్లో బయటపడవు. అందువల్లనే పట్టణాలను తమ కథాస్థానాలుగా స్వీకరించిన నవలలు ఆర్థిక వ్యత్యాసాలను, ప్రేమ వివాహాలను ఆలంబనంగా స్వీకరించగా పల్లెటూళ్ళను కథాస్థానాలుగా స్వీకరించిన నవలలు భూస్వాములను గురించి, వారి నిరంకుశత్వాన్ని గురించి వర్ణించసాగాయి. ఈవిధంగా ఈనాటి చాలామంది రచయితలు సమకాలీన సాంఘిక వ్యవస్థకు స్పందించి దానిని విమర్శించి సంఘంలో వ్యక్తులుగా తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నారు.

# తెలుగు చారిత్రక నవల

## చారిత్రక నవల : లక్షణాలు

చారిత్రకనవల రెండు విరుద్ధమైన భావాల సమ్మేళనంగా చెప్పవచ్చు. ''నవలలో'' కాల్పనికత ముఖ్యం. చరిత్రలో జరిగిన సంఘటనలను యథాతథంగా, క్రమానుగతంగా వివరించడంముఖ్యం. అయితే ఈ రెండింటి మేళవింపు అత్యద్భుతమై కథాసాహిత్య ప్రేరణకు నానుడి అవుతుంది అనడంలో అతిశయోక్తిలేదు. ఏ కథాసాహిత్యంలోనైనా కొంతయదార్థత, కొంత కల్పన రెంటి మేళవింపు తప్పదు. ఒక యదార్థజీవితాన్ని చిత్రించే సాంఘిక నవలలో అంతా యదార్థత వుంటుందని, జరిగిన సంఘటనలే చిత్రింపబడ్డాయని అనుకోవడం భ్రమ. బహుముఖావృతమైన లోకజీవనాన్ని దార్శనికుడు అయిన రచయిత తన అనుభవాల అద్దాలద్వారాచూచి తన రచనను నిర్మిస్తాడు. అందువలననే ఏకథాసాహిత్యంలోనైనా ''ఏమి జరిగిందో'' కాక "ఏమిజరగడానికి వీలుందో'' చెప్పబడుతుంది. ఈ సంభావ్యత (Probability) ఏ కథకైనా ముఖ్యం. సంభవం అయిన యదార్థ సంఘటన సాంఘిక నవలకు ఎలా బీజప్రాయమో, అలాగే చరిత్రలో జరగడానికి సంభవమైన ఒక కథ చారిత్రకనవలకు బీజంఅని చెప్పుకోవచ్చు. ఈ నిర్వచనంవల్ల చారిత్రక నవల ఎక్కువభాగం కాల్పనికము, అతి తక్కువభాగం చారిత్రక సత్యముఅయ్యే ప్రమాదం వుంది. ఇట్టి నవలల్ని ''మిశ్రమ చారిత్రకాలు'' అనో ''ఆభాస చారిత్రకాలు" అనో అనవచ్చు. అయితే మామూలు నవలకన్నా చారిత్రకనవల అటు రచయితకు ఇటు పాఠకుడికి ఎక్కువ సౌలభ్యం ప్రసాదిస్తుంది. రచయితదృష్ట్యా ఇది రచయితకు కావలసిన కథలోని

ముఖ్యాంశాలను, ఒక్కొక్కప్పుడు ముఖ్యమైన పాత్రలను అందిస్తుంది. అందువలన రచయిత సాధించి చిత్రించే కష్టం తప్పుతుంది. అదీకాక పాత్రచిత్రణలోవున్న సౌలభ్యం ఇంకా ముఖ్యమైనది. ఏ శివాజీనో, ఝూన్సీలక్ష్మినో చిత్రించాలంటే వారి పాత్రలతాలూకు గుణగణాలు ఇదివరకే చరిత్రలో వ్రాసిపెట్టబడివుండడంవల్ల రచయిత యథాతథంగా వానిని స్వీకరించడమే. అయితే లిఖితచరిత్రలేనిచోట్ల రచయిత కేవలం నవలాకారుడిగానేకాక పరిశోధకుడుగాకూడా రాణించవలసి వుంటుంది.

పాఠకులదృష్టిలో చారిత్రక నవలాపఠనంలో కొన్నివీళ్ళున్నాయి. "అమ్మయ్యా! ఈ కథ ఎప్పుడో జరిగిపోయింది. దాన్ని గురించి ఇప్పుడు చేయవలసింది ఏమీలేదు" అనే నిట్టూర్పుతోకూడిన "రిలీఫ్" పొందుతాడు పాఠకుడు. అందువల్లనే ఈనాటి సామాజిక సమస్యలకు దూరంగావుండే చారిత్రక నవలల్నే చదివేవారు ఏ సమాజంలోనైనా ఎక్కువమంది వుంటారు.

చారిత్రక నవల చాలామంది పాఠకులను ఆకర్షించటానికి ముఖ్యమైన కారణం అది అన్నిరకాల పాఠకులరుచులకు సరిపోయేది కావడమే. దీనిలో మంచిబిగి అయినకథవుంది. సస్పెన్సువుంది. నిత్యజీవితంలోచూసే వ్యక్తులకంటె ఉదాత్తమైన వ్యక్తులచిత్రణ వుంది. ఇంతేగాదు. ఇదిఒక జాతి జీవితంలోని అమృతమయమైన కొన్నిగాథల్ని వెలికితీసుకువచ్చి. "ఇదిగో! నువు ఈ జాతికిచెందినవాడవే. తలుచుకుంటే నువ్వూ అంతగొప్పవాడవు కాగలవు" అన్న ప్రేరణవుంది. చారిత్రక నవలలని చెప్పబడుతున్న చాలానవలల్లో మరొక లక్షణంకూడావుంది. అందులో కుట్రలు కుతంత్రాలు, యుద్ధాలు, వైరుధ్యాలు- ఇవన్నీ ఒక్కొక్కప్పుడు అపరాధ పరిశోధక నవలల్ని జ్ఞప్తికితెస్తాయి. అదికూడా దీని ప్రాముఖ్యతకి కారణం అనిచెప్పుకోవాలి. పట్టణాల్లో జీవించే మనుష్యులకి ఇందులో

దర్బారుళ్ళు, రాజుళ్ళు, రాజకన్యలు, యుద్ధాలు, పేరోలగాలు ఎంతో సుందరమైన దృశ్యాల్ని కళ్ళకుకట్టినట్లుచూపించి వారి నిత్యాను భావాలకు అతీతమైన, అసాధ్యమైన ఒకరమ్యమైన అనుభూతిని కలుగ జేస్తాయి.

ఏ దేశంలోని చారిత్రక నవలల్ని పరిశీలించినా అందులో ఎక్కువ భాగం జాతీయ పునరుజ్జీవనం ఆవశ్యకమైనప్పుడే అవి కోకొల్లలుగా వచ్చాయని తెలుస్తుంది. ఆ విధంగా (జాతిని కర్తవ్యోన్ముఖులనుచేసి వారి విధుల్ని వారికి సక్రమంగా నేర్పుతుంది చారిత్రక నవల.)

అయితే చారిత్రక నవలా లక్షణాలు పరిశీలించవలసినప్పుడు, చారిత్రక నవలలకూ, రాజకీయ నవలలకూగల సంబంధం మనకు ద్యోతకం కాకమానదు. "గతంలో ఏ ఒక్కరోజో ఏ ఒక్కవ్యక్తినో గురించి జరిగిన కథ చారిత్రకనవల" అనిచెప్పితే అది చాలానియమితమైన నిర్వచనం అవుతుంది. "చరిత్ర నడుస్తూవుండగా దానిని గురించి వ్రాయబడుతూవచ్చిన ఏ రచనైనా చారిత్రక నవలే" అన్న నిర్వచనం ఇచ్చినప్పుడు అన్ని రాజకీయ నవలలు కూడా చారిత్రక నవలలే అవుతున్నాయి.

అయితే ఈ నిర్వచనాలు చారిత్రక నవలను నిర్వచించడంపోయి అసలు విషయాన్ని సందిగ్ధంచేస్తున్నాయి. చారిత్రక నవలంటే ఏ నవలలో సంఘటనలు ఆ నవల వ్రాసేకాలం నాటి వెనుకటి తరాలకు చెందివుండో— అది చారిత్రక నవల అనవచ్చు. ఈ కథ ఎంతవెనక్కు పోవాలిఅన్నది ఆయారచయితలు ఎన్నుకోవలసిన విషయం. శ్రీ శ్రీ అన్నట్టు ("గడిచిన ప్రతినిముషం, అదేనాకు గతశతాబ్ది" అన్న నిర్వచనం చారిత్రక నవలలకుకూడాఇస్తే, ఇక చారిత్రక నవలకూ సమకాలీన చరిత్రను చిత్రించే సాంఘిక నవలకు పెద్దఅంతరం వుండదు.

టాల్‌స్టాయి వ్రాసిన ''వార్ అండ్ పీస్'' లేదా విశ్వనాథ వారి ''వేయిపడగలు'' తీసుకుంటే నేటి తరంవారికి అందులో చరిత్రకన్నా కల్పనేఎక్కువ వున్నది అన్న భ్రాంతికలిగే ప్రమాదం వున్నది. కాని చరిత్ర, కల్పన ఆ రెంటి సమ్మిశ్రమణం మనకు ఆదినుంచీ వస్తున్నదే. రామాయణ భారతాలు, ఇలియడ్ ఒడిస్సీలు ఇటువంటివే.

చరిత్రరచనకు, చారిత్రక నవలా రచయితకూవుండే అంత రాన్నికూడా ఇక్కడ పేర్కొనవలసివుంది. చరిత్రరచన వస్త్వాశ్రయ మైనది. చారిత్రక నవలారచన ఈ పరాశ్రయమైన చారిత్రక కథను ఆత్మాశ్రయంగామార్చి రచయిత దృక్పథంలోనుంచి జరిగిపోయిన కథను పునర్నిస్తుంది. అయితే చారిత్రక నవల గతాన్ని గురించిచేసే చిత్రణ చరిత్రకన్నాకూడా సత్యానికి దగ్గరగాకూడా వుండవచ్చు. ఒకేరకమైన కొన్ని చారిత్రక సంఘటనలను ముందు పెడితే— చరిత్ర పరిశోధకుడు అందులోనుంచి ఒక కొత్తసత్యాన్ని ఆనాటి జీవనవిధానాన్ని క్రమానుగతంగా పునర్నిర్మిస్తాడు. అదే చారిత్రక నవలాకారుడైతే ఆ సంఘటనల్లోవున్న చారిత్రకసత్యం మీదకన్నా కథగాకల్పించడానికి వీలైనబలం ఎంతవున్నదో చూస్తాడు. అందుకే అన్ని చారిత్రక సంఘటనలు నవలారచనకు పనికిరావు. మరొక విశేషంవుంది. చరిత్రవ్రాసేవాడు ఒక జరిగిన సంఘటనను మిగిలిన సంఘటనలకు వేరుగాచూడలేడు. ''జరిగిపోయిన సంఘటన మొత్తం'' అనేది చరిత్రఅయితే అందులో ఆ సంఘటన ఒకభాగం మాత్రమే. ఈ సంఘటన ఆధారంగా చివరికి ఏంజరుగుతుందిఅనే కార్యకారణ సంబంధం చరిత్రరచయితకు ముఖ్యం. కాగా ఆ సంఘటనల్లో ఆ వ్యక్తుల్లో గతచరిత్ర ఎంతవరకు ఇమిడివుంది, ఆ లక్షణాలు ఈనాటివారికి ఏవిధంగా వుపయోగంఅన్న దృక్పథం చారిత్రక నవలాకారుడిది.

చారిత్రక నవలాకారుడు ఎక్కువగా చరిత్రకు దూరంగాపోయి కాల్పనికతకు ఎక్కువ అవకాశంఇవ్వడం మనం తరచుచూస్తూ వుంటాం. అంతమాత్రాన అతన్ని అసత్యరచయితగా చూడకూడదు. అటు చరిత్రకారుడుగాని, ఇటు చారిత్రక నవలారచయితకాని ఇద్దరూ నిజమైనగతాన్ని చిత్రించలేరు. కాని చారిత్రక నవలారచయిత చరిత్రకారుడికంటె దగ్గరగా చరిత్రను చూపగలడు.

అయితే చారిత్రకసత్యం ఎంతభాగంఉండాలి, కాల్పనికతఎంత వుండవచ్చుఅన్న ప్రశ్న ఎన్నోసార్లు వినవస్తూవుంటుంది. "ఈ చారిత్రక నవల చారిత్రక సత్యాలకు దూరంగావుంది" అనే విమర్శకూడా సాధారణంగా వినవచ్చేదే. అయితే దీనికి ఒకనియమం అంటూలేదు. ప్రముఖచారిత్రక నవలా రచయితలందరూ తమ ముఖ్యమైన పాత్రల్ని అతిముఖ్యమైన సంఘటనల్ని చరిత్రనుంచి గైకొన్నవారే. అందువల్ల ఈ సూత్రాన్నే మనం అన్ని చారిత్రక నవలలకూ ఆపాదించుకోవచ్చు. అయితే నవలా రచయితకు చరిత్రను పునర్నిర్మించడం ఎంత ఆవశ్యకమో దాన్ని కథారూపంలో ఆకర్షణీయంగా చూపడంకూడా అంతముఖ్యం. కేవలం గతంలోని సంఘటనల్ని యథాతథంగా చిత్రిస్తే అది చారిత్రక నవలకాదు. "ఇందులో చరిత్రచాలా వుంది" అనిపించే చారిత్రక నవల నవలగా విజయవంతం కానేరదు. "ఇది మంచినవల. ఇందులో చరిత్రకూడా బాగావుంది" అనిపించే నవలే మంచిచారిత్రక నవల. ఈ చారిత్రకతని రూపొందించడానికి ఒక్కొక్క రచయిత ఒక్కొక్క రకమైనశిల్పాన్ని ప్రయుక్తంచేస్తాడు. ఒక రచయిత ప్రఖ్యాతమైన కథల్ని పాత్రల్ని ఎన్నుకుంటాడు. మరో రచయిత పృష్ఠభూమిగామాత్రం చరిత్రను తీసుకొని మొత్తంకథను కల్పిస్తాడు. మరొక రచయిత చారిత్రక వాతావరణాన్ని కల్పించి అందులో ఎక్కడో బీజప్రాయంగా వున్న ఒక కథను స్వీకరించి విస్తృతీకరిస్తాడు. ఎవరిపద్ధతివారిది.

ఇవిఅన్నీ చారిత్రక నవలలుగానే జమకట్టవచ్చు. అయితే ప్రముఖ పాత్రల్ని తీసుకుని ఆ పాత్రల ఉదాత్తతను చంపివేసే సంఘటనలను చారిత్రక నవలాకారుడు నిర్మించకూడదు. అలాగే చరిత్రలో ఒక మహత్తరమైన యుగాన్నో కాలాన్నో స్వీకరించి అందులోని వ్యక్తుల్ని అధములైన పాత్రలనుగా సృష్టించి మన ముందుంచకూడదు. దీనికి ఒక్కటే కారణముంది. చారిత్రక నవలారచయిత కేవలం ఒక కథనుమాత్రమే చెప్పడు. మన చరిత్రలోని ఒక వున్నతిని తిరిగి ఈనాటి పాఠకులు తెలుసుకోవడానికి అవసరం అనుకున్న విషయాన్ని చిత్రిస్తాడు. అంటే మామూలు నవలారచయితకన్నా చారిత్రక నవలారచయిత ఒకనీతిని, ఒకఆదేశాన్ని తనకథద్వారా, తాను చిత్రించినపాత్రలద్వారా పాఠకులకు ఇవ్వగలగాలి. అప్పుడే ఆ నవల చారిత్రక నవలగా ప్రాముఖ్యం వహించగలదు.)

### తెలుగు చారిత్రక నవల

తెలుగు చారిత్రక నవలల్ని పరిశీలించినప్పుడు పైనచెప్పిన చారిత్రక నవలా లక్షణాలు ఇందులో చాలానవలలకు అనుసంధానించవనే చెప్పాలి. చారిత్రక నవలను వ్రాసిన మొదటి రచయిత శ్రీ ఖండవిల్లి రామచంద్రుడు. ఈయన వ్రాసిన ''ధర్మవతీ విలాసము'' 1893 లో ప్రచురింపబడ్డది. 15 ప్రకరణాలువున్న ఈ నవల చింతామణి పత్రిక బహుమతిని గ్రహించినది. నిజానికి ఇదిచారిత్రకం అని చెప్పడానికి వీలులేనిది. కథ విజయనగర గజపతుల కాలంనాటిది. ఒక నవల ఒక కాలానికి చెందినదే అయినప్పుడు ఆనాటి ఆచార వ్యవహారాలు చూపడం రచయిత మొదటివిధి. అయితే ఈ నవలలో చారిత్రక సత్యాలకన్నా కాల్పనికమైన సంఘటనలే ఎక్కువ. స్వయంవరంలో భర్తను పరిగ్రహించడం, ఆ భర్తను ఆపదల నుంచి కాపాడడానికి న్యాయస్థానానికిపోయి న్యాయాధికారితో వాదించి నాయిక గెలవడం స్థూలంగా ఇందులో కథ.

1896–1906 మధ్యలో శ్రీ చిలకమర్తివారు టాడ్ వ్రాసిన "రాజస్థాన కథావళి" ని అనువదించారు. తెలుగుదేశంలో ఈ గ్రంథం బహుజన ఆమోదయోగ్యమైంది. ఆయనే 1896 లో "హేమలత" అన్న నవల రాజస్థాన చరిత్రను ఆధారంగా చేసుకొని వ్రాశారు. ఇదికూడా చింతామణి బహూకృతమే. ఆ తరువాత వచ్చిన నవలల్లో ఖండవిల్లివారి "లక్ష్మీసుందర విజయము" (1896) టిప్పు సుల్తానుకాలం నాటికథ. చిలకమర్తివారి "అహల్యాబాయి" (1897) ఔరంగజేబుకాలం నాటిది. మెడోస్ టైలరు వ్రాసిన సుల్తాను, తార, చాంద్ బీబీవంటి నవలలు చదివిన ఉత్సాహంలో వ్రాయబడ్డదీనవల. చిలకమర్తివారు 1902 లో వ్రాసిన "శాపము" అన్న నవలిక ఆంధ్రుల చరిత్రను గురించివచ్చిన మొదటి నవల. ఇది రాజా కళింగ గంగు వేసులవాడ భీమకవివల్ల శాపాన్నిపొందడం చిత్రించిన నవల.

1893–1930 మధ్యకాలంలో వచ్చిన చారిత్రక నవలల్ని "అనువాదనవలలు" అనవచ్చు. ఇందులో చాలాభాగం ప్రఖ్యాత వంగ నవలారచయిత, దేశభక్తుడు అయిన బంకిం చంద్రఛటర్జీ వ్రాసిన నవలలకు అనువాదాలు లేదా అనుకరణలు. ముట్టమొదటి అనువాదం శ్రీ ఓ. వి. యస్. దొరస్వామయ్య అనువదించిన "కపాల కుండల". (1899). తరువాత ఆయనే 1907 లో "ఆనందమఠం" నవలను మొదటిసారి అనువదించాడు. వీనితోపాటు శ్రీ వేంకట పార్వతీశ కవుల అనువాదాలను పేర్కొనవలసి ఉంటుంది. "కృష్ణకాంతుని మరణశాసనం" మొదట అనువదించినది శ్రీ చిల్లరిగె శ్రీనివాసరావు (1910). అయినా ఎక్కువ ప్రాముఖ్యంలోకి వచ్చింది శ్రీ వేంకటపార్వతీశ కవుల నవలలే. తల్లాప్రగడ సూర్యనారాయణ అనువదించిన బంకిం నవల 'శైవలిని' (శైవలినీ చంద్రశేఖరము అనే పేరుతో, 1910).

ఇవికాక ఆ రోజుల్లో ఎంతో ప్రఖ్యాతికివచ్చిన అనువాదాలలో పేర్కొనవలసినవి చాగంటి శేషయ్యగారి దుర్గేశనందని, రాధారాణి, నవాబునందిని. దుర్గేశనందని దాదాపు పదిమందిచేత అనువదింపబడి ఈ నాటికీ పాఠకులకు అత్యంత ప్రియమైనది.

ఇవికాక రమేశ్ చంద్రదత్ వ్రాసిన "మాధవీ కంకణము" నకు తల్లాప్రగడ సూర్యనారాయణచేసిన అనువాదము, బంకిం "ప్రఫుల్ల ముఖి" కి కనకవల్లి భాస్కరరావు (1909) చేసిన అనువాదాలు ప్రఖ్యాతములు.

ఈ కాలంలోనేవచ్చిన మౌలికమైన కొన్ని చారిత్రక నవలల్ని గురించి ఇక్కడ పేర్కొనాలి. అందులో వేలాల సుబ్బారావు "రాణీసంయుక్త" (1907), ధరణిప్రగడ వెంకట శివరావు వ్రాసిన "కాంచనమాల", వేంకటపార్వతీశ కవుల "వసుమతీవసంతం" మొదలైనవి. ఈ చారిత్రక గాథలన్నీ ఉత్తర హిందూదేశపు కథలేకావడం ఇక్కడ గమనించవలసిన విషయం. ఇది జాతీయోద్యమంలో మొదటిమెట్టు. నాటకాలలో వలెనే ఇక్కడకూడా ముందు భారతీయకథల్ని స్వీకరించడం తద్వారా మనపూర్వుల ధైర్యసాహసాలను ప్రబోధించడం జరిగింది. కాని తరువాతకాలంలో తెలుగు కథల్ని స్వీకరించడం మొదలైంది. ఇది 1930 తరువాతనే ఎక్కువ ప్రాముఖ్యానికి వచ్చింది.

1930కి పూర్వంవచ్చిన నవలల్లో మరోతరహా రచనలున్నాయి. ఇందులో సన్నివేశమో, ముఖ్యపాత్రలో మాత్రమే చారిత్రకములై మిగిలిన కథాభాగము సన్నివేశ కల్పనమూ అంతా రచయితచేతనే కల్పింపబడ్డాయి. ఇట్టి నవలలకు మార్గదర్శకులు శ్రీ వేంకట పార్వతీశకవులు. అనువాదాలు మినహాయించి వారువ్రాసిన మిగిలిన అన్ని చారిత్రక నవలల్లోనూ ఈ లక్షణం మన్నను

గోచరిస్తుంది. ఈ కల్పన చరిత్రదృష్ట్యా అసంగతంఅన్న ఒక్క విషయాన్ని తప్పించి మిగిలిన ఏ విషయంలోనూ వీరినవలలు, మిగిలిన చారిత్రక నవలలకు తీసిపోవు. అందుకు నిదర్శనం వారి ''వసుమతీ వసంతము''. ఈ నవలనన్నింటికీ ఏదో ఒక ఆంగ్ల గ్రంథంలోనో మరోచోటనో బీజంవున్నది. దానినే తమ నేర్పుతో అత్యంత ఆకర్షణీయంగా వ్రాశారు వేంకటపార్వతీశ కవులు. ఇటువంటి నవలల్లో చేర్చవలసినవే అక్కిరాజు ఉమాకాంతంగారి ''టిప్పుసుల్తాను'' (1913), ఎ. వి. నరసింహంపంతులు వ్రాసిన ''వసంతసేన'', వేంకటపార్వతీశ కవులదే ''ప్రమదావనము'' (1914). ఇవికాక ఈ కాలంలో ప్రఖ్యాతులైన శ్రీ భోగరాజు నారాయణ మూర్తిగారి నవలలన్నీ ఈ కోవకుచెందినవే. వారి ''విమాలాదేవి'' (1910) ఔరంగజేబుకాలం నాటికి సంబంధించిన నవల. అట్టివే ''ఆంధ్రరాష్ట్రం'' (1915) ''ధరణికోట'' (1915) కూడా.

ఇదేకోవకుచెందిన మంచినవల శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి ''మిథునానురాగము''. ఇది ఔరంగజేబు కాలం నాటి కథ. కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు వ్రాసిన ''పుల్ జానీబేగం'' అనే వ్యాసాన్ని ఆధారంగా చేసుకుని వ్రాయబడ్డది ఇది. ఇది ''అమంగళాంతం''.

ఈ కాలంలో వచ్చిన 'తెలుగు' చారిత్రక నవలలు బహుతక్కువ. ''ఆంధ్రమున నింతవరకు ననేకాఖ్యాయికలు వెలసినవిగాని యందొక్కటియు నాంధ్రుల వైభవమును ప్రకటించునదిలేదు. ఇది యెంతయు విచారకరము'' అని శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తమ 'మిథునాను రాగము' పీఠికలో చెప్పుకొన్నారు. ఇంతవరకూ వచ్చిన తెలుగు చారిత్రక నవలల్లో చిలకమర్తివారి ''శాపము'', కేతవరపు వేంకటశాస్త్రిగారి ''రాయచూరుయుద్ధము'' (1914), దుగ్గిరాల రాఘవచంద్రయ్యగారి ''విజయనగర సామ్రాజ్యము''

(1913), భోగరాజువారి "ఆంధ్రరాష్ట్రము" "ధరణికోట" ముఖ్యమైన నవలలుగా పేర్కొనవచ్చు.

ఇట్టి చారిత్రక నవలారచనకు విజ్ఞాన చంద్రికామండలి చేసిన సేవ మరువరానిది. చింతామణి పత్రిక సాంఘికనవలల పోటీని ఏ విధంగా నిర్వహించేదో అలానే విజ్ఞాన చంద్రికామండలికూడా చారిత్రక నవలల్లో పోటీలుపెట్టి అందులో బహుమానాలువచ్చిన నవలల్ని ప్రచురిస్తూవుండేది. "చరిత్రానుసారులగు (Historical) కల్పిత కథ (Novel) నెవరైన వ్రాసిరేని దానిని ప్రచురింపనియ్యకొంటిమి" అని విజ్ఞాన చంద్రికాగ్రంథమాల ప్రకటన. దీనికి ప్రతిఫలమే పైన పేర్కొన్ననవలలు.

ఈ మొదటిదశలోని చారిత్రక నవలాకారులను గురించి ఆలోచించేటప్పుడు శ్రీ కేతవరపు వేంకటశాస్త్రి ప్రత్యేకంగా చెప్పదగినవాడు. ఈయన సాంఘిక, అపరాధపరిశోధక నవలలు వ్రాసినా చారిత్రక నవలాకారుడిగానే ప్రసిద్ధుడు. ప్రఖ్యాత ఆంగ్లచారిత్రక నవల "ఐవాన్‌హో" అనే నవలను అనువదించి మొదటి ఆంగ్లానువాదకుడుకూడా అయినాడు శ్రీ కేతవరపు. ఈయన వ్రాసిన నవలల్లో తారాబాయి, రాయచూరుయుద్ధం. ముఖ్యంగా పేర్కొనదగ్గవి. "ఇచ్ఛినికుమారి", అశోక చక్రవర్తి జీవితాన్ని చిత్రించిన చక్కనినవల. ఇవికాక ఆనందాబాయి, రాజసుందరి అన్న చారిత్రక నవలలుకూడా ఈయన వ్రాశాడు.

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ "ఏకవీర" తో తెలుగులోని చారిత్రక నవలకు ఒక నూతనజీవితం ఆరంభమైంది. అప్పటికే జాతీయోద్యమం దేశాన్ని అట్టుడికినట్టు ఉడికిస్తూవుంది. దానికితోడు భావకవిత్వపు భావవిపంచి నవలాకారుల్ని కొత్తకొత్త దిశలకు కొత్త కొత్తరుచులకు ఆహ్వానించింది. ఈ వికాసయుగంలో పేర్కొనదగ్గ ఇద్దరు చారిత్రక నవలారచయితలు విశ్వనాథ, అడివి బాపిరాజు.

విశ్వనాథవారి "ఏకవీర" ముఖ్యమైన తెలుగు చారిత్రక నవలల్లో ప్రథమశ్రేణికి చెందినది. ఇది 1933 ప్రాంతాలలో వ్రాయబడ్డది. కథ అంతా మధురనాయక రాజులకు సంబంధించినది. ఇందులో చరిత్రఎంతవుందో మానవహృదయాలకు సంబంధించిన కథ అంతవుంది. తరతరాలుగా వస్తున్న ఆర్షధర్మానికి, వ్యక్తినిష్ఠమైన హృదయస్పందనకువున్న సంఘర్షణ ఈ కథకు బీజం. దీని గొప్పతనానికి కారణాలు రెండు. ఒకటి తెలుగు చరిత్రలోని కొందరువ్యక్తుల్ని గ్రహించి వారిపాత్రచిత్రణ అత్యద్భుతంగా చిత్రించడం. రెండవది ఏ కథకైనా ముఖ్యమైన - ఇతివృత్తభాగం. చారిత్రక నవలకూడా ముందునవల. తరువాతనే దాని చారిత్రక విశిష్టత అన్నవిషయం ఇందులో ద్యోతకం అవుతుంది. పాత్రల ఔన్నత్యాన్ని ఇనుమడింపచేయడానికి ఈ నవలలో చరిత్రఎంతో దోహదకారి అయింది. కుట్టాన్, వీరభూపతి, ఏకవీరవంటి పాత్రలు ఈనాటి సమాజవ్యవస్థను పృష్టభూమిగాస్వీకరించి వ్రాస్తేఅంతరాణించి వుండేవి కావేమో.

చరిత్రకూ. పాత్రపోషణకూ ఇతివృత్తనిర్మాణానికీ ఇంతటి "మేలుకలయిక" ను మరి ఏ ఇతర తెలుగు నవలలోనూ మనం చూడం.

విశ్వనాథ మరిమూడు చారిత్రక నవలలు వ్రాశాడు– బద్దన్న సేనాని, ధర్మచక్రము, కడిమిచెట్టు. "ధర్మచక్రము" బౌద్ధకథ ఆధారంగా హిందూధర్మ ఆధిక్యతను నిరూపించడానికిగాను వ్రాయబడ్డది. "కడిమిచెట్టు" పల్లవ కాదంబులకథ. ఇది చిన్నవల. ఇంతచిన్న పరిధిలోకూడా అత్యుత్తమమైన పాత్రలను క్షణక్షణమూ వుత్సుకతను రేకెత్తించే సంఘటనలను నిర్మించాడు విశ్వనాథ. ఆయన సుదీర్ఘమైన నవలల్లోకన్నా ఇటువంటిచిన్న నవలల్లోనే తన శిల్పావిన్నాణాన్ని అత్యద్భుతంగా చిత్రించగలిగాడు.

విశ్వనాథవారు ఇటీవల వ్రాస్తున్న పురాణవైర గ్రంథమాల లోని నవలలను వారి దృష్ట్యా చారిత్రక నవలలనే అనవలసివస్తుంది. కాని ఈనాటి వారికి అవి కేవలం కల్పనలుగానే కనిపిస్తాయి. ఇలానే వీరి నేపాలుదేశ చరిత్రలుకూడా. పూర్వకాలం నాటికథ అంటే ఎటువంటి కల్పననైనా చేయవచ్చు— అన్న విషయం యీ నేపాలుదేశ చరిత్రమీద వ్రాయబడ్డ నవలలు వ్యక్తం చేస్తాయి. వీని నన్నింటినీ కాల్పనికాలు అనడమే ఎక్కువ సమంజసం.

కాల్పనికయుగానికి అచ్చమైన ప్రతినిధి అడివి బాపిరాజు. ఈయన మూడుచారిత్రక నవలలు వ్రాశాడు— హిమబిందు, గోనగన్నారెడ్డి, అడవి శాంతిశ్రీ. "హిమబిందు" శాతవాహనులకాలం నాటికథ. "గోనగన్నారెడ్డి" కాకతి రుద్రమకాలమునాటికథ. "అడవి శాంతిశ్రీ" ఆంధ్రదేశంలో బౌద్ధప్రభావాన్ని సూచించేకథ. ఇవిఅన్నీ తెలుగువారి చరిత్రలనుంచి గ్రహింపబడ్డవే. బాపిరాజు వలెనే ఆయన నవలలుకూడా ఆదర్శపథాలవైవు ఎక్కువగా పయనిస్తాయి. ఈ మూడు నవలల్లోనూ ముఖ్యమైనది "హిమబిందు".

"హిమబిందు" శ్రీముఖ శాతవాహనచక్రవర్తికాలము నాటిది. వైదికమతానికీ బౌద్ధమతానికీవున్న సంఘర్షణ ఇందులో అతిసున్నితంగా వర్ణించబడ్డది. ఈ నవలలో అడుగడుగునా బాపిరాజు అమృతహస్తము మనకు కన్పిస్తుంది. శ్రీ కురుగంటి సీతారామయ్య అన్నట్లు "బాపిరాజు ధర్మము నిర్వచించునపుడు ధర్మవేత్తయై, యుద్ధములు వర్ణించునెడల సమరశాస్త్ర విశారదుడై, ప్రేమికుల సంభాషణల లో రసమూర్తియై, శిల్పచాతుర్యము నుగ్గడించువేళ శిల్పియై, గానము పాడించునెడల గాయకుడై, బాలికల యాటపాటల నిరూపించునెడల బాలుడై, శాస్త్ర చర్చలు సల్పునెడల సకల శాస్త్రవేత్తయై, పాత్రోన్మీలన వేళలలో సహృదయుడై, మొత్తము మీద నవలారచనయందు మహాకవియైనాడు."

"గోనగన్నారెడ్డి" లో అతడు కాకతి రుద్రమకు కుడిబుజము వాడై మహారాష్ట్రుల దండయాత్రనుఎదిర్చి తన రాజునకు విజయాన్ని సాధించిపెట్టడం కథ. "హిమబిందు" లో వలెనే "అడవి శాంతిశ్రీ" అన్న నవలలో బౌద్ధ వైదిక ధర్మాలకు సంఘర్షణ చూపబడ్డది. శాంతిమూలుడు, నాగార్జునుల ఆశీర్వాదంతో ఇక్ష్వాకురాజ్యస్థాపకుడు కావడం ఇందులోకథ.

బాపిరాజుగారి నవలల్లో కొట్టవచ్చినట్టు కన్పించే లక్షణాలు రెండు. ఒకటి ఆదర్శ పాత్ర చిత్రణం. రెండవది ఆయనలోని ఆంధ్రాభిమానం. బాపిరాజు పాత్రలన్నీ మూసపోసినట్టు ఒకే తరహాకుచెందినవి అన్న విమర్శ సర్వసాధారణంగా వినవస్తుంది. ఆయన- జీవితంలోని వేర్వేరు భాగా (Facet) అను మాత్రమేచూడ గలిగాడు, లోతును గ్రహించలేక పోయాడు- అన్న విమర్శలో కొంత నిజంలేకపోలేదు. అయితే ఈయన చూపినంత విస్తృతమైన పరిధిని మరి ఏ ఇతర తెలుగు నవలారచయిత చూపలేదు అనవచ్చు.

వీరికి సమకాలికుడే అయినా వీరికి ఎంతో తరువాత కాని చారిత్రక నవలల్ని వ్రాయడం మొదలుపెట్టనివాడు నోరి నరసింహ శాస్త్రి. తెలుగు చరిత్రను చిత్రించడానికి ఈయన ఒక కొత్తపంథా అనుసరించాడు. అది కవులకథలను నిర్మించడం. నారాయణభట్టు, రుద్రమదేవి, మల్లారెడ్డి అన్న నవలలు ఆంధ్రమహాభారతాన్ని వ్రాసిన నన్నయ, తిక్కన, ఎఱ్ఱనల కథలు. వీరి తరువాత ప్రముఖుడైన శ్రీనాథ కవిసార్వభౌముని కథ ఇతివృత్తంగా కలది "కవిసార్వభౌముడు" అన్న నవల. "ధూర్జటి" అట్టి మరోనవల.

చరిత్రలో మనకు తెలిసిన ఏ ఒకటి రెండు అంశాలనో స్వీకరించి దానిమీద కథ అల్లడం అందరు చారిత్రక నవలారచయితలు చేసేపనే. కాని, నోరివారు చరిత్రను సునిశితంగా పరిశీలించి, కావ్యాలను పరిశోధించి అందులోవున్న సంఘటనలను పాత్రలను స్వీకరించారు.

ఆయా కాలాలలోని రాజకీయ జీవితాన్నే కాక సాంఘిక జీవితాన్ని కూడా చూపడానికి శ్రీ నోరి ఎంతో ప్రయాస తీసుకున్నాడని చెప్పక తప్పదు. ఇవిఅన్నీ ముఖ్యంగా ఆంధ్రుల చరిత్రను ప్రతిబింబించడానికి పూనుకున్న నవలలు.

ఈ కాలంలో భారతీయగాథలను ఆధారంగా చేసుకొని వచ్చిన నవలలు బహుకొద్ది. అందులో వేదుల సూర్యనారాయణశర్మ వ్రాసిన ''ఆర్యచాణక్యుడు'' అన్నది చరిత్రకు ప్రాముఖ్యం ఇచ్చి నవలాలక్షణాలను మరిచి రచింపబడ్డది. కొండూరి వారి ''పురుషోత్తముడు'' అన్నది హిందీభాషలోని ఒక నాటకానికి దగ్గరి అనుసరణ అయినా స్వతంత్రమైన నవలా అన్నట్టు వ్రాయబడ్డది.

మంగోలు జాతికిచెందిన ''చంఘిజ్ ఖాన్'' పై నవలనువ్రాసి ఆనాడు చైనా మంగోలుజాతీయుల సాహస కార్యాలను ఎంతో నేర్పుగా వుదాత్తంగా చిత్రించినవాడు శ్రీ తెన్నేటి సూరి. ఇది చాలవరకు ఆంగ్లచారిత్రక గ్రంథాల పరిశోధనా ఫలితంగా వెలిసినది. ఇందులోని సంఘటనల చిత్రీకరణ అతిసహజంగా నేర్పుగా సాగింది. ఆంధ్రభాషలోవచ్చిన అత్యుత్తమమైన చారిత్రక నవలల్లో "చంఘిజ్ ఖాన్'' ఒకటి.

ఆంధ్ర విశ్వవిద్యాలయమువారు ఇటర్మీడియట్ పరీక్షకు ఉపవాచకంగా నిర్ణయించడానికిగాను ఆంధ్రచారిత్రక నవలకు వెయ్యిరూపాయల బహుమానం ప్రకటించారు. ఈ బహుమతిని అందుకొన్న నవలలుకొన్ని ముఖ్యమైనవే. ఇట్టి బహుమతిపొందిన నవలల్లో మొదటిది మల్లాది వసుంధర వ్రాసిన 'తంజావూరు పతనము'. ఇది తంజావూరు ఆంధ్ర నాయకరాజులలో చివరివాడు అయిన రఘునాథరాయలు కాలమును చిత్రించినది. కల్పనలోకొన్ని అసంబద్ధతలువున్నా ఇది ఆనాటి ఆస్థాన జీవితాన్ని చక్కగా ప్రతిబింబించిందని చెప్పవచ్చు.

కాకతీయరాజ్యాన్ని గురించి ఆమె వ్రాసిన ''సప్తపర్ణి'' కూడా బహుమతిపొందిన నవలే. ఇవికాక ఆమె ''రామప్పగుడి'' కూడా పేర్కొనదగినదే.

శ్రీ పాటిబండ మాధవశర్మ వ్రాసిన ''రాజశిల్పి'' కొండవీటి రాజ్యాన్ని పరిపాలించిన కుమారగిరి కాలానికి సంబంధించినది. కుమారగిరిరెడ్డి, లకుమాదేవిల కథ ఇందులో చిత్రింపబడ్డది. కథా నాయకుడైన కుమారగిరిరెడ్డిని వున్నతంగాచిత్రించడంకోసం ఆయనకు జ్ఞాతి, రాజమహేంద్రవరానికి ప్రభువుఅయిన పెదకోమటి వేమారెడ్డిని కవిసార్వభౌముడైన శ్రీనాథుడిని అనుదాత్తంగా రచయిత చిత్రించా రనిపిస్తుంది.

విశ్వవిద్యాలయ బహుమతి పొందిన మరో రెండు నవలలు ధూళిపాళ శ్రీరామమూర్తి వ్రాసిన ''భువన విజయము'' ''గృహ రాజుమేడ'' అన్నవి. మొదటిది శ్రీ కృష్ణదేవరాయల దండయాత్రలు, భువన విజయ సభానిర్మాణమునకు సంబంధించినవి. అష్టదిగ్గజములని పేరుపొందిన కవుల కవిత్వమునుగురించి చక్కనివర్ణన ఈ నవలకు సాహిత్యగౌరవాన్నిచ్చింది.

అయితే ఇలా విశ్వవిద్యాలయ పోటీలకువ్రాయబడ్డ అన్ని నవలల్లోనూ ముఖ్యమైనలోపం అందులోని భాష. మామూలు కంటేకూడా ప్రౌఢమైనభాష ఇందులో మనకు కనిపిస్తుంది.

ఇవికాక హైస్కూలు విద్యార్థులకు ఉపవాచకాలుగా నిర్ణయించడానికి వ్రాసిన చారిత్రక నవలలు ఎన్నోవున్నాయి. వాని నన్నింటినీ పేర్కొనడం యిక్కడ సాధ్యంకాదు. వీని పరిధి నియమితమే అయినా, ఇందులోకొన్ని చక్కని నవలలు రాకపోలేదు. ''మీనాంబిక, పురుషోత్తముడు, కడిమిచెట్టు'' వంటివి ఇట్టివే!

ఇటీవలవచ్చిన తెలుగు చారిత్రకనవలల్లో శ్రీనివాససోదర కవులు అనువదిస్తున్న ''విద్యానగర నవలామాలిక'' లోని నవలలు ముఖ్య మైనవి. కాని ఇందులో కథ చెప్పాలన్న వుత్సాహంకన్నా చరిత్రను చెప్పాలన్న వుత్సాహం ఎక్కువగా కన్పిస్తున్నది.

# తెలుగు నవలలలో హాస్యం

వికృతాకార వాగ్వేష చేష్టాదేర్న_ర్త కార్భవేత్

హాస్యోహాసః స్థాయీభావః

అన్నాడు సాహిత్యదర్పణ కారుడు. దీనివల్ల మన పూర్వులు మూడు రకాల హాస్యం వున్నట్లు చూపారని వ్యక్తమౌతున్నది: వికృతాకారమూ; వికృతమైన వాక్కు; వికృతమైన చేష్టా హాస్యాన్ని పుట్టిస్తవి. ఆకార చేష్టాదులవల్ల జనించేది బాహిరమైనదనీ, వాక్కువల్ల జనించేది ఆంతరమైనదని చెప్పుకోవచ్చు. ఈ మూడింటిలోనూ వాక్కువల్ల జనించేది మిగిలిన వానికన్న గొప్పది. ఆకారము, చేష్టలవల్ల కలిగే హాస్యం తాత్కాలికమూ; వాక్కువల్ల కలిగేది సార్వకాలికమూ అనవచ్చు.

తెలుగువారి నిత్యజీవితంలో వున్నంత హాస్యం, వారి గ్రంథాలలో వున్నట్టు లేదు. మొదటి మొదటి కావ్యాల్లో కొంత చేష్టాగతమైన హాస్యమూ, మరికొంత భాషాగతమైనదీ లేదని చెప్పలేము. కాని అట్టి హాస్యం అతిస్వల్పం. పారిజాతాపహరణము, పాండురంగ మాహాత్మ్యమువంటి కావ్యాల్లో క్వాచిత్కంగా హాస్యం కనిపిస్తుంది. రానురాను క్షీణయుగం అని పిలువబడే నాయకరాజుల కాలంలో 'విజయ విలాసం' వంటి కావ్యాల్లో శాబ్దికంగా కవులుచేసిన చమత్కారాలు కొంత హాస్యజనకాలైనా, అందులో హాస్యంకన్న వైచిత్రి వల్లన కలిగే ఆశ్చర్యమే ఎక్కువ.

పోతే పద్యరూపంలో ఉండికూడా హాస్యాత్మకాలైనవి చాటువులు. శ్రీనాథుడు, తెనాలిరామకృష్ణుడు మొదలైన కవి చతురుల పేరుమీద చలామణీ అవుతున్న యీ చాటువులు ఎవరు చెప్పినవైనా భాషాగతమైన హాస్యానికి తార్కాణాలుగానే పేర్కొనవచ్చు. ముఖ్యంగా శ్రీనాథుడి చాటువుల్లో అతని నిశిత పరిశీలనాపటిమకూడా మనకు ద్యోతకం అవుతుంది.

ఇలాంటి హాస్యమే తిరుపతి వేంకట కవుల శతావధానాల్లోను, గీరతంలోను, నానారాజ సందర్శనంలోను మనకు ద్యోతకం అవుతుంది. విద్వత్పరిషత్తులోను, రాజాస్థానములలోను వారు చేసిన హేళన, తమకు ఎదురు నిలిచిన కవులయెడ వారు చూపిన తిరస్కారము, ఎక్కడా మర్యాద అతిక్రమించని వారి ప్రతిభా మనకు వానిలో సాక్షాత్కరిస్తాయి.

ఇక తెలుగునవలల్లో హాస్యాన్ని గురించి చెప్పవలసి వచ్చినప్పుడు దాని లోపమే మనకు కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. తెలుగు నాటకాలలో, నవలలలోకన్న హాస్యం ఎక్కువగా కనిపిస్తుంది. దీనికి కారణం అటు సంస్కృత నాటకాల్లోనూ, యిటు ఇంగ్లీషు నాటకాల్లో కూడా హాస్యరసం ప్రాముఖ్యం వహించివుండడమే. అదీకాక దేశీ రూపకాలలో కేతిగాడు, బంగారక్కవంటి పాత్రలు జనంలో ఎంతో ఆదరణపొంది వుండడం. పైగా నాటకాలు ప్రదర్శనానుకూలం కావాలి. దానికి హాస్యం ఎంతో తోడ్పడుతుంది. అందువల్లనే యీ నాటికికూడా సాంఘిక నాటకాల్లో సైతం ఏదో ఒక పాత్రను హాస్యపాత్రగాచేసి నాటకం ఆసాంతం అతనిచేత హాస్యప్రసంగాలు, చేష్టలు చేయిస్తూనే వస్తున్నారు నాటకకర్తలు.

ఇక నవలలు ప్రదర్శనతో పనిలేనివి కనుక సామూహికమయిన ఫలితం (group effect)తో సంబంధం లేక ఏ పాఠకునికి ఆపాఠకుడు తనకు తానుగా చదువుకొని ఆనందించేవి కావడంతో పాఠకుని ఆసక్తిని

పట్టి వుంచడానికి నవలా రచయిత కథా నిర్వహణమీద ధ్యాస ఎక్కువగా వుంచుతాడు. పూర్తిగా హాస్యభరితమయిన కథను నిర్వహించడం చాలా కష్టసాధ్యమయిన పని. అందువల్లనే తెలుగు నవలలలోఉన్న హాస్యంపాలు అతి తక్కువ.

అయితే ఉన్నంతలోనూ యీ హాస్యాన్ని రెండు విధాలుగా చూపవచ్చు. ఒకటి హాస్యమే ప్రధానంగా ఉన్న నవలలు. రెండోవి హాస్యం అంగంగా వుండి అక్కడక్కడా నిర్వహింపబడ్డ నవలలు. ఏ సాహిత్యంలోనైనా హాస్యం నవలఆసాంతమూ వుండే నవలలు కొద్దిగానే వుంటాయి. రెండవరకం నవలలే ఎక్కువగా వుంటాయి. ముందు మొదటి రకానికి చెందిన నవలలను గురించి యిక్కడ ప్రస్తావిద్దాం.

కేవలం 'నవల'అన్న ప్రక్రియకిందికి చేరకపోయినా పెద్ద 'గద్య కథ'గా ప్రసిద్ధికెక్కిన మొదటి హాస్యరచన కందుకూరి వీరేశలింగం పంతులుగారి "సత్యరాజా పూర్వదేశయాత్రలు." ఇందులో రెండు భాగాలు వున్నాయి. సత్యరాజాచార్యులు అన్న ఆయన ప్రయాణాలమీది మక్కువతో దక్షిణదేశ యాత్రకు బయలుదేరి అక్కడ "ఆడమళయాళం" సందర్శించడం మొదటి కథ. రెండవది అతని "లంకా యాత్ర."

ఈ కథలు కథనపద్ధతిలో ఆంగ్ల వ్యంగ్య రచయిత స్విఫ్ట్ వ్రాసిన ప్రఖ్యాతమయిన గ్రంథం "గలివర్స్ ట్రావల్స్"ను పోలి ఉన్నాయి. ఇక కథ విషయంలో మొదటిది చాలావరకు మౌలికమయినది; రెండవది స్విఫ్ట్‌కు అనుసరణ.

ఈగ్రంథంలోని "ఆడు మళయాళము" అన్న కథలో వీరేశలింగంగారు అపహేళనతో కూడిన హాస్యాన్ని ప్రయుక్తం చేశారు. "వ్యాజరూపమున మనలోని దురాచారములను మూఢవిశ్వాసము

లను పరోక్షముగా ప్రదర్శించునట్టి పుస్తకమును...చేయవలెనని బుద్ధి పుట్టి'' యీ గ్రంథాన్ని వ్రాసినట్లుగా పంతులుగారు చెప్పుకొన్నారు. అందులోనూ యీ ''ఆడుమళయాళము'' ను ''స్త్రీల విషయమున మనవారు చేసిన యన్యాయములు తేటపడునట్లు'' వ్రాశామని పంతులు గారు తమ స్వీయచరిత్రలో పేర్కొన్నారు. వారి మాటలవల్ల వ్యంగ్యమూ, అధిక్షేపణ వారి గ్రంథరచనలోని వుద్దేశాలని తేట తెల్లమవుతున్నది.

పురుషులు ఆధిపత్యం, పెత్తనం వహించే యీదేశం నుంచి 'ఆడుమళయాళము' చేరిన సత్యరాజు అక్కడ యిందుకు తల్లక్రిందులుగా వుండే ఆచార వ్యవహారాలను తిలకించవలసి వచ్చింది. పురుషులు యింటి పనులన్నీ చేయడం, స్త్రీలు వ్యవహారాలు నడపడం, ఉద్యోగాలు చేయడం, యిందులో చూస్తాం. కాశీమజిలీ కథల్లో పగలంతా నిద్రపోవడం, రాత్రిఅంతా రాజ్యపాలనచేసే రాజుగారి అస్తావిస్తగాధవలె వుంటుంది యిది. అయినా యిది చదువుతున్నంతసేపూ పురుషులకు ఒకపక్క నవ్వు, వేరొకపక్క తమ్ము తాము అలా వూహించుకుని, అట్టి రాజ్యంలోని పురుషులను, తమ చుట్టూవున్న స్త్రీలను తాదాత్మ్య దృష్టితోచూచి తాము చేస్తున్న తప్పు తెలుసుకోవడం జరుగుతుంది. అందువల్ల సంఘసంస్కరణ దాని ఉద్దేశం. ఆ ఉద్దేశాన్ని వీరేశలింగం పంతులుగారు ప్రహసనాల ద్వారాను, యిట్టి కథలద్వారాను సాధించారు.

ఈ గ్రంథంలో ఉద్యోగంచేసి యింటికి యజమానురాలైన భార్యయెడ భర్త ఎలా ప్రవర్తిస్తాడో పంతులుగారు ఎంతో హాస్య భరితంగా వ్రాశారు. ''పురుషున కిమ్మహిబత్నియె పరమంబగు దైవతంబు'' అనీ, ''పత్నిసేవ చేసినవాడు యిహపరముల సుఖము బడయగలడ''నీ, ప్రతిఉదయము ''పురుషుండు పత్నికంటె, ముందుగాలేచి'' నదిలో స్నానంచేసి, నీళ్లు తీసుకువచ్చి, ఆనీళ్ళతో ఆమె కాళ్లుకడిగి,

ఆ ''శ్రీపాద తీర్థంబు త్రాగవలయు'' అనీ చదివినప్పుడు నిత్యమూ మన జీవితంలో పురుషులుచెప్పే నీతులను, అవే భావాలను, అవే మాటలనుకూడా స్త్రీపరంగా పంతులుగారు చెప్పినపుడు అవి ఎంత నిశితములై మగవారికి తగలవచ్చు!

''పురుషుండును గార్దభమున్
స్థిరముగ దండనములేక, చెడిపోదురిలన్''—

అనీ,

''అతివలకు స్వేచ్ఛభూషణమైనయట్లు
పురుషులకు లజ్జయే, మహాభూషణంబు''

అనీ అతినిశితమైన విమర్శ, అధిక్షేపణ చేశారు పంతులుగారు.

ఇందులో హాస్యం పరిస్థితులను తారుమారుచేసి వ్యత్యస్తమైన ఒక ఊహాసమాజాన్ని స్థాపించడం ద్వారా కలిగింది. ఇందులో ఉపయుక్తం చేయబడిన కథాకథన పద్ధతిని ''అధిక్షేపము'' అనీ ఇతివృత్త స్వీకరణ పద్ధతిని ''వ్యత్యస్త పద్ధతి'' అనీ అనవచ్చు.

ఇక యిందులోని రెండవకథ సత్యరాజు లంకాయాత్ర. ఇది గలివర్ ''బ్రాబ్డింగ్ నాగ్'' పోయిన కథకు అనుసరణ. ఇందులో పురుషులందరూ దీర్ఘకాయులు. సత్యరాజు వాళ్ళదృష్టిలో ఓమాటలు నేర్చిన కీటకం. అక్కడ అతడు పడినపాట్లు, అక్కడి దీర్ఘకాయులు అతన్ని ఎలా ఆశ్చర్యంతోచూసి, ఒక పంజరంలో నుంచి నలుగురికీ చూపి వినోదించినదీ వివరంగా చూపబడ్డది.

వీరేశలింగంగారు మాత్రం ''లంకాద్వీపము''న జ్యోతిశ్శాస్త్రములోనిజాతకభాగము యొక్కయు ముహూర్తభాగము యొక్కయు నవిశ్వసనీయతను పరోక్షముగా దెలుపుటకు'' వ్రాశానని చెప్పుకొన్నారు. అయితే యీ జ్యోతిశ్శాస్త్ర భాగం అతి తక్కువ. ఎక్కువ భాగం అక్కడ సత్యరాజు అనుభవాలు మాత్రమే. అవే హాస్యాత్మకాలు.

అక్కడ మామూలు మనిషి రెండువందల అడుగులువుండడం అక్కడ నల్లితో సత్యరాజుచేసిన యుద్ధం ''మత్కుణాసుర యుద్ధం''గా ప్రసిద్ధికి పొందడం, తనను ఒక పందికొక్కు తీసుకొనిపోగా ఒక మురికి గుంటలో పడడం, అక్కడనుంచి మండోదరి అన్న రాక్షసి తనను రక్షించడం – యివన్నీ ఎంతో వివరంగా వర్ణించారు పంతులుగారు.

చిన్న విషయాన్ని అతి దీర్ఘంగా పెంచి, ''అతిశయోక్తుల'' తో చెప్పడం ద్వారా పంతులుగారు యిందులో హాస్యాన్ని సాధించారు. ఇందులో ''అడుమళయాళము'' కంటె కూడా సంఘటనాత్మకమైన హాస్యం ఎక్కువగా వుండడంవల్ల, "లంకా యాత్ర" మొదటిదానికన్న సంపూర్ణమైన హాస్యాన్నే అందించిందని చెప్పవచ్చు.

వీరేశలింగంగారికి తరువాత హాస్యరచనలు చేసినవారు వున్నా కథా పద్ధతిలో చేసినవారు అరుదు. పానుగంటి తమ 'సాక్షి' లో ఉపన్యాసాల ధోరణిలో చాలా హాస్య, వ్యంగ్య ప్రసంగాలు చేశారు. ఇందులో నవలలోవలెనే అవే పాత్రలు తిరిగి తిరిగి ప్రవేశపెట్టబడినా, క్రమానుసారమైన సంఘటనలు లేకపోవడంతో ఇది నవలాసాహిత్యం కిందికిరాదు.

వీరేశలింగంగారికి చిలకమర్తి వారికీ మధ్యలో వీరేశలింగంగారి 'సత్యరాజా పూర్వదేశయాత్రలు'కు వలెనే మరో గ్రంథం వచ్చింది. అదికూడా హాస్యమైన ధోరణిలో నడచినదే! ఇది కొత్తపల్లి సుందర రామయ్యగారి ''రామలక్ష్మణ దేశయాత్ర" (1913) దీని ముఖపత్రం మీదమొదటి భాగమని వ్రాయబడ్డది. కాని రెండవ భాగం వచ్చినట్లు కనిపించదు. శైలి గ్రాంథికము. దేశపర్యటన చేస్తున్న రామలక్ష్మణులు చూచిన కొన్ని దేశాచారాలు వ్యంగ్యాత్మకంగా చిత్రించబడ్డాయి. అయితే ఇది నవలిక. కేవలం 57 పేజీలున్నది.

తరువాత చెప్పుకోదగిన హాస్యనవలలు చిలకమర్తి వారి '' గణపతి '' '' దుందుభి ''. చిలకమర్తి వారు వీరేశలింగం గారికి శిష్యులు, అనుయాయులు. ఆయనవలెనే సంస్కరణాభిలాషి. కాని వారి 'గణపతి'లో అట్టి సంఘ సంస్కరణాభిలాషకు వలసిన వ్యంగ్యము బొత్తుగా కన్పించదు. చిలకమర్తి వారు ఎన్నో ప్రహసనాలు వ్రాశారు. అన్నీ ఆనాటి సాంఘిక దురాచారాలను విమర్శించినవే! అలానే ''గణపతి''లో కూడా సాంఘిక దురాచారాలపై సుదీర్ఘ సంభాషణలు వున్నాయి.

ఈ నవలలోని గణపతి నిర్భాగ్యుడైన ఒక బ్రాహ్మణుడు. తిండిపోతు. ఉదరపోషణకోసం బహుకృతవేషాలు ధరించాడు. ఒక విధంగా యీనాటి విలువలనుబట్టి చూస్తే 'గణపతి' కథ విషాదాన్ని కలిగిస్తుంది కాని హాస్యాన్నికాదు. అతడు శవవాహనం చేసినా, భోగంమేళంలో కృష్ణపాత్రధారిగా వేసినా — అతని మాటలు కాని చేష్టలుకాని హాస్యజనితాలు కావు. కాని యీనాటికీ అది హాస్య నవలగా చెలామణీ అవుతున్నదంటే దానికి కారణం 'గణపతి'లో ఉన్న ఆకారగతమైన హాస్యం మాత్రమే! చిన్నతనంలో — వికార రూపుడైన గణపతి చేసే వికృతమైన చేష్టలు కొంత హాస్యాన్ని కలుగ చేసే మాట నిజం. కాని అది ఉత్తమమైన, స్వచ్ఛమైన హాస్యంకాదు.

ఈయన ''దుందుభి'' కూడా ఇటువంటిదే! గణపతికి స్త్రీ రూపం ''దుందుభి''. గణపతి చేసిన చేష్టలనే దుందుభీ చేస్తుంది. ఈవిడ కూడా అంత అందవికారం కలది. దరిద్రురాలు. అయితే ఈవిడ చరిత్ర మనకు అసమగ్రంగానే దొరుకుతోంది. ఎందువల్లనో దీని రెండవ భాగాన్ని మాత్రం చిలకమర్తి ప్రకటించలేదు. ఈ రెండు నవలలకన్నా ఆయన ప్రహసనాలే ఎక్కువ హాస్యయుక్తాలని చెప్పవచ్చు.

చిలకమర్తి తర్వాత దాదాపు రెండు దశాబ్దాల వరకు తెలుగులో హాస్యరచన రాలేదు. అప్పుడప్పుడు హాస్యప్రసంగాలు వ్యాసాలు పత్రికల్లో ప్రచురింపబడ్డ మాట నిజమే అయినా వీనిని హాస్యనవలలుగా మనం గ్రహించలేము. తరువాతి ముఖ్యమైన హాస్య నవల మొక్కపాటి వ్రాసిన "బారిష్టరు పార్వతీశం".

ఈ నవల ఆయనే చెప్పుకొన్నట్లు కొంత ఆత్మకథ. ఒక యువకుడు విదేశప్రయాణానికి సమకట్టి అమాయకుడు కావటంవల్ల దారిలో అడుగడుగునా అపహాస్యం పాలవుతాడు. ఇట్టి అపహాస్య సంఘటనలన్నీ పేరికూర్చిన నవల "బారిష్టరు పార్వతీశం". ఇందులో అక్కడక్కడా భాషాగతమైన హాస్యంఉన్నా ఎక్కువగా మొక్కపాటి వారు ఆశ్రయించింది వేషగతము, చేష్టాగతము, అయిన హాస్యాన్నే. ఇందులో సనాతనత్వానికి, మారుతున్న ఆచారాలకీ మధ్య మామూలుగా ఉండే వ్యత్యాసము, సనాతన ఆచార వ్యవహారాలు తరువాతి తరం వాళ్ళ అపహాస్యానికి ఎలాగురి అవుతాయో అన్న యదార్థతను చూపడం జరిగింది.

అంతేకాక ఈ నవలలో చాల వరకు రచయిత తన్నుతాను కావాలని అపహస్యం పాలు చేసుకొన్నాడని తెలిసినప్పుడు దీనిలోని హాస్యదృష్టిని పాఠకులు ఇనుమిక్కిలిగా చూడగలుగుతారు.

ఈ నవల చమత్కారమంతా దీని తరువాతి భాగం ఎప్పుడో వస్తుందని రచయిత ఊరించటంలో ఉంది. ఎప్పటికీ అసంపూర్తిగా నిలిచికూడా అసంతృప్తిని కలుగ నివ్వని నవల "బారిష్టరుపార్వతీశం". అయితే ఈ నవల రెండోభాగంకూడా యిటీవల వెలువడిన తర్వాత కూడాఎన్నడో వ్రాసిన మొదటిభాగమే బాగున్నదనిపిస్తుంది.

ఈయనకు సమకాలికుడు మునిమాణిక్యం నరసింహారావు. తెలుగు దేశంలోని వైవాహిక జీవితంలో ఉన్న సౌకుమార్యాన్ని

భార్యాభర్తల అనురాగంలో ఉండే సున్నితమైన చమత్కారాన్ని పుస్తకగతం చేసినవాడు మునిమాణిక్యం. నవలలుగా ఉద్దేశించి రాయకపోయినా ఈయన ''ఉపాధ్యాయుడు'' 'కాంతం కైఫీయతు' ''వృద్ధాప్యం'' వంటి రచనలు ఆబాలగోపాలమూ చదివి ఆనందించేవే! గార్హస్థ్య జీవితంలోని హాస్యాత్మకమైన సన్నివేశాలనన్నింటినీ ఈయన రూపుకట్టినట్టు మనముందు ప్రదర్శించాడు.

ఇటీవలి రచయితల్లో హాస్యమే ప్రధానంగా చేసికొని కథలూ నవలలూ వ్రాసినవాడు ముళ్ళపూడి వెంకటరమణ. ఈయన రచనల్లో ''బుడుగు'', ''ఇద్దరమ్మాయిలు-ముగ్గురు అబ్బాయిలు'', 'రాజకీయ భేతాళ—పంచవింశతి'' వంటివి ఈ కాలంలో చాలా ఆదరణ పొందిన రచనలు. ఇందులో ''బుడుగు—చిచ్చుల పిడుగు'' చిన్న పిల్లలకోసం ఉద్దేశించి పెద్దవాళ్ళకోసం రాసిన రచన. ఇందులో కొంటెతనమంతా ''బుడుగు'' అన్న చిన్నపిల్లవాడు వాడిభాషలో చేయడం. రెండుజడలరాధ, పక్కింటి పిన్నిగారువంటి హాస్యపాత్రలని దేశంలో సుస్థిరం చేశాడు ముళ్ళపూడి.

ఈయన రచనలన్నిటిలోనూ నవల అని చెప్పుకోదగ్గది ''ఇద్దరమ్మాయిలు—ముగ్గురబ్బాయిలు'' ఒకటే. ఇందులో కథ సామాన్యమైన ప్రేమకథే అయినా చెప్పినతీరులో ఎంతో విశిష్టత ఉంది. ఈ రకమైన శబ్దగత హాస్యం ఈయన రచన లన్నింటికీ ప్రాణం. చమత్కారాన్ని వెంకటరమణ చాలా రకాలుగా సాధిస్తాడు. ఈయన పాత్రలుకూడా ప్రతీకలుగా నిలిచిపోయేటంత ప్రఖ్యాతి వహించాయి.

ఇటీవలి నవలల్లో మొత్తం హాస్యగర్భితమై నడిచిన నవలల్లో పాలగుమ్మిపద్మరాజుగారి 'బ్రతికిన కాలేజి', గోరాశాస్త్రిగారి ''సెలవుల్లో'' వలె సమకాలీన సమాజంలో నిత్యమూ కనిపించే పాత్రలను గ్రహించి సున్నితమైన వ్యంగ్యంతో వ్రాయబడ్డది.

'బ్రతికిన కాలేజి' అంటే 'జూ'. బ్రతికివున్న జంతువుల ప్రదర్శనశాల అని అర్థం. మనుష్యుల్లో వలెనో వీ ని లో కూ డా ఎన్నోరకాలు. అందువల్లనే పద్మరాజు 'మానవ లోకం ఒక జూ' వంటి దన్నారు. ఇందులో చింతా, పట్టూ, శాంతమ్మ, శంకరయ్య, కళ్యాణి, రాధ అందరూ యీ ''జూ'' లో జంతువులు.

ఈ నవలకు ఆదిలో ఒక సంజాయిషీయిస్తూ పద్మరాజు తాను యిందులో అవలంబించిన రచనా పద్ధతిని గురించి ముచ్చటించారు. "మన సాహిత్యంలో హాస్య రచనలని చెప్పుకోదగ్గవి ఇంచుమించు లేవనేచెప్పాలి. అంచేత ఒక కథని కులాసాగా చెప్పాలని బుద్ధిపుట్టింది, ప్రయత్నం చేశాను" అన్నారు.

హాస్యనవలల్లో మూడు రకాలు ఉన్నాయన్నారు పద్మరాజు. వెకిలితనాన్ని ప్రదర్శించేది ఒక రకం. మనల్ని పొడిచేది మరొక రకం. ఈ రెండు పద్ధతుల్లోను హాస్యం అవాస్తవికమైనది. మన జాతీయ సాహిత్యాలలో మచ్చుకైనా కనబడని ఒక రకం హాస్యముంది' అది ''నిర్దిష్టమైన, స్పష్టమైన సామాజిక ప్రయోజనం ఏదీ లేని'' హాస్యం. ఆంగ్ల రచయితలైన జెరోమ్. కె. జెరోమ్, వోడ్ హౌస్‌లలో యీ పద్ధతి పరాకాష్ట నందుకున్నది. ''అతని పాత్రలలో అతని కయిష్టులంటూ లేరు. వోడ్‌హౌస్ లాగా వ్రాయగలగడం అసంభవమని తెలుసు. అయితే వ్రాయాలన్న అభిలాష చాలా కాలంగా బాధ పెడుతోంది''. దాని ఫలితమే యీ పుస్తకం.

కొంచెం సినిమా టెక్నిక్ లేకుండా వుంటే యిందులో వోడ్‌హౌస్ నవలా లక్షణాలకి ప్రతికృతి పద్మరాజు చక్కగా చేశా రని చెప్పవచ్చు.

తనకి నచ్చిన అమ్మాయిని చేసుకోవడానికి పట్టూ అనే అబ్బాయి పడినశ్రమ యీ నవలకి యితివృత్తం. తీరా ఆ అమ్మా

యిని చేసుకుందామని పెళ్లిపీటల మీదకు వెడితే ఎదురుగా ఆ అమ్మాయికాక, ఆమె అక్క కళ్యాణి పెళ్లికూతురు కావడం, పెళ్లికొడుకు ఎవ్వరితో చెప్పకుండా పారిపోవడం, చివరకు అతని స్నేహితుడు 'చింతా' సహాయంతో పట్టూ రాధని పెళ్ళాడడం జరిగి కథ సుఖాంతం అవుతుంది.

వోడ్ హౌస్ చిత్రించిన పాత్రలవంటి పాత్రలే యిందులోనూ మనకి కనిపిస్తాయి. జీవ్స్‌లాంటి చింతా, వూస్టర్ లాంటి పట్టూ మొదలైనవాళ్లు మాటిమాటికి వోడ్ హౌస్ నవలలను జ్ఞప్తికి తెస్తారు.

ఈ నవలలోని పాత్రల్లో కొంతలో కొంత తెలుగు తనం సాధించినా, సంఘటనలన్నీ చాలా వరకు సినిమా సంఘటనల పద్ధతిలో నడిచాయి. ఇందులో హాస్యం ఎక్కువ భాగం చేష్టాగతమైనది; ఆయాపాత్రల ప్రవృత్తి గతమైనది.

సంభాషణల్లోనూ, భాషా ప్రయోగంలోనూ కూడా యిట్టి చతురతను చూపితే ఆద్యంతమూ హాస్యరసంతో నిండిన అచ్చమైన తెలుగు నవలను పద్మరాజుగారు మనకు అందించవచ్చు.

ఎమెస్కో పుస్తకాలలో వచ్చిన వీరాజీ వ్రాసిన "ఇద్దరం ఒకళ్ళే" అన్న నవలలో సున్నితమైన, అచ్చ తెలుగుతనం ఉట్టిపడే హాస్యం ఎంతో మధురంగా వున్నది. భార్యా భర్తలు, వదినా మరదళ్లు మాట్లాడుకొనే అతిసహజమైన భాషను వాడారు వీరాజీ. వదినా మరదళ్ళ హాస్యం, భార్యా భర్తల హాస్యం, స్నేహితురాళ్ళ హాస్యం చాలా సహజంగా వున్నాయి యిందులో.

కేవలం హాస్యమే ప్రధానంగావున్న యీ నవలలుకాక మరి కొన్నింటిలో హాస్యం మిగిలిన కథలో కలిసి అక్కడక్కడా ప్రదర్శింపబడ్డది. ఇట్టివి మొదటి తరహా రచనలకన్న ఎక్కువేనని చెప్పుకోవచ్చు.

విశ్వనాథ నవలలు సునిశితమైన వ్యంగ్యాన్ని ఆధారంగా చేసుకొని వ్రాయబడ్డాయి. ''విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు'' వంటివి, వేయిపడగల్లో అక్కడక్కడ కనిపించే సన్నివేశాలూ కేవలం అధిక్షేపణ కోసం వ్రాయబడ్డవి. విశ్వనాథ వంటి భావాలు కలిగిన అందరూ వీనిని అమితంగా ఆకర్షణీయమైన భాగాలుగా విశ్వసిస్తారు. అలానే చలం సృష్టించిన కొన్ని పాత్రలు – ముఖ్యంగా ముక్కు పొడుంపీల్చే ప్లీడరువంటి వాళ్లు హాస్యం కలిగించే వారుగా కొందరికి కనిపిస్తారు. కాని ఇవన్నీ ఏకపక్షాశ్రితాలు కావడంవల్ల హాస్యదృష్టి వీనిలో లోపించింది. హాస్యప్రవృత్తికి కావలసిన నిష్పాక్షిక దృష్టి వీనిలో మృగ్యం అనే చెప్పాలి.

తరువాత పేర్కొనదగినవారు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు. ఈయన చిన్న కథలనే "నవలిక"లు అన్నీ తెలుగు జాతీయ జీవనాన్ని, సున్నితమూ, నిష్కల్మషమూ అయిన పల్లె జీవితంలోని హాస్య రసాత్మకములైన సన్నివేశాలనూ చూపేవే!

బుచ్చిబాబు "చివరకు మిగిలేది"లో హాస్యం పాత్రగతమైంది. బుచ్చిబాబు యిందులో సృష్టించిన జగన్నాథం పాత్ర ఎంతో రిలీఫ్ కలగచేసే పాత్ర–గ్రీక్ నాటకాల్లో 'కోరస్' లాగా, షేక్స్పియర్ లోని "ఫూల్" మాదిరిగా – అతి నిష్కల్మషుడై, పల్లెటూరిలో స్వచ్ఛంద జీవితాన్ని గడిపే జగన్నాథం పాత్ర అతను మాట్లాడే భాషలోను, అతని భావాలలోనూ కూడా హాస్యగతమైనదేనని చెప్పవచ్చు. మనం ముఖ్యంగా గమనించ వలసిందేమంటే, జగన్నాథం సమక్షంలో అతి సీరియస్‌గా వుండే వ్యక్తులుకూడా హాస్యప్రవృత్తి కల వారుగా మారిపోతారు.

గొల్లపూడి మారుతీరావు వ్రాసిన 'చీకటిలో చీలికలు' లో వెంకటపతి చాలవరకు 'జగన్నాథం' పాత్రను పోలినవాడే!

ఈనాడు హాస్యరస భరితమైన పాత్రలనో, సంఘటనలనో సృష్టించని రచయితలు లేనేలేరని చెప్పవచ్చు. కాని యివి ఏవీ యీ సందర్భంలో చెప్పుకోదగినంత ప్రసిద్ధికి వచ్చినవికావు.

పోతే మరొక్క రచయితను గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి — అతడు కొడవటిగంటి కుటుంబరావు. అతడు సునిశితమైన వ్యంగ్యం వ్రాయగల కొద్దిమందిలో ఒకడు. తన పాత్రల చిత్రణలో, వారి సంభాషణల్లో యింత పదునైన వ్యంగ్యం చూపించగల రచయిత సమకాలిక తెలుగు రచయితల్లో మరొకడు లేడనేచెప్పాలి. తనకు నచ్చని విషయాన్ని ఏనాడూ బహిరంగంగా విమర్శించక, అవి అన్నీ పాత్రల ద్వారానే చెప్పించ గలిగిన నిష్పాక్షిక రచయితయితడు. అతడు వ్రాసిన 'ప్రేమించిన మనిషి', 'కొత్తఅల్లుడు', 'కొత్త కోడలు' — యివి అన్నీఅతి సునిశితమైన వ్యంగ్యానికి ఆటపట్లు.

ఇవి అన్నీ ఒక ఎత్తు. అతడు డిటెక్టివ్ కథలకు వ్రాసిన పేరడీ ఒక ఎత్తు. (టి. వి. శంకరమ్ అన్న పేరుతో) అయితే యిందులో హాయినికూర్చే హాస్యం కన్న చురక తగిలించే వ్యంగ్యం అందులోనూ నర్మగర్భితమైన వ్యంగ్యం — ఎక్కువ. ఇట్టిదే మహీధర రామమోహనరావుగారి 'స్వయంవరణం' లోనూ చూడవచ్చు. ఇంతకన్న ప్రత్యక్షమైన వ్యంగ్యం రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి యిటీవలి రచనల్లో మనకు కన్పిస్తున్నది.

# తెలుగు నవల
# అనుకరణలు, అనువాదాలు

నవలా సాహిత్యం మనకు కొత్త ప్రక్రియ. ఇది ఆంగ్లేయ ప్రభావంవల్ల ప్రారంభం అయిందని నిశ్చయంగా చెప్పవచ్చు. నవలా రచనకు ఆదిలో మనకు మూలగ్రంథాలు లేకపోవడంవల్ల, ఇంగ్లీషు నవలల ఒరవడినే మనం అనుసరించాం. ఏ కొత్త సాహిత్యం అయినా అది మరొక దేశాన్నుంచి మనం తెచ్చుకున్నప్పుడు — అనువాదాలతోనూ, అనుకరణలతోనూ ప్రారంభం కావలసిందే !

అందువల్లనే తెలుగు నవలా సాహిత్యాన్ని పరిశీలిస్తే మొట్టమొదటి నవలలు, ఆంగ్లం నుంచి అనుకరణలై రానురాను దేశీయ భాషల నుంచి అనువాదాలు ప్రారంభింపబడ్డాయి. ఆ తరువాత — రెండవ ప్రపంచయుద్ధం తరువాత—అన్ని ప్రపంచభాషల నుంచి అనువాదాలు చేయబడ్డాయి,

ఈ అనువాద నవలా సాహిత్యాన్ని గమనిస్తే మనకు ఒక్క విషయం తోచకమానదు. మౌలికమైన నవలా సాహిత్యంవలెనే అనూదితమైన నవలా సాహిత్యంకూడా ఆయా కాలాలలో సంఘంలో ప్రజ్వలిత మవుతున్న భావాలకు అనుగుణంగా వ్రాయబడ్డవి. అంటే మొదటి తరంలో పాశ్చాత్య నాగరికతా ప్రభావం, మోజు ఎక్కువగా వుండి ఏర్పడిపోయిన సమాజంలోని వ్యక్తులను గురించి మాత్రమే నవల వర్ణించినప్పుడు అందుకు అనుగుణంగా అట్టి ఆంగ్ల నవలా సాహిత్యాన్ని మనం అనువదించుకున్నాం. అలాగే తరువాతి తరంలో జాతీయోద్యమ ప్రభావం ఎక్కువగావున్న రోజులలో జాతీ

యోద్యమానికి ఆలవాలమయిన వంగదేశం నుంచి ఆ వుద్యమాన్ని తన నవలల్లో సర్వదా ప్రతిబింబింపచేసిన బంకించంద్ర ఛటర్జీ నవలల్ని మనం అనువదించుకున్నాం. ఇక మూడవతరంలో మన దృక్పథమూ, సమాజజీవనమూ, పరిస్థితులకు అనువుగా విస్తృతమైనప్పుడు దేశీయమైన ఇతర భాషలనుంచి, ఇతర దేశాల భాషలనుంచి మనకు అనువాదాలు వచ్చాయి.

నిజానికి మౌలికమయిన నవలలకన్నా అనువాదాలు అనుకణరలే అధిక సంఖ్యలో వుండడం మన నవలా సాహిత్యంపట్ల నిజమైన విషయం. అందువల్ల ఇక్కడ ఆయా ప్రవృత్తులను మాత్రమే వివరించడం జరుగుతుంది. అనూదితమయిన నవల లన్నింటినీ ఇక్కడ పేర్కొనడం నా అభిమతం కాదు.

తెలుగులోకి వచ్చిన మొదటిఅనువాదం — మొదటి నవలగా చెప్పబడుతున్న "మహాశ్వేత". ఇది కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు బాణకృతమైన సంస్కృత "కాదంబరి" కి పాక్షికమైన అనువాదం. ఇది అసంపూర్తిగా ప్రచురింపబడడంవల్ల, సంస్కృత సాహిత్యంలోని ఒక గ్రంథానికి అనువాదం కావడంవల్ల మొదటి నవలగా అంగీకరింపబడలేదు. సంస్కృతం నుంచి కథారూపంలో అనువదింపబడ్డ ఒకేఒక గ్రంథం "మహాశ్వేత". ఇటీవల వచ్చిన భారత భాగవతాలకు వచనానువాదాలు, రఘువంశాది మహాకావ్యాలకు వచ్చిన గద్యానువాదాలు ఈ కోవకే చెందుతాయి. అయితే వెంకటరత్నం గారి ప్రయత్నంలో కొంత మౌలికత కన్పిస్తుంది. అది కాదంబరి మొత్తం కథనుంచి తనకు ఆవశ్యకమయిన "మహాశ్వేత" కథను మాత్రమే స్వీకరించి అనువదించడం.

తెలుగులో ఇంగ్లీషు నుంచి అనువాదాలకు, అనుకరణలకు మూలపురుషుడు కందుకూరి. ఈయన వ్రాసిన నవల "రాజశేఖర

చరిత్ర" ఆయనే చెప్పుకొన్నట్లు గోల్డుస్మిత్ వ్రాసిన "ది వికార్ ఆఫ్ వేక్ ఫీల్డు"కు అనుసరణ. యథాతథమైన అనువాదం మాత్రం కాదు. అయితే ఇందులోవున్న పాత్రలు, చాలా సంఘటనలు ఆంగ్ల నవలను అనుసరించి వ్రాయబడ్డవే! కందుకూరి మౌలికత అంతా ఆయన సంఘ విమర్శకోసం ఇందులో చొప్పించిన ఘట్టాలే. ఈ ఘట్టాలు ఉపన్యాసాత్మకాలు. కథా కథనం, ఇతివృత్త స్వీకరణ, పాత్ర చిత్రణవంటి ముఖ్యమైన నవలా లక్షణాలన్నింటిలోనూ ఆయన గోల్డుస్మిత్‌ని అనుసరించాడని చెప్పకతప్పదు.

ఇవికాక నవల అని చెప్పకపోయినా "సత్యరాజా పూర్వదేశ యాత్రలు" కూడా యిట్టిదే. ఇందులో రెండు భాగాలు వున్నాయి. ఒకటి "ఆడమళయాళము", రెండవది "లంకా ద్వీపము". సంఘ సంస్కరణమును, మూఢాచారాల విమర్శను వ్యంగ్యాత్మకమయిన పద్ధతిలో అతినిశితంగా ఎలా చేయవచ్చునో వీరేశలింగంగారు స్విఫ్ట్ వ్రాసిన "గలివర్స్ ట్రావెల్స్"ను చదివి గ్రహించారు. గ్రంథానికి ఆదిలో గలివర్ తన ఆత్మచరిత్రను చెప్పుకొన్నట్లుగానే దీనిలోనూ సత్యరాజు తన చరిత్రను, తన ప్రయాణానికిగల కారణాలను వివరిస్తాడు. గలివర్ లిల్లిపుట్ దేశానికి వెళ్ళినట్టుగానే సత్యరాజు ఆడు మళయాళమునకు పోతాడు. కానీ ఆడుమళయాళంలో కందుకూరి వారు చూపించిన ఏ సంఘటనా, స్విఫ్ట్‌లో మనకు కనిపించదు.

అయితే ఈ గ్రంథంలోని రెండవ భాగమైన లంకాయాత్ర మాత్రం గలివర్ బ్రాబ్డింగ్‌నాగ్ పోవడాన్ని అనుసరించి చేయబడ్డ అనువాదం. "బ్రాబ్డింగ్‌నాగ్"లో వలెనే ఇందులోకూడా మహా కాయులు సత్యరాజును ఆటవస్తువుగా చూడడం ప్రతిక్షణమూ సత్య రాజుకు ప్రాణసంకటంగా వుండడం చూపబడ్డది.

చిలకమర్తికూడా కొన్ని అనువాదాలు చేసినవాడే. ఇందులో రెండు ముఖ్యమైనవిగా చెప్పవచ్చు. మొదటిది "సుధాశరచ్చంద్రము". రమేష్‌చంద్ర దత్తు ఆంగ్లంలో వ్రాసిన "The Lake of Palms" అన్న నవలకు యిది అనువాదం. టాడ్ వ్రాసిన "Annals of Rajasthan" అన్న గ్రంథాన్ని "రాజస్థాన కథావళి" అన్న పేరుతో శ్రీ చిలకమర్తి అనువదించారు. దీనిలోని కథలను స్వీకరించి చాల మంది నవలలను వ్రాశారు.

చిలకమర్తి మరో అనుకరణ "శ్యామల" షేక్స్పియర్ వ్రాసిన "మాక్‌బెత్"కు దగ్గరగా వున్నకథ. నిడుద్రోలు రాజ్యాన్ని పొందడానికి ఒక సన్యాసి చెప్పినమాటవిని విజయరాయుడన్న ఒక సైన్యాధిపతి రాజును చంపడం ఇందులో కథ.

చిలకమర్తి వ్రాసిన "అహల్యాబాయి", "టిప్పుసుల్తాను" మొదలయిన నవలలు మెడోస్ టేలర్ వ్రాసిన సుల్తాను, తార, చాంద్‌బీబీ వంటి నవలలకు అనుకరణలు. భారతీయ భాషల నుంచి చేయబడ్డ మొదటి అనువాదం 1899లో బంకించంద్ర ఛటర్జీ వ్రాసిన "కపాల కుండల"కు శ్రీ ఒ. వై. దొరస్వామయ్య చేసిన అనువాదం. ఈయనే 1907లో బంకిం వ్రాసిన 'ఆనందమఠం' అన్ననవలను కూడా అనువదించారు. 1909లో కనకవల్లి భాస్కరరావు వ్రాసిన బంకిం అనువాదము "ప్రఫుల్లముఖి" కూడా ఈ కాలంలో ప్రఖ్యాతమే.

1909లో కృపాబాయి సత్యనాధమ్మ అన్న క్రైస్తవ స్త్రీ "కమలాంబ" అన్న నవలను ఆంగ్లం నుంచి అనువదించింది. ఇదికాక 1909లో మళయాళం నుంచి చాంద్‌మీనన్ వ్రాసిన "ఇందులేఖ"కు అనువాదంగా దొడ్ల వెంకట్రామరెడ్డిగారు "కళావతి" అన్న నవలను వ్రాశారు.

ఇవి అన్నీ ప్రథమదశకు చెందిన నవలలు. వీనిలో చాలాభాగం గ్రాంధిక భాషలో జటిలమైన సమాసాలతో వ్రాయబడ్డవి. అనువాద సాహిత్యంలో దీనిని మొదటి యుగంగా పేర్కొనవచ్చు. ఇక రెండవది ముఖ్యమైన అనువాదయుగం. ఈ రెండవ యుగంలో మౌలిక నవలకన్నా, అనుకరణలకన్నా అనువాదాలే లెక్కకు మిక్కిలిగా వచ్చాయి. పాఠకులచే అభిమానింప బడ్డాయికూడా.

## అనువాదయుగం (1910-1925)

మొట్టమొదటి అనువాదం 1899లోనే చేయబడ్డా, నిజానికి 1910 నుంచీ 1925 దాకావున్న కాలాన్ని అనువాదయుగంగా చెప్పకోవచ్చు. ఈ అనువాదయుగంలో అనుకరణలు అనువాదాలూ రెండూ వచ్చాయి. ఇవి అన్నీ 1910 కి ముందే చేయబడ్డ అనువాద అనుకరణ పద్ధతులను అనుసరించే చేయబడ్డాయి. అయితే ఈ అనువాద యుగం 1910 నుంచే ప్రారంభం కావడానికి రెండు కారణాలు చెప్పుకోవచ్చు.

మొదటిది తెలుగు ప్రచురణపద్ధతుల్లో 1910 ఒక మైలు రాయి. 1906–1912 మధ్యకాలంలో అత్యంత ముఖ్యమైన మూడు గ్రంథమాలలు తెలుగుదేశంలో స్థాపించబడ్డాయి. 1906 లో కొమర్రాజు లక్ష్మణరావు, రాజా వెంకటరంగారావు, రావిచెట్టు రంగారావు, ఆచంట లక్ష్మీపతిగార్ల ఆధ్వర్యంలో విజ్ఞానచంద్రికా గ్రంథమండలి స్థాపింపబడ్డది, 1911లో తణుకు కార్యస్థానంగా ఆంధ్రప్రచారిణీ గ్రంథమాల స్థాపించబడ్డది. ఈ గ్రంథమాలకు సంపాదకులు వేంకట పార్వతీశకవులు. 1912 లో బరంపురంలో వేగుచుక్క గ్రంథమాల స్థాపించబడ్డది.

విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి ''చారిత్రకాను సారములైన కల్పిత కథల''కు ప్రాముఖ్యం ఇచ్చింది. ఆంధ్రప్రచారిణీ గ్రంథ మాల అటు చారిత్రకాలకు, చారిత్రక అనువాదాలకు, ఇటు అపరాధ పరిశోధక నవలలకు స్థానం ఇచ్చింది. ఇక వేగుచుక్క గ్రంథమాల ఎక్కువగా అపరాధ పరిశోధక నవలలకే ప్రాముఖ్యం ఇచ్చింది. ఈ మూడూకాక, ఇదేకాలంలో కనీసం మరో అయిదారు గ్రంథమాలలు తెలుగుదేశంలో ప్రారంభింపబడి అప్పుడే విద్యార్జనము ఎక్కువగా చేయడం ప్రారంభించిన మధ్య తరగతి ప్రజల చదివే అభ్యాసాన్ని పెంపొందించాయి. పెరుగుతున్న పాఠకుల ఇష్టాఇష్టాల దృష్ట్యా పై మూడు గ్రంథమాలలు తమతమ ఆశయాలను నిర్ధారణచేసుకున్నాయి. విజ్ఞానచంద్రికా గ్రంథమండలి భారతీయ ఆంధ్రచరిత్రల్ని ప్రజలకు దగ్గరగా తీసుకురావాలనే ఉత్తమ ఆదర్శమే ధ్యేయంగా తన గ్రంథా లను ప్రకటిస్తూ వచ్చింది. ఆంధ్రప్రచారిణీ గ్రంథమాల అటు పాఠ కుల రుచి భేదాలకు, ఇటు సాహిత్య వైజ్ఞానిక ఆదర్శాలకు ఒక సమన్వయం సాధించడానికి ప్రయత్నించింది. వేగుచుక్క గ్రంథ మాల కేవలం పాఠకుల అభిరుచిని అనుసరించే పుస్తక ప్రకటనచేస్తూ వచ్చింది.

ఈ కాలం అనువాద కాలం అనడానికి రెండో కారణం — అంతకు ముందుగానీ, ఆ తరువాతగానీ వచ్చిన అనువాదాలకన్నా ఈ కాలంలోని అనువాదాలు గుణగణాల రెంటిలోనూ అత్యధికం. వెను కనే చెప్పినట్లు బంకించంద్ర ఛటర్జీతో ప్రారంభమై అటు ఇంగ్లీషు, ఇటు వంగసాహిత్యాల్లోని ఉత్తమమైన నవలల అనువాదానికి ఇవి దారి తీశాయి.

ఈ అనువాద సాహిత్యయుగాన్నే చారిత్రక నవలాయుగం అని కూడా అనవచ్చు. దీనికికూడా కారణాలు లేకపోలేదు. ఈ కాలంలో వచ్చినన్ని చారిత్రక నవలలు మరి ఏ ఇతర కాలంలోనూ

రాలేదు. దీనికి కారణం ఆనాటి దేశవాతావరణమే. జాతీయోద్యమ ప్రభావం, దాని తరువాత వచ్చిన ఆంధ్రోద్యమ ప్రభావం జాతిదృష్టిని తమ చరిత్రవైపుకు మళ్ళించింది. ఇదే ప్రవృత్తిని నాటకాలలోకూడా మనం చూడవచ్చు.

ఈకాలంలో చెప్పుకోదగ్గ మరో ముఖ్యలక్షణం ఈ చారిత్రక నవలలు కొన్ని, అనువాదాలు, కొన్ని మౌలికాలుగా వుండడం. భారతీయ చరిత్రకు సంబంధించిన దాదాపు అన్ని నవలలు అనువాదాలో, అనుకరణలో కాగా ఆంధ్రదేశ చరిత్రకు సంబంధించినవి అన్నీ మౌలికాలు.

భారతీయ చరిత్రకు సంబంధించిన నవలల్లో ముఖ్యమైనవి బంకిం చంద్రకు అనువాదాలు అన్న సంగతి వెనుకనే చెప్పబడ్డది. ఆనంద మఠం, కపాల కుండలవంటివి 1910కి పూర్వమే వచ్చిన ముఖ్యమైన నవలలు. ఇవికాక 1910లో బంకిం వ్రాసిన "కృష్ణకాంతుని మరణ శాసనం'' అన్న నవలకు చిల్లరిగె శ్రీనివాసరావు చేసిన అనువాదము, అదే నవలకు 1914లో వేంకట పార్వతీశ కవులు చేసిన అనువాదము ప్రశస్తములు. తల్లాప్రగడ సూర్యనారాయణగారి "శైవలినీ చంద్ర శేఖరము'', చాగంటి శేషయ్యగారి ''రాధారాణి'', వేంకట పార్వతీశ కవుల ''రాజసింహ'' మొదలైన అనేక నవలలు బంకిం అనువాదాలు.

ఈకాలంలో అనువదింపబడిన మరో బెంగాలీ రచయిత రమేష చంద్రదత్. ఈయన వ్రాసిన ''ది లేక్ ఆఫ్ పామ్స్'' అన్న ఆంగ్ల నవలకు చిలకమర్తివారి అనువాదం "సుధాశరచ్చంద్రము"ను గురించి వెనుకనే పేర్కొన బడ్డది. ఈయన నవలలను అనువదించిన వారిలో తల్లాప్రగడ సూర్యనారాయణగారు ముఖ్యులు. (మాధవీ కంకణము 1910.)

ఈ కాలంలోని అనువాద కర్తలలో చాగంటి శేషయ్యగారు కూడా ముఖ్యులు. ఈయన 1910లో బంకిం వ్రాసిన 'రాధారాణి'ని, 1911లో ''దుర్గేశనందిని''ని, 1915లో ''నవాబు నందిని''ని అనువదించారు. దుర్గేశనందిని, నవాబునందిని నవలలు ఇదే కాలంలో అనేక మందిచేత అనువదింపబడి పాఠకుల ఆదరణను చూరగొన్నాయి. ధీరేంద్రనాథ్‌పాల్ వ్రాసిన ''మొగలాయీ దర్బారు'' మూడు భాగాలుగా వచ్చింది. దీని అనువాదకర్త మొసలికంటి సంజీవరావు.

ఈ కాలంలో ప్రసిద్ధికి వచ్చిన అనువాదకర్తలు (వీరు మౌలిక నవలా రచయితలు కూడా) అయిదుగురు — వేంకట పార్వతీశకవులు, కేతవరపు వేంకటశాస్త్రి, చాగంటి శేషయ్య, తల్లాప్రగడ సూర్యనారాయణ, భోగరాజు నారాయణమూర్తిగార్లు. కేతవరపు వేంకటశాస్త్రి వ్రాసిన నవలల్లో ''తారాబాయి'', ''ఇచ్ఛినీకుమారి'' అన్న నవలలు అనుకరణలు. ఈయన ప్రసిద్ధ ఆంగ్ల చారిత్రకనవలా కారుడు సర్ వాల్టర్ స్కాట్ వ్రాసిన ''ఐ వాన్ హో'' ను 1910లో అనువదించారు.

భోగరాజు నారాయణమూర్తిగారి నవలల్లో ''ఆంగ్ల రాజ్య స్థాపన'', ''విమలాదేవి'' వంటి నవలలు ముఖ్యమైనవి. ఆంగ్ల సాహిత్యంనుంచి చేయబడ్డ అనుకరణలలో చిలకమర్తి ''ది స్లేవ్ గర్ల్ ఆఫ్ ఆగ్రా'' అన్న రమేషచంద్ర దత్తు వ్రాసిన నవలకు ''దాసీకన్య'' అన్న అనువాదము, వెంకట పార్వతీశకవుల ''శ్యామల'' (క్విన్‌టిన్ డర్‌వార్డ్, 1920) అక్కిరాజు ఉమాకాంతంగారి 'టిప్పుసుల్తాను' (1913) పేర్కొనదగినవి. ''ఒథెల్లో''కి అనువాదం ''కనకాంగి'' అన్న పేరుతో కాకరపర్తి సత్యనారాయణగారు చేశారు. (1923)

వేంకట పార్వతీశకవుల అనువాదాలన్నీ వారు సరాసరి వంగ నవలల నుంచి చేయలేదు. వానిని కన్నడంలో శ్రీ వేంకటాచార్యులు అనువదించగా ఆ కన్నడ నవలల ఆధారంగా తెలుగుచేశారు వీరు.

ఈ కాలంలోనే కొన్ని నవలలు మరాఠీ నుంచికూడా అనువదింపబడ్డాయి. శ్రీ వాసుదేవరావు అనువదించిన హరినారాయణ ఆప్టే వ్రాసిన "సింహగడము", "దృఢప్రతిజ్ఞ" అన్న నవలలు ఈ కోవకు చెందినవి.

ఈ కాలంలో వచ్చిన అపరాధ పరిశోధక నవలలు అన్నీ దాదాపు అనువాదాలుగానే పేర్కొనవచ్చు. ఈ అనువాదాలు అన్నీ ముఖ్యంగా బెంగాలీనుంచి చేయబడ్డాయి, బెంగాలీలో వీనికి ఆది పురుషుడు "పాంచ్ కడీదేవ్". ఆంధ్రప్రచారిణీ గ్రంథమాల, వేగుచుక్క గ్రంథమాల ఇట్టి నవలల్ని అశేషంగా అనువదింపచేసి ప్రకటించాయి. ఈ అనువాదకుల్లో వేంకట పార్వతీశకవులు, కేతవరపు వేంకటశాస్త్రి, చాగంటి శేషయ్యగార్ల వంటి ప్రఖ్యాతులు కూడా వున్నారు. వీరుకాక దేవరాజు వేంకట కృష్ణారావు, గార్లపాటి ఆంజనేయులు, మొసలికంటి సంజీవరావు వంటి చాలా మంది యీ అనువాదాలు చేశారు.

తరువాతి యుగంలో వచ్చిన నవలలు చాలా వరకు మౌలికమైన రచనలు. ఇది తెలుగు నవలకు వికాస యుగంగా చెప్పుకోవచ్చు. ఈ కాలంలో వచ్చిన నవలల్లో ముఖ్యంగా పేర్కొనదగ్గవి "మాలపల్లి, వేయి పడగలు, అసమర్థుని జీవయాత్ర, కీలుబొమ్మలు, చివరకు మిగిలేది". మాలపల్లికీ ఈస్ట్‌లిన్‌కీ వున్న సంబంధాన్ని గురించి ఇది వరకే చాలా మంది పేర్కొన్నారు. అయిదే మాలపల్లిలోని ఒకే ఒక్క సంఘటనకు ఈస్ట్‌లిన్ మూలమని చెప్పక తప్పదు. "వేయిపడగలు" గాల్స్‌వర్దీ వ్రాసిన "ఫోర్‌సైట్ సాగా" కు ఆత్మబంధువు అని విమర్శకులు చెప్పినదానిలో ఏ మాత్రమూ నిజంలేదు. రెంటిలోనూ మూడుతరాల కథ చెప్పడం తప్పించి ఆ రెంటికీ మరోసంబంధంలేదు. "అసమర్థుని జీవయాత్ర" కూడా స్టొవస్కీ వ్రాసిన "ఇడియట్", గోర్కీ వ్రాసిన "ది మాన్

హూ వజ్ ఎఫ్రైడ్'' అన్న నవలలు ఆధారాలని చెప్పబడుతున్నవి. పై నవలలకు వలెనే, ఈ నవలకు ఆంగ్లమాతృకలకు సంబంధం కేవలం ఆ భావాలను స్వీకరించడమే. ఇక జి. వి. కృష్ణారావుగారి "కీలుబొమ్మలు'' కు ''ది పవర్ ఆఫ్ ఎ లై '' సూచనా మాత్రంగా ఆధారం అని రచయితే చెప్పుకొన్నారు. కాని కృష్ణారావుగారు ఆ నవలలోని కథనుగాని, పాత్రలనుగాని, సంఘటనలనుగాని, ఏ మాత్రమూ స్వీకరించలేదు. ఒకరి జీవితంలో ఒకసారి ఆడిన అబద్ధానికి చాలా మంది జీవితాలలో కలిగే పరిణామం ఇందులో సూచించ బడ్డది. ఇంత వరకే ఆంగ్ల మాతృకకూ దీనికీ సంబంధం.

ఇట్టి సూచనమాత్రమైన అనుకరణలు కాక, ఈ కాలంలో వచ్చిన అనువాదాలలో కొన్ని ముఖ్యమైన వానిని ఇక్కడ పరిశీలిద్దాం. ఈ కాలంలోనే ప్రసిద్ధ బెంగాలీ నవలా రచయిత శరత్ అనువాదం ప్రారంభం అయింది. తెలుగులోకి వచ్చిన మొదటి శరత్ అనువాదం "అరక్షణీయ'' కు శ్రీ సూర్యప్రకాశరావు చేసిన అనువాదం(1929). కాని శరత్ అనుకర్తలలో శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారిది ప్రముఖమైన స్థానం. ఆయన చేసిన "రాముని బుద్ధిమంతతనం'', ''స్వామి'' వంటి అనువాదాలు అనువాదాలుకాక మౌలికమైన రచనల లాగానే ఈ నాటికీ స్వీకరింపబడు తున్నాయి. శరత్ అను వాద కర్తల్లో ''చక్రపాణిగారు'' కూడా అగ్రస్థానం వహిస్తారు. ఈయన అనువదించిన "పరిణీత" "బడదీదీ" ''వాగ్దత్త'' నవలలు యువ ప్రచురణల్లో చాలా ప్రఖ్యాతి వహించాయి.

1944_45 నుంచీ తెలుగు నవలా సాహిత్యం ఒక ప్రక్క మౌలికమైన రచనలతోనూ, మరో ప్రక్క అనువాదాలతోనూ, తనని తాను పరిపుష్టం చేసుకున్నది. స్వాతంత్ర్యం వచ్చాక, సర్వభాషా సాన్నిహిత్యం ఎక్కువై దాదాపు ప్రపంచంలోని అన్ని భాషలనుంచీ తెలుగులోకి నవలలు అనువదింపబడ్డాయి. సాహిత్య పరంగానూ,

అనువాదం దృష్ట్యానూ, వుత్తమమైన కొన్నింటని మాత్రమే ఇక్కడ పేర్కొనడానికి వీలున్నది. ఈ నవలల్లో ఎక్కువభాగం బెంగాలీ, ఇంగ్లీషు, రష్యన్‌భాషల నుంచి చేయబడ్డవి. ఈ అనువాదాల్లో బెంగాలీ అనువాదాలు అసంఖ్యాకాలు.

దేశి కవితామండలి, ఆదర్శ గ్రంథమండలి వంటి గ్రంథ ప్రకాశక సంస్థలు శరత్ సాహిత్యాన్నంతనీ 13, 14 సంపుటాల్లో మనకు అందించాయి. ఇందులో పైచేయి దేశికవితా మండలిది. శరత్ సంపుటాలు దేశంలో వేలకొద్ది అమ్ముడు పోయాయి. ఈ నవలల అనువాదకుల్లో బొందలపాటి శివరామకృష్ణ, శకుంతలాదేవి, పురాణం కుమార రాఘవశాస్త్రి, రమేష్ వంటి రచయితలు ఎందరోవున్నారు.

బెంగాలీ రచయితల్లో ఎక్కువగా అనువదింపబడ్డ మరో రచయిత విశ్వకవి రవీంద్రనాధ టాగూరు. 1962 —63 లో ఆయన శతజయంతి ఉత్సవ సందర్భంగా ఆయన నవలలన్నీ ముగ్గురు నలుగురు చొప్పున అనువదించారు. రవీంద్రుని "గోరా" చాలా కాలం క్రితమే వేంకట పార్వతీశకవులచే అనువదింపబడ్డది. అప్పుడు వచ్చిందే "పడవ మునక" కూడా. ఈ నవలలన్నీ తిరిగి, ఈ సందర్భంలో ప్రకటించ బడ్డాయి. కేంద్ర సాహిత్య అకాడమీకూడా మూడు నవలల్ని తెలుగులోకి తర్జుమా చేయించింది. శ్రీ శివశంకర స్వామి, వీరరాఘవస్వామిగారలు ఈ అనువాదాలు చేశారు. ఈ అనువాదాలను గురించి ప్రత్యేకంగా చెప్పవలసిందేమీ లేదు- ఇవి చదవడానికి చాలా అయోగ్యాలని తప్ప. పైన పేర్కొన్న వారి అనువాదాలకన్న కేంద్ర సాహిత్య అ కా డ మీ కోసమే వేదుల సత్యనారాయణశాస్త్రిగారు చేసిన "వినోదిని" అనువాదం సుగమమైనది.

శత జయంతి కాలంలో రవీంద్రుని అనువాదాలు శతాధికంగా వచ్చాయి. ఆ కాలంలో రవీంద్రుని నవలలను అనువదించిన వారిలో ప్రముఖుడు శ్రీ శ్రీనివాస చక్రవర్తి. రవీంద్రుని నవలలన్నీ— చిన్నవీ పెద్దవీకూడా— తెలుగులోకి అనువదింపబడ్డాయి. ఈ అనువాదాలు చేసిన వారిలో దండమూడి మహీధర్, విరించి, నన్నపనేని సుబ్బారావు, మోటూరి వెంకటేశ్వరరావు, అగ్నిహోత్రం రంగాచార్యులు మొదలైన వారు ముఖ్యులు.

బెంగాలీ నుంచి నవలా సాహిత్యాన్ని 1925 ప్రాంతాలకే అనువదించడం ప్రారంభించారు వేంకట పార్వతీశకవులు. అదే కాలంలో శివశంకరస్వామిగారు కూడా యిట్టి నవలలను అనువదించారు. ఇందులో పేర్కొనదగినవి ప్రభాత్‌కుమార్ ముఖోపాధ్యాయ నవలకు ఆయన స్వేచ్ఛానువాదం ''కుంకుమ భరిణి''.

ఇటీవల బంకించంద్ర నవలల అనువాదాలు కూడా చాలా వచ్చాయి. దండమూడి మహీధర్ అనువదించిన ''కృష్ణకాంత్'', ''విషవృక్షం'', ''మృణాళిని'', ''రాజసింహ'' ప్రత్యేకంగా పేర్కొనదగిన నవలలు. ఈ నవలలను సూటిగా బెంగాలీనుంచి అనువదించడంతో, మాతృకకు దగ్గరగా ఉన్నట్లు అనిపిస్తాయి. బంకించంద్ర నవలలకు వచ్చిన యితర అనువాదాలలో కమలాసనుడు అనువదించిన ''ఆనందమఠం'', డి. వెంకట్రామయ్య అనువదించిన ''సీతారాం'', కె. రమేశ్ అనువదించిన ''మాతంగిని'' ''శైవలిని'' ముఖ్యమైనవి.

బెంగాలీ రచనల్ని విరివిగా తెలుగు వారికి అందించిన వాడు శ్రీ మద్దిపట్ల సూరి. ఈయన చేసిన అనువాదాలలో విభూతిభూషణ్ బెనర్జీ వ్రాసిన ''పథేర్ పాంచాలి'', తారాశంకర్ బెనర్జీ ''విహిళ'', ''ఉత్తరాయనం'', అనురూపాదేవి ''మంత్రశక్తి'', తారాశంకర్

వంధ్యోపాధ్యాయ ''కాళింది'', శైలజానంద ముఖర్జీ 'విశాలహృదయులు'', నిహార్ రంజన్‌గుప్త ''మాయామృగం'' ముఖ్యమైనవి. ఇవి అన్నీ అనువాదాలే అయినా, మౌలికమైన రచనలనిపించే టంత సుగమంగా వ్రాయబడ్డాయి.

హిందీ నవలా సాహిత్యం కూడా యీ మధ్యనే తెలుగులోకి అనువదింప బడుతోంది. ప్రేమచంద్ వ్రాసిన ముఖ్యమైన నవలల నన్నింటినీ అనువదించడానికి విజయవాడలో ఒక ప్రచురణ సంస్థ నెలకొల్ప బడ్డది. ప్రేమచంద్ ప్రముఖ నవల ''గోదాన్'' కు పిచ్చేశ్వరరావు అనువాదం తెలుగులోని చక్కని అనువాదాలలో ఒకటి. 'అల్లన్' చేసిన ''మనోరమ'', ''వరదాన్'', ''రెండు తరాలు''; ఆలూరి భుజంగరావు చేసిన ''నిర్మల''; చావలి రామ చంద్రరావు చేసిన ''చదరంగ యోధులు, మంగళసూత్రం, జోడెద్దులు''; యన్. యస్. వి. సోమయాజులు చేసిన ''నారీ జీవనము'', ''గృహస్వామిని'' అనువాదాలు ప్రేమచంద్ అనువాదాలలో పేర్కొన దగినవి.

ప్రేమచంద్ అనువాదాలు కాక జయశంకర ప్రసాద్, జైనేంద్ర కుమార్, కిషన్ చందర్ (హిందీ నుంచి, ఉర్దూ నుంచి కూడా), ఇలా చంద్రజోషీ, ప్రభృతుల హిందీ నవలలు ఆంధ్రీకరించ బడ్డాయి. జైనేంద్ర కుమార్ నవలా సాహిత్యంలో చాలా భాగాన్ని ''ఛాయేశ్వర్'' అనువదించారు. ద్వివేదీ వ్రాసిన ''బాణభట్టుని ఆత్మకథ''ను కేంద్ర సాహిత్య అకాడమీ అనువదింప చేసింది.

ఇతర భారతీయ భాషల నుంచికూడా అనువాదాలు యిప్పుడిప్పుడే వెలువడు తున్నాయి. ముఖ్యంగా మన పొరుగు రాష్ట్రాలైన కన్నడ, మరాఠీ భాషలనుంచి పలువురు అనువాదాలు చేస్తున్నారు. తమిళం నుంచి వచ్చిన కొద్ది అనువాదాలలో

యం. వరదరాజన్ వ్రాసిన నవలకు జయచంద్రారెడ్డి చేసిన ''మధువు మాధుర్యం'' అన్న అనువాదం చెప్పుకో దగ్గది. మరాఠీ నుంచి నవలలను అనువదించిన వారిలో శ్రీ యన్. జగన్నాథ్ ముఖ్యుడు. మహాదేవ్‌శాస్త్రి జోషి నవలలను ఆయన ''పుత్రవతి'', ''బంగరు పంజరం'' అన్న పేర్లతో అనువదించారు. ఆధునిక మరాఠీ సాహిత్యంలో హరినారాయణ్ ఆప్టే ప్రఖ్యాతుడు. ఆయన నవలలలో ఒక దానిని శ్రీ పి. వి. నరసింహారావు ''అబలా జీవితము'' అన్న పేరుతో అనువదించారు.

కన్నడం నుంచి 'త్రివేణి' వ్రాసిన నవలలు ఎక్కువగా అనువదింపబడ్డాయి. వీనిలో చాల వరకు శర్వాణి అనువాదాలు. 'వెండి మబ్బు', 'తామరకొలను', 'అపస్వరం' ఎంతో మంది పాఠకులు ఆసక్తితో చదివిన నవలలు. కొరటి శ్రీనివాసరావు విద్యానగర రాజ్య చరిత్రను, దానిని పరిపాలించిన రాజ వంశాలను ఆధారంగా కన్నడంలో చాలా నవలలు వ్రాశారు. వీని నన్నింటినీ విద్యానగర నవలా మాలిక' అన్న పేరుతో శ్రీనివాసపురం సోదరులు అనువదిస్తున్నారు. ఇందులో ''దేవగిరి పతనము'', ''కుమార రాముడు'' మొదలైన ప్రఖ్యాత సంఘటనలను, వ్యక్తులను ప్రధానంగా స్వీకరించి వ్రాసిన నవలలున్నాయి.

ఇక పాశ్చాత్య నవలా సాహిత్యానికి తెలుగులో వచ్చిన అనువాదాలను గురించి ఇక్కడ వివరంగా చెప్పబూనడం సాహసమే! ప్రపంచ భాషలతో వచ్చిన అతి ముఖ్యమైన రచయితల ప్రముఖ నవలలన్నీ తెలుగులోకి వచ్చాయి. వీని సాహిత్య ప్రమాణాలను విశ్లేషించి చూపాలంటే, ఆయా మాతృకలను గురించి కూడా చెప్పవలసి వుంటుంది. అందువలన కేవలం ముఖ్యమైన కొన్ని నవలలను మాత్రమే యిక్కడ పేర్కొంటాను. ఈ అనువాదా లన్నింటికీ ఒక్క మూలసూత్రం ఉంది. మూలగ్రంథం ఏ భాషలో వ్రాయ

బడినా, మన రచయితలు మాత్రం ఆ గ్రంథ ఆంగ్లానువాదాన్నే మూలంగా గ్రహించారు. భారతీయ రచయితలైన రవీంద్రనాథ్ టాగూర్ వంటి వాని రచనలనే మనం ఆంగ్లానువాదాలు ఆధారంగా అనువదించు కొన్నాం. అందువల్ల మిగిలిన ప్రపంచ భాషల సంగతి చెప్పనక్కర లేదు. కాని దీనికి భిన్నంగా వి. యన్. శర్మగారు జర్మన్‌భాష నుంచీ, వుప్పల లక్ష్మణరావుగారు రష్యన్‌భాష నుంచీ చేసిన నవలానువాదాలు వున్నా, యివి వేళ్ళమీద లెక్కింప దగినవి మాత్రమే.

ఈ అనువాదాలలో ఎక్కువ భాగం రష్యన్ నుంచి వచ్చినవే!

రష్యన్ నుంచి ముందు ఆంగ్లంలోకి, ఆ తరువాత ఆ ఆంగ్లాను వాదాల నుంచి ఆంధ్రానువాదాలు వెలువడ్డాయి. ఇట్టి నవలలలో పేర్కొనదగినది టాల్‌స్టాయ్ సాహిత్యం. టాల్‌స్టాయ్ ముఖ్యమైన నవలల్ని అనువదించినవారు శ్రీ రెంటాల గోపాలకృష్ణ, శ్రీ బెల్లం కొండ రామదాసు. వీరిద్దరూ ''సమరము-శాంతి'' అన్న పేరుతో ''వార్ అండ్ పీస్''ను అనువదించారు. 'శైలేంద్ర'కూడా టాల్‌స్టాయ్ సాహిత్యాన్ని అనువదించారు. శ్రీ 'శ్రీనివాస చక్రవర్తి' తుర్గనీవ్ రచనలను తెలుగులోకి అనువదించిన వారిలో ముఖ్యులు.

అనువదింపబడిన రష్యన్ నవలలో మాక్సిం గోర్కీ వ్రాసిన "మదర్"కు క్రొవ్విడి లింగరాజుగారి "అమ్మ'' ముందు పేర్కొన దగినది. ఇది 1921 ప్రాంతాలకే ముద్రింపబడి, యిటీవల తిరిగి పునర్ముద్రణను పొందింది. సరళ గ్రాంధికంలో సాగిన యీ అను వాదం చదువుకోవడానికి వీలుగా, సాఫీగా, వ్రాయబడ్డది.

డాస్టొవస్కీ ప్రఖ్యాత నవలకు 'శివం' అనువాదం ''నేరము-శిక్ష'' కూడా పేర్కొనదగిన అనువాదమే!

తెలుగులో అనువదింపబడిన ఇతర రష్యన్ నవలల్లో గొగోల్ నవలకు కొడవటిగంటి కుటుంబరావు ''మృతజీవులు'' అన్న పేర

చేసిన అనువాదం, శ్రీనివాస చక్రవర్తి అనువదించిన ''తారాస్ బుల్బా'' శ్రీనివాసచక్రవర్తి, రాంభట్ల కృష్ణమూర్తి కలిసి అనువదించిన ''సాయం సంధ్యలు'', డోస్టోవస్కీ నవలలకు బెల్లంకొండ రామదాసు అనువాదాలు పేర్కొనదగినవి.

ఇవికాక రెంటాల గోపాలకృష్ణ అనువదించిన మకరెంకో నవల ''విజయ ధ్వజం'', రామదాసు అనువాదం చేసిన గోర్కీ నవల ''భయపడిన మనిషి'' కూడా చక్కని అనువాదాలే. రెంటాల అలగ్జాండర్ కుప్రిన్ నవల Yama ను 'యమకూపం' అన్న పేరుతో అనువదించాడు. ఇది చక్కని అనువాదంగా పాఠకుల మన్ననలు పొందింది. మొత్తానికి బెల్లంకొండ రామదాసు, రెంటాల గోపాలకృష్ణలు రష్యన్—తెలుగు అనువాదకులలో పేర్కొనదగిన వారు.

ఇక పాశ్చాత్య నవలల అనువాదాలను గురించి చెప్పుకోవాలి. ఈ నవలలలో ఆంగ్లం నుంచి మాత్రమేకాక, ఫ్రెంచి భాష నుంచి ఆంగ్లంలోనికి ముందు అనువదింపబడి, ఆ ఆంగ్లానువాదాలు తిరిగి తెలుగులోకి అనువదింపబడ్డాయి.

ఆంగ్ల నవలల అనువాదాలను ''ఆంధ్ర పత్రిక'' ఎక్కువగా ప్రోత్సహించింది. దీనిలో వచ్చిన చాలా అనువాదాలు అనువాద పద్ధతికి గీటురాళ్లు. ఈ అనువాదకులలో ముందు పేర్కొనవలసిన రచయిత నండూరి రామమోహనరావు. ఈయన పిల్లలకోసం అనువదించిన మార్క్ ట్వేన్ అనే అమెరికన్ హాస్య రచయిత నవలలు ''టామ్‌సాయర్'', ''హకిల్ బెరిఫిన్'' రెండూ అటు పిన్నలను, యిటు పెద్దలను కూడా రంజింప చేసిన నవలలు. ''ప్రిన్స్ అండ్ ది పాపర్'' అన్న నవలకు చేసిన ''రాజూ—పేద'' అన్న అనువాదం, ''ట్రెజర్ ఐలండ్''కు ''కాంచన ద్వీపం'' అన్న అనువాదం కూడా ప్రఖ్యాతాలే!

తెన్నేటి సూరి ఛార్లెస్ డికెన్సు వ్రాసిన "ది టేల్ ఆఫ్ టూ సిటీస్" అన్న నవలకు ''రెండు మహానగరాలు'' అన్న అనువాదం సాహిత్య గౌరవంతోపాటు, పాఠకుల మన్ననలు కూడా పొందింది. డికెన్సు వ్రాసిన మరొక ప్రఖ్యాత నవల 'డేవిడ్ కాపర్ ఫీల్డు''కు ''లోకం'' అన్న పేరుతో 'తూలికా భూషణ్' చేసిన అనువాదం కూడా మాతృకకు న్యాయం చేకూరుస్తూనే, సరళంగా సాగిన రచన.

వీనితోపాటు పేర్కొనదగినది, బహుళః వీనికన్నా ఎక్కువగా పాఠకుల మన్నన పొందినది అలగ్జాండర్ డ్యూమా 'కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో'కు సూరంపూడి సీతారాం అనువాదం. మాతృకలో ఉన్న బిగువైన కథకు రచయిత చేసిన స్వేచ్ఛానువాదంతోడై చక్కని ఆంధ్రానువాదాలలో యిది ఒకటి అనిపించుకోగలిగింది. డ్యూమా మరోనవల 'కార్సికన్ బ్రదర్స్' ను జొన్నలగడ్డ రాధాకృష్ణయ్య అనువదించారు.

డికెన్సు 'ఆలివర్ ట్విస్టు' కు అగ్నిహోత్రం రంగాచార్యులు, ''హార్డ్ టైమ్స్''కు బెల్లంకొండ రామదాసు చేసిన అనువాదాలు కూడా మంచివే!

పెరల్‌బక్ నవలలకు చాలా ఆంధ్రానువాదాలు వచ్చాయి. 'గుడ్ఎర్త్' కు నాలుగుఅనువాదాలు వచ్చాయి. వానిలో 'బీజలక్ష్మి' అన్న పేరుతో బెల్లంకొండ రామదాసుచేసిన అనువాదం మేలైనది. ఆమె ఇతర నవలలను అనువదించినవారిలో అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (నిశీథిలో నిర్గమనం), విరించి (దాయాదులు) చెప్పుకో దగ్గవారు.

విక్టర్ హ్యూగో ప్రఖ్యాత నవల 'లే మిజరబ్లే' కు వి. డి. ప్రసాదరావు 'కష్టజీవులు' యథా మాతృకంగా సాగిన అనువాదం.

ఎమిలీజోలా వ్రాసిన 'నానా' విశ్వసాహిత్యంలోనే సంచలనం కలిగించిన నవల. దీనికి బెల్లంకొండ రామదాసు చేసిన అనువాదం కూడా చాలామంది తెలుగు పాఠకుల మన్ననలు పొందింది.

హెన్రీ జేమ్స్ అన్న అమెరికన్ నవలా రచయిత వ్రాసిన 'ది అమెరికన్' ను డి. రామలింగం 'అడ్డుగోడలు' అన్న పేర అనువదించారు. థార్న్‌టన్ వైల్డర్ ప్రఖ్యాత నవల 'ది బ్రిడ్జ్ ఆఫ్ సాన్ లూయీ రే' కు శ్రీవాత్సవ, నండూరి విఠల్‌ల అనువాదం, జేన్ ఆస్టిన్ ప్రఖ్యాత నవల 'ప్రైడ్ అండ్ ప్రెజుడిస్'కు శ్రీ విరించిచేసిన అనువాదం 'అహం అసూయ', ఫ్లాబర్ట్ నవల 'మాడమ్ బొవరీ' కి ఆలపాటి సుబ్బారావు చేసిన అనువాదం కూడా చెప్పుకోదగ్గవి.

సోమర్‌సెట్ మామ్, హొవార్డ్ ఫాస్ట్, హార్డీ వంటి ఆధునిక ఆంగ్ల రచయితల నవలలనే కాక సెర్వాంటెజ్ (డాన్ క్విక్‌సాట్) వంటి ప్రప్రథమ నవలా రచయితల రచనలను కూడా తెలుగువారు అనువదించారు.

అంతేకాదు. భారతీయ రచయితలు ఆంగ్లంలో వ్రాసిన నవలలకు కూడా తెలుగు అనువాదాలు వచ్చాయి. వీనిలో ఆర్. కె. నారాయణ్, ముల్కరాజ్ ఆనంద్, కె. ఎ. అబ్బాస్‌ల నవల లున్నాయి. ఆర్. కె. నారాయణ్ నవలలను అనువదించిన వారిలో శ్రీనివాస చక్రవర్తి, మల్లాది నరసింహశాస్త్రిగారలు ఉన్నారు. ముల్కరాజ్ ఆనంద్ ప్రఖ్యాత నవల ''కూలీ'' కి అవసరాల సూర్యారావు అనువాదం ప్రత్యేకంగా పేర్కొనదగ్గది.

ఈ అనువాద నవలను పరిశీలిస్తే ముందుగా కొట్టవచ్చినట్లు కనిపించే విషయం వీని సంఖ్యాబలం. తెలుగులోని అనువాద నవలలు మౌలికమైన నవలలకన్న ఎక్కువ సంఖ్యలో ఉన్నాయనడం అతిశయోక్తికాదు. ఇక వాని గుణగణాలను గురించి చెప్పవలసివస్తే—అవి

మౌలికమైన చాలా నవలలకన్న ఉత్తమ సాహిత్య గౌరవాన్ని పొందడానికి అర్హమైనవని చెప్పాలి. మొత్తంమీద యీ అనువాదకులందరూ విశ్వసాహిత్యంలోని ఆణిముత్యాలను తెలుగు పాఠకులకు అందించడం ద్వారా సాహిత్యానికి చేసిన సేవ అటుండగా, పఠనాసక్తిని పెంపొందింప చేయడానికి ఎంతో దోహదం చేశారన్నది నిర్వివాదమైన విషయం.

# తెలుగు నవల
# మనోవైజ్ఞానికత

అధునాతన నవలా సాహిత్యం మీద మనోవైజ్ఞానిక సిద్ధాంతాల ప్రభావం అత్యధికం. ఈ సిద్ధాంతాలు ఇంగ్లండు, అమెరికాలలో 20 వ శతాబ్దం మొదటి భాగంలోనే అమలులోకి వచ్చినా ఆంధ్ర దేశంలోకి మాత్రం అవి 1944–50 ల మధ్య కాలంలో మాత్రమే విస్తృతంగా అనుసరించ బడ్డాయి. ఈ సిద్ధాంతాలు చాలా వరకు ఇతర దేశాల నవలల ద్వారా మన నవలల్లోకి గ్రహింప బడ్డవి. ఆంగ్ల విద్యాభ్యాసంతోనూ, ఆ సాహిత్యంతోనూ దగ్గరి పరిచయం వున్న వారు అదే రకం రచనలను మన భాషలోను చేశారు. ఇలా నవలలను మాత్రమే అనుసరించడం వల్ల కథా కథన రీతిలోను, పాత్ర చిత్రణ లోను మార్పు వచ్చిన మాట సత్యం. అయితే ఏ రచయితా—ఒక్క బుచ్చిబాబు తప్ప, ఈ రకం రచనల్లో వుండే లోతుపాతుల్ని మన ముందు ప్రదర్శించ లేదు. అందువల్ల సిద్ధాంతాలు సరాసరి మన నవలాకారుల్ని ప్రభావితం చేయలేదు. పరోక్షంగా ఇంగ్లీషు, అమెరికన్ నవలల్ని మాత్రమే మనవారు అనుసరించారని చెప్పవచ్చు.

సాహిత్యంలో మనస్తత్వ శాస్త్రాన్ని ప్రయుక్తంచేసి మానవ జీవితల్లో దాని ప్రభావాన్ని తరచి చూపినవాడు ఫ్రాయిడ్. తెలుగు సాహిత్యంలో ఫ్రాయిడ్ సిద్ధాంతాలు ఏ విధంగా అనుసరించ బడ్డాయో నిర్దేశించడానికి ముందు ఫ్రాయిడ్ సిద్ధాంతాలను గురించి కొంచెం పరిశీలన చేద్దాం. ఈ సిద్ధాంతాలను గురించి తెలుగులో ఇంతవరకు ఎవ్వరూ వివరణ చేయలేదు.

పందొమ్మిదవ శతాబ్దంలోనే మనస్తత్వ శాస్త్రసంబంధమైన ఆలోచన ప్రారంభం అయింది. మానవ జీవితంలో ప్రత్యక్షంగా ద్యోతకం అయ్యే భావాల వ్యక్తీ కరణకు వెనుక అహేతుకము (Irrational) అయిన భావ సంచయం యొక్క ప్రభావం వుంటుం దన్నది గుర్తించిన వారిలో ముఖ్యులు - స్కోపెనార్, నిషే, బెర్గ్ సన్, ఫ్రాయిడ్ లు.

19 వ శతాబ్దంలోనే హేతువాదం యొక్క అసంపూర్ణతను మన దృష్టికి తెచ్చారు పై రచయితలు. నైతికము, భావాతీతము అయిన సత్యాలను వివరించడంలో హేతువాదం ఎంత వరకు పనికి వస్తున్నది అన్న విషయాన్ని చర్చించి హేతువాద వివరణకు సాధ్యం కాని కొన్నిభావాలు వున్నాయని వారు వ్యక్తం చేశారు. 19 వ శతాబ్దంలోని ఈ అసమ్మతి వాదుల్ని (Irrationalists) రెండు వర్గా లుగా విభజించవచ్చు. ఒక వర్గంవారు—కాంట్, ఫిష్ట్ వంటివారు—హేతువాదాన్ని సమర్థిస్తూ, హేతువు ఆధ్యాత్మికమైన నైతిక భావాల్ని వ్యక్తీకరించడానికి అవరోధంకాదు. దాని వలన హేతువు యొక్క బలం ఎక్కువ అయింది అన్నారు. రెండవ వర్గంవారు—స్కోపెనోర్, నిషే మొదలైనవారు— ప్రవృత్తి (will) హేతువుకు ఎప్పుడూ విరుద్ధమైనదని, తెలిసో తెలియకో అది సహేతుకమైనభావ సముదాయానికి అభ్యంతరం కలిగిస్తూ వుంటుందని చెప్పారు. ఒకసారి హేతువుయొక్క పరిమితత్వాన్ని కాంట్ నిర్ధారణచేసిన తరువాత చాలా మంది తత్వవేత్తలు హేతువుకు విరుద్ధమైన ప్రసక్తి మానవుడ్ని ప్రేరేపిస్తున్నది— అన్న విషయంలో ఎంతో వూహాగానం చేశారు. ఫ్రాయిడ్ కూడా ఈ అసమ్మతి వాదుల లేదా అహేతుక వాదుల వర్గంలో చేరాడని భావించడం వల్లనే మొట్టమొదటి రోజులలో ఆయన్ని గురించిన ప్రశంసలు, విమర్శలుకూడా అసంఖ్యాకంగా వచ్చాయి.

సైకో ఎనాలిసిస్ అనే మనస్తత్వశాస్త్రం సాహిత్యంలో ఎంతవరకు ప్రయుక్తం చేయవచ్చునో అన్న విషయం మీద పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలు చాలా మందికున్నాయి. ఈ సందిగ్ధతకు కొంత వరకు ఫ్రాయిడ్, ఆయన సిద్ధాంతాలు కారణమని చెప్ప వచ్చు. ఫ్రాయిడ్ శరీర శాస్త్రవేత్త, మనస్తత్వ శాస్త్రవేత్త, సాహిత్యకారుడు కూడా. అందువల్లనే ఈ మూడింటినీ పరస్పర సంబంధంకల విజ్ఞాన భాగాలుగా ఆయన భావించాడు. మొదటి రోజుల్లో ఆయన్ని ప్రభావితం చేసినవి, బైబిల్, ప్రకృతిమీద గెథే వ్రాసిన వ్యాసం, డార్విన్ సిద్ధాంతాలు. మొట్టమొదట కేవలం శారీరక శాస్త్ర సిద్ధాంతాలకు సంబంధించిన వ్యాసాలే వ్రాసినా రాను రాను ఫ్రాయిడ్ తన పరిధిని విస్తృతంచేసి మానవ ప్రవృత్తి వైపుకు మళ్ళించాడు.

1885 లో ఫ్రాయిడ్ పారిస్‌లో ప్రారంభించిన కొన్ని ప్రయత్నాలు ఇక్కడ పేర్కొనాలి. మానసిక వ్యాధులున్న వ్యాధి గ్రస్తులకు అప్పటి వరకూచేస్తూ వచ్చిన వైద్యం సమగ్రం కాదని అట్టి వ్యాధులకు కొత్త కారణాలను ఆయన వివరించాడు. చార్కాట్, ఫ్రాయిడ్ ఇద్దరూ కలసి మానసిక వ్యాధులకి కొత్త వివరణల్ని ఇవ్వడం ప్రారంభించారు. అప్పటి వరకు స్త్రీలకు మాత్రమే పరిమితం అనుకొన్న హిస్టీరియా వ్యాధి పురుషులకుకూడా రావచ్చునని, కొన్ని సందర్భాలలో ఈ వ్యాధి రాక తప్పదని, హిప్నొసిస్ ద్వారా ఈ వ్యాధిని నయంచేయవచ్చునని వాళ్ళు భావించారు. చివరి రోజుల్లో హిప్నొసిస్ భావాన్ని ఆయన త్యజించి ఇట్టి వ్యాధులకు కారణంగా స్త్రీ పురుషుల మధ్య లైంగికత (sexual) లో వున్న లోపాల్ని పేర్కొన్నాడు. ఇందులో చాలా భావాల్ని ఫ్రాయిడ్ తో కలిసి పని చేసిన బ్రూవర్ ఒప్పుకొన్నా తరువాత తరువాత ఆయన ఫ్రాయిడ్ సిద్ధాంతాలను వ్యతిరేకించాడు.

ఒక వ్యాధిగ్రస్తుడ్ని హిప్నోటిక్ స్థితిలోవుంచినప్పుడు అతనిలో మేల్కొలిపే జ్ఞాపకశక్తుల్ని, హిప్నోసిస్‌లో పెట్టకుండా కూడా మేల్కొలపడానికి ఫ్రాయిడ్ ప్రయత్నం చేశాడు. కాని జాగృత మైన దశలో ఇట్టి భావాలకు స్వయంగా అవరోధం కల్పిస్తాడు రోగి. వీటిని అధిగమించి జ్ఞాతమైన దశ (Conscious state) లోనే రోగిలో అజ్ఞాతంగా వుండే భావాల్ని వెలికి తీసుకు రావడానికి ప్రయత్నిం చేసి సఫలీకృతడైనాడు ఫ్రాయిడ్. ఇలా ఒక వ్యక్తి తన మనస్సు లోకి వచ్చే ఆలోచనల్ని ఏ అవరోధమూ లేకుండా, అవి మనసులోకి ఏ విధంగా ఏ క్రమంలో వస్తాయో అదే పద్ధతిలో వ్యక్తీకరిస్తే రోగానికి గల లక్షణాలను సులువుగా కనిపెట్టవచ్చు నంటాడు ఫ్రాయిడ్. ఇలా ఏ అవరోధం లేకుండా అజ్ఞాతమైన భావాలను వెలికి చెప్పడాన్ని "free association" అంటారు.

పాత్ర పోషణ విషయంలో ఇటీవలి నవలాకారులు ఈ పద్ధతినే ఎక్కువగా ప్రయుక్తం చేశారు. ఇది సైకో ఎనాలిసిస్ కి మూల రూపం.

ఫ్రాయిడ్ సిద్ధాంతాలలో సాహిత్యానికి దోహదకారి అయిన మరో సిద్ధాంతం ఆయన కలలను గురించి చెప్పినది. కలలు ఒక మనిషిలో అజ్ఞాతంగా అణచివేయబడ్డ కోరికల మారు రూపాలని, నిత్య జీవితంలో అట్టి కోరికల అనేకమైన అవరోధాల మూలంగా వెలికి రాలేక నిద్రలో కలల రూపాన వస్తాయని ఫ్రాయిడ్ వాదం. ఈ భావాలన్నీ అజ్ఞాతంగా వుండి నిద్రలోమాత్రమే వెలికి రావడంవల్ల జ్ఞాతమైన మామూలు స్థితికి అజ్ఞాతమైన నిద్రావస్థకు మధ్య మరో అవస్థ వున్నదని నిరూపణ చేశాడు ఫ్రాయిడ్. సగం జాగృతమూ, సగం అజాగృతమూ అయిన ఈ స్థితి మానవుడు చేస్తున్న అనేకమైన కార్యాలకు,మాట్లాడే మాటలకు ఒక వివరణ ఇవ్వ గలుగుతుంది. హేతువాదందృష్ట్యా వివరించలేని ఎన్నో విషయాలను ఈఅజాగృత

భావసంచయం ద్వారా వివరించవచ్చు నంటాడు ఫ్రాయిడ్. 'ఎగో అండ్ ది ఈడ్' అన్న గ్రంథంలో ఈ జ్ఞాత, అజ్ఞాత అవస్థలకు గల మానసిక సంబంధాన్ని సూచించాడు ఈయన. అజ్ఞాతమైన అవస్థలను రెండు భాగాలుగా విభజించాడు ఫ్రాయిడ్. ఒక రకమైన అజ్ఞాతావస్థ మామూలు సందర్భా లన్నింటిలోనూ జ్ఞాతమైన అవస్థగా మారిపో గలదు. దానినే 'పూర్వజ్ఞాతావస్థ' (The Pre-Conscious) అన్నాడు. మరొకటి అట్టి పరివర్తన కష్టమైన అజ్ఞాతావస్థ. ఈ అజ్ఞాతావస్థలో సాధారణమైన ప్రయత్నంవల్ల జ్ఞాతావస్థను సాధించడం కష్టం. దీన్నే అజ్ఞాతావస్థ (The unconcious) అన్నాడు ఫ్రాయిడ్.

మానవుడి ఆత్మ (Ego) అటు జ్ఞాతస్థితికి, ఇటు అజ్ఞాతస్థితికి కూడా చెందినది. ఈ సిద్ధాంతం ఆధారంగానే ఒకే మనిషిలో జ్ఞాత అజ్ఞాత భావాల సంఘర్షణ ఎలా జరుగ గలదో మన నవలా కారులందరూ నిత్యమూ చూపిస్తూనే వున్నారు.

ఫ్రాయిడ్ సిద్ధాంతాల్లో సాహిత్యంలోకూడా బహుళంగా ప్రయుక్తం చేయబడిన భావాలలో లిబిడో, ఈడిపస్ కాంప్లెక్స్ కూడా ముఖ్యమైనవి.

లిబిడో—మనిషి భావాలను, అతని వ్యక్తిత్వాన్ని ప్రేరేపించి నడిపించే శక్తి—అన్నాడు ఫ్రాయిడ్. బాహ్య జీవనంలో తాను అభి వ్యక్తంచేయడానికి అనువైన భావాల ప్రేరణ దీనివలననే జరుగుతుంది. కాని ఈ ప్రేరణ స్వార్థమూ, ఆత్మాశ్రయమూ అయివుంటుంది. దీనికి సాంఘికమైన ప్రయోజనం, నైతికత వుండవు. ఈ లిబిడో వ్యక్తీ కరణంమీదనే జ్ఞాత, అజ్ఞాత స్థితులు నియమింపబడతవి. బాహ్య జీవ నంలో కాముక భావాలకు మధ్య ప్రేరణం కూడా లిబిడోనే! ఫ్రాయిడ్‌లో ఇది చాలా విస్తృతమైన భావంలో ప్రయుక్తం చేయ

బడ్డది. మానసిక భావాలైన ఉత్సాహాది విషయాలు, బాహ్య విష యాలైన సంయోగాది విషయాలు ఇందులోనే ఇమిడివున్నాయి.

లిబిడో మానసికమైన శక్తి. మిగిలిన మానసిక శక్తులకన్న ఇది భిన్నమైనది. ఈ భిన్నత్వం దీని రసాయన లక్షణంలో వుంది. మాన వుని లైంగిక జీవితంలో తరచు జరిగే క్రమబద్ధమైన విధానాలను, జరిగే మార్పులను సూచించేది ఇది. ఇది వస్తునిష్టమైనది.

''ఈడిపస్ కాంప్లెక్సు'' సిద్ధాంతాన్ని మొదట "Interpretation of Dreams'' అన్న గ్రంథంలో ఆయన పేర్కొన్నా దాని సమగ్రమైన చర్చ ''Three Contributions to a theory of Sex'' లోనే చేశాడు. "Totem and Taboo'' అన్న గ్రంథంలో ఈ ఈ సిద్ధాంతానికి మానవ జీవనవిధానానికిగల సంబంధాన్ని చిత్రిం చాడు ఫ్రాయిడ్.

తల్లిదండ్రులకూ, పిల్లలకు మధ్య వుండే ద్వేషానురాగాలను 'ఈడిపస్ కాంప్లెక్స్' అన్నాడు ఫ్రాయిడ్. ఇది కూడా ఆదిమ యుగాలకు చెందిన Totem, Taboo ల లక్షణాలలో ఒకటి. ఆదిమ యుగాల్లోను, అధునాతన యుగాల్లోను మానవుల నైతిక, సాంఘిక ప్రవర్తనకు మూలం ఈ ఈడిపస్ భావమేనంటాడు ఫ్రాయిడ్. ఈ సిద్ధాంతాన్ని ప్రపంచించడంతో ''అజ్ఞాతము''ను వివరించే ప్రయత్నం కూడా ఫ్రాయిడ్ చేశాడు. పురాతన ఆచార వ్యవహారాలలోను నియమాలలోను కొన్నింటిని ఇంకా ఈ అధునాతన యుగాలు పట్టు కొనివుంచే ప్రయత్నం చేయడానికి మానవులలోని ఈ 'అజ్ఞాత ఈడి పస్' భావమే కారణమంటాడు ఫ్రాయిడ్.

ఈడిపస్ భావానికి పసిపిల్లలలో నిద్రాణమై వుండే లైంగిక ప్రవృత్తికి సంబంధం వుంది. ప్రతి శిశువులోనూ ఆది నుంచీ ఈ కామ

భావం వుంటుంది. ఇది వేరువేరు సమయాల్లో వేరువేరు విధంగా అభివ్యక్తం అయి తృప్తిని చెందుతుంది. అందువల్లనే పిల్లలవికాసం వాళ్ళు పెరిగే వాతావరణంమీద ఆధారపడివుంటుంది.

తండ్రివలన పిల్లలుపొందే భయ, అనురాగ. ద్వేషాలను ఈడిపస్ కాంప్లెక్సు అనీ, తల్లివలన పొందే భావాలను ఎలెక్ట్రాకాంప్లెక్సు అనీ అంటారు. చిన్నతనంలో తల్లిదండ్రుల ద్వారా పిల్లలమనస్సులో ముద్రితాలైన ఈ రెండు భావాలే పెద్దఅయిన తరువాత కూడా వారి ప్రవర్తనలో కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి.

ఫ్రాయిడ్ చేసిన ఈ సిద్ధాంతాలు ఎంతవరకు ఇంగ్లీషు, అమెరికన్ నవలల్లో అనుసరింపబడ్డవన్న విషయం మనకు అప్రస్తుతమే అయినా ఆ అనుసరణాలో చాలామంది పాక్షికమైన అనుకరణనే చేశారన్న మాట మాత్రం మనం జ్ఞాపకం వుంచుకోవాలి. తెలుగు నవలాకారులు ఈ సిద్ధాంతాలను ఎంతవరకు అనుసరించారో మనం ఇప్పుడు చూద్దాం.

ఫ్రాయిడ్ సిద్ధాంతాలు ప్రభావం వికాసయుగంలో చలం, విశ్వనాథలలో ప్రారంభంఅయి మనోవైజ్ఞానిక యుగంలో పరాకాష్ఠకు వచ్చాయి. వికాసయుగంలో కనిపించే ఫ్రాయిడ్ సిద్ధాంతాల ప్రభావం ఆ రచయితలు వారివారికి అనుకూలమైన సిద్ధాంతాలకు అనుగుణంగా మార్చుకున్నారు. మనస్తత్వ శాస్త్రంలో ముఖ్యమైన సిద్ధాంతాలు స్త్రీ పురుష లైంగిక ప్రవృత్తికి సంబంధించినవి కూడా. ఫ్రాయిడ్ ఈ ప్రవృత్తికి "ఈడిపస్‌ఈ కాంప్లెక్స్" కారణంగా భావిస్తే చలం, అతని వర్గంవారు దీన్ని సాంఘికమైన ఒక ఆచారంగా భావించారు. అయితే చలంలో ఫ్రాయిడ్ 'లిబిడో' భావాలు ద్యోతకం కాకమానవు. సాంఘికమూ నైతికమూ అయిన మానవ జీవన ప్రవృత్తిలో లిబిడో అనే మానసిక శక్తి అతి ప్రధానమైనది. అచేతనమైన మానసికావస్థ బాహ్యజగత్తులో మానవుడుచేసే ఏప కార్యాలకు

ఆధారభూతమై వుంటుందో ఆశక్తిని లిబిడో అంటే—చలం నాయికా నాయకుల్లో చాలామంది ఈ లిబిడో ఆధారంగా ప్రవర్తించిన వారే.

ఫ్రాయిడ్‌వంటి మనస్తత్వ శాస్త్రజ్ఞుల సిద్ధాంతాలను అనుసరించడంలోకన్న, ఆ సిద్ధాంతాలను అనుసరిస్తూ ఇంగ్లండులోను, అమెరికాలోను వ్రాయబడ్డ నవలల్లోని క్రొత్తరకమైన కథనశిల్పాన్ని మాత్రమే మన నవలా రచయితలు అనుసరించారని చెప్పడం న్యాయం.

ఈ కథన శిల్పాన్ని తనదిగా చేసుకొని జాతీయ జీవనానికి సరిపోయే ఒక ప్రాథమికమైన కథ (Myth)ను స్వీకరించి వేర్వేరు వ్యక్తుల అంతరంగ కథనం ద్వారా దీనిని నిరూపించాడు విశ్వనాథ. అయితే ఈ ప్రభావం ఆయన మొదటి నవలలో ముఖ్యంగా ఏకవీర, మాబాబుల్లో చాలా హెచ్చుగా కనిపిస్తుంది. 1932—33 ప్రాంతాల లోనే ఈ కథనశిల్పాన్ని — అంతరంగిక ప్రవృత్తుల్ని బాహ్యమైన సంఘటనలకు ఆధారభూతమైన వానినిగా వ్యాఖ్యానించే పద్ధతిని విశ్వనాథ తన నవలల్లో చూపాడు. ఆయన ఫ్రాయిడ్‌లాంటి శాస్త్రజ్ఞుల నుంచి నేర్చుకున్నాడన్నా నేర్చుకోలేదన్నా అది ఆయన ప్రతిభకు నిదర్శనమే అవుతుంది. నేర్చుకుంటే అది అంత సమగ్రంగా అంత ప్రతిభావంతంగా తనదిగా చేసుకున్నందుకు, నేర్చుకోకపోతే అదేకాలంలో ఇంగ్లీషు అమెరికన్ రచయితలు వ్రాసినట్లుగా నేతాను వ్రాసినందుకు.

ఏది ఏమైనా ఏకవీర, మాబాబులలో రచయిత చూపిన అంతరంగిక భావాల వ్యక్తీకరణ మనస్తత్వ శాస్త్రానికి సంబంధించిన విషయమే.

''ఏకవీర'' లో కథ అతిస్వల్పమైనది; ఏకవీర, మీనాక్షి, కుట్టాను, వీరభూపతి అన్ననలుగురు వ్యక్తుల కథ. ఈ కథలో కథనం

అంతా ఇద్దరు వ్యక్తులమధ్య సంభాషణ ద్వారాకాని, లేదా ఒకే వ్యక్తి ఆంతరంగికమైన తన భావాలను వ్యక్తం చేయడంద్వారా కానీ నడుస్తుంది. ఈ ఇద్దరు వ్యక్తుల సంభాషణలో కూడా ఒకరు మరొకరికి తన మనస్సులోని భావాలను వ్యక్తం చేయడమే ప్రధానంగా చూపబడ్డది. ఈ విధంగా చూస్తే ఈ నవలను కథానాత్మకమైన గద్య కావ్యం అనవచ్చు.

ఈ విధంగా పాత్రలుచేసే పనులకు, వారి మనస్సులో చెలరేగే సంఘర్షణలకు ఆయాపాత్రలు చెప్పుకునే సమాధానాలుగా ఈ నవలలోని సంభాషణలు చూపబడ్డాయి.

'మాబాబు'లో కథ ఆత్మపరంగా చెప్పబడ్డది. నిజానికి ఆత్మపరంగా చెప్పబడే కథల్లో ఇతర వ్యక్తుల ఆంతరంగిక చిత్రణ చాలా కష్టం. కాని ఇందులో ప్రధాన పాత్ర తన ప్రవర్తన యొక్కవిశ్లేషణ ఎంత విస్తృతంగా చేసుకుంటాడో, మిగిలిన పాత్రల మానసిక విశ్లేషణకూడా అంత నిర్దిష్టంగాను వ్యక్తం చేశాడు. ఈ చిత్రణకు రచయిత తానుగాచేసే విమర్శ కొంత సహాయకారి. ఈ విశ్లేషణలో రచయిత నిర్వహించే పాత్ర ఎంత నిష్పక్షపాతమైనదైతే పాత్రలకు అంత న్యాయం చేకూరుతుంది. అలా కాక రచయిత కొన్ని పాత్రలఎడ ఎక్కువ పాక్షికత వహిస్తే పాత్రపోషణ దెబ్బ తింటుంది. తన మొదటి నవలల్లో విశ్వనాథ ఎంతటి నిష్పాక్షికుడో తరువాతి నవలల్లో అంతటి పాక్షికుడు.

ఫ్రాయిడ్ సిద్ధాంతాలను అతి జాగ్రత్తగా మననం చేసి, అతి జ్ఞాతంగా దానిని తమ నవలలలో ప్రయుక్తం చేసిన వారు మనోవైజ్ఞానిక యుగంలోని ముఖ్యమైన రచయితలు. ఈ నవలల్లో గోపీచంద్ "అసమర్థుని జీవయాత్ర", రాచకొండ విశ్వనాథశాస్త్రి "అల్పజీవి", బుచ్చిబాబు "చివరకు మిగిలేది", జి. వి. కృష్ణారావు "కీలుబొమ్మలు" పేర్కొనదగినవి.

"అసమర్థునిజీవయాత్ర" ఆధునిక నవలా పరిణామంలో ఓ కొత్తమలుపు. హేతువాదాన్ని, సమాజ పరిణామవాదాన్ని మానవత దృష్ట్యా పరిశీలించి ఒక వ్యక్తి జీవితాన్ని నిశితంగా పరిశీలించిన నవల ఇది. గతం మానవుడి వర్తమానంమీద చేసేదాడి ఈ నవలలో ప్రతి అడుగునా మనకు గోచరిస్తుంది. సీతారామారావు మనస్సుమీద అతని పూర్వీకుల మనస్తత్వం చెరగని ముద్ర వేసింది. తన తండ్రి తాతల గొప్పతనం, దానికి వారసుడైనతాను, తాను నివసిస్తున్న వాతావరణం— వీటికి మధ్య జరిగే సంఘర్షణ ఈ నవలలో ముఖ్య వస్తువు. గతానికి, వర్తమానానికి ఆధునిక కాలంలోవుండే సంఘర్షణ దీనికి ప్రాతిపదిక. పరిస్థితులు విషమించినప్పుడు మామూలు మనుష్యులు తమ మనస్సుమీద గతంచేసే అధికారాన్ని తొలిగించి, ఆ ముద్రల్ని చెరిపివేసి, వర్తమానంతో రాజీ పడతారు. సీతారామారావు చదువుకున్న మధ్య తరగతి కుటుంబానికి ప్రతీక. మామూలు మనిషి రాజీ పడ్డట్టు సీతారామారావు రాజీ పడలేక పోతాడు జీవితంతో. ఇందులో ఉన్న ఆరు ప్రకరణాలు ఒకే వ్యక్తిలోని ఆరురూపాలు. అసమర్థుడు, అసమర్థుని భార్య, అసమర్థుని మేనమామ, ప్రతాపం, అంతం— ఇవి ఈ ప్రకరణలు. ఇవన్నీ కలిసి అసమర్థుని జీవయాత్ర. ఈ ప్రకరణాల్లో ప్రతి దాంట్లోనూ సంఘటనల వివరణ, దాని వెనుక మానసిక విశ్లేషణ గోపీచంద్ సమగ్రంగా స్పష్టంగా చేశాడు.

బుచ్చిబాబు "చివరకు మిగిలేది" ఫ్రాయిడ్ సిద్ధాంతాలను నిశితంగా పరిశీలించి వానిని నేటి మానవ జీవితానికి అనుగుణంగా ప్రత్యాఖ్యానం చేయడానికి ఉద్దేశించబడ్డ నవల. ఇందులో కూడా గతం, మనిషి వర్తమాన జీవితంమీద ఎంతటి గాఢమైన ప్రభావాన్ని చూప గలదో అడుగడునా చూపబడ్డది. దయానిధి తల్లి ప్రవర్తన, దానిపై నలుగురూ చేసే అవహేళనాత్మకమైన వ్యాఖ్యానాలు ఒక

పక్క, తల్లి అంటే దయానిధికి వున్న ఆప్యాయత రెండవ పక్క దయానిధి మనస్సులోని సంఘర్షణలకు ముఖ్యమైనవి. ఇందులో చూపబడ్డది "ఎలక్ట్రా కాంప్లెక్స్".

దీనితోపాటు ఈ నవలలోని 'హామ్లెట్' చర్చకూడా 'ఈడిపస్ కాంప్లెక్సు' లోని మరో దృక్పథాన్ని చూపుతుంది. దయానిధి-తల్లిలోని ఆదర్శ భావాన్ని అంగీకరించి, ప్రపంచానికే ఎదురు తిరిగి ఏకాకిగా నిలబడవలసి వస్తుంది.

ఈ నవలలో దయానిధి మానసిక ప్రవర్తన అతి విశ్లేషణాత్మకంగా చూపబడ్డది. దయానిధి ఇతర స్త్రీలతో మానసికమైన దగ్గరితనం చూపడం, లైంగికానుభవాలకు దూరంగా ఉండడం, ఇవి అన్నీ అతని 'న్యూరాసిస్' లోని వివిధ భాగాలే. ఈ ఆత్మ సంఘర్షణకు అతీతమైన మానవతను నేటి నాగరిక జీవితంలోని అనేకమైన బాధలకు, కోప తాపాలకు సమాధానంగా చూపాడు బుచ్చిబాబు.

ఈ రకమైన కథన శిల్పాన్ని చూపిన మరో ముఖ్యమైన నవల రాచకొండ వారి 'అల్పజీవి'. ఆడ్లర్ సిద్ధాంతీకరించిన 'ఆత్మన్యూనత్వం' (Inferiority Complex) యీ నవల విశ్లేషించి చూపిన ముఖ్య విషయం. ఇందులో మనోవిజ్ఞాన వ్యక్తీకరణ పరాకాష్ఠకు పోయింది. ఆత్మాభివ్యక్తీకరణకు ఎంతో అనుకూలమైన స్వగతం (interior monologue) ద్వారా తన ముఖ్యపాత్రమానసిక జీవితాన్ని చిత్రించడం ఈ నవలకు ధ్యేయం. సుప్తచైతన్యం, జాగృత్- చైతన్యం, వీటి సంఘర్షణ—పాత్రల్లో వుండేవివిధ ప్రవృత్తులకు గల కారణాలనూ ఎంత చక్కగా వివరించేదీ ఈ నవలలో మనకు ద్యోతకం అవుతుంది. భావధార ఒక చైతన్య స్రవంతిలా మనస్సు నుంచి బహిర్గతం కావడం, ఆ బహిర్గతమైన క్రమంలోనే వానిని

వ్యక్తీకరించడం 'చైతన్య స్రవంతి' (Stream of Consciousness) అన్న అధునాతన కథాకథన పద్ధతికి మూలం. దానిని ఈ నవలలో ఆద్యంతమూ అనుసరించాడు రాచకొండ.

మనస్తత్వ శాస్త్రాన్ని, బెర్గ్‌సన్ కాలానికి ఇచ్చిన నూతన నిర్వచనాన్ని కలిపి చైతన్య స్రవంతి పద్ధతిలోనే ఒక వినూత్నమైన పరిశోధన చేసినవాడు భాస్కరభట్ల కృష్ణారావు. 'వెల్లువలో పూచిక పుల్లలు' అన్న అతని నవలలో అనుసరించబడిన విధానం వినూత్నమైనది. సంప్రదాయం సృష్టించిన తెరల పొరలను తొలగించి చదువరులను జీవితానికి సన్నిహితం చేయడానికి కృష్ణారావు విశిష్టమైన వినూత్న విధానం దీనిలో చూపాడు.

"సంప్రదాయ సిద్ధంగా వస్తున్న రచనా విధానంలోని అస్వాభావికత రచయిత సృజనశక్తిని బంధించివేసే సంకెళ్ళుగా భావించి ఆ సంకెళ్ళను విదిలించుకొని ఆ రచనా విధానం కంటె సువిశాలమూ, యధార్థ జీవితానికి సన్నిహితమూ అయిన మరొక విధానాన్ని శ్రీ కృష్ణారావు చేపట్టారు" అని శ్రీ గోపీచంద్ అన్నారు. ఈ నవలలో కథకన్నా ఒక వినూత్నత్వాన్ని చూపించాలన్న ఆతృత ఎక్కువగా గోచరిస్తున్నది.

మనోవైజ్ఞానిక నవలల్లో నవీన్ వ్రాసిన 'అంపశయ్య' యిటీవలనే వచ్చింది. ఇది జేమ్సుజాయిస్ ప్రఖ్యాత నవల 'యులిసిస్' వలె ఒక వ్యక్తి జీవితంలోని ఒకరోజు జరిగిన సంఘటనలను 'చైతన్య స్రవంతి' పద్ధతిలో చిత్రించిన నవల. మంచి ప్రయోగాలలో ఒకటి.

ఈ పద్ధతులలో ప్రయోగాలు చేసిన యితర రచయితలలో ఆర్. యస్. సుదర్శనం, గొల్లపూడి మారుతీరావు ప్రభృతులను పేర్కొనవచ్చు.

# తెలుగు నవల జాతీయోద్యమం

భారతదేశంలో జాతీయోద్యమం 1885 నాటికే ప్రారంభమైనా, అది కవులను, రచయితలను ఆకర్షించింది 1920 తరువాతనే. అయితే అంతకు పూర్వమే— ముఖ్యంగా 1905 నాటి బెంగాల్ విభజన నుంచి కూడా—దేశస్వాతంత్ర్యాల్ని గురించి, అస్వాతంత్ర్యానికి మూలకారణాలయిన సాంఘిక దురాచారాలను గురించి ఎన్నో కవితలు, కొన్ని నవలలు వెలువడక పోలేదు. జాతీయోద్యమ ప్రభావంతో వెలువడిన తెలుగు నవలా సాహిత్యాన్ని మూడు దశలుగా విభజించవచ్చు. ఇందులో మొదటిదశ 1900 నుంచి 1920 వరకు, రెండవ దశ 1921 నుంచి 1947 వరకు, మూడవ దశ 1948 నుంచి ఈ నాటి వరకు.

ఏ ఉద్యమమైనా సాహిత్యం మీద తన ప్రభావాన్ని రెండు విధాలుగా ప్రభావితం చేస్తుంది. ఒకటి ప్రత్యక్ష ప్రభావం. ఉద్యమం జరుగుతూ వుండగా ఆ ఉద్యమ విశేషాలను, దాని ప్రాముఖ్యాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు చూపుతూ వ్రాయడం, ఉద్యమ నాయకులను తమ రచనలలో పాత్రలుగా స్వీకరించడం ప్రత్యక్షప్రభావ రచనల లక్షణాలు. ఆ ఉద్యమం ఆనాటి సంఘంమీద, లేదా కొందరు వ్యక్తులమీద ఎట్టి ప్రభావాన్ని కలుగచేసిందో చూపడం పరోక్ష ప్రభావానికి నిదర్శనం. తెలుగు సాహిత్యంలో ప్రతిబింబించిన భారత జాతీయోద్యమాన్ని పరిశీలిస్తే, ప్రత్యక్ష ప్రభావంగల రచనలు ఎక్కువగా నాటకాలలోను (వీనిని రాజకీయ నాటకాలు అనవచ్చు), పరోక్ష ప్రభావంగల రచనలు నవలలలోను కనిపిస్తాయి.

తెలుగు నవలలలో జాతీయోద్యమం పరోక్షంగా మాత్రమే చిత్రించబడినా, తిరిగి యిందులో కూడా ఎంతో వైవిధ్యం గోచరిస్తుంది. కొన్ని నవలలు జాతీయోద్యమాన్ని వర్ణించి, అందులో పాల్గొన్న కొందరు వ్యక్తుల జీవితాలను ఆలంబనంగా గ్రహించి వ్రాయబడ్డవి. మరికొన్ని ఆ ఉద్యమ నిర్వాహణలో ప్రముఖ సూత్రాలుగా వెలవడ్డ అస్పృశ్యతా నివారణవంటి సమస్య లను చిత్రించినవి.

1920 లో గాంధీజీ జాతీయోద్యమ నాయకత్వంచేబట్టి సంఘ పునర్నిర్మాణానికి తన సూత్రాలను వెలువరించకముందే ఎందరో రచయితలు జాతీయ భావాన్ని వెలువరిస్తూ నవలలు వ్రాశారు.

పందొమ్మిదో శతాబ్దం చివరి భాగంలోను, ఇరవయ్యో శతాబ్దం తొలి రోజులలోను రచయితలు జాతీయ భావాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించడానికి వెనుకాడి, ఆ భావాన్ని పరోక్షంగా పౌరాణిక, చారిత్రక గాథలద్వారా చూపారు. ఇందుకు ఉదాహార ణంగా భారత వీరుల గాథలను పేర్కొనవచ్చు. ఈ తొలి రోజుల్లో ప్రసిద్ధ బెంగాలీ రచయిత, దేశభక్తుడు అయిన బంకించంద్ర చటర్జీ నవలలు దేశాన్ని అట్టుడికించినట్లు ఉడికించాయి. ఆయన "ఆనంద మఠం'' జాతీయ భావాలను ప్రస్ఫుటంగా వెలువరించిన మొదటి నవల. ఈ నవల వెలువడిన మరు సంవత్సరమే దీనిని వావిళ్ళ రామస్వామిశాస్త్రులు కొందరి సహాయంతో అనువదించి వెలువ రించారు. మరి మూడేళ్ళలో యీ నవలకు మూడు అనువాదాలు వెలువడ్డాయంటే యీ నవలకు గల ప్రఖ్యాతిని మనం గుర్తించవచ్చు. ఓ. వై. దొరస్వామయ్యగారు యీ నవలా రచనలో వావిళ్ళవారికి సహాయం చేయడమే కాక, 'కపాలకుండల' ను స్వయంగా అనువ దించారు కూడా. శివ శంకరస్వామిగారి "జీవన ప్రభాతము' వంటి నవలలు కూడా యీ ఒరవడిలో వ్రాయబడినవే..

ఈ రోజులలోనే కొమర్రాజు లక్ష్మణరావుగారి 'శివాజీ' రచయితలను, పాఠకులను కూడా, ఉత్తేజ పరచిన జీవితచరిత్ర. శివాజీ, రాణాప్రతాప్‌ల కథలు ఆధారంగా ఎన్నో నవలలు వెలువడ్డాయి.

తెలుగు నవలా చరిత్రలో చారిత్రక నవలాయుగం 1915 నుంచి ప్రారంభమైనదని చెప్పవచ్చు. ఈ నవలలలో కొన్నింటిని అనువదించి మరికొన్నింటిని స్వతంత్రంగా వ్రాసి తమ ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాలద్వారా ప్రకటించినఖ్యాతి వెంకట పార్వతీశ కవులది. వారు స్వయంగా యిట్టి నవలలు వ్రాయడమే కాక, తమ గ్రంథ మాలలో ఇట్టి చారిత్రక నవలలను, అనువాదాలను ప్రకటించి జాతీయోద్యమ భావానికిపాదులు కట్టారు.

గాంధీజీ భారత రాజకీయరంగంమీదికి రాక పూర్వమే తెలుగు నవలాకారులు, పంచముల ఉద్ధరణ (తరువాత గాంధీజీ ఉంచిన పేరు అస్పృశ్యతా నివారణ) ను కథా వస్తువుగా స్వీకరించి గ్రంథాలు వ్రాశారు. ఇట్టి నవలల్లో మొదటిది శ్రీ తల్లాప్రగడ సూర్య నారాయణగారు వ్రాసిన 'హేలావతి' (1913). వెంకట పార్వతీశ కవులు 1918 లో ప్రచురించిన 'మాతృమందిరము' అన్న నవల యీనాటి వరకు కూడా ఆసమస్యపై వచ్చిన ఉత్తమమైన నవలలలో ఒకటి. రంగన్న అనే బ్రాహ్మణ కుమారుడు ముత్యాలు అనే కడజాతి వాని కుమార్తెను పెళ్ళి చేసుకోవడం ఇందులో కథ. ఇటువంటి నవల వ్రాయడానికి ఆ రోజులలో ఎంతో ధైర్యం ఉండి ఉండాలి. 1920 లోనే వెలువడిన వేలూరి శివరామశాస్త్రిగారి ''ఓబయ్య'' జాతీయోద్యమాన్ని గురించి వ్రాయబడిన తొలిరచన.

1920 లో గాంధీజీ కాంగ్రెసు నాయకత్వాన్ని చేబట్టి స్వాతంత్ర్య శంఖారావాన్ని పూరించాడు. భారతదేశంలోని ప్రతి రచయితా ఏదోవిధంగా గాంధీజీ ప్రభావానికి లోనైన వాడే! అందరు

రచయితలు ఆయనను గురించి ఎక్కడో ఒక చోట వ్రాసినవారే! అయితే ఇందులో కొన్ని భేదాలున్నాయి. కావ్యరచయితలలో చాలామంది— (ఖండికా రచయితలను, పద్య రచయితలను కూడా ఇందులోనే చేర్చవచ్చు) గాంధీజీని, ఆయన మహిమను కీర్తిస్తూ కేవలం ప్రశంసాత్మకమైన రచనలే చేశారు. రాజకీయ నాటకకర్తలు గాంధీజీని ఒక పాత్రగా ప్రవేశ పెట్టి, ఆయన చేతనే ఉద్యమ విజయాలను ఉటంకింప చేశారు. ఇక నవలా రచయితలు ఉద్యమాన్ని దూరంగాఉండి పరాశ్రయంగా గమనించి ఆ ఉద్యమ ప్రభావం ఎవరెవరి మీద ఏ విధంగా ప్రసరించిందో చూప ప్రయత్నం చేశారు. ఇలా జాతీయో ద్యమాన్ని గురించి, దాని ప్రభావాన్ని గురించి పేర్కొన్న నవలలలో ఉన్నవ లక్ష్మీనారాయణగారి "మాలపల్లి", అడివి బాపిరాజుగారి "నారాయణరావు", ''కోనంగి'', విశ్వనాథవారి ''వేయిపడగలు'', బుచ్చిబాబు ''చివరకు మిగిలేది'', కొడవటిగంటి ''చదువు'', మహీధర రామమోహనరావు ''కొల్లాయిగట్టితేనేమి'', ముప్పాళ రంగనాయకమ్మ ''బలిపీఠం'' ముఖ్యమైనవి.

జాతీయ సాహిత్యంలో "మాలపల్లి'' మణిపూస వంటిదని చెప్పవచ్చు. ఉన్నవ లక్ష్మీనారాయణగారు "సుప్రసిద్ధాంధ్ర నాయకులు. సంస్కర్తలు. సాహిత్యవిశారదులు, కార్యశూరులు.'' ఈ నవలలో ఉన్నవవారు అస్పృశ్యతా నివారణను, హరిజనోద్యమాన్ని ప్రధాన ఇతివృత్తంగా స్వీకరించారు. "ఉన్నవ లక్ష్మీనారాయణగారు మాలపల్లి యందు సంకల్పించిన నవజీవన నిర్మాణవిధానము లాంధ్ర సాహిత్య సంస్కారమునందు నూతనాధ్యాయములు'' అన్నారు కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారు.

ఈ నవలను రామదాసు 'ఆత్మోద్ధరణము' అనవచ్చు. పెరిగిన పంటచేనును చూసుకొని మురిసిపోతున్న రామదాసుతో నవల ప్రారంభమై ఆయన మౌనిగా, యతీంద్రుడుగా రూపొందడంతో అంతమవు

తుంది. భౌతికమైన సంపదనుంచి కష్టాల సంక్లిష్టమార్గం గుండా ఆధ్యాత్మికమైన సంపదను పొందడానికి ప్రతిమానవుడు సాగించే యాత్ర రామదాసు జీవితమని చెప్పవచ్చు. రామదాసు గొప్ప తనాన్ని చూపడానికి—చిన్నకులాల వారి గొప్పతనంతోపాటు పెద్ద కులాలవారి చిన్నతనం కూడా విస్పష్టంగా చూపారు రచయిత.

'మాలపల్లి'కి 'సంగవిజయము' అన్నది నామాంతరం. సంగదాసు ఈ నవల మొదటిభాగంలోనే మరణించినా అతడు నిజంగా జీవించడం మొదలు పెట్టింది ఆ తరువాతనే. విజయకళాశాల స్థాపన, దిగువజాతుల విద్యాసముపార్జనకు అవకాశం, పంచములను కూడ గౌరవంగా చూడడం—ఇవి అన్నీ సంగదాసు ఆశయాల పరిపక్వ రూపమే. రామదాసు దిగువకులాలవారి ఆధ్యాత్మిక సంపత్తికి ప్రతీక అయితే సంగదాసు వారి మేధాసంపత్తికి ప్రతీక అని చెప్పవచ్చు.

ఈ నవలలో రామదాసు, సంగదాసు, రామానాయుడు అహింసా సిద్ధాంతం మూర్తికట్టినవారు. వీరి పాత్రలను చిత్రించడంలోను, హరిజనోద్యమ విజయాన్ని చూపడంలోను ఉన్నవవారు జాతీయోద్యమ సిద్ధాంతాలనే స్వీకరించినా ఈ నవల ఆద్యంతమూ ఎక్కడా మనకు ఆ ఉద్యమనేత అయిన గాంధీజీ పేరుకాని, ఆయన సారథ్యం వహించిన కాంగ్రెసు పేరుకాని, ఆ కాంగ్రెసు నడిపిన జాతీయోద్యమం పేరుకాని కానరావు, అందువల్లనే మాలపల్లి కేవలం వస్త్వాశ్రయ పద్ధతిలో ఒక వర్గంవారి జీవితాన్ని చిత్రించిన అద్వితీయమైన నవలగానే పరిగణింపబడుతుంది.

''వేయిపడగలు'' విశ్వనాథ సర్వోత్కృష్టమైన రచన. ఈ శతాబ్దంలోని మొదటి రెండు, మూడు దశాబ్దులలో తెలుగువారి జీవనగతుల్లో వచ్చిన మార్పును విశ్వనాథవారు ఇందులో చిత్రించారు.

ఈ రెండు మూడు దశాబ్దుల కాలాన్ని చిత్రించదలుచుకొన్నవా రెవ్వరూ జాతీయోద్యమ భావాన్ని, ఆ ఉద్యమ స్థితిగతులను పేర్కొన కుండా ఉండడానికి వీలులేదు.

'వేయిపడగలు' లో కనీసం ముగ్గురు పాత్రలు జాతీయోద్యమంలో మునిగితేలినవారు: సుబ్బన్న పేటలో జాతీయ కళాశాలను స్థాపించిన కేశవరావు, ధర్మారావుస్నేహితుడు రాఘవరావు ఆ ఉద్యమంవల్ల ప్రత్యక్షంగా ప్రభావితులైనవారు. ఇక ధర్మారావు– ఆ ఉద్యమం అంటే అభినివేశం ఉండి ఆర్థికమైన కారణాలవల్ల దానిలో పాల్గొనలేక దాని సిద్ధాంతాలను ఆమోదించినవాడు.

కేశవరావుగారు జాతీయభావాలకు ఆలవాలమై ఉండే కళాశాలస్థాపనకు పడిన మథన, దానిని నిర్వహించడానికి పడిన పాట్లు ఆనాటి విద్యావిధ్యానాన్ని తెలియచెబుతాయి. ఇక రాఘవరావు మద్యపాన నిషేధంవంటి దురాచారాలను మాన్పడానికి పడిన శ్రమ ఆ జాతీయోద్యమ కార్యకర్తలకు తగినదే! తుదకు రాఘవరావు తన సర్వస్వాన్నీ, చివరకు తన దేహదార్ఢ్యాన్నికూడా ఈ జాతీయోద్యమానికే ధారపోయడం చూస్తే, నిస్వార్థకాములై ఆనాడు తమ ధన, మాన, ప్రాణాలనుకూడా లెక్కించక జాతీయోద్యమంలోకి దూకిన ఎందరో యోధులు జ్ఞాపకం వస్తారు.

వీనికన్న ఎక్కువగా, విశ్వనాథ ఆనాడు గాంధీజీయెడ వెలువరించిన భావాలు ఎంతో సత్యాలు.

''అప్పటికి మహాత్ముడైన గాంధి సహాయ నిరాకరణోద్యమారంభించి రెండేండ్లయినది. జనులు గాంధి దేవుడై యవతరించె నన్నారు. ఆయనే కృష్ణుడు. రాట్నమే వేణువు. తన్మధురధ్వని వంశీనాదము. భారతదేశము బృందావనము. ప్రజలు గోపికలై యాయన చెప్పినట్లే కోట్లకుగోట్లు జనులు గుమిగూడి యవలంబించ

కొచ్చిరి. దేశమునందింగ్లీషు చదువన్నను పాశ్చాత్య సంప్రదాయానుసరణ మన్నను నిరాదరణ కలిగెను."

అడివి బాపిరాజుగారు జాతీయోద్యమ ప్రచండతకు విచలితులై, బందరులోని జాతీయకళాశాలలో అధ్యాపకవృత్తి నెరపిన వారు. ఆయనకు గాంధీజీ అన్నా, ఆయన అహింసా సిద్ధాంతమన్నా, జాతీయ భావ నిష్ఠమైన ఏ వ్యవహారమన్నా ఎంతో ప్రాణం. ఆయన ''నారాయణరావు,'' "కోనంగి" అన్న నవలలలో జాతీయోద్యమ విశేషాలు వివరంగా వర్ణించబడ్డాయి. కాంగ్రెసు ప్రారంభించిన ఉద్యమాలలోని ఉత్కృష్టతను గురించి మిగిలిన పార్టీలలోని లోపాలను గురించి ఆయన తన నవలలోని ప్రధానపాత్రలద్వారా చాలా సంభాషణలలో ఉపన్యాసాలు చెప్పించారు.

నారాయణరావు గాంధీగారి పిలుపు విని కాలేజీ వదిలి దేశం కోసం ఖైదుకు వెళ్ళినవాడే! అలాగే కోనంగికూడా. ఈ అసహాయోద్యమంయొక్క ఉత్సాహం స్త్రీలలోకూడా అమితంగా ఉండడాన్ని చూపారు బాపిరాజు. "కోనంగి'' లో అనంతలక్ష్మి, "నారాయణరావు'' లో శారద అక్కగారు శకుంతల ఇటువంటివారు.

''నువ్వు అదృష్టవంతురాలవు కాబట్టి నీకు నాన్‌కోఆపరేషన్ భర్తదొరికాడు'' అంటుంది శకుంతల, చెల్లెలు శారదతో.

ఇక కోనంగికి చిన్నతనంనుంచీ ''కాంగ్రెసు మహాసంస్థ అనీ, కాంగ్రెసు నాయకుడైన మహాత్మా గాంధీ లోకనాయకుడనీ నమ్మకం. రానురాను అతడు కాంగ్రెసు సభ్యుడై, అది చేపట్టిన అన్ని ఉద్యమాలలోను ముందుకు ఉరికాడు.

కోనంగి సమకాలికమైన ఉద్యమాలను తలచుకొన్నప్పుడల్లా బాపిరాజు అనాటి సర్వ విషయాలను వర్ణిస్తారు. 1925-40ల మధ్య వచ్చిన అన్ని రాజకీయ ఉద్యమాలను, పరిణామాలను కోనంగి

ద్వారా చెప్పిస్తాడు. చివరకు కోనంగి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకుపోతాడు. ఇలా ఆనాటి అన్ని ఉద్యమాలను వివరంగా వర్ణించాడు బాపిరాజు.

ఈనవల అంతటా కోనంగికి ఆనాటి రాజకీయ జీవితానికి ఉన్న సంబంధం చూపబడ్డది. ఉత్సాహవంతుడైన ఉద్యమ కార్యకర్తగా, జైలు నివాసిగా, సంపాదకునిగా అతని అనుభవాలే ఇందులో వర్ణింపబడ్డాయి. నిజానికి ఇవిఅన్నీ బాపిరాజుగారి స్వానుభవాలే!

జీవితం మీద ఒక దృక్పథాన్ని కలగచేయాలన్న ఉద్దేశ్యంతో సాగిన నవల బుచ్చిబాబు ''చివరకు మిగిలేది.'' ఈ దృక్పథాన్ని కలగచేయడానికి రచయిత దయానిధి పాత్రను స్వీకరిస్తాడు.

దయానిధి జీవితంలో వచ్చిన పెద్ద మలుపు అతని శోభనంనాటి రాత్రి కాంగ్రెసు సభలో మాట్లాడి, అరెస్టుకాబోయి, మామగారు పోలీసు ఆఫీసరయినందువల్ల, బయటపడడం. దయానిధిలో వచ్చిన రాజకీయ చైతన్యానికి ఇది దోహదం చేస్తుంది.

దయానిధి అత్తవారింటికి వచ్చాడు. ఆరాత్రి భోజనం చేశాడు ఇంకాకొద్దిసేపట్లో భార్యాభర్తలు ఒకటౌతారు. ''ఐదు నిముషాల్లోనే భారత మాత సంకెళ్ళని చప్పుడు చేస్తూ అతని ఏకాంతాన్ని భంగం చేసింది." ఆ సంకెళ్ళ చప్పుడు చలించిన దయానిధి కదనరంగంలోకి దూకుతాడు. ఇది 1935 లో.

గాంధీజీ (''ఒక సన్నటి నల్లటి పొడుగాటాయన'') సాగించిన ఉద్ధృతమైన ఉద్యమం, అందులో ప్రజలు రేణువులై పోవడాన్ని ఎంతో నిశితంగా వర్ణించాడు బుచ్చిబాబు. తాను ప్రేక్షకుడుగా మాత్రమే ఉపన్యాస వేదిక దగ్గరకు వస్తానన్న దయానిధి, తీరా దగ్గరకు వచ్చాక తన ఉద్రేకాన్ని ఆపుకోలేకపోతాడు. ఆ ఉద్రేకం ఎటువంటిది? ''శరీరం పొంగింది. చర్మం విప్పుకుని వెంట్రుకలు నిలబడి

గుండెలు దడదడ కొట్టుకుంటూ రక్తం వేడెక్కి వేగంగా ప్రవహిస్తూ అతన్ని నరాలకుప్పగా మార్చివేశాయి. అతనిక మనిషికాడు. ఒక శక్తి.''

ఇది ఆనాడు ఉద్రేకపూరితుడైన ప్రతికార్యకర్తకు నిర్వచనంగా చెప్పుకోవచ్చు.

ఈ నవలలో రెండు ప్రపంచ సంగ్రామాల మధ్యకాలంలో ఒక వైపు బ్రిటిష్‌వారి తాబేదార్లకూ వేరొకవైపు స్వాతంత్ర్యాన్ని ఆకాంక్షించే యువతీ యువకులకూ మధ్య జరిగిన సంఘర్షణ ఎంతో ప్రతిభావంతంగా చిత్రించబడ్డది.

కొడవటిగంటి కుటుంబరావు తాను వ్రాసిన చాలా నవలలకు 1930-40ల మధ్యకాలాన్ని పృష్ఠభూమిగా స్వీకరించారు. ఆనాటి జీవితాన్ని వర్ణించాలంటే జాతీయోద్యమాన్ని వర్ణించి తీరవలసిందే. కుటుంబరావుగారి చాలా నవలలలో ఈ ప్రస్తావన ఉన్నా, ముఖ్యంగా ఆయన ''చదువు'' అన్న నవలలో ఆ జాతీయోద్యమం వల్ల ప్రభావితమైన ఒక కుటుంబజీవితం చిత్రించబడ్డది.

ఆనాడు స్వదేశోద్యమంలో జరిగిన ఎన్నో కార్యక్రమాలకు ఈ నవలలో నాయకుడు సుందరం కేవలం ప్రేక్షకుడు మాత్రమే. కాని అతని మేనమామ శేషగిరి ఉద్యోగం మాని ఉద్యమంలో చేరడంతో ఆ ఉద్యమ విశేషాలు చాలా స్పష్టంగా తెలిసి వస్తాయి సుందరానికి.

''ఇంకా అస్పృశ్యత ఏమిటి? అంతా గాంధీమయం అయిపోతుంటేను—? జగమంతా గాంధీమయం'' అంటాడు శేషగిరి. దీని వలన ప్రభావితుడైన సుందరం కాలేజీలో చేరాక కాంగ్రెసు సభలకు వెళ్ళాడు. ఉప్పు సత్యాగ్రహంలో దేశం అట్టుడికినట్టు ఉడికిపోవడం సుందరానికి తెలుసు. ఇలా సుందరానికి చుట్టూ ఉన్న జీవితంలో ఆనాడు దేశవ్యాప్తంగా జరిగిన అనేక జాతీయోద్యమాల ప్రభావం

ఎలా పడ్డదీ వివరంగా చూపుతుంది ఈ నవల. ముఖ్యంగా ఇన్ని ఎగుడు దిగుడుల్లోను నిజంగా తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన శేష గిరి వంటి వ్యక్తుల జీవితాలనుగురించి ఇంకా స్పష్టంగా విశదీకరిస్తుంది ''చదువు''.

మహీధర రామమోహనరావుగారి ''కొల్లాయి గట్టితే నేమి'' అన్న నవల 1921 లో దేశాన్ని ఉద్రూత లూగించిన గాంధీజీ ఉద్య మాలను గురించిన రచన. కార్యస్థానం గోదావరి జిల్లాలోని ముంగండ. ఆనాటి రాజకీయ జీవితాన్ని చిత్రించడం ఈ నవల ధ్యేయం. ఆనాడు సంఘాన్ని కదిలించి వేసిన అన్ని కార్యక్రమాలు ఇందులో సవివరంగా వర్ణించ బడ్డాయి

ఈ నవలకు రచయిత ఉంచిన పేరునుబట్టే ఇది గాంధీజీ ప్రభా వాన్ని చిత్రించే నవలగా మనం ఊహించవచ్చు. గాంధీజీ ఆదేశం ప్రకారం కాలేజి చదువు మానిన ఒక విద్యార్థి కథ ఇది. అలా కాలేజి చదువులు మానడంలోగల ఇబ్బందులు, చుట్టపక్కాలు చూపే నిరసన ఇందులో వాస్తవికంగా చిత్రించబడాయి. ఒక గ్రామాన్ని కేంద్ర స్థానంగా స్వీకరించి, దానిలోని విభిన్నవ్యక్తుల్ని—ముఖ్యంగా భారత జాతీయోద్యమం అంటే వారికివున్న విభిన్న మనస్తత్వాల్ని—ప్రక టించి 1921 లో జాతీయోద్యమం ఒక అగ్రహారంలోని ప్రజల జీవి తాలను ఎలా ప్రభావితం చేసిందీ చూపే నవల ఇది.

తెలంగాణాలో నిజాంకు వ్యతిరేకంగా జరిగిన జాతీయోద్య మాన్ని గురించి కూడా కొందరు నవలాకారులు వ్రాశారు. అందులో ప్రముఖంగా పేర్కొనదగినది శ్రీ వట్టికోట ఆళ్వారుస్వామిగారి ''ప్రజల మనిషి''. "1938 లో హైదరాబాదు స్టేటు కాంగ్రెసు పుట్టు టకు పూర్వం తెలంగాణా వాతావరణాన్ని ఆధారంచేసికొని, దాని ప్రభావం నుండి బయలు దేరిన ఒకరిని కథానాయకునిగ తీసికొన్నాను"

అన్నారు అళ్వారుస్వామిగారు. ఇందులోని కంఠీరవం జాతీయోద్యమానికి తొలితరం యువనాయకులకు ప్రతీక. ఒకవంక నిజాం ప్రభుత్వ నిరంకుశాధికారాన్ని, అంతకన్న ఎక్కువగా దేశముఖ్‌లు, దొరలు సాగించే పెత్తనాన్ని ఎంతో ప్రతిభావంతంగా చిత్రించాడు యీయన.

తెలంగాణా పోరాటాన్ని కథావస్తువుగా స్వీకరించిన, లేదా తమ నవలలకు పృష్ఠభూమిగా స్వీకరించిన నవలలు వ్రాసిన వారిలో భాస్కరభట్లకృష్ణారావు (యుగసంధి), సింగరాజు లింగమూర్తి, దాశరధి రంగాచార్యులుగార్లను పేర్కొనవచ్చు.

హరిజన సమస్యను గురించీ, కులాంతర వివాహాలను గురించీ వ్రాయబడిన నవలల్లో ''బలిపీఠం'' ఎన్నికచేయ తగ్గది. వర్ణాంతర వివాహం చేసుకొన్న జీవితాలు ఎలా నడుస్తాయో చూపి, ''కులాల ఆధిక్యత'' అర్థంలేని సిద్ధాంతం అని రచయిత్రి శ్రీమతి ముప్పాళ రంగనాయకమ్మ ఈ నవలలో ప్రతిపాదించింది. ఇందులో పరిచయం చేసిన ''కరుణసమాజం'', ఆ ఆశ్రమ సిద్ధాంతాలు గాంధీజీ ఆశ్రమ సిద్ధాంతాలను జ్ఞప్తికి తెస్తాయి. హరిజన సమస్యను గురించి వచ్చిన నవలలలో రావూరి వెంకట సత్యనారాయణరావు వ్రాసిన ''నెలవంక'' కూడా ముఖ్యమైనది. సనాతన బ్రాహ్మణ సంఘానికి, సంఘసంస్కరణకీ మధ్య వచ్చే వైరుధ్యాన్ని చక్కగా చిత్రించిన నవల ఇది.

ఈ పైన పేర్కొన్న నవలలు కాక ఇటీవల వెలువడిన ఇంకా ఎన్నో నవలలు జాతీయోద్యమ ప్రభావాన్ని చిత్రించడానికి ప్రయత్నించాయి. శ్రీ పోలాప్రగడ సత్యనారాయణమూర్తి వ్రాసిన 'కౌసల్య' లో కౌసల్యభర్త శోభనంనాటి రాత్రే జాతీయోద్యమంలో పాల్గొని జైలుకు వెడతాడు. ఒక కుటుంబాన్ని ఈ జాతీయోద్యమం ఎలా ప్రభావితం చేసిందో, అందులోని విభిన్న వ్యక్తులు దానిని ఎలా వేరువేరు దృక్పథాలలో దర్శించారో చూపుతుంది ''కౌసల్య''.

సుమలత వ్రాసిన ''జీవనకలశం'' లో నాయిక వసంతలక్ష్మి తనకు ఇష్టంలేని భర్తను వదలి గాంధీజీని వార్ధాలో దర్శించి, ఆయన ప్రాపున నాగపూరులో చదువుకొని తనకు నచ్చినవాడిని వివాహ మాడుతుంది. ఇటీవలనే వెలువడ్డ ''రాజరికాలు-పేదరికాలు'' అన్న నవలలో ఫ్యూడల్ పద్ధతులకు చెందిన జమీందారుల కుటుంబంలో జాతీయ భావాలు పెంపొందించుకొన్న ఒక యువకుడు, అతనిభార్య పడే కష్టాలు వర్ణించబడాయి.

అలానే శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి వ్రాసిన ''విజేత'' లో సత్యాగ్రహోద్యమ ప్రసక్తి ఉంది.

పడాల వ్రాసిన "1857", ''అల్లూరి సీతారామరాజు'' కూడా జాతీయోద్యమ ఆద్యంతాలను చిత్రించిన నవలలు. ఒకటి మొదటి స్వాతంత్ర సంగ్రామాన్ని కథావస్తువుగా గ్రహించివ్రాస్తే, రెండవది ఇటీవలి వాడైన విప్లవయోధుడు అల్లూరి జీవితం ఆధారంగా ఆయన తన జీవితాన్ని దేశస్వాతంత్ర్యం కోసం ఎలా త్యజించాడో చూపుతుంది.

''ఇందుమతి'', ''ఇంద్రధనుస్సు'' అన్న నవలలు కూడా జాతీయోద్యమాన్ని చిత్రిస్తూ వ్యక్తులపై యీ ఉద్యమ ప్రభావం ఎలా ప్రసరించిందో వర్ణించినవే!

స్వాతంత్ర్యానంతరం వచ్చిన కవితలలో వలెనే నవలలోకూడా జాతీయోద్యమంలో త్యాగాలు చేసిన నాయకుల పవిత్రత, ధర్మదీక్షలకు ప్రతిగా ఈనాటి అధర్మము, నీచత్వము చూపబడాయి. ఇవి అన్నీ వ్యంగ్యాత్మకమైనవి. ఇట్టి నవలల్లో శ్రీ జి. వి. కృష్ణారావు వ్రాసిన ''కీలుబొమ్మలు'' ఎన్నదగిన రచన. ఈ నవలలో అమ్మాయమ్మ స్వార్థప్రయోజనాలకు హరిజనసేవ అన్న నినాదాన్ని ఎలా ఉపయోగించుకొన్నదో ఎంతో వ్యంగ్యంగా చిత్రించ బడ్డది.

ఇలా వందలాది నవలలు జాతీయోద్యమాన్ని ఏదోవిధంగా వర్ణించాయి. ఇలా వర్ణించిన నవలలను మూడు కక్షలకు చెందినవిగా క్రోడీకరించవచ్చు. ఒకరకం నవలలు జాతీయోద్యమాన్ని, ఆనాటి వ్యక్తులమీద అది చూపిన ప్రభావాన్ని చిత్రించేవి. అట్టివానిలో వేయిపడగలు, నారాయణరావు, కోనంగి, కొల్లాయి గట్టినేమి మొదలైన వానిని చేర్చవచ్చు.

రెండవ రకం నవలలు ఆనాటి ఉద్యమానికి దోహదాలై, నిర్మాణ కార్యక్రమాలకోవకు చెందినవి. అస్పృశ్యతా నివారణ, గోవధ నిషేదము, వర్ణాంతర వివాహాలు మొదలైన వానిని చిత్రించినవి. మాలపల్లి, బలిపీఠం వంటివి ఇందుకు ఉదాహరణలు.

ఇక మూడవ పద్ధతికి చెందినవి ఆనాటి జాతీయోద్యమంలోని స్వచ్ఛందతనూ, ఈనాడు దాని పేరున నాయకమ్మన్యులు సాగిస్తున్న అవినీతినీ తులనాత్మకంగా చూపే వ్యంగ్యరచనలు. 'కీలుబొమ్మలు' వంటి నవలలు ఈ కోవకు చెందినవి.

# తెలుగులో డిటెక్టివ్ నవలలు

ఒక కొత్త విషయం అకస్మాత్తుగా తెలిస్తే మనిషి ముందు విచలితుడౌతాడు. ఆ తరువాత ఆశ్చర్యం, ఆనందం క్రమంగా లభిస్తాయి. మామూలు పాఠకుడికి కథలో ఉండవలసినది సస్పెన్సు—ఏదో జరగబోతున్నదన్న ఉత్సుకత. ఇది డిటెక్టివ్ నవలల్లో అధికంగా ఉండడం వలననే అవి ఎక్కువ మంది పాఠకులను ఆకట్టుకొన్నాయి. గత పదిహేను సంవత్సరాలలో వచ్చినన్ని డిటెక్టివ్ నవలలు ఈ వందఏళ్ళనుంచీ వచ్చిన ఇతర నవలలకన్న ఎక్కువ సంఖ్యలో ఉన్నాయంటే అతిశయోక్తికాదు.

ఈ రకం సాహిత్యానికి మొదట మనవారుంచిన పేరు 'అపరాధ పరిశోధక నవలలు'. గద్య సాహిత్యానికి స్వర్ణయుగ మనదగిన 1920—35 సంవత్సరాల మధ్య యుగంలో ఎక్కువ మంది పాఠకులను ఆకట్టుకోవడానికి ప్రారంభమైంది ఈ సాహిత్యం. ముందు అనువాద సాహిత్యంగా ప్రారంభమై. కొద్ది మౌలికమైన రచనలు వెలువడి. తిరిగి అనువాద, లేదా అనుకరణ సాహిత్యంగానే యీ నాటికీ ఉండిపోయింది.

ఆంధ్రప్రచారిణీ గ్రంధమాల, సరస్వతీ గ్రంధమాల, విజ్ఞాన చంద్రికా మండలి, వేగుచుక్క గ్రంధమాల— యీ గ్రంథ ప్రచురణ సంస్థలన్నీ యిటువంటి నవలల అనువాదాలనో, అనుకరణలనో ప్రచురించాయి. ఈ నవలలు ఎక్కువగా బెంగాలీ నుండే అనువదింపబడ్డాయి. కొద్ది నవలలు మరాఠీ కన్నడ భాషలనుంచి, ఇంగ్లీషు

నుంచి అనువదింపబడ్డాయి. అయితే ఈ అనువాద నవలన్నింటిలోని వాతావరణాన్ని, పాత్రల పేర్లనుమార్చి అనువాదకర్తలు తెలుగు వాతావరణాన్ని, తెలుగు పాత్రలను ప్రవేశపెట్టారు. వెంకట పార్వతీశకవులు యిట్టి నవలలను అనువదించి ప్రచురించడానికి ఆద్యులు. పాంచకడీదేవ్ బెంగాలీలో వ్రాసిన చాలా నవలలను వీరు నేరుగా బెంగాలీనుంచి కాక ఆ బెంగాలీ నవలల కన్నడానువాదాలనుంచి తెలుగులోకి తెచ్చారు.

ఈ నవలల ఆవిర్భావానికీ ముందుకూడా యిటువంటి నవలలు లేకపోలేదు. అవి చారిత్రక — కాల్పనిక నవలలు. యోధులు, పన్నుగడలు, కుట్రలు, యుద్ధాలు — ఇవి అన్నీ యీ కాల్పనిక నవలలలోని విషయాలే. అయితే వీనిని కొంచెం ఆధునిక పద్ధతులకు అనుగుణంగామార్చి వ్రాసినవే అపరాధ పరిశోధక నవలలు. ఇందు లోనూ కుట్రలు, కుతంత్రాలు, భూగృహాలు — అన్నీ ఉన్నాయి. అయితే చారిత్రక—కాల్పనిక నవలల్లో కనిపించే సామూహిక చర్యలు (group actions) కు బదులు యిందులో ఒక దొంగలగుంపు, లేదా కొందరు దుర్మార్గులుచేసే ఘోరకృత్యాలు, ఆ దుర్మార్గులను శిక్షించ డానికే అవతారమెత్తిన పరిశోధకుడు — వీరి మధ్య సంఘర్షణ మాత్రమే చూపబడ్డవి. ఒక విషయంలో మాత్రం యీ రెంటికీ సామ్యంవుంది. రెంటిలోను నాయకుడు ఎంతో తెలివిగలవాడు, ఏ పనినైనా అవలీలగాచేయ గలిగినవాడు, దుర్మార్గులను శిక్షించి, సన్మార్గులను (ముఖ్యంగా స్త్రీలను) రక్షించడానికి కంకణం కట్టుకొన్న వాడు. చివరకు ధర్మం జయిస్తుంది.

ఈ నవలలు బెంగాలీనుంచి అనువదించడం ప్రారంభించిన వెంకట పార్వతీశకవులు-అంతకు ముందే అనువాద నవలాసాహిత్యానికి ఒక ఒరవడిని పెట్టి వున్నారు. వారు అనుసరించిన పద్ధతి స్థూలంగా యిది. కథా వస్తువును మూలంనుంచి గ్రహించి, దాని వాతా

వరణాన్ని సంఘటన జరిగే స్థలాలను, పాత్రలపేర్లను తెలుగు పాఠకులకు దగ్గరగా ఉండే విధంగామార్చి నవలను వ్రాయడం. ఇదే పద్ధతిని ఈ కాలం అనువాదకులందరూ అనుసరించారని చెప్పవచ్చు.

ఈ మొదటితరం నవలల్లో అద్భుత రసం ఎక్కువ. ఒక నాయకుడు ఏదో విధంగా ప్రతిపక్షాలవారి చేతులో చిక్కడం, యుక్తి ప్రయుక్తుల పన్నుగడలలో అతడు కొన్నిసార్లు ఆ చిక్కుల నుంచి వెలికిరావడం, తిరిగి అందులో చిక్కుకోవడం— చిట్టచివరకు ఆ దుర్మార్గులను శిక్షించి అతడు విజయం సాధించడం—ఇదీ కథ. అప్పుడప్పుడు దయ్యాలు, రసాయన పదార్థాలుకూడా ప్రవేశపెట్ట బడ్డాయి. భూగృహాలు, పాడుబడ్డ ఇళ్ళు, మీటలునొక్కితే పక్క లకు జరిగే గోడలు — యివి అన్నీ యీ నవలల్లో సాధారణంగా కనిపిస్తాయి.

ఇటువంటి నవలలో వేంకట పార్వతీశకవుల 'మాయావి', 'మాయావిని', 'మనోరమ' ఎంతో ప్రఖ్యాతి వహించాయి. దేవరాజు వెంకట కృష్ణరావుకూడా ఇట్టి నవలలు వ్రాసిన (లేదా అనుకరించిన) వారిలో ప్రఖ్యాతుడే. ఆయన 'వాడే వీడు' 'నేనే' ఆ రోజుల్లో ఎందరో పాఠకుల మన్ననలు పొందిన రచనలు. అయినాపురపు సోమేశ్వరరావు, తాతా కృష్ణమూర్తి వంటి వారుకూడా యీ సందర్భంలో పేర్కొనదగిన రచయితలే !

ఇన్ని అనువాద అనుకరణలలోను కొన్ని మౌలికమైన రచనలు కూడా రాకపోలేదు. వీనిలో చింతాదీక్షితులుగారి 'చిత్రరేఖ', మునిమాణిక్యం నరసింహారావుగారి 'వక్రరేఖ' పేర్కొనదగిన రచనలు.

చారిత్రక నవలలుగా పేరుపొందినా, అద్భుత రసప్రధానా లయిన 'మొగలాయీ దర్బారు' వంటివికూడా యీ కోవకు చెందిన రచనలుగానే పరిగణింపవచ్చు.

ఆంగ్ల సాహిత్యంలో షెర్లాక్ హోమ్స్‌కు ఎంతో ప్రసిద్ధివుంది. కాని ఏ ఒకటి రెండు నవలికలో తప్ప ఆయన యితర సాహిత్యం తెలుగులోకి అనువదింప బడలేదు. అంతకన్న రీవ్స్, ఎలైర్ వంటి అప్రసిద్ధ రచయితల నవలలు అనుకరింపబడ్డాయి.

1955 ప్రాంతాల ఈ రకం నవలల ఉధృతంతగ్గి, సాంఘిక నవలలు ప్రసిద్ధిలోకి వచ్చాయి. తిరిగి 1950—55 ప్రాంతాలకు యీ నవలలు తిరిగి తమ ఆధిక్యతను సంపాదించాయి. మనలో చదువు కొన్న వారు ఎక్కువై, ఆంగ్లభాషలో విద్యాభ్యాసాన్ని కొంతవరకు కొన సాగించి. అనేక వృత్తులలో చేరినవారు గంభీరమైన, సుదీర్ఘమైన నవలలు చదవలేక ఆంగ్లంలోని డిటెక్టివ్ సాహిత్యాన్ని చదవడం ప్రారంభించారు. పెర్రీమాసన్ వంటి రచయితల నవలలు సామాన్య పాఠకులకు మనన గ్రంథాలయినాయి. దీనితో తెలుగులో కూడా డిటెక్టివ్ నవలల రెండోవెల్లువ వచ్చింది. ఈసారి యీ నవలలు డిటెక్టివ్ నవలలుగాను, డిటెక్టివ్—మిస్టరీ నవలలుగాను మొలకెత్తాయి.

వెనుక వచ్చిన అపరాధ పరిశోధక నవలలు (లేదా అద్భుత నిరూపక నవలలు) చాలవరకు అనువాదాలు. కాని యిటీవల వచ్చిన నవలలలో చాలవరకు పేర్లు చెప్పకుండాచేసిన కాపీలు. వెనుక తెలుగు పాఠకులు చదువు కోవడానికి వీలుగా వాతావరణాన్ని పాత్రల పేర్లను మార్చారు. ఈ సారి పాత్రల పేర్లను కొంతవరకు మార్చారు. ఈనవలల్లో చిత్రించేవాతావరణంఎక్కడ వుంటుందో ఎవరికీ అంతుపట్టనిది.యిందులో అంతర్గతంగావుండే ఏదో 'మిస్టరీ' యీ నవల లకు కూడా వేలకొద్ది పాఠకులను సంపాదించి పెట్టింది. ఈ పాఠకులలో ఎక్కువమంది హైస్కూలు, కాలేజి విద్యార్థినీ విద్యార్థులు, కొందరు గృహిణులు, రిటైరయిపోయి యింటిదగ్గర పనిలేక కూర్చున్న వృద్ధులు. దీనికి ఆదరణం ఎంత ఎక్కువైనదంటే— కేవలం యిట్టి రచనలనే ప్రచురించడానికి రెండు మాసపత్రికలు వెలువడుతున్నాయి.

అతి ఉన్నతమైన ప్రమాణాలు కలిగిన సాహిత్య పత్రికకన్న యీ పత్రికల చందాదారులు నాలుగింతలు! అది ఆ రకం రచనలకున్న ఆదరణకు నిదర్శనం.

అయితే కొన్ని చక్కని డిటెక్టివ్ రచనలు రాకపోలేదు. పాఠకునిలో ఉత్సాహాన్ని కలిగించడంతో పాటు ఆలోచింపచేసే నవలలు కొన్ని వచ్చాయి. ఇట్టి స్వతంత్ర రచనల్లో ఆరుద్ర 'పలకల వెండి గ్లాసు' వంటివి ముఖ్యమైనవి. 'శారద' కూడా యిట్టి రచనలు చేసినవాడే!

ఆధునిక డిటెక్టివ్ రచయితల్లో పేర్కొనదగినవారు కొమ్మూరి సాంబశివరావు, జి. వి. జి. కృష్ణ, విశ్వప్రసాద్, టెంపోరావు ప్రభృతులు. మరీ యిటీవల వస్తున్న 'ఏజంటు000' నవలలను గురించి యిక్కడ చెప్పవలసిందేమీ లేదు.

తెలుగులో వచ్చిన డిటెక్టివ్ సాహిత్యాన్ని గురించి చెప్పవలసివచ్చినప్పుడు అది సాధించిన ఒక మంచి పనిని పేర్కొనక తప్పదు. అది పాఠకులలో పఠనాశక్తిని పెంపొందించడం. ఇలా డిటెక్టివ్ నవలలతో చదివే అలవాటును పెంపొందించుకొని, తరువాత గంభీరమైన నవలలను కూడా చదవడం అలవాటు చేసుకొన్న పాఠకులు కొందరు లేకపోలేదు.

ఈ సందర్భంలో కొడవటిగంటి కుటుంబరావు (టి. వి. శంకరమ్ అనే పేరుతో) వ్రాసిన వ్యంగ్యకథలను పేర్కొనాలి. అది డిటెక్టివ్ నవలలమీద ఆయన అతి సున్నితంగా చేసిన విమర్శ.

# నాలుగవ భాగం

తెలుగునవల :
కథా కథన శిల్పం

# కథా కథన శిల్పం

నవలా రచనలో ఇతివృత్త నిర్మాణం, పాత్రపోషణ, కథా కథనం, ఉద్దేశం, భాష – శైలి వీనిని ముఖ్యమైన అంగాలుగా నిర్ణయించారు విమర్శకులు. తెలుగు నవలలో ఇతివృత్త నిర్మాణంలో ఉన్న వైవిధ్యాన్ని గురించి మూడో అధ్యాయంలో వివరించబడ్డది. పాత్రపోషణ రీతులను గురించికూడా రెండు, మూడు అధ్యాయాలలో వివరించబడ్డది. కొన్ని ముఖ్యమైన నవలలలో వైలక్షణాలు ఏ విధంగా ఉన్నాయో తరువాతి అధ్యాయంలో

చూపబడుతుంది. ఆయా ప్రదేశాల్లో భాష—శైలి, ఉద్దేశం—వీనిని గురించికూడా చెప్పబడ్డది. పోతే, కథాకథనందృష్ట్యా తెలుగు నవలలోని వైవిధ్యాన్ని, విశిష్టతను యిప్పుడు స్థూలంగా వివరిస్తాను.

కథకు ఇతివృత్తం ముఖ్యం అంటారు. ఆ సూత్రాన్నే తొలి నవలా రచయితలు అనుసరించారు. కాని మనోవైజ్ఞానిక శాస్త్రం అభివృద్ధి అయిన తరువాత ఇతివృత్తంతోపాటు పాత్రల అంతరాంతరాలలోని మనోభావాలను చిత్రించే పాత్ర చిత్రణకూడా ప్రాముఖ్యం వహించింది. కాని కథాకథనంలో ఆనాటి ఈనాటినవలాకారులు కూడా ఎన్నో వినూత్నమైన ప్రయోగాలు చేస్తున్నారు. ఇవి కూడా తెలుగు నవల ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని స్వాయత్తం చేసుకోడానికి, దానిని సుసంపన్నం చేయడానికి, ఉపయోగపడ్డాయి.

కథాకథనం అంటే కథచెప్పేపద్ధతి. దీనిని స్థూలంగా రెండు విభాగాలుచేయవచ్చు. ఒకటి ఆత్మాశ్రయపద్ధతి, రెండవది పరాశ్రయ పద్ధతి. ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా ఎక్కువ నవలలు పరాశ్రయమైన పద్ధతినే అనుసరించి వ్రాయబడతాయి.

పరాశ్రయ పద్ధతిలో రచయితకు ఎంతో సౌకర్యం ఉంది—ముఖ్యంగా పాత్ర పోషణలో, సంభాషణలను నడిపించడంలో. ఆత్మాశ్రయపద్ధతి అనగానే ఏ పాత్ర ఉత్తమ పురుషలో కథను చెప్పడం ప్రారంభిస్తుందో, ఆ పాత్ర అనుభవాలమేరకే ఆ సంఘటనలు పరిమితమై ఉండాలి. అంతేగాదు, ఒక పాత్రను గురించి, లేదా ఒక సంఘటనను గురించి ఏదైనా విమర్శచేయవలసివస్తే అది ఆ కథనం సాగించే ఒక్క పాత్ర దృష్టినుంచి చేయవలసిందే. అంతేకాని పరాశ్రయ పద్ధతిలోవలె రచయిత తనంత తానుగా ఎట్టి విమర్శను చేయలేడు.

పరాశ్రయపద్ధతి రచయితకు ఎంతో సౌలభ్యాన్ని సమకూరుస్తుంది. తాను జరుగుతున్న సంఘటనలలో భాగస్వామి కాదు కనుక పాత్రలను గురించి, సంఘటనలను గురించి రచయిత తన యిష్టం వచ్చిన విమర్శను చేయవచ్చు. ఇటువంటి విమర్శలు ఒక్కొక్కప్పుడు కథాగమనానికి ఎంతో తోడ్పడతాయి.

ఇటీవల కొన్ని నవలలలో ఆత్మాశ్రయ పద్ధతిలో—ఉత్తమ పురుషలో—కథనం సాగిస్తూనే, ఆ పాత్ర దాని పరిమితిని దాటి రచయితవలె అన్ని విషయాలమీద, తన అభిప్రాయాలను వెలిబుచ్చడంతో పాటు ఇతరులు మనస్సులలో భావించిన విషయాలనుకూడా తానెరిగినట్లే చెప్పడం మనం గమనిస్తే. ఈ పద్ధతిలోఉన్న ఇబ్బందిని గ్రహించవచ్చు.

ఇటువంటి ఇబ్బందులు లేకుండా సూటిగా, సాఫీగా కథచెప్పే పద్ధతిని పరాశ్రయపద్ధతి అంటారు. రచయిత తాను చెప్పదలుచుకొన్న కథని, తన పాత్రలద్వారా నడిపిస్తూ, అవసరం అయినప్పుడు తాను ఆ యా పాత్రలను గురించి, సన్నివేశాలను గురించి పాఠకులకు వివరిస్తూపోయే పద్ధతిని స్థూలంగా పరాశ్రయపద్ధతి అనవచ్చు.

పరాశ్రయపద్ధతిలో వ్రాయబడే నవలల్లో సన్నివేశాల నిర్మాణం పాత్రలపోషణ ముఖ్యం. ఆత్మాశ్రయ నవలల్లో కూడా యివి ముఖ్యమే అయినా, ముఖ్యంగా ప్రధానపాత్ర దృష్టినుంచి మిగిలిన పాత్రల విశ్లేషణ కనిపిస్తుంది.

అయితే ఒక్కొక్కప్పుడు పరాశ్రయపద్ధతిని వ్రాయబడిన నవలలు ఆత్మాశ్రయాలుగాను, ఆత్మాశ్రయపద్ధతిలో వ్రాయబడిన నవలలు పరాశ్రయాలుగాను గోచరించవచ్చు. ఉదాహరణకు ఒక పరాశ్రయ నవలలోని ప్రధానపాత్ర రచయిత భావాలను వెల్లడిస్తూ దీర్ఘోపన్యాసాలుచేస్తూ కథలోని యితరపాత్రల గతిని, వారి

కార్యాలను విమర్శించినప్పుడు అది ఆత్మాశ్రయ పద్ధతికి దగ్గరగా వచ్చిన నవలగా మనం భావించవచ్చు. దీనికి ఉదాహరణలుగా వికాసయుగంలోని ముగ్గురు ముఖ్యమైన రచయితలను స్వీకరించవచ్చు. విశ్వనాథ, చలం, అడివిబాపిరాజులు ముగ్గురూ తాము వ్రాసినవి పరాశ్రయమైన నవలలే అయినా, ఆత్మాశ్రయపద్ధతికి చెందిన నవలలా అనేటట్లు వానిని నడిపారు. దీనికి కారణం—పైన పేర్కొన్నట్లు—వారి చాలా నవలల్లోని ప్రధానపాత్రలు ఆ యా రచయితల భావాలను వ్యక్తీకరించడమే కాక, వారు ప్రచారం చేయదలుచుకొన్న కొన్ని సిద్ధాంతాలకు ప్రతీకలుగా కూడా ఉండడం. ఈ సిద్ధాంతాలను ఎంత నిశితంగా వారు తమ పాఠకులముందు ఉంచదలుచుకొన్నారో, అంత దీర్ఘంగాను, ఏక పక్షంగాను వారిచేత ఉపన్యాసాలిప్పించారు. అట్టి రచనలన్నీ పరాశ్రయపద్ధతిలో వ్రాయబడినా, ఆత్మాశ్రయ నవలలకు దగ్గరలో ఉన్నవే. "వేయిపడగలు" తరువాత విశ్వనాథ వ్రాసిన నవలలో చాలా వరకు యీ తరగతికి చెందినవే. చలం నవలల్లో సగం వరకు ఆయనే స్వయంగా ఆత్మాశ్రయంగా రూపొందించినవి; మిగిలిన సగం పరాశ్రయంగా వ్రాయబడిన ఆత్మాశ్రయాలు. ఇక బాపిరాజుగారి సాంఘిక నవలల్లో—ఆ యా నాయకులు ప్రపంచంలోని అనేక విషయాలమీద చేసే వ్యాఖ్యానాలను గమనిస్తే— అవి అన్నీ ఆత్మాశ్రయ నవలలకు ఎంత దగ్గరగా వస్తాయో వ్యక్తం అవుతుంది. అయితే బాపిరాజు పాత్రల ఉపన్యాసాలు మిగిలిన వారి పాత్రల ఉపన్యాసాలకన్న తక్కువ నైశిత్యాన్ని తక్కువ దైర్ఘ్యాన్ని కలిగివుండడంవల్ల ఆయన పరాశ్రయ నవలల్లో అంత ఆత్మాశ్రయత కనుపించదు. విశ్వనాథ చలం ఇద్దరికీ ఒక సిద్ధాంతాన్ని చెప్పాలన్న గాఢమైన ఆకాంక్ష ఉండడంకూడా దీనికి కారణమే. ఇటీవలి రచనల్లో బుచ్చిబాబు "చివరకు మిగిలేది" ఇందుకు ఉదాహరణ. నవలలోని ప్రధాన

పాత్రను చిత్రించిన విధానం, ఆ పాత్ర చెప్పేమాటలు, అంతకుమించి ఆ పాత్ర తనలోతాను పడే మధన—ఇవి అన్ని రచయిత ఆత్మాను భూతిగా నుసకు ద్యోతకం అయి, తద్వారా యీ నవలను ఆత్మాశ్రయపద్ధతి రచనలకు దగ్గరగా తీసుకొని వస్తున్నవి.

పరాశ్రయ నవలలో రచయిత పాత్రలను సృష్టించి వాని ద్వారా కథను సూటిగా చెబుతాడు. తెలుగులో మొదటి నవలలన్నీ యీ కోవకు చెందినవే. అవి అన్నీ ఒక ప్రధానపాత్రచుట్టూ నిర్మింపబడ్డ కథలు.

కందుకూరి, చిలకమర్తి, ఉన్నవ, వంటి రచయితల రచనలన్నీ ఈ పద్ధతికి చెందినవే. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి నవలికలన్నీ ఇటు వంటివే. ఎప్పుడో వ్రాసినా యిటీవలనే వెలువడిన మల్లాది రామకృష్ణశాస్త్రిగారి రెండు నవలలూ (కృష్ణాతీరం, తేజోమూర్తులు) కూడా ఈ కొవకు చెందినవే. గోపీచంద్ కథల్లో కొంత ఆత్మాశ్రయత కనిపించినా నవలల్లో కనిపించదు. కొడవటిగంటి, పద్మరాజుల నవలలు, పినిశెట్టి ''దత్తత'' బలివాడ కాంతారావు ''గోడమీద బొమ్మ'', ''శారద'' నవలలు ఈ పద్ధతిలో వ్రాయబడినవే. రావూరి భరద్వాజ వ్రాసిన అసంఖ్యాకమైన నవలలు— ముఖ్యంగా ఆయన ''పాకుడు రాళ్ళు''—, సింగరాజు లింగమూర్తి. మంజుశ్రీ, కొమ్మూరి, గొల్లపూడి మారుతీరావు, ఆనందరామం మొదలైన ఆధునిక రచయితలందరూ యీ పద్ధతిలో వ్రాసినవారే.

ఏ సాహిత్యంలోనైనా పరాశ్రమ నవలలే ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. అప్పుడప్పుడు ఈ పరాశ్రయ నవల్లో కూడా రచయిత ఎ చివరనో ప్రత్యక్షమై యీ కథ అంతా నాకు ఫలానావాడు చెప్పాడు అంటూ ముగిస్తాడు. బుచ్చిబాబు నవలికలు యీ కోవకు చెందినవే! చాలా భాగం అవి ఆయనకు పరిచయండన్న వారి కథలు కావడంవల్లనే యిలా వ్రాశాడనుకోనక్కరలేదు. అలా తన

అనుభవాలకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ కథను, ఆ పాత్రలను సమన్వయిస్తే చదివేవారికి ఆసక్తి ఎక్కువ కావడానికి అవకాశం ఉంది.

ఇలా ఆద్యంతమూ కథలోని పాత్రలతో సంబంధం లేక, ఏ చివరనోవస్తే అది కొంత అనవసరంగా తోచవచ్చు. ''మైనా'' అన్న చక్కని నవలలో శీలా వీర్రాజు కథనంతా పరాశ్రయంగా చెప్పి చివరకు రచయితను ప్రవేశపెడతాడు. సాయిబాబా బండిలో పోతూ వుంటాడు. వెనుకగా రచయిత నడుస్తూవుంటాడు. అతడికి వీడ్కోలు చెప్పడానికి వచ్చిన మిత్రులలో అతడు కూడా ఒకడు అయివుండవచ్చు. బండిలోనుంచి సాయిబాబా ''అమ్మాయికి ఏం పేరు పెట్టమంటారో చెప్పలేదు'', అని అడుగుతాడు రచయితని.

''మైనా...............మైనా కుమారి''

అంటాడు రచయిత.

బండి వెళ్ళిపోతుంది. రచయిత యింటికి బయలుదేరాడు. దోవలో ఆ పేరును గురించి ఆలోచిస్తూ ఉంటాడు.

''మైనా! నిజమే. ఆ పేరు చాలా బావుంది. ఎప్పుడయినా సాయిబాబా జీవితాన్ని నవలగా వ్రాస్తే, ఆ నవలకు ''మైనా'' అనే పేరు పెట్టాలి— అనుకున్నాడు రచయిత.

ఆ రచయితను నేనే!''

ఇది ముగింపు. నిజానికి యీముగింపు అనవసరం. పరాశ్రయ పద్ధతిలో నుంచి అనవసరమైనచోట్ల ఆత్మాశ్రయపద్ధతిలోకి కప్పదాట్లు వేయడంవలన యిటువంటివి జరుగుతూవుంటాయి.

ఈ పరాశ్రయతను చారిత్రక నవలలలో సాధించినట్లు సమకాలీన జీవన చిత్రణను చేసే సాంఘిక నవలలలో సాధించడం కష్టం. అందులోనూ ఒక సమస్యను లేదా సిద్ధాంతాన్ని చిత్రించడానికి ఒక

కథను, ఒక పాత్రను స్వీకరించి వ్రాయబడిన నవలలలో ఆత్మాశ్రయత ఏ కొంచెమో తొంగి చూడక తప్పదు.

కేవలం ఆత్మాశ్రయమైన నవలలుకూడా తెలుగులో తక్కువ సంఖ్యలో లేవు. ఇటువంటి నవలలు ఎక్కువ భాగం భావకవిత్వ యుగంలో (దానినే "వికాసయుగం" అన్నాం, నవలా చరిత్రలో) రావడం సమంజసమే! భావకవిత్వం ఆత్మాశ్రయ కవిత్వం. ఆ భావకవిత్వ లక్షణాలలో ప్రధానమైనది, ఆత్మాశ్రయపరంగా భావనచేయడం. అదే లక్షణం ఆనాటి నవలలలో కూడా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అటు కవిత్వంలో కాని, యిటు నవలలలో కాని ఈ ఆత్మాశ్రయత ఎక్కువగా గోచరించడానికి కారణం ఆ కాలం రచయితలలోని విలక్షణమైన భావనే! ఈ కాలపు విలువల దృష్ట్యా మనం భావకవిత్వాన్ని, అదే కోవకుచెందిన ఆత్మాశ్రయ నవలలను విమర్శించవచ్చు. కాని ఆ క్రిందటి యుగాల దృష్ట్యా చూస్తే ఆ యుగం రచయితలలో కొత్త విషయాన్ని, కొత్తగా చెప్పాలనే ఆకాంక్ష ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. ఈ ఆకాంక్షే వారిని అంత ఆత్మాశ్రయ వాదుల్ని చేసింది.

భావకవిత్వాన్ని అంతో యింతో వ్రాసిన విశ్వనాథ, బాపిరాజుల నవలల్లో యీ ఆత్మాశ్రయత గోచరించడం ఆశ్చర్యం కాదు. కాని ఎన్నడూ కవిత్వం వ్రాయని చలం, భావకవులను గురించి యథాశక్తిగా వ్యంగ్య రచనలుచేసిన చలం, మిగిలిన వారికన్న ఎక్కువగా ఆత్మాశ్రయంగా వ్రాయడం ఆశ్చర్యంగా తోచవచ్చు. కాని ఆ యుగలక్షణాల దృష్ట్యా పరిశీలిస్తే చలంకూడా భావకవుల కోవకు చెందినవాడే! ఆ తరంవారిలో ఎక్కువ ''సెన్సిబిలిటీ'' ఉన్న రచయితలు కనుక అటు విశ్వనాథ, యిటు చలం— ఇద్దరూ కేవలం ఆత్మాశ్రయ పరమైన రచనలు చేయడమేకాక, తమ పరాశ్రయమైన

నవలలనుకూడా ఆత్మాశ్రయమైనవిగా కన్పించేటంతగా తను వ్యక్తిత్వాన్ని వానిలో చొప్పించారు.

ఆత్మాశ్రయపద్ధతిలో వ్రాయబడిన నవలలకు ముఖ్యమైన లక్షణం ఉత్తమ పురుషలో కథనం సాగించడం. ప్రధానపాత్ర తన దృష్ట్యా మిగిలిన పాత్రలను, సన్నివేశాలను చిత్రించుకుంటూ పోవడం యిందులో అనుసరించే పద్ధతి.

తెలుగులో ఉత్తమమైన ఆత్మాశ్రయ నవలలలో చలం ''అమీనా'', ''దైవమిచ్చిన భార్య''; విశ్వనాథ ''మాబాబు''; మొక్కపాటి వారి ''బారిష్టరు పార్వతీశం'' మొదలైన వానిని పేర్కొనవచ్చు. ఇటీవల వచ్చిన నవలలలో హారికిషణ్ వ్రాసిన ''సుమంగళి'', ''హృదయకుసుమాలు'' ఉత్తమ పురుషలో నడిచినవే!

ఉత్తమ పురుషలో కథనం సాగించడం వలన ఎదుర్కొనే ఇబ్బందులకు విశ్వనాథవారి ''దమయంతీ స్వయంవరము'' ను పేర్కొనవచ్చు. మొదటి ఇరవై పుటలు రచయిత ప్రపంచంలోని అన్ని విషయాలను గురించి తన అభిప్రాయాలు ఉపన్యాస తుల్యంగా చెబుతాడు. ఈ విధంగా ఇది మనోవిశ్లేషణాత్మకమై, చైతన్య స్రవంతి పద్ధతికి దగ్గరలో ఉన్నది. ''నేను'' అంటూ కథ ప్రారంభించడంతో రచయిత తనలో, తన భావాలలో తాను ఇమిడిపోయి కథా గమనాన్ని పట్టించుకోక పోవడం జరుగుతుంది.

పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు వ్రాసిన ''మా ఘంటం'' ఒక కొత్త ప్రయోగం. ఒక పల్లెటూరును కార్యస్థానంగా స్వీకరించి, తన్ను ఒక పాత్రగా గ్రహించి, ఆ గ్రామంలో జరిగే మార్పులను చిత్రించే నవల ఇది. ఆర్థర్ మిల్లర్ వ్రాసిన ''అవర్ టవున్'' కు దగ్గరి రచన. విశ్వనాథ పరాశ్రయంగా వ్రాసిన కొన్ని నవలల్లో (''చెలియలి కట్ట, ''తెఅవిరాజు'' వంటి వానిలో) ఆత్మాశ్రయత

ఎలా ద్యోతకం అవుతుందో, అలానే 'మాబాబు' లో పరాశ్రయత అలా గోచరిస్తుంది. రచయిత ఒక ప్రధానపాత్రచేత "నేను" అంటూ కథ చెప్పిస్తూకూడా ఆ పాత్రకు, వ్యక్తిగా తనకు ఏ విధమైన తాదాత్మ్యాన్ని, దగ్గరితనాన్ని చూపకుండా ఉండడం ఎంతో కష్ట సాధ్యమైన పని. దానిని యీ నవలలో సాధించాడు విశ్వనాథ.

ఆత్మాశ్రయ పద్ధతిలో వ్రాయబడిన నవలలలో తిరిగి ఎంతో వైవిధ్యం గోచరిస్తుంది ఇందులో రెండు, మూడు పాత్రలను ప్రధానపాత్రలుగా ఎన్నుకొని ఒకరి తరువాత మరొకరిచేత కథ చెప్పించటం ఒక పద్ధతి. దీని వలన ఆత్మాశ్రయ పద్ధతిలో మామూలుగా ఉండే పరిమితమైన పరిధిని రచయిత దాటే ప్రయత్నం చేస్తున్నాడన్న మాట. ఇటువంటి రచనల్లో సామాన్యంగా ఒక పురుషుడినీ, ఒక స్త్రీని ఎన్నుకోవడం ఆచారంగా కన్పిస్తుంది. తెలుగులో యిటు వంటి నవల యతీంద్రమోహన మైత్రా వ్రాసిన బెంగాలీ నవలకు "చక్రపాణి" అనువాదం 'సంధి'. ఇందులో నాయకుడు, నాయికల చేత మాత్రమేకాక ప్రతి నాయకుడనదగిన వానిచేత కూడా కథనం సాగించాడు రచయిత. మౌలికమైన తెలుగు నవలల్లో పుప్పల లక్ష్మణరావుగారి 'అతడు—ఆమె' ప్రఖ్యాతి చెందినది. ఇద్దరువ్యక్తుల జీవితాల్లో కలిగే సుఖ సంతోషాలను వారివారి మాటల్లో ఆత్మ కథనంగా చెప్పించాడు రచయిత యీ నవలలో. ఇది రెండు భాగాలుగా వెలువడ్డది. ఆత్మాశ్రయం కావడంవల్ల కథాగమనం కుంటు పడవచ్చునన్న ప్రథనేకుండా అయా వ్యక్తుల మనస్తత్వాలను చక్కగా చిత్రించిన నవల యిది.

ఇంత కంటె ముందుగానే శ్రీమునిమాణిక్యం నరసింహారావు గారు 'తిరుమాళిగ' వ్రాశారు. బహుశః యీ పద్ధతిలో వ్రాయబడిన తెలుగు నవలల్లో 'తిరుమాళిగ' ను మొదటి నవలగా పేర్కొనవచ్చు. ఇందులో పాత్రలు అతడు, ఆమె, డాక్టరు, ఒక అమాయకురాలిని

మోసంచేసి, ఆమె గర్భవతికాగా, ఆమెను వదిలిపెట్టి వెళ్ళిన ఒకస్త్రీని, ఒక మాస్టరుగారు చేరదీసి, ఆమెకు పురుడు పోయించి, ఆమె తన పిల్లలకు మాతృసమానురాలుగా ఉండడంతో, బంధువులు తోటి సమాజము వెలివేసినా అమెను వివాహం చేసుకోవడం ఇందులో కథ. ఆయన యీ నవల వ్రాసిననాటికి యీ ఇతివృత్తం కూడా విప్లవాత్మకమే.

ఆత్మాశ్రయ కథనంలో రచయితలు చూపిన మరో వైవిధ్యం ఉత్తరాలద్వారా రచన సాగించడం. ఇటీవలి తెలుగు నవలల్లో యీ పద్ధతిలో సాగిన రెండు చక్కని నవలలు ముప్పాళ రంగనాయకమ్మ వ్రాసిన 'కృష్ణవేణి', గంగినేని వెంకటేశ్వరరావు వ్రాసిన 'పాము—నిచ్చెన'.

'కృష్ణవేణి'లో కథ అంతా ఉత్తరాలద్వారా జరిగింది. అసలు ఆత్మాశ్రయమైన పద్ధతే రచయితకు కొన్ని నియమాలను నిర్దేశిస్తుందనుకొంటే, ఉత్తరాల పద్ధతి ఇంకా తీవ్రమైన నియమాలను నిర్దేశిస్తుంది. పరాకాష్ఠ సన్నివేశాల విషయంలో ఇది మరీ నిజం. కాని 'కృష్ణవేణి'లో రచయిత్రి ఈ అడ్డంకులను తొలగించుకొని నవలను పరాశ్రయ పద్ధతి నవలగా కన్పించేటంత నేర్పుతో వ్రాసింది. కృష్ణవేణి, మాధవల ప్రేమ వృత్తాంతం, అరుణ అతనిని ముందుతన భర్తగా స్వీకరించక, వాతతరు మేల్కొని తన సంసారజీవితాన్ని మళ్ళీ బాగుచేసుకోవడానికి ప్రయత్నించడం, చివరకు కృష్ణవేణి తన ప్రేమను త్యాగంచేసి భార్యాభర్తలను కలపడం— ఈ నవలలో కథ. నలుగురు పాత్రలను మాత్రమే స్వీకరించినా కథఅంతా సాఫీగా సాగిపోతుంది.

గంగినేని వెంకటేశ్వరరావు వ్రాసిన 'పాము—నిచ్చెన' లో కూడా 'ఉత్తరోత్తరాలు' ముఖ్యం. ఇందులో ముఖ్యంగా కాలేజీ విద్యార్థుల జీవితం వర్ణించబడ్డది. వారు ఎదుర్కొనే విచిత్రమైన సంఘర్షణలు, హాస్టలు జీవితం, ప్రేమ—పెళ్ళి, రాజకీయాలు వంటి

విషయాలమీద ఈ ఉత్తరాలలోనే చర్చలు కూడా జరిగాయి. ఇందులో రచయిత ఎక్కువమంది పాత్రలను స్వీకరించాడు. అందువల్ల ఉత్తరాలు వ్రాయడంలోను, వాని సమాధానాలలోను కొంత క్లిష్టత గోచరిస్తుంది. పరాకాష్ఠ సన్నివేశాన్ని చిత్రించడం కూడా పరోక్షంగా, ఉత్తరాల రూపంలో జరగాలి కనుక అదికూడా యీ నవలలో అంత పటిష్టంగా జరగలేదు.

ఆత్మాశ్రయ పద్ధతిలోనే వ్రాయబడిన మరో రకం రచనలు డైరీలు. ఒక ప్రధానవ్యక్తి ఒక అనుక్రమంలో సాగే కొన్ని సంఘటనలను తన డైరీలో నమోదుచేసే పద్ధతిలో వ్రాయబడ్డ యీ రచనలను ఆ వ్యక్తిచేసే కథనంగా స్వీకరించవచ్చు. ఇటువంటి రచనలు మనకు కొద్ది. అందులో పేర్కొనదగ్గవి కొడవటిగంటి వ్రాసిన 'సరితాదేవి డైరీ', దానికి పూరణప్రాయంగా వ్రాసిన "సరోజ డైరీ". మొదటిది కూతురు వివాహాన్ని గురించితల్లిపడే ఆరాటాన్ని, రెండోది ఎక్కువ ఆరాటపడి పెళ్ళి చెడగొట్టే తల్లిబారినుంచి కూతురు తప్పించుకొని పెళ్ళిచేసుకోవడాన్ని - కొన్ని సంఘటనలు ప్రధానంగా - చిత్రించాయి.

నిజానికి ఇవి డైరీలుకాదు. డైరీ రచనకు కావలసిన తేదీలు, లేదా ఒక అనుక్రమంలో సాగే సంఘటనలు యిందులో లేవు. అన్ని ఆత్మాశ్రయ నవలలలోను ఉండే ఉత్తమపురుష కథనమే ఇందులో ముఖ్యం. అయితే ఒకే సంఘటనను ఇద్దరువ్యక్తులు ఎంత విభిన్నంగా చూడగలరో ఈ రెండుడైరీలు చూపుతాయి. సమాంతరంగా సాగే సంఘటనల వల్ల యిలా ఇద్దరు వ్యక్తులమధ్య అంతరాన్ని చూపడం ఈ డైరీలలోని రెండు భాగాలలోను సాధ్యమైంది.

ఇటువంటిదే కాని డైరీ రచనకు ఇంతకన్న దగ్గరగా ఉన్నది ముప్పాళ వ్రాసిన 'నా డైరీలో ఒక పేజీ'.

ఆత్మాశ్రయ, పరాశ్రయ పద్ధతులను రెంటినీ మేళవించి వ్రాసిన ఒక రకం రచనలు ఉన్నాయి. ఇవి ఉపన్యాసాల కిందికి వస్తాయి. రచయిత ఒక పాత్రగా ప్రవేశించి, ఒక మిత్రుడు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ఒక కథను చెప్పడం ఇటువంటిది. ఇట్టి రచనలు చేసినవాడు విశ్వనాథ. ఇట్టి రచనల్లో రచయితే స్వయంగా ఒక కథను చెప్పవచ్చు; లేదా తాను మరొకపాత్రను సృష్టించి అతని ద్వారా కథను నడిపించవచ్చు. మొదటి పద్ధతికి ఉదాహరణ 'విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు'. రెండవదానికి ఉదాహరణ 'ఆఱు నదులు'.

విష్ణుశర్మకు ఇంగ్లీషు నేర్పడానికి సాగిన ప్రయత్నాలను వివరిస్తూ రచయితే ఆ యా సంఘటనలమీద, వ్యక్తులమీద, సిద్ధాంతాల మీద విమర్శలు చేస్తాడు. ఈ కథనంతా తానొక స్నేహితునకు చెబుతాడు. ఆ స్నేహితుడు కథను నడిపించడానికి మధ్యమధ్యలో కొన్ని ప్రశ్నలు, కొన్ని సవాళ్ళు వేస్తూ ఉంటాడు. దానికి రచయిత సమాధానాలు చెబుతూ కథను కొనసాగిస్తాడు. కథ చెప్పడంలో పరాశ్రయ పద్ధతే కనిపించినా, కథను రచయితే స్వయంగా చెప్పాడు కనుక ఆత్మాశ్రయ పద్ధతికూడా ఇందులో గోచరిస్తుంది.

ఇటీవల విశ్వనాథ వ్రాసిన నవలలలో ఎక్కువభాగం ఉపన్యాసాత్మకాలు. ఒక ప్రధానపాత్ర అనేక విషయాలను గురించి తన అభిప్రాయాలను స్వేచ్ఛగా వెలువరిస్తూ పోవడం యీ రకం నవలలకు ప్రాణం. ఈ ఉపన్యాసధోరణి తన సిద్ధాంతాన్ని నలుగురికీ చెప్పి నలుగురిచేత ఆమోదింప చేయాలన్న తీవ్రమైన ఆకాంక్షకు ఫలితం. ఇది 'వేయి పడగలు' నుంచి కూడా విశ్వనాథలో ద్యోతకంఅయ్యే పద్ధతే. ఇటీవల మరికొంత ఎక్కువ మోతాదులో వ్యక్తంచేయ బడుతున్నది.

విశ్వనాథ వ్రాసిన 'ఆఱు నదులు' అన్నది ఇందుకు చక్కని ఉదాహరణ. ఇది ఉపన్యాస సాహిత్యమని మనం అనుకోవచ్చునని రచయితే స్వయంగా "ఇది నవలకాదు అన్నంత మాత్రంచేత ఏమీ ఒరగలేదు. దయచేసి మన్నించండి. ఇదీ నవలయే" అని ఘంటాపథంగా చెప్పాడు. ఈ నవలలో కొన్ని విషయాలు అనుస్యూతంగా చెప్పబడ్డాయి. ఆ విషయాలు ఉపన్యాస ధోరణిలో చెప్పబడ్డాయి. విశ్వనాథ అన్నమాటలు నిజమే. "గ్రంథకర్తయొక్క ప్రతిభమీద ఆధారపడి వుంటుంది ఒక గ్రంథంయొక్క గొప్పతనం". పతంజలి అన్న ఒక మహాపండితుడు ప్రపంచ నాగరికతకు భారతీయ నాగరికత మూలమన్న సిద్ధాంతాన్ని కొన్ని ఉపన్యాసాల ద్వారా చెప్పడం ఇందులోకథ.

ఈ రకమైన రచనలు చేసినది విశ్వనాథ ఒక్కడే.

ఇవికాక తెలుగులో కొన్ని సంస్మరణ ప్రధానాలయిన నవలలు కూడా ఉన్నాయి. లత వ్రాసిన 'మోహనవంశి' ఇటువంటిది. డాక్టర్ పి. యస్. ఆర్. అప్పారావు వ్రాసిన 'వేణువు' ఈ విధమైన రచన. ఇట్టి నవలల్లో రచయిత తానే ఒక పాత్రగా ఊహించుకొని, తన నాయకుని యెడ తాము ఆ పాత్ర ఎలా ప్రవర్తిస్తుందో చిత్రించడం జరుగుతుంది. ఇట్టి నవలలు ముఖ్యంగా కృష్ణుని జీవితం ఆధారంగా వ్రాయబడ్డవే!

పైన పేర్కొన్న రెండు పద్ధతులుకాక కథ చెప్పడంలో కొంత నూతనత్వాన్ని సాధించిన మరికొన్ని విధానాలను ఇక్కడ వివరించడం జరుగుతుంది.

అందులో మొదట చెప్పుకోదగ్గది నవలలోని ప్రతి అధ్యాయానికి లేదా ప్రతి భాగానికి ఒక శీర్షికను ఉంచడం. దీనివలన రచయితకు అటు కథాగమనానికిగాని, పాత్రోన్మీలనానికిగాని ఎటువంటి సహాయం లభిస్తున్నదా అన్న విషయం వివాదాస్పదమే! అయితే రచయిత

ఇలా ప్రతి అధ్యాయానికి ఒక్కొక్క పేరు పెట్టుకోవడంద్వారా తన మనస్సులో ఉన్న కథకు ఒక ఆకృతిని ఇస్తున్నాడు. ఇది ఆ రచనా వ్యాసంగానికి కొంత దోహదకారి. అంతేకాని మొత్తం నవలకు అంత అవసరంగా తోచదు.

ఈ పద్ధతిని అనుసరించి వ్రాయబడిన నవలల్లో "మాలపల్లి" ముఖ్యమైనది. వెంకట పార్వతీశకవుల యుగంలో చాలమంది ఈ విధంగా నవలలు వ్రాశారు. కాని దీనిని ఎక్కువగా అనుసరించిన వాడు అడివి బాపిరాజు. ఆయన పెద్ద నవలలన్నింటిలోను ఈ విధంగా అధ్యాయాలకు ప్రత్యేకంగా పేర్లు పెట్టడం జరిగింది. బహుశః ఏ రోజుకు కావలసిన భాగాన్ని ఆనాడే వ్రాసియిచ్చే ఆయన రచనావిధానం దీనికి కారణం కావచ్చు.

ఇదేపద్ధతిని చలం కొన్ని నవలల్లో అనుసరించాడు. ఇది ప్రతి అధ్యాయానికికాక, కొన్ని సంఘటనలను వేర్పరచడానికిగాను ఉపయోగపడిన పద్ధతి. "దైవమిచ్చిన భార్య" దీనికి ఉదాహరణ.

ఇలా నవలను కొన్ని ఖండాలుగా విభజించి, ఆ ఖండాలకు ఒక పేరును పెట్టడం బుచ్చిబాబు "చివరకుమిగిలేది" లోను, గోపీచంద్ "అసమర్థుని జీవయాత్ర" లోను మనకు కనిపిస్తుంది. ఈ విభజన కొంతవరకు కథోన్మీలనాన్ని తెలిపేదిగా ఉన్నది. "చివరకు మిగిలేది" లో ఇది కాలక్రమేణా జరిగిన సంఘనలకు అనువర్తిస్తే, "అసమర్థుని జీవయాత్ర" లో ఇది సమాంతరకాల విశ్లేషణకు ఉపయోగించబడ్డది.

కొడవటిగంటి కుటుంబరావు వ్రాసిన "జీవితం" లో కూడా ఈ పద్ధతి అనుసరించబడ్డది. ఈ నవలలోని మూడు ఖండాలు "పౌరాణికం", "జానపదం", "సాంఘికం" అంటూ విభజింపబడి ఒక్కో

వ్యక్తి జీవితాన్ని మూడు కోణాలనుంచి వీక్షించడానికి వీలుగా వ్రాయబడ్డాయి.

ప్రతి ఖండానికి వేరువేరు శీర్షికలు ఉంచేపద్ధతిని రేడియోవారు తమకు చక్కగా ఉపయోగించుకున్నారు. ఒక నవలను కొన్ని ఖండాలుగాచేసి, వేరువేరు శీర్షికలు యిచ్చినట్లే రేడియోవారు కొందరు రచయిత్రులను ఎన్నుకొని వారిలో ఒక్కొక్కరిచేత ఒక్కొక్క భాగం వ్రాయించి నవలను పూరించారు. ఇలా వచ్చిన నవల "సప్తపది". ఇల్లిందల సరస్వతీదేవి, మాలతీచందూర్, దుర్గా కుమారి, కె. రామలక్ష్మి ప్రభృతులు యీ నవలకు పూరకులు. ఇలా చేయడంవల్ల ఏ ఖండికకు అది వేరుగా కన్పిస్తుందేతప్ప, వానిని కలిపితే సమగ్రమైన నవలా స్వరూపం గోచరించదు.

ఈ విధంగా పలువురు రచయితలు పూరించిన నవల "ఇడియట్". పురాణం సుబ్రహ్మణ్యశర్మ, కొమ్మూరి వేణుగోపాలరావు మొదలైనవారు దీనిని వ్రాసిన రచయితలు.

ఇటీవల అనుసరింపబడుతున్న మరి రెండు పద్ధతులను ఇక్కడ పేర్కొనాలి. అందులో ఒకటి హాస్యప్రధానంగా చేసే కథనం. రెండవది మనోవిశ్లేషణాత్మకమైన కథనం.

సంఘటనలను నిర్మించడంలోగాని, పాత్రపోషణలోగాని, సంభాషణల రచనలోగాని హాస్యాన్ని సృష్టించవచ్చు. సాధారణంగా నవలా కారులందరూ చేసేపని అదే. కాని కొన్ని పదాల కలయిక చేత కథనంలో కూడా హాస్యాన్ని సాధించవచ్చు. ఇది విజాతీయ పదాల కలయికతో ఎలా సాధ్యమో "కన్యాశుల్కం" లో చూప బడ్డది. అలాగే ముళ్ళపూడి వెంకటరమణకూడా ఒక విలక్షణమైన హాస్య కథనా విధానాన్ని తెలుగు గద్యరచనలో ప్రవేశపెట్టాడు. అతని "ఇద్దరమ్మాయిలూ-ముగ్గురబ్బాయిలు" ఇందుకు ఉదాహరణ.

ముళ్ళపూడి వెంకటరమణ మధ్యతరగతి ప్రజల మనస్థితిని వ్యక్తం చేసే పాత్రలను సృష్టించి, వారి ప్రవర్తనను విచిత్రమైన సన్నివేశాల ద్వారా, సంభాషణలద్వారా వ్యక్తం చేస్తాడు. ముళ్ళపూడిని ఎందరో ఈనాడు అనుసరిస్తున్నారు.

మనోవిశ్లేషణ పద్ధతులు సన్నివేశ కల్పనలోను, పాత్రచిత్రణలోను ఏ విధంగా ప్రయుక్తం చేయబడ్డాయో ఇదివరకే చిత్రించబడ్డది. కథా కథనంలో మనోవిశ్లేషణ పద్ధతికి పాశ్చాత్య దేశాలలో ప్రాచుర్యం కలిగించినవారు జేమ్స్ జాయిస్, వర్జీనియా ఉల్ఫ్ మొదలైనవారు. వారి కథా కథన పద్ధతిని ''చైతన్య స్రవంతి'' (స్ట్రీమ్ ఆఫ్ కాన్షస్‌నెస్) అంటారు. మనసులో ఏ క్రమంలో ఆలోచనలు వస్తాయో అదే క్రమంలో, అదే గతిలో వానికి అక్షర రూపాన్ని కల్పించడమే ''చైతన్య స్రవంతి'' పద్ధతి. దీనిని కొద్ది మోతాదులో బుచ్చిబాబు, రాచకొండ విశ్వనాథశాస్త్రి ప్రభృతులు అనుసరించినా, పాశ్చాత్య నవలా కారులవలె రచన చేసినవారు లేరు. జేమ్స్ జాయిస్ ''యులిసిస్'' ను అనుసరించి యీ పద్ధతిలో వ్రాసిన నవల ఇటీవలనే వెలువడ్డ నవీన్ ''అంపశయ్య''. ఈ నవలలోని కథా కథనం పైన పేర్కొన్న పాశ్చాత్య నవలాకారుల రచనలలోని కథా కథనానికి అతి సమీపంగా ఉన్నది.

మరొకపద్ధతి ''కారికేచర్'' వంటి పాత్రలద్వారా కథను నడిపించడం. ఒక పాత్రను సృష్టించి, దానిని కొన్ని భావాలకు ప్రతీకగా స్వీకరించి కేవలం 'కారికేచర్' లా ఆ పాత్ర చేష్టలను వర్ణించి చెప్పడం తెలుగులో 'హాహాహూహూ', 'పసరిక'లతో ప్రారంభం అయింది. అటువంటి ప్రతీక పద్ధతిలోనే హాస్యాత్మకంగా సృష్టింపబడినవాడు ''బారిష్టరు పార్వతీశం''. పసరిక రాను రాను బలిసి మనిషి అయినట్లు పార్వతీశం రాను రాను తెలివితేటల్ని పుంజుకున్నట్లు ఇటీవలి రెండు, మూడు భాగాలు తెలియ చెబుతున్నాయి.

అలాకాక కేవలం హాస్యపాత్రనే సృష్టించి, భయానికి పిరికి తనానికి ప్రతీకగా ఆ పాత్రను స్వీకరించి పారడీ పద్ధతిలో ఆ పాత్ర చేష్టలను వర్ణించి చెప్పారు కొడవటిగంటి కుటుంబరావు. ''బెదరిన మనుషులు'' లో ప్రారంభమైన ఈ పద్ధతి ''బ్రతుకు భయం'' లో పునరావృత్తమై, సీతప్ప పాత్ర తెలుగు నవలల్లో చిరస్మరణీయమైన పాత్రల్లో ఒకటిగా రూపొందింది.

తెలుగు నవలలో మొదటినుంచి ఈనాటివరకు వచ్చిన భాషా విషయకమైన మార్పునుకూడా ఇక్కడ పేర్కొనక తప్పదు. తెలుగు నవల ప్రారంభంలో ప్రబంధానికి గద్యరూపంగా భావించబడ్డదని గ్రహించవచ్చు. దానిని ''నవీన ప్రబంధము'' అన్నా, ''వచన ప్రబంధము'' అన్నా ఇదే భావాన్ని స్ఫురింపచేశారు మొదటి నవలా రచయితలు.

ఈ కాలంలోని నవలలలో - ప్రబంధాలలో వలెనే - వర్ణనలు, క్లిష్ట సమాసాలు ఎక్కువ. జటిలమైన శైలి వీని ప్రథమ లక్షణం: కందుకూరివారే ఈ శైలిని కొంత సులభం చేయడానికి ప్రయత్నిం చారు. ఈ జటిలమైన శైలి రానురాను సాంఘిక నవలల్లో అనుస రింపబడకపోయినా, చారిత్రక, కాల్పనిక నవలల్లోమాత్రం చాల రోజులవరకు యిట్టి శైలిని, సమాస రచననే నవలాకారులు ప్రయుక్తం చేశారు.

ఈ భేదం చిలకమర్తి నవలలను పరిశీలిస్తే వ్యక్తం అవుతుంది. ఆయన అటు సాంఘిక నవలలను, ఇటు చారిత్రక-కాల్పనిక నవలలను వ్రాసినవాడు. ఆయన ''రామచంద్ర విజయము'' వంటి నవలలు ''రాజశేఖర చరిత్ర'' కన్న సుగమంగా ఉన్నాయి. కాని ఆయన ''హేమలత'', కర్పూరమంజరి'' సాంఘిక నవలలకన్న జటిలమైన భాషల్లో వ్రాయబడ్డాయి.

1920 ప్రాంతాలకు నవలా రచనలో ఎంతోమార్పు వచ్చింది. భాష గ్రాంథికమే అయినా, ఎంతో సరళమైన గ్రాంథికం ఆనాటి నవలలో వాడబడ్డది. కేతవరపు వెంకటశాస్త్రిగారి నవలలు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి నవలలు ఇందుకు ఉదాహరణలు. శ్రీపాద వారు శిష్టవ్యావహారికాన్ని నవలల్లో ప్రయుక్తం చేయడం ప్రారంభించినవారిలో ముఖ్యులు. మొట్టమొదట గ్రాంథికంలోనే నవలారచన చేసినా, ఆయన ''రక్షాబంధనము'' నవలకు పీఠిక వ్రాస్తూ గ్రాంథిక. వ్యావహారిక భాషలలో దేనిని ప్రయుక్తం చేయాలన్న మీమాంస చేసి, తాము చివరకు శిష్టవ్యావహారికాన్ని స్వీకరించడానికిగల కారణాలను వివరించారు.

ఈ కాలంలోనే వ్రాయబడిన ''మాలపల్లి'' లో ఉపయుక్తమైనభాష ఎన్నోసంవత్సరాల తరువాతకానిరచయితలందరిచేత స్వీకరింపబడలేదు. ఇందరు వ్యావహారికం వ్రాస్తున్నా, ఆనాటివారి పలుకుబడి, ముఖ్యంగా ఉన్నవవారి పలుకుబడి, మరెవ్వరికీ రాలేదనడం అతిశయోక్తికాదు.

ఈ కాలం సాంఘిక నవలల్లో అనుసరింపబడిన భాషా విధానాన్ని చూపడానికి ''సుశీల''అన్న నవలను పరిశీలించవచ్చు. శ్రీ నిడమర్తి సత్యనారాయణగారు ఈ నవలను 1927 లో వ్రాశారు. ఇది 1967 లో ప్రకటింపబడ్డది. ఈ నవలలో రచయిత చేసే వర్ణన అంతా గ్రాంథికంలోను, సంభాషణలన్నీ వ్యావహారికంలోను సాగాయి. ఈ పద్ధతిలోనే ఆనాటి చాలా నవలలు వ్రాయబడ్డాయి.

ఇటీవల వచ్చే నవలల్లో చాలభాగం వ్యావహారికంలో వ్రాయబడేవే। విశ్వనాథవంటి రచయితకూడా చక్కని వ్యావహారికంలో నవలలు వ్రాశాడు. ''దమయంతీ స్వయంవరం, ఆఱునదులు.'' వంటి ఇటీవలి నవలలు ఇందుకు ఉదాహరణలు. ఈ తరంలో వచ్చే నవలల్లో

శిష్టవ్యావహారికంలో వ్రాయబడే నవలలనుంచి మాండలిక భాషలో వ్రాయబడే నవలలవరకు అన్నీ ఉన్నాయి. అయితే పాఠశాలల్లోను కాలేజీలలోను పాఠ్యగ్రంథాలుగా, ఉపవాచకాలుగా ఉపయోగించ డానికి వ్రాయబడే గ్రంథాలు మాత్రం ఇంకా గ్రాంధికంలోనే వ్రాయబడుతున్నాయి.

మొత్తంమీద నవలలు సామాన్య పాఠకులు సహితం చదువుకొని అర్థం చేసుకోవడంకోసం ఉద్దేశింపబడుతున్నవి కనుక అవి ఆ పాఠకు లకు అర్థమైన భాషలోనే, తేలికగా చదువుకోగలిగిన భాషలోనే వ్రాయబడాలి. వంద సంవత్సరాల తెలుగు నవలలో భాషాగతంగా వచ్చిన మార్పులన్నిటికి మూలసూత్రం ఇదే.

ఒక సాహిత్య ప్రక్రియకు కథావస్తువు శరీరంవంటిదైతే, శిల్పం ప్రాణంవంటిదని చెప్పవచ్చు. కథావస్తువు లేకుండా నవల, లేదా మరొక ప్రక్రియ రూపొందడం ఎంత అసంభవమో, శిల్పం లేకుండా అది సాహిత్య ప్రక్రియగా రూపొందడం కూడా అంతే కష్టం. అందువల్లనే ఈ రెండూ అభిన్నాలు. పరస్పర పూర కాలు.

నిజానికి శిల్పం కథావస్తువులోని ప్రత్యేకతను, రచయిత అభి ప్రాయాలను, ముఖ్యంగా ఆ రచనలోని వస్తుగతమైన విలువలను వెలువరించడానికి రచయిత చేతిలో ఉన్న ఒకే ఒక్క సాధనం. దీనిని తన కథాకస్తువుకు తగిన విధంగా ఉపయుక్తం చేసుకొన్న నవలా కారుడే పదికాలాలు మనగలుగుతాడు. అలాకాక తనకు తెలిసినదంతా పాఠకులకు ఏదోవిధంగా చెప్పాలనే ఉత్సాహంతో శిల్పాన్ని గణించని రచయితలు మఖలో పుట్టి పుబ్బలో అంతరిస్తారు.

ఇదేవిషయం ప్రఖ్యాత నవలారచయితల విషయంలోకూడా సత్యం. ఒక ప్రఖ్యాత రచయిత వ్రాసిన అన్ని నవలలూ ఒకే ప్రమాణానికిచెంది ఉండకపోవడానికి ఆయన స్వీకరించిన శిల్పవిధానంలో ఉన్న ఎగుడుదిగుడులే కారణం అని చెప్పవచ్చు. కథకు, దాని కథన విధానానికి గల అవినాభావ సంబంధాన్ని గుర్తించి తన కథకు, ఆ కథ ద్వారా తాను చెప్పదలుచుకొన్న ఉద్దేశానికి అనువైన శిల్పాన్ని, విధానాన్ని, రచయిత స్వీకరించడం ఎంతయినా అవసరం.

# ఐదవ భాగం

తెలుగులోని

కొన్ని ఉత్తమ నవలలు

రాజశేఖర చరిత్ర
మాలపల్లి
హిమబిందు
ఏకవీర
వేయిపడగలు
దైవమిచ్చిన భార్య
అసమర్థుని జీవయాత్ర
చివరకుమిగిలేది
కీలుబొమ్మలు
అల్పజీవి
చదువు
రుద్రమదేవి.

# రాజశేఖర చరిత్రము

ప్రవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు. సంఘసంస్కరణ, భాషాసేవ అన్న రెండుఆదర్శాలతో మానవత్వమే తన ధ్యేయంగా తెలుగు దేశానికి, తెలుగు భాషకు మహత్తరమైన సేవచేసిన వాడు ఆయన. క్రొత్త పాతల మేలు కలయికను కందుకూరి సాధించినట్టు మరి ఏ రచయిత సాధించలేదు. ఛాందసమైన ఆచారాలను, ప్రజలలో పాతుకుపోయిన మూర్ఖత్వాన్ని మొదలంటా ఊడ పెరికి జాతికి ధైర్యాన్ని, మానవతా దృష్టిని కలిగించిన మహనీయుడు

వీరేశలింగం. విగ్రహారాధన, బాల్యవివాహాలు, వితంతువులస్థితి, భోగం మేళాలు, వర్ణాంతర భోజనాలు మొదలైన అన్ని విషయాల లోను ఆయన ముందంజవేసి తెలుగు దేశానికి ఓ వినూత్నమైన మార్గాన్ని చూపాడు.

కందుకూరి నవయుగ నిర్మాత. సంఘసంస్కరణే ఆయన ధ్యేయమైనా ఆయన తెలుగు భాషకు చేసినసేవ అపారమైనది. రాజశేఖర చరిత్ర ఆయన ముప్ఫయ్యవపేట వ్రాసిన గ్రంథం. అంతకు ముందు పంతులుగారు వ్రాసిన గ్రంథాలన్నీ ఒక ఎత్తు. ఆ తరువాత వ్రాసినవి మరొక ఎత్తు. అంతవరకు పంతులుగారు పాండిత్య ప్రకర్ష చూపడానికి మాత్రమే రచన చేసినట్లు కనిపిస్తుంది. కాని 1878లో ఆయన ఒక నూత్న పథంలోకి మళ్ళీ ఒక కొత్త బాటను వేశారు.

''రాజశేఖర చరిత్ర'' 1878 లో ''వివేకవర్ధని'' లో భాగాలుగా ముద్రింపబడి 1880 లో పుస్తక రూపాన వచ్చింది. ఈనవలకు బీజం 1875 లోనే వున్నట్టు మనకు ''ఆత్మకథ'' ద్వారా తెలుస్తున్నది. ''Can you not write an original novel in Telugu?'' అని 1875 ఫిబ్రవరిలో ఆయన మిత్రులు సమర్ధి రంగయసెట్టిగారు వ్రాసిన వుత్తరం వారిలో ఒక సంచలనం కలిగించి నవలా రచనకు పురిగొల్పింది.

నవలా రచనకు పూనుకొన్న పంతులుగారు ముందుగా గోల్డుస్మిత్ వ్రాసిన "ది వికార్ అఫ్ వేక్ ఫీల్డు" ను అనువదించడం ప్రారంభించారు. కాని ఈ అనువాదం ప్రజలకు అంత ఆమోదయోగ్యంగా వుండదని ఆ కథే ఆధారంగా ఒక స్వతంత్రమైన నవలను వ్రాయడానికి పూనుకున్నారు.

ఈ కథకు, గోల్డుస్మిత్ గ్రంథానికివున్న సంబంధాన్ని గురించి పంతులుగారు వ్రాస్తూ "కథను కల్పించుటలో గోల్డుస్మిత్తును నిండ్లీసు

కవీశ్వరుని గ్రంథ సహాయ్యమును గొంత" పొందితిమని దెలిపిరి. కాని జాగ్రత్తగా చూస్తే ఈ సహాయము చాలా ఎక్కువగానే ఉన్నట్లు కనిపించక మానదు. కథాకల్పనలో చాలా భాగం ఆయన ఆంగ్ల గ్రంథాన్ని అనుసరించారని చెప్పక తప్పదు.

సహజంగా సంఘ సంస్కర్త కనుక ఈ నవలలో సంఘంలో వున్న మూఢ విశ్వాసాలను గురించిన విమర్శలు అత్యధికం. అంతే కాక ఆయన ఈ నవలకు పీఠికలో వ్రాసినట్లు "ఈప్రబంధు మన ఆంధ్ర భాషలో జనుల యాచార వ్యవహారములను దెలుపుచూ నీతి బోధకములుగా నుండు వచన ప్రబంధము లేవియు లేకపోవుట యెల్లవారికిని విశదముయియే యున్నది గదా ?" అన్న మాటల వలన (ఈ నవలకు ధ్యేయం జనుల ఆచార వ్యవహారాలను తెలియ చెప్పడం అని కూడా మనం చెప్పుకోవచ్చు.)

ఇది తెలుగులో మొతటి నవల కాదుగాని, (మొదటి ప్రతిభావంతమైన నవల. ఈ నవలకు అనుకృతులు చాలా వచ్చాయి. చిలకమర్తివంటి రచయితలు కూడ తాము రాజశేఖర చరిత్రను ధ్యేయంగా వుంచుకొని నవలా రచన చేశామన్నారు. పంతులుగారు మాత్రం "మొదటి వచన ప్రబంధమును నేనే జేసితిని" అన్నప్పటికి అది మొదటి నవల కాదని గట్టిగా చెప్పవచ్చు. అయినా తెలుగు సాహిత్య చరిత్రలో దానికి ఉన్న గొప్పతనం మరొక నవలకు రాదు.)

19 వ శతాబ్దంలోని తెలుగు దేశంలో పాతుకుపోయిన సంఘ వ్యవస్థని "రాజశేఖర చరిత్ర" స్పష్టంగా ప్రతిబింబింప చేసింది. ఇందులో 15 ప్రకరణాలు వున్నాయి. ధవళేశ్వరంలో రాజశేఖరుడనే సంపన్న గృహస్థును గురించిన కథ ఇది. ఆ గ్రామంలోని సిద్ధాంతి, రామశాస్త్రి అన్న వాళ్లు ఎప్పుడూ రాజశేఖరుడుగారిని స్తుతిజేసి ఆయన దగ్గరనుంచి బహుమానాలు పొందుతూ ఉండేవారు. అతని

భార్యమాణిక్యాంబ. సుబ్రహ్మణ్యం, రుక్మిణి, సీత అతని సంతానం పెద్ద అమ్మాయి పెళ్ళికి విపరీతమైన ఖర్చులు చేశాడు ఆయన. బంధుప్రీతి కొరకు మరికొంత ఖర్చుచేశాడు. దానధర్మాలు చేశాడు. వీటన్నిటివల్ల ఆయన పేదవాడు అయిపోతాడు. ఇంతలో ఆఊరికి ఒక బైరాగి వస్తాడు. లోహాలన్నింటినీ బంగారంగా మార్చేశక్తి అతనికి వున్నదని ఆ గ్రామంలో వదంతి వ్యాపిస్తుంది. ఆ బైరాగి వెండి బంగారాలను చేజిక్కించుకుని పారిపోతాడు. ఇంతలో గ్రామంలోని ఆలయంలో ఉత్సవానికి వెళ్ళిన రుక్మిణి మెడలోని దండను ఎవరో దొంగిలిస్తారు. వస్తువు ఉనికిని చెప్పగలనని వచ్చిన హరిశాస్త్రి రాజశేఖరుడుగారిని మోసంచేసి బహుమానం పట్టుకుపోతాడు. ఊరు నిండా అప్పులు. స్నేహితులు తప్పుకుంటారు. తాను సహాయం చేసిన వారు తిరిగి కనిపించరు. ఇకవున్న ఊళ్లో వుండలేక ఇళ్లు వాకిళ్లు అమ్ముకుని, కాశీయాత్రకు బయలుదేరుతాడు.

మార్గమధ్యంలో రాజానగరంలో ఆయన వడగొట్టి పడిపోగా రామరాజు అనే ఆయన అతనికి ఉపచర్యలు చేస్తాడు. ప్రయాణం సాగుతుంది. నల్ల చెరువు అనేచోట దొంగలు దోచుకుంటారు. రుక్మిణి కనిపించదు. చివరకు కాశీయాత్ర విరమించి భీమవరం చేరి అక్కడ కాపురం పెడతాడు. ఎవరి సహాయం లభించదు. రాజబంధువు అయిన శోభనాద్రిరాజును ఆశ్రయించినా ఫలితం దక్కలేదు. కొడుకు సుబ్రహ్మణ్యాన్ని ఉద్యోగంకోసం పిఠాపురం పంపుతాడు. శోభనాద్రి రాజు దుర్మార్గుడు. తనకు ఆశ్రితుడు అయిన మంచిరాజు పాపయ్య కొడుకు పద్మరాజుకు సీతను ఇచ్చి పెళ్ళి చేయవలసిందని రాజశేఖరుడు గారిని నిర్బంధిస్తాడు. రాజశేఖరుడుగారిని ఒప్పిస్తాడు కాని రామరాజే ఒక లేఖ ద్వారా రాజశేఖరుడుగారికి మైలవచ్చిందన్న మిషతో ఈ వివాహాన్ని తప్పిస్తాడు. కాని, తన మాట వినలేదన్న కోపంతో అప్పు తీర్చలేదన్న మిషతో శోభనాద్రిరాజు రాజశేఖరుడు గారిని కారాగారంలో బంధిస్తాడు. కుమార్తె సీతను అపహరిస్తాడు.

అక్కడ సుబ్రహ్మణ్యం పిఠాపురం రాజుగారి ఆస్థానంలో— రాజకోశాగారం కొల్లగొట్టిన నీలాద్రిరాజు అనే దొంగను పట్టుకోవడం ద్వారా రాజుగారి అనుగ్రహం సంపాదిస్తాడు. ఆ దొంగను పెద్దాపురం తీసుకుపోతూ త్రోవలో భీమవరంలో తండ్రిని కలుస్తాడు. కారాగారంలో ఉన్న రాజశేఖరుడు గారు మంచిరాజు పాపయ్య ద్వారా వాళ్లు చేసిన కుట్ర అంతా తెలుసుకుని పెద్దాపురం మహారాజు అయిన కృష్ణగజపతి మహారాజుగారికి విజ్ఞాపన పంపుకుంటాడు. అతనిపై ఉన్న అభియోగాన్ని విచారించి నిర్దోషి అని తేలుస్తారు మహారాజు. రాజశేఖరుడు గారు మహారాజును గుర్తిస్తాడు. ఆయన ఎవరో కాదు. తన సేద దీర్చిన రామరాజే.

ఈలోగా రుక్మిణి సుబ్బారాయుడన్న మగవేషంతో సీతను దుర్మార్గులనుంచి తప్పించి రామరాజు సాయంతో తండ్రి వద్దకు తీసుకు వస్తుంది. చెడు సహవాసాలు మరిగి ఇల్లు వదిలిపెట్టిన రుక్మిణి మగడు కూడా ఇంటికి చేరుకుంటాడు. పెద్దాపురం మహారాజు రాజశేఖరుడుగారిని కనికరించి ఆయన మడి మాన్యాలు ఆయనకు ఇప్పిస్తారు. అప్పటి నుంచి అందరూ సుఖంగా వుంటారు.

ఈ సన్నివేశాలను ఆనుపూర్విగా పరిశీలిస్తే, ఇందులోని సంఘటనలకు ఆంగ్ల మూలంలోని సంఘటనలకు ఎంతపోలికవుందో తేటతెల్లమవుతుంది. కథాకల్పనలో వీరేశలింగంగారు కొత్తగా సృష్టించిన సంఘటనలు కేవలం సంఘ దురాచారాలను ప్రవేశపెట్టిన సందర్భాలలో మాత్రమే. ఇవి కథాగమనానికి గాని, వస్తూన్మీలనానికిగాని పనికివచ్చేవి కావు. ఇతివృత్తంలోని క్రమానుగత సంఘటనలను మాత్రం ఆయన గోల్డుస్మిత్ నుంచే స్వీకరించారని చెప్పవలసి వుంటుంది.

ఈ విధంగా కథలోని ముఖ్యమైన సన్నివేశాలను స్వీకరించి, వాతావరణాన్ని పాత్రల పేర్లను తెలుగు వారికి అనుకూలమైన

విధంగా మార్చడం తెలుగు అనువాదకులు అనుసరించిన ముఖ్యమైన విధానం. దీనికి కూడా ఆద్యులు పంతులుగారేనని ఈనవల వలన స్పష్టమౌతున్నది.

ఈ నవలకు ఇంగ్లీషు నవలకు కొన్ని సంఘటనలలో పోలిక వున్నా పంతులు గారు ఎంతో నేర్పుతో తెలుగు వాతావరణాన్ని, దేశీయ పాత్రల్ని సృష్టించి మౌలికమైన నవలా అన్న భ్రాంతి కల్పించడంలో కృతకృత్యులైనారు.

తెలుగు సాహిత్యంలో రాజశేఖర చరిత్రకు ఉన్న స్థానం అప్రతిమానమైనది. రాజులు, చారిత్రక పురుషులు మాత్రమే కథానాయకులుగా స్వీకరింపబడే రోజులలో ఒక సాధారణమైన గృహస్థును తన నవలకు నాయకుడినిగా చేసి పంతులుగారు ఎంతోస్తుతి పాత్రులైనారు.

సంఘ సంస్కరణోధ్యేయంగా పెట్టుకొన్న ఈ నవలలో రెండు రకాల విమర్శ కనిపిస్తుంది. ఒక రకం కేవలం మానసిక దుర్బలతతో మనిషిచేసే లోపాలమీద విమర్శ. రెండవది సాంఘికమైన ఆచారాల పట్ల విమర్శ. స్తుతి ప్రియత్వం, అపాత్రదానం వంటి గుణాలను అవహేళనాత్మకంగా చూపించడమే కాక నిశితంగా కూడా విమర్శించారు పంతులుగారు.

దానితోపాటు ఆనాటి సంఘంలోని దురాచారాలనిన్నింటినీ దుయ్యబట్టారు. ప్రజల్లో నాటుకుపోయిన భయం, యుక్తాయుక్త విచక్షణ లేక పోవడం, మూర్ఖత్వం, ఇందుకు నిదర్శనాలు. భూతవైద్యం, గ్రహణాలు, శకునాలు, స్వర్ణయోగం, చేతబడులు, ప్రయోగాలు చేయడం మొదలైనవన్నీ పంతులు గారి తీవ్ర విమర్శకు గురిఅయ్యాయి.

శ్రీ జి. వి. కష్ణారావు గారన్నట్లు రాజశేఖర చరిత్రలో హృదయంగమమైనది దామోదరయ్య విషాదాంత వృత్తాంతమే.

జీవించడం కోసం అతడు భూతవైద్యుడవుతాడు. అతనికి ఖ్యాతి వస్తుంది. ఆ ఖ్యాతివల్ల అతనికి అహంకారము పెరుగుతుంది. కొబ్బరి బొండాలు ఇవ్వనందుకు కొబ్బరి చెట్లను ఎండింపచేయడంతో ప్రజలు అతన్ని అనుమానిస్తారు. భయపడతారు. చివరకు అతడు చేయని పనులకు కూడా నెపం అతని మీదనే వేస్తారు. సంఘం అతన్ని వెలివేస్తుంది. ఈ స్థితిలో అతనిభార్యకు రోగంవస్తుంది. ఆ ప్రతిమిత్రుడు కూడా సంఘానికి వెరిచి ఆమెకు మందు ఇవ్వడానికి జంకుతాడు. సంఘం అతన్ని క్షమించదు. ప్రజలు అతని కొంపకు చిచ్చుపెడతారు. దానితో పాటు దామోదరయ్యా కూడా భస్మీపటలం అయిపోతాడు.

ఈ నవలలో వర్ణింపబడిన స్త్రీ జనోద్ధరణ పంతులుగారికి ఆత్మీయమైన విషయం. దీనికి తోడుగా బాల్యవివాహాలు, వైధవ్య మనుభవించే ముక్కుపచ్చలారని పసి బిడ్డల దుస్థితి కూడా నిశితంగా విమర్శించ బడ్డది.

ఈ నవలను ఆంగ్లంలోకి శ్రీకాకుళంలో మతబోధకుడుగా ఉన్న రెవరెండ్ హచిన్‌సన్ దొర "The Fortune's Wheel" అన్న పేరుతో అనువదించారు. ఈ అనువాదం మద్రాసు క్రిస్టియన్ కాలేజీ మాగజైనులో భాగాలుగా ప్రచురింపబడి, లండనులో పుస్తక రూపంలో వెలువడ్డది.

ఈ నవలను మెచ్చుకుంటూ 1887 సెప్టెంబరు 30వ తారీకు "లండన్ టైమ్స్" అన్న పత్రిక ఈ విధంగా వ్రాసింది.

"The story itself is simple, and from a European point of view of no great interest. But the Picture of Hindu domestic life, religious ideas, modes of worship, and superstition, and the condition of women, with the denial of all rights of choice in marriage, are so well drawn and illustrated that the book will have a charm for all readers".

రాజశేఖర చరిత్రలోని భాషను గురించి ఒక్కమాట. ఇందులోని భాష గ్రాంథికమే అయినా ఎక్కడా వ్యర్థసమాసాలు, పాండిత్య ప్రకటన లేక వ్యావహారిక భాషకు సన్నిహితమై సరళంగా సాగుతుంది. ఇంతకుముందు వ్రాయబడ్డ "శ్రీరంగరాజు చరిత్ర"కూ "రాజశేఖర చరిత్ర"కూ ఈ భాషా విషయంలో కూడా ఎంతో తేడావుంది. జటిల సమాస భూయిష్టమైన శ్రీరంగరాజు చరిత్రకు భిన్నంగా వ్యావహారిక భాషకు సన్నిహితంగా ఉండే సరళ గ్రాంథికాన్ని ప్రయుక్తంచేసిన రాజశేఖర చరిత్రము ఎంతో ముందుకు సాగిందని చెప్పాలి. అక్కడనుంచి చిలకమర్తి, ఆ తరువాత ఉన్నవ లక్ష్మీనారాయణ గారు—తెలుగు నవలలోని భాషలో క్రమానుగతంగా వచ్చిన మార్పుకు ఈ నలుగురూ మైలు రాళ్ళవలె నిలిచి ఉంటారు.

# మాలపల్లి

''మాలపల్లి'' రచన తెలుగు సాహిత్యంలో ఒక గొప్ప సంఘటన. ఉన్నవ లక్ష్మీనారాయణగారు ''సుప్రసిద్ధాంధ్రనాయకులు, సంస్కర్తలు, సాహిత్య విశారదులు, కార్యశూరులు. శారదా నికేతనము, మాలపల్లి లక్ష్మీనారాయణగారి మానవధర్మ పరాయణత్వమునకు నిదర్శనములు.''

ఉన్నవ వారు జాతీయరంగంలో తాము చేపట్టిన ఒక సంఘ సంస్కరణ కార్యక్రమానికి అక్షరరూపం కల్పించారు యీ నవలలో. అప్పటికింకా గాంధీజీ ''హరిజనులు'' అన్న పేరు కల్పించలేదు. వారిని అస్పృశ్యులుగాను, కడజాతివారుగాను చూస్తున్న ఆ రోజుల్లో (1921) యీ నవల వ్రాయడం ఎంతో సాహసం.

దీని గొప్పతనానికి మరో కారణం దీనిని "వాడుక భాష''లో వ్రాయడం. ఆయనే చెప్పుకున్నట్లు వాడుక భాషలోకన్న గ్రాంధిక భాషలో వ్రాయడమే తేలిక-ఆ భాషను వ్రాయడానికి మనం అలవాటుపడి వున్నాం గనుక. పంతులుగారు యీ నవలలో గుంటూరు జిల్లా మెట్ట తాలూకాలలోని 'మాండలికం' వాడారు. అది అతి సహజంగా ఆయా పాత్రలకు నప్పేవిధంగా వ్రాశారు.

అందువల్లనే తెలుగు నవలల్లో "యదార్ధ'' జీవనాన్ని ప్రతిబింబించిన నవలలను పేర్కొనవలసి వచ్చినప్పుడు "మాలపల్లి'' ప్రథమ శ్రేణిలో ప్రప్రథమస్థానాన్ని అలంకరిస్తుంది.

"మాలపల్లి'' రాజకీయ, సామాజిక జీవితాల సజీవ, సమగ్ర చరిత్రను ప్రస్ఫుటం చేసే నవల. దీనికి ''సంగవిజయ'' మనే నామాం

తరం ఉన్నది. నాయకులు ఇద్దరు. రామదాసు, సంగదాసు. వీరి ఆదర్శాలతో విజయవంతమైన ఈ నవలకు రెండవపేరే ఎక్కువ సార్థకమైనది.

"మంగళాపురం" గ్రామంలో రామదాసు అనే హరిజనుడు ఉన్నాడు. హరిజనుడయినప్పటికీ అతడు చదువుకున్నవాడు, ఆధ్యాత్మిక చింతన ఉన్నవాడు. అతని భార్య మహాలక్ష్మమ్మ. వారికి వెంకటదాసు, సంగదాసు, రంగడు అనే ముగ్గురు కొడుకులు, జ్యోతి అనే ఒక కుమార్తె ఉన్నారు. పెద్దవాడు వెంకటదాసు వ్యవసాయం చేస్తూఉంటాడు. తీక్షణమైన స్వభావం కలవాడు. సంగదాసు అహింసా సిద్ధాంతాలలో అచంచలమైన విశ్వాసమున్నవాడే కాక వాటిని ఆచరణలో పెట్టటానికి సర్వస్వాన్ని అర్పించటానికి సంసిద్ధుడు. అతడు గ్రామ పెద్ద చౌదరిగారింట్లో నౌకరీకున్నాడు. రామదాసు కూతురు జ్యోతి. ఆమె అప్పాదాసు చిన్ననాటి నుంచి స్నేహితులుగా, కలిసిమెలసి ఉంటున్నారు.

ఈ ముఖ్యమైన కథతోపాటు చౌదరి కుటుంబగాథ ఉపకథగా సాగుతుంది. చౌదరి క్రూరమైన స్వభావం కలవాడు. పరమలోభి. కాని అతని భార్య లక్ష్మమ్మ చాలా ఉదార స్వభావురాలు. చౌదరి దంపతులకు పిల్లలు కలగకపూర్వం దత్తత చేసుకున్న కొడుకు వెంకటయ్య. తర్వాత వారికి కలిగిన కొడుకు రామానాయుడు. ఇద్దరూ పెద్దవాళ్ళయి తండ్రికి వ్యవసాయంలో చేదోడు వాదోడుగా ఉంటు ఉంటారు. రామానాయుడికి ఈ కథాకాలం నాటికి ఒక కుమారుడు కలిగాడు. వాడి పేరు గోపీకృష్ణ.

రామదాసు తనకున్న పొలాన్ని నమ్ముకుని ప్రశాంతంగా జీవితం గడుపుతూఉంటాడు. తీరిక ఉన్నప్పుడల్లా వేదాంత చర్చల్లో పాల్గొనటం అతనికి అభిమాన విషయం.

రామదాసు ''ఛండాలురని'' చెప్పబడే తన జాతిని ఉద్ధరించి వారి అజ్ఞానాన్ని, దారిద్ర్యాన్ని రూపుమాపాలనుకుంటాడు. సంగదాసు ఈ విషయంలో తండ్రికి అండగా నిలబడతాడు. సంగదాసుకు, చౌదరి కొడుకు రామానాయుడికి మధ్య స్నేహసంబంధాలు అధికమౌతాయి. తన కొడుకు ఇలా ఒక కడజాతివాని వెంట తిరగటంతో చౌదరి ''అహం'' దెబ్బతింటుంది.

చౌదరి, మరికొంతమంది గ్రామ పెద్దలు కలిసి కూలివాళ్ళకు ధాన్యానికి బదులు డబ్బు ఇస్తామంటారు. కాని వాళ్లు దానికి ఒప్పుకోక పోవడంతో సంగదాసు చౌదరికి నచ్చచెప్పచూస్తాడు. రామానాయుడు కూడా ఈ విషయంలో జోక్యం కలుగచేసుకోవాలని చూస్తాడు. దీనితో చౌదరి మరీ రెచ్చిపోతాడు.

రామానాయుడు, సంగదాసు విజయవాడ సభలకు పోయి వచ్చిన తర్వాత కూలివాళ్లు కూలిపని చెయ్యటానికి నిరాకరిస్తారు. సంగదాసు వారి పక్షం. చౌదరి కోపావేశంతో సంగదాసు నెత్తిమీద కొట్టగా అతను నేలకొరుగుతాడు. చౌదరికి భయంవేసి ఇంటికి వెళ్ళిపోతాడు. ప్రెసిడెంటు, మరికొంత మంది పెద్దలు బాగా డబ్బు గుప్పి ఈ హత్యను బయటికి పొక్కనీకుండా చేస్తారు.

సంగదాసు పేరు మీద మంగళాపురంలో "సంగపీఠా"న్ని స్థాపిస్తారు. అక్కడ హరిజనులకు చదువుకొనే అవకాశం కలిగిస్తారు. రామానాయుడు తన పుస్తకాలన్నీ సంగపీఠానికిచ్చేశాడు.

చౌదరి సంగదాసుని హత్యచేసిన తర్వాత రామదాసుచేసే సంఘసంస్కరణను చూసి ఓర్వలేకపోతాడు. ఈ ఓర్వలేని తనమే చౌదరిని రామదాసుకు అతని పొలాల మీద హక్కు లేకుండా చేస్తుంది. అప్పటి నుంచీ రామదాసు అప్పాదాసు ఇంటనే ఉండవలసి వస్తుంది.

తండ్రిచేసిన పాపం కొడుకులు అనుభవించవలసి వస్తుంది. రామానాయుడి భార్య మోహనరావుతో మద్రాసు లేచిపోతుంది. అక్కడ ఆమెకు అమ్మవారువచ్చి గుర్తుపట్టలేనంత వికారంగా తయారవుతుంది. హాస్పిటల్లో కమల చచ్చిపోయిందనుకున్న మోహన్ రావు వ్యాకులచిత్తుడై ఇంటికి తిరిగి వస్తాడు. అప్పటి నుంచీ అతడు క్షయరోగంతో బాధపడుతూ ఉంటాడు.

చౌదరి తమ పొలం తీసుకున్న తర్వాత రామదాసు కూలిపని చేసుకు బ్రతుకుతూఉంటాడు. ఈ బాధపడలేక, చూడలేక రామదాసు పెద్ద కొడుకు ''తక్కెళ్ళ జగ్గడు'' అనే గజదొంగగా మారి ధన వంతులను లూటీచేసి పేదవారికి పెన్నిధిగా మారుతాడు.

చౌదరి దురంతాలకు అంతులేకుండా పోతుంది. అప్పాదాసును పాఠశాలనుంచి తొలగిస్తాడు. జగ్గడి కారణంగా రామదాసు కుటుంబం పట్టుబడి శిక్షింపబడతారు.

ఈ లోపల చౌదరి మరణిస్తాడు. రామానాయుడు, వెంకటయ్య తమ ఆస్థిని ''సంగపీఠా''ని కి రాసిస్తారు. రామానాయుడు జ్యోతిని, రంగణ్ణి ఇంటికి తీసుకు రావాలనుకుంటాడు. కాని ఫాదర్ ఒప్పుకోడు. ఒకరోజు పాల్ జ్యోతిమీద అత్యాచారం జరుపబోగా ఆమె నదిలోపడి ప్రాణాలు విడుస్తుంది. సమయానికి అక్కడికి వచ్చిన అప్పాదాసు జ్యోతితో కూడా నదిలో దూకి ప్రాణాలు విడుస్తాడు.

ప్రభుత్వం చేసిన తీవ్రమైన ప్రయత్నంవల్ల జగ్గడు గాయపడి పట్టుబడతాడు. తానెవరయిందీ చెపుతాడు. ప్రభుత్వం అతనికి ఐదు సంవత్సరాల కఠిన శిక్ష విధిస్తుంది.

జగ్గడి సంగతి విని రామదాసు చాలా బాధపడతాడు. మహాలక్ష్మమ్మ అక్కడికక్కడే మరణిస్తుంది. వెంకటదాసు కూడా మరణిస్తాడు. చివరకు రామదాసు శిక్షనుండి బయటపడతాడు. జగ్గడు

పంపిన 5 లక్షలతో మంగళాపురంలో 'విజయ కళాశాల''ను నిర్మి స్తారు. మోహన్‌రావు మరణిస్తూ తన యావదాస్తినీ ''విజయ కళా శాల''కు రాసిస్తాడు.

''విజయ కళాశాల'' ప్రారంభిక శిక్షణ కేంద్రగా రూపొంది స్వరాజ్యాందోళనకు మార్గదర్శక మవుతుంది.

జీవితంలో అడుగడుగునా కష్టాలనే ఎదుర్కొంటూ అచంచల మైన విశ్వాసంతో నిలబడినవాడు రామదాసు. ఒకరోజు అకస్మా త్తుగా అరణ్యాలకు వెళ్ళిపోతాడు. దీనితో నవల సమాప్తమవుతుంది.

ఈ నవలలో సంగదాసు చూపే సర్వతోముఖమైన జ్ఞానం త్యాగం; జ్యోతి, అప్పాదాసుల పవిత్ర ప్రేమ, మహాలక్ష్మమ్మ వాత్సల్యం, వెంకటదాసు ఆత్మసమర్పణ, రామానాయుడి సేవా తత్పరత, రామదాసు నిష్కామ కర్మభావం, —అత్యంత ప్రతిభా వంతంగా చిత్రించబడ్డాయి.

ఈ నవలకు ''తొలిపలుకు'' వ్రాస్తూ శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు గారు— యీ నవల వైశిష్ట్యాన్ని ఉగ్గడిం చారు. అందులో వారు యీ నవలలో చూసిన మొదటి విశిష్టత ఏమంటే— యిది "మానవ ధర్మ పరిణామాన్ని" చూపడానికి పనికి వచ్చే గొప్ప సాధనమన్నారు. శ్రీ మహాభారత, రామాయణములు, తిక్కన భారతము—ఎట్టి మానవధర్మ పరిణామాన్ని చూపుతున్నవో యీ నవల కూడా అట్టి పరిణామాన్నే సూచిస్తున్నది. మహా భారతానికి జోడై నదీగ్రంథము అనికూడా వారన్నారు.

''రామదాసాశ్రయమైన మాలపల్లి ధర్మ సంరంభమునకు క్షేత్రము. సంగదాసు సంకల్పితమైన శ్రీ రామమందిరము ధర్మసంస్థాప నాలయము. పరస్పరాశ్రయములైన సమర పరిత్యాగములు ధర్మపరిణామమునకు సాధనములు. ప్రపంచా

వృతమైన రాజకీయ, మత, సాంఘికాది పరివర్తనా పరిజ్ఞాన మునకు సాహిత్యము పరమార్థ సాధనము''.

ఈ మాటల్లో ఎంతో సత్యం ఉంది. ఇది 'ధర్మయుద్ధం'. కొన్ని వేల సంవత్సరాలపాటు అణగద్రొక్కబడిన పీడిత ప్రజల హాహా కారాలు ఈ నవల అంతటా విన్పిస్తాయి. కాని దీనిలో విశిష్టత నాశనమైపోయివున్న ఒకజాతి వ్యవస్థను ఎలా పునరుద్ధారించవచ్చో ప్రత్యక్షంగా చూపడం. అది చాలా తక్కువ నవలలు చేస్తాయి.

సాహిత్యానికి పరమావధి నిద్రాణమైన జాతిని మేల్కొల్పి కార్యోన్ముఖం చేయడం. అట్టి మహత్తరమైన కార్యాన్ని "మాల పల్లి" చేసింది. "సర్వతో ముఖమైన మానవ స్వాతంత్ర్య ధర్మావ తరాణమునకు స్వతంత్ర సాహిత్యము మూలాధారము. వర్తమాన కాలమునందు ప్రజాజీవన వికాసమున కాధారములై వర్ణాశ్రమ ధర్మములు, సాంఘికాచార వ్యవస్థలు, రాజ్యాంగములు, మత విశ్వాసములు, వృత్తులు, ధనార్జన విధానములు, ధర్మసాధనములు, సాహిత్య రచనలు మొదలగు సకలవ్యవస్థలు శిథిలములై పునర్నిర్మా ణమునపేక్షించుచున్న విధమును ప్రపంచావృతమైన మహా పరి వర్తనను విశదము చేయుచున్నది''. అందులో ఒక నూతనాధ్యాయం మాలపల్లి. మాలపల్లిలో సంకల్పించిన నవజీవన నిర్మాణ విధానం ఎంతో అభ్యుదయాత్మకమైనది.

ఈ నవలలో కడజాతి వారనిపించుకొంటున్న మాల మాదిగల కథ వుంది. ఈ కథనే ఉన్నవవారు ఎన్నుకోవడానికి రెండు కారణాలు కన్పిస్తాయి. ఒకటి ఆయన సంఘ సంస్కరణోద్యమ నాయకులు కావడం. రెండవది, కొడవటిగంటి కుటుంబరావు గారి మాటల్లో— "పరిపాలనలో ఉన్న భారత దేశపు కుళ్లు యావత్తూ మాల పల్లెలు చూస్తే భూతద్దాంలో చూసినట్టుగా కనిపిస్తుంది. ఎందుచేతనంటే మాలమాదిగలు బాధితుల చేత బాధితులు''. సంఘ

సంస్కర్త, మానవతావాది అయిన రచయిత తన రచన ద్వారా ఎంతటి మార్పును సాధించగలడో ''మాలపల్లి'' విశదం చేస్తుంది.

అయితే యీ మాలపల్లిని మునిపల్లెగా మార్చిన వారు రామదాసు, ఆయన కుటుంబం. సంగదాసు ధనవంతుల, అధికార వాదుల బలానికి సమసిపోయినా, అతని జ్యోతి మిగిలినవారందరినీ ఉత్సాహపరచి అతని ఆశయాలైన అస్పృశ్యతా నివారణ, కడ జాతి వారికి విద్యా సౌకర్యాలను కలిగించడం వంటివి సాధింప చేసింది.

మాలపల్లి నాలుగు భాగాల బృహద్గ్రంధం. ఈ నాలుగు భాగాల్లో— మొదటి, మూడవ భాగాల్లో 24 అధ్యాయాలు, రెండు, నాలుగు భాగాల్లో 22 అధ్యాయాలు ఉండి, కథా పోషణలో ఒక ఐక్యతను సాధించింది యీ నవల. మొదటి భాగంలో ఎక్కువ భాగం రామదాసు కథ, రెండవ భాగం చౌదరయ్య కథ, మూడవ భాగం సెటిల్‌మెంటు జీవితం, నాలగవ భాగం జైలు జీవితం. ఇలా స్థూలంగా విభజించ బడ్డది కథ. మూడు, నాలుగు భాగాల్లోనే వెంకటదాసు ఉరఫ్ తక్కెళ్ళ జగ్గడి కథ, జ్యోతి అప్పాదాసుల వివాహగమనం, పాల్‌దుండగాలు, రామానాయడు, వెంకటయ్యలు తమ యావదాస్తి సంగమందిరానికి, విజయకళాశాలకు వ్రాసి యివ్వడం—జరిగాయి. ఇది కథాభాగం. దీనితోపాటు సెటిల్‌మెంటు జీవితం, జైలు జీవితం—వీని వర్ణన అతివిస్తారంగా చేయబడ్డది. ఒక విధంగా యీ వర్ణనలు ఆనాటి సంఘ జీవితంలో ఒకముఖ్యమైన భాగాన్ని తెలుసుకోవడానికి ఉపయోగపడ్డా, మరో విధంగాచూస్తే కథాభాగానికియివి అత్యాంతావశ్యకం అని తోస్తుంది. ఇంత కష్టము అసహ్యామూ అయిన పరిస్థితుల్లో ఉన్నాడు కనుక నేరామదాసు జీవితం లోని అన్ని బంధాలనుంచి విముక్తుడై యతీంద్రుడైనాడు. ఒకవిధంగా మానవజీవితం, ముఖ్యంగా కడజాతివారి జీవితం సెటిల్‌మెంటు జీవితంలా, జైలు జీవితంలా అంతటి దుఃఖభూయిష్టమైనదే!

ఈ నవలను ''రామదాసు జీవిత చరిత్ర''గా కూడా గ్రహించవచ్చు. పచ్చని జీవితంతో, ఆనందమయమైన సంసారంతో ప్రారంభమైన రామదాసు జీవితం మెల్లమెల్లగా ఎన్నికష్టాలకు లోనైందో, చివరకు జీవితంలోని అన్ని ఆకర్షణలు, అన్ని ఉద్వేగాలు వదిలివేసి ఆయన సన్యసించడం ఎలా జరిగిందో ఇది చూపుతుంది.

రామదాసు మాలదాసరి. దాసరులు పంచములలో మతబోధకులు. రామదాసు పూర్వీకులు వైష్ణవ మత బోధకులు. మూడు తరాలనుంచీ జ్ఞానమార్గంలో ప్రవేశించి అచల బోధను స్వీకరించినవారు. రామదాసు కూడా గురువుల్ల కారణం పొందినప్పటికీ యింటి పనులు, పొలం పనులు చేసుకొని పోతూవుండేవాడే! కాని ఐహిక విషయాలలో కన్న ఆముష్మిక విషయాల ఎడ ఎక్కువ శ్రద్ధాసక్తులు కనపరచేవాడు.

పెరిగిన పంటచేనును చూసుకొని మురిసిపోతున్న రామదాసుతో నవల ఆరంభమై, ఆయన మౌనిగా, యతీంద్రుడుగా విజయ కళాశాల కులపతిగా ఉండడంతో నవల అంతమౌతుంది. భౌతికమైన సంపదనుంచి కష్టాల మార్గంగుండా ఆధ్యాత్మిక సంపదను పొందడానికి ప్రతి మానవుడు సాగించే యాత్ర—రామదాసు జీవితం—అని చెప్పవచ్చు. ఈ మధ్య ఎన్నో విషాద సంఘటనలు జరిగాయి రామదాసు జీవితంలో. సంగదాసు మరణం మొదటిది. ఆస్తిపాస్తులు పోవడం, సెటెల్‌మెంట్లలో జీవించడం, చివరకు జైలుకు పంపబడడం, అక్కడ వరుసగా వెంకటదాసు, జ్యోతి, అప్పాదాసు, చివరకు తన భార్య మాలచ్చి అందరూ చనిపోగా తానొక్కడేమిగిలాడు.

“వృద్ధాప్యం వచ్చినకొద్దీ జీవుడికి పంచేంద్రియములతో సంబంధం ఒకటి తరువాత ఒకటి వూడిపోతున్నవి. ఇవన్నీ బంధాలా? నీవు నాకు బంధానివా ?'' అనుకుంటాడు రామదాసు.

"ముప్ఫై సంవత్సరాలనుంచీ యేవిధమయిన దీర్ఘమనస్తాపాలు లేకుండా కలిసిమెలిసి ఉన్న తన అర్ధాంగి యొక్క వియోగం దుస్సహమై, జోతీ అప్పాదాసుల మరణానికే విచారపడుతుంటే మాలక్ష్మి యొక్క ఆకస్మిక మరణం దుఃఖము యొక్క బాధనే తీసివేసింది. యేమీతోచక మౌనివలె మంచం మీద గూర్చున్నాడు.''

అలాగే వెంకటదాసు చనిపోయినప్పుడు కూడా ''రామదాసు సమాధి నిష్ఠుడయిన యోగీంద్రునివలె కూర్చున్నాడు.''

గార్హస్థ్యం, వానప్రస్థం, యీ అన్ని అంచెలూదాటి యతీంద్రుడైనాడు రామదాసు. సెటిల్‌మెంటులోవుండగా మాలక్ష్మి ప్రక్కన వుండడంతో అతడింకా గార్హస్థ్యం నుంచి వానప్రస్థంలోకి వచ్చినవాడే! రామదాసును జైలులో ఒక గదిలో చాలమంది దొంగలతో పడవేస్తారు (III–17). రామానాయుడువచ్చి తన్ను జామీనుమీద విడిపించాలని ప్రయత్నం చేస్తాడు. అందరూ అతన్ని చూచి నవ్వుతారు. ''మాలనాయుడు'' గారని ఎగతాళిచేస్తారు. ఆ రాత్రి రామదాసు ఆత్మవిమర్శ చేసుకుంటాడు.

''నన్ను జూచి హేళనగా మాట్లాడుతారు. నిందాస్పదమైన విషయం నాలో యేదో వాండ్లకు కనబడుతున్నది......ఉత్తమ పురుష సాహచర్యంవల్ల నేను గర్వించి ఆ గర్వాన్ని నామాటలలోనూ చర్యలలోను నిశ్చయంగా కనపరుస్తుండబట్టే భగవంతుడు నన్ను బాగు చేయడంకోసం యెరుకలద్వారా యెరుకగలిగించాడు... యింతవరకూ నాకాత్మ పారిశుధ్యం రాలేదు... నేను కర్మ సాపేక్షకంగా చేస్తున్నాగాని సంగ రహితుణ్ణిగాలేదు." అని వాపోతాడు రామదాసు.

ఈ ఆత్మ విమర్శతో, పారిశుధ్యంతో రామదాసు యతీంద్రుడైనాడు. అట్టి మహాత్ముని పంచమకులంలో పుట్టడం ఎలాసాధ్యమో యిందులో సహేతుకంగా నిరూపించారు ఉన్నవవారు. దీనికితోడుగా

చిన్నకులానికి చెందిన రామదాసు గొప్పతనం తెలియ చెప్పడానికి పెద్ద కులాల వారి చిన్నతనం కూడా చూపి తద్వారా రామదాసు యతీంద్రత్వానికి అర్హుడని చాటాడు. చౌదరయ్య, పంతులు, సెటిల్ మెంటు అధికారులు, జైలు అధికారులు — వీరందరూ పెద్ద ఉద్యోగస్థులు, ధనవంతులు. కాని మానసికంగా, గుణాలనుబట్టి వారికన్న ఎన్ని అంతస్థులపైన రామదాసునిలబడి వున్నాడో చూపడం ఈ నవల ముఖ్యోద్దేశం.

ఇందులో అంతర్వాహినిగా ప్రవహించిన మరో కథ సంగదాసుది. ఈ నవలకు "సంగవిజయం" అని నామాంతరం ఉన్నది. నిజానికి అది 'మాలపల్లి' అన్న దానికన్న సమంజసమైనది.

> "ఈ పుస్తకానికి మొదట మాలపల్లెని పేరు బెట్టదలచుకొని వ్రాయడం ప్రారంభించాను. కొంతదూరం పోయిన తరువాత సంగవిజయమని పిలవడం మేలని తోచింది. అందుకని రెండు పేర్లూ ఉంచాను." అన్నారు రచయిత.

ఈ నవలలో సంగదాసు మొదటిభాగం చివరనే మరణిస్తాడు. కాని అతడు నిజంగా జీవించడం మొదలుపెట్టింది, చనిపోయిన తరువాతనే. అందువల్లనే నవలను సంగవిజయం అనడమే సమంజసం. ఇది సంగదాసు ఆశయాల విజయంగా మనం భావించవచ్చు విజయ కళాశాలనే సంగకళాశాల అనడం, అది దిగువజాతుల విద్యాసముపార్జనకు కూడలి అనడంవల్ల యీ కళాశాల స్థాపన ద్వారా సంగదాసు భావాలు, ఆశయాలు నెరవేరాయని స్పష్టం చేయబడ్డది. అంతే కాదు. సంగదాసు చనిపోయేటప్పుడు "మనమే గెలుస్తాం" అన్న చివరి మాటతో ప్రాణం వదిలాడు. ఆ మాట చివరలో అక్షరాలా నిజమయింది. అందువల్ల కూడా దీనిని సంగవిజయం అనవచ్చును.

'సంగ' శబ్దం సంఘ శబ్దానికి వికృతి. అందువల్ల యిది సంఘ విజయం అని కూడా అనవచ్చు. సంగదాసు సంఘానికి ప్రతినిధి. అందులో జరుగుతున్న అక్రమాలను కూకటి వేళ్ళతో కూలద్రోయ డానికి జరిగిన మహావిప్లవానికి బీజాలు వేసింది సంగదాసే! దానిని అనుభవించిన వారు తరువాతి తరాలవారు. అందువల్ల దీనిని సంగ దాసు సాధించిన సంఘవిజయంగా మనం గుర్తుంచుకోవాలి.

ఇవి అన్నీ గాక, మరొక్క కారణంవల్ల దీనికి సంగవిజయ మన్న పేరు తగివున్నది. ఈ జీవితంలోని బంధాలకు ''సంగ'' ములని పేరు. సర్వసంగ పరిత్యాగి అన్నది అలావచ్చినదే. దీనిని రామదాసు కథ అన్నాను. రామదాసు ఎలా అన్ని వ్యామోహాలు. అన్ని బంధాలు వదల్చుకుని సర్వసంగత్యాగిగా, యోగిగా మారి పోయినది సూచిస్తుంది కనుక సంగముల మీది విజయం — సంగముల మీద రామదాసు సాధించిన విజయంగా — దీనిని ''సంగవిజయం'' అనడం ఎంతైనా సముచితంగా వుంది.

ఈ విధంగా ఈ నవల ఒక ప్రక్క సంఘవిజయంగాను, రెండవ ప్రక్క ఆ సంఘ జీవితానికి విముఖమైన సన్యాస జీవితాన్ని రెంటి మేళవింపును అత్యంత మధురంగా చూపింది.

ఈ నవలలో హరిజనోద్ధరణం ప్రధానమైన ఆశయంగా ఉద్దే శించబడ్డది. దీనికి ఉన్నవ వారు రెండు మార్గాలు సూచించారు. ఒకటి వారికివారు పరిశుద్ధులుగా ఉండడం; రెండవది మిగిలిన జాతుల వారు దానికోసం వారికి సహాయంచేస్తూ, కులభేదాలను మరచి, అందరూ మానవులన్న సంగతి జ్ఞాపకం ఉంచుకోవడం.

ఉన్నవ వారు ఆస్తిక వాదులు కావడంవల్ల హరిజనుల మత సంబంధమైన విషయాలను గురించి వివరిస్తూ, నవలకు వ్రాసిన ''ముగింపు''లో తమ సిద్ధాంతాన్ని ప్రవచించారు. నిజానికి ఈ నవ లకు దీనిని పరాకాష్ఠగా గ్రహించవచ్చు.

"జాత్యాధిక్యత అహంకారమునకు హేతువగుటచే సవర్ణులు భగవంతునకు దూరమగుచున్నారు. కడజాతివారికి మేమెక్కు వను అభిమాన ముండదు. గనుక వారికి ముక్తి సమీపము. సవర్ణులకు అహంకారము ఆజన్మసిద్ధము. కడజాతికి అనహంకారము జన్మసిద్ధము."

ఈ మాటలలోను, రామదాసు సంగకళాశాల స్థాపననాడు చెప్పిన మాటలలోను యీ నవలలో ఆస్తికతను, సర్వమానవ సమాన భావాన్ని ప్రచారం చేయడం కూడా ముఖ్యోద్దేశంఅని చెప్పవచ్చు.

ప్రేమకుమించిన సాధనం లేదని, సంఘసేవ చేయనిదే ఎవరూ దాని చేత పోషించబడడానికి అర్హుడుకాడని, ఆత్మోపలబ్ధికి కర్మయోగము ఉత్తమ మార్గమనీ, చెప్పి యీ నవలను ఆధునిక గీతగా ఉద్దేశించారు, ఉన్నవ లక్ష్మీనారాయణగారు.

మాలపల్లి రచనలోవున్న వస్త్వైక్యాన్ని గురించి యిదివరకే కొంచెం చెప్పాను. నాలుగుభాగాల యీ నవలలో మొదటిభాగంలో సంగమరణం, రెండవభాగంలో చౌదరయ్య బాధలకు లోనుకావడం, రామానాయడు పూర్వంకన్నా ఎక్కువగా తనకు సంగదాసు అప్పగించిపోయిన పనులను చేయడం; మూడవభాగంలో సంగమందిర స్థాపనం, సంగదాసుభావాలకు అనుగుణగా అందరూ సమ్మెలుకట్టి, సెటిల్మెంటులకు పోవడం, నాలుగవభాగంలో అతనిభావాలను అనుసరించే రామదాసు. రామానాయడు జైళ్ళకుపోయి అహింసా పద్ధతిలో తమభావాలకు విజయం సాధించడం ... యివి అన్నీ అంతకంతకు ఎక్కువ తీవ్రంగా, ఉత్సుకతతో చూపబడి, ఆద్యంతాల సమన్వయం అత్యద్భుతంగా చూపబడ్డది.

అంతేకాదు. ఏ భాగానికాభాగం కూడా యీ ఐక్యతకు దోహదం కల్పిస్తున్నది. మొదటి భాగాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే

ఇందులోని మొదటి అధ్యాయం ''చేను.'' రెండవది ''దొడ్డి'' మూడవది ''ఇల్లు.'' నాల్గవది ''కుటుంబము''. ఐదవది ''బ్రె''. ఆరు 'గొడ్లకాపరులు.'' ఈ వరుసను గమనిస్తే రామదాసు పల్లెటూరులోని వ్యవసాయక జీవితానికి ప్రతినిధి అని తెలుస్తుంది. అతనికి ముఖ్యమైనది చేను. ఆ తరువాత పశువులుఉండే దొడ్డి. చేను నుంచి దొడ్డి, దొడ్డినుంచి ఇంటిలోకి, ఇంటిలో కుటుంబానికి అవశ్యకమైన ''బ్రె''... యిలానడుస్తుంది పరస్పరం అనుబంధం గల సంఘటనల స్వీకరణ.

అలాగే రెండవ అధ్యాయంలో కూడా. దీనిలో నల్లమోతు చౌదరయ్య, అతని ఆస్తిపాస్తులు, అతనికి సంఘంలోని గౌరవం, అతడి గర్వం... ఇవన్నీ క్రమానుగతంగా చూపబడ్డాయి.

జైలు, సెటిల్‌మెంటులలోని జీవితం కొంత విస్తృతంగా చూపబడ్డది. కాని దానివల్ల కథాగమనం దెబ్బతినదు. ఆ విషయాలు మనకు తెలియని విషయాలు కనుక ఉత్సాహజనకాలుగానే ఉంటాయి. ఆ విషయాలు అటు అధికారులు, యిటు కార్మికులు – యిరువురి మనోభావాలు తెలియచేసే ప్రతిబింబాలు కనుక అవి కథా కల్పనలో ఎంతో తోడ్పడ్డాయని చెప్పవచ్చును.

ఈ నవలలోని మరోముఖ్యమైన లక్షణం అందులోని తెలుగుతనం. కేవలం గ్రామీణ జీవితాన్ని, అందునా అట్టడుగునవున్న గ్రామీణ ప్రజలను – మాలమాదిగలను – తీసుకొని వారి అభ్యుదయాన్ని అకాంక్షిస్తూ వ్రాయబడిన రచనల్లో ఇది ఉత్కృష్టమైనది. అందులో ఒక ప్రక్క ఆంధ్రుల సహజజీవనవిధానం వర్ణింపబడగా, మరొక ప్రక్క ఉన్నత జాతు లనుకొన్న వారి దుండగాలు కూడా కన్నులకు కట్టినట్లు చూపించబడ్డాయి. ఈ ఆంధ్రత్వం నడుస్తున్న చరిత్రలోని ముఖ్యవిషయాలపై ఆధారపడి వ్రాయబడ్డది. ఇందులోని

కీర్తనలు, పాటలు, పదాలు - యీ గ్రామీణ జీవన విధానాన్ని తేట తెల్లం చేయడానికి తోడ్పడుతున్నవి.

ఒకవంక మానవధర్మ పరిణామం, వేరొక వంక సాంఘిక పరివర్తనం సమాంతరంగా చూపబడ్డాయి యీ నవలలో. సాంఘిక, రాజకీయ పరివర్తనంలో మానవ పరిణామం ఆధారపడి వున్నదన్న సంగతికూడా యీ నవల పరోక్షంగా నిర్వచిస్తున్నది. మానవ ధర్మ పరిణామం ఏవిధంగా సాంఘిక పరివర్తనం మీద ఆధారపడి వున్నదో చూపడానికి యీ నవలలోని మూడు పాత్రలను మనం గ్రహించాలి. వారు రామదాసు, సంగదాసు, వెంకటదాసు.

రామదాసు అంతా కృష్ణమయమనీ, మనం నిమిత్త మాత్రులమనీ భావించి - కర్మసిద్ధాంతాన్ని అనుసరించాడు. భగవంతుని యందు భక్తి ద్వారా తరించడమే తక్కువ కులాల వారు చేయవలసిన పని అని, అందుకుగాను బాహ్య, అంతరాలను శుద్ధంగా ఉంచుకోవాలని భావించినవాడు.

సంగదాసు లేదా రామానాయడు (వారిద్దరూ ఒకే భావానికి ప్రతినిధులు కనుక) కులమత భేదాలు సంఘ పతనానికే దారితీస్తాయని కడజాతివారు ఎందునా మిగిలిన జాతుల వారికి తీసిపోరని భావించి, అందుకుగాను తమ కులాలవారిని ఆర్థిక సాంఘిక రంగాలలో ఉన్నతుల చేయడానికి ప్రయత్నించారు.

ఇక వెంకటదాసుకు తమ కులం అణచబడ్డకులాలకు ప్రతీక. తమను ఇన్నాళ్లుగా అణచి వుంచుతున్న యీ ధనిక వర్గాలు సక్రమమైన మార్గాన్ని అనుసరించక పోవడంవల్ల సాంఘికమైన, ఆర్థికమైన సమత్వాన్ని సాధించాలంటే అట్టి ధనవంతుల దగ్గరి ధనాన్ని కొల్లగొట్టి బీదసాదలకు పంచాలని నడుంకట్టాడు జగ్గడు.

ఒకరిది భక్తి మార్గం. రెండవ వారిది ప్రేమ మార్గం. మూడవ వారిది వీరమార్గం. ఈ మూడు విధాలుగానూ సంఘ సంస్కరణ లేదా సంఘపరివర్తనం జరుగుతుంది. కాలవిభజన ప్రకారం కూడా యీ మూడు పద్ధతులూ ముందు మొదటి పద్ధతీ, తరువాత రెండవది, తరువాత మూడవది జరుగుతాయని సాంఘిక శాస్త్రవేత్తలు చెబుతారు.

రామదాసంతటి వాడు కూడా వెంకటదాసు పద్ధతి మంచిదో చెడ్డదో తేల్చలేక—

"నీది చాలా కొత్తనాటకం. నీ నాటక నియమాలు కూడా వేరే. కొత్త పంథా దొక్కావు. నేను మామూలు దారిని పోయినవాణ్ణి. నీది మార్గంకాదని చెప్పలేనుగాని, అంతా అవలంబిస్తే యెట్లావుంటుందో చూడాలె. నీ మార్గం నియమ బద్ధం మటుకు అవును. ఆ నియమాలు చాలా ఉత్కృష్టమైన వని, అమలులో పెట్టడం కష్టమే మోననీచాల మందికి అనుమానం."

అంటాడు. ఈ మాటల్లో ఆశాభావమూ, సందిగ్ధతా సమపాళంలో వున్నాయి. వెంకటదాసు పద్ధతి సామ్యవాద పద్ధతి. లేదా దానికి పునాది. అందువల్లనే వెంకటదాసు చనిపోతూ చెప్పిన మాటలు భావితరాలవారికి మార్గదర్శకాలు వంటివి:

"అందరూ పనిచెయ్యాలె. అందరికీ ఒకటే భోజనం. ఒకటే మోస్తరు గుడ్డలు...... రేపనే దిగులులేదు...... పోటీలు లేవు. ఆదుర్దా లేదు."

అదీ వెంకటదాసు సమతా సిద్ధాంతం. రామరాజ్యమని మనం అనుకొనేది అదే! దానిని ఆదర్శరాజ్య మనవచ్చు.

# హిమబిందు

శ్రీ అడివి బాపిరాజు తెలుగుదేశానికి భావకవిత్వమిచ్చిన బంగారు పంట. వంగసాహిత్యానికి రవీంద్రుడు ఎంత వైవిధ్యమైన కళామూర్తో, తెలుగు సాహిత్యానికి బాపిరాజు అంత. ఆయన కవి, కథకుడు, గేయకారుడు, శిల్పి, చిత్రలేఖకుడు. ఆయన వ్రాసిన ప్రతి పంక్తిలోనూ ఈ వైవిధ్య మూర్తే మనకు గోచరిస్తాడు.

బాపిరాజు భావన సులలితము, గంభీరమూ. సెలయేరులా నడచిపోయే పదవిన్యాసము, అతిసుకుమారము సౌష్టవము అయిన పాత్ర పోషణము, సన్నివేశాలలోని తెలుగు తనము – బాపిరాజుగారి నవలలకు, కథలకు, గేయాలకు ఒక ప్రత్యేకమైన ప్రతిపత్తిని సంపాదించి పెట్టాయి.

ఈయన వ్రాసిన నవలలకు, కథలకు తెలుగు దేశమే కథాస్థానము. తెలుగు వీరుల కథలే వానికి ఇతివృత్తాలు.

బాపిరాజుగారి నవలలలో ఐదు ప్రధానమైనవి. హిమబిందు, గోనగన్నారెడ్డి, అడవి శాంతిశ్రీ, నారాయణరావు, కోనంగి. ఇవి అయిదూ తెలుగు వారి కథలను ఇతివృత్తాలుగా స్వీకరించినవే!

ఈ రచనలన్నింటిలోను మనకు కన్పించేవి బాపిరాజుగారి వైవిధ్యమైన వ్యక్తిత్వము, ఆయన తెలుగుతనము, ఆయనకు లలితకళలంటే ఉన్న అమితమైన ఆసక్తి.

ఈయన వ్రాసిన నవలలలో సాధారణంగా "నారాయణరావు" కు పాఠకులు ఎక్కువ. కాని సాహిత్యవిమర్శనం దృష్ట్యా "హిమబిందు" కే ప్రథమ తాంబూలం ఇవ్వాలి.

"హిమబిందు" దాదాపు 350 పేజీల బృహన్నవల. ఇది నాలుగు భాగాలుగా విభజింపబడ్డది. వందకుపైగా అధ్యాయాలు ఉన్నాయి.

ఇది ఆంధ్ర శాతవాహనులను గురించిన కథ. చారిత్రక నవలను రూపొందించటానికి రచయితలు ప్రత్యేకమైన కృషి చేయవలసి ఉంది. కథాసంవిధానంలో, భాషలో, పాత్రకల్పనలోనూ, పోషణలోనూ ఏనాటి చరిత్ర నుంచి కథను రచయిత గ్రహించాడో ఆనాటికి సంబంధించిన విషయాలను జోడించాలి. ఇట్లా అన్ని విషయాలలోను తన చారిత్రక నవలను ఉత్తమోత్తంగా బాపిరాజుగారు చేశారు. దానికి నిదర్శనం "హిమబిందు" నవల.

బౌద్ధశకము 453లో ధాన్యకటకము రాజధానిగా ఉన్న ఆంధ్ర సామ్రాజ్యానికి మహారాజైన శ్రీముఖ శాతవాహనుడు ఏవిధంగా పాటలీపుత్రాన్ని జయించి జంబూద్వీప చక్రవర్తిత్వాన్ని సాధించాడో నిరూపించే నవల ఇది. ఇంతవరకు మాత్రమే ఇది చారిత్రక సత్యం. దీనికి సరియైన సాంఘిక, రాజకీయ, పరిస్థితులను కల్పించడంలో బాపిరాజుగారు చూపిన ప్రజ్ఞ అనన్యసామాన్యమైనది.

శ్రీముఖ శాతవాహనుడు రాజ్యానికి వచ్చిన పందొమ్మిది సంవత్సరాలకు—అంటే బౌద్ధశకము 472వ సంవత్సరంలో—మహారాజుల జన్మదినోత్సవాలతో కథ ప్రారంభం చేయబడ్డది. అప్పటికే శ్రీముఖుల కుమారుడు శ్రీకృష్ణ శాతవాహనుడు "మహారాజ" బిరుదాన్ని పొంది ప్రతిష్ఠాన నగరాన్ని పరిపాలిస్తున్నాడు. శ్రీకృష్ణ శాతవాహనుడుగాక శ్రీముఖులకు మాయాదేవి, శాంతిశ్రీ అన్న కుమార్తెలు, మంజుశ్రీ అన్న మరొక కుమారుడు ఉన్నారు. ఈ మంజుశ్రీ కుమారుణ్ణి కొన్ని మాసముల క్రిందట చోరులు తస్కరించడం వల్ల రాజకుటుంబం విచార సముద్రంలో మునిగిఉంది.

మహారాజుల జన్మదినోత్సవ సందర్భంలో జరిగే శకటపోటీల పరీక్షలో విజయలక్ష్మి సువర్ణశ్రీ అనే యువశిల్పిని వరించింది. సువర్ణశ్రీ రాజశిల్పి అయిన ధర్మనంది తనయుడు. వ్యాయామాచార్యుడైన సోమదత్తుని శిష్యుడు. భారత వణిక్సార్వభౌముడైన చారుగుప్తులవారి శకటం పందెంలో ఓడిపోవడంవల్ల వారి కుమార్తె హిమబిందూ దేవికి సువర్ణశ్రీ అంటే కొంచెం కోపం వచ్చింది. కాని సువర్ణశ్రీ మిక్కిలి అందగాడు. ఉత్తముడైన శిల్పి. అతనివలన హిమబిందు ఆకర్షితురాలై తన సర్వస్వాన్ని ఆ యువకునకు అర్పించింది. సువర్ణశ్రీకి హిమబిందు తోటిదే లోకమైంది.

ఇది ఇలాఉండగా, రాజ్యాన్ని కూలద్రోయడానికి కొందరు కుట్రపన్నుతూ ఉన్నట్లు మహారాజులకు తెలియవచ్చింది. శాతవాహనులు బౌద్ధులు. వైదికమతానుయాయులు కొందరు పరరాజుల సహాయంతో శాతవాహనులను కూలద్రోసి వైదికరాజ్యాన్ని స్థాపించవలెనని కుట్ర సాగిస్తున్నారు. స్థౌలతిష్య మహర్షులకు దీనితో సంబంధమున్నదని, మంజుశ్రీ రాజకుమారుడు తస్కరింపబడడానికి ఈ కుట్రకు సంబంధమున్నదని రాజోద్యోగుల అనుమానం.

ఈ కుట్రను గూర్చి మహారాజ మందిరంలో జరుగే చర్చలో చారుగుప్తుడు కూడపాల్గొన్నాడు. ఆంధ్రసామ్రాజ్యానికి ఆదిశేషువు వంటివాడు అతడు. తనకుమార్తె హిమబిందను భావిమహారాజు అయిన శ్రీకృష్ణునకు ఇచ్చి ఉద్వాహము చేయాలని కలలు కంటున్నాడు. కాని ఆమె మేనత్త కొడుకైన సమదర్శికూడా ఆమెను వివాహమాడాలని ఉవ్విళ్ళూరుతున్నాడు.

మరొక వైపు స్థౌలతిష్యులు 'విషబాల' అనే విషకన్యను సృష్టించి ఆమెను శ్రీకృష్ణ శాతవాహనులపైకి పంపడానికి ప్రయత్నిస్తున్నారు. ఆయన ఈ విషయంలో చాణక్యనీతిని ప్రదర్శిస్తూ

పైకి మహారాజుకు హితులైనట్లు నటిస్తూ లోలోపల కుట్రలు పన్నడంలో నిమగ్నులైనారు.

పుళిందులొకవైపు, మాగధులొకవైపు, మాళవులు వేరొక వైపు తమపై యుద్ధ సన్నద్ధులవుతున్నారని తెలియగానే మంత్రి, సైన్యాధి పతులతోను, వర్తకచక్రవర్తి చారుగుప్తునితోను సంప్ర దించి తమ సైన్యాన్ని విభజించి వేరువేరుగా పంపడానికి మహారాజు శ్రీముఖుడు నిశ్చయించాడు.

చారుగుప్తుల వారు కూడా మహారాజులతో యుద్ధానికి పోవడానికి ఆయత్తమై—తన మనోభావాన్ని కుమార్తెకు చెప్పారు, ఏనాటికైనా ఆమె మహారాజ్ఞి కావాలన్న తన భావానికి మహా రాజులు అంగీకరించారని విని హిమబిందు మూర్ఛిల్లింది. తన తండ్రి మనోరథాన్ని ప్రియునికి చెప్పడంతో సువర్ణశ్రీ నిలువున నీరై నాడు. తన మనస్సునంతను కూడగట్టుకొని తాను హిమబిందును మహారాజ్ఞిని చేయుటానికే నిశ్చయించి, తన ప్రేమను త్యాగం చేయడానికి నిశ్చయించుకొన్నాడు.

శ్రీకృష్ణ శాతవాహనుడు వేటనెపంతో బయలుదేరి, రాను రాను తన బలగాన్ని కూర్చుకొని ఉజ్జయినిని ఒక పక్కనుంచి ముట్టడించాలని రాజాజ్ఞ. ఇలా రావడం స్థాలతిష్యులెరిగి విషబాలను మంత్రించి శ్రీకృష్ణుడు వచ్చేదారిలో ఆమెను ఉంచాడు. అది అతడు మరణించడానికి చక్కని ప్రయోగం. అనుకున్నట్లే యువ రాజు ఆమెను చూశాడు. ఆమె కన్నులలోని వింతకాంతి అతనిని ముందుకు సాగనీయలేదు. ఆమె విషబాల అని కూడా లెక్కించక ఆమెతోనే తన లోకమని గ్రహించిన యువరాజు ఆమెను మానవ కన్యగా మార్చడానికి వైద్యులను ఆజ్ఞాపించాడు. ఇలా విషబాల, శ్రీకృష్ణ శాతవాహనులు—పరస్పరం ఆకర్షితులైనారు.

ఉజ్జయిని, మాళవదేశాలలో యుద్ధం ముమ్మరగా జరుగుతున్నది. ఈ లోపల ధాన్యకటకంలో ఊహించరాని ఘోరమొకటి జరిగింది. ఒక సాయంకాలం ఉద్యానవనంలో ఉన్న హిమబిందును చోరులెవరో తస్కరించుకొని పోయారు. పట్టణమంతా అట్టుడికి పోయింది. సువర్ణశ్రీ ఏమైనా తాను హిమబిందును కనుగొనవలెననే ప్రతినతో యింటినుండి బయలుదేరాడు.

సువర్ణశ్రీ, తనమిత్రుడైన గోండుల యువరాజు సాయంతో హిమబిందును కనుగొనవలెనని నిశ్చయించుకొన్నాడు.

శబరులనే దస్యులు హిమబిందును, ఆమె మాతామహి ముక్తావళీదేవిని అరణ్యాలకే తీసుకుని వచ్చినారని సువర్ణశ్రీ మహాబల గోండుని సాహాయ్యమున తెలుసుకొని, ఎంతో చాకచక్యంతో హిమబిందు, ముక్తావళులను రక్షించాడు. గోండు సైన్యాలు ఆగుహను ముట్టడించినప్పుడు అందులో మహారాజు రెండవ కుమారుడు మంజుశ్రీ కూడా సువర్ణశ్రీకి దొరికాడు.

ఆనందదాయకాలైన ఈ వార్తలు మహారాజులకు, చారుగుప్తుల వారికి తెలియచేయబడ్డవి. సువర్ణశ్రీ తన గురువుల కోరిక ననుసరించి శ్రీకృష్ణునకు అంగరక్షకుడై అతని ప్రాణాలను కాపాడి యువరాజు మన్ననలను, ఉప సైన్యాధి పత్యాన్ని గ్రహించాడు.

చారుగుప్తుల వారు హిమబిందును యువరాజ్ఞిని చేయడానికి మహారాజుల అనుమతి వేడగా, మహారాజులు ఆ విషయాన్ని శ్రీకృష్ణ శాతవాహనులకు వర్తమానం చేశారు. యువరాజు మనసు నంతా హిమబాల ఆక్రమించుకొన్నది. అందులో మరొకరికి చోటు లేదు.

అన్నివైపులనుండి వచ్చిన దాడులకు తట్టుకోలేక పాటలీపుత్రం ఆంధ్రుల వశమైంది. ఆంధ్ర శాతవాహనుడు జంబూ

ద్వీపాన్ని జయించి చక్రవర్తి అయినాడు. అన్నివైపులనుంచి ఆయనకు విజయమే. ఒక్క కుమారుని వివాహ విషయమే మహారాజును కలచివేస్తూ ఉండగా, అమృతపాదార్హతులనే తమ బౌద్ధ గురువుల సలహాను పొందదలచాడు.

అమృత పాదార్హతులు విషకన్య అనన్యసామాన్యమైన అంద చందాలను మహారాజుకు తెలియచెప్పి ఆమె యువరాజుకు తగినదని నచ్చచెబుతాడు. అంతేకాదు. హిమబిందు సువర్ణశ్రీల ప్రేమోదంతాన్నికూడ అతడు మహారాజుకు వెల్లడిస్తాడు.

సువర్ణశ్రీ చెల్లెలైన నాగబంధునిక, సమవర్తి శాతవాహనులు ప్రేమించుకొన్నారు. మహారాజు అనుజ్ఞతో వారి వివాహంకూడా నిశ్చయింపబడ్డది.

ఒకనాటి మధ్యాహ్నం విషబాల విషయం తెలుసుకోవడానికి అమృతపాదార్హతులు స్థాల తిష్యుల ఆశ్రయానికిపోగా అక్కడ వారిరువురికి వైదిక బౌద్ధమత సిద్ధాంతాలనుగురించి తీవ్ర చర్చ జరిగింది. ఈ సమయంలోనే స్థాల తిష్యులవారు అమృతపాదార్హతులను అతని ముప్పదవయేట గంగలో మునిగిపోయిన కుమారునిగా కనిపెట్టారు. స్థాల తిష్యులవారు కోపంనెపంతో అమృతపాదార్హతుల తలమీద తీవ్రంగా గాయం చేస్తాడు. అప్పుడు కుమారుడుకూడా తండ్రిని గుర్తిస్తాడు. ఆయనకు తన పూర్వవృత్తాంతమంతా గుర్తుకు వస్తుంది.

ఈ మత చర్చలో అమృతపాదార్హతులు ఆర్య — బౌద్ధ ధర్మాలకు రెంటికి అతి సన్నిహిత సంబంధమున్నదని నిరూపించాడు. తన కొడుకు యిలాకావడం, తన విషబాలికా ప్రయోగం నిరుపయోగం కావడంతో స్థాల తిష్యులవారికి జ్ఞానోదయం అయింది. విషకన్య అమృతబాలగామారి శ్రీకృష్ణ శాతవాహనుని వివాహమాడడానికి ఆమోదించింది.

ఇది ఎరుగని సువర్ణశ్రీ యుద్ధంలో మహారాజుకు విజయం లభించగనే తన పని నెరవేరిందని నిశ్చయించుకొని భారత దేశంలోని సంఘారామాలనన్నింటిని చూచి, భిక్షువై శిల్పాలను చెక్కడంలో తన జీవిత సర్వస్వాన్ని గడపడానికి నిశ్చయించుకొని దేశ పర్యటనకు బయలుదేరాడు.

శ్రీకృష్ణుడు విషజాలను వివాహమాడడానికి నిశ్చయించుకొన్నారని విన్న చారుగుప్తుడు నిర్విణ్ణుడైనాడు. కాని తుదకు తన కుమార్తె ఆనందమే తన సర్వస్వమని భావించి సువర్ణశ్రీకిచ్చి ఆమె వివాహాన్ని జరిపించదలచుకొన్నాడు. మహారాజు సువర్ణశ్రీని పాటలీపుత్రంలో తమ ప్రతినిధిగా నిర్దేశించారు.

కీర్తిగుప్తులు, శ్రీకృష్ణ శాతవాహనుల, మహారాజుల అనుమతి బడసి సువర్ణశ్రీని అతడు భిక్షువు కాకముందే వెదికి తెచ్చుటకు, త్వరపడి సంఘారామాలను వెదకడానికి బయలుదేరారు. వారికన్న ముందుగానే హిమబిందు తండ్రికి కూడ తెలియకుండ సువర్ణశ్రీని వెతుకుతూ వారణాసి మృగవన సంఘారామానికి వచ్చింది. ఆమెతో సువర్ణశ్రీ తాను సన్యాసినౌతానని చెప్పాడు.

"సువర్ణశ్రీ కుమారా! నీకు మాత్రము సన్యాసమెందుకయ్యా" అని చారుగుప్తుడా మందిరంలోకి ప్రవేశించి, జరిగిన కథను వారికి చెబుతాడు. కథ అంతా ఈ విధంగా సుఖాంతం అవుతుంది.

హిమబిందు చారిత్రక నవల. అందులోనూ తెలుగు చరిత్రకు సంబంధించినది. శాతవాహనులు తొలి తెలుగు చక్రవర్తులు. చరిత్రను కథకు అనువుగా మలచడంలో బాపిరాజుగారు చూపిన ప్రజ్ఞ అసాధారణమైనది. అందుకుగాను రచయిత భాషలోను పాత్రపోషణలోను ప్రత్యేకమైన శ్రద్ధ వహించారు.

అట్టి చరిత్ర కనువైన పాత్రలను సృష్టించుకోవడం, వారు మాట్లాడు భాషనే ప్రయోగించడం, వారికి తగిన ఆచార వ్యవహార ములను సూచించడం— ఇవి అన్నీ ఈ చారిత్రక నవలలో నిర్దిష్టంగా చూపబడ్డాయి.

మహారాజుల జన్మదినోత్సవాలు, అందులో జరిగే వేడుకలు, విజయోత్సవాలు, ఇవి అన్నీ ఆ రాచరికపు చిహ్నాలే!

రాజకీయ, మత, సాంఘిక, న్యాయ, విషయాలలో ఏ ఒక్క భాగాన్ని బాపిరాజుగారు విడువలేదు.

బాపిరాజుగారి భాష కొండచరియలలో ప్రవహించే సెలయేరు వంటిది. ఉదాత్తమైన సంస్కృత సమాసాలు, వెనువెంటనే అతి లలితమైన తేటతెలుగు పదాలు. వేషభాషలు, జీవనవిధానం, శౌర్య ప్రతాపాల ప్రకటన— ఇట్టి ఆనాటివారి ప్రతి చిన్న ఆచార వ్యవహారాలపైన బాపిరాజుగారు తమ నిశ్చితమైన అభిప్రాయాలను పరిశోధకుడివలె వెల్లడిచేశారు.

హిమబిందు ఇతివృత్త నిర్మాణం క్లిష్టమైనది. చరిత్ర అనగానే మత, రాజకీయ ప్రసక్తి ఉండక తప్పదు. నిజానికి ఆ రెండూ ఒక దానిపై ఒకటి ఆధారపడి ఉన్నవని చెప్పకతప్పదు. మతవైరాలు, కుట్రలు యీనవలలో కూడా ప్రధానాలే. ఆనాటి రాజకీయాలలో బౌద్ధ, వైదిక మతానుయాయులకు మధ్య జరిగే సంఘర్షణను కన్నులకు కట్టినట్లు చిత్రించారు శ్రీ బాపిరాజు.

స్థాలతిష్యులవారు విషబాలను రాజకీయ సంబంధమైన కార్యానికి నిర్దిష్టపరిచిన నాటినుంచి ఈ రాజకీయాల ప్రాముఖ్యం అంత కంతకు పెరుగుతూ వచ్చి, మహారాజుల పాటలీపుత్ర విజయంతో పరాకాష్ఠనంది, స్థాలతిష్య, అమృతపాదార్హతుల వాగ్వివాదములో అంతర్నిహితమైపోయింది. స్థాలతిష్యులవారు వైదిక, బౌద్ధ మత

స్త్రీలు సౌందర్యఖనులు, సర్వకళాశోభితలు, సర్వవిద్యా పరిపూర్ణలు. ఇట్టి పాత్రలు నిత్యజీవితంలో మన అనుభవములకు విరుద్ధంగా ఉంటాయి

కాని యీ విధమైన బాపిరాజుగారి పాత్రపోషణకు రెండు రకముల సమాధానము చెప్పుకోవచ్చు. ఒక విధంగా ఈ పాత్రలు అయన మనోభావాలకు ప్రతిబింబాలు. ఆయనవలెనే ఆయన పాత్రలు కూడ జీవితములోని మంచికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తాయి. జీవితంలో కాపట్యం ఎరుగనివాడు కావడం వల్లనే తుదకు స్థాల తిష్యుల వారిలో కూడ మానసికమైన మార్పును సూచించి దివ్యునిగా చేశాడు బాపిరాజుగారు.

మరొక కారణము బాపిరాజుగారికి చరిత్రను గురించి ఉన్న అభిప్రాయాలు. తెలుగువారి చరిత్రను తెలుగువారు చదవడం ఒక విధంగా వారి ప్రాచీనులను గూర్చి, వారి ఉన్నతిని గురించి తెలుసుకోవడం. వారిని శీలహీనులనుగా చిత్రిస్తే ఈనాటి వారు ఆ కథలను ఆ వ్యక్తులను మార్గదర్శకంగా స్వీకరించలేరు. ఈ చారిత్రక దృష్టే అయనచేత అంతటి ఉదాత్తమైన పాత్రలను సృష్టింపచేసింది.

అందువల్లనే ఆంధ్ర శాతవాహన రాజవంశం వారిలోనేమి, వారి దండనాయక సేనాపతులలో నేమి, వారి ప్రజలలో నేమి మనకి ఉదాత్తమైన వ్యక్తిత్వమే గోచరిస్తుంది.

కాని బాపిరాజుగారు ఈ ఏకత్వంలో సున్నితమైన భిన్నత్వాన్ని కూడా చూపకపోలేము. అందుకు నిదర్శనంగా ఈ నవలలో ఎన్ని పాత్రలనైనా చూపవచ్చు. సమదర్శి సువర్ణశ్రీలు; విషబాలా, హిమబిందులు; చారుగుప్త శ్రీముఖ శాతవాహనులు; అందరిని మించి స్థాలతిష్య అమృత పాదార్హతులు.

స్థాలతిష్యులవారి పాత్ర వైవిధ్యమైనది. ఈయనలో ఆర్యుల వైదిక నిష్ఠను, కార్యదీక్షను, మనోనైశిత్యాన్ని మనోజ్ఞంగా చిత్రిం

చారు రచయిత. ఈయనలోని మార్పు కథకు అత్యంత ప్రాముఖ్యమైనది. "ఆర్య ధర్మావతారమే" బుద్ధుడు అని ఆయన వచించడం రెండు మతాలను సమన్వయిస్తూ రచయిత చేసిన వ్యాఖ్యానమే!

స్థాలతిష్యుల చరిత్రలో ముఖ్యమైనది విషబాలికా ప్రయోగం. ఈ అంశాన్ని బాపిరాజుగారు చాణక్య, చంద్రగుప్తుల కథనుండి గ్రహించినాడనడం స్పష్టం. కాని చాణక్యులవారి విషకన్య విషకన్యగానే ఉండిపోయి వారి కార్యాలను విజయవంతంగా నిర్వహిస్తుంది. బాపిరాజుగారి విషకన్య అంతకన్న క్లిష్టమైన పాత్ర. శారీరక మానసిక సంఘర్షణలో మానసికమైన శక్తికే విజయమని ఆమె నిరూపించింది. ఆమెను శారీరకంగా విషతుల్యను చేసినాడు మహర్షి. ఆమె గాలి సోకితే మరణమే శరణ్యం. కాని ఆమె మనసు వెన్నముద్ద. ఆమె మానసికంగా అమృతమూర్తే. స్థాలతిష్యులవారి మనసులో నున్న విషభావాలకు ఆమె ప్రతీక కదా! ఆ భావాలనుకూడా విరిచి అతనిని మార్చగలడమే ఆమె శక్తికి నిదర్శనం. స్థాలతిష్యులు ఆమెను శ్రీకృష్ణునకిచ్చి వివాహం చేయడానికి ఆమోదించడం ఆ మార్పునే సూచిస్తుంది.

స్థాలతిష్య మహర్షి కుమారులైన అమృత పాదార్హతుల పాత్ర ముఖ్యంగా ప్రతీకాత్మంగా (Symbolic) చిత్రించబడ్డది... పుత్రభావం అతి సున్నితమూ, మార్దవమూ అయినది. మానవుడు కాఠిన్యము, మృదుత్వమూ సమంగా పెంచుకొన్నమూర్తి. కుమారుడు గంగలో కలసిపోయిన నాటినుంచి అతడు కాఠిన్యమూర్తి. ఎంతటి కాఠిన్యమూర్తి కాకపోతే మనమరాలిని విషకన్యగా చేయడానికి సమకడతాడు! తన పుత్రుణ్ణి గుర్తించిన తరువాత యీ కాఠిన్యమూర్తే పరమ మార్దవమూర్తిగా మారిపోవడం మనం గమనించాలి. ఈ సౌమ్యభావం ఆయనలో కలగగానే ఆయన వెనుకటి

స్థౌలతిష్యులే అయినారు. వైదిక, బౌద్ధ మతముల సారూప్యాన్ని గ్రహించాడు.

ఇక్కడ మరొక్క విషయం వివరించవలసి ఉంది. వైదికులైన స్థౌలతిష్యులకు బౌద్ధులైన అమృతపాదార్హాతులు కుమారులు కావడంలో బాపిరాజుగారు మత సంబంధమైన ఒక కొత్తభావాన్ని స్పష్టం చేశారు. ఆ తండ్రీ కొడుకులకు గల జనక జన్య సంబంధమే, వైదిక, బౌద్ధ మతాలకు కూడా ఉన్నదని ఇందులోని తాత్పర్యం.

స్థౌలతిష్య అమృతపాదార్హాతుల కథలో మరొక ప్రతీకకూడా మనకు స్ఫురిస్తుంది. తండ్రినుంచి కుమారుడు దూరంకావడం వేరు మార్గమున పెంచబడడం, చివరకు తండ్రిని తెలుసుకోవడం— ఇవి అన్నీ బౌద్ధ మతానికి కూడా వర్తిస్తాయి. నిజానికి నాటికథ భారత దేశంలో బౌద్ధమత చరిత్రకు కథారూపమని చెప్పవచ్చు.

ఈ నవలలో ముఖ్యమైనది వైదిక, బౌద్ధ మతముల సారూప్య నిరూపణము. ఇది బహుశః మరి ఏ తెలుగు రచయితకూడ చేయలేదేమో! ఇది ఈ నవలలో అత్యద్భుతంగా చూపబడ్డది.

హిమబిందు నవలలోని సంఘటనలు ఆంధ్రదేశంలో బౌద్ధమతం ఉచ్ఛదశలో ఉన్ననాటివి. శాతవాహనులు బౌద్ధులు. కాని, వారు సర్వ మతములను సమానంగా ఆదరించారు. అయినా అతివాదులైన వైదికులు బౌద్ధ మతాన్ని నిరసించి మహారాజులను కాలద్రోసి రాజ్య రక్షణకే ముప్పు తీసుకొనిరావడానికి ప్రయత్నించడం చారిత్రక సత్యం. ఈ బౌద్ధ, వైదిక మతాల సంఘర్షణ ఈ నవలలో అత్యుత్తమంగా చిత్రింపబడ్డది. ఇందుకు పరాకాష్ఠ స్థౌలతిష్యులవారు రెండు మతములలోని సారూప్యమును గ్రహించడమే! ఈ నవలలో బాపిరాజుగారు చూపించదలచుకొన్న సర్వమత సామరస్యాన్ని అమృతపాదార్హాతుల అమృతోపమానమైన వాక్కు వెలువరించింది.

"ఆర్యధర్మమే వేదములు. ఆర్య ధర్మావతారమే బుద్ధుడు. జనక రాజర్షికి బిమ్మట శ్రీ కృష్ణావతారము. వేదవ్యాసుల పరిణతియే బుద్ధావతారము."

ఈ నవలలో బాపిరాజుగారి సర్వ వ్యక్తిత్వము ప్రదర్శింపబడ్డది. సువర్ణశ్రీ బాపిరాజుగారి ఆశయాల ప్రోవు. కేవలం పాత్రలలోనే కాక నవల ఆసాంతము బాపిరాజుగారు ఎన్నో విషయాలను స్పృశించి చర్చించారు. ఆనాటి సైన్య విభాగాన్ని గురించి ఒక అధ్యాయమే వ్రాయబడ్డది. రాజమార్గాలను గురించిన ప్రసక్తి, వైద్య విధానాన్ని గురించి, యోధాగారాలను గురించి, నగరవీధుల నిర్మాణాన్ని గురించి, న్యాయవిచారణను గురించి— బాపిరాజుగారు సుదీర్ఘమైన విచారణ చేశారు. ఇవి అన్నీ ఆయన పాండిత్యానికి, నిశితమైన పరిశీలనకు ఉదాహరణములు.

"హిమబిందు" తెలుగు సాహిత్యంలోని ఉత్తమమైన నవలలో ఒకటి. తెలుగు చరిత్రను ఇంత హృదయంగమంగా చిత్రించిన తెలుగు నవలలను మనం వేళ్ళమీద లెక్కించవచ్చు.

# ఏకవీర

ప్రథమశ్రేణికి చెందిన తెలుగు నవలల్లో ''ఏకవీర'' ఒకటి. ఈ నవలలో విశ్వనాథచూపిన ప్రతిభావిశేషాలు, కథాకథన చాతురి, శిల్పనైపుణ్యమూ మరి ఏ ఇతర నవలల్లోనూ చూపలేదని చెప్పవచ్చు. ఇది విశ్వనాథ వ్రాసిన ముఖ్యమైన, పేర్కొనదగిన నవలల్లో మొదటిది. ఇది 1932 ప్రాంతాల్లో వ్రాయబడ్డది.

''ఏకవీర'' చారిత్రక నవల. ఇందులో చరిత్రకన్న కల్పన అధికం. చరిత్ర కేవలం నేపథ్య చిత్రణకు మాత్రమే ప్రయుక్తంకాక కథలో భాగమై పాత్రల ఉత్కృష్టతకు తోడ్పడ్డది. మధురనేలిన నాయకరాజుల కాలానికి చెందినదీకథ. ముత్తుకృష్ణప్ప నాయకుని కాలంనాటిది. ఆనాటి దేశకాల పరిస్థితులను, పోర్చుగీసు దుండగులు సముద్రం మీదచేసే అరాచకాలను, క్రైస్తవమతము అప్పుడే దేశంలో అడుగు పెట్టడాన్ని యథాతథంగా చిత్రిస్తుంది నవల. చరిత్రకు అనువైనట్లుగా పాత్రలను కూడా ఉత్తమమైనవిగా చిత్రించాడు విశ్వనాథ. ఇట్టి సర్వపాత్రల ఉత్తమత్వము ఒక్క చారిత్రక నవలలోనే సహేతుకంగా కన్పిస్తుంది. ఈ నవలలోని కుట్టాన్ సేతుపతి, వీరభూపతి, ఏకవీర, మీనాక్షి వంటి పాత్రలన్నీ ఈ కోవకు చెందినవే! కేవలం ఉత్తమ వ్యక్తిత్వంగల పాత్రలతోనే నవల వ్రాయటానికి తగిన సంఘర్షణను సృష్టించుకోవాలి రచయిత. అయినా ఇందులోని సంఘటనలలో మంచికి చెడుకు మధ్య సంఘర్షణకన్న వ్యక్తుల మానసిక భావాల మధ్య సంఘర్షణ ఎక్కువగా ద్యోతకం అవుతుంది.

ఈ విధంగా చూస్తే ఇది తెలుగులో వ్రాయబడిన మొదటి మానసిక శాస్త్రసంబంధమైన నవల అని కూడా చెప్పుకోవచ్చు. విశ్వ

నాథ ఈ నవలలో పరిస్థితుల ప్రాబల్యం, అందువల్ల వ్యక్తుల జీవితాల్లో జరిగే విషమ సంఘటనలు వీనిని-ప్రతిభావంతంగా చూపారు.

నవలలోని పాత్రల ద్వారా మానసిక సంఘర్షణను వ్యక్తం చేయటం విశ్వనాథ ఈ నవలలో చూపిన రచనా విధానం. ఈ సంఘర్షణను రెండు దశల్లో చూపారు. మొదటి దానికన్న రెండవ సంఘర్షణ నిశితమై కథలోని వ్యగ్రతకు కారణమైంది.

ఇందులోని సంఘటన ఒక్కటే. ఇరువురు వ్యక్తుల జీవితంలో జరిగే చిత్రమైన, పరస్పర విరుద్ధమైన ప్రేమ సంఘటన. కుట్టాన్ అన్న దళవాయి కుమారుడు, మీనాక్షి అన్న సామాన్య కుటుంబంలోని యువతి ప్రేమించుకోవటం; అతని పరమ ఆప్తుడు వీరభూపతి-సామాన్యుడు - ఒక మండలాధిపుని కుమార్తె పరస్పరం ప్రేమించుకోవటం. ఇది సాధారణమైన సంఘటన. దీనిమీద విశ్వనాథ నిర్మించిన రెండవ సంఘటన మానసిక సంఘర్షణలకు మూలం. కుట్టాన్ సేతుపతి మండలాధిపుని కుమార్తె ఏకవీరను, వీరభూపతి మీనాక్షిని వివాహం చేసుకోవడం. ఈ సంక్లిష్ట సంబంధం (క్రాస్ రిలేషన్‌షిప్) నవలలో ''ఉద్విగ్నత'' అధికం కావటానికి సహాయకారి అయింది. దీనికి తోడు సమాంతర సంబంధం (పార్లల్ రిలేషన్ షిప్) చూపే కుట్టాన్, వీరభూపతుల స్నేహం ఈ అనిశ్చిత ప్రతీక్ష (సస్పెన్స్) కు దోహదకారి అయింది.

కథలో ఈ సన్నివేశాలను విశ్వనాథ ఎలా నిర్మించుకుంటూ పోయాడో గమనిస్తే, నవలలోని శిల్పాధిక్యత మనకు గోచరం అవుతుంది. అటు కుట్టాన్, ఇటు వీరభూపతి యిద్దరూ పూర్వమే ప్రేమించినవారు, ఇద్దరూ తమ ప్రేమ సఫలం కాదని గ్రహించిన వారు. ఇద్దరూ తమకు యిష్టంలేని వివాహాలు చేసుకున్న వారు. కొంచెం తక్కువ ఉద్విగ్నత, ఎక్కువ ప్రపంచజ్ఞానం, ధర్మపరిజ్ఞానం ఉన్న వీర

భూపతి తల్లిదండ్రుల ఆజ్ఞను తన విధ్యుక్త ధర్మంగా భావించి తాను వివాహమాడిన యువతిని ప్రేమగా చూడనారంభిస్తాడు.

అది కుట్టాన్ చేయలేకపోతాడు. ఇవి అన్నీ ఫ్లాష్ బాక్‌లో చూపబడతాయి. కథ ప్రారంభం అయ్యేనాటికి కుట్టాన్‌కు ఏకవీరతో వివాహం కావటం, వారి సాంసారిక జీవితం ఆనందదాయకం కాక పోవటం జరుగుతుంది. ఆ సమయంలో వీరభూపతి ఏకవీరను ప్రేమించడం; దానికి ఆటంకాలు; తన వివాహవిషయంలో తల్లిదండ్రుల ఒత్తిడి ఇవి చర్చించబడ్డ విషయాలు.

ఈ సంఘటనలన్నింటినీ ఈ విధంగా క్రోడీకరింపవచ్చు:

ముందు కుట్టాన్ తన కథ వీరభూపతితో చెప్పడం; తరువాత వీరభూపతి తన కథను కుట్టాన్‌తో చెప్పడం; నిజానికి ఇద్దరిదీ ఒకటే కథ: విఫల ప్రేమ.

కుట్టాన్ వివాహితుడు కావడం; అతడు ఏకవీరను ప్రేమానురాగాలతో చూడలేకపోవడం; వీరభూపతి తల్లిదండ్రుల బలవంతం మీద మీనాక్షిని వివాహం చేసుకోవడం, మీనాక్షి భర్తతో సమంగా ఉండకపోవడం; అందులోకూడా కొంత అంతరం కనిపిస్తుంది. కుట్టాన్ ఏకవీరను చూడనేచూడడు. చూసినా ఆమెను స్పృశించడు. మీనాక్షి భర్తకు సకల సపర్యలు చేస్తుంది. కాని సంయోగం మాత్రం నిషిద్ధం. ఇంతవరకు కథలో రెండు సమస్యల ముడులను కట్టాడు రచయిత.

ఈ ముడులు విప్పడం చిత్రంగా జరిపిస్తాడు విశ్వనాథ. వీరభూపతి మాటలు — అతడు భర్తగా తన ధర్మాన్ని నిర్వర్తించాలన్న సూచన — కుట్టాన్‌కు కొంతవరకు ఏకవీరయెడ దయను కలుగ చేస్తాయి.

అతని పరమేశ్వరసముద్ర ప్రయాణం, అక్కడ తల్లి ఏకవీరను గూర్చి చేసిన ప్రసంగం, తన వెనుకటి భావానికే బలం చేకూరు

స్తుంది. మీనాక్షి ఇంట్లో ఆమెను కలుసుకోలేకపోవటం, ఆమె యెడ తన ప్రణయం వ్యర్థమన్న విషయం అతనికి తెలుస్తుంది. వెంటనే మధురకు ప్రయాణమై తాను ప్రేమించటానికి ప్రయత్నం చేస్తానని ఏకవీరకు వాగ్దానం చేస్తాడు.

ఇంతలో వీరభూపతి వివాహం, అతడు స్థానాపతి కావడం, భార్యతో మధురలో కాపురం పెట్టడం జరుగుతాయి. కుట్టాన్ ఏకవీరకు దగ్గరగా రావడానికి ప్రయత్నం చేస్తున్నకొద్దీ మీనాక్షి వీరభూపతికి దూరంగా ఉండడానికి ప్రయత్నం చేస్తుంది. కుట్టాన్‌కు ఒకవంక పశ్చాత్తాపం, వేరొకవంక తన పూర్వ ప్రేయసి జ్ఞాపకం.

"నా భార్యయంతఃపురములో ఒడలిపోవుచున్నది. ఈ యప్రతిష్ట ఎన్నాళ్ళని భరింతును" అన్నాడు కుట్టాన్. అతనిని అనునయించడానికి వీరభూపతి తన గాథ చెప్పుకుంటాడు. కుట్టాన్ నిజం గ్రహిస్తాడు. అది కుట్టాన్‌లో మార్పుకు మొదలు. కుట్టాన్ ఏకవీరకు ఎంత దగ్గరగా ఉందామని ప్రయత్న చేస్తాడో అంత దూరం కావాల్సి వస్తుంది. ముందు మీనాక్షి కోరిక మీద వారింట్లో అయిదు రోజులు ఉండడం, రాజాజ్ఞ రాగా అటునుంచి అటే రామనాథపురం వెళ్ళడం జరుగుతవి.

కుట్టాన్ ఏకవీరను కలుసుకొని తన మనస్సులోని భావాలను చెప్పనేలేదు. చెప్పాలని ఆత్రత. కాని పరిస్థితుల ప్రాబల్యం! ఇదే నవల విషాదాంతం కావటానికి ముఖ్యబీజం. కుట్టాన్ ఇలా తన ఆనం దాన్ని, ఆమె అంటే తనకిప్పుడున్న అభిప్రాయాన్ని, విప్పిచెప్పక పోవటం వల్లనే భగ్నమైన తన భార్య ప్రేమ నుంచి మానసికానందాన్ని కూర్చే తన ప్రియుని ప్రేమను జ్ఞాపకం తెచ్చుకుంటుంది ఏకవీర. ఇదే ఆమె మరణానికి హేతువౌతుంది.

ఈ కథలో మానవ జీవితాల్లో సహజంగా ఉండే రెండు ధర్మాల మధ్య కల సంఘర్షణను వేరువేరు కలయికలతో విశ్లేషించి

చూపారు విశ్వనాథ. సంఘజీవి అయిన మానవుడు చేసే కార్యాలు రెండు ధర్మాలమీద ఆధారపడి ఉంటాయి. ఆత్మధర్మము, లోక ధర్మము. ఆత్మధర్మము ప్రతి వ్యక్తికి ఆంతరంగికమైన అనుభూతికి సంబంధించిన విషయం. మానవుడు సంఘజీవిగా బ్రతకడానికి సంఘం నియమించిన కట్టుబాట్లకు లోబడిఉండడం లోకధర్మం. ఈ నవలలోని ముఖ్యమైన నాల్గుపాత్రలు ఆత్మధర్మాన్నే అవలంబించి తమ యౌవన ప్రాంగణంలో అడుగు పెట్టినవే! ఉద్వేగ ప్రవృత్తులకు ఇది సహజం. కుట్టాన్ తనకు మీనాక్షియెడల గల ప్రేమ భార్యపై గల ప్రేమకన్న గొప్పదనుకున్నాడు. అలానే మీనాక్షి, ఏకవీర, వీర భూపతులు కూడా. వీరందరిలోనూ లోకధర్మానికి అతి తొందరగా తన ఆత్మధర్మాన్ని సమన్వయం చేసుకున్నవాడు వీరభూపతి. తన కథను కుట్టాన్‌తో చెపుతూ: "అవివాహితుడనుగా ఈ జీవితాంత ముండవలసిన స్థితియున్ననూ నా శరీరముమీద నా కే యధికారము లేకున్నది. వివాహమేమో చేసికొనక తప్పునట్లు లేదు." అంటాడు. ఇందులో అవివాహితుడుగా జీవితాంతం ఉండవలసి రావటం ఆత్మ ధర్మం. తన తల్లిదండ్రులకోసం వివాహం చేసుకోవలసి రావడం లోక ధర్మం.

అలానే ఏకవీర తాను వీరభూపతిని ప్రేమించింది. కాని కుట్టాన్‌తో వివాహం అయింది. ఆమె తన వెనుకటి ప్రేమ ప్రవాహానికి ఆనకట్టకట్టి, కుట్టాన్ ప్రేమను స్వీకరించడానికి నిరీక్షిస్తూ ఉంది. లోకధర్మం ప్రకారం భార్యగా తన విధిని నిర్వర్తించడానికి సిద్ధంగా ఉంది. కాని ఆమెకు దొరికింది భర్తృ తిరస్కారమే! ఈ లోకధర్మంనుంచి ఆమె వ్యథిత హృదయం మెల్లగా తన ఆత్మావిష్కృతమైన మొదటి ప్రేమవైపుకు సాగింది. దాని పర్యవసానమే వీరభూపతి కౌగిలింత.

ఆ కౌగిలింత ఉద్వేగ ప్రణయిని అయిన ఏకవీర శరీరానికి ఎంతో హాయిని కూర్చింది. అది ఆత్మధర్మము. కాని అందుకు విరుద్ధమైన లోకధర్మముకూడ ఆమెకు తెలిసినది కావడంవల్ల "నా యెడల మహాఘమున్నది, దీనిని క్షాళనము చేయవలెను" అంటూ వైగై నదివైపు పరుగెత్తుతుంది. కాని లోకధర్మ ప్రవృత్తి ఒకవంక, తన తప్పిదము వేరొకవంక కుట్టాన్‌ను వెనుకముందులాలోచింప నీయలేదు. మాటలతో ఏకవీరకు సమాధానం చెప్పక అతడు ఆమెను కౌగలించుకుంటాడు. అది "విజాతీయమైన స్పర్శ" అంటాడు రచయిత. అంటే ఆత్మధర్మానుసారంగా తను మొదటి స్పర్శకే పులకిత అయిన ఏకవీరకు ఇది విజాతీయం. వీరభూపతి స్పర్శతో అపవిత్రమైన ఆమె శరీరం వైగైలో ప్రాణాలతోసహా అర్పించుకుంటేకాని పవిత్రంకాదు.

ఈ నవలలోని స్పర్శ సిద్ధాంతాన్నిగురించి చాలామంది ఇదివరకే చెప్పిఉన్నారు. ఈ సిద్ధాంతం నవలలోని ఆయా వ్యక్తుల ఉద్విగ్నతను, ఆ ఉద్వేగాల పరాకాష్ఠను చూపడానికి ఎంతగానో సహాయకారి అయింది. పరిస్థితులూ, తన చుట్టు ఉన్న లోకాన్ని అంతా మరిచిపోయి భౌతికమైన లోకాన్ని మించిన ఆత్మసంచలనంమాత్రమే ఉండిపోయిన ఏకవీర చేతుల్ని చాచి వీరభూపతిని ఆహ్వానిస్తుంది. కాని తన పరిస్థితులు తెలిసివచ్చాక ఆమె నివ్వెరపోతుంది.

తుట్టతుదకు ఈ లోకధర్మ, ఆత్మధర్మాల సమన్వయం ఆమె ఆధీనంలో లేనిదై, భర్తకోరే లోకధర్మానుగుణమైన ప్రణయాన్ని తాను అతనికి పంచి ఇవ్వలేకపోతుంది. ఆమె భర్తను చూచి వైగై వైపు పరుగెడుతుంది.

కుట్టాన్ ఆమెను వైగై నది అంచున ఆగమని ఆజ్ఞాపిస్తాడు. ఆమె భర్తృ ఆజ్ఞానువర్తి. ఆగిపోయింది. అతడు బలవంతాన ఆమెను స్పృశిస్తాడు. ఆ స్పర్శ-ఒక్కొక్క అవయవాన్ని స్పృశించినంతనే - ఆమెలో ఆ అవయవం యొక్క చైతన్యం నశిస్తుంది. ఆమె

పెదవులను అతడు ముద్దుపెట్టుకుంటాడు. ఆమె అచేతన మూర్తి అయి వైగైలో పడిపోతుంది.

విజాతీయ స్పర్శ సున్నితమైన వ్యక్తిత్వం కల వ్యక్తుల (Sensitive people) యెడ ఎట్టి సంచలనం కలుగచేయగలదో ఏక వీర ద్వారా మనకు చూపబడ్డది. అది ఆత్మధర్మమూ, లోకధర్మమూ కూడా అయినప్పుడు ఆ స్పర్శ ఎంత ఆనందాన్ని కలుగచేస్తుందో విశ్వనాథ మిగిలిన నవలలో (వేయిపడగలు వంటివానిలో) చూపారు.

ఇందులోని ప్రధానపాత్రలను గురించి చెప్పవలసివచ్చినప్పుడు కుట్టాన్, ఏకవీరలలోని ఉద్విగ్నతను గురించి చెప్పుకోవాలి. ఇద్దరూ ఉద్వేగం ఒకపాలు ఎక్కువ ఉన్నవారే! ఇద్దరూ తమతమ ప్రణయ కథలకు స్వయంగా శ్రీకారం చుట్టినవారే! ఇద్దరూ తమ ప్రేమలను భద్రంగా చాలారోజులు మనస్సుల్లో దాచుకున్నవారే! ఇద్దరూ నిగ్రహంలేనివారే!

ఈ నవలలో విశ్వనాథ చూపిన శిల్పచాతురి - అంతా వారి వారి ఉద్వేగాలు మనుష్యులను ఎలా స్వాధీనం చేసుకుంటాయో చూపడమే. ''అతి'' అయిన ఉద్వేగం విషాదాంతానికి దారితీయక తప్పదనీ, సంఘమూ, లోకమూ, ఆమోదించిన ధర్మాన్ని స్వీయ ధర్మంగా స్వీకరించాలని ఆయన వాదం. ఈ వాదం శిల్పంలో ఒదిగి పోయి ఈ నవలలో అతి మనోహరంగా చిత్రించబడ్డది. అయితే విశ్వనాథ తరువాతి నవలలలో కథ తక్కువై, ఈ వాదం ప్రధానమై ఒక సిద్ధాంత ప్రచారకుడిలా కన్పిస్తాడు విశ్వనాథ.

ఈ నవల ఉత్తమత్వానికి విశ్వనాథ కథాకథన చాతురికూడా కారణమే! కుట్టాన్, వీరభూపతుల కథలు అవి జరిగిపోయాక చిత్రించడం; అందులోను వీరభూపతి తల్లిదండ్రులకోసం తాను "ఈ శరీరం నాదికాదు" అన్న లోకధర్మాన్ని ప్రపంచించి తద్వారా

కుట్టాన్‌కు హితబోధ చేయటం - చక్కని ధ్వని కావ్యంలా సాగుతుంది.

ఈ ధ్వని ఈ నవలలోని చివరి మూడు అధ్యాయాల్లోనూ చూపబడ్డంతగా మరి ఏ యితర తెలుగు నవలలోను చూపబడలేదనుకుంటాను. అది సిద్ధేంద్రయోగి కథ. ఐహికమూ ప్రాపంచికము అయిన తన ప్రణయానుభూతుల్ని, సత్యాకృష్ణుల ప్రణయాత్మకమైన దివ్యానుభూతులుగా చూపడానికి సన్యసించినవాడు ఆయన. అట్టి యోగి వ్రాసినది భామాకలాపము. ప్రదర్శించేది కళలో అజేయులైన కూచిపూడివారు. భామవేషం వచ్చింది. ఆమె వాసవసజ్జికను అభినయిస్తోంది. ఆ వాసవ సజ్జిక తానే అయినది ఏకవీర. ప్రియాగమ నిరీక్షణ చేస్తున్న ఆమె యింకా కళా లోకంలోనే విహరిస్తున్నది. వీరభూపతి కౌగిలింత ఆమె మనస్సును హత్తుకోలేదు. అది కేవలం బాహిరమైన అనుభూతి. ఆ బాహిరమైన అనుభూతిని మానసికం చేసుకొన్నప్పుడే ఆ అనుభూతికి సంపూర్ణత్వం సిద్ధిస్తుంది. కాని ఆమె విషయంలో అది అసంభవం. అందువల్లనే ఆమె శరీరం విజాతీయమైన స్పర్శకు తట్టుకోలేకపోయింది. అయితే అంతకుపూర్వమే ఆమె మనస్సు మరొకరికి అంకితమైపోయింది. తద్విరుద్ధమైనది శారీరకమైన అనుభవం. ఆ రెంటికీ సమాధానం కుదరలేదు. అందువల్లనే తాను వైగైలో కలసి తన్నుతాను క్షాళనం చేసుకోవడం తప్ప వేరు గత్యంతరం లేదనుకొన్నది.

అయితే ఏకవీర ఈ స్థితిలో కూడా క్రైస్తవ మతబోధకుడైన రాబర్టు నోబిలితో వాదనలోకి దిగటం, అతన్ని ఓడించటం ఈ నవలలోని ఒక విచిత్రమైన సంఘటన.

ఏకవీర సుందరేశ్వరుని కెదురుగా నిలబడ్డది. స్వామి అన్నివ్రాళ్లుగా యిట్టి "సంకల్పవికల్పములు సహస్రముఖముల విజృంభించు మనస్సునకై ప్రతీక్షించుచుండెను. ఆమె ఏకవీర. స్వామి ఆమెయందు

ప్రవేశించెను. రాబర్టునోబిలి చేయుచున్న హిందూమత వ్యతిరేకమైన ప్రచారమును ఆపుచేయవలెనన్నది చొక్కనాథ శివుని యాజ్ఞ. ఏకవీర కది వినబడినది.'' రాబర్టునోబిలి వచ్చాడు. ఆమె వాదించింది. ఆ వాదనతో అతని సిద్ధాంతాలను ఖండించి తనమతాన్ని నిలబెట్టుకొంది.

మతము ఎంత వ్యక్తినిష్టమో అంత సమాజనిష్టము. వ్యక్తి నిష్టమైన మతము సమాజనిష్టమైన మతముతో తాదాత్మ్యం చెందాలి. ఆత్మధర్మాన్ని అనుసరించి లోకధర్మాన్ని విస్మరించడంవలన ఏకవీర ఈ ధర్మాన్ని అతిక్రమించింది. కాని సుందరేశ్వరుడామెకు జాతిధర్మాన్ని నిలబెట్టవలసిందిగా ఆదేశించాడు. అది వ్యక్తి ధర్మం కన్న గొప్పది. సమాజ శ్రేయస్సుకు సంబంధించినది. తన జీవితము, సరే; సర్వవిధముల తనకు నిరుపయోగము. కాని తన జీవితంలోని సర్వశక్తులను సంఘంకోసం, దానికి మంచినికూర్చే మతంకోసం వ్యయం చేసింది. అందువల్లనే విశ్వనాథ అంటాడు. "భర్త జీవితము సుఖపరుపవలెనని తల్లి నేర్పించిన ఏకవీర చదువు శ్రీ సుందర చొక్కనాథ శివుని కుపయోగ పడినది.'' అని-నిజం. భర్తకు ఉపయోగించడానికి తాను సంసారం చేయబోవడంలేదు. అందువల్ల ఇది లోక కళ్యాణానికైనా ఉపయోగపడాలని సుందరేశ్వరుని ఆజ్ఞ; ఆమె కోరిక.

కథాకథన శిల్పాని గురించి చెప్పేటప్పుడు అతిసూక్ష్మమైన విషయాలనుగురించి కూడ విశ్వనాథ ఎంత శ్రద్ధ వహిస్తాడో చూడడానికి ఈక్రింది ఉదాహరణ చాలుననుకుంటాను. కుట్టాన్ తన కథను వీరభూపతికి వినిపిస్తాడు. వీరభూపతి తన కథను కుట్టాన్‌కు చెబుతాడు. ఈ రెండు సందర్భాలలోను అటు కుట్టాన్ కాని, ఇటు వీరభూపతికాని వారివారి ప్రియురాళ్ళను ఏ ఊళ్ళలో చూచారో పేర్కొనబడలేదు. ఆ ప్రసంగం అతి చమత్కారంగా తప్పించి వేయబడ్డది.

వీరభూపతి కుట్టాన్‌ను ప్రశ్నిస్తాడు. ''అది యేయూరు?'' కుట్టాన్ తన ఆవేశంలో, తన్మయత్వంలో ఆ ప్రశ్న వినిపించుకోలేదు.

రెండవసారి వీరభూపతి ముందుగానే చెపుతాడు. కుట్టాన్‌కు ''ఆ యూరిపేరు గాని యేపనిగాని నన్నడగి నామనస్సు గలత పెట్టకుము''.

మొదట కుట్టాన్ వినిపించుకోకపోవడంలో అతని తాదాత్మ్యత, అతని ఉద్వేగ ప్రవృత్తి వ్యక్తం అవుతున్నాయి. అతని మనస్థితి అంతా వ్యక్తం అవుతున్నది.

వీరభూపతి అలా చెప్పటంలో అతని కుటుంబ విషయాలు, దానికి సంబంధించిన బాధలు వ్యక్తం అవుతున్నాయి.

ఈ రెండు సమాధానాలు వారి వారి వ్యక్తిత్వాలను వ్యక్తం చేయడానికి ఉపకరిస్తూనే కథాగమనానికి అతిముఖ్యమైన ప్రశ్నను దాటివేస్తాయి.

తరువాత మరొకసారి వీరభూపతి తన వివాహాన్ని గురించిన ప్రసక్తి తీసుకువస్తాడు. అప్పుడు అసలు ఊరు, పేరు చెప్పడు. తుదకు కుట్టాన్ పరమేశ్వర సముద్రం పోయి మీనాక్షిగారింటికి పోయినప్పుడు తన మనోవ్యగ్రతలో మీనాక్షి తల్లి చెప్పిన మాటలు — ''వారు రాజ వల్లి పురము కాబోలు వెళ్ళినారు'' — కుట్టాన్ వినిపించుకోలేదు. అది సహజమే! ఇన్నినాళ్లుగా ఏ ప్రేయసిని మనస్సులో ప్రతిష్టించు కున్నాడో, ఆమెను చూడాలనే ఆతురత, ఆమె కనిపించదేమన్న బాధ, తాను రాగానే వెళ్ళిపోయిందన్న విషాదం - యివి అన్నీ కలిసి ఆ 'పిచ్చిబాగుల తల్లి' చెప్పిన మాటలను కుట్టాన్ వినిపించుకోవడానికి వీలులేకుండా చేశాయి.

ఈ ఊరు పేర్లను యింతవరకు ఒకరికొకరికి తెలియకుండా పట్టుకురావటం అతిజాగ్రత్తగా చేయబడ్డది. ఇక పరాకాష్ఠ సన్ని

వేశంలో వీరభూపతి వివాహం చేసుకొని వచ్చాక, వారింట్లో భోజనం చేసిన నాటిరాత్రి కుట్టాన్ తనంత తానుగా ప్రశ్నిస్తాడు.

"ఇద్దరు చాలసేపు నిశ్శబ్దముగ కూర్చుండిరి. కొంతసేపయిన తర్వాత కుట్టాన్ నెమ్మదిగ 'నీయత్తవారేయూ' రన్నాడు. వీరభూపతి కొంచెముసేపూరకుండి 'పరమేశ్వర సముద్ర' మన్నాడు. కుట్టానుకేమో యొడలంతయు తేళ్లు ప్రాకినట్లయ్యెను. కుట్టాన్ లేచి నిలబడుచుండెను. 'వీరా! మీ మామగారి పేరు?' వీరభూపతి 'దొడ్డ దేవరాజని' సమాధానమిచ్చినాడు.

కుట్టాన్ 'నీ భార్యపేరేమి' ?

వీరభూపతి 'మీనాక్షి' యన్నాడు.

కుట్టాన్ 'అయ్యో' అని క్రింద బడిపోవుటకు సిద్ధమైనాడు."

ఈ సంఘటనకోసం యింతకాలంగా ఆ ఊరిపేరును ఒకరికొకరికి తెలియకుండా ఉంచడం విశ్వనాథ శిల్ప విన్నాణానికి ఒక ఉదాహరణ.

✓ ఈ నవలలో విశ్వనాథ చూపిన శిల్పచాతురి అంతా ఆయా పాత్రల మానసికోద్వేగాలను ఒకదాని తరువాత మరొక దానిని పరిపుష్టం చేసుకుంటూ పోవడంలో కనిపిస్తుంది. మనస్తత్వశాస్త్రాన్ని సృజనాత్మక రచనల్లో అనుసరించడం పాశ్చాత్య దేశాలలోకూడా ప్రారంభంకాని రోజుల్లో అతి సున్నితమూ, సూక్ష్మమూ అయిన మానసిక భావాలను తన పాత్రల, చేష్టలద్వారా, ఆలోచనలద్వారా వ్యక్తం చేయడమేకాక, ఆ సిద్ధాంతాలనే తన నవలకు ప్రధాన సంఘర్షణగా స్వీకరించాడు విశ్వనాథ.

తెలుగులోని అత్యుత్తమమైన నవలలలో ఏకవీరకు ఒక విశిష్టమైన స్థానం ఉన్నది.

# వేయిపడగలు

ఆధునిక ఆంధ్ర సాహిత్య చరిత్రలో శ్రీ విశ్వనాథ సత్యనారాయణది అద్వితీయమైన స్థానం. ఆయన వ్రాసిన నవలలన్నింటిలోను ఆయన చెప్పదలచుకొన్న భావం ఒక్కటే. సనాతన సంప్రదాయాల విశిష్టత; తరతరాల జాతి సంస్కృతి ఈ కాలంలో పొందుతున్న విచ్ఛిన్నత. సనాతన ధర్మ విశిష్టతను చాటడంతోపాటు అధునాతన విధానాలలోని, విలువలలోని లోపాలను చూపడంలోకూడా ఆయనదే పై చేయి. సాంప్రదాయికమైన విలువలకు, అధునాతనమైన-ముఖ్యంగా ఆంగ్లేయ సంపర్కంతో మనకు సంక్రమించిన విలువలకు మధ్య జరుగుతున్న సంఘర్షణ విశ్వనాథ నవలలలో చాలావాటికి మూలవస్తువు. విశ్వనాథ ఎటువైపుకు మొగ్గుచూపాడో చెప్పనక్కర లేదు. ఆయన తీవ్ర సంప్రదాయవాది. ఆ విలువకే విశ్వనాథ పట్టం కడతాడు.

విశ్వనాథ భావాలకు పరాకాష్ఠ ''వేయిపడగలు''. శిల్పం దృష్ట్యాకూడా ఇది ఆయన నవలలో ఉన్నతమైనది. ''వేయిపడగలు'' ముందు వచ్చిన నవలలు ఒక ఎత్తు; తరువాత వచ్చిన ఉపన్యాసాత్మకాలైన నవలలు వేరొక ఎత్తు. ఈ రెంటికి మధ్య అత్యున్నతంగా నిలచే నవల ''వేయిపడగలు''.

వేయిపడగలు ఒక బృహన్నవల. గాల్స్‌వర్దీ వ్రాసిన ''ఫోర్ సైట్ సాగా''లో వలె ఇందులోను మూడుతరాలవారి జీవితం చిత్రించబడ్డది. ఈ మూడు తరాలలో జాతి జీవిత విధానంలో వస్తున్న మార్పులు, పాశ్చాత్య వ్యామోహంతో దేశంలో ఇన్నాళ్ళుగా నిలిచిన జాతీయత, జాతి ధర్మము — వీని క్రమ క్రమ క్షీణత ఈ నవలలో విస్పష్టంగా చిత్రించబడ్డది.

ఇది ఒక రకంగా చారిత్రక నవల. ఇరవయ్యో శతాబ్దం ప్రారంభం నుంచి మూడు దశాబ్దాలపాటు తెలుగు దేశంలో జరిగిన కథ ఇందులో చూపబడ్డది. ఒక విధంగా చూస్తే 1900–1930 మధ్య కాలంలో తెలుగు దేశంలో వచ్చిన ఆర్థిక, సాంఘిక, రాజకీయాల పరిణామ చరిత్ర "వేయిపడగలు" అని చెప్పవచ్చు. విశ్వనాథవారికి మన పూర్వ ఆచారాలన్నా నాడు మన పెద్దలు నియమించిన సంఘ వ్యవస్థ అన్నా ఎంతో మక్కువ. కొన్ని వేల సంవత్సరాల నుంచి భారతీయ సంస్కృతికి, సంఘవ్యవస్థకు వివాహ వ్యవస్థ కేంద్రమై వున్నది. పాశ్చాత్య వ్యామోహంతో పైపై మెరుగులతో వివాహ వ్యవస్థ అన్నా, పూర్వ ఆచారాలన్నా, దైవభక్తి అన్నా, ప్రజలలో కనిపిస్తున్న నిరాదరణ ఆయనను ప్రతిక్షణం బాధపెట్టింది. ఈ వేదనకు పర్యవసానమే "వేయిపడగలు" రచన. ఈ రచనలో ప్రతిక్షణము మనకు విశ్వనాథ వ్యక్తిత్వము, ఆయన భావనాబలము ద్యోతకం అవుతూనే వుంటాయి. విదేశపాలన యెడ కలిగిన వైముఖ్యం మనలో జాతీయోద్యమ భావాన్ని ఎంతగా మేల్కొలిపిందో, పాశ్చాత్య నాగరికతా ప్రభావం వారి మత, నైతిక భావాల ప్రభావం, మనలో అంతటి వైముఖ్యత కలిగించలేదు. విశ్వనాథ భావనలో రాజకీయమైన జాతీయత కూడా అంత ముఖ్యమైనదే.

విశ్వనాథ రచనలో తీవ్రమైన తర్కము, నిశితమైన అవహేళన కన్పిస్తాయన్నది అందరూ చేసే విమర్శ. వెల్లువలా వస్తున్న పాశ్చాత్య నాగరికతా వ్యామోహం ప్రజలనందరినీ ఒక్కుమ్మడిగా ముంచివేయకుండా చేయడానికి విశ్వనాథ తన శక్తి సామర్థ్యాలనన్నింటిని కూడగట్టుకొని ఎదిరించవలసి వచ్చింది. ఆయన తన భావాలయెడ మామూలుగా చేయబడే విమర్శలను దృష్టిలో వుంచుకొని వాటికి సమాధానంగా తర్కబద్ధమైన తన అభిప్రాయాలను వివరించాడు.

ఒకవంక పాశ్చాత్య నాగరికతను, మత దృష్టిని, సాంఘిక భావాలను వివరిస్తూ అశేషమైన రచనలు తెలుగులో వ్రాయబడుతున్నప్పుడు అందుకు భిన్నంగా నిలిచి ప్రవాహానికి ఎదురీదడానికి సిద్ధపడినవాడు విశ్వనాథ.

ఈ నవలను చదివేటప్పుడు ప్రాథమికమైన కొన్ని భావాలను, రచయిత నమ్మిన కొన్ని సత్యాలను మనం ఆమోదించడం అవసరం. ఆ భావాలలో నమ్మిక లేకుంటే ఈ నవల అంతా పనికిరాని పాత కాలం పిచ్చిగా మాత్రమే చూడగలం. మరణిస్తున్న ఒక వ్యవస్థకు, కొనవూపిరితో వున్న కొన్ని సాంఘిక మర్యాదలకు జీవం పోద్దామన్న ఆశగల రచయిత విశ్వనాథ.

వేయిపడగలు ముప్ఫై ఏళ్ళ తెలుగుజాతి జీవితానికి ప్రతి బింబం. విదేశపాలన, దాని మంచి చెడ్డలు, జమీందారీలు, వాని వ్యవస్థ, సహాయ నిరాకరణోద్యమం, దాని ప్రభావం—ఇవి అన్నీ కలసి ఒక జాతిని ఏ విధంగా నడిపించాయో తెలియజేస్తుంది, ఈ నవల.

"వేయిపడగల"ను విమర్శించిన వారందరూ ఇది కావాలని ఎదురీదుతున్నది అన్న విమర్శ చేసినవారే. కాని పాశ్చాత్య నాగరికత మనదేశంలో ప్రవేశించి మన విద్యలను, మన సంగీత సాహిత్య నాట్యాలను, మన లలిత కళలను ఏ విధంగా భ్రష్టం చేసిందో తెలిసిన వారెవ్వరూ ఈ విమర్శను ఆమోదించరు. సహజత్వం నశించిపోయి కృత్రిమత్వాన్ని మనవారు ఏ విధంగా కౌగలించుకుంటున్నారో అన్ని కోణాలనుంచి చూపించడానికి ప్రయత్నించింది ఈ నవల.

''వేయిపడగలు'' అన్న పేరు సుబ్రహ్మణ్యేశ్వరుని వేయి పడగలను బట్టి వచ్చినది. ఆ వేయిపడగలు వేయి ముఖాలైన భారతీయ ధర్మానికి ప్రతినిధులు. దాని నాలుగు పాదాలు చతుర్విధ పురుషార్థ

ములకు ప్రతీకలు. దాని రెండు పడగలు దాంపత్య ధర్మానికి చిహ్నాలు. మూడువందల ఏండ్లకిందట ధర్మం సంపూర్ణంగా అవలంభింపబడ్డప్పుడు సుబ్రహ్మణ్యుని వేయిపడగలు దేశాన్ని కాపాడాయి..

"పిరన్ననాయని వంశమువారు స్వామికి ప్రతినిధులు.. బ్రాహ్మణ వంశమువారు ప్రచారకులు. కాపు వంశపుటాడుపడుచులు స్వామికి వ్యాఖ్యాతలు. ఈ రీతిగా భూమ్యాకాశముల మధ్య, స్వర్గ మర్త్య లోకముల మధ్య, ప్రత్యక్షా ప్రత్యక్షముల మధ్యనొక స్థిరమైన సంబంధమేర్పడెను.

ఇది నాల్గు స్తంభముల ధర్మమంటపము. స్వామి, జమీందారు, బ్రాహ్మణుడు. గణాచారి —వీరు నల్గురు స్తంభములు.

ఈ ధర్మ మంటపము నిత్యకల్యాణము పచ్చతోరణముగ మూడువందల ఏండ్లు నిరంతరముగా శోభాయమానమై యొప్పెను. ఈ మూడువందల ఏండ్లలో వేయిపడగలతో భాసించిన నాగేశ్వర స్వామి సుబ్బన్న పేటమీద తన సహస్రఫణామండలి ఛత్రముగా జాచి యా చల్లని నీడలో నా యూరి ప్రజల జోకొట్టెను."

"వేయిపడగల పాము విప్పారుకొని వచ్చి
కాటందుకొన్నది కలలోన రాజును"

అన్న వ్యాఖ్యానాత్మకమైన గీతంతో నవల మొదలవుతుంది. ఈ వేయి పడగల పాము—ధర్మాన్ని పరిరక్షించిన నాగేశ్వరుడు —ఈ నాడు ధర్మచ్యుతి కలుగుతున్నప్పుడు తన వేయి పడగలను విరమింప చేసుకొన్నాడు. నాల్గు పడగలతోనే నిలిచినాడు కొన్నాళ్ళు. ఈ నాల్గు పడగలలోను ధర్మ మోక్షములు నశించి అర్థ కామములే మిగిలినవి. ఈ అర్థ కామములు ఆధునిక జీవితానికి పరమార్థాలు. ఇవికూడా ధర్మనిబద్ధములై వున్నప్పుడు స్వామి రెండు పడగలతో కనిపించాడు. ఈ రెండు పడగలు దాంపత్య జీవితానికి చిహ్నం. ధార్మిక నిష్ఠ

కలిగిన అర్థకామాలే స్వామి రెండు పడగలు. వానికికూడా వినాశనం కలిగినప్పుడు సర్వ భారతీయత నాశనం కావలసినదే! ఈ వివాహ వ్యవస్థ దేశంలో నిలదొక్కుకుని ఇన్ని వేల ఏండ్లనుంచి అవాంతరాలు లేకుండా వస్తున్నందువల్లనే స్వామి రెండవ పడగ గాయపడినా అక్షతమై మళ్ళీ మళ్ళీ రూపసౌష్ఠవాన్ని పొందుతున్నది. ఈ దాంపత్య ధర్మము ఒక్కటి చాలు. భారతీయ సంస్కృతి నిలిచి వుండడానికి అన్నభావం ఈ నవల మనకందించే సందేశం.

ఈ నవలలో భారతీయ సంస్కృతిని ఒకవంక పాశ్చాత్య వ్యామోహాన్ని వేరొకవంక ప్రతిబింబించడానికి రెండు వర్గాల పాత్రలు సృష్టించబడ్డాయి. అరుంధతి, శశిరేఖ, గిరిక, ధర్మారావు, కిరీటి, పసరిక, రాఘవరావు వంటివారు ప్రాచీన సంస్కృతిలోని ఒక్కొక్క మహోత్కృష్టమైన గుణాన్ని నిరూపించడానికి మూర్తి దాల్చిన ప్రతీకలు. రంగారావు, రామేశ్వరము, మంగమ్మ, రాధాపతి, వంటివారు పాశ్చాత్య నాకరికతలోని దుర్మార్గాలను ప్రతిబింబించిన వారు.

"వేయిపడగలు" సర్వ భారతీయాత్మకు వ్యాఖ్యానము వంటిది. ప్రాచీన సంస్కృతికి ప్రతీకలనదగిన ఒక్కొక్కరు చనిపోవడాన్ని, ఆ భావం దేశంలోనుంచి క్షతమై పోవడంగా నిరూపించారు రచయిత. ఈ విధంగా చూస్తే ఇది ఒక గొప్ప ధ్వనికావ్యం. మహారాజు కృష్ణమ నాయనింగారితో ధర్మబద్ధమైన రాజత్వం నశించింది. అలానే రంగారావుగారి మొదటి భార్యతో రాణీత్వము నశించంది. రామేశ్వర శాస్త్రితో చాతుర్వర్ణ్య వ్యవస్థ రూపుమాసింది. త్రైవిద్యలు నశించాయి. గిరికతో భాగవత ధర్మము, పసిరికతో వ్యావసాయిక స్వచ్ఛత్వములు నశించాయి. "ఇందరు నశించగా ఇంకనేమి మిగిలినది?" అని ప్రశ్నించుకొన్నాడు ధర్మారావు. చిన్న అరుంధతి ద్వారమువద్ద నిలుచున్నది. "అవును నీవు మిగిలితివి. ఇది నా జాతి

శక్తి. నా యదృష్టము. నీవు మిగిలితివి.'' అన్న ధర్మారావు మాటలు విశ్వనాథ వివాహ వ్యవస్థకు చేసిన వ్యాఖ్యానం.

ప్రాచీన భారతీయ వ్యవస్థలో జమీందారులకు ఎంతో ప్రాధాన్యంవున్నది. రాజు దేవునికి ప్రతినిధి అనుకొన్నప్పుడు జమీందారు ధర్మాధర్మ విచక్షణతో రాజ్యాన్ని చేశాడు. జమీందారీ పదవి అధికార ప్రాబల్యానికి మూలమనుకొన్నప్పుడు రంగారావువలె నిరంతరము దానికి వ్యగ్రతనే తెచ్చిపెట్టారు జమీందారులు. ఒక చిన్న హారప్ప, ఒక చిన్న అరుంధతి - వీరు ప్రాచీన సంస్కృతికి ఇంకా అక్కడక్కడ మిగిలివున్న ధర్మఖండికలు. అవే జాతికి ప్రాణం..

ఈ నవలలో ఇన్ని పాత్రలు, ఇన్ని సన్నివేశాలు ఉండడంవల్ల వస్త్వైక్యత లోపించిందన్న ఒక అపప్రథ దేశంలో వున్నది. కాని అది ఈ నవలను చదవనివారు అనేమాట. ధర్మారావు కథ ఈ నవలలో ముఖ్యమైనది. ఈ జాతిని నిలబెట్టే స్తంభాలలో ధర్మారావు ఒకడు. అందువల్లనే అతన్ని ముఖ్యంగా తీసుకుని మిగిలిన మూడు స్తంభాలైన రాజు, గణాచారి, స్వామి – కథలను అసలు కథతోపాటు నేర్పుగా కూర్చాడు రచయిత.

స్వామి కథ అనగానే ఆయన సహస్ర ఫణిత్వము మనకు గోచరిస్తుంది. అందునుంచి ఆయన నాలుగు పడగలు, తరువాత ఆయన రెండు పడగలు – ఇదీ భారతీయ నాగరకత చరిత్ర.

స్వామి కథకు, గిరికకు దగ్గరిసంబంధం ఉంది. ఆమె దేవదాసి. భగవంతునికి తన సర్వస్వమునూ అర్పించింది. దేవదాసిత్వము పూర్వం అందుకోసమే సృష్టించబడ్డది. ఆ సంస్థలో చివరిమెరుపు గిరిక. ఆమె చరిత్ర దేవదాసిత్వ చరిత్రే. అంతేకాదు నాట్యశాస్త్ర చరిత్రకూడా. ఆమె ముగ్ధయై, మధ్యయై, ప్రౌఢయై, అభిసారికయై, వాసవసజ్జికయై, నాట్యశాస్త్రాత్మకమైన ఆత్మ పరమాత్మల ఐక్యమును

మహోత్కృష్టమైన కళారూపంలో ప్రస్ఫుటం చేసింది. గిరిక అంటే భగవద్భావానికి ప్రతీక. భరత శాస్త్రానికి వ్యాఖ్యానం. ఆమె స్వామిలో కలిసిపోవడం భక్తికి ఆధ్యాత్మిక నిర్వచనం. ''మా తల్లి దేవదాసి చనిపోయినది. భగవద్భావమంతయు నాశనమైనది, దేవుడే చనిపోయినాడు.''

ఈ నవలలో పసరిక ఒక విచిత్రమైన సృష్టి. అతడు భారతీయ వ్యావసాయిక నిష్టకు ప్రతికృతి. దేవ మాతృకల ప్రతినిధి. వృక్షాల్ని ఛేదించి అన్ని పొలాలను మాగాణం చేస్తున్నప్పుడు నిలవడానికి తావులేక మరణించినవాడు పసరిక. పాముగా పుట్టి, మనిషై, పాముగానే మరణించినవాడు పసరిక. ''ఒత్తుకొని వచ్చు నదేవమాతృకల ముందాతడు నిలువలేక'' చనిపోయినాడు.

ఈ నవలలోని ప్రతి చిన్న పాత్రకూడా ఏదో ఒక ఉద్దేశంతో ఒక భావాన్ని చెప్పడానికే చిత్రించబడ్డది. గోపన్న, నాయరువంటి వారు ఏ సంఘంలోనైనా ఉంటారు. కాని విశ్వనాథ తాను సృష్టించిన ప్రతి చిన్న పాత్రను అతి స్పష్టంగా, వివరణాత్మకంగా మన ముందు ఆ వ్యక్తి సాక్షాత్కరించే విధంగా సృష్టించాడు.

నాయరు భక్తుడు, కష్టజీవి. ఎన్నో కుటుంబాలకు సహాయం చేసినవాడు. తనకు ద్రోహం చేసినవారికి కూడా సహాయంచేసేటంత సజ్జనుడు. అలాగే గోపన్న.

ఈ నవలలో సమకాలీన సమాజాన్ని ఉగ్రరూపతలూగించిన సహాయనిరాకరణోద్యమం సవిస్తరంగా చిత్రించబడ్డది. రాఘవరావు జాతీయనాయకులకు ప్రతినిధి. తన సర్వస్వాన్ని, చివరకు ఆరోగ్యాన్నికూడా దేశమాత శృంఖలాలను విడగొట్టడానికి త్యాగం చేసిన ధీరుడు. కేశవరావుగారు జాతీయ కళాశాలను స్థాపించి పూర్వవిద్యా సంస్థలను బ్రతికిద్దామనుకొన్నవాడు.

ఇందులో మరి రెండు కథలను గూర్చిన ప్రస్తావన అవసరం. అవి మంగమ్మ రంగారావుల కథలు. ఇవి రెండు ఆత్మ పరివర్తనాన్ని సూచించేవి. మంగమ్మ వివాహ వ్యవస్థను కాదని చెడిపోయింది. కాని అంతలో ఈ కొత్త జీవితంలోని అసహ్యాభారమంతా ఆమె అనుభవిస్తుంది. ధర్మ విరహితమైన కామ ప్రవృత్తియెడ ఆమె వైముఖ్యంచెంది ధర్మారావుకు ఏకలవ్య శిష్యురాలై తన్ను తాను సంస్కరించుకుంటుంది.

అలానే రంగారావు కథ. పాశ్చాత్య వ్యామోహం, దానితోపాటు వివాహ వ్యవస్థ అంటె అయనకున్న అలసత్వము ఆయనను ఇష్టంవచ్చిన పథంలో నడిపిస్తాయి. దేశీయ వైద్యాన్ని నిరసిస్తాడు దేశీయవిద్యనూ నిరసిస్తాడు. జబ్బుపడ్డ రంగారావుకు తన కొడుకైన చిన్న హసన్న జ్ఞానోదయం కలిగిస్తాడు. మారిన రంగారావు ఒక కొత్తవ్యక్తి. అతనిలో పాతవాసనలు వున్నా దానితోపాటు సంప్రదాయాన్ని అనుసరించడం నేర్చుకున్నాడు. అది ఎందుకో తెలియదు. అందులో నిష్ఠ లేదు. కాని తన కొడుకు చూపించిన దారికనుక దానిని అనువర్తించాలన్న ప్రయత్నం. 1930 లో తెలుగు యువకుడు రంగారావు స్థితిలో వున్నాడు. ఈనాటి తెలుగు యువకుడు చెడిపోయినప్పటి రంగారావు వంటివాడు. దేనిలోను నమ్మకంలేదు; దేనిని లోలోతులకు తరిచిచూచే ప్రత్యయం లేదు; పైపై వ్యామోహాలే అతనికి నిజాలు.

పసరిక దేవ మాతృకలకు ప్రతినిధి అని చెప్పాను. క్షేత్రాలన్నీ దేవమాతృకలనీ, నదీ మాతృకలనీ రెండు రకాలు. దేవమాతృకలంటే మేఘములపైన ఆధారపడిన భూములని అర్థం. ఈ భూములు వృక్షాల సహాయంవల్ల ఎక్కువ ఫలసాయాన్నిస్తాయి. పసరిక పాత్ర ఈ దేవ మాతృకలకు ప్రతీక.

సర్పరాజు విజ్ఞానానికి అధిదేవత అయినట్లే వ్యవసాయానికి కూడా. భూమిని సారవంతం చేయడానికి శతధా ప్రయత్నం చేస్తూ వుంటాడు. పసరిక ఈ సర్పమానవ జాతుల మిశ్రమ స్వరూపం. ఈ సర్పత్వం అతనిలోని దేవమాతృక భావానికి ప్రతిబింబం. అతడు సర్పమూర్తిని విడనాడి మానవుడుగా పాశ్చాత్య వ్యామోహాలకు లోనైనవాడుగా కనిపించినప్పుడే అతడు మృతప్రాయుడు.

ఈ నవలలో విశ్వనాథవారు స్పృశించని విషయమంటూ లేదు. సాహిత్య విమర్శ సాంఘిక శాస్త్రము, వేదాంత శాస్త్రము, నాట్యశాస్త్రము, పునర్జన్మ సిద్ధాంతము మొదలైన అన్ని విషయాలను గురించిన చర్చ దీనిలో కానవస్తుంది. ఇవి అన్నీ ఆయా పాత్రల సంభాషణలలో ఒదిగిపోయి కథా గమనానికి పరిపోషకములుగా ఉంటాయి.

చివరకు ఒక్కవిషయం చెప్పాలి. అది విశ్వనాథ వర్ణనా చమత్కృతి. ఇది ఒక ప్రత్యేకమైన వ్యాసం వ్రాయడానికి తగిన వస్తువు. విశ్వనాథకు వర్ణనలంటే అమితమైన అభిమానం. ఈవర్ణనలు కేవలం బాషాభేషజాన్ని ప్రదర్శించడానికి కాదు. ఈవర్ణనలు ఎంతో అర్థవంతాలు. ఒక్కొక్కప్పుడు వాతావరణ సృష్టికి మరొక్కప్పుడు పాత్ర సృష్టికి, మరొకప్పుడు మనోభావ వ్యాఖ్యానానికి ఈవర్ణనలు ఆలంబనలు. తొమ్మిది రోజుల స్వామికల్యాణ వర్ణన ఈ నవలలో ఒక మణిపూస.

ఈ వర్ణనలు. ఇతివృత్త నిర్మాణంలో ప్రత్యేకమైన, ప్రతీకాత్మకమైన స్థానం కలిగిఉన్నాయి. ఋతువర్ణన, ప్రకృతి వర్ణన ఆయా పరిస్థితులకు అనుగుణంగా, వ్యాఖ్యానాత్మకంగా వ్రాసి ఆ పాత్రలను సన్నివేశాన్ని మనముందు ప్రత్యక్షంగా చూపగలిగారు విశ్వనాథ.

ఈ విధంగా విశ్వనాథ ప్రతిభా పాండిత్యాలను రచనాశిల్పాన్ని వేయి ముఖములుగా ప్రతిబింబించిన ''వేయి పడగలు'' ఒక మహాసృష్టి. అసంప్రదాయికమైన, విజాతీయమైన, సంస్కృతికి, జాతీయమైన, సర్వధర్మాత్మకమైన, భారతీయ సంస్కృతికి మధ్య జరిగిన సంఘర్షణను వ్యాఖ్యానాత్మకంగా చిత్రించిన ఈ నవల విశ్వనాథ నవలలన్నింటిలోను ఉత్కృష్టమైనది. ప్రపంచ నవలా సాహిత్యంలోని ఉత్తమమైన నవలలలో ఒకటిగా పరిగణింపదగిన నవల ''వేయి పడగలు''.

# దైవమిచ్చిన భార్య

ఆధునిక తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి విప్లవకారుడు చలం. 20వ శతాబ్దం మొదటి భాగంలో తెలుగు సాహిత్య ప్రపంచంలో బయలు దేరిన భావకవితోద్యమంలో పుట్టి, ఆ ఉద్యమానికి అతీతంగా పోయి, తీవ్రవాదిఅయి ఆనాడు ఎవ్వరూచెప్పని నగ్నసత్యాలను-తాను సత్యాలని నమ్మిన వాటిని-ఎంతో శక్తిమంతగా ప్రదర్శించినవాడు చలం. రొమాంటిసిజానికి మౌలిక లక్షణమైన పరిపూర్ణమైన హృదయవాదం చలానిది. మూడు దశాబ్దాల పాటు తెలుగుజాతిని తిట్టి, గిచ్చి, కొత్త కొత్త లోకాలను చూపించాడాయన. స్త్రీ పురుషుల సంబంధాన్ని వాస్తవికంగా నిత్య జీవితానికి అతిసన్నిహితమైన సామాజిక వ్యవస్థగా చూపిన అతిముఖ్యుల్లో చలం మొదటి వాడు.

చలం సాహిత్యమంతా పరిశీలిస్తే కొట్టవచ్చినట్లు కనిపించే విషయం ఆయన స్వీకరించిన కథావస్తువు, దానిని చిత్రించిన విధానం. తరతరాలుగా మగవాడు చూపుతున్న ఆధిక్యత, వాడి అహంకారం కింద పడి నలిగిపోతున్న స్త్రీజాతి ఉద్ధరణ—ఇదీ చలం సాహిత్య సృష్టి సంక్షిప్త స్వరూపం. ఆయన కథల్లోనూ, నవలలలోను ఆయన స్వీకరించిన ఒకే కథావస్తువు స్త్రీ.

చలం నవలల్లో "మైదానం", ''అమీనా'', ''అరుణ'', ప్రఖ్యాతాలు. చలమే తన నవలల్లో ''అమీనా''ను ఎక్కువగా అభిమానించేవాడు. కాని ''దైవమిచ్చిన భార్య'' ఆయన నవలా సాహిత్యంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కలిగివుంది. చలం నవలలన్నింటిని క్రమానుగతంగా పరిశీలిస్తే మొదటి దశలో స్త్రీ

పురుషుల శారీరక సంబంధాలకి మాత్రమే ఆయన విలువనిచ్చాడని పిస్తుంది. చివరి దశలో స్త్రీ పురుషుల సంబంధాన్ని ఆధ్యాత్మికమూ, అలౌకమూ అయిన ప్రణయాన్వేషణ వైపుకు పయనింపచేశాడు. మధ్య దశలో ఈ రెంటి సమన్వయం కన్పిస్తుంది. ఈ దశకు చెందిన ముఖ్యమైన నవల ''దైవమిచ్చిన భార్య''.

అంతేకాదు. సమకాలీన జీవితంలో మిగిలిన అందరు రచయితలను, కవులను స్పందింపచేసిన ఏ ఉద్యమమూ చలాన్ని కదిలించలేదన్న విమర్శ ఆయనమీద ఉన్నది. దానికి ప్రతిగా పేర్కొనదగిన నవల ''దైవమిచ్చిన భార్య''.

చలం నవలలోని కథావస్తువును గురించి చెప్పవలసివచ్చినప్పుడు ఆయనకు తన జీవితం తొలిరోజుల్లో అనుభవవేద్యమైన పురుషుల అహంకారాన్ని, స్త్రీల ఆవేదనను కథావస్తువుగా స్వీకరించడానికి వెనుకనున్న కథను పేర్కొంటూ ఉంటారు.

కార్యం రోజున తనను అబ్బాయి గదిలోకి తోస్తూఉంటే భయపడిన అమ్మాయి ఆక్రందన, సంస్కారంలేని అబ్బాయి ఆమె సంగతి గమనించక తన అమానుషత్వానికి ఆ అమ్మాయిని బలిచేసిన ఆక్రూరవాని పశుత్వమూ—వీనిని పక్కగదిలో ఉండి ప్రత్యక్షంగా విన్న, చూచిన చలం పురుషుల పెత్తనం ''ఇంకానా? ఇకపై సాగదు'' అంటూ తరతరాలనుంచి వస్తున్న ఈ సంబంధంపై తన యుద్ధం ప్రకటించి, స్త్రీల పక్షాన వాళ్ళకు స్వేచ్ఛను ప్రకటించాడు ఈ స్వేచ్ఛ కేవలం ''ప్రణయం''లో మాత్రమేనన్నది మనం ప్రత్యేకంగా గుర్తించవలసిన విషయం.

చలం తన నవలల్లో జీవితంలోని అసత్యాలను ఖండించినంతగా సత్యాలను వెలువరించలేదు. ముఖ్యమైన అసత్యం పురుషులు స్త్రీల యెడ చూపే ప్రేమ రహితమైన మోహం అని చలం ఉద్దేశం. అందువల్లనే చలం విమర్శకు గురిఅయినవాళ్ళలో ప్రథముడు

స్వార్థపరుడైన పురుషుడు. ఆ స్వార్థాన్ని "దైవమిచ్చిన భార్య"లో చూపినంత విస్తృతంగా చలం మరే నవలలోనూ చూపలేదు.

సమాజ నియమాలకు విరుద్ధమైన ప్రేమ ఏ విధంగా హింసకు లోనౌతుందో చూపుతుంది "దైవమిచ్చిన భార్య". సాంప్రదాయికమైన పురుషుని ఆధిక్యతను, పాశవిక బలాన్ని, స్వార్థాన్ని అతినగ్నంగా చిత్రిస్తుంది ఈ నవల.

చలం అన్ని నవలల్లో వలెనే ఈనవలలో కూడా ముఖ్య పాత్రలు ప్రేయసీ ప్రియులే. మిగిలిన వాళ్ళంతా వీరి ప్రేమ జీవితాన్ని భగ్నంచేయ సమకట్టేవారే! పెద్ద జమీందారీ కుటుంబానికి చెందిన పద్మావతి, రాధాకృష్ణ అనే సామాన్యుడు బాల్యంలోనే ప్రేమించుకుంటారు. కాని పద్మావతికి, ఒక రెండో పెళ్ళివాడికి వివాహం అవుతుంది.

ఆ పెళ్ళి అంత చిన్నతనంలోనే రాధాకృష్ణకు ఇష్టం ఉండదు. "పద్మావతి ముక్కు మొహం ఎరుగని ఆయన, ఆ అమ్మాయిచేత దెబ్బలు తినని ఆయన, ఆ అమ్మాయికేమి ఇష్టమో తెలుసుకోని అట్లానే ప్రవర్తించి, ఆ ఆటలే ఆడుకోవటం తెలీని ఆయన, రాత్రీ పగలూ నవ్వుతూ, పాడుతూ, ఆ పిల్లలతో చేతులూ చేతులూ, కలుపుకు తిరగని ఆయన ఎవరో-కొత్తాయన వచ్చి ఏ న్యాయం ప్రకారం నా పద్మావతి మెళ్ళో అప్పన్నికట్టి, నన్ను కూడా పద్మావతి ముట్టుకోనియ్యని, ఆ మెడకి గంధం రాస్తాడు?" అనుకుంటాడు రాధాకృష్ణ.

తిరిగి రాధాకృష్ణ, పద్మావతి పదేళ్ళ తరువాత కలుసుకుంటారు. అప్పటికి రాధాకృష్ణ బి.ఏ. పరీక్షకు వెళ్ళాడు. అందగాడుగా ఎదిగాడు. వాళ్ళిద్దరూ వెనకటి రోజుల్ని జ్ఞాపకం తెచ్చుకుంటారు. రాధాకృష్ణ పద్మావతిని ఆరాధించడం మొదలు పెడతాడు. వాళ్ళిద్దరూ ఇంకా దగ్గరకు వస్తారు. ఆ ఎండాకాలం అంతా వాళ్ళు ఈ ప్రేమ ప్రవాహంలో మునిగిపోయేవున్నారు.

చలానికి ప్రేమ అంటే శరీరవాంఛని తీర్చుకోవడమేననే అభిప్రాయం కలుగుతుంది యీనవల మొదటి భాగాన్ని చదివితే. శరీరాల కలయిక చలం ప్రేయసీ ప్రియుల ప్రేమకు ఆఖరుమెట్టు అనికూడా అనిపించవచ్చు. కాని చలం వాదం అల్లా ప్రేమలేకుండా కేవలం స్త్రీ పురుషులు వివాహంజరిగింది కదా అని శారీరక వాంఛను తీర్చుకోవడం నీచమని. అంతేకాదు వివాహంతో తనకు వచ్చిన అధికారాన్ని అలంబనంగా తీసుకొని మగవాడు ఆడదాన్ని యంత్రంలా వాడుకోవడం నీచాతినీచ మంటాడు. ప్రేమతోపొందే శరీరసుఖం అతిలోక మంటాడు. అటువంటి అతిలోక ప్రేమ రాధాకృష్ణ పద్మావతులది.

ఈ నవలలో పద్మావతి స్త్రీత్వాన్ని గురించి, ఆమె ప్రేమను గురించి ఎన్నో ఉపన్యాసాలు కూడా చెబుతుంది.

"స్త్రీలు యెందుకనుకున్నావు వుంది? జీవితమంటే ఎంత ఉన్నత మయిందో, గాఢమయిందో, పురుషునికి తెలిసేట్టు చెప్పేందుకు. పురుషుల్ని ప్రోత్సహించాలి. స్వర్గానికి యెత్తెయ్యాలి. గొప్ప పనులకి, గొప్ప ఆదర్శాలకి, గొప్ప వూహాలకి ఉత్సాహమివ్వాలి; అగ్నితో నింపెయ్యాలి, నిర్జీవమైన బతుకులోంచి రక్షించాలి. వాగ్దత్తం చెయ్యి. యెన్నడూ యీ సామాన్యపు దేశ సేవకులమల్లే, ప్రజలమల్లే, తుక్కుకింద, యేడుపుకింద, శవాకారంకింద, తయారుకానని, వెధవ బతుకు పాడుమొహాలు వేసుకుని కళ్ళమీద పొరలు కమ్మి, కుళ్ళు నవ్వులు నవ్వుకుంటో, మర్యాదలో, గౌరవంలో, భయంలో, పిరికిదనంలో, ధర్మాచరణంలో, సనాతన ధర్మంలో, మత్తులో కొంచెంగా కొవ్వెక్కి, గుండ్రంగా తయారై, పిర్రలు బలిసి అలా బతకనని ఒట్టెయ్యి."

"ప్రమాణం చేస్తున్నా"

"అదీ నా పద్మావతి - నాకు దైవమిచ్చిన పద్మావతి."

న్యాయమూర్తి వచ్చాడు. పద్మావతి ఆయనతో వెళ్ళి పోయింది. కాపురం పెట్టింది. రాధాకృష్ణ ఆమెను కలుసుకుంటాడు. వాళ్ళిద్దరి మధ్య మళ్ళీ ''ప్రేమ''.

అయినా రాధాకృష్ణకు అనుమానం.

''మరి పద్మా ! నా మీద ప్రేమ లేదూ నీకు'' అని అడిగాను.

''నీకు తెలీదు నా ప్రేమంతా నీదేనని'' ?

''మరి ప్రేమ ఉంటే ఇద్దరూ కలిసి ఉండరూ. ఒకరి వారు యింకొరయి పోరూ ?

...............

రాధా, నేను నాదాన్నే అయి ఉంటా, ఒకరిదాన్నవడం నాకిష్టంలేదు. యెందుకు కావాలి''.

''ప్రేమవల్ల''

''నా జీవనం నేను జీవిస్తా - నీ పని నువ్వు చూసుకో, ప్రేమ ఉంటుంది".

తరువాత పద్మావతి, రాధాకృష్ణల విషయం న్యాయమూర్తికి తెలుస్తుంది. తిరిగి రాధాకృష్ణను కలుసుకోనని ఒప్పుకున్న తర్వాత కాని వాళ్ళిద్దరూ కలిసి ఉండడం సాధ్యంకాలేదు.

ఈలోగా రాధాకృష్ణ ఆమె కోరినట్లు దేశనాయకుడైనాడు. ఇంగ్లండు వెళ్ళాడు. అందరూ అతనిని గొప్పవాడని సన్మానాలు చేశారు. ఆ సన్మానాలకు పద్మావతి వచ్చింది. మళ్ళీ కలుస్తారు ఇద్దరూ. మళ్ళీ ప్రేమ. మళ్ళీ గొడవలు.

అంతకుముందే రాధాకృష్ణకు పెళ్ళి అవుతుంది - తనకు ఇష్టం లేకుండానే ఒకనాటి ఉదయం ఆ మామగారు అమ్మాయిని తీసుకు

వచ్చి దించి వెడతాడు. రాధాకృష్ణ తిరిగి ఆమెను పుట్టింట్లో దించుతాడు. మళ్ళీ దేశసేవ. కొన్నాళ్లు తిరిగి వస్తాడు. మళ్ళీ భార్య శకుంతల తన దగ్గరకు వస్తుంది. ఆమెను ఈసారి పంపలేక పోతాడు. ఆమెతో కాపురం పెడతాడు.

కొన్నాళ్ళపాటు సంసారం, దేశసేవలతో పద్మావతి జ్ఞాపకానికి రాదు. మళ్ళీ ఆమె దగ్గర నుంచి ఉత్తరం. వాళ్ళిద్దరూ కలుసుకోకూడదని, ఉత్తరాలు రాసుకోకూడదని షరతు. కాని ఆమె ఉత్తరం చూచాక, అతనూ రాస్తాడు. తిరిగి అలా ఉత్తరాలతో దగ్గరివాళ్ళవుతారు.

రాధాకృష్ణ కాలికట్‌లో సంఘసంస్కరణ సభకి అధ్యక్షత వహించడానికి వెడుతూ త్రోవలో అకస్మాత్తుగా కలుసుకుంటాడు పద్మావతిని. ఆమె దేశం చూడడానికి వచ్చింది. ఆమెపై నిఘా ఉంచడానికి మరొక ఆమె ఉంది. పద్మావతి రాధాకృష్ణను చూడగానే లోకమే మరిచిపోయింది. అతనితో ఆరాత్రి అంతా చల్లని వెన్నెల్లో వెనుకటి జీవితాన్ని గుర్తుకుతెచ్చేలా అమృతమయమైన క్షణాలను గడిపింది.

ఈ సంగతి ఆ రెండో ఆమె ద్వారా న్యాయమూర్తికి తెలుస్తుంది. అతడు రాధాకృష్ణ మీద కేసునడుపుతానంటాడు. ఆ సంగతి చెప్పి "ఆఖరుసారి నిన్ను చూడడానికివచ్చాను. నీకేం భయంలేదు. నేను అన్నీ సరిచేస్తానుగదా" అంటుంది పద్మావతి.

అతనితో ఆ ఆఖరు క్షణాలు గడిపి పద్మావతి అతని ఒళ్లోనే మరణిస్తుంది.

న్యాయమూర్తి వస్తాడు.

"మనిద్దరం... కలిసి చంపాము... ఇద్దరం ముక్కలికింద చీల్చుకున్నాము" అన్నాడు.

ఇదీ సంక్షిప్తంగా కథ.

చలం నవలలన్నింటిలో వలెనే "దైవమిచ్చిన భార్య"లో కూడా సమాజానికి, కృత్రిమత్వానికి అతీతమైన స్త్రీ పురుషుల సంబంధం చిత్రించబడ్డది. చలం తానురాసిన అన్ని నవలల్లోను స్త్రీ పక్షం వహించి వారి లైంగికవాంఛని, వారి ప్రేమలో స్వేచ్ఛని కొనియాడతాడు. అలానే ఈ నవలలో కూడా. పెళ్ళి అయిన పద్మావతి, సమాజం పేరిట అన్నదమ్ముల చేత, భర్తచేత బోనులో బంధింపబడి తన సహజమైన ప్రేమభావాలకు తిలోదకాలివ్వవలసిందని ఆజ్ఞాపింపబడిన పద్మావతి, చలం ఉద్దేశించిన స్త్రీత్వానికి ప్రతీక. అయితే తరువాతి చలం స్త్రీలకన్న ఈమె వాస్తవికతకు దగ్గరలో ఉంది. రాధాకృష్ణ అంటే తనకున్న మోహం. భర్తతో ఉండవలసిన సమాజపు విధి ఆమెను చెరోవైపు బాధపెడతాయి. ఆమె ఎన్నోసార్లు చెబుతుంది: "నేను మీ ఎవ్వరి దాన్ని కాదు. నాదాన్నే నేను" అని. కాని ఆమె ఎవరికీ దక్కకుండా తన ప్రేమకు బలి అయిపోతుంది. సమాజపు రథ చక్రాల కింద ఆ స్వేచ్ఛా ప్రణయం తునాతునకలై పోతుంది.

స్త్రీకి కావలసిన స్వేచ్ఛా ప్రణయాన్ని చలం ఎలా తన కథావస్తువుగా స్వీకరించాడో, అలానే పురుషుల స్వార్థాన్ని కూడా అంతకు మించి నగ్నంగా చూపాడు. అమీర్, మీరాలమధ్య నలిగి పోయే రాజేశ్వరి, రాధాకృష్ణ, న్యాయమూర్తుల మధ్య నలిగి పోయే పద్మావతి ఒకరే. అయితే పద్మావతి తెలివిగలది. "ఆమెతో మాట్లాడిన తరవాత, నా చదువంతా యూనివర్సిటీ పరీక్షలకి తప్ప పనికిరాదని తెలిసింది" అంటాడు రాధాకృష్ణ.

అటువంటి పద్మావతి తనవ్యక్తిత్వాన్ని తానునిలబెట్టుకొని తానుఎవరిని సహజంగా ప్రేమిస్తుందో వారికి తన ప్రేమను అర్పిద్దామనుకుంటుంది. కాని పురుషుని స్వార్థంవల్ల సాధ్యపడదు. న్యాయమూర్తికి

తన భార్య, తనను ప్రేమించకపోయినా సరే, తనదగ్గరే తనవస్తువులా పడివుండాలని. రాధాకృష్ణకు తాను ప్రేమిస్తున్న మనిషి తనదికావాలని.

"పద్మా, అతనో, నేనో, యెవరో. నీయిష్టం ఆలోచించుకో. ఇక యిక్కడ ఎట్లావుంటావు? ఈయింట్లో".

"పద్మావతి చప్పున నామీదికి తిరిగింది."

"ఎందుకు వుండకూడదూ యిక్కడ? ఇద్దరిలో యెవరినో యేరుకోడం యేమిటి? ఎందుకు యేరుకోవాలి? యెవరో ఒకరు వుండితీరాలా యేమిటినాకు మొగనాధుడు? మీ యిద్దరూ అక్కర్లేదు. ...నాకోసం మీ యిద్దరూ యెందుకిల్లా, బొమికముక్కకోసం కుక్కల్లాగా, పోట్లాడతారు? ఇది నాయిల్లు, నేనిక్కడే వుంటాను"

ఇది స్త్రీ స్వేచ్ఛకు పద్మావతి నిర్వచనం.

స్త్రీకి కావలసిన స్వేచ్ఛా ప్రణయాన్ని, పురుషుడి స్వార్థాన్ని ఈ నవల చివర గొప్పగా చిత్రించాడు చలం. రాధాకృష్ణను గౌరవంగా బ్రతక నీయడం కోసం తనను తాను త్యాగం చేసుకుంటుంది పద్మావతి.

"మనిద్దరం... కలసి... చంపాము... ఇద్దరం... ముక్కల కింద చీల్చుకొన్నాము". అంటాడు న్యాయమూర్తి. ఎన్నడూ నవ్వులకైనా తన నవలల్లోని ప్రతిద్వంద్వి (Antagonist) చేత మంచిమాట చెప్పించని చలం ఈ'తన' మాటలను న్యాయమూర్తి చేత చెప్పిస్తాడు నవల చివర, భరత వాక్యంగా.

మామూలుగా చలం తరువాత నవలల్లో కనిపించని కొన్ని విషయాలు ఈ నవలలో దొరుకుతాయి. చలం స్త్రీలకు హోదా, గొప్పతనం - అవి అన్నీ తమ అడ్డంకులు లేని మోహంలోనే కనిపిస్తాయి. కాని పద్మావతిలో తన సమాజ సంస్కృతి జీర్ణించుకొని పోయింది.

"మరి అతనితో కాపరానికి వెడుతున్నావు?" అంటాడు రాధాకృష్ణ.

"అవును. యెందుకంటే, నేనిట్లావుంటే, అతని దగ్గరికి వెళ్ళకుండా, అందరూ యేమంటారు? అతనికీ అపరదిష్టే!" అంటుంది పద్మావతి.

సాంప్రదాయకమైన నీతికి పద్మావతి బలవంతాన లొంగదీయబడినట్లు నవల మధ్యలో చలం చిత్రించినా, అసలు పద్మావతి నరాల్లో జీర్ణించుకొని పోయింది ఆ సంస్కృతి. అందుకే - భర్తతో వెళ్ళిపోవాలని, అతనితో పైకి కాపురం చేస్తున్నట్లు ఉంటూ, రాధాకృష్ణతో తన ప్రణయం సాగించాలని.

ఈ నవలలో అటువంటి స్వభావాన్ని పద్మావతి చాలాసార్లు వ్యక్తం చేసింది. "నాకోసం ఒక్క మూడు సంవత్సరాలు ఆగు. ఈ లోగా ధనం, కీర్తి సంపాదిస్తాను" - అంటాడు రాధాకృష్ణ.

దానికి పద్మావతి సమాధానం యిది. "నేను మాత్రం అనుభవించనక్కర్లేదూ? నాకు మేడలూ, నౌకర్లూ, హోదా, గౌరవం కావాలి. నాకు నువ్వెంత గొప్పవాడివి కావాలనుందో, నేనూ అంత గొప్పదాన్ని కావాలని నాకువుంది."

ఈ పద్మావతి ఇంకా ఎదగని చలం స్త్రీ. ఇంకా పూర్తిగా తన అభిప్రాయాలను, తాను ప్రాతినిధ్యం వహించవలసిన విప్లవ భావాలను సమగ్రం చేసుకోని చలం సృష్టి.

అయినా చలం రాయబోతున్న గొప్ప నవలలకి ఈ నవలే మూలం. మైదానం, అమీనా, అరుణ, జీవితాదర్శం వంటి రచనలకు బీజాలు ఈ నవలలో కనిపిస్తాయి. తాను చెప్పవలసిన విషయాన్ని, చేపట్టవలసిన రచనావిధానాన్ని తనకు తాను ప్రయోగించి చూచుకున్నాడు చలం ఈ నవలలో.

ఈ నవల మరొకందుకు కూడా చలం మిగిలిన నవలలకన్న భిన్నమైనది. చలం ఈ నవలలో తన సమకాలిక జీవితంలో మహో ధృతంగా సాగుతున్న ఉద్యమాన్ని కొంతవరకు స్పృశించాడు.

చలం ఎక్కడో ఊహాలోకాలలోనే బ్రతికాడు. ఆనాడు సమాజంలో ఉన్న ఒక్క సమస్యని తీసుకొని దానిని తన భావనతో వెయ్యి విధాల వ్యక్తం చేశాడు. తన కాలంలోని సమాజానికి చలం సాహిత్య సృష్టికి ఏమీ సంబంధం లేదు - అనే విమర్శ చలం మీద ఉన్నది. దానికి ప్రతిగా మనకు ఈ నవలలో రాధాకృష్ణను దేశసేవకుడిగా రూపొందించడం కనిపిస్తుంది. ఇంగ్లండు వెళ్ళి తిలక్ శిష్యుడై సాంఘిక సేవకుడిగా ప్రఖ్యాతి పొందుతాడు రాధాకృష్ణ.

పద్మావతి కూడా తాను అతని సంఘ సేవకు అడ్డంరాకూడదని, తాను అతనితో ఉంటే అతడు ఆటువంటి ఉన్నతమైన కార్యాలను చేయడని అతనితో వెళ్ళిపోవడానికి నిరాకరిస్తుంది.

మొత్తానికి - ఈ నవలలో సంఘంలోని సాంప్రదాయికమైన విలువలను ఇంకా విడిచిపెట్టలేని చలమే కనిపిస్తాడు. అయితే తరువాత తెలుగు దేశానికి సుపరిచితుడైన విప్లవవాదిగా కూడా మనకు ఈ నవలలో కనిపిస్తాడు చలం.

చలం సిద్ధాంతాలన్నీ ఇందులో కూడా అదే నిర్మొహమాటంగా, అంతే తీక్షణంగా చెప్పబడ్డాయి.

చలం తన నవలల్లో శిల్పంలేదని, తనకు శిల్పమంటే ఏమిటో తెలియదని చాలాసార్లు చెప్పాడు. తానురాస్తున్నది ఇదీ అని గొప్ప రచయిత చెప్పవచ్చుగాని, దీనిని రాస్తున్నాను. దీనిని యీ విధంగా రాస్తున్నాను, ఈ మాటని ఇందుకోసం ఇక్కడ పడేస్తున్నాను- అని తన రచనావిధానాన్ని గురించి చెప్పే రచయితలో సృజనాత్మక రచయిత కన్న విమర్శకుడు ఎక్కువ పాళ్ళలో ఉన్నాడన్నది స్పష్టం.

చలం కేవలం సృజనశీలి. అందువల్లనే తన భావాలని గురించి చెప్పకుండా తన శిల్పాన్ని గురించి పొగిడే వాళ్ళంటే చలానికి మంట.

కాని చలంలోని నవలా శిల్పం అనల్పం. అతని భాష, కథ చెప్పే తీరు - అన్నీ అతని భావాలకు ఎంతో నైశిత్యాన్ని, తీక్షణతనీ ఆపాదించాయి. చలం ఒప్పుకోకపోయినంత మాత్రాన అతనిశిల్పం గొప్పది అనకుండా ఉండలేము.

చలం ఇన్ని నవలలు వ్రాసినా అందులో ఏదీ గొప్పనవల అని చెప్పడానికి వీలు లేదు. అన్నీ మంచి నవలలు. ఒక సిద్ధాంతాన్ని చెప్పడానికి, ఒక అన్యాయాన్ని ఎదురోక్కడానికి, ఒక సాంఘిక దురాచారాన్ని బట్టబయలు చేయడానికి కలం పట్టిన చలం తాను ఆ ధ్యేయాన్ని ఎంతవరకు నెరవేర్చాడో సమకాలీన సమాజం జవాబు చెప్పగలదు.

# అసమర్థుని జీవయాత్ర

గోపీచంద్ జీవితం హేతువాదం నుంచి ఆధ్యాత్మిక భావానికి మనిషి ఎదిగే కథ. అలాగే ''అసమర్థుని జీవయాత్ర'' నుంచి ''పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా'' కూడా హేతువాదంనుంచి గోపీచంద్ ఆధ్యాత్మికతకు ఎలా పరిణామం చెందాడో చూపుతాయి. చదువుకున్న వ్యక్తి, స్వంతంగా ఆలోచించగల వ్యక్తి అనేక సమస్యలు ఎదురైన వ్యక్తి, అనేక సంఘర్షణలకు లోనైన వ్యక్తి జీవితం ''ఎందుకు?'' అని ప్రశ్నించుకోవడంతో మొదలై తనకు తాను సమాధానం చెప్పుకొని జీవితంతో రాజీపడడంతో అంతం అవుతుంది.

''అసమర్థుని జీవయాత్ర'' గోపీచంద్ రెండో నవల. మొదటిది ''పరివర్తన'' అన్నది. ఇందులో సీతారామారావు అన్న అసమర్థుని జీవితగాధ వివరించబడ్డది. ఇది రచయిత కథన పద్ధతిలో చెప్పక ఆపాత్ర తనంత తానుగా తాను పొందుతున్న అనుభవాలను ఎప్పటి కప్పుడు విమర్శించుకుంటూ సాగిపోయే పద్ధతిలో మనస్తత్వ విశ్లేషణతో సాగిపోతుంది. ఫ్రాయిడ్ సిద్ధాంతాలు తెలుగు నవలాకారుల్లో మొట్టమొదట గోపీచంద్‌నే ప్రభావితం చేశాయని చెప్పవచ్చు.

సీతారామారావు కథ సగటు తెలుగు మనిషి కథ. కాదు. సగటు భారతీయుని కథ. కాదు కాదు. సగటు ప్రపంచ మానవుడి కథ. ఆ ప్రపంచ మానవుడు నేటి మనిషి. అణుయుగం మనిషి. డార్విన్, ఫ్రాయిడ్, మార్క్సులవల్ల ప్రభావితం అయిన మనిషి.

ఈ నవల మొత్తం ఆరు ప్రకరణాలుగా విభజింపబడ్డది. ప్రతి ప్రకరణానికి వేరువేరు పేర్లు పెట్టబడ్డాయి :

అసమర్థుడు

అసమర్థుని భార్య

అసమర్థుని ఆదర్శం

అసమర్థుని మేనమామ

అసమర్థుని ప్రతాపం

అసమర్థుని అంతం.

నిజానికి యీ ఆరు ప్రకరణాలలోను రచయిత శిల్పం దృష్ట్యా వేర్పాటు చేసినా కనిపించే సంఘర్షణ ఒకటే ! అది అసమర్థుడికీ అతని భార్య, ఆదర్శం, మేనమామ, ప్రతాపం, అంతం అన్న వాటికే ! అసమర్థుడు ఒక్కడూ ఒకపక్క, మిగిలిన అన్ని బలాలూ వేరొక పక్క ఉండి సాగించిన యుద్ధం. ఒక విధంగా యిది సీతారామారావు ఆంతరంగిక శక్తులకు, బహిర్గతమైన శక్తులకూ జరిగిన సంఘర్షణ అని చెప్పవచ్చు. ఇది సీతారామారావు అనే సాధారణ వ్యక్తి తనతో తాను చేసుకున్న యుద్ధం. ఇది ప్రతి సగటు మనిషి తనతోతాను చేసుకుంటున్న యుద్ధమే !.

ఇరవయ్యో శతాబ్దంలో మనిషి తన వాతావరణంలో యిమిడి పోలేక పోతున్నాడు. శాస్త్ర విజ్ఞానం అతనికి హేతువాదాన్ని నేర్పింది. డార్విన్ సిద్ధాంతం భగవంతుడి మీద నమ్మకం లేకుండా చేసింది. ఇంకా కొత్త నమ్మకం ఏమీ నేర్పలేదు. ఆసంధి కాలంలో మనిషి సీతారామారావు.

సీతారామారావు కథ విషాదనాయకుడి కథ. అన్నిటా మంచివాడే అతడు. కాని అతనికి ఒక దురభిమానం వున్నది : ఉన్నత వంశ సంజాతుణ్ణి అన్న గర్వం ఉన్నది. తండ్రి చనిపోతూ "బాబూ

మన వంశం పేరు నిలబెట్టు'' అంటూ చెప్పిపోయాడు. పాపం! అసమర్థుడు అన్నీ, ఆ పేరును నిలబెట్టడం కోసమే చేశాడు. వంశ ఖ్యాతి కోసం తాను బికారి అయినాడు. ఆస్తిని ఖర్చుపెట్టాడు. దురభిమానం చూపిన త్రోవలో నడిచి సీతారామారావు అసమర్థుడై నాడు. చివరకు మరణం తప్ప మరో గత్యంతరం లేనంత అసమర్థుడై నాడు.

ఈ దురభిమానానికి తోడు తన తండ్రి తాతలవలె తాను కూడా ఉదారుడనిపించుకోవాలన్న అభిలాష కూడా సీతారామారావుకు వుంది. తన కూతుళ్ళందరిచేతా తనమీద వున్న ప్రేమను బహిరంగంగా చెప్పించుకోవాలనుకొన్న లియర్ వంటివాడు సీతారామారావు.

సీతారామారావు అసమర్థతకు తోడైన అంశాలు చాలా వున్నాయి. ఎన్నో బలహీనతలు ఉన్నాయి. ఆ బలహీనతలతో కూడిన సీతారామారావు సగటు మనిషి. తానుచేసిన తప్పుపనులకు పెద్దపేరు పెట్టుకుని తనకు తాను సమాధానం చెప్పుకోవలసి రావడం అతనిలో మరో బలహీనత: పెళ్ళాలను కొట్టేవారు ఎందరు లేరు? కొందరు ఎన్నిసార్లు కొట్టినా తాముతప్పు చేశామని ఏకోశానా అనుకోరు. మరి కొందరు ఒక్కసారి ఆతప్పుచేసి, పశ్చాత్తాప పడి మరి ఆతప్పు చేయరు. కాని సీతారామారావు అలాకాదు. తాను తప్పుచేస్తున్నానని తెలుసు. కాని కొడతాడు. ఆ కొట్టడానికి ఏదో ఒక సమర్థన వెతుక్కుంటాడు. దానికో పెద్దపేరుపెట్టి తన్ను తాను ఓదార్చుకుంటాడు. అందుకే సీతారామారావు చదువుకున్న అసమర్థుడు.

సీతారామారావులో యీ ఆత్మజిజ్ఞాస అతనిలోని అసమర్థతకు తోడ్పడినట్లు కనిపిస్తుంది. తాను ఉదారుడుగా ఉండి నలభై వేలు తీసుకోవలసిన మామదగ్గర పదెకరాలు మాత్రం రాయించు

కున్నాడు. మామ తనకు కృతజ్ఞుడై వుండాలి. కాని మామడబ్బు పంపడు: అప్పుడతనితో తగాదా.

అసమర్థుని జీవయాత్రలో అసమర్థుడు నేటి (1945 నాటి) చదువుకున్న యువకుడికి ప్రతీక. అంతేకాదు. అతని భార్య, ఆదర్శం, మేనమామ యివి అన్నీ ఆ యువకుడు నిత్యమూ తనజీవితంలో ఎదుర్కొనే అనేకమైన ఆకర్షణాలకు ప్రతీకలు.

అసమర్థుడు భార్యను ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడు. కాని తన పరిస్థితి తారుమారు కాగానే ఆమెను అవమాన పరుస్తాడు. కొడతాడు. ఆమెవల్ల పిల్లల్ని కంటాడు. ఆమె కనిపిస్తేనే ఆగ్రహిస్తాడు. ఈ ఆగ్రహం ఆమెమీద కాదు ; తనమీదే ; తన అశక్తత మీద; కలకాలం నిలవలేని తన ప్రేమమీద; తన అస్థిరత్వం మీద.

అలానే అతని ఆదర్శం, అతని ప్రతాపం, అతని మేనమామ అతని జీవితంలోని వేరువేరు కోణాలను (Facets) చిత్రించే ప్రతీకలు. అసమర్థుడు ఒక్కొక్క అడుగులో ఒక్కొక్కరితో సంఘర్షణ పడుతూ చిట్టచివరకు తాన్నుతానే చంపుకుంటాడు.

ఈ నవలలోని రామయ్యా తాత పాత్ర అనుభవానికీ, జీవితంతో మనిషి పడవలసిన రాజీకి మారురూపం.

"బాబూ ! కుర్రవాడివి. ప్రపంచానుభవం తక్కువ. కొంచెం తెలిసి మెలగాలి'' అంటాడు రామయ్యా తాత.

"నేను తెలిసే చేస్తున్నాను తాతా'' అని అతని సమాధానం.

ప్రపంచ జ్ఞానానికి మూర్తి కట్టిన ఆకృతి రామయ్యా తాత. అజ్ఞానానికి, తెలివి తక్కువతనానికి, అసమర్థతకు మారురూపం సీతారామారావు. ఒక విధంగా రామయ్యా తాత సీతారామారావుకు 'ఆత్మ' (Conscience) లాంటివాడు. ఆ కాన్షన్స్ ఎప్పుడూ

మనల్ని హెచ్చరిస్తూనే వుంటుంది. మనకు ఎంతో తెలుసునన్న దురహంకారంతో ఎన్నడూ దాని మాటవినం. అదే సీతారామారావు చేసింది కూడా. ఈ అహంభావం, అతనిలో గ్రీకు నాటకాల్లో —'ప్లాట్'—వలె ఒకటోసింగా ప్రవేశించి చివరకు అతన్నే ఆహుతి కొంటుంది.

గతం, గతం తాలూకు అహం మనిషి జీవితాన్ని ఎంతటి నీచస్థితికి తీసుకొని రాగలవో సజీవంగా చిత్రించిన నవల ''అసమర్థుని జీవయాత్ర''. వర్తమానంతో సంబంధం లేని యీగతం, పరిస్థితులను పరిగణించని యీ అహం మానవుడు ఎంత తెలివి గలవాడయినా, ఎంతవిజ్ఞాని అయినా అతనిని అధఃపాతాళానికి అణచగలవు. ఈ నవలలో గతం తనవంశ ప్రతిష్ట. అహం—మారుతున్న పరిస్థితులను గమనించలేని సీతారామారావు మనస్సు, దానిస్థితి. ఈ రెండూ అతడిని నాశనం చేసేవరకూ సీతారామారావు చేతకాని ప్రేక్షకుడి లానే చూస్తూ వూరుకుండి పోయాడు.

అప్పుడు తెలిసిందతనికి - తానుఏదో ఒకఉద్యోగం చెయ్యాలని. కాని వంశప్రతిష్టకు నష్టం. అయినా తప్పలేదు. గుమాస్తాగాచేరాడు. ఉదార వంశానికి చెందిన అహంకారి సీతారామారావు. ఉదారంగా వితరణలు చేసిన సీతారామారావు గుమాస్తాగా చేరడమే అతని మరణానికి నాందీవాక్యం.

అక్కడనుంచీ ప్రతినిత్యమూ తనకూ తన మనస్థితికీసంఘర్షణ. భార్య, పిల్లలు, మేనమామ—వారితో సంఘర్షణలన్నీ యిందులో భాగాలే! తనతో తాను రాజీపడడానికి సీతారామారావు ఎన్నడూ ప్రయత్నం చేయలేదు. తనకు తాను రాజీపడనివాడు జీవితంతో రాజీ పడలేదు. అందుకే అతను చనిపోయాడు.

ఈనవల నేటికీ పాఠకలోకానికి అతిసన్నిహితమైనది కావడానికి మొదటి కారణంగా—అది నేటి యువకులు చాలమంది జీవితాలకు ప్రతీకగా నిలుస్తుంది కాబట్టి—అని చెప్పుకోవచ్చు. చదువు ఉన్నంత మాత్రాన జీవితంలో సుఖంపడం కల్ల. కాక మరేం కావాలి ? జీవితానికి ఒక ధ్యేయం కావాలి. ఆ ధ్యేయాన్ని నిజం చేసుకొనే ఉత్సాహం కావాలి; కష్టించేశక్తి కావాలి. ఇవిఅన్నీ లోలోపల వుండి కూడా చేతకానివాడై—అంతాబుద్బుదప్రాయం. అని తేల్చివేసి కాళ్ళు బారజాపుకొని కూర్చునే అలసస్వభావులకు యీనవల ఒక చెంపపెట్టు.

తమవంటి ఒకమనిషి ఉచ్చస్థితినుంచి పతనం పొందడం వల్ల భయము, కరుణ కలుగుతాయని అరిస్టాటిల్ చెప్పాడు. ఈ నవల మనలో ఆ రెండు ఉద్వేగాలను కలిగిస్తుంది — ముఖ్యంగా చివరి ప్రకరణంలో సీతారామారావు తాన్ను తను చంపుకొనే ఘట్టంలో.

ఈ నవలలో అడుగడుగునా జీవితతత్త్వం చర్చించబడ్డది. సీతారామారావు ప్రశ్నించుకునే ప్రతి "ఎందుకు"లో ఎంతో ఆర్తి, ఎంతో వేదన యిమిడివున్నాయి. అయితే సీతారామారావుకు హేతువాదం నేర్పిన "ఎందుకు" మాత్రమే తెలుసుకొని, దానిని నేర్పుతో జీవితానికి అన్వయం చేసుకొనే ప్రతిభలేదు. అందువల్లనే "కేవలం సిద్ధాంతాలుకాదు ; అవి జీవితానికి ఎలా అన్వయం చేసుకోవాలన్నదే మనం విజ్ఞానశాస్త్రం నుంచి నేర్చుకోవలసిన సత్యం" అంటాడు ఆల్డస్ హక్స్లీ.

ఈ నవలలో పలాయనవాదం, పరాజయవాదం (Escapism, Defeakism) వున్నదంటారు చాలమంది. అయితే అది గోపీచంద్‌కు ఏ రూపేణా వర్తించదు. అది అతని ప్రధాన పాత్రను సృష్టించడానికి గోపీచంద్ ఏర్పాటు చేసుకొన్న మార్గం. సీతారామారావుకు అనేక శక్తులు అడ్డట్టుకొని అతన్ని తరుముతాయి. ఆశక్తుల దాటికి

తాళలేక అతడు జీవితం నుంచి ప్రతిక్షణం పారిపోతాడు. చేతనైన చోట ప్రతీకారం చేద్దామనుకుంటాడు. అదీ ధైర్యంగా చేయలేడు. పైగా ఆ ప్రతీకారం తనమీద తానే చేసుకుంటున్నానని గుర్తించడు. అందువల్లనే "ఏమిట్రా నువ్వు చేసింది?" అని తనకు తాను ప్రశ్నించుకుంటూనే ఆ చేసినదానికి ఓ పెద్ద పేరుపెట్టి సమర్థించుకుంటాడు.

'ఎందుకు?' అని ప్రశ్నించుకొనే కేవల హేతువాది—జీవితానికి దాని సమాధానాలకు సమన్వయం చేసుకోలేని 'ఒట్టి హేతువాది', క్రియా శూన్యుడైన హేతువాది, బ్రతికి ప్రయోజనం లేదు. అతడు చనిపోక తప్పదు. బ్రతికితే మిగిలిన వారిని ప్రతిక్షణం చంపడంకన్న మరొక పని సాధించలేడు. కేవలం హేతువాదిత్వమే జీవితంలోని ప్రశ్నలకు సమాధానాన్నివ్వదు. అంతకు మించినదేదో ఉన్నది. దానిని అన్వేషించడం కోసమే గోపీచంద్ అసమర్థుణ్ణి చంపి సమర్థుడుగా తన అన్వేషణను కొనసాగించాడు. బహుశః దాని అర్థాన్ని తెలుసుకున్నాడనే అనుకుంటాను నేను.

ఇక్కడ గోపీచంద్ ఈ నవలలో ప్రయుక్తం చేసిన శిల్పాన్ని గురించి రెండు మాటలు చెప్పవలసివుంది. అడుగడుగునా గోపీచంద్ దీనిలో ధ్వన్యాత్మకమైన వర్ణనలు, సంభాషణలు ప్రయుక్తం చేశాడు.

నవల యిలా ప్రారంభం అవుతుంది: "సీతారామారావు జీవితం చిత్రమైంది. ఉన్నత శిఖరాగ్రం నుండి స్వచ్ఛమైన జలంతో భూమి మీదపడి మలినాన్ని కలుపుకొని మురికి కూపంలోకి ప్రవహించే సెలయేటిని జ్ఞప్తికి తెస్తుంది".

సంక్షిప్తంగా యిదే సీతారామారావు చరిత్ర. జీవితంలోని మలినాన్నంతా — అహంభావాన్ని దురహంకారాన్ని, దురభిమానాన్ని—తనలో కలుపుకొని, చిట్టచివరకు చేతకానితనమనే మురికి కూపంలోకి ప్రవహించిపోయాడు సీతారామారావు.

నవలకు చివర రచయిత ఆదేశంగా రామయ్యా తాతమాటలను చెప్పుకోవచ్చు: "జీవిత ప్రవాహం. ప్రచండ వేగంతో వెళ్ళిపోతూ వుంటుంది. అందులో ఎవరెవరి సంస్కారాన్నిబట్టి వాళ్లు తమసుఖం కోసం పోట్లాడు కుంటున్నారు. ఇదొక మహాసంగ్రామం. ఇందులో పిరికివాళ్ళకూ, అసమార్థులకూ స్థానంలేదు.

నిజం. అసమర్థులకు స్థానంలేదు. అందువల్లనే గోపీచంద్ సీతారామారావు అంతాన్ని నవల చివర చూపి తన ఆదేశం వినిపించాడు.

ఈనవలలో ఆరు ప్రకరణాలు వున్నాయి. ప్రతిప్రకరణమూ తిరిగి చిన్న చిన్న భాగాలు చేయబడ్డది. ప్రతి ప్రకరణంలోను ముందు కొన్ని సంఘటనలు చూపడం, తరువాత ఆ సంఘటనల వెనుక వుండే కార్యకారణాలను తాత్త్విక దృష్టితో వ్యాఖ్యానించడం—యిదీ ఈరచనలో గోపీచంద్ అనుసరించిన పద్ధతి. తిరిగి మొదటిసంఘటనలకు వ్యతిరిక్తమైన సంఘటనలను చిత్రించడం; వాటిని తాత్త్విక దృష్టితో పరిశీలించడం-ఇలా యదార్థ, తాత్త్విక దృక్పథాలలో వుండే అంతారాన్ని చూపడం గోపీచంద్ యీ నవలలో అడుగడుగునా చేశారు. అంతేకాదు. ఒక యదార్థమైన సంఘటనను తాత్త్విక దృష్టిలో చూస్తే అదినిలిచినప్పుడే దానిని తరువాత వారు అనుసరించ డానికి వీలౌతుంది.

ఈ తాత్త్విక దృష్టే నిజానికి యీ నవలయొక్క ఆధిక్యతను యినుమడింప చేస్తున్నది.

# చివరకు మిగిలేది

తెలుగు నవలా సాహిత్యంలో 'చివరకు మిగిలేది' ఒక అపూర్వ సృష్టి. దీని రచన ఒక నూతన శకానికి నాంది. ఈ నవల 1943 లో తలపెట్టినా, 1946 లో నవోదయలో సీరియల్‌గా ప్రారంభమై పదహారుమాసాల తర్వాత పూర్తయింది. 1952 లో మొదటిసారి పుస్తక రూపాన ప్రచురింపబడ్డది.

తెలుగులో వచ్చిన పరిపూర్ణమైన మొదటి మనోవైజ్ఞానిక నవల చివరకుమిగిలేది. బుచ్చిబాబు అధునిక పాశ్చాత్య సాహిత్యంలోను, అందులోవచ్చిన వినూత్న సిద్ధాంతాలతోను, అవి ఆధారంగా సాహిత్యంలో చేయబడ్డ వివిధ ప్రయోగాలతోను దగ్గరి పరిచయం ఉన్నవాడు. దానికితోడు మతము, రాజకీయాలవంటి తాత్త్విక, సాంఘిక సమస్యలను ఒక విజ్ఞానిలా మధనం చేసినవాడు. ఈనవలలో తన భావాలను, అనుభవాలను ఏకీకృతం చేసి. దీనిని కేవలం భావ సముచ్చయాత్మకమైన నవల (Novel of Ideas)గా మాత్రమే కాక సంక్లిష్టమైన సన్నివేశాలతో కూడిన క్రియాత్మకమైన నవల (Novel of Action)గా కూడా రూపొందించాడు.

ఈ నవలలో "రెండు మహా సంగ్రామాల మధ్య కాలంలో, తెనుగునాట కొందరు యువతీ యువకుల జీవితం చిత్రితమైంది" అన్నారు "సమర్పణ"లో బుచ్చిబాబు. నిజానికి ఇందులోని సంఘటనలు-రాయలసీమ పర్యటన-వంటివి ఆకాలాన్ని నిర్ణయిస్తాయి కాని, ఆ రాజకీయ సాంఘిక సమస్యలకు, యీ నవలలోని ప్రధాన వ్యక్తులకు అంతసంబంధం లేదు. అందువల్లనే యీనవల ముందుగా వ్యక్తుల ఆంతర, బాహ్యాసంఘర్షణలకు సంబంధించినది. దానికి

అనుగుణమైన వాతావరణ నిర్మాణానికి మాత్రమే మిగిలిన సాంఘిక సంఘటనలు పనికి వచ్చాయి. అంతేకాదు. ఈ నవలకు జీవలక్షణం అనదగిన యువకుల మనస్సులలో జరిగే భావసంఘర్షణ అన్నికాలాల యువతీ యువకుల ప్రకృతికనుక ఈ నవల కాలపరిధిని దాటి, సార్వకాలికం అవుతున్నది.

తనకు ఎదురైన ఒక సంఘటన-సంఘనిష్టమైనదానిని-తీసుకొని, దానికి కారణమైన వ్యక్తులను, వ్యక్తుల నుంచి ఒకే వ్యక్తిని ఆ వ్యక్తినుంచి ఒక భావాన్ని పరామర్శించారు బుచ్చిబాబు. "1943 లో రాయలసీమ ప్రజల్ని పరిశీలించే అవకాశం కలిగింది నాకు'' అంటూ యీనవల వ్రాయడానికిగల కారణాలను ప్రారంభించారు బుచ్చిబాబు.

"ఈ పరిచయం వల్ల రాయలసీమ ప్రజలకీ, సర్కారు జిల్లాల ప్రజలకీ పరస్పరమైన వైముఖ్యాలున్నాయన్న సంగతినాకు స్పష్టమైంది''. దీనికి ఆర్థికస్థితిగతులు, చరిత్ర కొంత కారణమే అయినా ''అసలు జనం ఎందుకు పరస్పరం ద్వేషించుకుంటారు? ఇరుగుపొరుగు ప్రాంతాలవారి స్నేహభావానికి ఆటంకాలేవి? పరస్పరద్వేషం, అసహనం-యివి ఆరోజుల్లో నన్ను కలవరపెట్టినై'' అంటారు రచయిత.

ఈ నవలకు బుచ్చిబాబు మొదట ఉంచదలుచుకొన్న పేరు "ఏకాంతం'' బాహ్యజీవితంలోని అనేక అనుభవాలు దయానిధిని ఏకాకిని చేస్తాయి. సంఘంలోని బాహ్యశక్తులు తననిలా ఏకాంతంలోనికి నెట్టివేయడానికి గల కారణాలను అన్వేషిస్తూనే దయానిధి తన జీవితంలో కొన్ని విలువలు సాధిస్తాడు. అంతేకాదు. వైయక్తిక జీవితపరిధుల్ని దాటి, ఒకవంక తనచుట్టూవున్న సమాజంగురించి, వేరొకవంక జీవితానికి అర్థం ఏమిటి అన్న అన్వేషణకి మూలమైన ఆధ్యాత్మిక తత్త్వాన్ని గురించి పరిశోధన సాగిస్తాడు. ఈ పరిశోధనలో

ఉత్పన్నం అయ్యే సమస్యలు, ఆ సమస్యలను అధిగమించి దయానిధి తన జీవితంలో సాధించిన విలువలు—యీ రెండూ ఈ నవలను గురించిన తాత్త్వివిక విచారంలో ముఖ్యమైనవి.

దయానిధి ఎదుర్కొన్న మొదటిసమస్య ప్రేమరాహిత్యం... ''గతించిపోయిన యౌవనం, జాడ్యం, బీదతనం, మృత్యువు-ఇవి జీవితంలోని చెడుగు. ఈ చెడుగులో మానవుడు గుండెబాదుకోవలసిన విషాదం యేమీలేదు. జీవితంలో నిజమైన విషాదం ద్వేషించడం కూడాకాదు. నిజమైన విషాదం ప్రేమించలేక పోవడం'' అంటాడు రచయిత పీఠికలో. ఈ నిర్ణయం ఆయన సృష్టించిన ప్రధాన పాత్ర దయానిధిది కూడా. "అసలు జనం ఎందుకు పరస్పరం ద్వేషించుకుంటారు? ఇరుగుపొరుగు ప్రాంతాలవారి స్నేహభావానికి అటంకాలేవి?'' యీ ప్రశ్నలు అతణ్ణి కుదిపి, అతనిలోని తాత్త్వివిక జిజ్ఞాసను రేకెత్తిస్తాయి. ఈ ద్వేషం కేవలం సాంఘికమైనదే కాదు, వైయక్తికమైనదికూడా. దయానిధి తనజీవితంలో ప్రవేశించిన నలుగురూ తన్ను ద్వేషించడం-ప్రేమించలేక పోవడం-గమనిస్తాడు. ఈ పరిశోధనలనుంచి రచయిత సాధించిన సిద్ధాంతం: ''సమాజాల మధ్యవున్న ద్వేషాలకీ, వ్యక్తులు ప్రేమించలేక పోవడానికీ ఏదో సంబంధం ఉండితీరాలని నా నమ్మకం". అటు సర్కారు జిల్లాలలోను ఇటు రాయలసీమలోను దయానిధి అనుభవాలు యీ సత్యాన్నే నిరూపిస్తాయి.

జీవితంలో చెడుగు-పాపం, ముఖ్యంగా పెద్దలు చేసిన తప్పిదాలు, పిన్నలపైబడి వారి జీవితాన్ని ఏ విధంగా వికసించనీయకుండా పాడుచేసింది చూపడం, దాన్నిగురించిన పరిశీలన-యీ నవలలో చిత్రించబడ్డ రెండో సమస్య. మనోవైజ్ఞానిక వేత్తగా బుచ్చిబాబు యీ సమస్యను బహుకోణాల నుంచి దర్శించాడు.

దయానిధికి తల్లి ఆరాధ్యదేవత. దానికి కారణం ఆమెలోని దయ, అర్థంచేసుకోగల, సానుభూతి చూపగల విశాల హృదయం. ఆమెను గురించి వున్న వదంతులను నమ్మి, ఆమె శీలాన్ని గురించి ఎవరు అవహేళన చేసినా దయానిధి భరించలేడు. అలా హేళనచేసిన వారెవ్వరూ అతని జీవితంలో భాగం పంచుకోలేదు. సుశీల, ఇందిర దానికి తార్కాణం. అమృతం చాలా విధాల అతని తల్లిని పోలివుంటుంది. దయ, ప్రేమ, సానుభూతి ఆమె నైజగుణాలు. అంతేకాదు. దయానిధితల్లిని ప్రేమించిన ఒకే ఒక్క వ్యక్తి ఆమె. అందువల్ల నే అమృతం దయానిధి జీవితంలో అమృతాన్నినింపి తన మాతృత్వాన్ని సఫలం చేసుకుంటుంది. తల్లిని ఆదర్శమూర్తిగా భావించే మగవాడు లోకంలోని స్త్రీలందరిలో ఆమె ప్రతిమూర్తినే అన్వేషిస్తాడన్న సిద్ధాంతం దయానిధి యెడ సత్యం. ఇదే ఫ్రాయిడ్ నిర్వచించిన ''ఈడిపస్ కాంప్లెక్స్''.

ఈనవలలో దయానిధి తల్లిపాత్ర చిత్రించబడలేదు. కాని ఆమె చేసిన అపచారాల ఫలితం నీడలా అతన్ని వెంటాడి, సంఘ విమర్శ ద్వారా అతని జీవితాన్ని కలుషితం చేస్తుంది... ''ఒకరు చేసినఅపచారాలకి మరొకర్ని బాధ్యుల్ని చేయడంవలన సమాజంలో నైతికమైన విలువలకు తావు లేకుండా పోతుంది. ఈ దౌర్జన్యాన్ని ఎదుర్కోవడంలో దయానిధి కొన్ని విలువలు సాధిస్తాడు.'' ఈ రెండు సమస్యల పరిష్కారాన్ని సాధించడానికి పూనుకున్న దయానిధి నిజానికి కార్య రూపేణా ఏమీ సాధించలేడు. కాని సాధించిలేకపోయానన్న జిజ్ఞాసతో అతనికి రెండు కొత్త విలువలు లభిస్తాయి. వీనిల్లో మొదటిది మానవత. రెండవది శరీరానుభవాలనుంచి ఎదిగి, ఆధ్యాత్మికానుభవాలకోసం అర్రులుసాచి, తననుగురించి జీవితం గురించి నిజం తెలుసుకోవాలన్న ఆకాంక్ష. ఆ పరిశీలనకు ఫలరూపమైన ఆత్మజ్ఞానం తనతోతాను సమాధానపడడం.

శారీరకాకర్షణలను అధిగమించి ఆధ్యాత్మికతవైపుకు, విశ్వ మానవతవైపుకు మానవుడు చేసేనిరంతర పయనమే దయానిధిగాథ. రస్సెల్ నుంచి రాధాకృష్ణన్ వైపుకు పయనించిన బుచ్చిబాబు ఈ మానవుని పయనాన్ని చిత్రించడం ఎంతైనా సమంజసం.

ఈ నవలలోని ప్రధాన పాత్ర దయానిధి. వృత్తి చేత డాక్టరు అయినా ప్రకృతి చేత తాత్త్వికుడు, భావుకుడుకూడా. ఈ నవలలోని మిగిలిన పాత్రలన్నీ అతనిచుట్టూ తిరుగుతాయి - ముఖ్యంగా స్త్రీ పాత్రలు.

ఈ నవలలో ముఖ్యమైన స్త్రీ పాత్రలు కోమలి, అమృతం, సుశీల, ఇందిర. దయానిధికి వీరందరూ సన్నిహితులే. కాని వీరెవ్వరి తోను దయానిధి సంపూర్ణమైన, ఆనందం పొందలేకపోతాడు. సుశీల, ఇందిరలను తాను దగ్గరకు రానివ్వలేడు: తన తల్లి అంటే వారికున్న దురభిప్రాయం అందుకు కారణం. కోమలి కూడా తల్లిని గురించి తప్పుగా భావించినంతకాలం ఆమెను చేరలేకపోతాడు దయానిధి ఇంక అమృతంఒక్కతే అతనికి జీవితంలో ఏ ఒక్కక్షణాన్నో ఆనందమయం చేసింది.

ఈ నలుగురు జీవితంలోని నాలుగు విభిన్నమైన భావాలకు ప్రతీకలు. కోమలిలోని శరీరాకర్షణ, అమృతంలో ఉన్న దయ, సానుభూతి, సుశీలలోవున్న విద్య, నాజూకుతనం, ఇందిరలోవున్న సంఘం ఆమోదించిన సంబంధం - ఇవి అన్నీ కలిస్తే మగవాడు ఆదర్శ వంతంగా చిత్రించుకొనే పరిపూర్ణ స్త్రీ అవుతుంది. అటువంటిపరి పూర్ణత్వం లభ్యంకాదు కనుకనే దయానిధి వీరినందరినీ త్యజించాడు. చివరకు తనతోపాటు భౌతిక సంబంధంలేని ఆధ్యాత్మిక ప్రేమను పంచు కోవడానికి సిద్ధపడ్డకోనులే అతనితో ఉండిపోతుంది.

ఈ నవలలో అతిప్రధానమైన పాత్ర దయానిధి తల్లిది. ఆమెకు పేరులేదు. ఆమె ఈ నవల ప్రారంభంలోనే మరణిస్తుంది. ఆమె గత చరి

త్రను గురించి ఏవో వదంతులే దయానిధి జీవితం అలా దుర్భరం కావడానికి కారణం. కోమలి, అమృతం తరువాత ప్రధానమైనవారు. ఈ పాత్రలే కాక, సుశీల, కృష్ణమూర్తి - ఇలా అన్ని పాత్రలుకూడా ఈ నవలలోని పాత్రలన్నీ ఎంతో సానుభూతితో చిత్రింపబడ్డాయి. దయానిధి కృష్ణమూర్తిని చూసి, జాలిపడి ప్రేమించడం నేర్చుకున్నాడు. ఇదే తన పాత్రలంటే బుచ్చిబాబుకి ఉన్న భావంకూడా. ''దొంగను పట్టుకుని వాడాపని ఎందుకు చేశాడో కనుక్కొని ఆ చేష్టపై సానుభూతి చూపబుద్ధి వేసేది'' అన్నాడు బుచ్చిబాబు ఒక వ్యాసంలో. ఒక వ్యక్తిని ద్వేషించడంకన్న వ్యక్తిలోని దౌర్బల్యాలను ద్వేషించాలన్న మానవతావాదమే దయానిధి జీవితమంతా తిరిగి నేర్చుకొన్న పాఠం. బుచ్చిబాబు కూడా ఈ పాఠం నేర్చుకున్నవాడు కావడం వల్లనే ఆయన పాత్రల్లో అంత వైవిధ్యం ఉన్నా, ఎక్కడా చెడ్డ పాత్రల్ని చూపడు. చెడ్డతనాన్ని కూడా విశ్లేషించి, వ్యక్తినీ, వ్యక్తిగతమైన రుగ్మతనీ వేరుచేసి చూపే పాత్ర చిత్రణం ఆయనది.

ఈ పాత్ర చిత్రణంలోను, ఇతివృత్త నిర్మాణంలోను బుచ్చిబాబు ఒకవైపు అణచివెయ్యలేనంత జీవితోత్సాహాన్నీ, వేరొకవైపు ఎంతో సంక్లిష్టమైన ఆధ్యాత్మికత తత్త్వాన్ని ఒకదాని తరువాత మరొకదానిని నేర్పుగా ప్రయుక్తంచేశాడు. ''సంప్రదాయాలు, ఆచారాలు, నైతిక విలువలు, కట్టుబాట్లు అన్నింటిని ముంచెత్తివేసే మహాసముద్రంలోని అఘాతంలాంటి కోమలి, కన్నీరుకారిస్తే తడిసి నీరైపోయిన స్వప్నకాంతలాంటి అమృతం, తాను చేరిన ప్రతిచోటా నవ్వుల్ని పంచిఇచ్చే జగన్నాథం'', ఒకరేమిటి అతి చిన్న పాత్రలు కూడా-రోజా, సోమయ్య, రెడ్డి ప్రతి ఒక్కరూ మనకు అతి సన్నిహితులైన వాళ్ళే. అందరూ తమఅంతరాంతరాల్లోని భావాలను మనకు విప్పి చెప్పుకుంటున్నారా అనిపిస్తుంది.

ఈ నవలలోని ఇతివృత్త నిర్మాణాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే దయానిధి జీవనయాత్రలో అతని మజిలీలు, లక్ష్యసాధనకోసం అతడు తిరిగిన మలుపులు, చివరకు చేరుకున్న గమ్యం వీటిని రచయిత ఎంత క్రమబద్ధంగా చిత్రించాడో తెలుస్తుంది.

నవలలోని మొదటి మూడు అధ్యాయాలు కథకు బీజ ప్రాయాలు. మొదటి అధ్యాయం తల్లి మరణంతోను, దయానిధి కోమలి ఇంటిచుట్టూ తిరగడంతోను ప్రారంభమౌతుంది. రెండవ అధ్యాయంలో కోమలి శరీరాకర్షణకులోనై, ఆమెకు దగ్గరగాపోయి కూడా, ఆమెనేమి చేయకుండా తిరిగివస్తాడు దయానిధి. మూడవ అధ్యాయంలో ఇందిరతో పెళ్ళి. దయానిధి జీవితంలో తరువాతవచ్చే వ్యక్తుల్ని అందర్నీ ఈ మూడు అధ్యాయాల్లోనే పరిచయం చేశాడు రచయిత.

నాలుగు, ఐదు, ఆరు, అధ్యాయాలు జీవిత ప్రాంగణంలో ప్రవేశించిన దయానిధి ప్రథమానుభవాలు, అతని ఆశయాల విఫలత చూపబడ్డాయి. నాలుగవ అధ్యాయం ''చప్పుడు చెయ్యని సంకెళ్లు''లో కార్యంనాటి రాత్రి హఠాత్తుగా స్వాతంత్ర్య సమరంలో దుమికాడు దయానిధి. దెబ్బలు తిన్నాడు. అరెస్టు కావలసినవాడే. మామగారు తప్పించాడు. అలా జాతీయ పోరాటంలో చేరలేక విఫలుడౌతాడు. ఇది ఒకజాతి పౌరుడుగా అతని విఫలత. తరువాతి అధ్యాయం ''సౌందర్యరాహిత్యం''. డాక్టరుగా తనవిధిని నిర్వర్తించాలనుకుంటాడు. శ్యామలను ఆమె మానసిక వ్యాధినుంచి రక్షిస్తాడు. కాని పూర్తిగా నయంకాకముందే ఆమె అన్న వారిద్దరినీ శంకించి ఆమెను తీసుకుపోతాడు. ఇది తనవృత్తిలో దయానిధి పొందిన విఫలత. ఇక ''స్వయం సంస్కారం'' లో మానవుడుగా, సంఘంలో వ్యక్తిగా కృష్ణమూర్తికి సుశీలకు జరుగుతున్న పెళ్ళి ఆపుచెయ్యాలని ప్రయత్నించాడు. కృష్ణమూర్తి రోగిష్టి. తన పేషంటు. అతను ఈ జబ్బు

నయం అయ్యేవరకు పెళ్ళిచేసుకోకూడదు. అయినా ఇరుపక్షాలవారు వినలేదు. అది మానవుడుగా దయానిధి విఫలత.

ఈ విఫలతలనుంచి తేరుకొని, ఈ వాతావరణం నుంచి తప్పించుకోవాలి. బాహ్యశక్తులు తన్ను వంచించాయి. అప్పుడే దయానిధి అంతర్దృష్టిని సాధించుకున్నాడు. హేమ్లెట్ సమస్యని విశ్లేషించి చూశాడు. పెద్దల గత చరిత్ర పిన్నలపై ఎంతటి ప్రభావాన్ని కలుగ చేస్తుందో తెలుసుకున్నాడు. ఈ బాహ్య పరిసరాలనుండి, ఈ విఫలత నుంచి తనకు విముక్తి కావాలి. ఈ విముక్తి అమృతం ద్వారా లభించింది. కాని ఇది పరిపూర్ణమైన విముక్తికాదు. అయితే ఈ శారీరకావధుల్ని దాటి, అంతకుమించిన ఆధ్యాత్మికతవైపుకు అతడు అన్వేషణ ప్రారంభించాడని రచయిత సూచిస్తాడు. "శరీరం అనుభవంతో ఆత్మైపోయింది. తాత్కాలిక విముక్తి లభించగానే కొత్త చోట కాత్యాయని వజ్రం దొరికిన పరిస్థితుల్లో కొత్త జీవితం ప్రారంభించాడు. ఈ కొత్త జీవితం, ఈ జీవితంలోకి తిరిగి కోమలి ప్రవేశించడం, ఇందిర మరణించడం, గనులలో కోమలివల్ల గొడవలు, కాత్యాయనిపై నిందారోపణలు ఇవి అన్నీ 7, 8, 9, 10 అధ్యాయాలల్లో చూపబడ్డ అతని అనుభవాలు. ఇందులో ముఖ్యమైన అనుభవం సంఘం, ఇతరవ్యక్తులు, తన్ను దయతో చూడలేకపోవడం. దయానిధికి కొత్తకాదు. వెనుకటి అనుభవాలే, మరోరూపంలో వచ్చాయి. మార్పు అల్లా పరిసరాలు. అంటే పరిసరాలలో మార్పులు వచ్చినా గతచరిత్ర తాలూకు ప్రభావం పోదు. అది వెన్నాడుతూనే వుంటుంది. వ్యక్తికీ వ్యక్తికీ మధ్య ద్వేషమే తప్ప సమరస భావంరాదు. ఈ సమాంతర సంఘటనల ద్వారా బుచ్చిబాబు చెప్పదలచుకున్న సత్యం ఇదే.

7 వ అధ్యాయంలోవలెనే ఆఖరు అధ్యాయం "చివరకు మిగిలేది" అన్నది కూడా నవలలోని మరో ముగింపును, దయానిధి అన్వేషణకుగల గమ్యాన్ని చూపుతుంది. అయితే దయానిధి ఎదిగాడు, వెనుక

అతడు బాహ్య సంఘర్షణనుంచి విముక్తుడు కావడానికి శారీరక సంబంధం అవసరమైనవాడు. ఇప్పుడు అటువంటివాడు కాదు. ఇప్పుడు లభించిన విముక్తి ఆధ్యాత్మికమైనది. తల్లి విగ్రహం పడిపోయి విరిగిపోయింది. గనులు పూడ్చబడ్డాయి. ఇప్పుడు దయానిధి పూర్తిగా ఆత్మవిమర్శ చేసుకున్నాడు. సంఘాన్ని మార్చలేడు. మనుషుల్ని మార్చలేడు. మారిస్తే బాధ, పగ, యుద్ధం. తనతోతాను సమాధానపడాలి. అది ఈనాటికి సాధించాడు. ఒక ప్రశాంతత, పవిత్రమైన మహత్తర ఆనందం, అతనిలో వుద్భవించింది. అది బాహ్య ప్రపంచంలో లేదు. మంటని చల్లార్చే మంచుకణాల ప్రవాహం అతని హృదయం. "పిచ్చి ప్రపంచాన్ని దయతో దూరంగావుంచే ఔదార్యం, మతాన్ని దైవాన్ని మనుషుల్ని తోసేసి సంతృప్తిచెందే ఆధ్యాత్మికదృష్టి తనలో కడసారి యదార్థం".

చివరకు మిగిలేది తనతోతాను సమాధాన పడటం. అంతేకాదు, చివరకుమిగిలే దేమిటి? అన్న ప్రశ్నకు సమాధానం తెలుసుకొనేటందుకు తనుచేసిన యత్నాలఫలితం. శారీరక సంతృప్తినుంచి ఎదిగిపోయిన ఆధ్యాత్మిక దృష్టి.

ఇవీ అనుభవాల రాపిడిలో దయానిధి సాధించిన విలువలు. అందుకే అనుకుంటాడు దయానిధి తన రచనకు ప్రతీకగా.

"మానవుడికి కావల్సింది మతాలు, దేవుళ్లు, ప్రెముక్కుబళ్లు, రాజకీయాలుకావు. మానవుడికి కావల్సింది దయ. కొంచెం, కాస్తయినా చాలు". ఇది మానవత్వపు చరమోత్కర్ష. దానిని వెలువరించడమే చివరకు మిగిలేది ధ్యేయం.

## కీలుబొమ్మలు

స్వాతంత్ర్యానంతరం వచ్చిన ఆంధ్ర సాహిత్యంలో ''కీలు బొమ్మలు''కు ఒక విశిష్టమైన స్థానం వున్నది. తెలుగువారి—అందునా పల్లీయులైన తెలుగు వారి జీవన విధానానికి ఇది అద్భుతము, వాస్తవికము అయిన దర్పణం. దాదాపు ఒక దశాబ్దం కాలంలో తెలుగు గ్రామాల్లో జరిగిన సంఘటనల వర్ణన, వ్యాఖ్యానం యీ నవల.

ప్రతి విషయాన్ని లోలోతులా తరిచి తాను గ్రహించిన విషయాన్ని ప్రస్ఫుటంగా చదువరులకు అందించగలిగిన కొద్దిమంది తెలుగు రచయితల్లో జి. వి. కృష్ణారావుగారు ఒకరు. అందువల్లనే ''కీలు బొమ్మలు'' కేవలం చదువరులను ఆనందపరిచే నవలగానూ మాత్రమే కాక, వారి ఆలోచనలను రేకెత్తించే ఒక కళాత్మకమైన తత్త్వ చరిత్రగా మనకు గోచరిస్తుంది.

''కీలు బొమ్మలు'' వ్యాఖ్యానాత్మకమైన వర్తమాన ఆంధ్ర గ్రామీణ చరిత్ర. ఒక వాస్తవిక చిత్రాన్ని కళాత్మకంగా వ్యాఖ్యానించడమే దీని ధ్యేయం. ఇందులో రాజకీయాలు (ఇవి లేకుండా పల్లెటూర్లు వుండడం అసంభవం కనుక), కొంతలో కొంత వేదాంత చర్చ (యాథ్యర్థంలో) ఉన్నాయి. కాని ఇది అట్టివానికి సంబంధించిన నవల కాదని ముందుగానే రచయిత చదువరులను హెచ్చరించారు :

> ''ఇది ప్రణయగాథకాదు. ప్రాచీన చరిత్ర కాదు. భారతీయ ధర్మవిశిష్టతా బోధకంకాదు.

> వ్యక్తులను కాని, పార్టీలను కాని, వస్తున్న ఎన్నికలనుకాని ఉద్దేశించి దీనిని వ్రాయలేదు... ఈ రచనకు కళానుభూతే ప్రధానం. పార్టీ ఆవేశాలను సాధ్యమైనంత వరకు మరచి చదివి నప్పుడే ఆ అనుభూతి ఇందులో సాధ్యం.''

అన్నారు ఈనవలకు ముందు పొందుపరచిన "ప్రస్తావన''లో. ఈ నవలను అర్థంచేసుకోవడానికి యీ విషయాలను గుర్తుంచుకోవడం ఎంతైనా ముఖ్యం.

ఈ నవలకు మూల భూతమైనది తెలుగు పల్లెటూళ్ళలోని జీవితం. అందులోనూ స్వాతంత్ర్యం వచ్చాక ఈ పల్లెటూళ్లు ఎలా సంఘర్షణలకు, రాజకీయాలకు ఆలవాలమైనవో, అమాయకులు వానిలోపడి ఎలా నలిగిపోయారో, తప్పులు చేసినవారు ఎలా గొప్ప వారై పోయారో వాస్తవికంగా చూపే కథ ఇది. కాని ఇది కేవలం ఈ సామాన్యమైన విషయాలను గురించినదే కాదు. ఇందులో చిక్కుకొన్న ప్రాణుల మానసిక సంఘర్షణను, ఈ సంఘర్షణల వెనుకనున్న మానవ ప్రవృత్తిని తాత్త్వికంగా దర్శించి, ప్రదర్శించిన గ్రంథం.

ఇందులోని కథ సంక్షిప్తంగా యిది :

ఒకానొక ఊళ్ళో పుల్లయ్య అనే ఒక మోతుబరి రైతు. ఆయన భార్య లక్ష్మమ్మ. పుల్లయ్యకు భార్య అంటే గౌరవం, ఆవిడ నోరంటే భయం. ఒకనాడు పట్నంవెళ్ళిన పుల్లయ్య భార్యకు తెలియకుండా శేఖరం అనే కాగితాల మిల్లు యజమానికి మార్వాడి దగ్గర అడ్డం ఉన్నాడు. శేఖరం అభ్యుదయవాది. శేఖరం తన ఆదర్శాలతో పూర్తిగా చితికిపోయాడని, తాను అడ్డంవున్న ఐదువేలు మార్వాడీ తనచేత కక్కిస్తాడని పుల్లయ్యకు భయం పట్టు

కుంది. డబ్బుపోతుందన్న భయంకాదు, లక్ష్మమ్మకు తెలుస్తుందేమో నన్నభయం.

ఇటువంటి విషయాలు పల్లెటూళ్ళలో పాకిపోవడం. ఎంత సేపు? ఆనోట ఆనోట పడి చివరకు యీ విషయం పుల్లయ్య కూతురుకు తెలిసింది. సీత మొదట్లో నమ్మలేదు. ఆ రాత్రి పుల్లయ్య నిద్రపోబోతూ వుండగా ''చంద్రశేఖరానికి నువ్వు అడ్డం వున్నావని లోకులు అనుకుంటున్నారు, నిజమా?'' అని తండ్రిని అడిగింది సీత. నిద్ర మత్తులోవున్న పుల్లయ్య నోట ''లోకులకు మరి పనిపాట లేమున్నాయి?'' అన్న మాటలు అప్రయత్నంగా దొర్లుతాయి.

ఈ మాటలువిన్న సీత తన తండ్రి శేఖరానికి అడ్డం వుండడం అబద్ధం అన్న నిశ్చయానికి వస్తుంది. మర్నాడు వుదయం యీవార్త బసవాచారికి తెలుస్తుంది. బసవాచారి నోట్లో నువ్వు గింజనానదు. ఊళ్లో అందరికీ తెలుస్తుంది.

ఇక మిగిలిన కథ అంతా—పొరపాటున ఆడిన యీ అబద్ధాన్ని నిలబెట్టుకోవడానికి పుల్లయ్య చేసిన ప్రయత్నమూ, దాని ఫలితాలు.

కొన్నాళ్లు గడిచాక ఒకనాడు లక్ష్మమ్మ తమదగ్గర పనిచేస్తున్న గుమాస్తా సత్యనారాయణను పిలిచి తనభర్త శేఖరానికి అడ్డంవున్న మాట నిజమేనా అని అడుగుతుంది. ఎవరు చెప్పారని అడుగుతాడు సత్యనారాయణ. ''మీ షావుకారే సీతకు చెప్పాడట!'' అంటుంది లక్ష్మమ్మ.

ఆమె అంతటితో ఆగక-శేఖరమే ఫోర్జరీచేసి తనభర్త అడ్డం వున్నట్లు తప్పుడు పత్రాలను సృష్టించాడని శేఖరానికి నోటీసు ఇప్పిస్తుంది, తన అన్నకొడుకు, శేషగిరిఅనే ప్లీడరు ద్వారా. ఇంటికి వచ్చి పుల్లయ్య యీ సంగతి విని ఆగ్రహోవేశుడౌతాడు. నిజాన్ని

తాను ఇదివరకే స్పష్టంగా చెప్పివుంటే ఎంతబావుండేది? ఇప్పుడు ప్లీడరు దగ్గరకు వెళ్ళి నోటీసు ఎత్తి వేసుకొంటే?— భార్యకు నలుగురిలో అవమానం! ఎటూతోచదు పుల్లయ్యకు.

సత్యనారాయణకు ఇదంతా ఆశ్చర్యంగా వుంది. పుల్లయ్య అడ్డం వున్న సంగతి తనకు తెలుసు. పుల్లయ్య ఎప్పుడూ అబద్ధాలు చెప్పేవాడు కాదు. కాని యీ విషయంలో ఎందుకిలా చేస్తున్నాడు? నిజం చెప్పనందుకు అతని అంతరాత్మ అతన్ని బాధించడం మొదలు పెట్టింది.

ఇప్పుడు శేఖరం వ్యవహారం ఏమీ బాగులేదు. కాలేజీలో చదువుకొనే రోజుల్లో అతను సామ్యవాది. ఆధునిక పరిశ్రమలను స్థాపించాలని, కార్మికులకు సమస్త సౌకర్యాలను కలిగించాలని— ఎన్నో ఆదర్శాలతో కాగితాల మిల్లు స్థాపించాడు, కాని కార్మికులు యజమానిని నమ్మలేదు. ఇంకా సౌకర్యాలు, ఎక్కువ జీతాలు కావాలన్నారు. సహకార పద్ధతి మీద నడుపుదామన్నాడు. కార్మికు లెవ్వరూ ముందుకు రాలేదు. మిల్లుమూల బడ్డది. ఉన్నవారు లేని వారు తనదగ్గర దాచుకొన్న ధనాన్నికూడా మిల్లులోనే పెట్టాడు శేఖరం. అంతాపోయింది. ఇప్పుడు పగటిపూట ఊళ్ళోకి రావడానికే జంకుతున్నాడు శేఖరం. అంతలోనే పుల్లయ్య పేరుమీద లక్ష్మమ్మ ఇచ్చిన నోటీసు అందింది. శేఖరానికి అర్థం కాలేదు. ఆనాడు నిజంగా అడ్డంవున్న పుల్లయ్య ఇవాళ ఎందుకు మాటతప్పుతు న్నాడు ? తాను కార్మికుల పక్షం వాడుకావడంవల్ల ధనికుడైన పుల్లయ్య ఇలా తనమీద కత్తికట్టాడని నిశ్చయించుకున్నాడు శేఖరం. ఊళ్లో వాళ్ళకయితే యీ విషయం అంతర్జాతీయ సమస్యే అయింది.

మార్వాడీ దగ్గరనుంచి వుత్తరం వచ్చింది. దానికి లక్ష్మమ్మ దగ్గరవుండి పుల్లయ్యచేత జవాబిప్పించింది. కాని పుల్లయ్య తన

ఆత్మను శాంతింప చేసుకోలేకపోతాడు. లోలోపల ఇంత బాధపడుతున్నా, తన పరువు ప్రతిష్టలు కాపాడుకోవడం కోసం మాత్రం తాను శేఖరానికి హామీవుండడం వచ్చి అబద్ధం అని ఇతరులకు ప్రచారం చేస్తూవుంటాడు, పుల్లయ్య.

ఈ కేసును గురించే రెండుపక్షాలు తీవ్రంగా వాదోపవాదాలు జరుపుకోవడమే కాక తమవైపు సాక్ష్యాలను సమకూర్చుకోవడంలో కూడా నిమ్మగ్నమౌతాయి. అందుకు మల్లయ్య అనే షావుకారు ప్రయత్నం తీవ్రమైంది. మల్లయ్య ఊళ్లో అన్ని విషయాలలోను పుల్లయ్యకు ప్రతికక్షి.

ఆ ఊళ్ళో ఇరు పక్షాల వారికి ప్రియమైనవాడు డాక్టరు వాసుదేవశాస్త్రి. ఆయన సత్యనారాయణకు స్నేహితుడు. జాతీయోద్యమంలో కారాగారశిక్ష అనుభవించినవాడు. పల్లెటూళ్ళకు వచ్చి ప్రజాసేవ చేయాలని స్వగ్రామం వచ్చి ప్రాక్టీసు పెట్టాడు. ప్రతి విషయాన్ని సప్రమాణకంగా ఆలోచించి నిర్ణయానికిరావాలని అతనివాదం. ప్రాచీన అధునాతన సిద్ధాంతాలకు ఈనాడు జరుగుతున్న సంఘర్షణలో వివేకవంతులు సంకుచితస్వార్థాన్ని అధిగమించి, సర్వమానవకోటికి సహేతుకం, సమంజసం అయి ధర్మమార్గాన్ని చూపించగలగాలన్నది అతనిదృఢమైన నమ్మకం. ఈ సిద్ధాంతాలను నమ్మడంలో అతడు రచయితకు దగ్గరవాడనిపిస్తుంది.

ఇటువంటి డాక్టరుకు అనుయాయి పుల్లయ్యగారి రెండో కొడుకు రామారావు. పుల్లయ్య పెద్దకొడుకు మరణించాడు. ఇక రామారావు, సీత, ఇద్దరే పిల్లలు ఆయనకు. అయినా రామారావు ఇంటికిరాడు. ఫిలాసఫీ ఎమ్.ఏ చదివి పట్నంలో వుండిపోయాడు. కొడుకు అక్కడవుండి ఏం చేస్తాడో పుల్లయ్యకు తెలియదు.

రామారావుకు తండ్రి చంద్రశేఖరం మీద ఫోర్జరీ కేసు పెట్టిన సంగతి తెలుస్తుంది. అతడు విస్తుపోయాడు. శేఖరానికి హామీ

వున్నసంగతి తండ్రి తనతో స్వయంగా చెప్పాడు. ఈ విషయం జ్ఞాపకంచేస్తూ తండ్రికి వుత్తరం వ్రాశాడు. దానికి తండ్రి వ్రాసిన సమాధానం అతన్ని ఇంకా ఆశ్చర్య చకితుణ్ణి చేసింది. "ఈ సంగతి నీకేమీ తెలియదు. కాబట్టి మెదలకుండా వూరుకోవడం ఉత్తమం. ఇప్పట్లో నీవు ఇక్కడకు రావద్దని మీ అమ్మకూడా చెప్పమంటు న్నది". ఇదే వుత్తరం... అప్పుడే స్వగ్రామంనుంచి తిరిగి వచ్చిన సీతతో ఈ విషయం ప్రస్తావించాడు రామారావు. సీత తండ్రితనతో చెప్పిన సంగతులు అన్నతో చెబుతుంది. రామారావు వూరికి వెళ్ళడానికే నిశ్చయించుకొంటాడు.

కేసులో నెగ్గడానికి ఎవరి ఏర్పాట్లు వాళ్ళు చేసుకొంటు న్నారు. శేఖరం పుల్లయ్య గుమాస్తా సత్యనారాయణ సహాయం కోరాడు. వారి పూర్వులెవ్వరూ యిటువంటి అన్యాయాలు చేయలే దన్నాడు. కాని సత్యనారాయణ మాత్రం తన షావుకారుకు వ్యతి రేకంగా ప్రవర్తించలేనంటాడు. పుల్లయ్య తన పొరపాటునుగ్రహించి కేసును ఏనాటికైనా ఎత్తివేసుకోవచ్చునని ఆశపడతాడు సత్య నారాయణ.

ఇది ఇలావుండగా, ఊళ్లో దుండగులుచేసే అరాచకాలు ప్రబలాయి. సత్యనారాయణ ఇంటికి ఎవరో నిప్పుఅంటించారు. అయినవాళ్ళ ప్రోద్బలంమీద ఆయన తన స్నేహితుడు డాక్టరుగారింట్లో గడపడానికి వెళతాడు. తరువాత రెండు రోజులకు మల్లయ్య గారి ముప్ఫయి ఎకరాల గడ్డివాము, దాని తరువాత హరిజనాశ్రమం పరశురామ ప్రీతి అయ్యాయి. ఇవన్నీ కమ్యూనిష్టులు చేస్తున్న దుండగాలని అమ్మాయమ్మగారు పేపర్లకు వ్రాసింది.

ఈ వార్త చదివిన డాక్టరు ఆశ్చర్యపోయాడు. శేఖరం పుల్లయ్యల మధ్య వచ్చిన యీతగాదా ఇలా విశృంఖలంగా పాకి పోవడం అతనికి నచ్చలేదు. వారిద్దరికి ఎలాగైనా రాజీ కుదర్చాలని

ఆలోచన చేశాడు. కాని రాజీకోసం పుల్లయ్య దగ్గరకు రావడానికి శేఖరం నిరాకరించాడు. మళ్ళీ కార్మిక సంఘం నెలకొల్పి షావు కార్లకు వ్యతిరేకంగా కార్మికులను పురికొల్పుతున్నాడు.

కేసు విచారణ ప్రారంభం కావడానికి ఒకరోజు ముందు రామారావు స్వగ్రామం వచ్చాడు. తండ్రికి నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు. కాని ఆ ప్రయత్నం విఫలమయింది. తల్లికైనా నచ్చచెప్పాలను కొన్నాడు. కాని లక్ష్మమ్మ కూడా రామారావు మాట వినలేదు. అక్కడనుంచి పట్నానికి వెళ్లిపొమ్మని సలహా నిస్తుంది. రామారావు ముందునిశ్చేష్టుడయినా, తాను తండ్రికి వ్యతిరేకంగా కోర్టులో సాక్ష్యం యివ్వడానికే నిశ్చయించుకొం టాడు.

రామారావు ఊళ్ళోకి రావడం కనిపెట్టిన మల్లయ్య అమ్మాయమ్మతో సంప్రదింపులు జరిపి రామారావును కమ్యూనిష్టు అన్న మిషమీద అరెస్టు చేయించాలని, తద్వారా మానసికంగా పుల్లయ్యను దెబ్బతీయాలని పన్నాగం పన్నాడు. అమ్మాయమ్మ యీ అదను చూచుకొని పుల్లయ్యదగ్గరకు పోయి రామారావును పోలీసులు అరెస్టు చేయబోతున్నారని, అది క్రిమినల్ కేసులో ముద్దాయిగా కాక రాజకీయ డిటెన్యూగా మార్చడంకోసంగాను ఐదువందలు కావాలని గుంజుతుంది.

పుల్లయ్య పెద్దకోడలు రంగమ్మ తన మామగారు మరిదిని కావాలని పోలీసులకు పప్పచెప్పడం విని నిర్ఘాంతపోయింది. వెంటనే రామారావును పిలిపించి జరిగినదంతా వివరించి చెబుతుంది. కేసులో తనకు అడ్డం రాకుండా వుండడంకోసం కన్నతండ్రే తనను పోలీసులకు పప్ప చెబుతున్నాడనివిన్న రామారావు పోలీసులకు స్వయంగా స్వాధీనమౌతాడు.

విచారణ ప్రారంభమైంది. దానితోపాటు వూళ్ళో పరిస్థితులు కూడా విషమించాయి. ఇరుపక్షాలవారు తమ తమ సాక్షులతో కోర్టులో హాజరైనారు.

శేఖరం చాలా దీనావస్థలో వున్నాడు. బాకీదారులందరూ ఇంటిమీద వచ్చిపడుతున్నారు. తన మామగారు తతవల్లనే బికారి అయినాడు. చివరకు ఆయన ఆత్మహత్యకు కూడా తానే కారణ మైనాడు. కాని శేఖరం ఆలోచన అంతా కేసుమీదనేవున్నది. తాను చెయ్యని నేరానికి తన్ను కోర్టుకు లాగారని ధనికవర్గంమీదనే అతనికి అక్కసుగావుంది. దానికి ప్రతిగా కార్మికులను ఉత్సాహపరుస్తూనే వున్నాడు శేఖరం.

ఒకనాడు ఉద్రిక్తులైన కార్మికులు ఊరేగింపు జరుపుతు న్నారు. ఆ కోలాహలానికి బెదరి పుల్లయ్యగారి గిత్త పోలయ్య కొడుకు డొక్కలో కుమ్మింది. 'పిల్లవాడికి పేగులు బయటికి వచ్చాయి. పోలయ్య కోపంలో గిత్తను కొట్టాడు. అది చచ్చి పోయింది. దీనితో పుల్లయ్య శివం ఎత్తాడు.

ఊళ్లో జరుగుతున్న యీ అరాచకమైన పరిస్థితులకు పర్యవ సానం మలబారు పోలీసులరాక. వారి రాకతో పరిస్థితులు భీభత్సంగా తయారయ్యాయి. పాటిమీది జనం అంతా ఎక్కడెక్కడికో పోయి దాక్కున్నారు. మలబారు పోలీసుల ఘాతుక కృత్యాలకు హద్దు లేదు. నోరులేని జంతువులను హింసించారు. స్త్రీలను చెరిచారు. కనిపించిన అందర్నీ దిశమొలలతో నడివీధుల్లో నడిపించారు. దానికి ఆగ్రహం ప్రదర్శించిన డాక్టరు శాస్త్రిని కొట్టబోగా, అడ్డంవచ్చిన పోలయ్యను చిత్రవధ చేశారు.

చివరకు డాక్టరు శాస్త్రి - తనకు మిత్రుడైన మంత్రిగారికి ఉత్తరం వ్రాశాడు. యీ పోలీసుల జులుం గురించి. వెంటనే మలబారు దళం ఉపసంహరించబడ్డది.

శేఖరానికి మూడు సంవత్సరాలు శిక్ష పడ్డది.

పుల్లయ్యగారి విజయానికి ఊరంతా సంతోషించింది. ఈ అదనులో పుల్లయ్యగారిని మంచి చేసుకోవాలని అప్పాయమ్మ మల్లయ్యతో ఆలోచించి పుల్లయ్యకు సన్మానం ఏర్పాటు చేస్తుంది. సన్మానపత్రం మల్లయ్య సమర్పించే ఏర్పాట్లు జరుగుతాయి. సన్మాన సందర్భంలో ఆయనకు ''సర్దార్'' అన్న బిరుదుకూడా యివ్వబడు తుంది.

సన్మానంనుంచి వచ్చిన మగనితో లక్ష్మమ్మ అంటుంది:

''ధర్మమే జయిస్తుంది...ఇది లోకానికి ఆదర్శప్రాయం''.

''నిజమే. సత్యం, ధర్మం కాకపోతే మరేమి జయిస్తుంది?'' అన్నాడు పుల్లయ్య. లైబ్రరీ అరుగుమీద సత్యనారాయణ మధుర కంఠంతో ''యదాయదాహి ధర్మస్య...ధర్మసంస్థాపనార్థాయ, సంభ వామి యుగేయుగే'' అని పాడుతూ వుంటాడు.

ఇది ప్రధాన కథ. దీనికి అనుబంధంగా జరిగిన కథ డాక్టరు శాస్త్రికి, సత్యనారాయణ భార్య పద్మకు సంబంధించినది. పద్మకు శాస్త్రి అంటే వల్లమాలిన అభిమానం. ఒక బలహీనమైన క్షణంలో శాస్త్రి ఆమెకు వశుడౌతాడు. ఆమె గర్భవతి అవుతుంది. గర్భ స్రావం చేయవలసినదిగా ఆమె డాక్టరును అర్థిస్తుంది. తాను వృత్తి ధర్మానికి విరుద్ధంగా నడవలేడు. ఆత్మహత్యకు పూనుకొని తనను తాను శిక్షించు కొందామనుకొంటాడు. పద్మతో పట్నానికి లేచి పోదామని ఆలోచిస్తాడు. కాని అంగీకరించకపోవడంతో తాను ఎన్నడూ చేయని వైద్యం ఆమె విషయంలో చేయవలసి వస్తుంది. శాస్త్రి ఆవూళ్ళో వుండలేక పట్నం పోతాడు.

తన భార్య గర్భవతి అని తెలిసి సత్యనారాయణ ఆమెను అనుమానిస్తాడు. ఆ అనుమానం బలమై అతనికి మనస్థిమితం తప్పు

తుంది. దానికితోడు - తాను సహాయం చేయలేకపోవడం వల్లనే, అధర్మంగా ప్రవర్తించడంవల్లనే శేఖరం జైలుకు వెళ్ళాడని. భగవంతుడే తనకు శిక్షవిధించాడని బాధపడతాడు. ఇంటికి తిరిగిరాడు, లైబ్రరీ అరుగుమీద కూర్చొని కాళహస్తీశ్వరుని శతకం నుంచి, గీత నుంచి పద్యాలు, శ్లోకాలు పాడుతూ కాలం గడుపుతూవుంటాడు.

పుల్లయ్యకు సన్మానం జరుగుతున్ననాడు రామారావుతో సహా డాక్టరు శాస్త్రి కూడా స్వగ్రామం వస్తాడు. ఆ సభలోనే తాను ఆ వూరువదిలి పోవలసి వచ్చిందనీ, తన యింటిని పోలయ్య కుటుంబానికి వ్రాసి ఇస్తున్నాననీ ప్రకటిస్తాడు.

ఇది జరిగిన మరోగంటలో ఆ ఇంటికిగాను ఐదువేలు పోలయ్య కుటుంబానికి ఇచ్చి ఆ ఇల్లును తన పేర వ్రాయించుకొంటాడు సర్దార్ పుల్లయ్య. మనుషుల్లో లోలోతుల పాతుకొనిపోయిన ఈ వర్గ మతద్వేషాలను గమనించిన రామారావుకు పల్లెటూళ్ళంటే అసహ్యం వేస్తుంది.

రామారావు, డాక్టరు శాస్త్రి ఆ రాత్రికి రాత్రే తమ స్వగ్రామం వదిలి వెళ్ళిపోతారు.

ఈ నవలను కృష్ణారావుగారు రెండు విభిన్నమైన పరిధుల్లో నడిపించారు. ఒకటి వాస్తవికతకు రూపకల్పన. ప్రత్యక్షంగా తాను చూచిన సంఘటనలకు కళారూపం. ఇక రెండవది మానసికమైనది, మనస్తత్వ పరిశీలన ఆధారంగా నడిచినది. ఒకే మానవునిలోని రెండు విభిన్నమైన ప్రవృత్తుల ప్రదర్శనకు ఇది రచయితకు ఎంతగానో ఉపక రించింది. వాస్తవికతను, మనస్తత్వ శాస్త్రాన్ని ఒకే సంఘటనలో, ఒకే పాత్రలో కలిపి చూపడం సాహసంతో కూడిన పని. దానిని విజయవంతంగా చూపారు రచయిత.

పాత్రపోషణలో ఇది రచయితకు ఎంతగానో ఉపకరించింది. పుల్లయ్య తాను చేసిన పనికి బాధపడుతూనూ వుంటాడు; మరొక

వంక తన్ను తాను ఆత్మవంచన చేసుకొంటూనూవుంటాడు. శేఖరం కూడా అలాగే!

నిజానికి - ఈ ప్రత్యక్ష, పరోక్ష (లేదా మానసిక) శక్తుల సంఘర్షణే కీలుబొమ్మలు నవల. డాక్టరు శాస్త్రి, రామారావులు కూడా ఈ పరిశోధన నాళికలో ఉపయుక్తాలయిన పరిశోధక వస్తువులే!

ఇందులోని పాత్రలన్నీ ఎంత వాస్తవికములో తెలుగు పల్లెటూళ్ళను గురించి తెలిసిన ఎవ్వరికీ ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఈ వాస్తవికమైన పాత్రల మధ్య సంభవించే సంఘర్షణలు పరిస్థితుల్లోను, వారి చేష్టలలోనుకాక వారివారి ప్రవృత్తులలోను, వారి సంస్కారంలోను వుంటుందని కృష్ణారావుగారు నిరూపించారు. ఇందులోని ప్రతిచిన్న పాత్ర, ప్రతిచిన్న సంఘటన - రచయిత నిశితమైన పరిశీలనకు ఉదాహరణలే! పల్లెటూళ్ళను ఇంత నిశితంగాను, పల్లె ప్రజల్ని, వారి సమస్యలను ఇంత విమర్శనాత్మకంగాను పరిశీలించిన నవల తెలుగులో లేదనే చెప్పవచ్చు.

ఇతివృత్త నిర్మాణంలోకూడా రచయిత రెండు దృక్పథాలను ప్రదర్శించారు. జరుగుతున్న సంఘటలను వానివాని విలువలను అనుసరించి వ్యాఖ్యానించడం ఒక రకమైన దృక్పథం. రచయిత తానుగా వ్యాఖ్యానించడు. కాని ఒక పాత్రచేత ఆ వ్యాఖ్యానం చేయిస్తాడు.

ఉదాహరణకు పుల్లయ్య పెద్దకోడలు రంగమ్మ కొడుకు జగ్గారావు చేస్తున్న అల్లరి పనులకు విసిగి - భగవంతుడు తన భర్తను తీసుకుపోయాడుగాని తనను తీసుకుపోలేదేమని - బాధపడుతుంది. పుల్లయ్య ఆ మాటలకు కంపించిపోయాడు. తన్ను తాను మరచిపోయాడు. చటుక్కున కోడలి దగ్గరకు వచ్చి "అమ్మా ! ఏడవకు. తప్పంతా నాది. మళ్ళీ చేయను. ఈ పాదాలు సాక్షిగా చెబుతున్నాను." అని అమాంతం కోడలి కాళ్ళకు సాష్టాంగ నమస్కారం చేస్తాడు.

ఈ సంఘటనలో పరోక్షంగా రచయిత చేసిన వ్యాఖ్యానం ప్రధాన పాత్ర మనస్తత్వాన్ని ప్రస్ఫుటంగా వెల్లడిస్తోంది. పుల్లయ్యా తానుచేసిన తప్పుకు కుమిలిపోతున్నాడు. తాను చేసిన అన్యాయం వల్లనే తన పెద్ద కొడుకు మరణించాడని అతని లోలోపల ఆవేదన. దానికి వ్యాఖ్యాన రూపమే అతని యీ చేష్ట.

ఇక వ్యంగ్యాత్మకమైన వ్యాఖ్యానం రెండవ పద్ధతి. ఇట్టివి నవల అంతటా కనిపిస్తాయి. ముఖ్యంగా అమ్మాయమ్మను, మల్లయ్యను గురించి చెప్పవలసివచ్చినప్పుడు :

> "[అమ్మాయమ్మగారు] కావాలనుకొంటే రాజకీయ బాధితురాలుగా అయిదెకరాల పొలం సంపాదించి ఉండేది. కాని ఆమె దరఖాస్తు కూడా పెట్టలేదు. అలాంటి వ్యక్తి హరిజన విద్యార్థుల వసతిభవనం కోసం సంపాదించిన సిమెంటు, ఇనుము మొదలైన వాటిలో చాలవరకు బ్లాకు మార్కెట్లో అమ్మింది. లాభం సంపాదించింది అంటారు. ఇవన్నీ నమ్మడానికి వీలు లేదనే చెప్పాలి. కాకుంటే ప్రతి వార్షికోత్సవం ఏ హైకోర్టు న్యాయమూర్తో, ఏ ప్రముఖ మంత్రో, లేక ఏ భారత ప్రధాన నాయకుడో వచ్చి ఎందుకు జరుపుతాడు ?"

ఈ నవలలోని సంఘటనలను, పాత్రలను సార్వజనీనకం చేయుడానికి రచయిత ఒక వినూత్నమైన పద్ధతిని అవలంబించారు. ఈ కథంతా జరిగిన పల్లెటూరుకు రచయిత ఒక ప్రత్యేకమైన పేరు అంటూ ఏదీ ఇవ్వలేదు. మనకు "అవూరు"గాను, ఆయా పాత్రలకు "మావూరు"గాను మాత్రమే ఇది పరిచయం చేయబడ్డది. అంటే— యీవూరు యీవూరే కానక్కరలేదు. ఆంధ్రదేశంలో— భారతదేశంలోనే - ఏ వూరైనా కావచ్చును అని రచయిత సూచించారన్నమాట.

ఈ నవలలో అన్నింటికన్న ముఖ్యమైనది పాత్రలలోని మానసిక సంఘర్షణ. ఇది ప్రధాన పాత్రలో ఇంకా ప్రాముఖ్యం వహించింది.

ఒక అబద్ధంయొక్క విలువ మానవ జీవితంలో ఎంతో యీ నవల విపులంగా ప్రదర్శిస్తుంది. ఒక అబద్ధాన్ని నిజంగా రూపొందించడానికి వంద అబద్ధాలు ఆడడం, ఆ అబద్ధం అబద్ధమే కాదు, నిజమేనని తనను తాను నమ్మించుకోవడం - తదనుగుణంగా మనిషిలో వచ్చే మానసికమైన మార్పులు రచయిత ఎంతో నేర్పుతో చిత్రించారు.

దీనిని గురించి రచయితే తమ ''ప్రస్తావన''లో సూచించారు: ఇది బోజర్ అనే పాశ్చాత్య రచయిత వ్రాసిన "ది పవర్ ఆఫ్ ఎ లై'' అన్న రచన చేసిన సూచనను అనుసరించి వ్రాసింది. "అతడు యీ దేశం వాడుకాడు. ఈనాటివాడు కాడు. అయితే అతని రచనకిది అనువాదం కాదు. అనుసరణమూ కాదు.'' కాని కథకు అంతకూ మూలం ఆ 'పవర్ ఆఫ్ ఎ లై' మాత్రమే!

ఉదాహరణకు తాను శేఖరానికి అడ్డంవున్న మాటను తలుచుకొని, ఎందుకు ఉన్నానా అని బాధ పడతాడు పుల్లయ్య- మొదటి అధ్యాయంలో. రెండవ అధ్యాయంలో పొరపాటున, ఏమరుపాటున అయినా సరే - తాను అటువంటి పని చేయలేదని - కూతురు సీతతో చెబుతాడు. అక్కడనుంచి పుల్లయ్య తన్నుతాను మోసం చేసుకోవడంలో ఒక్కొక్క మెట్టుపైకి పోతూ వుంటాడు. శేషగిరికి అదే విషయం స్పష్టంగా చెబుతాడు. తాను హోటలు గదిలో హామీ పత్రంమీద సంతకం చేయడం సర్వాబద్ధం- అని.

రానురాను ఆ భావం ప్రబలి శేఖరమే అన్యాయంగా తన మీద కత్తి కట్టాడనిపిస్తుంది పుల్లయ్యకు. చివరకు తన్నుతాను ఇలా నమ్మించుకొంటాడు. ''తనది మెత్తని మనస్సు. అందువల్లనే తాను హామీ వున్నానని శేఖరం చెబితే నమ్మాడు.''

ఈ ఆత్మవంచన ఎంత పరాకాష్టకు పోయిందో నవల చిట్టచివరి మాటల్లో విశదం అవుతుంది. లక్ష్మమ్మ మగని సన్మానానికి సంతోషిస్తూ "ధర్మమే జయిస్తుంది" అన్నప్పుడు పుల్లయ్య "అవును. ధర్మం, సత్యం, కాకపోతే మరేమి జయిస్తుంది?" అంటాడు.

లక్ష్మమ్మ విషయంలో అది నిజమైన భావనే! కాని పుల్లయ్య ఆత్మవంచనకు అది వ్యంగ్యాత్మకమైన వ్యాఖ్యానం. ఈ వ్యాఖ్యానానికి పరాకాష్ఠ. సత్యనారాయణ నవలాంతంలో పాడుతున్న భగవద్గీతలోని శ్లోకం "ధర్మ సంస్థాపనార్థాయ, సంభవామి యుగేయుగే" అన్నది.

ఈ వ్యాఖ్యానంతో నవల అంతం చేయడంవల్ల రచయిత ప్రస్తుత ప్రపంచంలో ఎటువంటి ధర్మమూ, సత్యమూ రాజ్యం చేస్తున్నాయో పరోక్షంగా ప్రదర్శించారు.

ఈ భావమే రచయిత డాక్టరు శాస్త్రి ద్వారా మరొకచోట ఇంతకన్న విపులంగా, నిశితంగా చెప్పించారు.

> "ప్రపంచంలో ఏనాటికైనా ధర్మం గెలుస్తుందని నమ్మకమేమిటి? లేదు. కేవలం అంధవిశ్వాసం. కేవలం బలమే గెలుస్తుంది. ఆ బలం దేహబలమో, ధనబలమో, సంఘబలమో తప్ప ధర్మబలంకాదు."

ఇంత వ్యంగ్యాత్మకమైన, ఆశారహితమైన పరిస్థితుల ప్రదర్శనలోను యువతరంమీద రచయిత ఎంతో ఆశాభావం వ్యక్తం చేశారు. ఈయువతరానికి ప్రతినిధులు మల్లయ్య, కొడుకు రామారావు. వీరిద్దరి మధ్యా ఎంతో విభిన్నత వుంది. మల్లయ్యకొడుకు చదువులేనివాడు. రామారావు చదువుకొన్నవాడు. మల్లయ్యకొడుకు ఆవేశపూరితుడు. రామారావు ప్రతిపనినీ కూలంకషంగా ఆలోచించికాని చేయనివాడు. అయినా యిద్దరూ ఒక్కవిషయంలో సన్నిహితులు. దుర్మార్గాన్ని

యిద్దరూ సహించలేరు. కాలుష్యాన్ని ఎలాగైనా పెల్లగించివేసి దాని స్థానే మంచిని సుస్థాపితం చేయాలనేవారు.

అందువల్లనే ఆ మంచికి ప్రతినిధి అయిన డాక్టరు ఆ వూరు నుంచి వెళ్లిపోతానంటే యిద్దరికీ బాధ, కోపం కలిగాయి. అయితే డాక్టరుగారు మల్లయ్యకొడుకుకు యిచ్చిన సలహా యువతరంవారికి రచయిత యిచ్చిన సలహాగా మనం అంగీకరించవచ్చు.

"సత్యాన్వేషణ, స్వాతంత్ర్య సముపార్జన యీ రెండే ముఖ్యాలు. ఏనాడు యివి అంతరిస్తాయో ఆనాడు మానవుడు మానవుడు కాడు. పశువు అవుతాడు."

# అల్పజీవి

"అల్పజీవి" ఈ శతాబ్దపు అయిదవ దశాబ్దంలో వెలువడ్డ విశిష్టమైన తెలుగు నవల. తెలుగు నవలా ప్రపంచంలో ఈ నవల ఒక మలుపును తెచ్చింది. 'భారతి'లో ప్రచురితమైనప్పుడు ప్రతి తెలుగు పాఠకుడికీ ఇది కథా, కావ్యమా అనే అనుమానాన్ని రేకెత్తించింది. ఆ భావాన్ని నవల అభివ్యక్తిలోని నవ్యతవల్ల సాధించినదే! దీని రచయిత శ్రీ రాచకొండ విశ్వనాథ శాస్త్రి,

శ్రీ విశ్వనాథశాస్త్రి నేటి తెలుగు కథానికా రచయితల్లో సుప్రసిద్ధుడు. "ఆరు సారాకథలు", "ఆరు సారోకథలు", "మరో ఆరు చిత్రాలు"— మొదలైన కథా సంపుటాలు ఆయన ప్రతిభా దీప్తికి తార్కాణాలు. "అల్పజీవి"లో ఆయన ప్రవేశపెట్టిన విశిష్టమైన అభివ్యక్తి మార్గమే తరువాతి కథల్లోకూడా కానవస్తుంది.

అధునాతన సాహిత్యంలో మనస్తత్వ పరిశీలన చాలా ప్రాధాన్యం వహిస్తున్నది. ఫ్రాయిడ్ సిద్ధాంతాలు, సాహిత్య రంగంలో అనేక విప్లవాత్మకమైన ఉద్యమాలకు కారణాలయినవి. సర్రియలిజం లాంటి ఉద్యమాలు సాహిత్య రంగాన్నేకాక చిత్రకళా రంగాన్ని కూడా ప్రతిభావితం చేశాయి.

పూర్వం కావ్యమూ, నవల అన్నీ విస్తృతమైన సమాజ జీవితాన్ని సర్వతోముఖంగా ప్రదర్శించేవి. కాని ఆధునిక కాలంలో వ్యక్తి కేంద్రంగా అతని రాగద్వేషాలు ఆధారంగా సమాజచిత్రం గీయబడుతున్నది. "అల్పజీవి"లో సుబ్బయ్య పాత్ర అటువంటిది. నవలలోని మిగిలిన అన్ని పాత్రలు అతని వ్యక్తిత్వంలోని "కాంప్లెక్సెస్" నుంచి పుట్టినవే.

ఇది ఒక విధంగా స్వగతంలాంటి రచన. ఆంతరిక సంభాషణలు (Interior Monologue) ఆధారంగా ఆత్మాశ్రయంగా సాగిన రచన ఇది. ఈ రచనలోని వైశిష్ట్యం సుప్త చైతన్య, చైతన్యావస్థల సంఘర్షణను చిత్రించడంవల్ల ఏర్పడుతున్నది. వ్యక్తి ప్రవృత్తి, ఆ పాత్ర యొక్క వికాసం ఈ చిత్రణవల్ల మనకు స్పష్టంగా గోచరిస్తున్నాయి. మానవుని మనస్సులో మెదిలే పరంపరానుగతాలైన భావాల చైతన్య ధార వ్యక్తీకరింప బడ్డప్పుడు ఇలా లోలోపల మనస్సులో మెదిలే వివిధ భావాల వెనుక ఏదో అంతస్సంబంధం వున్నదని మనకు స్పష్టం అవుతున్నది.

> "వెంకట్రావునెలాగైనా కలుసుకోవాలి. కలుసుకొని సంగతేదో తేల్చుకోవాలి. తగు మనిషి తరహాగా లేదు వెంకట్రావు ప్రవర్తన. ఏహ్ మి తగు మనిషి తరహాగా లేదు. ఇంట్లో వుండే ఆవిడచేత అబద్ధాలాడించేడు. (ఎంత ఇంపుగా చెప్పింది. పాపం ఆవిడ తప్పేమీ లేదు)."

ఇక్కడ వెంకట్రావు కనిపించడం, అతనితో డబ్బు సంగతి తేల్చుకోవడం ముఖ్యం. ఆవిడ చెప్పిన సమాధానం "లేదు" అని. కాని సుబ్బయ్య ఆవిడ "ఇంపుగా చెప్పడం" అన్న ప్రసక్తి తీసుకు రావడం అతని వ్యక్తిత్వాన్ని చాటుతున్నది. ఈ భావధారే సుబ్బయ్య తన ఇంటిముందు కూర్చుని రోజూ చూసేవారిని— ఎర్ర చీర మనిషి, మునీశ్వర్లవారు, లేడిపిల్లలు —గురించి ఆలోచించడంలో కనిపిస్తుంది.

ఈ భావధార ద్వారా రచనలో ఒక అవిచ్ఛిన్నమైన సూత్రం సాధించబడ్డది. ఇది అభివ్యక్తీకరణలోని గొప్పతనం. భూత భవిష్యద్వర్తనాలు విడివిడిగా వున్నా మానవుడి మనస్సులో ఆ మూడు పరస్పరం మిశ్రితాలై నడుస్తూవుంటవి. కాలగతిని ఈ విధంగా

వర్ణించడం జేమ్స్‌జాయిస్, వర్జీనియావుల్ఫ్ వంటి పాశ్చాత్య నవలా కారులు చేశారు.

''అల్పజీవి''లోని కథ అతి అల్పమైనది. సుబ్బయ్య సామాన్యుడు. ఒక ఆఫీసు గుమాస్తా. భయస్థుడు. అతని బావమరిది వెంకట్రావు గవరయ్య అనే కంట్రాక్టరు దగ్గర ఐదువందలు తీసుకొని తనకు అవసరానికి ఇవ్వమని బలవంత పెట్టడంతో కథ ప్రారంభం అవుతుంది. సుబ్బయ్య డబ్బు తెస్తాడు. కాని ఆఫీసులో గవరయ్య పని పూర్తి చేయలేక పోవడంతో గవరయ్య డబ్బుకోసం నిర్బంధం చేస్తాడు. ఇవ్వనంటాడు సుబ్బయ్య. ఆరాత్రే గవరయ్య మనుష్యులు బలవంతాన అతనిచేత వెయ్యిరూపాయలకు నోటు రాయించుకుంటారు. ఎలాగైతేనేం చివరకు వెంకట్రావు, మనోరమ, అవధాని కలిసి ఆ బాధను తప్పిస్తారు.

ఈ అల్పమైన సంఘటనే ఈ నవలకు ఆధారం. కాని దీనిలో అవలంబించిన చైతన్యధారావిధానం దీని గొప్ప మనోవైజ్ఞానిక నవలనుచేస్తున్నది.

నవలలోని మొదటి అధ్యాయమంతా కథానాయకుడి పాత్ర చిత్రణ. ఈ చిత్రణ కొంత అతడే చేసుకొన్నది. మరికొంత అతని చుట్టూవున్న వ్యక్తులు చేసినది. సుబ్బయ్య స్వభావంలో భయం, తక్కువతనం (Inferiority Complex) ప్రధానంగా కనిపిస్తాయి. ఈ భయం ప్రతినిత్యమూ సుబ్బయ్యను ఆశ్రయించే వుంటుంది. ఈ భయాన్నుంచి రక్షణ కలిగినప్పుడు మాత్రం అతడు ఎటువంటి పనైనా చేయ సాహసిస్తాడు. ''భయానికీ మంచికీ పొందికలేదు. పిరికివారు ఎవ్వరూకూడా మంచివారు కాజాలరు'' అన్న రచయిత మాటలను బట్టి సుబ్బయ్య బాహ్య స్థితివల్లనే కాక మానసికమైన స్థితివల్లకూడా అల్పుడుగానే చిత్రించబడ్డాడు.

అయితే ఈ భయానికి గల కారణాలు నిద్రాణమై చిన్నతనం నుంచి అతన్ని ఆవహించే వున్నాయి. సవతి తల్లి క్రూరత్వం, సమాజం అంటే భయం, తండ్రిని ఎవరో కొట్టిన సంఘటన ఇవన్నీ అతని భయానికి కారణాలు. ఈ కారణాలు సుప్త చైతన్యంలో నిలిచివుండి అప్పుడప్పుడు వెలికి వస్తూవుంటాయి. గవరయ్యా మనుష్యులు హింసించిన నాటి రాత్రి అతనికీ విషయాలు జ్ఞాపకం వస్తాయి.

సుబ్బయ్య స్వభావం అందరికీ ఒదిగి వుండడం. వెంకట్రావుకు, గవరయ్యకు, చివరకు భార్య సావిత్రికికూడా అతడు భయపడతాడు. వారికంటె తనను తక్కువగా చూచుకుంటాడు. ''మొగుడు మొగుడు కాకపోతే ఆడదాని బ్రతుకింతే'' అన్న సావిత్రి మాటలు ఇతనియెడ యదార్థాలే.

సుబ్బయ్య కల్పించుకున్న పాత్రలు అతని కల్పనలోనుంచి పుట్టినవి. స్వప్నం మనలో నిద్రాణమైవున్న కోర్కెలకు అవ్యక్త రూపం. అలాగే మన ఊహా కల్పనలుకూడా నిత్యజీవితంలో పొంద లేని అనేక అనుభూతులకు ప్రతిరూపాలే. సుబ్బయ్య కల్పనలో నుంచి పుట్టిన నలుగురు వ్యక్తులూ అతనిలోవున్న వివిధ వాంఛలకు ప్రతీకలు. ఎర్రచీర మనిషి, మునీశ్వర్లవారు, ఇద్దరు లేడిపిల్లలు అతనిలో నిద్రాణమై వున్న ప్రేమ, శాంతి, స్త్రీ గతమైన వాంఛ, బాదరబందీలేని హాయి అయిన జీవితం— వీటిని చిత్రిస్తారు.

ఈ నవలలో ముఖ్యమైనది ఒకేఒక పాత్ర — సుబ్బయ్యది. వెంకట్రావు, గవరయ్యా, మనోరమలు సుబ్బయ్యను వ్యక్తీకరించే మూడు వుద్వేగాలకు ప్రతినిధులు. వెంకట్రావు ధనాశకు, గవరయ్యా స్వార్థానికి, మనోరమ ప్రేమకూ ప్రతీకలు. భయము, లోభమూ, కామము ఈ మూడింటికి పై ముగ్గురు వ్యక్తులు వ్యాఖ్యానాలు. సుబ్బయ్య జీవితం కేంద్రంగా ఈ మూడు శక్తులూ మూడు కోణా

లుగా కలిగిన "సమాజము" అన్న త్రిభుజాకార చిత్రము ఈ నవలలో గీయబడ్డది. ఇందులోని మిగిలిన పాత్రలు అన్నీ పై మూడు వర్గాల పాత్రల్లో ఇమిడిపోతాయి.

రచయిత ఈ నవలలో ప్రయుక్తం చేసిన కథా కథన విధానాన్ని "ఇంటీరియర్ మోనొలోగ్" అన్నాము. ముఖ్యపాత్ర ఒక సన్నివేశాన్ని గురించి, ఆ సన్నివేశం తన మనస్సులో చిత్రించిన అనేక భావాలను గురించి తనలోతాను అనుకుంటున్నట్లు చిత్రణ జరిగితే దానిని ఆంతరిక సంభాషణా రీతి అనవచ్చు. పోతన్న వచ్చినప్పుడు ఎంతో సంఘర్షణపడి ''కొంత వ్యవధి ఇస్తే ఇచ్చేస్తాను'' అంటాడు సుబ్బయ్య. కాని వెంటనే ఇలా అనుకుంటాడు.

"వచ్చేసింది మాట. ఇవ్వననేస్తే ఎంత బావుణ్ణు!
ఇవ్వననేస్తే ఏం చేయగలడు గవరయ్య?
ఏంచేయగలడా, ఏమైనా చేయగలడు.
అటువంటి మనిషితో పేచీలు పెట్టుకుని
ప్రయోజనంలేదు. సాఫీగా పోతే నయం."

ఈ ఆలోచనవల్ల సుబ్బయ్య మనస్సులోవున్న సంఘర్షణ, చివరకు తాను చేసినదానికి సమాధానపడడం మనకు కనిపిస్తుంది. ఇలా బాహ్యా, అంతరాల పరస్పర సంఘర్షణ, సమాధానం ఈ నవల అంతటా ప్రయుక్తం చేయబడ్డది.

ఈ నవలలోని ప్రధానపాత్ర చిత్రణలో ''భయం'', "తక్కువ తనం" అనే భావాలు (fear complex, inferiority complex) ప్రధానంగా ప్రయుక్తం చేయబడ్డాయి. అడ్లర్ అనే మనస్తత్వ శాస్త్రవేత్త మానవులలోని ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సును గురించీ,

అది ఆ వ్యక్తుల ప్రవర్తనమీద కలగజేసే ప్రభావాన్ని గురించి ఎంతో నైపుణ్యంతో సిద్ధాంతీకరించాడు. ఆడ్లర్ రూపొందించిన యీ సిద్ధాంతం ఇందులో ఎంతో ప్రతిభావంతంగా చిత్రించబడ్డది. సుబ్బయ్య భయం, మిగిలిన అందరికంటే తాను అల్పుణ్ణనే భావమే యీ నవలలో ప్రతి సంఘటనకు మూలం.

కథలో, కథా నిర్వహణలో, కథాకథనంలో ఎంతో వినూత్నతను సాధించిన "అల్పజీవి" తెలుగు నవలను ఆధునికత వైపుకు మళ్లించిన విజయవంతమైన ప్రయత్నం.

# చదువు

సమకాలీన తెలుగు నవలా రచయితలలో శ్రీ కొడవటిగంటి కుటుంబరావు ముఖ్యుడు. అటు రాశిలోనూ, ఇటు గుణంలోనూ; కూడా ఆయన నవలలు చెప్పుకోతగ్గవి. గల్పిక మొదలుకొని నవల దాకా ఉండే అన్ని వచన సాహిత్య విధానాలను ఆయన ఉత్తమంగా నిర్వహించాడు. తెలుగులో నవలికకు ప్రాణంపోసింది ఆయనే!

కుటుంబరావు నవలలలో కొట్టవచ్చినట్లు కనిపించే గుణం నిజాయితీ (సిన్సెరిటీ). తనకు పరిచయం అయిన వాతావరణాన్ని, తన అనుభవం పరిధిలోకి వచ్చిన పాత్రలని మాత్రమే తన నవలలలో చూపాడు కుటుంబరావు. ఆయన రచనలన్నింటిలో ''ప్రేమించిన మనిషి'' గొప్పరచన. మానవతా వాదాన్ని సృజనాత్మకంగా వ్యాఖ్యానించిన నవల అది.

''చదువు'' కుటుంబరావు వ్రాసిన ఒకేఒక్క నవల అనవచ్చు. మిగిలినవన్నీ నవలికలే! నవలికకూ, నవలకూ ఉండే అంతరం కేవలం వాని విస్తృతిలోనే కాక, పాత్రపోషణలోను, ఇతివృత్త నిర్మాణం లోనుకూడా గమనించవచ్చు. ఆ అంతరం ''ప్రేమించిన మనిషి'', ''చదువు'' ల మధ్య స్పష్టంగా కన్పిస్తుంది.

''చదువు'' మొదటి ప్రపంచ యుద్ధానికి ఆరేడు సంవత్సరాలు ముందుగా ప్రారంభమై, 1935 తో అంతమౌతుంది. ముప్ఫయి సంవత్సరాలపాటు తెలుగుదేశంలోని మధ్యతరగతి జీవితాన్ని ఏ ఏ ఉద్యమాలు, ఏఏ భావాలు కదిలించాయో ''చదువు'' విస్పష్టంగా చూపుతుంది. ఆ దృష్టితో చూస్తే ''చదువు'' ను తెలుగులో వచ్చిన అత్యుత్తమ డాక్యుమెంటరీ నవలగా పేర్కొనవచ్చు.

సుందరం అన్న పిల్లవాడి అక్షరాభ్యాసంతో ప్రారంభమైన నవల అతని కొడుకు చదువులో ప్రవేశించడంతో అంతమౌతుంది. ఈ విధంగా ఒక తరం కథని ''ప్రత్యక్ష కథనం'' అనిపించేటంత వాస్తవికంగా రూపొందించారు కుటుంబరావు.

సీతమ్మ అనే ఇల్లాలుకు సుందరం అనే కొడుకూ, జానకి అనే కూతురూ ఉన్నారు. సీతమ్మ కొడుకును ఆదర్శంగా (తనదృష్టిలో) పెంచాలని తాపత్రయ పడ్డది. బడి అంటే బంధిఖానా అని నలుగురు అమ్మలక్కలూ అనే మాటలు సీతమ్మకు నచ్చవు. కొడుకుకు చదువు మీద ఆసక్తి కలిగించి చదివించాలని ఆవిడ అభిప్రాయం.

సీతమ్మగారు కొడుకు చదువుకోసం పడిన ఆరాటం, సుందరం వీధిబళ్ళో ''ఓనామహా శివాయహా'' లు చదవడంతో ప్రారంభం అవుతుంది. అక్కడనుంచి కథాంతం వరకు సుందరం అటు బళ్ళోను ఇటు జీవితంలోను నేర్చుకున్న పాఠాలను క్రమబద్ధంగా రచయిత చూపారు. ఆనాటి వీధిబడులు, పంతులుగారి దౌష్ట్యం, చిన్నతనంలో పిల్లల అనుభూతులు ఇందులో ఎంతో వాస్తవికంగా చిత్రించబడ్డాయి.

వీధిబడినుంచి హైస్కూలుకు, హైస్కూలునుంచి కాలేజికి, కాలేజినుంచి సంసారజీవితంలోకి నడిచినా, సుందరం జీవిత వాహిని - అందరు మనుష్యులకువలెనే - ఎన్నో ఉపనదులను తనలో ఇముడ్చు కొంది. ఇందులో ముఖ్యమైనవి శేషగిరిమామయ్య జాతీయ పోరాటంలో సాగించిన ఉద్యమాలు, నరుసు వేసిన నాటకాలు, అన్నింటిని మించి చిన్నతనంలో ఎంతో దగ్గరగా ఉంటూ వచ్చిన తల్లికి, కొడుకుకూ, రానురాను ఏర్పడుతూవచ్చిన అగాధం-దాని పరిణామాలు.

ఈ నవలలో జాతీయోద్యమాన్ని గురించిన క్రమబద్ధమైన వివరణ కన్పిస్తుంది. ఈ క్రమం ఆయా సంఘటనలను పేర్కొనటం కాక, ఆ సంఘటనలు దేశాన్ని ; పల్లెటూళ్ళను, పట్నాలను; కుటుంబాలను, వ్యక్తులను ఏ విధంగా ఉత్తేజపరిచింది, ఆ ఉద్రేకంలో ప్రజలు

వెనుకముందులూ, మంచిచెడులూ, ఆలోచించకుండా ఏ విధంగా ముందుకురికిందీ తెలియచెబుతాడు రచయిత.

ఏ సంఘటనను చెప్పినా నాణానికి ఉన్న ''బొమ్మ-బొరుసు'' వలె ఒక సంఘటనను గురించి రెండు విభిన్న వర్గాలవారు ఏమనుకుంటున్నారో చెప్పడం కుటుంబరావు రచనావిధానంలో ముఖ్యలక్షణం. సుందరం ఎరిగి ఉన్న ఇద్దరు టీచర్లు-సీతప్ప, సాంబయ్యగార్లు ఇందుకు నిదర్శనం. బాలగంగాధర తిలక్ చనిపోతే సీతప్పగారు తాను ఖిన్నుడై పోయి ''అటెండన్సు తీసుకోలేదు. పిల్లలతో జాస్తిగా మాట్లాడనూలేదు. విచారసముద్రంలో మునిగిపోయినాడు''. ఇదే సందర్భంలో సాంబయ్యగారు ఏమి చేసి ఉండేవాడో రచయిత ఇలా ఊహిస్తాడు. ''ఇదే సాంబయ్యగారయితే, ఈ తిలక్ ఏంచేశాడో, ఎందుకు గొప్పవాడో పిల్లలకు చెప్పి ఏదోవిధంగా బ్రిటిష్‌వాళ్ళను తిట్టి ఉండేవాడే! సీతప్పగారి విచారం చూసి పిల్లలు విచారపడ్డారే కాని తిలక్‌గారినిగురించి వాళ్లు తెలుసుకున్నది ఏమీ లేదు''.

శేషగిరి చెప్పే ఉపన్యాసాలు, ఉద్యమాన్ని నమ్మి అయన తన కొడుకు చదువు మాన్పించి అతని భవిష్యత్తును పాడుచేయడం మొదలైన ఉద్యమ ఫలితాలను చెప్పడంలో రచయిత ఏ మాత్రమూ సానుభూతి లేని వ్యక్తిగానే కన్పిస్తాడు. కాని జలియన్‌వాలా బాగ్ దురంతాలు, ఉద్యమం ప్రజలను ఎలా ఉత్తేజితులను చేసిందీ చెప్పినప్పుడు ఆ ఉద్యమంలోని మంచినికూడా పేర్కొంటాడు. ఈ విధంగా ప్రతి సమస్యకూ ఉన్న ''బొమ్మ-బొరుసు'' లను పేర్కొనడం కుటుంబరావుగారి ప్రత్యేకత.

సుందరం కథను రచయిత చెప్పిన తీరు చూస్తే, సుందరంలో రచయిత తన్ను చూసుకున్నారనిపిస్తుంది. రచయిత జీవితానికి, సుందరం జీవితానికి కొన్ని సంఘటనలలో సామ్యం ఉన్నమాట వాస్తవమే! అంతమాత్రాన ''ఇది రచయిత ఆత్మకథా సదృశమైన

నవల'' అనటానికి వీలులేదు. రచయిత సుందరం మనస్సులో ఉన్న భావాలమీద చేస్తూవచ్చిన వ్యాఖ్యలను గమనిస్తే ఈ విషయం రూఢి అవుతుంది.

సెకండ్‌ఫారం చదువుతున్న సుందరం మేనమామ కొడుకు నరుసు మాటలు వింటాడు. అప్పుడు సుందరం పరిస్థితిని రచయిత ఇలా వర్ణిస్తాడు :

> "నరుసు మాట్లాడుతుంటే వాడు ఎవరినో ఎందుకో అపహాస్యం చేస్తున్నట్టు సుందరానికి తోచింది. తనను చూచి తాను నవ్వుకుంటున్నాడేమో కూడా సుందరానికి తెలియలేదు.''

ఈ విధంగా సుందరం మనస్సులోని విభిన్నమైన ఉద్వేగాలను, అతని మనస్సులో మెదిలే వివిధ భావాలను రచయిత చెప్పడం చూస్తే సుందరం భావాలకూ, రచయిత భావాలకు కొంత సామ్యం కనుపించక మానదు.

''చదువు'' లో రెండు రకాల చదువులను సవిమర్శకంగా పరిశీలన చేసినట్లు కన్పిస్తుంది. ఒకటి స్కూలు చదువు. ఇందులో రెండోది జీవితం నేర్పే చదువు. ఇందులో మొదటిరకం చదువుకన్న రెండవదానికే ఎవరైనా ఆధిక్యతనిస్తారు. కుటుంబరావుగారిచ్చే ఆధిక్యత మాటల్లో వ్యక్తం కాదు. ఆయా సంఘటనలలోను, ఆ సంఘటనలమీద రచయితచేసే విమర్శల్లోను ఆ భావం ద్యోతకం అవుతుంది. స్నేహితులద్వారా వాతావరణంద్వారా మనిషి ఎంత నేర్చుకుంటాడో సుందరం జీవితం విడమరచి చెపుతుంది. స్కూలులో చెప్పే చదువు ఉద్యోగానికితప్ప పనికిరాదు. బయటి చదువు మనిషిని ''మనిషిగా'' చేస్తుంది. జీవితంచెప్పే చదువు మానవత, నలుగురినీ అర్థం చేసుకుని, తన వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూనే అవతలివాళ్ళను సహృదయంతో అర్థంచేసుకోవడం - ఇదీ ''చదువు'' చెప్పే గుణపాఠం.

కుటుంబరావు నవలలన్నీ వాస్తవిక జీవిత చిత్రాలు. ఇందులో మామూలు నవలలలో ఉండవలసిన లక్షణాలు అంతగా గోచరించవు. సంఘటనలను పేర్పుగా పేర్చుకుంటూ పోయి, ఒక పతాక స్థాయి సన్నివేశాన్ని చూపడంకాని లేదా కొన్ని బలమైన సంఘర్షణలను పేర్చుకుంటూ పోయి, పరాకాష్ఠను చిత్రించడంకాని ఈ నవలలో కన్పించవు. ఒక హృదయమున్న వ్యక్తి తన జీవితభావాలను మనకు చెపుతున్నట్లుగా ఉంటాయి ఇవి అన్నీ. ఉద్వేగం లేదు. వాస్తవిక చిత్రాన్ని యదార్థంగా చిత్రించడం కుటుంబరావు చేసిన పని. అందువల్ల చాలామంది పాఠకుల్ని కుటుంబరావు కదిలించలేడు.

''చదువు'' లో మాదిరిగానే మిగిలిన అన్ని రచనల్లోనూ కూడా కుటుంబరావు వ్యాఖ్యాతగా మనకి కన్పిస్తాడు. తాను ప్రత్యక్షంగా చూచిన ఒక సంఘటనని మనకు అదే పద్ధతిలో, అదే క్రమంలో తిరిగి చెపుతున్నాడా అనిపిస్తుంది. ఈయన రచనా శిల్పాన్ని "ప్రత్యక్ష వ్యాఖ్యాన పద్ధతి" (Running Comentary) అనవచ్చు.

''చదువు'' లో రచయిత చేసే కథాకథనంలో ముఖ్యంగా మనకు కన్పించేది ఆయన అప్పుడప్పుడు చేసే సున్నితమైన వ్యంగ్య వ్యాఖ్యానం.

దసరాకు పిల్లలు ఇంటింటికీ తిరుగుతున్నారు. "జయాభి జై భవా'' అని అరుస్తూ "జయ విజయీభవా! దిగ్విజయీభవా!'' అనే మాటలను ఇలా భ్రష్టం చేస్తున్నారని ఎవరో వ్యాఖ్యానం చేశారు. ఈ విమర్శ చేసినవెంటనే పిల్లలు ఆ యింట్లోనుంచి బయటకు వస్తూనే మామూలు ప్రకారం "జయాభి జై భవా" అని కేక వేశారు. రచయిత అంటాడు: "తప్పొప్పులెవరిక్కావాలి? సంస్కృతి కన్న సంప్రదాయం బలమైనది ; అర్థంకంటె నినాదం బలమైనది,"

ఇటువంటి వ్యాఖ్యానాలు ఈయన నవలలనిండా కోకొల్లలు. వీనిద్వారానే రచయిత తన యధార్థ చిత్రణకు ఒక దృక్పథాన్ని జోడిస్తాడు.

తల్లికి సుందరానికి ఉన్న సంబంధాన్ని చిత్రించడంలో రచయిత ఒక జీవిత సత్యాన్ని మనముందు ఉంచాడు. చిన్నప్పుడు తల్లిచాటు పిల్లవాడైన సుందరం క్రమంగా ఆవిడకు దూరంకావడం అతిసహజం. ఈ దూరం కావడానికి రచయిత చూపిన సంఘటనలను ఒకదాని ప్రక్కన మరొకదానిని అమర్చిచూస్తే, ఈ సున్నితమైన వ్యంగ్య భావాన్ని రచయిత ఎలా వెలువరించాడో మనకు స్పష్టంగా తెలుస్తుంది.

సుందరం రచయితగా మారడం, ఆ రచనలుకూడా సాంఘి కోదంతాలుకావడం కొంతవరకు జీవితం సుందరానికి నేర్పిన అనుభవాల ఫలితమే. శకుంతలకథను రాయాలనుకోవడం, వితంతువులు తిరిగి వివాహం చేసుకోవాలని భావించడం-ఇవి రచయితగా సుందరం వెలికి రావడానికి తోడ్పడ్డ సంఘటనలు. సుందరం రచయితగా మారడం తోటి మనుష్యులను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడంలో ఒక భాగమే.

సుందరానికి జీవితంలో కలిగిన ఇన్ని అనుభవాలు ఒకఎత్తు, తన కొడుకు అక్షరాలు గుర్తుపడుతూ ఉంటే భార్యతోపాటు తాను కూడా ఆనందించడం మరొక ఎత్తు. అతనికి తన చిన్నతనం జ్ఞాపకానికి వచ్చింది. ఆనాడు తన తల్లి తనకు చదువుమీద పెట్టిన ఆసక్తి ఈనాడు ఇంకా తనచేత పుస్తకాలు చదివిస్తున్నది.

తన కొడుకు రాస్తున్న అక్షరాలనుచూసి ఆనందిస్తున్న తండ్రిగా సుందరం తన కొడుక్కు కూడా ఆ ఆసక్తి కలగాలనుకోవడం ఆశ్చర్యం కాదు. అందువల్లనే ఒకతరం కథ సుందరానిది. కొత్త తరానికి నాందీ వాక్యం పలుకుతూనే తన తరానికి మంగళగీతం పాడతాడు సుందరం అనే కుటుంబరావు. కాని కొత్తతరానికి ఆశయాలలోను, ఆశలలోను, భేదం లేదు. అది పరంపరానుగతంగా వస్తున్న మానవ చరిత్ర చెప్పేకథ.

# రుద్రమదేవి

తెలుగులో వచ్చిన చారిత్రక నవలలనుపరిశీలిస్తే, స్వాతంత్ర్యం రాకముందు వచ్చిన నవలలకు, ఆతరువాత వచ్చిన నవలలకు కొంత అంతరం ఉన్నట్లు స్పష్టమవుతుంది. స్వాతంత్ర్యానికి పూర్వం వచ్చిన నవలలు ప్రజలలో స్వేచ్ఛాభావాన్ని పెంపొందింపచేయడానికి ప్రయత్నించాయి. చరిత్రలోని ఒక మహోవ్యక్తిని నాయకుణ్ణిగా స్వీకరించి, ఆయన భారతీయ స్వాతంత్ర్యాన్ని నిలపడానికి చేసిన మహత్కార్యాలను వెలువరించడం ఆ నవలలు చేసినపని. కాగా, స్వాతంత్ర్యానంతరం వచ్చిన చారిత్రక నవలలకు ఆ బాధ్యత తప్పింది. అందువల్ల ఈ నవలలు సమగ్రమైన చారిత్రకతను చాటి చెప్పడానికి, గత చరిత్రలోని మహత్తర సంఘటనలను పాఠకులముందు ఉంచడానికి ప్రయత్నం చేశాయి. ఇట్టి చారిత్రక నవలలలో నోరి నరసింహశాస్త్రి గారి నవలలు పేర్కొనదగినవి.

భారతదేశానికి స్వాతంత్ర్యం రావడం, ''మహా భారతశ్రీ'' తిరిగి ప్రజల హృదయసీమలనుఅలంకరించడం - ఇది నోరి వారిని చారిత్రక నవలా రచనకు పురికొల్పింది.

''భారతీయ సంస్కృతి యందభిమానము పురుషసింహులలో విజృంభించినప్పుడెల్ల ఆంధ్రమహాభారత రచన సాగినది''. అన్నారు నోరివారు. తిరిగి అట్టిభారతీయ సంస్కృతి అంటే క్రొత్త అభిమానం స్వాతంత్ర్య సిద్ధివల్ల రచయితలలో జనించింది. ఆంధ్రమహా భారత రచయితల కథలను ఆధారంగా గ్రహించి వ్రాయబడిన ఈనవలలు ఆ భారతీయ సంస్కృతీ పునరుజ్జీవనానికి ఫలితమే.

భారతదేశంలో యవనుల ఆక్రమణ మూడు ఘట్టాలలో సాగింది. మొదటిది భారతదేశం సరిహద్దులలో, 11వ శతాబ్ది ప్రథమ దశలో. అప్పుడు ప్రజలలో తమ దేశమన్నా, తమ సంస్కృతి అన్నా శ్రద్ధ కలిగాయి. దానికి ఫలితమే. నన్నయ మహాభారత రచనకు ఉపక్రమించడం. అలానే రెండువందల సంవత్సరాల తర్వాత యవనులు ఉత్తర భారతాన్ని ఆక్రమించుకొని దక్షిణ దేశానికి దండెత్తిరావడానికి సన్నాహాలుచేస్తూ ఉన్నారు. ఈదశలో రెండవసారి సంస్కృతీ సంప్రదాయాలయెడ ఆదరణ హెచ్చింది. అప్పటి రచనే తిక్కన సోమయాజి గారి భారతాంధ్రీకరణం. తరవాత, డెబ్బై సంవత్సరాలకు, దక్షిణ భూమిని యవనులు ఆక్రమించిన తరువాతకూడా, కొందరు రాజులు భారత ధర్మాన్ని పునస్థాపించే ప్రయత్నాలు చేశారు. అప్పటి రచన ఎర్రన శేషభారతాంధ్రీకరణం.

ఈ విధంగా మనం దేశంమీదికి పరులు దండెత్తివచ్చే సూచనలు ఉన్నప్పుడల్లా దేశభక్తి యినుమడించి, భారత ధర్మమంటే ఆదరణ కలిగి, భారతాంధ్రీకరణం వంటి మహత్తర కార్యాలు నెరవేర్చబడ్డాయని, భారత స్వాతంత్రలబ్ధితో నూతనంగా ఆవేశించిన భారత ధర్మపరిరక్షణకు వెనుకటి ధర్మరక్షకులైన వారికథలు ఎంతగానో ఆదర్శప్రాయాలు కాగలవని రచయిత ఉద్దేశం. అందువల్లనే నన్నయ, తిక్కన, ఎర్రనల కాలాలకు చెందిన రాజకీయ, మత, సాంఘిక పరిస్థితులను తెలియచెప్పే నారాయణభట్టు, రుద్రమదేవి, మల్లారెడ్డి— అన్న మూడు నవలలను వ్రాశారు నోరివారు.

"రుద్రమదేవి" ఆంధ్రుల చరిత్రలోని ఒక మహోజ్వల ఘట్టాన్ని చిత్రించే నవల. నవల అంతటా రుద్రదేవ మహారాజుల యౌవ రాజ్య పట్టాభిషేకాన్ని గురించి, ఆ మహారాజు తనకు ఎదురు తిరిగిన సామంతులను అణగద్రొక్కి, తన రాజ్యంమీదకు దండెత్తి వచ్చిన పరరాజులను పారద్రోలడాన్ని గురించి వర్ణించబడ్డది.

అయినా రుద్రదేవ మహారాజన్న పేరు యీ నవలకు పెట్టక, చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన 'రుద్రమదేవి' అనే పేరుపెట్టారు రచయిత. దీనికి కొంత కారణం చరిత్ర. మరికొంత కారణం రుద్రమ ఎంత మగవానివలె పెరిగినా, ఎంతగా మహారాజుగా చెలామణి అయినా, అంతరాంతరాల్లో, ఉద్వేగ ప్రకటనలలో, ఆర్ద్రహృదయం కలిగి ఉండడంలో స్త్రీ కావడమే! లోలోపల సహజమైన స్త్రీత్వము, బాహ్య పరివర్తనలో చూపవలసిన పురుషత్వాల మధ్య కలుగగల సంఘర్షణే యీ నవలలోని యితివృత్తానికి నూతనత్వాన్ని చేకూర్చింది.

భారతాంధ్రీ కరణానికి అనువైన మూడు ఘట్టాలను స్వీకరించడంలో రచయితకు ఒక సౌలభ్యం ఏర్పడింది. ఈ మూడు ఘట్టాలు తెలుగుల చరిత్రలో ప్రసిద్ధికెక్కిన రాజుల పరిపాలనకు చెందినవి. అందువల్ల భారత రచనను ప్రధానంగా స్వీకరించినా, అంతకన్న విస్తృతికల ఆయా రాజుల జీవితాలను, వారు ఆర్ష ధర్మాన్ని నిలపడం కోసం చేసిన కృషి, దానితోపాటు ఆనాటి రాజకీయ, సాంఘిక, మత సంబంధమైన సర్వవిషయాలను చర్చిస్తాడు రచయిత.

''రుద్రమదేవి'' కాకతీయులలో ప్రఖ్యాతిగన్న రుద్రమ రాజ్యకాలంలోని మొదటి ఆరునెలల చరిత్ర. గణపతిదేవ చక్రవర్తి వృద్ధుడై తన తరువాత రాజ్యానికి వచ్చేవారికి యౌవరాజ్య పట్టాభిషేకం చేయడానికి శరన్నవరాత్రులలో నిశ్చయం చేస్తాడు. రుద్రమ భర్త చాళుక్య వీరభద్రేశ్వరునికి మరొక భార్యవల్ల జన్మించిన హరిహరదేవ రాయలు యువరాజుకావాలని ఒకపక్షంవారి వాదన. ఆ పక్షానికి నాయకుడు వీరభద్రేశ్వరుడే. మరొక పక్షం-చక్రవర్తికి మనుమరాలైన ముమ్మడమ్మ పుత్రుడు ప్రతాపరుద్ర దేవుడే యువరాజు కావాలని వాదించింది. వీరభద్రేశ్వరుడు, ఆతని పక్షం వహించిన పలువురురాజులు జైనబౌద్ధ మతాభిమానులు. మంత్రి

సామంతుల అభ్యర్థనను మన్నించి రాజగురువులు శ్రీ విశ్వేశ్వర శంభు దేశికులు "సమస్త విద్యలు నభ్యసించి వీరావతారమై ప్రత్యక్షముగా పురుష సింహాకారముతో శ్రీ గణపతిదేవ చక్రవర్తుల దక్షిపార్శ్వము నలంకరించిన శ్రీ రుద్రమ శ్రీ రుద్రదేవ మహారాజులుగా'' భావి కాకతీయ రాజ్యాన్ని ఏలవలసిందని నిర్దేశించారు. పట్టాభిషేకం పూర్తి అయింది.

రుద్రమ రాజ్యానికి రావడంవలన వీరభద్రేశ్వరుడు, అతని పక్షం వహించిన ఇతరులు, జైనమతాభిమానులు. ఆ రాజ్యంలో కల్లోలం కలిగించడం ప్రారంభించారు. దానికితోడు చోళులు, కొప్పెరుంజింగడు, దేవగిరి యాదవులు, కళింగులు-వీరిలో ప్రతివారూ కాకతీయ రాజ్యాన్ని కబళించాలని ఆశిస్తున్నారు.

నవల ఆసాంతమూ ఈ అంతర్బహిశ్శత్రువులను రుద్రమ, ఆమె మంత్రి సామంత సేనానులు ఎలా అణచివేశారో చూపబడ్డది.

జన్నిగదేవుడు జటావర్మ సుందర పాండ్య, కొప్పెరుంజింగలను, త్రిపురాంతకుడు సిద్ధయ దేవుణ్ణి, అంబదేవుడు ఎఱువ మల్లి చోడాదులను, ఇందులూరి అన్నయ మంత్రి హరహర దేవరాయలను, రుద్రమ అటు మహారాష్ట్రి మహాదేవరాజును, తనభర్త చాళుక్య వీరభద్రేశ్వరుని ఓడిస్తారు. వసంతోత్సవాల సమయంలో మహారాజు తనశత్రువుల బారినుంచి దేశాన్ని రక్షించి తన ధర్మపరిపాలనకునాంది పలకడంతోను, తిక్కన సోమయాజి రాజధర్మాన్ని గురించి భారతం నుంచి ఒక ఘట్టాన్ని వినిపించడంతోను కథముగుస్తుంది.

ఈ నవలలో రచయిత చూపదలుచుకొన్న ముఖ్యమైన విషయం ఆర్షధర్మ పునరుద్ధరణ. దీనికిగాను ఆయన మూడు పాత్రలను స్వీకరించాడు. విశ్వేశ్వర శంభుదేశికులు, తిక్కన సోమయాజి, అన్నయ మంత్రి. ముగ్గురూ నిర్లిప్తులైన లౌకికులు. వారికి ధర్మరక్షణమే ముఖ్యం. ఈ ధర్మరక్షణమన్న కావ్యనిర్వహణలో మూడు

దశలున్నాయి. ఒకటి కర్మదశ, రెండవది జ్ఞానదశ, మూడవది యోగదశ. ఈమూడింటికి వరుసగా అన్నయమంత్రి, తిక్కన సోమయాజి, విశ్వేశ్వర శంభుదేశికులు ప్రతినిధులు. మొదటి దశలో, ధర్మరక్షణానికి పూనుకొన్న అన్నమంత్రి తాను ధర్మమని భావించిన కర్తవ్యాన్ని తాను నిర్వహించాడు. చెఱసాలే దైవమందిరంగా భావించినవాడు ఆయన. అయినా కార్యవాది. అవసరం వచ్చినప్పుడు దేశాన్ని రక్షించినవాడు.

తిక్కన సోమయాజి మహాకవి, మహామంత్రి. మంత్రిత్వాన్ని వదిలి, జ్ఞానయోగం వైపుకు దృష్టిని మళ్లించినా, తన జ్ఞానసంపదను మహారాజుకు, ప్రజలకు అనువుగా వినియోగించిన వాడు.

ఇక విశ్వేశ్వర శంభు దేశికులు తపస్సంపన్నులు. ధర్మదీక్షితులు. ధర్మసూక్ష్మాన్ని వివరించి రుద్రమను మహారాజును చేయాలని నిర్దేశించిన ధీశాలి.

వీరికి అనుయాయులై, అనువర్తులై కాకతిసామ్రాజ్యంలోని సర్వసైన్యాధిపతులు, మంత్రులు వ్యవహరించి దేశస్వాతంత్ర్యాన్ని రక్షించుకొన్నారు.

''సమగ్రమగు ఆంధ్రుల చరిత్ర వెలువడలేదు. చరిత్రకారులకు ఏకీభావములేదు. అందుచే మా బోంట్లకు మూలాధారములు కూడ శోధించవలసిన పని తప్పలేదు. ఇప్పటికి ఆకాలమునకు సంబంధించి వెలువడిన గ్రంధములయు, వ్యాసములయు సామగ్రి అంతయు సాధ్యమైనంత వరకు పరిశోధించియే ఈ నవలలు వ్రాసినాను" అన్నారు రచయిత పీఠికలో. శాసనాలను, ఆనాటి కావ్యాలను, తరువాత వారి రచనలను జాగ్రత్తగా పరిశీలించి యీనవల వ్రాసినట్లు స్పష్టమే! మల్కాపురశాసనం, దశకుమార చరిత్ర, క్రీడాభిరామము మొదలైన వాని పరిశీలనం ఇందులో కనిపిస్తూనే ఉంది. కాని

చరిత్రాంశాలు ఎన్ని ఉన్నాయో, అంతకు మించిన కల్పనలు కూడా ఇందులో కానవస్తాయి.

"మన అదృష్టం వల్ల మన గత చరిత్ర వివరాలు అంత ఎక్కువగా లేనందువల్ల చారిత్రక నవలాకారులకు స్వతంత్ర కల్పనలు చేసేందుకు అవకాశాలెక్కువ ఉన్నవి. మనకావ్యాదులవల్ల ఆయా కాలాల సాంఘిక మతాచారాదులు తెలియవస్తున్నవి. వాటిని మాత్రము ఉల్లంఘించకుండా జాగ్రత్త పడితే చాలును, చరిత్రాత్మకనవల విశృంఖలంగా ఊహా వీధులలో స్వైరవిహారము చేయవచ్చును!" అని నోరివారే ఒకచోట పేర్కొన్నారు. ఆయన నవలలు—ముఖ్యంగా "రుద్రమదేవి" ఈ కోవకు చెందిన నవలే!.

పట్టాభిషేకోత్సవ సభావిశేషాలు, కొప్పెరుం జింగని ఆంధ్ర దేశయాత్ర, అతనికి గల 'సాహిత్యరత్నాకర', 'భారతమల్ల' బిరుదాల సార్థక్యము, జైనకరణముల సమ్మె, కరణపాఠశాల, మాచల్దేవి గోవింద మంచన శర్మలు నేరస్థులను పట్టుకోవడంలో సహాయపడడం-వంటి వెన్నో కల్పనలు. అయితే ఈ కల్పనలన్నీ కథకు పుష్టినే కూరుస్తున్నాయని చెప్పవచ్చు.

కొన్నిపాత్రల మీద రచయితకు పక్షపాతం ఉన్నట్లు యీనవలలో స్పష్టంగా అనిపిస్తుంది. ఉదాహరణకు రచయిత అన్నయ మంత్రి పాత్రను సృష్టించిన పద్ధతిని పేర్కొనవచ్చు. అలాకాక, కొన్ని వేళల ఎంతో నిష్పక్షపాత బుద్ధిని ప్రదర్శించిన సంఘటనలను కూడా పేర్కొనవచ్చు. కొప్పెరుంజింగని పాత్ర సృష్టి అటువంటిది.

రచయిత సృష్టించిన రుయ్యాము పాత్ర కొంత విశిష్టమైనది. మనకింతవరకు తెలిసిన చరిత్రకు భిన్నమైనది. రుయ్యాము రుద్రమ రెండవ కూతురని చాలమంది చరిత్రకారుల మతం. ఆమె అన్నయ మంత్రిని వివాహం చేసుకోవడం అన్న చరిత్ర సత్యాన్ని సమర్థించ

డానికి గాను నోరివారు గుయ్యమకు కూడా బ్రాహ్మణ కన్యగా మార్చారు. ఆమె అనాథ అనీ, ఆమెను రుద్రమ చిన్ననాటినుంచి చేరదీసి, పుత్రికగానే చూచుకున్నదనీ కల్పించారు.

ఈ నవల ఉపక్రమ ఉపసంహారాలను గురించి కోగంటి సీతారామాచార్యులు నవలకు వ్రాసిన ''పరిచయము''లో ప్రస్తావించారు. ఈ నవల ప్రారంభకాలం శరన్నవరాత్రి ఉత్సవాలు. ఉపసంహారకాలం వసంత నవరాత్రి ఉత్సవాలు. మొదటిది గణపతిదేవుని పరిస్థితిని, పరిపాలనను, రెండవది రుద్రమ రాజ్య పాలనావిధానాన్ని ధ్వనింప చేస్తున్నాయి. అంతేకాదు. నవల మొదట్లో విజయదశమినాడు రుద్రమ పట్టాభిషేకం జరగడం ''మహాలయామవాస్యాపరరాత్రి వేళ'' హరిహరుణ్ణి మహారాజుగా వైరివర్గం వారు స్వీకరించడం కూడా రుద్రమకు రాబోయే విజయాన్ని, ప్రతిపక్షం వారికి రాగల ప్రమాదాన్ని సూచిస్తున్నాయనవచ్చు.

ఈ నవలకు వ్రాసిన పీఠికలో నోరివారు మహాభారత శ్రీ శక్తి వారినావేశించినదని. ''నిత్యనూతనమై యచంచలమగు భారత ధర్మము మనదేశమును ఇప్పుడు మరలనావేశించినది. తత్ఫలితమే నాయీ ప్రయత్నములు'' ని చెప్పారు. వేరొకచోట చారిత్రక నవలాకారులలో తనకు, అడివిబాపిరాజుగారికిగల విభేదాన్ని చెబుతూ ''బాపిరాజుకు ఆంధ్రాభిమాన మెక్కువ'' అనీ, తనకు ''మహాభారతాభిమాన మెక్కువ'' అనీ అన్నారు. కాని ఈమూడు నవలలలోను ఆయన ఆంధ్రాభిమానం కూడా మనకు విస్పష్టంగా కనిపిస్తుంది. గోదావరీతీర పండితుల వర్ణన, కొప్పిరుంజింగని సేనలను జయించి తిరిగివస్తున్న ఆంధ్రసైన్యాలు అత్యాచారాలు చేశాయంటూ జైన గ్రంథాలు వ్రాసిన వ్రాతలను త్రోసిబుచ్చడం పై విషయాన్ని నిరూపిస్తున్నాయి.

అయితే, నోరివారి ప్రప్రథమ లక్ష్యం ఏ ఏ కాలాల్లో భారత ధర్మం ఏవిధంగా పరిరక్షింపబడ్డదో చూపటం. ఆంధ్రదేశాన్ని ఆలంబనంగా స్వీకరించి ఈ దేశంలో భారత ధర్మ పరిరక్షణం ఎలా జరిగిందో నిరూపించారు శ్రీ నోరినరసింహశాస్త్రి. దానితోపాటు ఆయన కూర్చిన సంఘటనలలో కొంత వర్తమాన చరిత్ర కూడా ధ్వనిస్తున్నది. భారతదేశంలోని రాజకీయ, మతకల్లోలాలను గురించి ప్రస్తావించినప్పుడు ఇలా ధ్వనించక తప్పదనుకుంటాను.

చరిత్రను, కల్పనను సమానంగా మేళవించి, ఇన్ని పాత్రలను ప్రవేశపెట్టినా (ఈ నవలలోని ముఖ్యపాత్రలే ముప్ఫయికిపైగా ఉన్నాయి) క్లిష్టతలేకుండా, సుగమంగా కథను నడిపించి, చక్కని చారిత్రక కథను పాఠకులకు అందించారు, శ్రీ నోరి నరసింహశాస్త్రి.

18207
అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం.
అన్నమయ్యవీధి. గుంటూరు-6

# పదానుక్రమణిక


"అంతరాత్మ" 82

"అంగస్తులు–అంతఃకరణాలు" 120

"అంపశయ్య" 204, 240

"అగ్రహారము" 80

"అడవి శాంతిశ్రీ" 157, 158

"అడ్డుగోడలు" 191

"అతడు-ఆమె" 233

"అది ప్రశ్న–ఇది జవాబు" 118

"అదృష్ట చక్రం" 120

అనంతాచార్యులు, పసప్పాకము 51

అనురూపాదేవి 165

"అన్వేషణ" 116

"అపస్వరాలు" 117

అప్పారావు, డాక్టర్ పి.యస్.ఆర్. 237

"అబలా జీవితము" 187

అబ్బాస్ కె.ఏ. 191

"అమీనా" 28, 234, 304

"అరక్షణీయ" 183

అరిస్టాటిల్ 11

"అరుణ" 304

"అల్పజీవి" 106-107, 143, 201; 203

"అవర్ టవున్" 232

"అసమర్థుని జీవయాత్ర" 103, 132, 143, 182, 261, 202, 238, 315-322

"అస్తమయము" 70

"అహం-అనర్థం" 120

"అహం-అసూయ" 191

"అహల్యాబాయి" 58, 60, 67, 152, 177

"అహోబలీయం" 93

"ఆంగ్ల రాజ్యస్థాపన" 67, 181

ఆంజనేయులు, గార్లపాటి 182

ఆంధ్ర పత్రిక 189

ఆంధ్రప్రచారిణీగ్రంథమాల 69, 70, 207, 218

"ఆంధ్ర రాష్ట్రము" 70, 154, 155

ఆడ్లర్ 94, 166

"ఆత్మకథ" (వీరేశలింగం) 248

"ఆత్మబలి" 93, 122

"ఆదర్శాలు–అంతర్యాలు" 117

ఆదివిష్ణు 118

"ఆనందమఠము" 65, 151, 177, 180, 185, 206

"ఆనందాబాయి" 80

ఆనందారామం 122, 229

"ఆర్యచాణక్యుడు" 159

ఆరుద్ర 222
"ఆలివర్ ట్విస్ట్" 190
"ఆఖునదులు" 85, 237, 242
ఆళ్వారుస్వామి, వట్టికోట 112, 214, 215
"ఇందుమతి" 216
"ఇందులేఖ" 177
"ఇంద్రధనుస్సు" 216
"ఇచ్ఛినీ కుమారి" 80, 155, 181
"ఇడియట్" 182, 239
"ఇద్దరం ఒక్కటే" 118, 171
"ఇద్దరబ్బాయిలూ—ముగ్గురమ్మాయిలు" 118, 169, 239
ఇలాచంద్రజోషి 186
"ఇల్లు పట్టిన వెధవాడ బడుచు" 93
ఈడిపస్ కాంప్లెక్స్ 198, 199, 203
"ఈస్ట్ లిన్" 94, 182
"ఉదయ కిరణాలు" 112, 116
"ఉపాధ్యాయుడు" 169
ఉమాకాంతం, అక్కిరాజు 154, 181
ఉషశ్రీ 120
"ఎదిగీ ఎదగని పువ్వు" 120
ఎమిలీ జోలా 136, 191
"ఏకవీర" 82, 155, 156, 200, 283–293
"ఏకోదరులు" 92
"ఏడురోజుల మజిలీ" 116
"ఐవాన్ హో" 66, 155, 181
"ఒథెల్లో" 66, 181
ఓడ్ హౌస్ 170, 171
"ఓనమాలు" 115
"ఓబయ్య" 207
"ఓపువ్వు పూసింది" 90
"కడిమిచెట్టు" 82, 83, 156, 160
"కత్తులవంతెన" 115, 144
కనకరాజు, గోటేటి 53
"కనకాంగి" 181
"కన్యాశుల్కము" 80, 239
"కపాలకుండల" 54, 65, 152, 177, 180, 206
"కమలాంబ" 66, 177
"కమలా కోమల" 65
"కర్ణసామ్రాజ్యము" 70
"కరుణ" 119
"కర్పూర మంజరి" 58, 241
"కవిద్వయము" 110
"కవిసార్వభౌముడు" 110, 158
"కష్టజీవులు" 190
"కళావతి" 66
"కాంచన ద్వీపం" 189
"కాంచనమాల" 67, 153
కాంట్ 194
"కాంతం కైఫీయతు" 169
కాంతారావు, బలివాడ 107, 114, 143, 229
"కాదంబరి" 46, 175
కామేశ్వరి, డి. 122
"కార్సికన్ బ్రదర్స్" 190

"కాశ్మీర పట్టమహిషి" 115
క్రాస్, రిచర్డ్ 2
కిషన్ చందర్ 186
"కీలుబొమ్మలు" 105, 106, 144, 132, 182, 183, 201, 216, 332, 346
"కుంకుమ భరిణి" 185
కుటుంబరావు, కొడవటిగంటి 96, 97, 100, 114, 131, 143, 173, 188, 208, 229, 235, 238-241' 353, 357, 358
"కుమారరాముడు" 187
కుమార రాఘవశాస్త్రి, పురాణం 184
"కూలీ" 191
కృష్ణ, జి. వి. జి. 222
కృష్ణమూర్తి, తాతా 220
"కృష్ణకాంత్" 185
"కృష్ణకాంతుని మరణ శాసనం" 65, 152, 180
కృష్ణమూర్తి, రాంభట్ల 189
"కృష్ణవేణి", (చిలకమర్తి) 79
"కృష్ణవేణి" (ముప్పాళ) 121, 234
"కృష్ణాతీరం" 229
కృష్ణారావు, డాక్టర్ జి. వి. 96, 105, 232, 133, 183, 201, 216, 252, 332, 333, 341, 342, 343, 345
కృష్ణారావు, భాస్కరభట్ల 107, 108, 108, 119, 204, 215
"కేరటాలు" 120
కేశవరావు, తుమ్మగుండి 67
"కేసరి విలాసము" 53
"కొండపల్లి ముట్టడి" 93
"కొత్త అల్లుడు" 114, 173
"కొత్త కోడలు" 114, 173
"కొత్త యిల్లు" 120
"కొల్లాయిగట్టితేనేమి" 115, 144, 208, 214
"కోనంగి" 87, 208, 211,-12
కోమలాదేవి 122
"కౌంట్ ఆఫ్ మాంటిక్రిస్టో" 190
"కౌసల్య" 150, 215
కౌసల్యాదేవి, కోడూరి 122
"గంగు" 112
"గడియపడిన తలుపులు" 103, 104
"గణపతి" 71, 72, 167
గణపతిశాస్త్రి, పిలకా 93, 115
"గద్వాల చీర" 120
"గలివర్స్ ట్రావెల్స్" 49, 50, 163, 176
గాల్స్‌వర్దీ 182
"గుడ్ ఎర్త్" 190
"గుణవతీ పరిణయము" 135
"గృహరాజు మేడ" 160
"గృహస్వామిని" 186
గొగోల్ 188
"గోడమీది బొమ్మ" 107, 114
"గోదాన్" 186
"గోనగన్నారెడ్డి" 157, 158

గోపాలకృష్ణ, రెంటాల 188,189
గోపాలకృష్ణమచెట్టి, నరహరి 17 19, 20, 22, 39, 43, 45, 46 176
గోపాలరావు, హద్దలూరి 135
గోపీచంద్ 30, 96, 102-105 132, 133, 136, 138, 143, 201, 302, 204, 229, 315, 320, 321, 322
గోరా 184
గోరాశాస్త్రి 169
గోర్కీ 186, 189
గోల్డ్ స్మిత్, ఆలివర్ 38, 48, 176, 248
"గ్రహణం విడిచింది"122
"చంఘిజ్ ఖాన్" 111, 159
"చంద్రరేఖ" 220
చంద్రశేఖరరావు, బంపని 143
"చంద్రునికో నూలుపోగు" 115
"చక్రనేమి" 122
చక్రపాణి 94, 183, 233
"చక్రవాకం" 122
"చక్రభ్రమణం" 122
"చదరంగయోధులు" 186
"చదువు" 131, 208, 213-14, 353-358
చలం 27, 76, 77, 81, 88-90 94, 120, 128, 130, 132, 136, 137, 228, 231, 232, 238, 304, 307, 310-14
"చాంద్ బీబీ" 152, 177
చాంద్ మీనన్ 66, 177
"చార్ కాట్" 195
'చింతామణి' 18, 19, 23-24, 44, 45, 50, 51, 53, 54, 58, 59, 116, 151, 152, 155
"చిత్రకారుని భార్య" 120
చిలకమర్తి
చూ. లక్ష్మీనరసింహం, చిలకమర్తి
"చిల్లరదేవుళ్ళు" 119
"చివరకు మిగిలేది" 29, 30. 100-102, 137, 172. 182, 201, 202, 208; 212, 213, 235, 323, 831
"చీకటికడుపున కాంతి" 122
"చీకటిగదులు" 203
"చీకటిలో చీలికలు" 119,172, 82, 84, 130
"చెలియలికట్ట" 28, 232
ఛాయేశ్వర్ 186
జగన్నాథ్, యన్ 186
జగన్నాథరావు, ఇచ్ఛాపురపు 115
జయచంద్రారెడ్డి 187
జయశంకరప్రసాద్ 186
"జయసేన విజయము" 66
"జారుడుమెట్లు" 118
"జీవనకలశం" 216
"జీవనగంగ" 117
"జీవనజ్యోతి" 120

"జీవనప్రభాతము" 206
"జీవితం" 238
"జీవితాదర్శం" 88
జెరోమ్ కె. జెరోమ్ 170
జేన్. ఆస్టిన్ 291
జేమ్స్ జాయిస్ 204, 240
జైనేంద్రకుమార్ 186
"జోడెద్దులు" 186
జోషి, మహాదేవశాస్త్రి 157
టాడ్, కల్నల్ 67, 177
"టామ్‌సాయర్" 189
"టాల్‌స్టాయ్" 1-9. 188
"టిప్పుసుల్తాన్" 66, 154, 177, 181
టెంపోరావు 222
టేలర్, మెడోస్ 65, 66, 152, 177
"ట్రెజర్ ఐలండ్" 189
డికెన్స్, ఛార్లెస్ 190
"తంజావూరు పతనము" 111, 159
"తామరకొలను" 187
"తార" 152, 177
"తారాబాయి" 80, 155, 181
తారాశంకర్ బెనర్జీ 185
తారాశంకర్ వంద్యోపాధ్యాయ 185-189
"తారాస్ బుల్బా" 189
"తిమింగలం వేట" 114
తిరునారాయణస్వామి, నంబూరు 52
తిరుపతివేంకటకవులు 192
"తిరుమాళిగ" 92, 233
"త్రివిక్రమవిలాసము" 53
'త్రివేణి' 187
తుర్జనీవ్ 188
"తూలికాభూషణ్" 190
"తెలుచిరాజు" 84, 130, 232
"తేజోమూర్తులు" 229
"తొలిమజిలీ" 118
థార్న్‌టన్ వైల్డర్ 191
"దగాపడిన తమ్ముడు" 114
"దత్తత" 229
"దమయంతీ స్వయంవరము" 232, 242
దక్షిణామూర్తి, పోరంకి 119
"దాసీకన్య" 66 181
"ది అమెరికన్" 191
"ది టేల్ ఆఫ్ టూ సిటీస్" 190
"ది బ్రిడ్జ్ ఆఫ్ సాన్‌లూయీరే" 191
"ది మూన్ హువజ్ అఫైర్డ్" 182, 183
"ది లేక్ ఆఫ్ పామ్స్" 180
"ది స్లేవ్‌గర్ల్ ఆఫ్ ఆగ్రా" 66
"ది వికార్ అఫ్ వేక్‌ఫీల్డ్" 48. 176
"దీక్షితులు" 92

దీక్షితులు, చింతా 220
"దుందుభి" 72, 167
"దుర్గాకుమారి" 239
"దుర్గేశనందిని" 65, 153, 181
"దృఢ ప్రతిజ్ఞ" 182
"దైవమిచ్చిన భార్య" 88, 89, 167, 212, 238, 304-314
దొరస్వామయ్య, ఓ. వై. 54, 65, 152, 177, 206
ద్వివేదీ 186
"ధనిష్ఠ" 120
"ధరణికోట" 70, 154, 155
"ధర్మచక్రము" 82, 122, 156
"ధర్మవతీ విలాసము" 51, 53, 151
ధర్మారావు, తాపీ 70
ధీరేంద్రనాథ్ పాల్" 93, 181
"ధూర్జటి" 158
"ధృవతారం" 120
నరసింహంపంతులు, ప. వి. 154
నరసింహశాస్త్రి, మల్లాది 191
నరసింహశాస్త్రి, నోరి 78 – 79, 109, 110, 111, 158, 359, 365, 388
నరసింహశాస్త్రి, మొక్కపాటి 91 92, 232
నరసింహారావు, మునిమాణిక్యం 91, 92, 142, 168, 220,233
నరసింహారావు, పి. వి. 187
"నల్లరేగడి" 119
"నవాబునందిని" 65, 153, 181
నవీన్ 204, 240
"నా డైరీలో ఒక పేజీ" 235
నారాయణ్, ఆర్. కె. 191
నాగేశ్వరరావు, తాపీధర్మారావు 120
నాగేశ్వరరావుపంతులు, కాశీ నాథుని 208
"నానా" 191
"నారాయణభట్టు" 110, 158
నారాయణమూర్తి, భోగరాజు 67, 70, 73, 127, 128, 154, 155, 181
"నారాయణరావు 86, 208, 211" 270
"నారీజీవనము" 186
"నిర్మల" 186
నిర్మల ప్రభావతి, పవని 122
నిహార్ రంజన్‌గుప్త 186
నిక్జ్ 94, 194
"నూరు శరత్తులు" 188, 144
"నెలవంక" 112, 215
"నేనే" 220
"పండిత పరమేశ్వరశాస్త్రి వీలు నామా" 103, 104
"పడవ మునక" 184
పడాల 217
"పథవిహీన" 123
"పథేర్ పాంచాలి" 185
పద్మరాజు, పాలగుమ్మి 119,

144, 169-71. 229
"పరిణీత" 183
పరిమళా సోమేశ్వర్ 122
"పరివర్తన" 103, 315
"పలకల పెండిగ్లాసు" 111
పాంచకడీదేవ్ 70, 181, 119
"పాకుడురాళ్ళు" 119
పాపయ్యశాస్త్రి, బులుసు 53
"పాము-నిచ్చెన" 134, 135
పార్థసారధి, సందూరి 110
పాల్ బిపిన్ చంద్రపాల్ 61
పిచ్చేశ్వరరావు, అట్లూరి 186
పినిశెట్టి 119
"పిల్ల తెమ్మెర" 103
"పుత్రవతి" 187
"పురుషోత్తముడు" 159, 160
"పురూరవ" 89
"పెంకుటిల్లు" 117
పెరల్ బక్ 190
పెర్రీమాసన్ 221
"పేక మేడలు" 121
"ప్రజలమనిషి" 111, 114-15
"ప్రణయ మహిమము" 51
"ప్రఫుల్లముఖి" 55, 153, 171
ప్రభాత్ కుమార్ ముఖోపాధ్యాయ 185
"ప్రమదావనము" 67
ప్రసాదరావు, వి. డి. 190
"ప్రిన్స్ అండ్ ది పాపర్" 189
ప్రీస్ట్లీ, జె. బి. 3
ప్రేమ్‌చంద్ 186
"ప్రేమించిన మనిషి" 114, 131, 144, 173
"ప్రేమోపహతులు" 103
"ప్రేయసి-ప్రియంవద" 130
"ప్రైడ్ అండ్ ప్రెజుడిస్" 198
ఫాక్స్, రాల్ఫ 3
ఫాస్టర్, ఇ.యం. 11
ఫిష్ట్ 194
"ఫుల్ జానీ బేగం" 154
"ఫోర్ సైట్ సాగా" 194
ఫ్లాబర్ట్ 198
ఫ్రాయిడ్ 94, 95, 100, 108, 193-105, 135, 136
ఫ్రేజర్ 94
బంకించంద్ర ఛటర్జీ 54, 60, 151, 177, 180, 181, 185, 106
"బంగరు పంజరం" 187
"బడదీదీ" 183
"బద్దన్న సేనాని" 81, 156
"బలిపీఠం" 121, 141, 215
"బడీ" 53
"బాణభట్టుని ఆత్మకథ" 186
"బాదావళి" 82
బాపిరాజు, అడివి 76, 78, 79, 81, 85-87, 131, 155, 157, 158, 208, 211, 228, 231, 282, 270, 276-279, 281, 238
"బారిష్టరు పార్వతీశం" 91, 168, 232, 240

బాల్‌జాక్ 136
"బిజలక్ష్మి" 190
బుచ్చిబాబు 29, 30, 96, 97, 133, 136, 138, 139, 172, 201, 208, 212, 229, 240, 323-25, 328
"బుడుగు-చిచ్చులపిడుగు" 169
"బూచీ" 107
"బెదరిన మనుషులు" 241
బెర్గ్‌సన్ 30, 94, 107, 194, 204
బోజర్ 105, 344
"బ్రతికిన కాలేజి" 119, 169, 170
"బ్రతుకుభయం" 241
బ్రహ్మయ్యశాస్త్రి, కాశీభట్ట 2, 18, 37
"బ్రాహ్మణీకం" 88
బ్రూవర్ 195
"భయపడిన మనిషి" 139
భరద్వాజ, రావూరి 229
భాస్కరరావు, కనకపల్లి 65, 177
"భాస్కరవిలాసము" 53
భుజంగరావు, ఆలూరి 186
భుజంగరావు, మంత్రిప్రగడ 53
"భువన విజయము" 111, 160
"మంగళసూత్రం" 187
"మంచీ-చెడూ" 117
'మంజుశ్రీ' 118, 144, 229
"మంజువాణీ విజయము" 51
"మంత్రశక్తి" 185
"మత్తరాయనం" 185
"మదర్" 188
"మదాలస" 73, 80
"మధువు-మాధుర్యం" 157
"మనం మిగిలేం" 117
"మనిషి-మిథ్య" 119
"మనోరమ" 53, 186, 220
"మర్చెంట్ ఆఫ్ వెనిస్" 51
"మల్లారెడ్డి" 110, 159
"మల్లిక" 120
"మహానగరంలో స్త్రీ" 121
"మహాశ్వేత" 175
మహీధర్, దండమూడి 185
"మల్లీవసంతం" 108
"మాక్‌బెత్" 68, 177
మాక్సిం గోర్కీ 188
"మాఘుంటం" 232
"మాడమ్ బోవరీ" 191
"మాతంగిని" 185
"మాతృమందిరము" 71, 207
మాధవశర్మ, పాటిబండ 160
"మాధవీ కంకణము" 66, 153
"మాబాబు" 82, 83, 200, 201, 232, 233
"మాయామృగం" 186
"మాయావి" 220
"మాయావిని" 220
"మారిన విలువలు" 122
మారుతీరావు, గొల్లపూడి 118, 172, 204, 229
"మా కేమనుషులు" 117

మార్క్ ట్వేన్ 189
మార్క్స్ 315
మాలతీచందూర్ 121, 239
"మాలతీ రాఘవము" 51, 53
"మాలపల్లి" 74, 80, 81, 118, 144, 182, 208, 209, 238, 242, 255-269
"మిథునానురాగము" 60, 154
మిల్లర్, ఆర్థర్ 232
"మిహిర కులుడు" 81
"మీనాంబిక" 93, 160
"ముత్యాలపందిరి" 119
'మురయా' 120
ముల్కరాజ్ ఆనంద్ 191
"మృతజీవులు" 188
"మృత్యుంజయులు" 112
"మృణాళిని" 185
"మెరుపుల మరకలు" 103
మేయో, లార్డ్ 39
"మైదానం" 28, 88, 89, 304
"మైనా" 230
"మొగలాయీ దర్బారు" 93–94, 181, 220
"మోహలరాణి" 67
"మోహనవంశి" 121, 237
యతీంద్రమోహన మైత్రా 233
"యమకూపం" 139
"యమపాశం" 103
యుంగ్ (Jung) 94
"యుగసంధి" 107, 215
"యులిసిస్" 204, 240
'రంగధామ్' 120
రంగనాథరావు, పన్యాల 120
రంగనాయకమ్మ, ముప్పాళ్ళ 121, 215, 234, 235
రంగయ్య సెట్టి, సమర్థి 48
రంగస్వామి, వి.యస్. 120
రంగాచార్యులు, అగ్నిహోత్రం 185, 190
రంగాచార్యులు, దాశరథి 195, 211
రంగారావు, రావిచెట్టు 178
"రథచక్రాలు" 144
రమాపతిరావు, డాక్టర్ అక్కిరాజు 38, 39
చూ. మంజుశ్రీ
రమామణి, కొలిపాక 122
రమేశ్ చంద్రదత్ 66, 153, 177, 180, 181
రమేశ్ 184, 185
రవీంద్రనాథ్ ఠాకూర్ 63, 184 185, 188
"రక్షా బంధనము" 93, 242
రాఘవ చంద్రయ్య శాస్త్రి 70
"రాజకీయ భేతాళ పంచవింశతిక" 169
రాజగోపాలరావు, చేకుమళ్ళ 53
"రాజరికాలు-పేదరికాలు" 120, 216
"రాజశిల్పి" 111, 160

"రాజశేఖర చరిత్రము" 2, 32, 33, 34, 37, 38, 43-45, 48, 49, 52, 127, 175, 176, 241, 147-154
"రాజస్థాన కథావళి" 67, 152,177
"రాజసింహ" 65, 180, 185
"రాజసుందరి" 80
"రాజారత్నము" 71, 72
రాజా వెంకటరంగారావు 178
"రాజు-పేదా" 189
"రాణీ సంయుక్త" 153
రాధాకృష్ణయ్య, జొన్నలగడ్డ 190
"రాధారాణి" 65, 153, 180, 183
రామచంద్రయ్య, దుగ్గిరాల 154
రామచంద్రయ్య, పణతుల 120
రామకృష్ణరావు, అవసరాల 118
రామచంద్రరావు, చావలి 186
"రామచంద్రవిజయము" 25, 43, 53, 58, 127, 241
రామచంద్రుడు, ఖండవిల్లి 44, 51 53, 60, 151, 152
రామదాసు, బెల్లంకొండ 188, 189 190, 191
రామమోహనరావు, నండూరి 189
రామమోహనరావు, మహీధర 115, 144, 173, 208, 214
"రామలక్ష్మణ దేశయాత్ర" 186
రామలక్ష్మి, కె. 239
రామలింగం, డి. 191
"రామప్పగుడి" 160
రామస్వామి శాస్త్రులు, వావిళ్ళ 206
"రాముని బుద్ధిమంతతనము" 183
"రాయచూరు యుద్ధము" 69-70, 154, 155
"రుక్కుతల్లి" 92
"రుద్రమదేవి" 110, 153, 539-368
"రూపవతి" 67
"రెండుమహానగరాలు" 190.
లండన్ 'టైమ్స్' 253
లింగమూర్తి, సింగరాజు 117, 235, 229
లింగరాజు, కందుకూరి 117
లింగరాజు, క్రొవ్విడి 188
లత 123, 136, 137, 237
లల్లన్' 186
లక్ష్మణరావు, కొమఱ్ఱాజు 69, 154, 178, 207
లక్ష్మణరావు, వుప్పల 138. 233
లక్ష్మీనరసయ్య, కూనపులి 53
లక్ష్మీనరసింహారావు, కొవ్వలి 143
లక్ష్మీనరసింహం, చిలకమర్తి 24, 25, 44, 53, 58, 60, 66, 67, 69, 71, 72, 73, 79, 127, 128, 152, 166, 167, 168, 177, 180, 229, 354
లక్ష్మీనారాయణ, ఉన్నవ 80, 128, 129, 398, 229, 254, 264, 265, 266

"లక్ష్మీప్రసాదము" 25, 73, 80
"లక్ష్మీసుందర విజయము" 51, 60, 152
"లే మిజర్ బ్లే" 190
"లోకం" 190
"లోకంపోకడ" 120
"వడ్లగింజలు" 93
వరదరాజన్, యం. 187
"వరదాన్" 186
"వల్లభమంత్రి" 82
"వసంతసేన" 854
వసుంధర, మల్లాది 159
"వసుమతీ వసంతము" 67, 153, 154
"వాగ్దత్త" 183
"వాడే వీడు" 220
'వాచస్పతి' 120
"వార్ అండ్ పీస్" 149, 188
"వారధి" 122
'వాసమూర్తి' 120
వాసుదేవరావు 182
విక్టర్ హ్యూగో 190
విజ్ఞానచంద్రికా గ్రంథమండలి 59, 218
"విచిత్ర ప్రణయం" 167
"విజయధ్వజం" 189
"విజయనగర సామ్రాజ్యము" 70, 154
విజయలక్ష్మి, ఉన్నవ 122
"విజయవిలాసం" 161
"విజేత" 122, 216
విఠల్, నండూరి 191
విద్యానగర నవలామాలిక 160
"వినోదిని" 184
విభూతి భూషణ్ బెనర్జీ 185
"విమలాదేవి" 67, 70, 154, 181
'విరించి' 185, 191
విశ్వనాథశాస్త్రి, రాచకొండ 96, 106, 133, 143, 173, 201, 240
విశ్వప్రసాద్ 222
"విశాలనేత్రాలు" 115
"విశాల హృదయులు" 186
విశాలాక్షి, ద్వివేదుల 122, 141
"వివేకచంద్రిక" 44
వివేకవర్ధని 248
"వివేక విజయము" 53
వివేకానందదేవి, అద్దేపల్లి
"విషభుజంగము" 71
"విషవృక్షము" 185
"విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు" 82, 84, 130, 172, 236
"విహిత" 185
వీరభద్రరావు, డా. కొత్తపల్లి 36, 48
వీరభద్రరావు, చిలుకూరి 70
వీరభద్రాచార్యులు, కొండిపర్తి 66
వీరరాఘవ స్వామి 184
వీరరాఘవాచార్యులు, కొండూరి 159

వీరాజీ 118, 171
వీరాజు, శీలా 130
వీరేశలింగం పంతులు, కందుకూరి 2, 20, 32, 33, 42, 43, 46, 64, 163, 165, 166, 167, 229 247-249
"వృద్ధాప్యము" 169
వెంకటరమణ, గంటి 122
వెంకటరమణ, ముళ్ళపూడి 118, 169, 239, 240
వెంకటరత్నం పంతులు, కొక్కొండ 32, 175
వెంకట్రామయ్య, డి. 185
వెంకట్రామరెడ్డి 177
వెంకట్రామరెడ్డి, దొడ్ల 66
వెంకట శివరావు, ధరణిప్రగడ. 67, 153
వెంకట సుబ్బారావు, రెంటాల 53
వెంకటేశ్వరరావు, గంగినేని 234
వెంకటేశ్వరరావు, నార్ల 203
వెంకటేశ్వరరావు, మోటూరి 185
వెంకటేశ్వరరెడ్డి, అన్నపరెడ్డి. 190
వెంకటేశ్వర్లు, పుల్లాభొట్ల 232
"వెండిమబ్బు" 187
వెంకటకృష్ణారావు, దేవరాజు 71, 182, 220
"వెలుగూ వెన్నెలా గోదారి" 119
"వెల్లువలో పూచిక పుల్లలు" 30, 107, 204
వేంకటప్పయ్య, రత్నాకరము 67
వేంకట పార్వతీశకవులు 24, 65, 67, 69, 71, 73, 152-154, 178, 180-182, 184, 185, 207, 219, 220
వేంకటరావు, నిడదవోలు 34
వేంకటశాస్త్రి, కేశవరపు, 24, 25, 67, 69, 73, 79 128, 154, 155, 181, 182, 242
వేంకట సీతమ్మ, అట్లూరి 67
వేంకటాచార్యులు, 181
వేగుచుక్క గ్రంథమాల 70, 218
వేణుగోపాలరావు, కొమ్మూరి 117, 239
"వేణువు" 237
"వేయిపడగలు" 28, 82, 83, 84, 86, 130, 149, 182, 208, 209-10 228, 236, 294-303
"వైకుంఠపాళి" 122, 141
వైజయంతి 34, 46
శంకరమ్, టి వి. 222
శకుంతలాదేవి 184
శరత్ 94
శర్మ, వి.యస్. 188
'శర్వాణి' 187
"శశిరేఖ" 88
"శ్మశాన వాటిక" 71
"శాంతినికేతన్" 122
"శాపము" 152, 154

'శారద' 116, 222, 229
"శిఖరాలు-సరిహద్దులు" 120
"శిథిలాలయం" 103
'శివం' 188
శివరామకృష్ణ, బొందలపాటి 184
శివరామకృష్ణ, బొల్లిముంత 122
శివరామశాస్త్రి, వేలూరి 93, 94, 183, 207
శివశంకర పాండ్య 35
శివశంకర స్వామి 76, 184, 185, 206
శేషయ్య, చాగంటి 73, 153, 180-182
శేషాద్రి రమణకవులు 93
శైలజా నందముఖర్జీ 186
"శైవలిని" 152, 185
"శైవాలినీ చంద్రశేఖరము" 65, 180
"శైలేంద్ర" 188
"శ్యామల" 68, 177, 181
శ్యామలారాణి, ఎ. 122
శ్రీదేవి 120
శ్రీనివాస చక్రవర్తి 185, 188, 189, 191
శ్రీనివాసపురం సోదరులు 160, 187
శ్రీనివాసరావు, కొరటి 187
శ్రీనివాసరావు, చిల్లరిగె 65, 152, 180
"శ్రీరంగరాజు చరిత్ర" 17, 22, 32, 36-39, 43-46, 48, 51, 254
శ్రీరామచంద్రమూర్తి, కొండముది 119
శ్రీరామమూర్తి, ధూళిపాళ 160
'శ్రీవాత్సవ' 191
శ్రీశ్రీ 148
"సంగ విజయము" చూ. మాలపల్లి
"సంఘం చేసిన మనిషి" 120
"సంజీవరాయ చరిత్రము" 43, 52, 53, 135
సంజీవరావు, మొసలికంటి 94, 181, 182
"సంధి" 233
"సంపెంగ పొదలు" 122
"సగటు మనిషి" 118
సత్యనాథమ్మ, కృపాబాయి 66
సత్యనారాయణ, కాకరపర్తి 181
సత్యనారాయణ, నిడమర్తి 242
సత్యనారాయణ, విశ్వనాథ 27, 130, 155, 156, 157, 208, 209, 228, 231, 232, 283, 284, 285, 289, 293-95, 302, 303
సత్యనారాయణమూర్తి, పోలాప్రగడ 215
సత్యనారాయణరావు, రావూరి 112, 120, 216

సత్యనారాయణశాస్త్రి, వేదుల 184
"సత్యరాజా పూర్వదేశ యాత్రలు" 49, 163, 166, 176
"సమరము-శాంతి" 188
సరస్వతీ గ్రంథమాల 218
సరస్వతీదేవి, ఇల్లిందల 121, 239
"సప్తపది" 239
"సప్తపర్ణి" 111, 160
"సరితాదేవి డైరీ" 235
"సరోజడైరీ" 235
సాంబశివరావు, అవుల 102
సాంబశివరావు, కొమ్మూరి 222
సాంబశివరావు, పోతుకూచి 112, 116
"సాయం సంధ్యలు" 189
సాహితీ సమితి 76
సింహనాథము 182
సీతారాం 185
సీతారాం, సూరంపూడి 190
సీతారామరాజు 216
సుందరరామయ్య, కొత్తపల్లి 166
"సుందరి" 135
"సుఖమూ-సుందరీ" 115
"సుగుణ" 107, 114
సుదర్శనం, ఆర్. యస్. 108, 204, 66, 177,
"సుధాకరశ్చంద్రము" 180
"సుమంగళి" 232
'సుమలత' 216
"సుల్తాను" 152, 177
సులోచనారాణి, యద్దనపూడి 122, 216
"సుశీల" 242
"సువర్ణగుప్తుడు" 79
సుబ్బరామయ్య, పెద్దిభొట్ల 120
"సుబ్బారావు" 52
సుబ్బారావు, ఆలపాటి 191
సుబ్బారావు, నన్నపనేని 185
సుబ్బారావు, వేలాల 153
సుబ్బారావు పంతులు, న్యాపతి 54
సుబ్రహ్మణ్యశర్మ, పురాణం 115, 239
సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద 154, 172, 62, 131, 143, 229, 242
సూరి, తెన్నేటి 111, 159, 190
సూరి, మద్దిపట్ల 135
సూర్యనారాయణ, తల్లాప్రగడ 52, 53, 65, 66, 71, 73, 135, 152. 180, 185, 207
సూర్యనారాయణశర్మ, వేదుల 159
సూర్యప్రకాశరావు 183
సూర్యప్రకాశరావు, పురాణం 117,
సూర్యారావు, అవసరాల 191
"సెక్రటరీ" 122
సెర్వాంటెజ్ 191
"సెలవుల్లో" 169
సెసిల్, లార్డ్ డేవిడ్ 3
"సోనాబాయి పరిణయము" 43

సోమయాజులు, యస్.వి. 186
సోమర్ సెట్ మామ్ 191
సోమేశ్వరరావు, అయినాపురపు 220
స్కాట్, సర్ వాల్టర్ 66
స్కోపెనోర్ 94, 194
"స్వర్గారోహణ" 118
"స్వర్గానికి నిచ్చెనలు" 82, 84
"స్వయం వరణం" 173
"స్వామి" 183
స్విఫ్ట్, జోనాథన్ 50, 163, 176
"స్వీట్ హోమ్" 121
"స్నేహబంధం" 120
"హంపీకన్యలు" 88
హక్స్‌లీ, ఆల్డస్ 13, 320
"హాకిల్ బెరిఫిన్" 189
హచిన్‌సన్ దొర, రెవరెండ్ 253
హనుమంతరావు, ముద్దంశెట్టి 120
"హరిజన్" 120, 232
హరినారాయణ్ ఆప్టే 182, 187
"హార్డ్ టైమ్స్" 390
హార్డీ, థామస్ 191
"హామ్లెట్" 203
"హాహాహూహూ" 85, 140
"హిమబిందు" 86, 157, 270-181
"హృదయకుసుమాలు" 110, 131
హెన్రీజేమ్స్ 191
"హేమలత" 58, 60, 151, 141
"హేలావతి" 71, 107
హోవార్డ్ ఫాస్ట్ 191
"హౌస్ సర్జన్" 117

STATE REGIONAL ... GUNTUR
18207
అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం
అన్నమయ్యవీధి. గుంటూరు-8